# తెలుగులో
# దండక సాహిత్యము

డా॥ గొల్లకోట సూర్యభాస్కరరావు

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయమునుండి
తెలుగులో పిహెచ్.డి. డిగ్రీ పొందిన
సిద్ధాంత గ్రంథము – 1988.

# తెలుగులో
# దండక సాహిత్యము

రచయిత :

**డా॥ గొల్లకోట సూర్య భాస్కరరావు**

తిరుమల తిరుపతి దేవస్థానమువారి ఆర్థిక సహాయంతో ప్రచురితం.

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయము నుండి
తెలుగులో పిహెచ్‌డి. డిగ్రీ పొందిన
సిద్ధాంత గ్రంథము - 1988

Date....................................

# తెలుగులో దండక సాహిత్యము

ప్రథమ ముద్రణ : జూలై 1992

ప్రతులు : 1000

SRI VENKATESWARA
CEN LIBRARY &
CENTRE
No. 50703
TIRUPATI.

హక్కులు : గ్రంథకర్తవి

ప్రతులకు : డా॥ జి. యస్. భాస్కరరావు
సాహిత్య పీఠం
తెలుగు విశ్వవిద్యాలయము
బొమ్మూరు—533 124.

వెల : **50/-** రూ॥లు

ముద్రణ : మహేశ్వరి ప్రింటింగ్ & బైండింగ్ వర్క్స్
సీతంపేట, రాజమండ్రి.

# అంకితం

ఈ కృతి శ్రీ వేంకటేశ్వర స్వామివారి
శ్రీచరణాలకు పూజాసుమంగా.

**Dr. J. S. PRAKASA RAO,**
**Professor & Ex Head**
**Dept; of Telugu, B.H U.**
**VARANASI - 5**

# సమీక్షణం

శ్రీకరమైన తెలుగు సాహిత్యం వెయ్యేళ్ళ తెలుగు వెలుగుల జిలుగు నింపుకున్నట్టిది. ప్రక్రియావైవిధ్యం దానికి పెట్టనిసొమ్ము. ఆదికవి ఆ నన్నయనుండి నేటి పిల్లకవుల వరకు ఆప్యాయంగా చేపట్టి ఆదరించిన వానిలో దండక ప్రక్రియ ఒకటి. దండక రచన భక్తకవుల కృతులలో పరిపాటిగ కన్పిస్తుంది. ఈ ప్రక్రియకు ఆది స్తోత్రస్సు భక్తిపరక దండకములే. ఏకారణంచేతనో పరిశోధన క్షేత్రంలో ఇటీవల వరకు పరిశోధకుల దృష్టి దండక సాహిత్యం మీద ప్రసరించలేదు. ఈ విషయమును గుర్తించి ఆలోటు యథాశక్తి తీర్చుటకు సాహసించి శ్రమించి సాఫల్యమును సాగొనినవాడు చి॥ డా॥ గొల్లకోట సూర్య భాస్కరరావు.

సూర్యభాస్కరరావు విద్యార్థి దశలో గురుకుల క్లిష్టుడు. 'విద్యాదదాతి వినయం' అనే సూక్తికి పాత్రమెనవాడు. రాజమండ్రి స్నాతకోత్తర విభాగంలో తెలుగు ఎం.ఏ.లో ఉత్తమ విద్యార్థులలో నొకడుగ ఉత్తీర్ణుడై పిహెచ్.డి. పరిశోధనకై వారణాసి యందలి కాశీ హిందూ విశ్వవిద్యాలయమున ప్రవేశించినవాడు. నా పర్యవేక్షణలో పరిశోధన ప్రారంభించి, నిరంతరముగ శ్రమించి నిర్ణీత సమయము మించకుండానే పట్టమును కైవసమొనర్చుకొని నాకు గర్వకారణమైన శిష్యులలో నొకడైన వాడు. 'స్థానేషు శిష్యనివహైర్వినియుజ్యమానా విద్యా గురుంహి గుణవత్తర మాతనోతి' అనికదా సూక్తి. ప్రస్తుతం రాజమండ్రిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో పనిచేస్తూ పైవారి మన్నలకు పాత్రుడైనవాడు.

ఈ గ్రంథం షడధ్యాయ విలసితం. ప్రథమాధ్యాయంలో 'దండకము-స్వరూప వివేచనము' కావింపబడినది. దండకశబ్ద విచారములోను, వృత్త స్థితి నిర్ణయము నందు, మార్గ దేశి భేద పరిశీలనమున, నిర్ణయమున భాస్కరరావు మౌలికత గోచరించుచున్నది.

ద్వితీయాధ్యాయమున 'దండకలక్షణములు' పరామృష్టములైనవి. అగ్నిపురాణాది సంస్కృత గ్రంథాలనుండి, కవిజనాశ్రయాది తెలుగు లక్షణ గ్రంథాలనుండి దండక లక్షణాలు సేకరించి రెండింటి భేదసాదృశ్యాలతోపాటు తెలుగు దండకాల ప్రత్యేకతను చూపడంలో గ్రంథకర్త కృతకృత్యుడయ్యాడు.

మూడు నాల్గు అధ్యాయాలు ఈ గ్రంథానికి సారభూతమైనవి. తృతీయాధ్యాయంలో సాహిత్యయుగ విభజన ఆధారంగా దండక సాహిత్యం ఆవిర్భావ వికాసాలు, నిబద్ధ-అనిబద్ధ కావ్యపరంగా వివరించడం జరిగింది. చతుర్థాధ్యాయంలో భక్తిపరకమైన దండకాలతోపాటు ప్రధాన రసాలకు చెందిన ఆయా దండకాలనే కాకుండా వ్యంగ్యప్రధానమైన తిట్లదండకాల తీరుతెన్నులను కూడా వివరించడంలో గ్రంథకర్త చూపిన ఓర్పూ, నేర్పూ, తీర్పూ విశదమౌతున్నాయి.

పంచమాధ్యాయం ప్రత్యేకతను సంతరించుకొన్నది.'రక్తిలేనిదే భక్తికుదరదనీ-కామిగాక మోక్షగామికాడు' అనీ నానుడులు వింటూ ఉంటాం. పోతన మొదట్లో రాజాశ్రయం వైపుమొగ్గి ఇష్టంగానో అయిష్టంగానో తన పలికను మెప్పించడానికి భోగినీదండకం చెప్పినట్లు జనశ్రుతి. దాని కర్తృత్వం ఇంకా వివాద గ్రస్తమైనదే కదా! దండక సాహిత్యంలో భోగినీ దండకానికి ఉన్న ప్రత్యేకతను పురస్కరించుకొని, ఆ కోవకు వచ్చే దండకాలను పెక్కింటిని గుదిగుచ్చి వాటిని వివరిస్తూ చివరకు వాని పోకడలను క్రోడీకరించడం అయిదవ అధ్యాయంలోని విషయం. ఈ జాతి దండకాలన్నీ భోగినీ దండకానికి ప్రతిబింబాలే అని

నిరూపించిన తీరు ప్రశంసనీయం. ఇదే కోవకు చెందినవైనా తాళ్ళపాక పెదతిరుమలయ్య శృంగారదండకం, ధూర్జటి కాళహస్తీశ్వర దండకం, అజ్ఞాత కర్తృకమైన భీమేశ్వర దండకాలు దైవనాయకములు కావడం అపవాద ప్రాయం.

చి॥ భాస్కరరావు సహజంగా సాహిత్య విద్యార్థి కావడంచేత ముక్తకాల జాతికి చెందిన దండకాలు లఘుకృతులని చిన్నచూపుచూడకుండా ఉన్నంతమట్టుకు ఆయా దండకాలలో గోచరించే వర్ణనలు, అలంకారాలు, లోకోక్తులు జాతీయాలు వంటి కళా పక్షానికి చెందిన విషయాలు షష్ఠాధ్యాయంలో వివేచించడం జరిగింది.

దేవతా మూర్తుల వర్ణనలు కలిగిన దండకములు మిక్కిలి ప్రచురములు. వానిలో దేవతా స్వరూప స్వభావాలతోపాటు అంగాంగ వర్ణనలును గోచరించును. సరస్వతీ, గాయత్రీ దండకాదులలో మంత్ర బీజాక్షరములు నిక్షేపింపబడినవని సోపపత్తికముగ చూపుటలో గ్రంథ కర్త బుద్ధి నైశిత్యము, పరిశోధన పాటవము ప్రకటితమగుచున్నవి. ఇతర వర్ణనలు వైవిధ్య సంశోభితములు. ఏకదేశికముగాకాక దీర్ఘవర్ణనములు కొన్ని దండకములలో కానవచ్చును. ఆదిభట్ల నారాయణ దాసుగారొనర్చిన మైసూరు దేశ ప్రశంసా దండకము పురవర్ణనేతివృత్తముగా గలది. అద్దంకి గంగాధర కవి 'చపలనయన ఈ గంధనాగంబు చందంబు'... అంటూ చేసిన పర్వత వర్ణనగల దండకము కూడా ప్రశంశనీయమైనదే. కవులు సాధారణంగా ఋతు వర్ణన చేయడం పరిపాటి. కాని ముత్యసూర్యనారాయణ మూర్తి తన 'సకలనానందం'లో గ్రీష్మాంత వర్ణన చేస్తూ గ్రీష్మ, వర్షా ఋతుసంధిని రమ్యంగా వర్ణించినాడు.

దీని వెను వెంటనే కొన్ని ముఖ్య దండకాలలో నుంచి శబ్దార్థాలంకారాలను లక్ష్య లక్షణ సమన్వయం చేస్తు దిఙ్మాత్రంగా చూపడం బాగున్నవి. వీని కనుబంధంగా సూక్తులు క్రోడీకరించబడ్డాయి.

అనుబంధంలో ముద్రితాముద్రితములు, లభ్యాలభ్యములు, గ్రంథాంతర్గతములు, ముక్తకములు ఈ రీతిగా దండకాల పట్టికలను ఇవ్వడం పఠితల సౌలభ్యం కోసమే.

దండక సాహిత్యం గురించి తెలిసికొనగోరేవారికి ఇది కరదీపికలా ఉపకరించగలదనడం, స్తవం కాదు, వాస్తవంకనుక. దీనికి రెండవభాగంగా ప్రముఖమైన దండకాలను ఆయా కవుల సంక్షిప్తపరిచయంతో యథాతథంగా ముద్రించి నట్టయితే ఆంధ్రపాఠకలోకానికి ఉపకారకం కాగలదు, కాని అది బహు వ్యయ ప్రయాసలతో కూడిన పని.

ఒక్కమాట. ఏ కారణంచేతనో అచ్చు తప్పులు ఎక్కువగా దొర్లినవి. అవి సవరింపబడి ఉంటే గ్రంథసౌకర్యం ఇంకా ఇనుమడించి ఉండి ఉండేది. చిరంజీవి సూర్యభాస్కరరావు లేఖిని నుండి మరిన్ని ఉపయుక్తరచనలు వెలువడగలవని ఆశిస్తూ అతనికి ఆశక్తిని కల్గించమని ఆ అన్నపూర్ణాసహిత విశ్వేశ్వరుని ప్రార్థిస్తున్నాను.

శుభంభూయాత్.
విద్వజ్జనవిధేయుడు,
జోస్యుల సూర్యప్రకాశరావు

ఆచార్య బేతవోలు రామబ్రహ్మం
సాహిత్యపీఠం
తెలుగు విశ్వవిద్యాలయం
బొమ్మూరు-533 124

# ఆమోదం

నన్నయ నాటినుంచీ దండక ప్రక్రియ సాహితీపరులకు తన పరిమళాలను పంచిపెడుతూనే ఉంది. ఆనాటినుంచీ దీని ఆరంభ-పరిణామ-వికాసదశలన్నింటా భక్తిదే పైచేయిగా కనిపిస్తోంది. పదాలను పువ్వులుగా దండగుచ్చి ఆరాధ్యుడైనవానికి అర్పించడం ఈ ప్రక్రియలో అంతర్గతంగా కనిపించే తత్త్వం.

వ్యుత్పత్తిని బట్టి చూసినా "దండకం" ద్రావిడభాషా సంబంధిగానే తోస్తుంది. ఈ పూలదండ, సంస్కృతంలో ఆదికావ్యం అవతరించే నాటికన్నా ముందే సురభారతి గళసీమను అలంకరించి ఉంటుంది. "దండకం"గా రూపం మార్చుకుని స్థిరపడి ఉంటుంది. దండ-దండక శబ్దాలకు ప్రక్రియా తత్త్వానుకూలమైన అర్థం సంస్కృతంలో కనపడదు. ఈ ఆలోచనకు ఇదొక బలమైన ఆధారం,

పింగళ ఛ్ఛందస్సులో దండక లక్షణాలు ఉన్నాయి. పురాణ కావ్యాలలో లక్ష్యాలు కనబడుతున్నాయి. ఇవి ఆధారంగా డా॥ జి. యస్. భాస్కరరావుగారు సంస్కృతం నుంచి ద్రావిడ భాషలలోకి ప్రవేశించిన మరొక ఛందః ప్రక్రియగా దండకాన్ని సంభావించారు. దీన్ని దృఢ పరచడం కోసం అనేక లక్షణగ్రంథాలను అవలోడనం చేసారు. పరిశ్రమించారు. ఇది ప్రశంసనీయం.

ఆరంభంలో భక్తికి ఆలవాలమైన ఈ దండకం మధ్యకాలంలో రక్తికి వాహిక అయ్యింది. దక్షిణాంధ్ర యుగంలో రాజస్తుతులకూ వేశ్యావర్ణనలకూ పాల్పడింది. ఆధునిక కాలంలో అన్నింటికీ ఆహ్వానం

పలికింది. పవరసాలనూ ఒలికించింది. సాంఘిక దురాచారాలు, రాజకీయాలు, ధూమశకటాలు, పీపుల్స్‌పార్కులు, ఎన్నికలు, పితూరీలు, పేరడీలు, పుష్కరాలు అన్నీ ఇందులో ఇమిడిపోయాయి. దండకం ఒక కదంబం అయ్యింది. అయినా అజన్మ సిద్ధమైన లక్షణాన్ని వదులుకోలేదు. భక్తిని ఒకవైపు ప్రముఖంగా గుబాళిస్తూనేఉంది. ఈ వైనాన్ని మిత్రులు భాస్కరరావుగారు సక్రమంగా సాధారంగా నిరూపించారు.

ఛందఃపరంగా విభజించడమేకాక గ్రంథాంతర్గతాలు – స్వతంత్రాలు అంటూ వింగడించి వాటిలో అవాంతర భేదాలను వీరు నిర్ధారించారు. ఇది శాస్త్రీయంగా సాగిన విశ్లేషణ. రసప్రాధాన్యాన్ని బట్టి చేసిన విభజన మరొక పార్శ్వంకాగా భాషాపరంగా సంస్కృత – ఆంధ్ర – ఆచ్ఛిక దండక విభాగం మరొక కోణం. ముద్రితా ముద్రిత విభాగంతో విశ్లేషణకు సమగ్రత చేకూరింది.

దండకం తెలుగులో చాలా ప్రసిద్ధికెక్కిన ప్రక్రియ. ఇది క్రమక్రమంగా తన ఉదాత్తతను కోల్పోతూ వచ్చింది. ఇవ్వాళ "దండకం విప్పకు నాయనా!" అంటే తిట్లకు లంకించుకోకు అని అర్థం. ఈ జారుపాటును కూడా డా॥ భాస్కరరావుగారు ప్రస్తావించారు.

గ్రంథాంతర్గతంగాగానీ స్వతంత్రంగాగానీ ఒక స్తోత్రంగా ఒక ఖండికగా తన పాత్రను నిర్వహించిన ఈ దండకం స్వతంత్ర కావ్యంగా కూడా ఆధునిక కాలంలో రూపొందింది. మొత్తం రామకథను దండకంగా రచించినవారు ఉన్నారు. భాగవతకథ చెప్పినవారూ ఉన్నారు. భక్తి అంతస్సూత్రం.

సంస్కృతాంధ్రాలలో ప్రసిద్ధికెక్కి, విస్తృతిని పొంది, ఈ నాటికీ సజీవంగా ఉన్న ఈ ప్రక్రియను గురించి తలస్పర్శిగా పరిశోధన చేసి పిహెచ్. డి. పట్టాభిషిక్తులైన డా॥ జి.యస్. భాస్కరరావుగారిని మనసారా అభినందిస్తున్నాను. "మత్పురాకృత శుభాధిక్యంబు తా నెట్టిదో" అని సంబరపడుతూ వీరు ఈ పరిశోధనాంశాన్ని స్వీకరించి

ఉంటారు. వీరి పరిశోధన పర్యవేక్షకులు ఆచార్య జోస్యుల సూర్య ప్రకాశరావుగారికి సాహిత్య విద్యార్థిగా నేనూ కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి ఈ పరిశోధనకు ఫలితంగా పట్టం పొంది శ్రీ భాస్కరరావుగారు కాశీ పండితులయ్యారు. ఇప్పుడు మేమంతా సాహిత్యపీఠంలో సహవ్రతులం. అదీ ఆనందం.

ముద్రణ విషయంలో వీరు మరికాస్త జాగ్రత్త తీసుకుని ఉండాల్సింది. "అప్పుతచ్చులు" బాగా దొర్లాయి. పరిశోధకుడే పొరపాటు పడ్డాడు అనిపించేవి కూడా చాలా ఉన్నాయి. పడ్డపొరపాట్లకు ఇవి తోడై తడిసి మోపెడయ్యాయి. కంటిలో వత్తి వేసుకుని చూసినా ముద్రారాక్షసాలు దొర్లుతూనే ఉంటాయి. అటువంటిది ఏమారితే ఇక చెప్పాలా! ఇది ద్వితీయ ముద్రణకు నోచుకుంటుందనీ, అప్పుడు సవరించుకుంటారనీ ఆశిద్దాం. (ఈ పీఠికలో ఎన్ని దొర్లుతాయో!!) సెలవు.

బొమ్మూరు
14-7-92

భవదీయుడు
బేతవోలు రామబ్రహ్మం

ఆచార్య ఆర్వీ యస్. సుందరం
ఎం. ఏ. (తెలుగు, కన్నడం, సంస్కృతం),
పిహెచ్. డి., డి. లిట్.
పీఠాధిపతి, సాహిత్యపీఠం
తెలుగు విశ్వవిద్యాలయం, రాజమండ్రి ప్రాంగణం
బొమ్మూరు-533 124
తేది. 21-7-1992

# మంగళాశంస

ప్రక్రియా వైవిధ్యంలో తెలుగుసాహిత్యం ఏ సాహిత్యానికీ తీసిపోదు. కావ్య పురాణ ప్రబంధాది మహాకావ్యాలను రచించిన మహా కవులకు, మధుర కవితలను ప్రవచించిన జానపద కవులకు తెలుగు సాహిత్యంలో కొదువ లేదు. కాని తెలుగు సాహిత్యమంటే రామాయణ మహాభారత ప్రబంధాది కావ్య ప్రక్రియలు మాత్రమే అనే అపోహ ఉంది. ఇది తెలుగువారిలోనే కాక తెలుగు సాహిత్యాన్ని గూర్చి మిడిమిడి జ్ఞానం ఉన్న భాషేతరులకూ ఉంది. ఇలాంటి అపోహను పోగొట్టి, తెలుగు సాహిత్యంలోని వైవిధ్యాన్ని ప్రదర్శించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

తెలుగు సాహిత్యంలోని ప్రక్రియల్లో కొన్ని సంస్కృతం నుంచి తెచ్చుకున్నవి, కొన్ని సంస్కృత ప్రభావంవల్ల ఏర్పడ్డవి, మరికొన్ని దేశీయంగా వికాసం చెందినవి. ఇవి ఏ కోవకు చెందినవైనా తెలుగు వారు వాటిని తమ సొంతం చేసుకున్నారు. ఎంతవరకు సొంతం చేసుకున్నారు అనే విషయాన్ని విప్పిచెప్పే గ్రంథాలుగాని, విమర్శలుగాని ఇంతవరకు రాలేదు. వచ్చినా వాటిలో సమగ్ర దృక్పథం కొరవడింది చంపూ కావ్యప్రక్రియకూ తెలుగులోని మహాకావ్య ప్రక్రియకూ ఉండే భేదాన్ని సమగ్రంగా పరిశీలించినవారులేరు. తెలుగు ప్రబంధాలను కన్నడ ప్రబంధాలతో పోల్చి చెప్పినవారూ లేరు. అలాగే తెలుగులోని ఒక్కొక్క ప్రక్రియ వికాసాన్ని సమగ్రవివేచన చేయవలసిన

అవసరం ఎంతైనా ఉంది. ఇలాంటి వాటిలో మహనీయులు నిడుదవోలు వేంకటరావుగారి 'ఉదాహరణ వాఙ్మయ చరిత్ర' ఒకటి.

డా. గొల్లకోట సూర్యభాస్కరరావు చేపట్టిన పరిశోధనాంశం పైన నేను చెప్పిన కారణాలవల్ల వైశిష్ట్యాన్ని సంతరించుకుంది. దండక సాహిత్యం సంస్కృతం, తెలుగు, తమిళం, కన్నడం మొదలైన భాషల్లో ఉంది. అయినా తెలుగులో దానికొక ప్రత్యేకస్థానముంది. శతకం ఎలాగైతే తెలుగువారికి సొంతమైందో దండకం కూడా అలాగే సొంతం అయింది. ఈ విషయాన్ని చెప్పడానికి డా. భాస్కరరావుగారికి ఇంత గ్రంథం అవసరమైంది. దండక స్వరూప వివేచనం చేయడంలో, దండకసాహిత్యం ఆవిర్భావ వికాసాలను సమీక్షించడంలో, దండకాలను విభజించి పరిశీలించడంలో డా. భాస్కరరావు చూపిన విజ్ఞత ప్రశంసార్హంగా ఉంది. తెలుగులోని లక్షణాల్ని ఇతర భాషల్లోని లక్షణాల్ని సమన్వయంచేసి డా. భాస్కరరావు మంచి పనిచేశారు. దండక స్వరూప వివేచనంతో బాటు విషయ విశ్లేషణ కూడా చేశారు.

మన కంటికి ఆనని సాహిత్య ప్రక్రియలో కూడా తెలుసుకోవలసిన విషయాలు ఎన్నో ఉంటాయని డా. భాస్కరరావుగారి పుస్తకం నిరూపిస్తోంది. ఈ విధమైన కృషిలో ఆయన సమర్థుడని కూడా ఈ పుస్తకం నిరూపిస్తోంది. మంచి పరిశోధకుడిగా రూపుదాల్చే లక్షణాలు డా. జి. ఎస్. భాస్కరరావుగారిలో కనిపిస్తున్నాయి.

ఆర్వీ యస్. సుందరం

# కృతజ్ఞతలు

'మధురమనోహర అతీవ సుందర యహ్ సర్వవిద్యాకీ రాజధానీ' అని కాశీ హిందూ విశ్వవిద్యాలయ విద్యార్థులు గీతాలాపన చేయుదురు. సార్థకమగు వచనమిది. ఈ ప్రఖ్యాతి కంతటికిని పండిత మదన మోహన మాలవీయగారి మహదాశయమే కారణము. దీనికి తోడు అన్నపూర్ణా విశాలాక్షీ గంగాభవానీ సమేత విశ్వనాథ కృప శ్రీరామరక్ష.

ఎం. ఏ. చదువుచున్న సమయమునందే పరిశోధనకు ఇదొక అంశం మిగిలి ఉందని, తమ 'ఉదాహరణ వాఙ్మయచరిత్ర' ద్వారా ఉత్సుకత కలిగించిన, ప్రాతస్మరణీయులు శ్రీ నిడుదవోలు వెంకటరావు గారికి ప్రథమముగ నమస్కరించుచున్నాను.

నాకీ విశ్వవిద్యాలయమున ప్రవేశము కల్పించిన ఆచార్య బయ్యా వెంకట సూర్యనారాయణగారికి, నా సిద్ధాంతవ్యాస పర్యవేక్షణ బాధ్యతను చేపట్టి, అనారోగ్యకారణములచే విరమించుకొనిన శ్రీమతి డా॥ బయ్యా రత్నావళి గారికి సర్వదా కృతజ్ఞుడను.

నిరాధారముగ నిస్పృహకు లోనయిన సమయమున నిర్వ్యాజముగ అభయమునిచ్చి, పరిశోధన వ్యాసంగ పర్యవేక్షణ బాధ్యతను వహించి, నన్నీ స్థితికి చేర్చినది ఆచార్య జోస్యుల సూర్యప్రకాశరావు గారు. వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

పరిశోధన సమయమున సముచిత సలహాలనొసగిన కళాప్రపూర్ణ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారికి, ఆచార్య యస్వీ జోగారావుగారికి, శ్రీ టి. భాస్కరరావు(స్ఫూర్తి శ్రీ)గారికి, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో రీడరు డా॥ గుంటూరు త్రివిక్రమయ్యగారికి, ఉపన్యాసకులు డా॥ బి. విశ్వనాథ్‌గారికి నా కృతజ్ఞతలు.

సాహితీబంధువు, దయార్ద్రసింధువు అయిన బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ అగ్రికల్చరల్ ఫేకల్టీ రిజిస్ట్రార్ శ్రీ ఏలేశ్వరపు రామకృష్ణశాస్త్రిగారి ఆదరణ మరువలేనిది. వారికి నా నమోవాకములు.

నా సిద్ధాంత వ్యాస న్యాయనిర్ణేతలు ఆచార్య యస్వీ. జోగారావు గారికి, ఆచార్య ఎస్. గంగప్పగారికి, ఆచార్య జె. యస్. ప్రకాశ రావుగారికి నా నమస్సులు.

అడిగిన వెంటనే ఆదరణతో తమ అభిప్రాయములను ఒసగిన ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికి, ఆచార్య ఆర్వీయస్. సుందరం గారికి, కృతజ్ఞుడను.

నైతికముగ, ఆర్థికముగ సంపూర్ణ సహాయ సహకారము లందించిన నా కుటుంబ సభ్యులకు.

ఉపకారవేతనము నొసగి పరిశోధన వ్యాసంగమునకు ప్రోత్సాహమునిచ్చిన బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ అధికారులకు, ఇంకా సరిపడనపుడు మేమున్నా మని తోడుగనిలిచిన మిత్రులు డా॥ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తిగారికి డా॥ డి. ఎస్. వి. సుబ్రహ్మణ్యంగారికి, డా॥ జి. జయలక్ష్మిగారికి, డా॥ పి. వి. మురళీకృష్ణ శ్రీమతి నాగమణి దంపతులకు నా కృతజ్ఞతలు.

అడిగినదే తడవుగ పొత్తములను, తాళపత్రములను చూచుటకు అనుమతించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు గవర్నమెంటు మ్యూజియం [కాకినాడ], గౌతమీ గ్రంథాలయం [రాజమండ్రి], శ్రీరామ బాల భక్త పుస్తక భాండాగారం [రాజమండ్రి], రాళ్ళబండి సుబ్బారావు పురావస్తు ప్రదర్శనశాల [రాజమండ్రి], ఠాకూర్ రీసెర్చి లైబ్రరీ [విజయవాడ], సారస్వత నికేతనం [వేటపాలెం], ప్రాచ్య పుస్తక భాండాగారములు [హైదరాబాదు, మద్రాసు], సరస్వతీ మహాలు [తంజావూరు] గ్రంథాలయాధికారులకు కృతజ్ఞతలు

పుస్తకమును అందముగా ప్రింటుచేసి యిచ్చిన మహేశ్వరి ప్రింటింగ్ ప్రెస్ వారికి, ఇంకను ప్రత్యక్షముగను పరోక్షముగను సహాయమందించిన వారెందరో మహానుభావులు, వారందరికి నా కృతజ్ఞతలు.

రాజమండ్రి — డా॥ జి. యస్. భాస్కరరావు

# విషయసూచిక


**ఉపక్రమణిక 1-4**

**ప్రథమాధ్యాయము 4-32**

దండకము - స్వరూప వివేచనము

1. దండకశబ్ద విచారము 4-8, 2. స్వరూపస్థితి 9-13, 3. విశేషవృత్తము 13-17, 4. దండకము-మార్గ, దేశి భేద పరిశీలనము 17-19, 4-1. ఇతి వృత్తము 19-20, 4-2. భాష 20, 4-3. ఛందస్సు 21-23, 4-4. దేశి యనుటకు ప్రమాణములు 24, 4-5. మార్గ యనుటకు ప్రమాణములు 25-31, అథస్సూచికలు 31.

**ద్వితీయాధ్యాయము 33-6**

దండకము - లక్షణములు

1. సంస్కృతము 33-45, 1-1. ఛందోవిచితి 34, 1-2. అగ్నిపురాణము 35, 1-3. ఛందోనుశాసనము 35, 36, 2. తెలుగు 45-54, 2-1. కవిజనాశ్రయము 46, 2-2. కావ్యాలంకార చూడామణి 46, 2-3. ఛందోదర్పణము 46,47, 2-4. లక్షణసార సంగ్రహము 47,48, 2-5. అప్పకవీయము 49, 2-6. సరసాంధ్రవృత్త రత్నాకరము 50, 51, 3. సంస్కృత తెలుగు లక్షణముల భేదసాదృశ్యములు 54-58, 4. తెలుగు దండకముల ప్రత్యేకత 59-62, 5. కన్నడము 63-65, 6. తమిళము 65-66, 7. హిందీ 66-73, అథస్సూచికలు 74-76.

**తృతీయాధ్యాయము 77-178**

తెలుగున దండకము-ఆవిర్భావ, అభివృద్ధి, వికాసములు

1. పురాణేతిహాసయుగము 83-92, 2. కావ్య ప్రబంధ యుగము 92-110, 3. దక్షిణాంధ్రయుగము 110-132, 4 ఆధునిక యుగము 134-170, అథస్సూచికలు 171-178.

## చతుర్థాధ్యాయము 179-232

### దండకము - వివిధ రీతులు

1. భక్తి, 1-1. భక్తినిర్వచనము 180, 1-2. భక్తిరసము 181, 1-3 భక్తిమార్గములు 182, 1-4. దండకములలో భక్తితత్త్వము 183-187, 2. శృంగారము 187-191, 3. హాస్యము 191-203, 4. రౌద్రము 203-206, 5. బీభత్సము 206-210, 6. సాంఘికములు 210-226, 7. తిట్లు 226-230, అధస్సూచికలు 230-232.

## పంచమాధ్యాయము - 232-279

### భోగినీ దండకము - తజ్జాతి దండకములు

1. భోగినీదండకము, 1-1. ఇతివృత్తము 234, 1-2 కృతికర్త-కతిభర్త 235-246, 1-3. శైలి 246, 1-4 యథార్థా-యథార్థములు 248-251, 2. శృంగార దండకము 251-254, 3. వెంకటపతిరాయల దండకము 255-257, 4. శాహరాజ దండకము 257-259, 5. పద్మినీ దండకము 260-262, 6 విద్యావతి దండకము 262-264, 7. కచ్చిరంగరాజ దండకము 264, 8 చంద్రాననా దండకము 265, 9. పద్మినీ దండకము 266, 10. భీమేశ్వర దండకము 267, 11. భోగినీజాతి దండకములు-వాని పోకడ 269-275, అధస్సూచికలు 276-279.

## షష్ఠాధ్యాయము 280-321

### వర్ణనలు, అలంకారములు, లోకోక్తులు

1. వర్ణనలు 280-313, 1-1. అలౌకికవర్ణనలు 284-300, 1-2. ప్రకృతి వర్ణనలు 300-313, 1-2-1. పుర 300, 1-2-2. పర్వత 300, 1-2-3. ఋతు 304, 1-2-4. జలక్రీడ 306, 1-2-5. వనవిహార 307, 1-2-6. యుద్ధ 309, 2. అలంకారములు 313-317, 3. సూక్తులు 317-321, అధస్సూచికలు 321.

ఉపసంహారము 322-324.

అనుబంధము .1 325-342.

అనుబంధము 2. 343.

ఉపయుక్త గ్రంథ పట్టిక 344-350.

సంకేతాలు, సవరణలు.


—[౦]—

# ఉపక్రమణిక

భగవంతుని దృష్టిలో పరమాణువును, పర్వతమును సమానమయినట్లుగనే సహృదయ పాఠకునికి మహాకావ్యమును, చాటు కవితయును సమానమే. ఎందరో ప్రముఖులు తెలుగు సాహిత్యమున వివిధ శాఖలపై పరిశోధనలు చేసి తమతమ పరిశోధన నిబంధములను తెలుగుతల్లి ని కై సేసియే యుండిరి. అయిననుఏలనో పరిశోధనలోకము దండకశాఖను చిన్నచూపు చూసినదనుట సాహసముగాదు. అతి ప్రాచీనమగు దండకశాఖపై పరిశోధన జరుగలేదనిన విషమును, కీ॥ శే॥ నిడదవోలు వెంకటరావుగారి 'ఉదాహరణ వాఙ్మయ' గ్రంథము నుండి గ్రహించి పరిశోధన చేయుటకు పూనుకొంటిని.

తెలుగున దండకము నన్నయగారి చేతి చలువ వలన ఆంధ్ర మహాభారతమున అవతరించినది. ఇంతకంటెను ప్రాచీన లక్ష్యము తెలుగున మరియొకటి గానరాదు. నన్నయగారి రచనా స్వాతంత్ర్యము వలన అది క్రొత్తదనము సంతరింప జేసికొనినది.

పుట్టినింట (సంస్కృతము) ప్రతాప మేమియును లేదు. లక్షణముల రూపమున క్రమశిక్షణకు మాత్రము కొదువలేదు. ఇక మెట్టినింట (తెలుగు) దీని ప్రతాపము చెప్పనలవి గాదు. పోని పోకడ లేదు. ముట్టని గళము లేదు. వేయి సంవత్సరములు వయసు కలిగిన కడు వృద్ధు. అయినను నిత్య నూతన యౌవనముతో విరాజిల్లుచున్నది.

తెలుగు దండకము రెండు మార్గములలో పయనించినది. ఒకటి : గ్రంథాంతర్గతముగ నితర వృత్తములతోపాటును, రెండు: స్వతంత్ర రచనలుగను. నేటికిని యీ విధముగనే కొనసాగుచున్నది. నన్నయాది కవులు మూలము నందలి భావముల నూతగొని దండకము

లను రచించిరి. శ్రీనాథాది కవులు తమ కావ్యముల సంస్కృత భాషా శ్రితముగ దండక రచనజేసిరి.

దండకమున ఏకగణనిష్ఠములై శరవేగమున కొనసాగెడి శబ్దములు పాఠకుని ఆనంద రసాబ్ధి నోలలాడించి, మైమరపును కలిగించును. ఇతర ఆలోచనలకు తావు నీయదు. కావున నీ సిద్ధాంత వ్యాసమున దండక మననేమో ఒక అవగాహన కుదురుటకు ప్రథమాధ్యాయ ముద్దేశింప బడినది. ఇందు దండకశబ్ద చర్చ, సాహితీరంగమున దండకమునకు గల స్థానము, దండకముపై ప్రముఖుల అభిప్రాయములతో పాటు తెలుగు దండకము మార్గ-దేశి ప్రక్రియలలో దేనికి సంబంధించినదను అంశములు పరిశీలింపబడినవి.

ద్వితీయాధ్యాయమున దండక లక్షణములు తెలుపబడినవి. లక్షణముల కొక విభాగ మచ్చుట తప్పినది గాదు. సంస్కృత లాక్షణి కులు ఒకరితో మరియొకరు విభేదించి లక్షణముల నొసగియుండిరి. అట్లే తెలుగు లాక్షణికులును. సంస్కృతము నుండి గ్రహించిన ప్రక్రియ అయినను, తెలుగున దండకము లక్ష్య, లక్షణ విషయము లలో అధికస్వాతంత్ర్యము వహించినది. కావున తెలుగున దండకము దేశి ప్రక్రియగ కొందరు ప్రముఖులు తమ అభిప్రాయములు వెలిబుచ్చిరి. అందువలన తెలుగునకు సోదరీ భాషలగు తమిళ, కన్నడము లందలి దండక లక్షణములను, అట్లే ఆర్యభాషా సంబంధియగు హిందీ సాహి త్యము నందలి దండక లక్షణములను పరిశీలనకు గైకొనబడినవి. తుదకీ యధ్యాయమున తెలుగునకు దండకము సంస్కృతము నుండి తెచ్చు కొనిన ప్రక్రియగా నిర్ధారించుట జరిగినది.

తృతీయాధ్యాయమున; తెలుగున దండకము యొక్క ఆవిర్భావ అభివృద్ధి వికాసములు పరిశీలింపపడినవి. వేయి సంవత్సరములు

అవిచ్ఛిన్నముగ కొనసాగిన దండక రచనము పరిశీలన సౌలభ్యము కొరకు నాలుగు యుగములుగ విభజింపబడినది. ప్రతియుగమునను గ్రంథాంతర్గతములు, స్వతంత్రములు అను అంతర్విభాగముతో యీ అధ్యాయము వివేచించుట జరిగినది.

దండకము పలు రీతులలో రచింపబడినది. రసాశ్రయములు, సాంఘికములు, తిట్లు అను విభాగములుగ చతుర్థాధ్యాయమున పరిశీలించుట జరిగినది.

తెలుగున దండక సాహిత్యము నందంతటను భోగినీ దండకము ప్రత్యేకత కాదనరానిది. ఇందు కృతికర్త, కృతిభర్త, వారి కాలములు, కృతిభర్త వంశము, ఇతివృత్తము మొదలగు విషయములన్నియును వాద వివాదములతో కూడియున్నవి. ప్రత్యేక కృతిగ ఉపలబ్ధమగుచున్న యీ ప్రథమాంధ్ర దండకమునకు సంబంధించిన వివరములన్నియును తృతీయాధ్యాయమున పరిశీలించినచో, అధ్యాయమునకు సమత్వము కొరవడుచున్నది. అదియునుగాక దక్షిణాంధ్ర యుగము నందలి ఎందరో కవులు భోగినీ దండకము నాదర్శముగగొని దండక రచనలు చేసిరి. కావున భోగినీ దండకముతోపాటు దాని అడుగుజాడలలో నడచిన దండకము లన్నియు ఒక వర్గముగ పంచమాధ్యాయమున పరిశీలింపబడినవి.

దండకములు లఘుకృతులైనను ఎన్నియో వర్ణనలకును, అలంకారములకును, సూక్తులకును ఆలవాలములై యున్నవి. వీనినన్నిటిని షష్ఠాధ్యాయమున పరిశీలించుటతో నీ సిద్ధాంత వ్యాసము ముగియుచున్నది.

తెలుగున దండకములు అపరిమిత సంఖ్యలో నుండుటవలన ముద్రితములు; గ్రంథాంతర్గతములు, ముద్రితములు; స్వతంత్రములు,

అముద్రితములు; ఉపలబ్ధములు, అముద్రితములు ; అనుపలబ్ధములు అను విభాగములతో దండకకృతుల నన్నిటిని పట్టికగా అనుబ ధమున పొందుపరచుట జరిగినది. కొన్ని అముద్రిత దండకములు రెండవ అనుబంధముగ నీయబడినవి. కవుల కాలములు, నామములు ఆధారము లున్నంతవరకు పేర్కొనబడినవి. తృతీయాధ్యాయమున ప్రత్యేకత కనబరచని దండక కర్తలు, లక్ష్యములను ఇత్యాదిగ వ్యవహరించి, అనుబంధమున పొందుపరచుట జరిగినది. అరసున్న, శకటరేఫ, 'ఌ' కారములు విడువబడినవి. స్పష్టార్థ ప్రతిపత్తికై (అక్కడక్కడ) విసంధి పాటింపబడినది. గ్రంథాంతర్గత దండకముల కన్నిటికిని మూలములు సేకరించుట మిక్కిలి కష్ట సాధ్యము గాన, మూలములు పరిశీలించుట జరుగలేదు.

నా యీ పరిశోధన సర్వంకషమని నేను వాదము చేయను. ఈ దిశలో మరియెవ్వరికైన మరింత లోతుగ పరిశోధన చేయుటకు నా యీ ప్రయత్నము ప్రేరకమైనచో నది నా మహాభాగ్యముగ భావింతును. ఇందలి గుణ దోషములకు సహృదయ హృదయమే ప్రమాణము.

# 1

# దండకము – స్వరూప వివేచనము

ఆకాశ మనంత తారా శోభితము. అట్లే, మహోజ్జ్వలమైన ఆంధ్రసాహిత్య జగత్తు అనంత ప్రక్రియలకు ఆలవాలమైనది. పురాణ, కావ్య, ప్రబంధ, ద్విపద, శతక, దండక, ఉదాహరణ, యక్షగాన, నాటక, నవల, గేయ, వచన, శాస్త్రీయ గ్రంథాది వివిధ శాఖలతో అది విరాజిల్లుచున్నది.

ఇట్టి శాఖలలో దండకశాఖ యొకటి. కావ్యాంతర్గతముగను, స్వతంత్రముగను, ఛందోనియమ సహితముగను, తద్రహితము గను, బహులక్షణ సమన్వితముగను, మిక్కిలి ప్రాచీనత కలిగినదై, సంస్కృతాంధ్రవాఙ్మయముల బహుముఖవ్యాప్తినొందిన ప్రక్రియ దండకము.

## 1-1. దండక శబ్ద విచారము :

ఛంద : పరముగ ప్రత్యేకత కలిగి, బహువ్యాప్తి నొందినది దండకము. రూఢ్యర్థము కలిగిన ఈ దండక శబ్దమునకు స్వార్థమున 'క' ప్రత్యయము చేరగ దండక శబ్ద మేర్పడుచున్నది. అట్టి ఈ దండక శబ్దమునకు దండకారణ్య మనియు, దండ శబ్దమునకు కఱ్ఱ అనెడి అర్థములు సంస్కృత గ్రంథములందు పెక్కుతావుల పేర్కొనబడినవి.[1]

అగ్నిపురాణమున దండక వృత్త ప్రసక్తి కలదు. కేవలము అచటనది నొక వృత్తముగనే పరిగణింపబడినది.[2]

ఒకానొక వృత్తము, సమాసప్రాయ వాక్యము, అరణ్యము లలో నొకటియనెడి అర్థములు ఆంధ్ర శబ్దరత్నాకర, సూర్యారాయాంధ్ర నిఘంటువులలో పేర్కొనబడినవి. వరుసగా రెండు నగణ

ముల పిమ్మట ఏడు రగణములు అని చండవృష్టిప్రయాత దండక లక్షణము శబ్దరత్నాకరమున విశేషించి పేర్కొనబడినది.[3]

కప్రత్యయ రహితముగ దండము అను శబ్దమునకు, నమస్కారము, కర్ర యను నర్థములు కలిగియున్నవి.

"క్షణ కాలంబు మ్రాన్పడియు జగద్గురుండా జగద్ద్విజునకు సాష్టాంగ నమస్కారము చేయుచు భూమియందు దండమువోలె పండు కొనియుండి తదియ పాదపద్మంబుల నిజకర పద్మంబులం బూని—" అని శంకర విజయము నందలి ప్రయోగము.[4] ఇట దండము అనిన కఱ్ఱ అనియే నర్థము.

ఆంధ్ర వాఙ్మయముపై విశేష పరిశోధన చేసిన బ్రౌన్ పండితుడు దండకమను శబ్దమునకు **"The Dandakam or chant or blank Verse is a measured prose, consisting of one short and two long syllables alternatly. It may There fore be looked upon as a series of batchicts (Y) or (T) anti bacchicts. At the close of the peragraph, one or two long syllables are added some times the first six syllables are short. This metre is conveniently transcribed in lines of which each contains four of five feet"** అని చెప్పి, పోతన భాగవతాంతర్గత దండకమునందలి ఈ క్రింది పంక్తుల నుదాహరించెను.

శ్రీమానినీ మాన చోరా శుభాకార
వీరా జగద్ధేతు హేతు ప్రకారా స
మస్తంబు నస్తంగతంబై మహాలోల
కల్లోల హేలా కులాభీల పాథోసి
పాథశ్శ తల్పా కృపా కల్ప మందార
కల్పా నమస్తే నమస్తే నమస్తే నమః[5]

బ్రౌన్ పండితుని వివరణము చాలవరకు సమగ్రమయినది. తక్కిన నిఘంటుకారు లీమాత్రమును వివరణ నిచ్చి యుండలేదు. ఛంద 8 పరముగ దండక శబ్దమున కీతని వివరణమే సముచితమైనది. ఇతడు ఒక లఘువు. రెండు గురువులని యగణ సంబంధ వివరణ నిచ్చినట్లు కానగును. కాని, పోతనగారి భాగవతము నందలి దండక పంక్తుల నుదాహరించుట వలన తగణముగనే భావించవలెను. దండకాదిని ఆరు హ్రస్వాక్షరము లుండుట నగణ ద్వయము. ఇక అంతమున నొకటిగాని, రెండుగాని దీర్ఘాక్షరము లుండునని తెలిపెను. కొంత వరకు నిది సముచితముగనే కనిపించును. రెండు దీర్ఘాక్షరములతో నంతమగు దండకములు గూడ, తెలుగు సాహిత్యమున నొకటి, రెండు గలవు. ఈ 'గగ'లతో నంతమగు నియమము తగణ దండకమున కయిన, అది హేమచంద్రుని ఛందోనుశాసనము నాధారముగ గూడ చెప్పెననవచ్చును.

సంపూర్ణముగ దండక తత్త్వమును పరిశీలించిన వ్యక్తి బ్రౌన్ పండితుడు. కావుననే దండకమును 'గీతము', అనగా రాగయుక్తముగ చదువు పద్యమని కూడ తలచెను. కాని దండక శబ్దమునకును, ఈ ఛందమునకును గల సంబంధము జోలికిపోలేదు. తెలుగున వివిధ గణములు దండక చ్ఛందమునకు స్వీకరింపబడినవి. ఒక్క తగణమే గాదు.

విలియమ్ మోనియర్ తన సంస్కృతాంగ్ల నిఘంటువున **"The stanzes which may extended from 4 × 27 to 4 × 999 syllable"** అని సంస్కృత లాక్షణికోక్తముగనే అర్థము నొసగి యుండెను.[6] ఇతడు ప్రత్యేకించి నాలుగు పాదములుండునని చెప్పెను.

గణపవరపు వేంకటకవి తన విద్యావతీ దండకమును 'పుష్ప కోదండ' మని యభివర్ణించి యుండెడు. నేడు వ్యవహారమున, అనర్గ

కముగ పది తిట్లు తిట్టిన, దానిని గూడ తిట్ల దండకముగా నభివర్ణిం చెదరు. ఇది నేడేర్పడిన అర్థభేదము మాత్రమే.

సామాన్యముగ తెలుగున దండ శబ్దమునకు మాల, పూల మాల అను అర్థములు స్ఫురించును. తెలుగు లాక్షణిక పరిగణనము ననుసరించి యిది మాలా వృత్తము. ఇతర మాలా వృత్తములలో పలు గణము లావృత్తము కాగా, పుష్పమాల యందలి పుష్పముల వలె ఒకే గణము పలుమార్లు ఆవృత మగుటవలన మాలా వృత్తము యొక్క అర్థ సార్థక్యము కొంతవరకు స్పష్టపడును. మాల యందును ఒకే పూవును వినియోగించవలెనను నియమము లేదు. ఇవన్నియును కవితా హృదయముతో చెప్పెడి మాటలుగాని, వాస్తవముగా తోచవు. అయినను దండకమును మాలా వృత్తముగ తెలుగు లాక్ష ణికులు తెలుపుటకు గల కారణము భరత మర్పియే.[7]

పద్యభేదము లెన్నియో గలవు. కొన్నిటికి కొంతవరకు నామ సార్థక్యము నిరూపించవచ్చును. అట్లని ఛందమునకును వాని నామ మునకును గల సంబంధమును, వానికా పేరిడుటకు గల కారణమును అన్ని వృత్తములకును నిర్వచించుట సాధ్యము గాదు.

దండకమున వివిధ గణముల ఉపయోగము, గణ ప్రస్తార మును విడిచి గురు లఘువుల నామముతో నుడివిన ఛందము, నగణ ద్వయము యొక్క ఉపయోగము – నిరుపయోగము, ఈ అంశముల నన్నిటిని దృష్టియందిడుకొని చెప్పినచో, ఒక నియమము ననుసరించి అక్షరములను లేదా గణములను క్రమముగా పొందుపరచుట యని భావించవచ్చును.

## 1—2, స్వరూప స్థితి

తెలుగు సాహిత్య మంతయును పద్య, గద్య, చంపూ రూప మయ్యెను. వృత్తపరముగ, నితివృత్త పరముగను, వర్ణనా పరము గను, సంఖ్యా పరముగను పెక్కు విధములుగ ప్రత్యేకత కలిగినదై యేదియోనొక ప్రక్రియా నామమున పిలువ నెంపిక కలిగి యున్నది. ఒక వృత్తమును, సంఖ్యను, అక్షర నియమము నాధారముగా గొని, కొన్ని ప్రక్రియలను సాహిత్య శాఖలుగా కవులు విస్తరింప జేసియుండిరి. తెలుగున నిరోష్ఠ్య కావ్య, శతక, దండకాది శాఖ లీవిధముగ నభివృద్ధి చెందినవే.

తెలుగు సాహిత్యమున ప్రాముఖ్యము కలిగి, బహు విస్తృతి నొందిన ప్రక్రియలలో దండక మొకటి. ప్రత్యేక శాఖగా రూపు దిద్దుకొనిన యీ దండకము, కేవలము ఉత్కృతి చ్ఛందము కంటె నధికాక్షరముతో కూడిన ఒక వృత్తభేదము మాత్రమే. ఈ దండక వృత్తమును సంస్కృత లాక్షణికులు సమ వృత్తముగ నెంపిక చేయ లేదు. అట్లని దీనిని ప్రత్యేకముగ పేర్కొనను లేదు. సమవృత్త ముల తదుపరి దీనిని చేర్చి, సమవృత్త ప్రకరణమును సమాప్తమొన రించియుండిరి. కారణము ఇరువది యేడు అక్షరములతో కూడిన యీ వృత్తము ఇరువది యేడు అక్షరములే కలిగి యుండునను నియ మమును పాటించునది కాదు. దీని స్వరూపము ఒక్కొక్క గణము చొప్పున ఏకోన సహస్రాక్షర పర్యంతము పెంపొందునని లాక్షణికుల నిర్ణయము. ఇట్టి తత్త్వము గల దీనికి ఏకోన సహస్రాక్షర పర్యంతము పెంపొందునను నియమము కూడా, సరిపడునది గాదు. తెలుగున నెన్నియో లక్ష్యము లీనియమము అతిక్రమించినవియు నై యున్నవి. గణ నియమము, పాద నియమము లేనివాటిని కొందరు లాక్షణికులు గద్య దండకములుగ నభిప్రాయపడి యుండిరి. ఇట్టి స్వరూప విస్తృతి

కలిగిన దగుట వలననే నొక ప్రత్యేక శాఖగ రూపు దాల్చుట కవకాశము నేర్పడినది. ఎటువంటి భావములనైనను ఇముడ్చుకొను శక్తి కలిగి యున్నది. ఇట్టి దీనిని కావ్య నామముచె పిలువ ఎంపిక కలిగినదా యను విషయము పరిశీలింప వలెను.

కావ్యములు, ప్రబంధములు – చాటు ప్రబంధములని ద్వివిధ ములు. మరల నీచాటు ప్రబంధములు, సంఖ్యాబద్ధములు - అసంఖ్యా బద్ధములు అని రెండు విధములు. దండకము అసంఖ్యాబద్ధ చాటు కావ్య మనజెల్లును. దండకములను చాటు ప్రబంధములని లాక్షణికులు నిర్వచించి యుండిరి.

కావ్యాలంకార చూడామణి కర్త, కావ్య భేదములను జెప్పు సందర్భమున నీదండకమును గూర్చి యీ విధముగా చెప్పెను.

కం. ఛందో భవ లక్షణ గణ
సందోహ నిబద్ధ మగుచు శ్రవణానందా
మందాను ప్రాసంబుల
నందంబగు "దండకము" మహాకవి కృతులన్. 4-42

కం. ఇవి యెల్లను నానావిధ
కవి కృత శాస్త్రముల జేత గల్పితములు పె
క్కు విధంబులు "చాటుకృతి"
ప్రవరంబులు పరగ నెరుగబడి నొండెడలన్. 4-43

అప్పకవి తన అప్పకవీయమును దండకమును గూర్చి ఈ క్రింది విధముగ తెలిపియుండెను.

తే. అట్టి "కావ్యంబు ద్వివిధమై" యతిశయిల్లు
బరువడి ప్రబంధ చాటు ప్రబంధములన 1-27

కం. కనుగొన "సంఖ్యా బద్ధం"
"బు నసంఖ్యాకంబు" నా భువి నిరు దెరగై
తనరారు పూర్వ కవి మత
మున నా "చాటు ప్రబంధములు" జబుజాక్షా. 1-92

తే. నాల్గు దెగల యుదాహరణములు ముక్త
కాది పంచదశమును సంఖ్యాన్వితములు
గద్య, రగడ, "దండకములు," మంజ
రులును సంఖ్యారహిత చాటువులు నృసింహ 1-30

ఇట్లు తెలుగు లాక్షణికులచే చాటు ప్రబంధ భేదముగ పేర్కొన బడినది దండకము. తెలుగు కవులు, లాక్షణికులు చెప్పిన చాటు ప్రబంధములే ప్రాచీన సంస్కృతాలంకారికులచే నిరూపింపబడిన ముక్తకాదులు.

ఈ ముక్తకము, నిబద్ధము - అనిబద్ధము అని రెండు విధములు. పూర్వోత్తర పద్యముల సంబంధమును అపేక్షింపక స్వతంత్రముగ నొక యర్థమును జూప గలిగిన సామర్థ్యము కలిగినది ముక్తకము. ఇదియే అనిబద్ధము.

పూలదండ యందలి దారము వలె పద్యముల కన్నిటికిని అను స్యూతను కలిగించు నితివృత్తముతో కూడినది నిబద్ధము. పూర్వోత్తర పద్యములతో సంబంధము నపేక్షించియు, నపేక్షించకయు నేర్పడిన నిబద్ధానిబద్ధ భేదములలో దండక మేవిభాగమునకు చెందిన దను విషయమున, దండకము నిబద్ధ - అనిబద్ధ అను రెండు విధములుగను కనుపించును. కావ్య సంబంధియైన వ్యక్తియొక్క మధుర భావనను నివేదించుటకు నుపయోగించునది గాన కావ్య సంబంధి యయినదియే. కావ్యమునకు వన్నె తెచ్చునది వలె నంతర్గతముగ నుండును. కావున

నిబద్ధ మనజెల్లును. గ్రంథాంతర్గతములైన దండకములను గూర్చి తెలుపుచూ "కాని పై దండకము లన్నియు గ్రంథాంతరములు అనగా నాయా కావ్య ప్రబంధము లందుపయుక్తములగు ఛందస్సు లలో నిది యొకటి. గ్రంథముతో సంబంధించి యుండును గాని వేరు గాదు"[8] అను నిడదవోలు వెంకటరావుగారి అభిప్రాయము గమనించ తగినది. నిబద్ధమను అభిప్రాయమున కిది యుపబంధకము కాగలదు. అయిన నించుక సూక్ష్మముగ పరిశీలించిన యిది వృత్త భేదములలో నొకటియే గాని, ఇతివృత్త పూర్వకమగు ప్రత్యేక విషయము గాదన వలెను. కావ్య వస్తువున కుపకారకమై యుండును. కావున దీనిని సంపూర్ణముగ నిబద్ధ మనుట కూడ కుదరని విషయము.

'ముదునూరు వెంకటాచలపతి కవి' రచించిన 'శ్రీ శివ రామకృష్ణ దండకము'ను గూర్చి యొకింత పరిశీలింప వలసియున్నది. ఈయన దండకాదిని పీఠికలో "శ్రీ సుగుణాకర విజయాది కబ్బంబుల రచియించియుంటి. అందు సుగుణాకర విజయ మను కబ్బంబు, శృంగార, ప్రేమ, కరుణా, భక్తిరస ప్రధాన మూలకంబై, ద్రాక్షా పాక సమంచిత సహస్రాధిక పద్యానువృత్త గద్య సంకలితంబై శ్రీ భగవత్కృపాలోకనా విశేషంబున నాంధ్ర జననీ సహాయ సంపత్తి కొలంది శ్రీ పార్థివనామ సంవత్సరంబున బరిపూర్తి యగు భాగ్యాతిశయోన్నతి వడయగంటి గాని, ప్రస్తుత కాల పరిస్థితి బట్టి యా పొత్తంబు నచ్చొత్తించుట కలవి యగుపడని కతన, దద్గ్రం థాంతర్భాగంబైన యీ దండకమునైన ముద్రించి మన్మనోరథార్థ సంసిద్ధ వడయ దొరకొంటి[9]" నని వాక్రుచ్చి యుండిరి.

దీనిని బట్టి గ్రంథాంతర్గతమై, కథకు సహాయభూత మయ్యు, ప్రత్యేకముగ వెలువరచినను తన్నదైన స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పో వుటలేదని తెలియుచున్నది. ఇంచుమించు స్తుత్యాత్మకములైన

కావ్యాంతర్గత దండకము లన్నియును నీవిధముగనే యుండును. కావున కావ్యమునందు నిబద్ధమై వన్నె తెచ్చుచూ, ననిబద్ధముగూడ నగుచున్నది.

అంతర్గతమ్మలైన స్తుత్యాత్మక దండకముల విషయమున నీసమర్థనము చెల్లును గాని, స్వతంత్ర దండక కృతుల విషయమున జెల్లదు. సంఘము నందలి కొందరు ఉన్నత వ్యక్తుల పరముగ, వారి చరిత్ర నాధారముగ జేసికొని రచించిన స్వతంత్ర దండకములును గలవు. కీ॥ శే॥ కలుగోడు అశ్వత్థరావుగారు రామాయణేతి వృత్తము నంతటిని దండక రూపమున రచియించి యుండిరి. అట్లే ఆంజనేయ సంబంధి దండకము లందు, నాతని జన్మ వృత్తాంతము మొదలుగ సుందరకాండ యందలి యాతని సాహస కృత్యములు, చివరకు శ్రీరామ పట్టాభిషేకమును తెలిపిన కృతులున్నవి.

అష్టాదశ వర్ణనములు ప్రయత్న పూర్వకముగ నిక్షిప్తము చేయకపోయినను, కావ్య తత్త్వము నంతటిని మోయగలిగిన, శక్తి మంతమైన కావ్య ప్రక్రియగ నెంచదగినది. దీనిని రమణీయార్థ ప్రతి పాదకమైన లఘు కావ్య మనుటలో విప్రతిపత్తి యుండజాలదు.

## 1-3. విశేష వృత్తము :

నియమ సహితమైన అక్షర చ్ఛందము యొక్క, మాత్రా చ్ఛందము యొక్క ప్రత్యేకతను వేరొకచో జెప్పన నవసరము లేదు. దేని అందచందములు దానివి. ఒక వృత్తము యొక్క విశిష్టత మరియొక వృత్తమునకు రాదు. అట్లని అన్ని వృత్తములను అమితముగ నాదరించినవారు గారు ఆంధ్రులును ఆంధ్ర కవు లును. ప్రతి వృత్తమును జనమునోట పట్టి ఆదరించలేదు. జన జీవన నాడుల కెక్కుటకు వృత్త నియమము ప్రధానము. అందునను

పఠన సౌలభ్య, సౌకర్యములు ప్రాధాన్యము వహించును. సాహిత్యము ప్రధానాంశము. అది భక్తి, రక్తులకు దేనికి సంబంధించిన దైనను గావచ్చును. ఇట్లు ప్రాధాన్యము వహించిన వృత్తములలో దండక వృత్తము నొకటి. దీని ప్రత్యేకత దీనిది. అంతియేగాక తెలుగున దండకము అమితాదరణము పొందినది. ఆంధ్ర మహాభారతమునందు దండక వృత్తమును సంస్కృతమునందు కంటె ఉచ్చారణాది సౌలభ్యములతో రూపొందుటయే కారణము.

ఏ యితర వృత్తము కంటెను నధికముగ తెలుగు కవులెందరో దండక వృత్తమును కొనియాడి యుండిరి.

ఏ యితర వృత్త మయినను పరిమిత గణములతో, కొద్దిపాటి అక్షరసముదాయముతో నంతమగును. దండక వృత్త మటులుగాక, అతి విస్తృతముగ తన స్వరూపమును పెంపొందించుకొనుట పరిపాటి.

ఇట్టి వృత్తమును కవులు, పండితులు, విమర్శకులు మొదలగు వారందరును కొనియాడుట, సామాన్య ప్రజానీకము నాలుకల కాకట్టు కొనుటయేగాక సర్వత్రా వ్యాపించి యున్నది.

ఒకే వృత్తము ఒక కావ్యముగ రూపు దాల్చుట, అందునను ఒకే గణముతో కూడిన వృత్తము పొత్తి మంతయును కొనసాగుట, తెలుగు సాహిత్యమున దండక వృత్తమునకు దక్క మరి యే యితర వృత్తమునకును తావు లేదు. ఇటువంటి వృత్తమును, వృత్త విశేష మను చూపుతో స్వల్పముగ విశదీకరించుట సముచితము గాకపోదు.

దండకవృత్తమునకు అక్షరములు 27కు తక్కువ గాకుండుట నియమము. ఇది ఉత్కృతి చ్ఛందము తదుపరిది. చాలమంది లాక్షణికులు సమ వృత్తముగ గుర్తింపకపోయినను, సమ వృత్త భేద ప్రకరణమునసే చివరగా దీనిని పేర్కొని యుండిరి. అట్టి వారిలో వృత్త

రత్నాకర కారుడు - కేదారభట్టు, ఛందోమంజరి కారుడు-గంగా దాసు, శబ్ద కల్పద్రుమ కర్త - రాధాకాంత దేవుడు, మొదలగువారు ముఖ్యులు. ఛందశ్శపరమగు విషయములు సమస్తము ద్వితీయాధ్యాయమున పేర్కొనబడుటచే నిచట ప్రస్తావించలేదు. (చూ॥ద్వి॥అ॥).

దండక వృత్తమును కొనియాడిన వారు :

1. "చండ విద్యావతీ 'దండక రాజంబు'
సులభమే రసము హెచ్చుగ నొనర్చు"

పరిబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము -
గణపవరపు వేంకట కవి. ప. సం. 51

2. " 'శ్రీరాజిత దండకములు' జెప్పినవాడన్ "

రుక్మిణీ పరిణయము - సత్యవోలు భగవత్కవి ప.సం.18

3. "మంచి క్షేత్ర కథనంబు మరియు బెక్కు
శతక, 'దండక సత్కృతుల్' ప్రతిభ గూర్చి
యుల్ల మలరార పార్వతీ వల్లభునకు
భక్తి నర్పణ చేసిన భవ్య మతిని"

శివలీలా విలాసము - కూచిమంచి తిమ్మకవి. 1-5

4. "మా శిష్యుడైన మణికంధరాహ్వాయు
డిట గొన్ని నాళ్ళను క్రిందటను క్రొత్త
గాగ హరిం బొడం గానంగ దావచ్చి
'దండక రూప సంస్తవ రచన' "

కళాపూర్ణోదయము - పింగళి సూరన. 1-78

ఇట సూరన దండకము చదివెడి తీరును గూడా వివరించి యుండెను. తదుపరి వచనమున "అమ్మదిరాక్షి 'మధుర గంభీర స్వరంబుగ' నిట్లని చదివి" 1-79 అని దండక రచన కుపక్రమించెను.

"యుగపత్ప్రవృత్త విశ్వావసు తుంబురు నారద ప్రభృతి దివ్య గాన గీత నిజ నామాంకిత బిరుదావళ్యుదాహరణ మంగళాష్టక 'దండకాది' ప్రబంధ సంరంభుండును—"

ఘటికాచల మాహాత్మ్యము –

తెనాలి రామకృష్ణ కవి. 2–253.

6. "రాజగోపాల 'దండక' సందర్భ
వైదర్భిగన్న విద్వత్కవీంద్ర"

ప్రహ్లాద చరిత్ర – విజయరాఘవుడు. పు-3

7. "రాణ దలిర్ప జెప్పి రఘురామున కంకిత మిచ్చినాడ భ
ల్లాణ చరిత్ర దండక మలక్ష్యము సేయకు బోకు డాంధ్ర గీ
ర్వాణ రసజ్ఞులైన కవి వల్లభులార –"

భల్లాణ దండకాంత పద్యము–నడిమింటి రామజోగి.

ఇట్లు తెలుగు కవులెందరో దండకములను మమకారముతో రచించి, తమను తామే పొగడుకొని మురిసి యుండిరి. ఈ వృత్తము నందలి ఇంపు సొంపు లటువంటివి. ఆధునికులలో గూడ దీనిని శ్లాఘించిన వారెందరో గలరు.

8. "వట్టి గతి చేతనే తెలుగువారి హృదయములను ఇంత
చూరగొన్న, చూరగొనగల వేరొక ఛందస్సు నేనెరుగను." [10]

కీ. శే. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

9. "ఎవరైనా జంభోరా కంఠమెత్తి పఠిస్తూవుంటే వేదఘోషను
తలపిస్తుంది. వారి నిపాత ధ్వానికి ఎద అనిపిస్తుంది." [11]

కీ. శే. కవికొండల వెంకటరావు

10. "వాగ్ఝరి అబ్బాలీ అంటే తెనుగు దండకం మన అబ్బాయిలు కంఠోపాఠంచేసి తీరాలి అని నా అభిప్రాయం."[12]

కీ. శే. కవికొండల వెంకటరావు

11. "స్తుతి పాత్రంగానూ, శృతి పాత్రంగానూ ఉంటాయి దండకాలు. ఒక అపూర్వమైన లయతో మనసును సులభంగా ఆకర్షిస్తాయి. పది కాలాలపాటు నాలుకమీద నిలిచి వుండే తత్త్వం వాటిలో విదితమై ఉంది."[13]

డా॥ మద్దూరి సుబ్బారెడ్డి.

దండక వృత్త విశేషమును ఇంకను ఎందరో కొనియాడియుండిరి. ఆంధ్ర ప్రజలు అమితముగ నాదరించిరనుటలో సంశయింపబనిలేదు. కవితల్లప్రయత్నించే పిల్లకవులు మొదలుగ, తల పండిన కవుల వరకూ ఆదరించిన వృత్త మిది.

గణ నియమము పీడనిది. పద్యముతో సమానమైనది. గణ సంఖ్యా నియమమును విడిచి గద్యముతో పొత్తు కలిగినది. పద్య, గద్యముల కనుసంధానమై సమస్కంధముగ నడక సాగించు అపురూపమైన వృత్తమిది.

## 1-4 దండకము - మార్గ, దేశి భేద పరిశీలనము :

ఈ మార్గ-దేశి భేదములు నిజమునకు సంగీత శాస్త్రమునకు సంబంధించినవి. వాల్మీకి రామాయణమునందు కుశలవులు. కుశీలవులై మార్గ విధానమున రామచరితమును గానము చేసిరని తెలుపబడినది.

"తతస్తుతౌ రామ వచః ప్రచోదితా
నగాయతాం మార్గవిధాన సంపదా
నచాపి రామః పరిషద్గత శ్శనై
ర్బుభూష యాస క్త మనా బభూవహ" 1-4-31

శార్ఙ్గదేవుడు (క్రీ. శ. 1230) తన "సంగీత రత్నాకరమున" మార్గ-దేశి భేదములను పేర్కొనియుండెను.

"మార్గ దేశీ విభాగేన సంగీతం ద్వివిధం మతమ్
ద్రుహిణేన యదుద్దిష్టం యదుక్తం భరతేనచ
తన్మార్గోహి యయారీత్యా యత్స్యాల్లోకాను రజనం
దేశే దేశేషు సంగీతం తద్దేశీత్యభిధీయతే" పు. 188

బ్రహ్మచేత నుద్దేశింపబడి భరతునిచే నుపదేశింపబడినది మార్గ సంగీతము. ఆయా ప్రదేశములయందు, నాయా ప్రజల యనురంజనార్థమై యొక్కొక్క ప్రదేశమున నొక్కొక్క రీతిగ నుండునది దేశి సంగీతము.

ఇట్లు సంగీతపరముగ నుపయుక్తమయిన మార్గ-దేశి భేదములు తెలుగున ప్రథమముగ నన్నెచోడుడు తన "కుమార సంభవము"న భాషా పరముగ ప్రయోగించెను.

"మును మార్గ కవిత లోకం
బున వెలయగ దేశికవిత బుట్టించి తెనుం
గున నిలిపి రంధ్ర విషయం
బున జన చళుక్యరాజు మొదలుగ పలువుర్" 1-23

నన్నెచోడుని పద్యమునుబట్టి సంస్కృత కవిత్వము మార్గమనియు, అట్టి మార్గము విడిచి దేశికవితను అనగా తెలుగు కవితను చాళుక్యరాజులు పుట్టించిరనియు తెలియును.

"మార్గకు మార్గము దేశియు
మార్గము వగవంగ దశు ... మది వదలక దు
ర్మార్గపథ వర్తులన దగు
మార్గవుల దలవ నలతి మహి నుకవులకున్" 1-28

ఇట మార్గ—దేశి కవితా భేదములతోపాటు, మార్గ కవితాభిమానులను నిందించెనని తెలియును. నన్నెచోడునిబట్టి సంస్కృత కవిత్వమును మార్గకవిత్వ మనియు, దేశ భాషలలోని కవిత్వమును దేశికవిత్వ మనియు భావింపవలెను. అట్లుగాక, ఇతివృత్తము, భాష, ఛందస్సు మొదలగువానిలో సంస్కృత ప్రభావమున్న వానిని మార్గ కవిత్వమనియును, సంస్కృత ప్రభావమునకు లోనుగాక భాష, ఛందము, ఇతివృత్తము దేశితనముతో కూడినదానిని దేశికవిత యనియు కొందరి అభిప్రాయము.

"ఇతివృత్తము— భాష— ఛందస్సు, ఈ మూడును శుద్ధ దేశీయములైన నాడే దేశికవిత్వమనే పదము సార్థకమగును"[14] అని శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు తమ అభిప్రాయమును వ్యక్తీకరించి యుండిరి. తుదకీ మార్గ— దేశి పదములు భాషాపరముగ చర్చనీయాంశము లగుటయేగాక, తెలుగు సాహిత్యమున ప్రాచుర్యమునుబట్టి దండకము దేశిసాహిత్య ప్రక్రియగను, ద్రావిడ భాషల సొంతమనెడి యభిప్రాయములు జనించినవి.

తెలుగున దండకము మార్గకవితా సంప్రదాయమునకు చెందినదా? దేశి కవితా సంప్రదాయమునకు చెందినదా? యను అంశమున పలువురు పరిశోధకులు పెక్కు అభిప్రాయములను వ్యక్తీకరించి యుండిరి. వారి వారి అభిప్రాయములను పరిశీలించుటకు ముందుగ తెలుగున దండకము భాష, ఛందస్సు, ఇతివృత్తముల నాధారముగా పరిశీలించి మార్గమో, దేశియో తెలిసికొనుట యుచితము.

## 1-4-1 ఇతివృత్తము :

దీనినే వస్తువు అందురు. దేశి జన వ్యవహారమున, దేశి సంప్రదాయములతో నిండిన విషయమును దేశీయేతివృత్త మనవచ్చును.

ఆర్య సంప్రదాయములు కలిగి సంస్కృతమున పురాణ వాఙ్మయము నకుగాని, కావ్య వాఙ్మయమునకగాని చెందిన బహుపురాతన వస్తు వును మార్గేతివృత్తముగ నిర్ణయింపవచ్చును.

ఇతివృత్త మేమియును లేనిదియు, స్తుత్యాత్మకమైనదియు, సంస్కృతమున కేవలము స్తుతిపూర్వకముగనే వినియోగింపబడి నదియు నీ దండకము. స్తుతిపాత్రమైన భగవంతునో; యేదేవతనో, నెంతవరకు విశేషణములతో కొనియాడుటయేగాని, తీగవలె సాగెడి యితివృత్తము కలిగినది కాదు.

తెలుగున నీదండక వృత్తము చాలవరకు స్తుతిపరముగనే విని యోగింపబడినను, వస్తువైవిధ్యమున సంస్కృతముకంటె తెలుగునదే పైచేయి. భోగినీ దండకము వంటి దేశీయేతివృత్తములు రచింపబడినవి సాంఘికపరమైన, గ్రామదేవతా పరమైన, దేశీయాచార వ్యవహార పరమైన విషయములెన్నో యితివృత్తములుగ కలిగిన దండకములు గలవు. ఇట్టి దండకములే తెలుగున దండక సాహిత్యమునకు సంపన్నత నాపాదించినవి.

కనుక సాంఘికముగా గాని, రాజకీయముగా గాని, దేశీయ దేవతలకు సంబంధించిన వస్తువుతో గాని, నెలకొనియున్న దండకములకు వస్తుపరముగా దేశీయత నాపాదించవచ్చును. ఉదాహరణకు భోగినీ, పోలేరమ్మ, దేశమాత దండకములు ఇట్టివి. అట్లుగాక విష్ణువునో, శివునో, సరస్వతినో, పార్వతినో, ఆంజనేయునో లేక దశావతారము లనో వర్ణితములైన దండకములు మార్గ సంబంధిగా నిర్ణయింపనగును.

## 1-4-2 భాష :

సంస్కృత శబ్దజాలమును మార్గగను, దేశీయ శబ్దజాలమును దేశిగను పరిగణింపవలెను. సంస్కృత శబ్దము దేశీయతా ముద్రతో

కూడిన దనగా నది, దేశీయతా ముద్ర నేర్పరచుకొనిన మార్గ యగును. అయినను, ఈ మార్గ-దేశి భేదములు తెలుగు భాషకు పట్టవు. సంస్కృతభాష ప్రాచుర్యమున నున్న కాలమున, దానితో జన వ్యవహారమున నడచుచున్న ప్రాకృతాది అపభ్రంశములకు ఈ మార్గ-దేశి విభజనము చెల్లునుగాని నేటి తెలుగుభాషకు అసంగతము నేటి తెలుగుభాష యంతయును సంస్కృతభాషా మిశ్రితమైయుండుట వలన, మార్గ-దేశి మిశ్రమముగనే భావించవలెను.

సాధారణముగ దండకములందు ప్రయోగింపబడెడి శబ్దజాల మంతయును సంస్కృతమయ మయ్యును, పెక్కు అచ్చ తెలుగు దండకములుకూడ నున్నవి. నన్నయగారి భారతాంతర్గత దండకము ఇంచుమించు సంస్కృతపద భూయిష్ఠము. శ్రీనాథుని శృంగారనైష ధాంతర్గత దండకమును సంస్కృత భాషాశ్రితమే. భోగినీ దండకమున ప్రయుక్తమయిన భాష చాలవరకు తెలుగనియే చెప్పవచ్చును.

కావున మార్గ-దేశి పదములను భాషాపరముగ గ్రహించి, సంస్కృత భాషా మిశ్రమమై విడదీయరానంతగా పల్లుకొనియున్న తెలుగుభాష నాధారముగ గొని, దండకము భాషాపరముగా మార్గయా? దేశియా? యని నిర్ణయింపబూనుట అనుచితము, అసంగతము.

## 1-4-3 ఛందస్సు :

ఏకగణ నిబద్ధమైన విశేషవృత్తము దండకము. వివిధ కావ్యము లందువలె, వివిధ ఛందములకు తావులేదు. ఇట్టి దండక కృతులకు ఛందఃపరమగు బీజము పింగళముని ఛందోవిచితినుండి గానవచ్చును. నేటి నాట్యశాస్త్ర ప్రతు[illegible]ను, పరిశోధకులు ప్రతి

_ప్తముగా దలచినను, భరతముని (తన) నాట్యశాస్త్రమునగూడ నున్న దని తెలియుచున్నది. (చూ॥ ద్వి॥ అ॥)

సంస్కృత భాషయందు "ర, స, య" గణములేగాక, రగణ-జగణ పరివృత్తితో దండకవృత్తము రచింపవచ్చునని నియమమును నగణ ద్వయముపై "ర, త, య" గణములు రచింప వచ్చుననియును లక్షణములవలన తెలియుచున్నది. అట్లేగాక, గురు లఘువుల నాధార ముగను "ఛందోమంజరి" యందు "గంగాదాసు" మరికొన్ని లక్షణ ములను తెలిపియుండెను. సంస్కృత లక్షణము లిటులుండ, తెలుగున లక్ష్యముల ననుసరించి తగణదండక లక్షణము గలదు. అట్టే ననహా, సనహా, నసహా గణముల తదుపరి తగణములు కలిగి అంతమున గురువుతో నిలుపుట, నగణ ద్వయముపై యగణములు రచితమగుట, ననహా గణములలో నేదొక్క గణమునైనను ముందుగ నిలిపి తక్కిన వన్నియును తగణములు కలిగి గురువుతో నంతము జేయుట, మున్నగు లక్షణములను తెలుగు లాక్షణికులు తెలిపియుండిరి.

తెలుగున కవిజనాశ్రయకర్త చెప్పిన 'ననహా' గణము లాదిగ నిలిపి తక్కినవి తగణములు కలిగి యంతమున నొక గురువు నిలిపెడి లక్షణము, సంస్కృత రగణ దండక లక్షణమే. ఇది నగణద్వయముపై రగణ సమూహామగును. ఈ అంశము ద్వితీయాధ్యాయమున సప్రమా ముగ నిరూపింప బడినది. ఈ సందర్భమున (శ్రీ) రావూరి దొరసామి శర్మగారి అభిప్రాయమును గమనింపవలసి యున్నది. "న, న, ర లే-న, న, హా, త లుగ భీమన చెప్పియుండును. తరువాత ననహా పాఠము అమరగ సనహాంబులని మార్పులజెంది, తదనుగుణముగ, అమరగ సనహాంబని కాలక్రమమున సవరింపబడి స్థిరపడియుండును."[15] ననహా, సనహా గణము లాదిగనుండు లక్ష్యములు. తెలుగు దండకములందు విరళము. ఇక నీనగణ ద్వయము ఏల పరిత్యజింపబడిన దను విషయ

మున, ఛందోమంజరికారుడు గంగాదాసు నగణ ద్వయమును వీడి కొన్ని లక్షణములను పేర్కొనియే యుండెను.

కావున దండక చ్ఛందమునకు బీజభూతము, ఆధారము, పింగళచ్ఛందమని చెప్పవలెను. తదుపరి యెన్నియో భేదములు సంస్కృత లాక్షణికులే తెలిపియుండిరి. అట్లే తెలుగునను మార్పులు సంభవించినంత మాత్రమున తెలుగు దండక చ్ఛందము దేశియన జెల్లదు. మిక్కిలి ప్రాచీనత కలిగినదై, ప్రత్యేక లక్షణములు కలిగి, సంస్కృత లక్షణముం తో విభేదించిన యది, దేశిచ్ఛంద మన జెల్లును.

ప్రతిభావంతుడగు వ్యక్తి అనుకరణకు పూనుకొనినను, మక్కికి మక్కి అనుకరించుటకు ఆరాటపడడు. అందు కొద్దిగనో, గొప్పగనో నాతని వ్యక్తిత్వము ప్రతిఫలింపజేయ బూనుకొనును. కావున తెలుగు దండకము మార్గచ్ఛంద స్సంప్రదాయి యనజెల్లును. తెలుగు కావ్య కర్తలు దానికి, తెలుగుదనమును రంగరించి పోసి, మరింత సౌందర్య సౌఖ్యావహము జేసి జనజీవన నాడుల కెక్కునట్లు తీర్చిదిద్దిరి.

అక్షర చ్ఛందము మార్గచ్ఛంద స్సంప్రదాయము. దండకము ఇరువదియేడు అక్షరములు కలిగి యుండవలెనను విషయము సంస్కృ తాంధ్ర లాక్షణికు లందరును ఏకగ్రీవముగ నంగీకరించినదే. ఇప్పట్టున అక్షరనియమము కలిగిన దండకములను, మాత్రా నియమముగల దేశి యనుట పొసగనిది. అయినను తెలుగు దండకముల విషయమున శ్రీ రావూరి దొరసామిశర్మగారు దేశి సాహిత్యమునకు చెందినవిగ తమ అభిప్రాయములను వెలిబుచ్చుటతో పాటు శ్రీ నిడదవోలు వెంక టరావు, కిట్టెల్, బ్రౌన్ మొదలగువారలు అభిప్రాయములనుకూడా పేర్కొనియుండిరి. తమిళ దండకముల విషయమున సంస్కృతము నుండి తమిళమునకు వచ్చినదిగా చెప్పిరి. అయినను వీరి అభిప్రాయ ములు పరిశీలించుట సముచితము.

## 1-4-4 దేశి యనుటకు ప్రమాణములు :

"తెనుగు ఛందములలో లయగ్రాహి మున్నగు మాలా లక్షణములు చెప్పుటలో 'ఏకోన చత్వారింశన్మాత్రా గర్భితంబు ద్రింశ దక్షరంబునైన లయగ్రాహి' ఇత్యాది విధముగ మాత్రా గణనము సేయబడినది. దీనినిబట్టి మాలికా వృత్తములు మాత్రా ఛందస్సునకు చెందినవని చెప్పవచ్చు. ఏతత్కారణమున దండకాదులు జాతి పద్యములై దేశి కవితా శాఖలోనివిగ సమర్థనీయములగు."[16]

"సంస్కృతభాషా పారంగతుడు, విద్యాదయితుడు, ఆంధ్ర కవిత్వ విశారదుడు నన్నయభట్టారకుడు దండక రచనయందు దనకు ముందుండియున్న మార్గ సంప్రదాయమును (నసర గణ దండకరచన) వీడి, తగణమయముగ, నేకపాదముగ వ్రాయు కొత్తపద్ధతి స్వీకరించుట పరికింపగా నాతడు కొంత దేశీయత కూర్చెనేమోయని తోపక మానదు."[17]

అయిదు మాత్రలు గల తగణముల కూర్పగుటచే దండకము మాత్రా చ్ఛందస్సుకు జెందినదనియు కొందరి యూహ. అప్పట్టున నిది దేశికవితా సంప్రదాయము అనవలసి యుండును. కన్నడభాషలో నాగవర్మ రచించిన ఛందోంబుధిని ఆంగ్ల వివరణముతో ప్రకటించిన కిట్టెల్ పండితుడు కొన్ని ప్రత్యంతరములలోని పాఠభేదముల నాధారముగా గొని దండకములు జాతి వృత్తములను మతము పైతము సూచించు చున్నాడు. (ఆంగ్ల పీఠిక 8,9.) అంతియేగాక తెలుగు దండకము మాత్రా ఛందస్సునకు చెందినదిగా గోచరించెడునని తెల్పియున్నాడు. **A Telugu Dandaka seems to belong to the mora metres** (పీఠిక. పు. 8). ఇందులకనుబలకముగా నీ క్రింది విషయ మాలోచింప వలసియున్నది. పింగళచ్ఛందమునను, వృత్త

రత్నాకరమునను షడ్వింశతి ఛందోజాత సమవృత్తములను దెల్పిన తరువాత దండకములు చెప్పబడినవి. కాని యందియ్యవి మాలా వృత్తములని పేర్కొనబడలేదు. మరియు తెలుగులోని యుగ్రాహ్యాతి వృత్తభేదములు తత్ప్రకరణమున జూపట్టవు."[18]

"ద్రావిడ భాషలలో సంస్కృతభాషా సంపర్కములు మిక్కిలిగ నెక్కొని యుండుటచే ద్రావిడభాషా సహజములగు ఛందస్సులే సంస్కృతీయములై కొంత కాలమున కవి యాభాషలోనివిగను, దాని నుండియే ద్రావిడ భాషకు సంక్రమించినవిగను కొందరు భాషాతత్త్వ విమర్శకులు వక్కాణించెదరు. కర్ణాటాంధ్రములందే గాక తమిళము నందును దండకము వెలయుచున్నది గదా! నేడు ద్రావిడ భాషా పదములు గొన్ని వ్యవహారవశమున సంస్కృత భాషయందు గ్రహింపబడి సంస్కృత శబ్దములుగనే పరిగణింపబడుచున్నవి. అట్లే ద్రావిడ ఛందస్సులలోని కొన్ని పద్యరీతులు సంస్కృతమున జేరి యాఛందస్సులందు కాలక్రమమున నెక్కియుండనోపు"[19]

"తెనుగు సాహిత్యములో మహాకావ్యములు. పురాణములు, చంపువులు, ప్రబంధములు మార్గ కవితలనియు, ద్విపదయు, యక్షగానములు, శతకములు, ఉదాహరణములు, దండకములు దేవి కవితలనియు జెప్పనోపును."[20]

ఇంతదనుక దండకము దేశికవిత యనెడి ప్రముఖుల అభిప్రాయములు తెలుపబడినవి. అట్లే దండకము మార్గకవిత యనుటకు గల ప్రమాణములను పరిశీలించుట యుచితము కాగలదు.

## 1-4-5 మార్గ యనుటకుగల ప్రమాణములు :

'ఏకోన చత్వారింశన్మాత్రా గర్భితంబు ద్రింశ దక్షరంబునైన

లయగ్రాహి' అని చెప్పుటలో లయగ్రాహి వృత్త విషయమున ముప్పది తొమ్మిది మాత్రలుగ లెక్కించి యవి గర్భితముగ నుండు నని వివరణముగ మాత్రమే తెలిపియుండును. మాలా వృత్తముల కన్నిటికి నీనియమము సరిపడదు. అందువను దండక వృత్తమునకు తెలుపలేదు. మాత్రా గర్భితములని చెప్పిన లయగ్రాహి లక్షణ పాదమున ప్రకసీసము 'అది' శబ్దమైనను ప్రయోగించలేదు. కావున దండకమునకు ఈ లయగ్రాహి లక్షణ పాదమును ప్రామాణికముగ గ్రహింపలేము.

దేశీయ ఛందములలో మాత్రలు ప్రధానముగా జేసికొని గణ రచన సాగును. మాత్రలుగ లెక్కపెట్టగలిగినప్పటికిని, అక్షర ప్రధా నములే గాని మాత్రా ప్రధానములుగావు అక్షర గణములు.

పింగళముని యొసగిన దండకి చ్ఛందమునకు హలాయుధుని వృత్తి యీ విధముగ నున్నది. 'యత్ర పాదే ద్వౌ నగణౌ రగణా శ్చ సప్త భవన్తి దండకో నామసః, ఉత్కృతే షడ్వింశత్యక్షరాయాః సమనంతరం దండకస్య పాదాత్సప్త వింశత్యక్షరమేవ యుక్తమ్. సర్వేషాం ఛందసా మైకైకాక్షర వృద్ధ్యా ప్రవృత్తేః ఇత ఊర్ధ్వం పునరేకైక రేఫ వృద్ధ్యా ప్రస్తారః దండకో నారః ఇతి శ్రవణాత్.' అని చండవృష్టి ప్రపాత దండక లక్షణము తెలిపిన తరువాత 'శేషః ప్రచిత ఇతి' అను పింగళుని సూత్రము నందలి ప్రచితక సంజ్ఞకు 'ఇతి చండవృష్టి ప్రయాతాదూర్ధ్వం దండక ప్రస్తారః ప్రచిత ఇతి సంజ్ఞా లభతే. పూర్వ మేకైకాక్షర క్రమేణ ఛందసాం వృద్ధిరుక్తా ఇదానీంతు రేఫోపలక్షితాక్షర త్రయేణ వృద్ధిః' అని హలాయుధుడు వృత్తి నొసగియుండెను. కావున నిది అక్షర చ్ఛందమునకు సంబంధించి నదై మూడేసి అక్షరముల చొప్పున నొక్కొక్క గణము నభివృద్ధి చెందుననని స్పష్టముగా తెలియుచున్నది.

అందునను ముప్పది తొమ్మిది మాత్రలు గలిగిన లయగ్రాహిని మాత్రాగణనము చేసినను, లయ విభాతి, లయహారియును గూడ ముప్పది తొమ్మిది మాత్రలు కలిగినవై క్రమముగ 30, 34, 37 అక్షరములు కలిగియుండును. అంతియేగాని యీ వివరణము దండక మునకు మాత్రముగాదు. పై వాటికి అక్షర సంఖ్యలో భేదము కలదు గాని, మాత్రా సంఖ్యయందు భేదము లేదు. లయను గ్రాహ్యముగా జేసికొని చెప్పెనన వచ్చును. "లయగ్రాహి, లయ విభాతి, లయ హారులు మూడును మాత్రా సమక వృత్తము లననొప్పును పై అక్షర సంఖ్యలో భేదము కలదుగాని, మాత్రా సంఖ్యలో భేదము లేదు. అన్నిటికిని ముప్పది తొమ్మిది మాత్రలే. గాన పై మూటి నడక లయ సమానము. లయశబ్దపూర్వక మగుటకిదే కారణ మేమో."[21] అను దొరసామిశర్మగారి అభిప్రాయమే గమనింపతగినది.

ఇకనీ దండకములు అనగా సంస్కృత లక్షణోక్త రగణ దండకమును, తెలుగున గల తగణ దండకమును మాత్రా విభజన చేసిన, రెండును పంచ మాత్రా గణములుగనే కనిపించును. తెలుగు దండకము మాత్రా నియత మనిన, సంస్కృత రగణ దండకము మాత్రా నియతముగనే గ్రహించి రగణమును కూర్చిరనుట చెప్పనొప్పును, గాని చెల్లదు. కావున తెలుగు దండకము మాత్రా నియతముగ గానవచ్చునేగాని, మాత్రా నియమమునకు చెందినదిగాదు. ఇదే ఉద్దేశ్యముతో కిట్టెల్ పండితుడు తెలుగు దండకములు మాత్రా గణములుగ కనిపించునని తెలిపియుండును. ఖచ్చితమైన అభిప్రాయమును వ్యక్తీకరించ లేదు.

"కన్నడనాగవర్మ తన ఛందోంబుధియందు ద్రావిడ ఛ్ఛంద స్సులను తెలుపు సందర్భమున నొక దండక భేదమును పేర్కొని యుండెను. అది అజగణము (జగణము కానిది) లతో కూడినదై,

ఉత్సాహమను పేరున పిలువబడునని తెలిపి యుండెను."[22] దీనికిగూడ గురువుతో అంతమగుట కలదు. ఛందోంబుధిని ప్రకటించిన కిట్టెల్ పండితుడు ఈ దండక లక్షణమును దృష్టియందిడుకొని, తెలుగు దండక తత్త్వమునుగూడ తెలిపియుండును. కాని కన్నడ సాహిత్యమునను దండకము సంస్కృతము నుండి వచ్చినదే. నాగవర్మ ఛందోంబుధిలో ద్వితీయాధికరణమున పింగళాదుల దండక చ్ఛందమునే పేర్కొనియు, తదుపరి పంచమాధికరణమున నీ దండక భేదమును తెలిపియుండెను. (చూ॥ ద్వి॥ అ॥)

దండకము ఇరువదియేడు అక్షరములతోనేగాక, అక్షరస్వరూప విస్తృతి యందనియతమై యుండుటచే మాత్రా గణమునకు వీలులేదు. అందునను కవి తన భావావేశమును ఉపసంహరింపవలెనే గాని, మాత్రా గణ ప్రధానముగ రచించి రనుట యసమంజసము. ఇది మాత్రా గణములకు సంబంధించినది గాదని ఛందోమంజరికారుని 'అనఙ్గశేఖర, అశోకపుష్పమంజరి' అను నామములుగల దండక లక్షణములే ప్రబల ప్రమాణములు. కావున దండకము అక్షరగణ సంబంధి గాని, మాత్రా సంబంధి గాదు.

సంస్కృత చ్ఛందోజాతము లయిన చంపకమాలాదులను ప్రాసలు నెలకొనినంత మాత్రమున దేశిగ పరిగణింపలేము. అట్లే దండకము తగణముగ మారినంతమాత్రమున దేశి యనుట కుదరదు. వృత్తరత్నాకరకారుడు కేదారభట్టు 'సద్వయా తత్పరతః తకారే ణాపి క్వచిద్దండకా దృశ్యన్తే' అని తగణ దండక లక్షణమునుకూడా తెలిపియుండెను. అంతియేగాక 'హేమచంద్రుడు' తన 'ఛందోనుశాసనము'న 'కామబాణ'మని పిలువబడు దండక లక్షణము నొకదానిని తెలిపి యుండెను. అనియత సంఖ్యాకమైన తగణములపై రెండు గురు

వులతో అంతమగుట దీని లక్షణము. తెలుగున తగణ దండకము ఒకే గురువును అంతమున కలిగియుండును.

కీ॥ శే॥ నిడదవోలు వెంకటరావుగారు చెప్పినది స్థూల నిర్వచనమే గాని, సూక్ష్మపరిశీలనము గాదు. నన్నయ సంస్కృత లక్షణానుసారమే దండకమును రచించి యుండెను. నన్నయయేగాదు తెలుగు సాహిత్యమున దండక రచన గావించిన కవులందరును. సంస్కృతమునందు వలె తెలుగునను ప్రాసగాని, యతిగాని కానరావు. తెలుగునను ఇతర సోదర ద్రావిడ భాషలయిన తమిళ, కన్నడములందు యతి, ప్రాస నియమము లుండుటవలన, తెలుగు దండకము సంస్కృత లక్షణ లక్షితమేగాని వేరుగాదు.

నన్నయగారు మార్పు నూహించినది దండకాదిని నగణ ద్వయమును వీడుట. కావ్యాదిని గాని, స్తుతిపరమగు భావమును వెల్లడించు పట్టున గాని, శ్రీకారోపక్రమణము తెలుగు సాహిత్య సంప్రదాయము. నగణ ద్వయము వీడని యెడల శ్రీకారోపక్రమణమునకు అవకాశము లేదు. అందువలననే నన్నయ నగణ ద్వయమును వీడి యుండవచ్చును. అంతమాత్రమున నది దేశి యనుట యుచితముగాదు. దశరథేత్యాది సర్వలఘు శబ్దములు ప్రవేశించవలెననిన నగణ ద్వయము యుండవలెను. సంస్కృత కవులు సర్వ లఘు నామమును పొందుపరచుటకే నగణ ద్వయమును దండకాదిని ప్రవేశపెట్టి యుందురు.

"నన్నయగారు తమకు తోచినట్లుగా సంస్కృతము నుండి వృత్తములను దిగుమతి చేయలేదు. దేశ పరివ్యాప్తములు, సన్నిహిత దేశభాషా ప్రచురములు మాత్రమే స్వీకరించినారు. ఈ వృత్తములను సంస్కృతము నుండి తెలుగులోనికి తెచ్చుటకు సంస్కృతభాషా

భిమానము కారణము గాదు. అట్లయినచో సంస్కృతమున ప్రచుర ములయిన వృత్తముల నన్నిటిని తెచ్చుట జరిగెడిది. దేశీయములగు వానికి దగ్గరగానున్న వృత్తములనే తెచ్చి దేశీయతా ముద్రనువేసి తెలుగు తనమును నిలిపినారనీ చెప్పవలసి యున్నది. చంపకోత్పల శార్దూల మత్తేభములు, దండకముకూడ పోగా నన్నయ వాడిన విశేష వృత్తములు పదునెన్మిది. నన్నయగారు సంస్కృతమునుండి వీనినే ఎందుకు స్వీకరించిరి? అన్నది విచారణీయమైన విషయము. ఇవన్నియు దేశీయములయిన ఛందస్సులకు దగ్గరగా నుండుట చేతనే స్వీకరించి నారు."[28] అను (శ్రీ) కోవెల సంపత్కుమారాచార్యగారి అభిప్రాయము దండకము దేశి సంబంధి గాదను నా అభిప్రాయమునకు ఉపబలకము కాగలదు.

'భవభూతి' తన 'మాలతీ మాధవము'న తాండవనృత్య పర ముగ దండకమును రచించి, తాలబద్ధమైనదిగ నభివర్ణించెను. కావున నీదండకము దేశి కాదుగదా, ఆర్య సంప్రదాయమునకు చెందిన గీత విశేషముగ కూడ తలప వీలగుచున్నది.

దేశికవితలను పరికించునట్టున రెండు విధములుగ పరిశీలింప వలెను. ఒకటి : గ్రామీణుల జీవితములనుండి జానపద వాఙ్మయ రూపమున వెలసినవి. ఉదాహరణకు సువ్వాల పదములు, వెన్నెల పదములు మొదలగునవి. రెండు : పండిత కవులు తమంతట తాము వెలయించినవి. ఉదాహరణకు ఉదాహరణ కావ్యములు మొద లగునవి.

దండకములు గ్రామీణ జనవ్యవహారము నుండి జనించినవా? లేక పండిత కవులు వెలయించినవా? అను సంశమున, దండకములు దీర్ఘ సమాసము లగుటచేసి గ్రామీణ జనవ్యవహారమున జనించినవి

గావని చెప్పవచ్చును. దేవాలయమున గన్పించువారందరును భక్తులు గారను నటులు, జన వ్యవహారమున ప్రబల ప్రచారములో నున్నంత మాత్రమున దేశి యనజెల్లదు. దేశి చ్ఛందస్సులు చిన్న చిన్న పాదములతో సృష్టింపబడినవే గాని, పెద్ద పెద్ద పాదములతో సృష్టింపబడినవి గావు. అందునను దండకము పొరలు పొరలుగ పెరిగెడి రచన గాదు. సమాసభూయిష్ఠమైన నడక కలిగినది. ఇతివృత్త మేమియును లేక కేవల స్తోత్రప్రాయములుగ నుండు దీర్ఘ రచనలు గ్రామీణులు చేసిరనుట అస్వాభావికము. అందునను పాద నియతి లేదు. ఎంతటి దీర్ఘముగనైనను కొనసాగించ వచ్చును. కావున తెలుగున దండకము మార్గ సంబంధి ప్రక్రియ యనుటలో విభేదము లేదు.

—0—

## అథ సూచికలు

1. సంగీత రత్నాకరము. శార్ఙ్గదేవుడు. పుట. 246
2. వృత్తలక్షణ విభాగము. పు. 305, 306
3. ఆంధ్ర శబ్దరత్నాకరము. సం. 2
4. శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రి. పు. 32
5. **A grammar of the Telugu language Page. 319**
6. పు. 467

7. దండకంనామ విజ్ఞేయ ముత్కృతే రధికాక్షరమ్
మేఘ మాలాదికం తస్యానోక్తా గుహాత్రికాః
(నాట్యశాస్త్రము, పదిహేనవ అధ్యాయము. వృత్తలక్షణ విభాగము, శ్లో. సం. 154)

8. పోతన. పుట. 51
9. (శ్రీ) శివరామకృష్ణ దండకము. పీఠిక.
10. రాళ్ళపల్లి పీఠికలు, పు. 142
11. ద్విపద-రగడ-దండకము. భారతి. జూన్, 1942
12. ద్విపద-రగడ-దండకము. భారతి. జూన్, 142
13. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం. దండకములు. పు. 301
14. ఆంధ్ర సాహిత్య చరిత్ర. పు. 119
15. తెలుగుభాషలో ఛందోరీతులు. దండకము. పు. 140
16. దండక వాఙ్మయము. (శ్రీ) రావూరి దొరసామిశర్మ. ఆంధ్ర పత్రిక. హేమలంబ సంవత్సరాది సంచిక. పు. 135

17. ... ... ... ...
18. ... ... ... ...
19. ... ... ... పు. 136
20. ఉదాహరణ వాఙ్మయ చరిత్ర. (శ్రీ) నిడదవోలు వెంకటరావు. అవతారిక. పు. 1
21, తెలుగుభాషలో ఛందోరీతులు. దండకము. పు. 131
22. కన్నడ నాగవర్మ ఛందోంబుధి. పంచమాధికరణము. ప.సం.351
23. తెలుగు ఛందోవికాసము. పు. 61

# 2

# దండకము - లక్షణములు

## 2-1 సంస్కృతము :

పింగళ విరచిత చ్ఛందశ్శాస్త్రము ప్రాచీనము. సుప్రసిద్ధము. భరతమునియును, నాట్యశాస్త్రము-పదునాలుగవ అధ్యాయమున కొంతవరకు ఛందస్సును గూర్చి వివరించి యుండెను. ఇందు ఏది ప్రాచీనమను విషయమున భేదాభిప్రాయము లున్నవి. "కీత్ పండితుడు పింగళముని ఛందశ్శాస్త్రము ప్రాచీనమైనదను అభిప్రాయమును వ్యక్తీకరించి యుండెను."[1] వివిధ ప్రతులు పరిశీలించిన 'డా. పి.యస్.ఆర్. అప్పారావుగారు', 'చండవృష్టిప్రయాత' నామమున పిలువబడు దండకవృత్త లక్ష్యము నొకదానిని తమ నాట్యశాస్త్రానువాదమునందు పేర్కొనుచూ, భరతముని పేర్కొనిన దండక లక్షణములను ప్రక్షిప్తములుగ తలచియుండిరి.[2]

కొన్ని నాట్యశాస్త్ర ప్రతులను బట్టి భరతముని కూడ దండకమునకు లక్షణము నొసగి యుండెనని భావించవచ్చును.[3] ఇదుపరి ఎందరో లాక్షణికులు దండక చ్ఛందమును గూర్చి లక్షణీకరించి యుండుటయేగాక, ఎన్నియో నధిక భేదములను కూడ తెలిపియుండిరి. అట్టివారిలో ఛందోనుశాసన కర్తలు, వృత్తరత్నాకరకారుడు, ఛందోమంజరికారుడు మొదలగువారు ముఖ్యులు. వీరి లక్షణములనే తెలుగు ఛందఃకర్తలు అనుకరించి యుండుటయేగాక, తెలుగు దండక రచనా స్వాతంత్ర్యము వలన మరికొన్ని ప్రత్యేక లక్షణములను తెలిపి యుండిరి.

## 2-1-1 పింగళుడు - ఛందోవిచితి :

పింగళముని తన ఛందోవిచితి యందు దండక చ్ఛందమును స్వీకరించగా, హలాయుధుడు దానికి వృత్తి నొసగి యుండెను.[4]

సూ. దండకో నౌరః : (7-33)

హలాయుధ వృత్తి : యత్ర పాదే ద్వౌ నగణౌ రగణాశ్చ సప్త భవంతి దండకో నామసః ఉత్కృతే షడ్వింశత్యక్షరాయాః సమనంతరం దండకస్య పాదాత్సప్త వింశత్యక్షర మేవ యుక్తమ్. సర్వేషాం ఛందసాం ఏకాక్షర వృద్ధ్యా ప్రవృత్తేః ఇత ఊర్ధ్వం పునర్నైక రేఫ వృద్ధ్యా ప్రస్తారః ఇతి శ్రవణాత్.

సూ. ప్రథమ శ్చండవృష్టిప్రయాతః (7-34)

హలాయుధ వృత్తి : యది సప్తవింశత్యక్షర పాదః ప్రథమో దండకః చండవృష్టి ప్రయాతో నామ.

సూ. అన్యత్ర రాత మాండవ్యాభ్యామ్. (7-35)

హలాయుధ వృత్తి : రాత మాండవ్యాభ్యా మన్యత్ర అస్య అభిధాన మేతదేవ తాభ్యాం పునరన్యైవ సంజ్ఞాం కృతస్య వృత్తస్య రాత మాండవ్య గ్రహణం పూజార్థమ్.

సూ. శేషః ప్రచిత ఇతి. (7-36)

హలాయుధ వృత్తి : ఇతి చండవృష్టిప్రయాతా దూర్ధ్వం దండక ప్రస్తారః ప్రచిత ఇతి సంజ్ఞా లభతే. పూర్వ మేకైకాక్షర ఛందసాం వృద్ధిరుక్తో ఇదానీంతు రేఫోపలక్షితాక్షర త్రయేణ వృద్ధిః

నగణ ద్వయముపై రగణ సమూహాము కలిగి ఇరువదియేడు అక్షరములు కలిగిన పాదము దండకము అగుచున్నది. దీనినే చండ వృష్టిప్రయాత మను నామమున పిలచెదరు. తదుపరి మూడేసి అక్షర

ముల కొక గణము చొప్పున హెచ్చించిన కొలది యేర్పడు దండక ములకు పింగళుడు ప్రచితక సంజ్ఞను వాడియుండెను.

ఇదియే ప్రథమ దండక లక్షణము. ఇంకను సుప్రసిద్ధ లాక్షణికు లెందరో నీదండకలక్షణము నాధారముగ గొని విస్తృతమైన భేదము లను వక్కాణించి యుండిరి.

## 2-1-2 అగ్నిపురాణము :

అగ్నిపురాణమున ధండకమునకు లక్షణము తెలుపబడినది.[5]

"సప్తరో దండదః స్యాశ్చండవృష్టి ప్రథాతకమ్॥
(శ్లో, సం. 29)
రేఫ వృద్ధ్యేయ ననవాస్యు ర్వ్యాల జీమూత ముఖ్యకాః।
శేషవై ప్రచితా జ్ఞేయా గాథా ప్రస్తారః ఉచ్యతే"
(శ్లో. సం. 30)

ఇత్యాది మహాపురాణే ఆగ్నేయే సమవృత్త వర్ణనం నామ చతుస్త్రింశ దధిక త్రిశతమో ధ్యాయః" అని సమవృత్తము లంత మయినవి.

ఇందు దండకమునకు లక్షణము చెప్పబడినను పింగళుని దాని కంటెను ప్రాచీనము గాదు. వృత్త లక్షణములు తెలుపునపుడు పింగళుని నామము ఉటంకింపబడినది.[6]

## 2-1-3 ఛందోనుశాసనము – జయకీర్తి, హేమచంద్రుడు :

ఛందోనుశాసన కర్తలు జయకీర్తి (క్రీ.శ. 1000), హేమ చంద్రుడు (క్రీ.శ. 1088) ఇరువురును 'గద్య దండక' మనునొక దండక భేదముతోపాటు, మరియొక దండక భేదమును కూడా తెలిపియుండిరి.[7]

"దండకా శ్చండవృష్ట్యాద్యాః పాదాంశ నియమోదితాః
ఆపాద నియమోశ్శోక్తాః గణాథా గద్య దండకాః" జయకీర్తి

"దండకా వృత్త శబ్దాధికాః వృత్తవత్తేహి; పాదోక్త లక్ష్మేతరాః దండకాః యేతుతే గద్యపూర్వాశ్చ మాలాదికాః తేఽథవానేకధా. (జయకీర్తి.)

"తాః గా కామబాణః" (హేమచంద్రుడు)

హేమచంద్రుడు చెప్పిన కామబాణ మను పేరుగల దండక లక్షణమును ఎవరును తెలిపినది గాదు. తెలుగు దండక లక్ష్యముల కత్యంత సన్నిహితమైన లక్షణమిది.

## 2-1-4 కేదారభట్టు - వృత్తరత్నాకరము :

కేదారభట్టు తన వృత్తరత్నాకరమున దండక చ్ఛందమును గూర్చి యీ క్రింది విధముగ లక్షణీకరించి యుండెను.

"అరభ్యైకాక్షరాత్ పదాదేకైకాక్షర వర్ధితైః పృథక్ ఛందో భవేత్పద్యైర్యావత్ షడ్వింశతి గతమ్" 3-17

"తదూర్ధ్వం చండవృష్ట్యాది దండకాఃపరి కీర్తితాః

శేషాం గాథా స్త్రిభిః షడ్భిశ్చరణోప లక్షితాః" 3-18

అని తెలుపుచూ 'సమవృత్త ప్రసంగేన సమవృత్త రూపానాహ' అని. దండకమునకు ఈ క్రింది విధముగ లక్షణముల నొసగియుండెను.

"యదిహ నయుగలం తతః సరేఫా స్తదా చండవృష్టి ప్రపాతో భవేద్దండకః

ప్రతిచరణ వివృద్ధ రేఫాస్యు రర్ణోర్ణవ వ్యాళ జీమూత లీలాకరోద్దామ శంఖాదయః

ఏకోన సహస్రాక్షర పర్యన్తా దండకాత్ యః ప్రోక్తాః

వర్ణ త్రికగణ వృద్ధయా నద్వితీయాద్యా మహా మతిభిః

ప్రచితక మభిధో ధీరధీభిః స్మృతో దండకో నద్వయా స ప్తభిర్యైః

నద్వయూ దు త్తరై త్పరతః తకారేణాపి క్వచిద్దండకా దృశ్యన్తే.

ఏవ మేకోన సహస్రాక్షర వృద్ధిర్భవతి దండకమ్.

2-1-5 గంగాదాసు – ఛందోమంజరి : (క్రీ. శ. 1612)

గంగాదాసు తన ఛందోమంజరి అను సంస్కృత లక్షణ గ్రంథమునందు దండకమునకు మరికొన్ని విశేష లక్షణములను పేర్కొని యుండెను.

"ప్రచితక మభిధో ధీరధీభిః స్మృతో దండకో నద్వయా దుత్తరై స్సప్తభిర్రైః

సగణైః సకలైః ఖలు యత్ర భవేత్తమిహ ప్రవదంతి బుధాః కుసుమస్తబకః

యత్ర రేఫః పరం స్వేచ్ఛయా గుమ్ఫితః స్మృతో దండకో మత్తమాతఙ్గ లీలాకరః

లఘు గ్గురు నిజేచ్ఛయా యదా నివేశ్యతే తదైష దండకో భవత్యనఙ్గ శేఖరః

యత్ర దృశ్యతే గురోః పరో లఘు క్రమాత్ స ఉచ్యతే బుధై రశోక పుష్పమంజరీతి.

అత్రైతే దండకాః పుస్తకాన్త రేష్వధికా దృశ్యంతే—

యకారై కవీచ్ఛానురోధా న్నిబద్ధైః ప్రసిద్ధో విశుద్ధో పరో దండకః సింహవిక్రాంత నామా.

స్వేచ్ఛయా రజౌ క్రమేణ సన్నివేశయత్యుదారధీః కవిః స దండకః స్మృతో జగత్యశోక మంజరీ.

యత్ర రేఫాన్ కవిః స్వేచ్ఛయా పాద సౌకర్య సాపేక్షయారోప యత్యేష ధీరైః స్మృతో దండకో మత్తమాతఙ్గ లీలాకరః"

పై లక్షణముల కొన్నిటిని పునరావృతము జేసి యింకను మరి కొంత వివరణముగ నిచ్చియుండెను.

## 2-1-6 రాధాకాంత బహదూర్ – శబ్ద కల్ప ద్రుమము :

శబ్దకల్పద్రుమ కర్త సింహ విక్రాన్త నామమున నొక దండక భేదమును తెలిపి, ఛందోమంజరి కర్త కంటె విభేదించిన చందము నుటంకించి యుండెను.[10]

'నయుగలం గురు యుగేదేవం యకారాః కవీచ్ఛానురోధా త్తదాయతః వక్ష్యన్త ఏషా పరో దండకః పండితై రీరితః' అని లక్షణము.

నగణద్వయము తరుపరి రెండు గురువులు, అటుపిమ్మట ఇచ్ఛ వచ్చినన్ని యగణములు పొందుపరచి రచించెడి దండకము సింహ విక్రాన్త నామమున పిలువబడునని తెలియుచున్నది. కాని పొత్త ములో నుదాహరించిన గురు లఘువులు వివరణము ఈతని లక్షణ ముతో విభేదించుచున్నది.

మొత్తముమీద పైన పేర్కొనబడిన లక్షణకర్తల లక్షణముల ననుసరించి, పింగళముని నుడివిన దండక లక్షణము శిరసావహింప దగినది. నగణద్వయముపై ఏడు రగణములతో నేర్పడు దండకము చండవృష్టిప్రయాత మని లాక్షణికు లందరును అంగీకరించి యుండిరి. తదుపరి లక్షణ కర్తలు కొందరు పింగళుని దండక లక్షణము కంటెను అధిక భేదముల నుటంకించి యుండిరి.

వృత్తరత్నాకర కర్త రెండు నగణముల తదుపరి ఏడు తగణ ములు నిలుపుట క్వాచిత్కముగ కలదని తగణ దండక భేదమును చెప్పియుండెను. వృత్తరత్నాకరుని కంటె పూర్వుడయిన హేమ చంద్రుడు, నగణ ద్వయమును వీడి సంపూర్ణముగ తగణములనే వినియోగించి 'గగ'లతో నంతముచేయు కామబాణ మనెడి తగణ దండక భేదమును పేర్కొని యుండెను.

గంగాదాసు తన ఛందోమంజరి యందు సకల గణములు సగణముతో రచింపబడిన దండక భేదమును 'కుసుమస్తబక' మను నామమున పిలువబడుననియు, అట్లే మొత్తము గణములన్నియు రగణములతోనే రచించిన దండక భేదము "మత్తమాతఙ్గ లీలాకర" మను నామమున పిలువబడుననియు తెలిపియుండెను.

ఇతడే మరిరెండు భేదములను పేర్కొనియుండెను. ఒక లఘువు ఒక గురువు చొప్పున కూర్చిన దండక భేదమును 'అనఙ్గశేఖర' నామముననను, అట్లే ఒక గురువు—ఒక లఘువు చొప్పున కూర్చిన దండక భేదమును 'అశోక పుష్పమంజరి' నామముననను పిలువబడునని చెప్పియుండెను.

ఈ భేదము లన్నియును పింగళముని తెలిపిన 'ప్రచితక సంజ్ఞ' యందు అంతర్గతములుగ గ్రహింపవచ్చునుగాని, పింగళుని కంటె వృత్త రత్నాకర, ఛందోమంజరులందు గణ భేదములు కనిపించుట జేతప్రచితక సంజ్ఞచే గ్రహించుటకు వీలుగాదు. పింగళుడు ఒక్క రగణమునే దండక వృత్తమునకు వినియోగించుట గమనింపదగినది.

గంగాదాసు తన ఛందోమంజరి యందు కవీచ్ఛానుసారముగ ఘటింపబడి యగణముంతో కూడిన దండకము 'సింహవిక్రాన్త' నామమున పిలువబడునని తెలిపెను. శబ్దకల్పద్రుమకర్త 'సింహవిక్రాన్త' నామమున పిలువబడు దండకమును గూడ నగణద్వయ సహితముగ యగణ ఘటితమై యుండునని విభేదించి యుండెను. యగణము లెన్ని ఉపయోగించవలెనను విషయమున విభేదము లేదు. నగణద్వయ విషయమున భేదాభిప్రాయము కలదు. ఇదియేగాక శబ్ద కల్పద్రుమకర్త నగణద్వయము తదుపరి రెండు గురువులు కూడ నుండునని తెలిపెను. గురు లఘువుల నుదాహరించుపట్టున, ఏడు లఘువుల నుదాహరించిన పిమ్మట రెండు గురువులు, పన్నెండు రగణములు

నిలుపబడి యున్నవి. అతని లక్షణమునకును, గురు లఘువుల వివరణ మునకును భేదమున్నది. ఇది ముద్రాపకుల దోషము గావచ్చును. రెండు నగణముల తదుపరి రెండు గురువులు నుండవలెను. అట్లుగాక ఒక లఘువు అధికముగా నున్నది. నగణద్వయము తదుపరి ఏడవ అక్షరమగు లఘువును మీాది రెండు గురువులను కలిపిన యగణము, రగణములు ఏర్పడుచున్నవి. కావున సింహవిక్రాన్త లక్షణభేదమున ఛందోమంజరికారుని లక్షణమే గ్రహింపదగియున్నది.

ఒక రగణము, ఒక జగణము చొప్పున కొనసాగిన గణ ప్రస్తారమున నొక దండక భేదము కలదు. దీనిని పేర్కొనినవాడు గంగాదాసు. అనగా పింగళ, కేదారభట్టుల కంటె గంగాదాసు ఆరు భేదములను అధికముగా వక్కాణించినట్లు తెలియును.

గణప్రస్తారమున మూడేసి అక్షరములకొక గణము చొప్పున లెక్కించవలసి యుండగా, గంగాదాసు 'అనఙ్గశేఖర, అశోక పుష్ప మంజరి' భేదములకు, రెండేసి అక్షరముల చొప్పున వివరణ నిచ్చి యుండెను. ఈతడు ఒక లఘువు – ఒక గురువు, ఒక గురువు – ఒక లఘువు అని లక్షణీకరించి నప్పటికినీ రెండునూ, ఒకటి జగణ–రగణము లకు, మరియొకటి రగణ–జగణములకు చెందినవై విపరీతముగ నున్నవి. కావున నీతడు తెలిపిన "అశోకపుష్పమంజరి–జగత్యశోకమంజరి" యను రెండు భేదములును ఒకటియే యగుచున్నవి.

వీరికంటె 'హేమచంద్రుని' కామబాణ మను తగణ దండక లక్షణము ప్రత్యేకమైనది.

ఇంతదనుక దండక పాదము ఒక్క అక్షరము తక్కువగ తొమ్మిది వందల తొంబది తొమ్మిది అక్షరముల వరకు కొనసాగించ వచ్చు ననెడి నియమము లాక్షణికు లందరును అంగీకరించి యుండిరి.

ఛందోఽనుశాసనకర్త పాద, గణ నియమ రహితములుగ నున్నటువంటివానిని గద్య దండకములుగ విభజించి యుండెను.

ఇట్లు పైన తెలుపబడిన లక్షణ కర్తల భేదము లన్నియును క్రింది విధముగ పట్టిక రూపమున నీయబడినవి.

పింగళుడు :-

I 1. చండవృష్టి ప్రయాతము 2 నగణములు 7 రగణములు. ఇతడు ఈ ఒక్క భేదమునే తెలిపి తక్కిన భేదములకు ప్రచితక సంజ్ఞను వాడియుండెను. కేదారభట్టు పింగళుని ప్రచితక సంజ్ఞను ఆధారముగ గొని ఒక్కొక్క గణము హెచ్చిన కొలదీ దండకములు వేరువేరు నామమున పిలువబడునని యీ క్రింది విధముగ తెలిపియుండెను.

| | | | |
|---|---|---|---|
| 2. | అర్ణ | 2 నగణములు | 8 రగణములు |
| 3. | అర్ణవ | ,, ,, | 9 ,, |
| 4. | వ్యాళ | ,, ,, | 10 ,, |
| 5. | జీమూత | ,, ,, | 11 ,, |
| 6. | లీలాకర | ,, ,, | 12 ,, |
| 7. | ఉద్దామ | ,, ,, | 13 ,, |
| 8. | శంఖ | ,, ,, | 14 ,, |

పింగళుని చండవృష్టిప్రయాత నామముతో కలిపి ఎనిమిది భేదములను తెలిపి, "శంఖాదయః" అని ఆది శబ్దముచేత మరికొన్ని భేదములున్నట్లు తెలిపి యుండెను. "తక్కిన భేదముల నామములు కొన్ని తర్కవాచస్పత్యమున తెలుపబడినవి."[11] వాచస్పత్యమున పేర్కొనబడిన దండక భేద

నామములీ క్రింది విధముగ నున్నవి. ఇవియన్నియును పింగళుని ప్రచితక సంజ్ఞ యందంతర్గతములే.

| | | | |
|---|---|---|---|
| 9. | ఆరామ | 2 నగణములు | 15 రగణములు |
| 10. | సంగ్రామ | ,, ,, | 16 ,, |
| 11. | సురామ | ,, ,, | 17 ,, |
| 12. | వైకుంఠ | ,, ,, | 18 ,, |
| 13. | సార | ,, ,, | 19 ,, |
| 14. | కాసార | ,, ,, | 20 ,, |
| 15. | విసార | ,, ,, | 21 ,, |
| 16. | సంహార | ,, ,, | 22 ,, |
| 17. | నీహార | ,, ,, | 23 ,, |
| 18. | మందార | ,, ,, | 24 ,, |
| 19. | కేదార | ,, ,, | 25 ,, |
| 20. | ఆసార | ,, ,, | 26 ,, |
| 21. | సత్కార | ,, ,, | 27 ,, |
| 22. | సంస్కార | ,, ,, | 28 ,, |
| 23. | మాకంద | ,, ,, | 29 ,, |
| 24. | గోవింద | ,, ,, | 30 ,, |
| 25. | సానంద | ,, ,, | 31 ,, |
| 26. | సందోహ | ,, ,, | 32 ,, |
| 27. | ఆనంద | ,, ,, | 33 ,, |

అని ఇరువదియేడు నామముల వరకు తెలుపబడినవి. ఇట్లు గణములు హెచ్చిన కొలదీ మరికొన్ని నామములు కలిగి యుండవలెను. ఇట్లు పేర్కొనబడిన వానికన్నిటికిని రగణమే

ఉపయుక్తమైనది. ఛందోమంజరికారుడు పేర్కొనిన 'మత్తమాతఙ్గ లీలాకర' మను దండక భేదము ప్రచితక సంజ్ఞ యందంతర్గతము కాజాలదు. ఇది నగణ ద్వయమును విడిచిన రగణ దండకము.

ఇట్లు పై ఇరువదియేడు భేదములను గణముల విస్తృతి, వేరువేరు నామములను ఆధారముగ జేసికొనినట్టివేగాని, గణములు విభేదించి చెప్పినట్టివిగావు. కావున ఇవియన్ని యును ఒక దండక భేదమునకు సంబంధించినవే.

కే దా ర భ ట్టు :-

II 2 నగణములు తగణములు

పింగళుని ప్రచితక సంజ్ఞలో ఏడు భేదముల నామములు చెప్పటయేగాక. ఈపై దండక భేదమును గూడ తెలిపి యుండెను. దీనికొక నామమును గాని, తగణ సంఖ్యయందు పరిమితినిగాని వక్కాణింపలేదు.

గ ం గా దా సు :-

III ప్రచికత సమభిధ 2 నగణములు 7 యగణములు

IV కుసుమ స్తబకము అన్నియు సగణములే

దీనికి సగణముల సంఖ్యతో నిమిత్తము లేదు. తొమ్మిది గణములకు తక్కువ గాకుండ నుండవలెను.

V మత్తమాతఙ్గ లీలాకరము అన్నియు రగణములే

దీనికిని రగణముల సంఖ్యతో నిమిత్తము లేదు. తొమ్మిది గణములకు తక్కువ గాకుండ నుండవలెను.

VI అనఙ్గ శేఖరము ఒక లఘువు - ఒక గురువు చొప్పున దీని. ఇరువదియేడు అక్షరములకు తక్కువగాకుండ యుండుటనియమము

VII అశోకపుష్పమంజరి ఒక రగణము -
లేదా ఒక జగణము
జగత్యశోకమంజరి వొప్పున

ఈ భేదమునకును తొమ్మిది గణములకు తక్కువ గాకుండ నుండుట నియమము.

VIII సింహవిక్రాన్తము అన్నియు యగణములే

ఈ భేదమునకును తొమ్మిది గణములకు తక్కువ గాకుండుట నియమము.

హేమచంద్రుడు :-

IX కామబాణము అన్నియు తగణములే గగలతో నంతమగును.

దీనికిని తొమ్మిది గణములకు తక్కువగాకుండ నుండవలెను.

జ య కీ ర్తి :-

X గద్య దండకము

పాదాక్షర నియమ విరహితమగు గణములతో చెప్పబడు దండకము లన్నియును ఈ కోవకు చెందును.

పై పట్టికయందు వివరించిన విధముగ పది దండక భేదములను వక్కాణించి యుండిరి. ఇందు గణముల సంఖ్యయందు మార్పు ననుసరించియు, గణముల మార్పు ననుసరించియు లక్షణములు పేర్కొనబడి యున్నవి.

ఇంతవరకు సంస్కృత లాక్షణికులు రగణ, యగణ, సగణ, జగణ, తగణములను దండకరచన కుపయుక్తమైనవిగ గుర్తించి యుండిరి. అనగ ఐదు గణములు దండకరచన కుపకరించినవి. వీని యందు మాత్రలు లెక్కించిన రెండు పంచమాత్రా గణములును,

రెండు చతుర్మాత్రా గణములు నై యున్నవి. అట్లని మాత్రలు లెక్కించుటకు వీలుకాదు. అటువంటి నియమ మెచ్చటను గానరాదు. ఇవి యన్నియును అక్షర సంఖ్యాబద్ధములే.

జయకీర్తి నుడివిన గద్య దండకము పాదరహితమై, అసమానాక్షరగణములు కలది. ఇది యిట్లుండగ దండక పాదమును తొమ్మిది వందల తొంబది తొమ్మిది అక్షరముల వరకు కొనసాగింప వచ్చుననెడి నియమమునకు గల కారణము మృగ్యము. అంతకంటె ముందున కెందులకు కొనసాగకూడదో, ఈ నియమము నెందుల కేర్పరచిరో తెలియదు.

## 2–2. తెలుగు :–

తెలుగున గూడ సంస్కృత లాక్షణికు లుదాహరించిన దండక లక్షణములతోపాటు, తెలుగు లాక్షణికులు మరికొన్ని స్వతంత్రముగ చెప్పిన లక్షణములును గలవు. తెలుగు లాక్షణికుల లక్ష్యముల కొన్నిటి ననుసరించి, సంస్కృత లక్షణములను మార్పుజేసి చెప్పినటులు భావించనగును. సంస్కృతమున లక్ష్యములందు గాని, లక్షణములందు గాని ప్రాస, యతులజాడలు గానరావు. ఇట్లే లక్ష్య, లక్షణముల రెండిటను తెలుగు సంస్కృతానుసారి యనుట నిర్వివాదాంశము.

సంస్కృతమున దండకమునకు ఒక గణము నియతమైనట్లు గానరాదు. తెలుగున కూడ గణ భేద, మధికముగ కన్పించుటయే గాక, కొన్ని లక్షణములకు ప్రయోగములు విరళముగను, మరి కొన్నిటికి అతి విరళముగను, ఇంకొన్నిటికి శూన్యమని చెప్పవచ్చును.

తెలుగున లక్షణ గ్రంథములలో 'కవిజనాశ్రయము' ప్రప్రథమము. ఈతడు నుడివిన 'న, న, హ' గణము లాదిగ కలిగిన తగణ

దండక లక్షణము, సంస్కృత రగణ దండక లక్షణమునకు మార్పు నూహించెనని భావించ వీలగుచున్నది.

సంస్కృతము నందు వలె తెలుగునను లక్షణములకు కొదవ లేదు. తెలుగు నందలి లక్ష్యముల గూర్చి చెప్పవలవి గాదు.

2-2-1. భీమన - కవిజనాశ్రయము :— (క్రీ. శ. 13 శ.పూ.)

అమరగ నసహంబులం దాదిగ నొండె, కాదేనినాదిన్ దకారంబుగా నొండె, లోనన్దకారంబు లిమ్మైగ్ల గకారావసానమ్ముగా జెప్పినన్, దండకం బండ్రు దీనిం గవీంద్రుల్...... త్యాగవైరోచనా! కావ్యసంసూచనా![12]

2-2-2. విన్నకోట పెద్దన - కావ్యాలంకార చూడామణి :-
( క్రీ. శ. 15 శ. పూ. )

"కృతినాది నసహంబులొండెం దకారంబు లొండెం బ్రకల్పించి యామీద నెల్లన్ దకార ప్రధానంబు గుర్వంతమై క్రాల నిచ్ఛాను రూపావధిం బేర్మి నిర్మించుచో మించి దత్తద్గణావ్రాతముస్ వృత్త్యను ప్రాస ధుర్యంబులై యర్థవర్యంబులై మోదితార్యంబులై సాధు సారస్య హార్యంబులై రీత్యలంకారవంతంబులై పుష్టిమంతంబులై యింపు లంతంత కింపార గల్పింపగా దండకంబున్న మన్నండ లంబయ్యె—"[13]

2-2-3. అనంతుడు-ఛందోదర్పణము :— (క్రీ. శ. 15 శ. పూ.)

అనియతాక్షరంబైన దండకము-

"సిరినేలు రసికుండు శ్రీవత్స వక్షుండు నీరేరుహాక్షుండు నిత్యా సదక్షుండు త్రైలోక్య సంరక్షణోపాయ దక్షుండు మాపాలి

దేవుండు. ధీరుండు దారుండితండిచ్చు మాయిచ్చుకునవచ్చు సౌఖ్యమ్ము లంచు న్మదింగోరి పెద్దల్ సకారంబుతో సంగతంబై నహంబాది నొండెన్. దకారాదిగా నైన లోనెల్ల చోటన్ దకారంబులం బెల్లు చెందన్ గకారావసానంబులై దండకాకార మేపార గుర్తింతు రెల్లప్పుడున్"[14]

## 2-2-4. చిత్రకవి పెద్దన - లక్షణసార సంగ్రహము :-

(క్రీ. శ. 1550)

కం. "దండక విధములు పెక్కులు
దండిగ గలవవి చతుదష్వథ స్ఫురితములై
యుండెడి వనేక విధముల
నుండెడివిన్ వానివిను సమున్నత చరితా"[15] 2-60

అందు చండవృష్టి దండకము :-

"నగణ యుగము మీాదటం దేడు రేఫల్ దగన్ చండ వృష్ట్యాఖ్యతో దండకంబౌ హరీ." 2-61

అర్ణమను దండకము :-

"నయుగముపయి రాష్ట్రకంబైనచో వర్ణమన్ దండకం బొప్పనో యుంజనా కంజనేత్రాత్మజా" 2-62

అర్ణవమను డండకము :-

"మొదలు ననల మీాదటం దొమ్మిదా రేఫలున్నంగనౌ దండకం బర్ణవంబంద్రు రామభక్తాగ్రిణీ" 2-63

అందు వ్యాళదండకము :-

"బుతులఘువులపైని రేఫల్ పదిన్నిల్పగా వ్యాళ నామంబుతో దండకం బౌనయా జంబుమాలిదుర్ధీామజా" 2-64

జీమూతమను దండకము :-

"గుహాముఖ లఘువుల్ రముల్ రేఫలర్రైదు జీమూత మిద్దండకం బయ్యెనో నక్రి చక్రిస్తనీ శావ జీమూత జంఝానిలా" 2-65

లీలాకర దండకము :-

"రస లఘువులమీద బండ్రెండు రేఫల్ దలిర్పంగ లీలాకరం బన్న యీ దండకంబుద్దగు న్ధారుణిం గంపనాంభోధి కుంభీసుతా" 2-66

ఉద్దామ దండకము :-

"నయుగళమును రేఫయున్ రేఫలీరారు నుద్దామమన్ దండకం బౌను గౌల స్త్యకాసూహతాజిస్థలీ లక్షణా పాణిసంరక్షణోధ్యక్షణా" 2-67

శంఖ దండకము :-

"నయుగళము పయినెన్న బద్ధాల్గు రేఫల్ క్రమంబొప్పగా నుండిన న్శంఖ మన్దండకం బెందు నందంబగున్ శంఖ హస్తాంఘ్రి నీరేజ భృంగాయమానా జనా" 2-68

నయుగముతోడ నీరీతితో రేఫలేడాదిగా గణంబఘ్రి నొక్కొక్కటిం బెంచినన్ జండవృష్ట్యాదుల్ దండకంబుల్ దగున్ వీని నేకోన సాహస్రి పర్యంతమై యేక పాదంబులం గూర్పగావచ్చు, గాకుండెనేనిం జతుష్పాద యుక్తంబుగా జేయగావచ్చు, నీలాగు నద్వ్యయం బాదిగా యాపై బయోదేవతంబౌ గణశ్రేణి(యగణము), యేడాదిగానే వేయింటి సంఖ్యల్ ప్రవర్తిల్లగా దండకంబుల్ వినిర్మింపగావచ్చు, నద్వంద్వము న్మాని యాది న్నభోదేవతంబౌ గణంబు (తగణము), యెంతే దకారంబులు న్నిండినన్ స్వేచ్ఛ గాంతంబుగా నుంపగావచ్చు, నుంకొక్కటౌ దండకంబున్ నన ల్లాబుతో నాదిగా బెట్టి దకారంబు లెన్నైన నిచ్ఛాగతిం గూర్చి గాంతంబుగా నిట్లు గావింపగావచ్చునో యాంజనేయా జయోపాయ విద్వత్కవిగ్రామణీ గేయనిర్భేదితానేక దైతేయ కీశాన్వయాంభోధి చంద్రోదయా. 2-69

**2-2-5. అప్పకవి - అప్పకవీయము (క్రీ. శ. 1656)**

కం. "ఇది నియమములేని మహా
పథమున గావలసినంత వక్కాణింపన్
గొదలేక యమరు దండక
ముదధీంద్రశయాన తావకోత్తమ నుతులన్"[16] 4-442

విద్వాంసు లెల్లన్ హాకారంబెకానీ, నకారంబె కానీ, సకారంబు గానీ, వచింపన్ దగన్ముందుగా నిందుగాదేని యాదిం దకారంబు గల్పించి యామీది వెల్లం దకారంబులే మెండుగా నిచ్చకున్వచ్చు నంద్రాక నిర్మించి గుర్వంతమున్ జేసినన్ దండకంబండ్రు భక్తనుయాయీ! భుజగేంద్రశాయీ! ... ... నమస్తే నమస్తే నమః"
4-443

కం. దండిగ నేక పదంబున
నుండెడివిన్ నాల్గడుగుల నుండెడివిన్ వే
దండావన దండకముల
పిండువు దనరారు చండవృష్ట్యాదికముల్ ॥ 4-444

"నీరీతితోడ నన్నకారంబులు నెన్రింటి తర్వాత నేడాదిగాగా రకారంబు లొప్పారగా నంఘ్రి నొక్కొక్కటెక్కించి కావించినం జండవృష్ట్యాది నానా లసద్దండకంబు ల్విసాళించు గాకుండె నాల్గంఘ్రులుం జేయగావచ్చు నీరీతి నేకోన సాహస్రి పర్యంతముం గూర్చి యిచ్చావిధిం జెప్పగావచ్చు గాంతంబుగా... నమస్తే నమస్తే నమః"
4-445

## 2-2-6. వెల్లటూరి లింగయమంత్రి - సరసాంధ్ర వృత్తరత్నాకరము

కం. "హగణంబుల నగణంబుల
సగణంబుల రగణములను సత్కవిజనముల్
తగునసగను దండకముల
నొగి నాలుగు విధము లొనర జెప్పిద గృష్ణ"[17]

గీ. "హగణ మొక్కటి మొదలుగా హగణములను
దండకము సేయ దుద గురువుండు గృష్ణ".

లక్ష్యము. "శ్రీసతీశ మాల్య శైలవాస ... ... భూనుతాహ్వా
భక్తలోక పోషకుండ వంచు నేను దండముల్ యొసంగి
మీకు దండకంబు నిచ్చెదన్"

గీ. "సగణ మొక్కటి మొదలిడి సగణములను
దండకము సేయ దుద గురువుండు గృష్ణ"

లక్ష్యము. "జయమాల్య గిరీశ జయాశ్రితపోష ... ... నను
బ్రోవుము నారసింహా"

గీ. "తగణ మొక్కటి మొదలిడి తగణములను
దండకము సేయ దుద గురువుండు గృష్ణ"

లక్ష్యము. "శ్రీమాలెకొండ నృసింహుండు ——"

గీ. "నగణ మొక్కటి మొదలిడి నగణములను
దండకము సేయ దుద గురువుండు గృష్ణ"

లక్ష్యము. "జయ జయ నగధర జయ సుర రిపుహర జయ
జయ శుభకర ——"

గీ. "సగణ నగణ హగణ తగణంబులివిగూర్చి
దండకము సేయ దుద గురువుండు గృష్ణ"

లక్ష్యము. "జయ జయ రమణి ధవచిన్మయ జయ జయ కుశల
కూర్మ దంష్ట్రివై నారసింహుండవై రేణుకాగర్భశుక్తిందు
రత్నంబు చందంబున నుద్భవంబై-మాలెక్కొండె
నృసింహుండవై యుండు లక్ష్మీసమేతా నృసింహా నమస్తేనమః

ఇక కావ్యాలంకార చూడామణి కర్త - విన్నకోట పెద్దన, ఆనందరంగరాట్ఛందః కర్త - కస్తూరి రంగయ, లక్షణదీపిక కర్త - వార్తాకవి రఘునాథయ్య, లక్షణశిరోమణి కర్త - పొత్తపి వెంకట రమణ కవి మొదలగువా రుదాహరించిన దండక లక్షణములందు వైవిధ్యము కన్పించదు.

ఇట్లు తెలుగున లాక్షణికు లందరును దండకమునకు లక్షణము లను చెప్పియుండుటయేగాక, మాలావృత్తములందు దండకమును చేర్చి యుండిరి. ప్రాచీనుడగు పింగళముని మొదలు సంస్కృత లాక్షణికులెవరును దండకమును మాలావృత్తముగ పరిగణించలేదు. అగ్నిపురాణమునను, వృత్తరత్నాకరమునను, ఛందోమంజరియందును శబ్దకల్పద్రుమమునందును దండకము సమవృత్తజాతికి చెందినదిగా సూచించుచూ, సమవృత్తము లనంతరము ప్రసంగించి ప్రకరణమును సమాప్తము గావించి యుండిరి.

"దండకమును మాలావృత్తముగ పరిగణించిన వ్యక్తి ఛందోనుశాసన కర్త-జయకీర్తి."[18] భరతముని గూడ దండకమును మాలా వృత్తముగగాక 'మేఘమాలాదికం' అని ఒక నామము నుటంకించి యుండెను. కావున మాలా శబ్ద సూచితమగు శ్లోకము భరతముని నాట్యశాస్త్రమునందు గన్పించును. దీనినిబట్టి దండకమునకు మాలా వృత్త సూచనము సంస్కృతమున[illegible]పరిగెనని తెలియును.

తెలుగున లక్షణములలో సంస్కృతము నందలి లక్షణ భేదములనే పేర్కొని, తెలుగు నందలి లక్ష్యముల ననుసరించి మరికొన్ని ప్రత్యేక లక్షణములను తెలిపియుండిరి. కొందరు లక్షణములందేగాని, లక్ష్యము లందెచ్చటను గానరాని లక్షణములనుగూడా వక్కాణించి యుండిరి.

కవిజనాశ్రియకర్త న, న, హ గణము లాదిగ నిలిపి తదుపరి అన్నియును తగణములే కూడి యంతమున గురువుతో సమాప్తమగు లక్షణము నొకదానిని పేర్కొనియుండెను. తెలుగున వెలసిన ప్రిప్రిథమ దండక లక్షణ మిదియే.

తెలుగున లాక్షణికులు దండక లక్షణములను వెలువరించుచూ వానికి ఏనామము నుటంకించియుండలేదు. సంస్కృత రగణదండక భేదములను యథాతథముగ వానివాని నామములతోనే నుదాహరించిరి. తెలుగున తాక్షణికులు పేర్కొనిన లక్షణ భేదములు ఈ క్రింది భాగమున పట్టిక రూపమున నీయబడినవి.

కవిజనాశ్రయము :

I ననహ గణముల తదుపరి తగణ సమూహము అంతమున గురువు.

II తగణముతో మొదలిడి తక్కిన వన్నియును తగణములే కలిగి యంతమున గురువుతో నిలుపుట.

కావ్యాలంకార చూడామణి :

III సనహ గణము లాదిగ నిలిపి, తదుపరి తగణ సమూహము కలిగి గురువుతో నంతము జేయుట.

ఛందోదర్పణము :

కావ్యాలంకార చూడామణి కర్త పేర్కొనిన లక్షణము, కవిజనాశ్రయ కర్త నుడివిన సంపూర్ణ తగణాత్మక లక్షణములే చెప్ప

బడినవి. ప్రత్యేకత యేమియును గానరాదు. అనియతాక్షరమైన దండక మనుటవలన గద్య దండకముగ భావించవచ్చును.

## లక్షణసార సంగ్రహము :

సంస్కృతము నందలి చండవృష్టి ప్రయాతాది దండక లక్షణ ముల నెనిమిదింటిని పేర్కొనెను. ఇంతదనుక సంస్కృత లాక్షణికులు గాని, తెలుగు లాక్షణికులుగాని, చండవృష్టి ప్రయాతము మొదలు కొని శంఖమను పేరున పిలువబడు దండక భేదము వరకును ప్రత్యేకించి లక్ష్యపూర్వకముగ పేర్కొనినవా రెవరును లేరు. లక్షణసారసంగ్రహ కర్త యే లక్ష్యపూర్వకముగ వివరించి యుండెను.

**IV** నగణద్వయ మాదిన నిలిపి యేడు యగణములు.

ఈ లక్షణమునకు యగణసంఖ్య అనిశ్చితము.

## అప్పకవీయము :

**V** హగణము ముందుగ నిలిపి తక్కిన గణములన్నియును తగణ ములు అంతమున గురువు.

**VI** నగణము నాదిగ నిలిపి తక్కిన వన్నియును తగణములు కలిగి గురువుతో నంతము జేయుట.

**VII** సగణము నాదిగనిలిపి తక్కినవన్నియును తగణములతో రచితమై అంతమున గురువును నిలుపుట.

## సరసాంధ్ర వృత్త రత్నాకరము :

**VIII** హగణములతోనే మొత్తము దండకము నంతయును రచించి అంతమున గురువుతో ముగించుట.

**IX** సగణములతోనే మొత్తము దండకము నంతయును రచించి దండకాంతమున గురువుతో ముగించుట.

X నగణముతోనే అనగా సర్వలఘువులతోనే దండకము నంత యును కొనసాగించి గుర్వంతముగా చేయుట.

ఇవి యన్నియును తెలుగున లాక్షణికులు పేర్కొనిన దండక భేదములు. సంస్కృత లాక్షణికుల కంటె తెలుగు లాక్షణికులు చెప్పిన నియమము దండకము ఏకపాదముగాని, చతుష్పాదమున గాని రచింపవచ్చుననుట.

## 2-3. సంస్కృత - తెలుగు లాక్షణికుల లక్షణముల భేద సాదృశ్యములు :

ఈ విషయమున సంస్కృత లాక్షణికుల లక్షణముల నాధారముగ జేసికొని కొన్ని లక్షణములను తెలుగు లాక్షణికులు నిర్వచించి రనుట నిర్వివాదాంశము.

సంస్కృతమునగాని, తెలుగునగాని లక్ష్య-లక్షణము లందెచ్చటను యతి. ప్రాసలు గానరావు, తెలుగు నందలి దండక లక్ష్యములు, సంస్కృత దండక లక్ష్యానుసారులనుట కిదియొక ప్రబల నిదర్శనము.

తెలుగున వెలసిన ప్రప్రథమ దండక లక్షణము న, న, హ గణము లాదిగ కలిగి తక్కిన వన్నియును తగణములు కలిగి గుర్వంతముగా జేయుట. ఈ లక్షణమును పేర్కొనినవాడు కవిజనాశ్రయ కర్త. కాని దీనిని ప్రత్యేక లక్షణముగా గుర్తించుటకు వీలులేదు. సంస్కృత లాక్షణికులు పేర్కొనిన రగణ దండకభేదమును, కవిజనాశ్రయకర్త చెప్పిన న, న, హ లాదిగ కలిగిన తగణ దండక భేదమును అభేదములై యున్నవి.

కవిజనాశ్రయకర్తకు పూర్వము న, న, హ గణములాదిగ నిలిపెడి తగణ దండకమునకు లక్ష్యము లెచ్చటను గానరావు.

**కవిజనాశ్రయకర్త నుడివిన లక్షణము :**

**తెలుగునందలి లక్షణపరముగా :**

అమర గనన హంబు లందాది గానొండె గాదేని
యాదింద కారంబు లిమ్మైగ కారావ సానంబు గాదండ
కంబండ్రు దీనింగ వుల్

**సంస్కృతమునందలి లక్షణపరముగా :**

అమర గనన హంబులం దాదిగా నొండెగా దేనియా
దిందకా రంబులి మ్మైగకా రావసా నంబుగా దండకం
బండ్రుదీ నింగవుల్

పైన వివరించిన విధముగ కవిజనాశ్రయకర్త చెప్పిన తగణ దండక లక్షణము, సంస్కృతము నందలి రగణదండక లక్షణము అగు చున్నది. ఇతడు చెప్పిన సంపూర్ణ తగణదండక లక్షణము పూర్వ కవుల లక్ష్యముల నాధారముగ గొని నుడివినట్టిదే.

కావ్యాలంకార చూడామణి, ఛందోదర్పణ కర్తల 'ననహ' గణము లాదిగ కలిగి చెప్పిన తగణ దండక లక్షణము కృతకముగ దోచును. ఈ లక్షణమునకు పూర్వకవుల ప్రయోగములు లేవు. కావున "న, న, ర, లే – న, న, హ, త లుగ భీమన చెప్పియుండును. తరువాత న, న, హ పాఠము వ్రాతలో స, న, హ లుగ మారి యుం డును. విన్నకోట పెద్దన యందులకు తగినట్లు కృతినాది సనహంబు లని రచించియుండును. దానినే అనంతాదులు అనుసరించిరి గాబోలు. ఇంతకు 'అమరగ ననహంబు' లను పాఠము 'అమరగసనహంబు' లని మార్పులజెంది తదనుగుణముగ 'అమరగ సనహంబని' కాలక్రమమున సవరింపబడి స్థిరపడి యుండును"[19] అనెడి శ్రీ రావూరి దొరసామి శర్మగారి అభిప్రాయము సమంజసముగ దోచును.

దండకాదిని ప్రయోగించెడి యీ 'న,న,హ-స,న,హ' గణము లాధారముగ గొని యప్పకవి 'స,న,హ' గణములలోనే ఒక్కదాని నైనను ముందుగ నిలిపి తక్కినవన్నియును తగణములు కలిగి గుర్వంతముగా జేయు లక్షణమును దెలిపియుండెను. ఈ లక్షణములకును లక్ష్యములు కనిపించవు.

చిత్రకవి పెద్దన నగణద్వయము నాదిని నిలిపి యేడు యగణములతో దండకము రచింపవచ్చునని యగణదండక లక్షణమును చెప్పియుండెను. సంస్కృతమున ఛందోమంజరికారుడు ఈ లక్షణమును నిర్వచించి యుండుటయేగాక, ఈ దండకమును 'ప్రచితకసమభిధ' అను నామముతో (సంబోధించి) పేర్కొని యుండెను.

సంస్కృత సాహిత్యము నందు యగణదండక లక్ష్యము లెచ్చటను గానరావు. ఛందోమంజరికారుని లక్షణ నిర్దేశత్వమును బట్టి ఉన్నదని భావించవలెను. తెలుగు సాహిత్యమున 'ములుగు పాపయారాధ్యుని' దేవీభాగవతము నందు (5-535) యగణదండక రచన గలదు. ఇదియును నగణద్వయముపై రచితము గాదు సరిగదా జగణముతో నంతమగును. కావున చిత్రకవి పెద్దన నిర్వచించిన యగణ దండక లక్షణము సంస్కృత లక్షణానుసారి యని దలపవచ్చును.

సరసాంధ్రవృత్తరత్నాకర కర్త మరికొన్ని భేదములను ఉటంకించెను. అందు హగణదండక మొకటి. ఈ దండకమంతయును హగణములతోనే కొనసాగి గుర్వంతమగును. ఈ భేదమును, ఛందోమంజరి యందు చెప్పబడిన 'అశోకపుష్పమంజరి' యను దండక భేదమును అభేదములై యున్నవి.

యత్ర దృశ్యతే గురోః పరో లఘుః క్రమాత్స ఉచ్యతే బుధై రశోక పుష్పమఞ్జ రీతి.

పై నుదాహరించిన లక్షణము ఛందోమంజరికారుడు చెప్పిన అశోక పుష్పమఞ్జరి అను భేదమునకు సంబంధించినది. ఛందోమంజరి కారుడు ఒక గురువు-ఒక లఘువు క్రమముగ నడచునని చెప్పి యుండగా, లింగనమంత్రి హగణ దండకమును గుర్వంతముగా జేసెను. కావున సంస్కృత లక్షణానుసారి యనుటకు వీలుగాదు. హగణముతో రచింపబడిన దండకము తెలుగు సాహిత్యము నందెచ్చటను గాన రాదు. ఈతడు హగణముతో దండకము రచింపవచ్చునని, తగణ దండకమునందు వలె గుర్వంతము గావించెనని చెప్పవలెను.

లింగనమంత్రి చెప్పిన ప్రకారము హగణములను పొందుపరచిన దండకమును, మూడేసి అక్షరములకొక గణము చొప్పున లెక్కించిన ఒక రగణము-ఒక జగణము క్రమముగ పునరావృతమగును. ఇట్లు రగణ, జగణములతో కొనసాగిన దండక భేదమును 'జగత్యశోకమఞ్జరి' నామమున ఛందోమంజరికారుడు పేర్కొనియుండెను.

ఇట్లే అప్పకవి పేర్కొనిన 'హ, న, స' గణములతో నేదొక్క గణమునైనను దండకాదిని నిలిపి తదుపరి అన్నియును తగణములే కలిగి గుర్వంతము జేయు లక్షణము. సంస్కృత లాక్షణికుడు చెప్పిన ఒక లక్షణముతో సరిపోలుచున్నది.

యత్ర రేఫాన్ కవిః స్వేచ్ఛయా పాదశః కల్పయేత్ పేక్షయా
రోపయాత్యేషధీరైః స్మృతో దండకో మత్తమాతఙ్గలీలాకరః

పై నుదాహరింపబడిన లక్షణము ఛందోమంజరికారుడు చెప్పిన మత్తమాతఙ్గలీలాకరమను దండక భేదమునకు చెందినది. రగణముతో ప్రారంభమయి, రగణముతోనే అంతమగును. రగణ సంఖ్య యందు నియమము లేదు. ఇరువదియేడు అక్షరముల తదుపరి యెన్ని గణము లైనను రచింపవచ్చును.

అప్పకవి లక్షణము ప్రకారము :

యత్ర రేఫానేక విశ్వేచ్ఛ యాపాత సౌకర్య సాపేక్ష యారోప యత్యేష ధీరైశ్శస్త్ర తోదండ కోపత్త మాత్రజ్ఞ లీలాక రః

కావున అప్పకవి చెప్పిన పై తగణదండక భేదము ప్రత్యేక ముగా తోచదు. రగణదండక ప్రభేదముగా కన్పించును. అందునను లక్ష్యములు గానరావు.

సరసాంధ్రవృత్తరత్నాకర కర్త నుడివిన అంతమున గురువు కలిగెడి సర్వలఘుదండకము అసహజముగా దోచును. ఈతని లక్షణ మున కీతని లక్ష్యమే శరణ్యము. సర్వలఘు సీసమును గైకొని పాద విభజన చేయక అంతమున నొక పొల్లు గాని, దీర్ఘము గాని చేర్చిన నగణదండక మగును. అట్లే సర్వలఘు గద్యను గూడా సర్వలఘు దండకముగా మలచవచ్చును. దండక రచనయందు ప్రత్యేకత సృష్టించవలెనను తలపుయే గాని, ఈ భేదము ప్రామాణికముగా తోచదు.

అట్లు గాక సరసాంధ్రవృత్తరత్నాకర కర్త చెప్పిన సర్వలఘు దండకము కొద్దిపాటి భేదముతో హిందీ సాహిత్యమున గలదు. దానిని హిందీ సాహిత్యము నందలి దండక ప్రభేదములలో చూతము.

సంస్కృత లాక్షణికులు తెలిపిన గద్యదండక భేదమును, తెలుగు లాక్షణికు లెవరును తెలుపలేదు. అందునను గద్య దండకములు తెలుగు సాహిత్యమునందే యధికము. అయినను గద్యదండక భేదమును వక్కాణించి యుండక పోవుట విచిత్రము. ఛందోదర్పణకర్త- అనంతుడు 'అనియతాక్షర దండక' మనుట వలన గద్యదండకమును గూడ దృష్టి యందుంచుకొని లక్షణము చెప్పినట్లు భావించనగును. దండక లక్షణ ములను సమగ్రముగ విశదీకరించినది చిత్రకవి పెద్దన యొక్కడే. తదితరులు చెప్పిన లక్షణము లన్నియును అసమగ్రములే.

## 2-4 తెలుగు దండకముల ప్రత్యేకత :

తెలుగు దండక లక్ష్యముల నియమములుగాని నియమములుగ పాటించినవి శ్రీకారోపక్రమణ, నమోవాకములు.

గద్య-పద్యముల కనుసంధానముగ ఏకగణపు పొందికతో రచించిన గద్య దండకమును మాలావృత్త మనుట కూడా పొసగనిది. తెలుగున గల లక్ష్యముల ననుసరించి కొన్ని వేల గణములు ఏక పాదమున పొందుపరచిన దండకము లనేకములున్నవి. భావము నందు శక్తి యున్నంత వరకును వెదురు గడవలె, లేదా ఇక్షు దండము వలె నిది కణుపులు, కణుపులుగా నెదుగుచునే యుండును. అల్లే మాల వలె కూర్పు కలిగినదగుట కూడా సముచితముగనే యుండును. ఏమైనను అఖండ దండాకృతి కలిగిన దనుట సమంజసము.

తెలుగు దండక లక్ష్యమును గుర్వంతముగా జేయుట అప్రయత్న సాధ్యమైనదే గాని, వేరు గాదు. లక్ష్యముల ననుసరించి లక్షణముల పుట్టుక జరుగును గాన నిదియొక నియమముగ నేర్పడినది.

పాద నియమమున నేక పాదమున గాని, చతుష్పాదమున గాని, దండక రచన గావించ వచ్చునని తెలిపినది తెలుగు లాక్షణికులే. అయినను తెలుగు దండక లక్ష్యముల కొన్నిట పాద నియమము పాటింపబడ లేదు.

సంస్కృతమునందు వలె తెలుగున కూడా అక్షర చ్ఛందమే గాని, మాత్రా చ్ఛందము గాదు.

తెలుగున 'స, న, హ' గణము లాదిగ కలిగిన దండక లక్ష్యములు విరళముగ గన్పించును. సింహాసనద్వాత్రింశిక లోని దండకము సనహ గణము లాదిగ కలిగినదే. దీని యందే 'య, స, మ' గణ నిర్మోష్ఠ్య దండకము గలదు. య, స, మ గణము లాదిగ నిలిపి తక్కిన

గణము లన్నియును రగణములు కలిగినట్టిది. దీనికి తెలుగున లాక్షణికు లెవ్వరును లక్షణ నిర్దేశము చేయలేదు.

వరాహ పురాణము నందు నాలుగు పాదములు కలిగిన దండక మొకటి గలదు. ఇందు ప్రథమ పాదమున 'న, న, హ' గణము లాదిగ నిలిపి తక్కిన గణము లన్నియును తగణములు కలిగి గుర్వంతమై కొనసాగగా, తక్కిన పాదము లందు హగణము విడువబడి నగణ ద్వయముపై తగణ ఘటితమై గుర్వంతముగా కలిగినట్టివి. దానికిని తెలుగున లక్షణ నిర్దేశము చేయబడలేదు.

తెనాలి రామకృష్ణుని-ఘటికాచల మాహాత్మ్యాంతర్గత దండకము సంపూర్ణ రగణాత్మకమై గుర్వంతముగా జేసినట్టిది. ఈ దండకమునకును తెలుగున లక్షణ నిర్దేశము జరుగలేదు.

రఘునాథుని వాల్మీకి చరిత్రి యందలి దండకము 'గగ' లతో నంతమగును. రెండు గురువులతో నంతమగు దండకమునకును తెలుగున లక్షణము లేదు.

లాక్షణికు లెవరును పేర్కొనని లక్షణము కలిగిన లక్ష్యము కూడ తెలుగున మరియొకటి గలదు. ఈ లక్ష్యము 'కూచిమంచి తిమ్మకవి-అచ్చతెనుగు రామాయణము' లోనిది. న, స, హ గణము లపై రచింపబడిన తగణ దండకమిది. ఈ లక్ష్యము నందు రెండవ గణము సగణముగాన తదుపరి గణము హగణముగనే భావింపవలెను. తెలుగున న,న,హ – స,న,హ గణము లాదిగ కలిగిన లక్షణములు కనిపించుచునే యున్నవిగదా !

తెలుగున "పారిజాతాపహరణ కృతి కర్త ముక్కు-తిమ్మన" గణసమక దండకము నొకదానిని రచించెను. ఇది రెండు పాదములు కలిగినది. రెండు పాదము లందునను గణ సంఖ్య సమానముగా

నున్నది. అందుచేతనే గాబోలు గణసమక దండకమని సంబోధించి యుండెను. ఇదియును లాక్షణికులు గ్రహింపదగిన నియమముగ భావింపవచ్చును.

తెలుగు దండకమున శ్రీకారోపక్రమణము సత్సంప్రదాయముగ భావించిన, నగణము ఛందఃపరముగ సర్వలఘు నామమును పొందుపరచుటకు నుపయోగకారి. అంతియేగాక నగణమును గూర్చి అప్పకవి –

సీ. గ్రహములలోన భాస్కరుని చందమున
దరులలో బారిజాతంబు కరణి
క్ష్మాధరంబులలోన గనకాద్రి కైవడి
నదులలో జహ్నుకన్య విధమున
దైవతంబులలోన దైత్యారి చాడ్పున
బ్రమథులలో శూలపాణి పగిది
మృగములలో గరిద్వేషి భాతిని జూడ
వివిధ విద్యలలోన వేదము క్రియ

తే. క్షేత్రములలోన వారణాశీ స్థలంబు
రీవి నిభములలోన నైరావతంబు
రీతి గణములలోన జర్చించి జూడ
నగణ మొప్పారు శుభ నిధానంబు గాన. 4–74

కం. కృతి మొదల నిలిచినప్పుడు
మతి దలపగ నుపగణములు మగణాదులతో
జత గూడి యూఫలంబులె
పతికిచ్చు రవీంద్ర శీత భానుల మహిమన్ 4–75

అని, నగణము యొక్క ఉన్నతిని చాటియుండెను. కావుననే గాబోలు తెలుగు లక్ష్యముల గూడ నగణము ప్రాధాన్యము వహించినది.

ఇట్లు తెలుగున దండక లక్ష్యములు అవిరళముగ నున్నవి. కావ్యకర్తలు దండక రచన యందు మిక్కిలి స్వాతంత్ర్యము వహించిరి. లక్ష్యములకు సరియగు లక్షణ నిర్దేశము ఇప్పటికిని జరుగలేదు. దండకము కొన్ని సంప్రదాయములను ఏర్పరచుకొనినది.

ఇంతదనుక సంస్కృత, తెలుగు సాహిత్యములందు దండక చ్ఛందము యొక్క పరిశీలన జరిగినది. సంస్కృతమునందు కంటె తెలుగున లక్ష్య లక్షణముల రెండింటను అపరిమిత వ్యాప్తి కలిగియున్నది. ఇట్టి వ్యాప్తి ననుసరించియు దేశి సంబంధి సాహిత్యముగా పలువురు సాహితీ వేత్తలు తలచి యుండిరి.

సంస్కృతము ఆర్యభాష అనియు, తెలుగు ద్రావిడ భాష అనియు అందరు నెరిగినదే. అట్లయిన తెలుగునకు సోదర ద్రావిడ భాషలగు తమిళ, కన్నడ సాహిత్యముల దండకము వ్యాప్తి యందుండవలెను. సోదరీ ద్రావిడ భాషలగు తమిళ, కన్నడముల దండక రచన సంస్కృతభాషా జన్యమా ? ద్రావిడ భాషల స్వతంత్రలక్షణమా ? అను విషయమును గూడ క్లుప్తముగ గైకొని పరిశీలించిన దండకము యొక్క పుట్టుక మరింత నిర్ధారణ యగును.

తెలుగున అవిరళముగ దండక రచనలు వెలువడుటయే ఇటువంటి అపోహలకు గల కారణము. సంస్కృత భాషయందు లక్ష్యములు అతి విరళముగ నుండుటయు ద్రావిడ భాషల సొంతమను ఊహకుపబలక మగుచున్నది. కావున ఆర్యభాషా కుటుంబమునకు చెందిన హిందీ సాహిత్యము నందలి లక్ష్య, లక్షణములను పరిశీలించిన తెలుగు దండకము పుట్టుక మరింత సుస్పష్టముగ నిర్ధారింపవచ్చును.

## 2_5. కన్నడము :

క్రీ. శ. 10వ శతాబ్దమునకు చెందిన 'కన్నడ నాగవర్మ' తన 'ఛందోంబుధి' అను లక్షణ గ్రంథమున దండకమునకు ఛందమును నిర్దేశించి యుండెను. ఇతడు సంస్కృతమునందలి దండక లక్షణములను పేర్కొనుటతోపాటు అదనముగా 'ఉత్సాహ' మను ఒక ప్రత్యేక దండక లక్షణమును దెలిపి యుండెను.

"అమర యుగద ముందె బందెగ్నిగళ్ వండవృష్టి
ప్రపాతక్కె ఏళప్పు దెంటప్పుద
త్తమెని దొడె యరణ మొంబొత్తరిం దర్ణవం బత్తరి
వ్యాళ జీమూతకా
గ్రిమదెబర్ల దొందు లీలాకరం సుందరం ముందరళ్
సందిరల్ పుట్టుగం
కమల వదనె లోకప్రసిద్ధ మాదారరిం ముంతె
నానావిధ దండకం పుట్టుగుం." [20]

"రచితం నయుగ సప్త సప్తార్చియిందం
ప్రచిత వెనలధిక రెమాగ నద్వైతదిం మ
త్తుచిత పెనలత్త తోయాదీందంతాం
నిచిత మధు మోమాది గళ్ బందొడక్కుం" [21]

ఇందు నాగవర్మ మొదటి పద్యమున సంస్కృత రగణదండక ప్రభేదములనే పేర్కొని యుండెను. తదుపరి కొద్దిపాటి వైవిధ్యము కలిగిన మూడు ప్రత్యేక లక్షణములను చెప్పియుండెను. అవి యేవన- **1.** ప్రచిత, **2.** ఉచిత, **3.** నిచిత.

ప్రచిత లక్షణము :- రెండు నగణముల తదుపరి యేడు రగణములు కలిగి యుండును.

ఉచిత లక్షణము :- రెండు నగణముల తదుపరి తోయగణములు కలిగి యుండును. తోయగణములనగా తగణ, యగణములు. ఈ రెండు గణములలో నేగణముతోనైనను నగణద్వయ మాదిగ నిలిపి దండక రచన చేయబడును.

విచిత లక్షణము :- రెండు వగణముల తదుపరి ఏడుకంటె నెక్కువ సంఖ్యలో రగణములు రచితమగును.

పై లక్షణములను బట్టి నాగవర్మ సంస్కృత లాక్షణికోక్తకము గనే దండక లక్షణములు నుడివెనని తెలియును.

నాగవర్మ ద్రావిడ ఛందస్సులను పేర్కొను వేరొక ప్రకరణమున ప్రత్యేక దండకలక్షణము నొకదానిని చెప్పియుండెను.

కం. "మృదు మధుర వెనిసు ఉత్సా
హ దండకం ధరగె నాకెయం బజగణకిం దిం
పుదిద వలె కడమె గురు చె
ల్వాదవిరె లక్షణ నియుక్తమనె పెసర్వడగుం"[22]

పైన పేర్కొనబడినది 'ఉత్సాహ' మను దండక లక్షణము. దీనిని ద్రావిడ ఛందస్సులలో పేర్కొనుటయే గాక. కందపద్యమున లక్షణము నిర్వచించి యుండెను. ఇందు అజగణములు (జగణములు కానివి) ఎన్నియైనను పొందుపరచవచ్చు. తుదను గురువుతో ముగి యుట దీని లక్షణము.

క్రీ. శ. 10 వ శతాబ్దము పూర్వభాగము నందుండిన నాగవర్మ కన్నడ కావ్య చ్ఛందమును నిర్వచించుట వలన, తనకంటె పూర్వ కవి కృతులందలి లక్ష్యణముల నాధారముగ గొని లక్షణములు చెప్పె ననుట నిర్వివాదాంశము. క్రీ. శ. 1030 కాలము వాడైన చంద్రరాజ మదనతిలక' కర్త 'చంద్రరాజు' ఉత్సాహ దండకము నొకదానిని

రచించె ననియు, కన్నడమున 'రాజశేఖర చరిత్రము. వృషభేంద్ర విజయము' మొదలగు కావ్యము లందు గూడ ఉత్సాహదండకము రచింపబడినదనియు 'కన్నడ ఛందః చరిత్ర స్పష్టము చేయుచున్నది.

కన్నడ చందః చరిత్ర, పు. 435

విశేషించి దండకమును కన్నడ లాక్షణిక లోకము గూడ మాలా వృత్తముగనే పరిగణించినది. దీనికిగల కారణము భరత మునియేనని కన్నడ ఛందఃచరిత్రము వ్యక్తము చేయుచున్నది.

"దండకం నామ విజ్ఞేయం షడ్వింశ దధికాక్షరమ్
వృత్తం మాలాధికం తస్యానో్క్తం చాదౌ గుహాదినః"[23]

కన్నడ ఛందఃచరిత్రము పు. 435

గుహాండు మొదలగు పూర్వ ఛందఃక ర్తలు ఈ వృత్తమును తెలుపలేదనియు, భరతమునియే దీనిని మాలా వృత్తముగ పరిగణించి నట్లు పై శ్లోకము వలస స్పష్టపడుచున్నది.

కన్నడమున దండకము దేశి సంబంధి సాహిత్య ప్రక్రియ గాదనియును, సంస్కృతము నుండి కన్నడ కావ్య కర్తలు స్వీకరించి రనియును వ్యక్తమగుచున్నది. అందునను కన్నడ నాగవర్మ, ఛందోనుశాసన కర్త జయకీర్తి వలన ప్రభావితుడనియును తెలియు నున్నది.[24]

## 2-6. తమిళము :-

తమిళ భాషా సాహిత్యము నందును దండకము వెలయు చున్నది. అట్లని మిక్కిలి ప్రాచుర్యమున లేదు.

తమిళ సాహిత్యము నందలి దండక ఛందమును గూర్చి విద్వాన్ రావూరి దొరసామిశర్మ గారు ఈ క్రింది విధముగా తెలియజేసి యుండిరి.

"తమిళ భాషలో 'తాండకమ్' అను పద్య భేదము తద్భాషా ఛందో గ్రంథములలో లక్ష్య, లక్షణములతో వివరింపబడియున్నది. సంస్కృత దండకము తమిళమున తాండకమై యుండును. తమిళ తాండకము రెండు విధములు —

1. అళవియల్ తాండకమ్ : ప్రతి పాదమునకు ఇరువదియేడు అక్షరములు మొదలుకొని యెన్నని అక్షరములు కలిగి యున్నది.

2. అళవరి తాండకమ్ : అక్షరములు సమానముగ లేనిది యును. గురు లఘు యోగ సమత్వము లేనిదియునగు ఇరువది యేడు అక్షరములకు మించిన పద్యము.

ఇంతియేగాక కుటుంతాండకమ్, నెండుం తాండకమ్ అని భేదములు కలవట.

ఈ తమిళ భాషయందలి తాండకములు నాలుగు చరణములు కలిగి పద్యము మాదిరిగ యతి, ప్రాస సమన్వితములై యుండును.

తమిళభాషలో నీతాండకకృతమయిన గ్రంథముమ 'తేవార' మని పిలిచెదరు. అప్పరుస్వామి 'తాండక వేందు' అని బిరుదు కలిగిన వాడు. అంతియేగాక తమిళభాషలో ఈ తాండకము లన్నియును సంస్కృతభాషయందు వలె స్తుతిపరములై యొప్పుచున్నవి.

(దండక వాఙ్మయము. ఆంధ్ర పత్రిక. హేమలంబ సంవత్సరాది సంచిక పు. 126)

## 2-7. హిందీ :—

హిందీ సాహిత్యమున దండకము ప్రముఖ స్థానము నలంకరించి యున్నది. అయినను దానికి సాహితీ విమర్శక లోకము నందలి గుర్తింపు తక్కువ.

ఈ దండకము సంస్కృత భాష నుండియే హిందీ సాహిత్యము నకును సంక్రమించినది. హిందీ కవులు దానిని సంస్కృత భాషనుండి

గైకొనినప్పటికిని కొన్ని క్రొత్త పోకడలు పోయిరి. దండకముకు వివిధ నామములును పేర్కొనబడినవి.

హిందీ సాహిత్యమున భక్తికాలమునకు (క్రీ. శ. 1375-1700) చెందిన 'కేశవదాసు' (క్రీ. శ. 1552-1614) తాను రచించిన 'రామ చంద్రిక' యందు రామాయణ మహాకావ్యము నందు నలుబది మార్లు దండక వృత్తమును రచించి యుండెను. అన్నియును గ్రంథాంతర్గతము లగుటయే గాక, ఇంక విరివిగ దండక వృత్తమును రచించిన కవి కనుపించడు. భక్తి కాలమునకు చెందిన కేశవదాసు తాను రచించిన దండకము లన్నియును భక్తి పరముగనే గాక, వర్ణనలకును వినియోగించి యుండెను. ఇట్లు హిందీ సాహిత్యమున దండకములను రచించిన కవులు 'రఘునాథ దయాల్, బిఖారీదాస్, గోపాల్ శరణ్ సింహ్, రామచంద్రశుక్లా, ఘనానంద్, రామచంద్రశుక్లా' మొదలగు వారు ఎందరో గలరు.

కేశవదాసు దండకములను వివిధ నామములతో రచించుట గాక, ఛందము నందును వైవిధ్యము ప్రదర్శించి యుండెను. కావున నీతని దండక రచనను పరికించుటకు ముందుగ, ఛందఃకర్తలు ఏయే నియమములు వక్కాణించిరో పరిశీలించుట యుక్తము.

హిందీ భాషా ఛందమున గూడా ఛందోవేత్తలు దండకము వర్ణ వృత్తముగనే పరిగణించిరి. ఇది రెండు విధములు. ఒకటి : సాధారణము లేదా గణాత్మకము, రెండది : ముక్తకము లేదా వర్ణ సంఖ్యను ప్రమాణముగా జేసికొనినది.

1. సాధారణము లేదా గణాత్మకము : దీనియందు గణములు కూర్పు కలిగియుండును. ఏ నియమమును అనుసరించి గణములు పొందుపరచవలెనో యాగణములనే వినియోగించవలెను. ఉదాహరణకు చండవృష్టిప్రయాతము, మత్తగ్రు లీలాకరము, కుసుమ స్తబకము

పైనుటంకించిన గణాత్మక దండకములు సంస్కృత ఛందః కర్తలు లక్షణీకరించినవి. కాన వీనిని యథాతథముగనే గైకొన వలెను.

2. ముక్తకము : ఈ ముక్తక దండకము వర్ణసంఖ్య యందు నియమము కలిగి యుండును, గణముల యొక్క బంధము నుండి ముక్తి కలుగుటచేత దీనిని ముక్తక మందురు.

"గణోంకె బంధన్‌సే ముక్తి రహతీహై"

(కావ్యప్రదీప్ పు. 326)

ఈ ముక్తక ఛందమున ఇరువదియారు అక్షరములకు మించుట ప్రధానము.

2-7-1. సాధారణ గణాత్మక దండకములు :—

కుసుమస్తబకము : సగణ మాధారముగ గొని రచించునట్టిది. తొమ్మిది గణములు మొదలుకొని యాపై నెన్ని గణముల నైనను రచింపవచ్చును. గణ సంఖ్య యందు నియమము లేదు.

"కుసుమ స్తబక్ సగన్ ధరీ నౌ అథవా అధికా రచియే అపనో మన్ దే. కుసుమస్తబక్ ప్రత్యేక్ చరణ్ మే నౌసే అధిక్ సగణ్ హోతాహై."

(కావ్యప్రదీప్ పు. 327.)

బిధినా బిధినా నభలే దుఖ్ దే హన్ దే హాకుబా సమలీ
నన్ కే గనమే
యదిమీా తమిలే పునితో జిన్‌కీ రతిహో గతిహా రన్‌రీ
తికబీ నజ్ మే
బరుధో రకతో రసహా దుఖ్ దీ రఫ్‌పై ఆవనీ యత్ టే
కనిభై జగ్ మే
మన్‌చా హాత్ మా నమిలై నిత హీ నతుగో యరహా
జుసుధా మన్‌కీ మనమే

మత్తమాజ్గ లీలాకరము : దీనియందు తొమ్మిది రగణముల నుండి యెన్ని గణములేనియు నధికముగ రచింపవచ్చును.

"పాయిబి ద్యానికో బృద్ జూ భారతీ ల్యాయిపా నంద్ జూం
మానుషీ కృతినే బంద్ జూ ఛాద్ లీ లాకరై తౌకహో

హ్యైమనే పాల్ కో మేర్ ఆ భేట్ మే సంఘుహూ భార్ లా
లీన్ కా హీన్ కీ దారప ఢీలజీ లాకరై తౌకహో"

(కావ్యప్రదీప్ పు. 328)

ఇది నాలుగు పాదములు కలిగిన లక్ష్యము. పైన రెండు పాదములే నుటకింపబడినవి. వర్ణముల నాధారముగ గొని రచింపబడెడి సాధారణ దండకములు సంస్కృతము నందలివియే. పైన తెలిపిన రెండు భేదములను గంగాదాసుని (తన) ఛందోమంజరి యందు జెప్ప బడినవి. ఈ దండకములను గూర్చి తెలుపుచూ 'పింగల్ విరచిత్' అని చెప్పబడినది. 'అనగా పింగళుడు రచించిన' అని అర్థము. కాని రెండు భేదములను పింగళుడు వక్కాణించినవి గావు.

## 2-7-2, ముక్తక దండకములు :-

ముక్తక మననేమో ముందుగనే తెలుపడినది. ఇందు గణము లాధారముగా గొని నిర్వచించుట జరుగలేదు. వర్ణము లాధారముగ సంఖ్యా నియమము కలిగియుండును. ఆ కొన్నిట యతిమైత్రి పాటింప బడినది. ఈ ముక్తక దండకము అనేక తెరగులుగ జెప్పబడినది. ఒక లక్ష్యమునకు ముప్పది యొక్క అక్షరములు నియమమైన, మరియొక భేదమునకు ముప్పది రెండు అక్షరములు నియమము కలిగి యుండును. ఈ ముక్తక దండకము గూర్చి కావ్యప్రదీపమున నిట్లు చెప్పబడినది.

"జిన్ ఛందోంమే వర్ణోంకీ సంఖ్యాకాహీ ప్రమాణ్ హై అథవా కహీ కహీ లఘు గురుకాభీ నియమ్ రహతాహై । గణోంకే బంధన్ సే ముక్తి రహతీహై ఉన్ కో ముక్తక్ కహతే హై । జైసె 31

వర్ణోంకె 'మన్‌హరణ్' జన్‌హరణ్, కలాధర్, 32 వర్ణోంకె 'రూప్ ఘనాక్షరీ, జల్‌హరణ్, డమరూ, విజయీ', ఔర్ 33 వర్ణోంకా 'దేవ్ ఘనాక్షరీ, ఇన్‌మే కుచ్‌కా వర్ణన్ ఆగేకియా జాయ్‌గా".

ముక్తక దండకము నందు ముప్పదియొక్క వర్ణములతో మన్‌హరణ్, జన్‌హరణ్, కలాధర్ అను నామములు కలిగిననియును, ముప్పదిరెండు వర్ణములతో రూప్‌ఘనాక్షరి. జల్‌హరణ్, డమరూ, విజయీ అనునవియును, ముప్పదిమూడు వర్ణములతో రచింపబడునది 'దేవఘనాక్షరి' అనియును ముక్తక దండక భేదములు చెప్పబడినవి

మన్‌హరణ్ దండకము :-

ల. దీనియందు పాదమునకు ముప్పదియొక్క వర్ణము లుండును. పాద పాదమునకు పదునారవ అక్షరముతో యతిమైత్రి పాటింపబడును. పాదాంతమున గురువు కలిగి యుండవలెను. పాదాంతమున గురువు నిలిపెడి నియమము దప్ప తక్కిన అక్షరములతో గురు లఘువుల క్రమమేదియును లేదు.

లక్ష్యము. "మంజుల మృదుల మురలీకీ స్వర్ కే సమాన్
ఉన్‌కా సరస్‌గాన్ గూంజ్‌తా హై కాన్‌మే
ఉన్‌కా అనూప్ రూప్ భూల్‌తా కభీ కభీ నహీ
చాహే కుచ్ సోచూ కింతు ఆతావహీ ధ్యానమే।
సుఖ్‌కర్ ఉన్‌కే శరీర్‌కీ సుగంధ్ జైసే హై
ముఝె ఉన్‌కీ సుధ్ ఆతి లన్ ఆన్ మే।
ప్రాణ్‌మే ఉన్‌కీ మంజు మూర్తి హై సమాయీ
హులయీ మనోహై ఉడ్‌తీ వహీ సాసోంకె విమాన్ మే।

(కావ్యప్రదీప్ పు. 328.)

అట్లుగాక ప్రతిచరణమునకు ఎనిమిది అక్షరముల కొక మారు చొప్పున యతివేసి, ఆఖరున మిగిలిన ఏడవ అక్షరమునకు కూడా యతి వేయుట కలదు.

కేశవదాసు తన రామచంద్రిక యందు 'జగ్ మోహన్ దండక్' అను నామముతో దండకము నొకదానిని రచించి యుండెను. కావ్య ప్రదీపమున పేర్కొనిన "మన్‌హరణ్, జన్‌హరణ్, కలాధర్" అను మూడు దండక నామముల కంటె భిన్నమైన నామము కలిగినది. ఇది యును ముప్పదియొక్క అక్షరములతో రచింపబడిన ముక్తక దండకము.

లక్ష్యము. "కిద్యాం యహ రాజపుత్రీ వరహీ వరయాహై
కిద్యాం ఉపది వరయోహై మహి సోభా అభారతహై ।
కిద్యాం రతి రతినాథ జిస్‌సాథ్ కేసొదాస్
జాత తపోవన్ సిర్ వైర్ సుమిరిత్ హా ।[25]"

ఘనాక్షరి : ఇది మూడు విధములు, 1. రూప ఘనాక్షరి, 2. కృపాణ ఘనాక్షరి, 3. దేవ ఘనాక్షరి. ఈ మూడు భేదములకు ముప్పదిరెండు వర్ణములు కలిగియుండుట నియమము.

1. రూప ఘనాక్షరి; ముప్పది రెండు వర్ణములతో, పదునారవ అక్షరమునకు యతిస్థానము కలిగియుండును. చరణాంతమున నొక గురువు, లఘువు కలిగి యుండవలెను.

లక్ష్యము. "నగర్ దూర్ కుచ్ గాంవ్ కిసీ బస్తీ ఏక్ హరేభరే
ఖేతోంకే సమీప్ అతి అభిరామ్ ।
జహాఁ పత్రిజాల్ అంతరాల్ సె ఝలక్ తేహై లాల్
ఖపరైల్ శ్వేత భజ్జోంకే సంవారే ధామ్ ।

(కావ్య ప్రదీప్. పు-329.)

ఇంకను రెండు చరణములు కలిగియున్నది. ఇట్లే కృపాణ ఘనాక్షరికిని ముప్పది రెండు వర్ణములు కలిగి ప్రతి చరణమునను ఎనిది వర్ణముల కొకమారు యతిమైత్రి పాటించి, చరణాంతమున లఘువు, గురువు, లఘువు మూడు వర్ణములను నిలుపవలెను.

ముక్తక దండకములను హిందీసాహిత్యము నందలి ప్రత్యేక తగా భావించ వలెను. సర్వలఘు దండకమును గూడ కావ్య ప్రదీప మున ఘనాక్షరి భేదముగా తెలుపబడినది. తెలుగు లాక్షణికులలో 'వెల్లటూరి లింగయమంత్రి' పేర్కొనిన నగణ దండకమునకిది సరి పోలును. కాని తెలుగు దండకమున యతిమైత్రి పాటింపబడలేదు. హిందీసాహిత్యము నందలి ఘనాక్షరి భేదములలో నొకటైన సర్వలఘు దండకమునకు, ఎనిమిదవ అక్షరమునకు యతిమైత్రి పాటింప వలెనను నియమము గలదు. దీనినొక భేదముగా అంగీకరింపక తీరదు.

లక్ష్యము. "జరత్ సకల జగ గరల ధరత్ గల కరత్ అభయ భయ
జయకహ జయకర్ ।
తపత్ కరమ్ తప తన్ మన్ జర్ జర్ భనక్ న భల్ రహ్
జనమ్ జనమ్ జర్ ।"

పైన వివరించినంతవరకు హిందీ సాహిత్యము నందలి దండక చ్ఛందము అక్షర చ్ఛంద మనియు, సంస్కృత చ్ఛందోజాత మనియు, హిందీభాషా కవుల స్వాతంత్ర్యము వలన యతి నియమముతో కూడిన ముక్తక దండకములు ఏర్పడినవని తెలియును.

సంస్కృత, హిందీ, తెలుగు, తమిళ, కన్నడము లన్నిటి యందును దండకము వెలయుచున్నది. ఈ భాషలన్నిటి యందును సంస్కృత భాష నుండి గ్రహించిన దండక వృత్తమే ప్రాచుర్యమున నున్నది. సంస్కృతేతర భాషాకవులు స్వతంత్రముగనొక దండక భేదమును సృష్టించినను, వారి వారి స్వాతంత్ర్యమునకు తార్కాణము

గనే పేర్కొనగలము. అంతమాత్రమున నాలక్ష్యము నూతనగాని యది దేశీయ చ్ఛందోజాత మనుట యుచితముగ తోచదు. ప్రాచీన ములైన లక్షణములు సంస్కృత సాహిత్యము నందే నిక్షిప్తములై యున్నవి. తెలుగు భాష యందు యథాతథముగా గ్రహించగా, హిందీ, తమిళ, కన్నడ భాషలా ఛందమునకు యతి ప్రాసలు జతచేసి కొనినవి.

తమిళమున 6వ శతాబ్దము నుండి దండక లక్ష్యములు కనిపించు చుండగా, హిందీ సాహిత్యము నందు 14వ శతాబ్దము నుండియు, కన్నడమున 9వ శతాబ్దము నుండియు, తెలుగున 11వ శతాబ్దము నుండియు, సంస్కృతమున 2వ శతాబ్దము నుండియు లక్ష్యములు కనిపించుచున్నవి. సంస్కృతమున లక్ష్యముల కంటె లక్షణము లే ప్రాచీనములై యొప్పుచున్నవి. కాలక్రమమున సంస్కృతభాష యందే దండకమునకు వివిధములైన గణములు ఉపయోగింపబడినవి. అట్లే యితర భాషల యందును పలుగణములు వినియోగింప బడినవి. ఇట్లు దండకమునకు భేదము లేర్పడుట కవకాశమిచ్చినవాడు పింగళుడే. "ప్రథమ శ్ఛందవృష్టి ప్రియాతః" అని చెప్పుటతోనే తదుపరి కవులు స్వాతంత్ర్యము వహించియుందురు.

## అధస్సూచికలు

1. The adopts the system of algebraic symbols using 'L' for short (laghu), 'g' for long (guru) syllable, m fora molossus and soon. We must there for be uncertain wether his work was the guide by which the poets steered Tueir course what is clear is that we have no uncertainly early text other than this. (History of Sanskrit literature. Page. 416)

2. నాట్యశాస్త్రము. 15వ. అధ్యాయము. పు. 416.

3. "దండకం నామ విజ్ఞేయ ముత్కృతే రధికాక్షరమ్
మేఘమాలాదికం తస్యానోక్తం చాదా గుహాత్రికః
ఏతాని సమవృత్తాని మయోక్తా ద్విజోత్తమాః
విషమార్ధ సమా..."

అని సమవృత్త ప్రకరణము అంతమగును. ఇట దండకము సమవృత్తములలో చేర్చబడినది. ఈ లక్షణము, బరోడా, కాశీ, ఢిల్లీ ముద్రణములు మూడిటి యందును గలదు. ఈ లక్షణమునే కొందరు ప్రక్షిప్తములుగ తలచియుందురు.

4. ఛందోవిచితి. పింగళుడు. హలాయుధ వ్యాఖ్య. సప్తమాధ్యాయము. లౌకిక ఛందోధికారము.

5. అగ్నిపురాణము. వృత్తలక్షణములు. పు. 305, 306.

6. రసథాల భృగు రుద్రాః పృథ్వీ జసజసాజనా।
గావ సుగ్రీహావిచ్ఛన్నాపిఙ్గలేనేరితాపురా ॥

శ్లో. సం. 20, పు. 304

7. ఆంధ్రమహాభారతము – ఛందశ్శిల్పము. డా. పాటిబండ మాధవ రామశర్మ. విశేష చ్ఛందములు – దండకము. పు. 261.

8. వృత్తరత్నాకరము. తృతీయాధ్యాయము.

9. ఛందోమంజరి గంగాదాసు ద్వితీయ స్తబకము పుట-84

10. శబ్దకల్పద్రుమము. ద్వితీయకాండ. పు. 471.

11. వాచస్పత్యమ్. శ్రీ తారానాథ తర్కవాచస్పతి. చతుర్థ భాగము. పు. 3432, 33.

(వాచస్పత్యము నందలి విషయమును శ్రీ రావూరి దొరసామి శర్మగారు తమ తెలుగుభాషలో ఛందోరీతులు అను గ్రంథమున గుర్తించియే యుండిరి. పు. 133, 34.)

12. ఉద్ధరమాలావృత్తాధికారము. దండకము. పుట. 54

13. చతుర్థోల్లాసము. దండకము. పు. 56

14. ఛందోదర్పణము. ద్వితీయాశ్వాసము, పు. 135

15. లక్షణసారసంగ్రహము. ద్వితీయాశ్వాసము. పు. 51-53.

16. అప్పకవీయము. చతుర్థాశ్వాసము. పు. 261, 32.

అప్పకవియును చిత్రకవి పెద్దనవలె జండవృష్ట్యాది దండకము మొదలు శంఖమను దండకము వరకును లక్షణములందు లక్ష్యసహితముగా చెప్పియుండెను.

17. అముద్రితలిఖితప్రతి. మద్రాసు, ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారము, గ్ర. సం. డి. 1320.

(సరసాంధ్ర వృత్తరత్నాకరము నందలి చ్ఛందమును గూర్చి విద్వాన్ రావూరి దొరసామిశర్మగారు ఇంతకు మునుపే తెలుగు భాషలో ఛందోరీతులు అను గ్రంథమున తెలిపియుండిరి.)

18. దండకాః వృత్తశబ్దాధికాః వృత్తవర్తైషి; పాదోక్తలక్ష్మేతరా
దండకాః యేతుతే గద్యపూర్వాశ్చ మాలాదికాః
తేథవానేకథా.

19. విద్వాన్ రావూరి దొరసామిశర్మగారు తమ తెలుగుభాషలో ఛందోరీతులు అనుగ్రంథమున సంస్కృత రగణ దండకమునకును, కవిజనాశ్రయ కర్త చెప్పిన తగణ దండకమునకును అభేదమును గుర్తించియే యుండిరి.

20. తెలుగు భాషలో ఛందోరీతులు. ఉద్ధర మాలావృత్తములు. పు. 140.

21. ఛందోంబుధి. తృతీయాధికరణము. ప. సం. 22

22. ,, ,, ప. సం. 23

23. ఛందోంబుధి. పంచమాధికరణము. ప. సం. 258.

24. కన్నడ ఛందః చరిత్ర తెలిపెడి శ్లోకమునందు 'వృత్తం మాలాదికం' అని యుండగా, సంస్కృత ప్రతులందు "మేఘ మాలాదికం" అని కన్పించుచున్నది.

25. కాశీ హిందూ విశ్వవిద్యాలయమున కన్నడ విభాగాధ్యక్షులు ప్రొ. శివానందగారితో నాగోష్టి.

26. రామచంద్రిక. అయోధ్య కాండ. ప. సం. 51

# 3

# తెలుగున దండకము-ఆవిర్భావ, అభివృద్ధి వికాసములు

సంస్కృత సాహిత్యమున దండక వృత్తము ఏనాడుద్భవించినదో యెప్పటినుండి ప్రచారమునకు వచ్చినదో తెలుపుటకు నిర్దిష్టమైన ఆధారములు గానరావు. 'అష్టాధ్యాయి రచించిన పాణినికి తమ్మునిగా భావింపబడుచున్న పింగళముని[1]' తన 'ఛందోవిచితి' యను లక్షణ గ్రంథమున ప్రథమముగ దండక వృత్తమునకు లక్షణము తెలిపి యుండెను. భారతీయ భాషలు లక్ష్యము లుద్భవించిన తదుపరి లక్షణ ములను నిర్దేశించు కొనెడి తత్త్వము కలిగినవి గావున, పింగళముని (క్రీ. పూ. 2వ శతాబ్ది) కాలము నాటికే దండకము ప్రచారమున నుండెనని భావించ వీలగుచున్నది.

ఒక్కొక్క పాదము ఇరువదియేడు అక్షరములు మొదలుకొని ఏకోన సహస్రాక్షర పర్యంతము కొనసాగించవచ్చునను నియమము చేత, నీ దండక వృత్తమునకు పింగళాది ఛందఃకర్తలు ప్రత్యేక ప్రతి పత్తి కల్పించి యుందురు. దీనినిబట్టియును దండక వృత్తముయొక్క విస్తృతి, ప్రాచుర్యమును ఊహించుటకు వీలగుచున్నది.

సంస్కృత లక్షణములందు, రెండు నగణములు తదుపరి రగణ సమూహము కలిగిన దండక వృత్తమునకు నగణద్వయము అపరిహార్య ధర్మము. ధశరథేత్యాది సర్వలఘు నామములు నగణద్వయమునకు గాని లొంగెడివి గావు. ఇట్టి యాపదను నివారించుటకు దండక మధ్య భాగమున గాక దండకాదినే నగణద్వయము నౌచిత్యవంతముగ ప్రవేశపెట్టి యుందురు.

పింగళుని తదుపరి ఛందోనుశాసన కర్తలు, వృత్తరత్నాకరుడు, ఛందోమంజరీకారుడు, పింగళుని రగణ దండక లక్షణమును తు. చ. తప్పక పాటించిరి, పింగళుడు చూపిన భేదముల కంటె నెన్నో యధిక భేదములను గూడ తెలిపియుండిరి.

ఇట్లు సంస్కృతమున దండక వృత్తమునకు లక్షణములు కనిపించినంత విస్తృతిని లక్ష్యములు మాత్రము కనిపించవు. లక్షణ కర్తల లక్షణములకు వారు చూపిన లక్ష్యములే ప్రమాణములుగ నున్నవి కావున సంస్కృత సాహిత్యమున దండకమునకు ప్రాచుర్యము, ఆదరణ లేదని చెప్పవచ్చును.

లక్షణ కర్తలు లక్ష్యము లాధారము గొనియే లక్షణములను నిర్వచింతురు గదా! అట్టియెడ సంస్కృత సాహిత్యమున లక్ష్యములు లేవనుటకు ప్రమాణ మేది? యనవచ్చును. ఛందోమంజరికారుడు 'గంగాదాసు', అక్షర సంఖ్యను గురు లఘువుల నాధారముగ జెప్పిన కొన్ని లక్షణములకు హిందీ సాహిత్యమున లక్ష్యములు కన్పించు చున్నవి. భక్తి కాలమునకు చెందిన 'కేశవదాసు' (క్రీ. శ. 16 వ శతాబ్ది) రామచంద్రిక యందు గురులఘువుల నాధారణముగ, అక్షర సంఖ్య ప్రమాణముగ జేసికొని, కొన్ని దండకములను రచించి యుండెను. ఛందోమంజరికారుడు గంగాదాసు కూడా కేశవదాసు కాలము నాటివాడే (క్రీ. శ, 16 వ శతాబ్ది) యగుట గమనించదగినది. గంగాదాసు సంస్కృతమున చెప్పిన లక్షణములకు కేశవదాసు రచించిన దండకములు సరిపడుచున్నవి. కావున లాక్షణికులు సంస్కృత మెన చెప్పిన లక్షణముల కన్నిటికిని, సంస్కృత సాహిత్యము నందలి లక్ష్యములనే ప్రమాణముగ గ్రహించి రని తలపనవసరము లేదు.

ఇట్లు సంస్కృతమున కనిపించు దండక లక్ష్యములు సంఖ్య యందు స్వల్పము. ఒక అక్షరము తక్కువగ. వేయి అక్షరముల వరకు

పాడిగింప వచ్చునని తెలిసినను నిడివియందలి స్వల్పము లైనవి. ఇందు లకు విరోధము శ్యామలా దండక మొక్కటియే.

క్రీ. శ. 230 ప్రాంతమువాడుగ భావింపబడుచున్న 'భవభూతి' తన 'మాలతీ మాధవ' నాటకము నందు సూత్రధారుని ముఖమున దేవీ స్తుతిపరముగ నొక దండకమును చెప్పించి యుండెను. అది పంచ మాంకమున 'మాలతి' ప్రవేశించు సందర్భములోనిది. ఇది సంగ్రామ మను పేరున పిలువబడు దండకము. సమపాద సమన్వితమైనది. కనిపించునంత వరకు నిదియే ప్రాచీనతమమైన సంస్కృత దండక లక్ష్యము.

దం. "ప్రచలిత కరి కృత్తి పర్యన్త చంచన్నఖాఘాత భిన్నేందు
నిష్యంద మానామృతశ్చ్యోత జీవత్కపాలావలీ ముక్త చండాట్ట
హాసత్రసద్భూరి భూత ప్రవృత్తి స్తుతి।
శ్వసి దసిత భుజఙ్గ భోగాంగద గ్రంథి నిష్పీడ నోత్ఫుల్ల
ఫుల్లాత్ఫణా పీఠ నిర్యద్విషజ్యోతి రుజ్జృంభణోడ్డామర వ్యస్త
విస్తారి దోఃఖండ పర్యాసిత క్ష్మాధరమ్ ।
జ్వలద పిశఙ్గ నేత్రచ్ఛటా భారి భూమోత్తమాఙ్గ భ్రమి
ప్రస్తుతా లాత చక్రక్రియా స్యాత దిగ్భాగ ముత్తుంగ
ఖట్వాంగ శృంగధ్వజోద్ధూతి విక్షిప్త తారాగణమ్।

ప్రముదిత కటపూత నోత్తాల వేతాల స్ఫుటన్కర్ణ సంభ్రాంత గౌరీ ఘనాశ్లేష హృష్టస్య మన్ముగ్ధ స్త్యంబకానందిన స్తాండవం దేవి భూయా దరిష్టైహ్య హృష్టైయ్యచనః । పంచమాంకము. శ్లో. సం. 25

ఈతడు దండకము తాండవ నృత్యమున కనువుగ రచించెను. లేక, భవభూతి కాలమునకు దండయొక సంప్రదాయ గీతముగ ప్రయుక్తమయి యుండవలెను. ఈ విషయము దండకేతివృత్తమును బట్టి భావించవచ్చును.

దండకము చివరి పాదమున 'గౌరీ ఘనాశ్లేష హృష్టాస్త్ర్యైబం కానందివ స్తాండవం దేవి' అని తాండవ నృత్యమున కనువుగ సభి వర్ణింప బడినది.

చివరి పాదముననే 'వేతాల తాల స్ఫురత్కర్ణ సంభ్రాంత' అని తాలబద్ధ మైనదిగ వచించుట జరిగినది.

హస్తి చర్మము, చంద్రుడు, ముండమాల, సర్పములు మొదలగునవి అంగహారములుగను, ఖట్వాంగమను ఆయుధ విశేషమును, కటపూత యమ పిశాచి విశేషమును వర్ణితములైనవి.

కావున తాండవ నృత్యమున కనువుగ దండకమును రచించుట వలనను, తాలబద్ధమైనదిగ నభివర్ణించుటచేతను, దండకమొక సంప్రదాయ గీతవిశేషముగ భావింప వీలగుచున్నది.

క్రీ. శ. 1050–1100 ప్రాంతమువాడైన "కృష్ణమిశ్రుడు" తాను రచించిన 'ప్రబోధ చంద్రోదయ' నాటకాంతర్గతముగ దండకము నొకదానిని రచించియుండెను. [2] ఇదియును దేవీస్తుతిపర మైనదే.

ఇక కాళిదాస కృతముగా భావింపబడెడి 'శ్యామలా దండకము' సంస్కృతమున సుప్రసిద్ధమైనది. సంస్కృత సాహిత్యమున ననుటకంటె సంస్కృతాంధ్ర సాహిత్య పరిచయముగల ప్రజ ఎక్కువగా నాదరించిన దండకరూప శ్యామలాస్తుతి యనుట లెస్స. ఈ దండకము కాళిదాస కృతమని జనశ్రుతి దప్ప వేరు ఆధారము గానరాదు. క్రీ. శ. 1'వ, శతాబ్దము నందుండిన కాళికాదేవి భక్తుడు పురాంతకుడను కవి, ఈ దండకమును జెప్పి ధారా నగరాధీశుడగు భోజుని వలన నూరు అగ్రహారములను పొందెననియును ఐతిహ్య మొకటి గలదు. "సంస్కృత వాఙ్మయ చరిత్ర"కారులు కీ. శే. మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు శ్యామలా దండకమును కాళిదాస కృతముగా భావించలేదు. [3]

కాళికాదేవి స్తుతిపరమైన శ్యామలా దండకము నాలుగు పాదములతో కొనసాగినను సమాక్షర సమన్వితము గాదు. ఈ శ్యామలా దండక మేగాదు. కృష్ణమిశ్రుని ప్రబోధ చంద్రోదయము నందలి దండకమును సమ పాదములు కలిగినది గాదు.

ఇట్లు సంస్కృతము నందు కనిపించిన మూడు దండకములలో రెండు కాళికాదేవి స్తుతిపరమైనవి. ప్రత్యేకాకృతిలో వెలువడిన దండకము శ్యామలా దండక మొక్కటియే.

దం. "జయ జనని సుధా సముద్రాంత రుద్యన్మణి ద్వీప సంరూఢ
బిల్వాటవీ మధ్య—— పాహిమాం పాహిమాం
పాహిమాం దేవి తుభ్యం నమో దేవి! తుభ్యం నమో దేవి!
తుభ్యం నమోమ్!"

దండకాంతము నందలి నమోవాకము తెలుగు దండక లక్ష్యముల అంతము నందలి నమస్కృతికి ప్రేరకము అని చెప్పవచ్చును.

కాళిదాసు రచనగా చెప్పబడుచున్న శ్యామలా దండకము కాళిదాసు, పురాంతకులలో నెవరు రచించినను, తెలుగు దండక సాహిత్యము కంటె స్వతంత్ర దండక రచన సంస్కృతము నందే ప్రథమముగ నుద్భవించిన దనుటకు తార్కాణమగును.

ఇట్లు సంస్కృత సాహిత్యమున దండక రచనలు అతి విరళముగ కనిపించును. ఈ లక్ష్యములు తెలుగు దండక సాహిత్యమునకు ప్రాతిపదికలయినను, సంస్కృత దండక రచనలను సంస్కృత కవుల కంటె, తెలుగుకవులే అధికముగ నాదరించి, పోషించిరనుట నిర్వివాదాంశము. తమ కావ్యము లేదా రచన తెలుగుభాష యందొనరించుచున్నప్పటికిని దండక వృత్తము రచించు పట్టున శ్రీనాథాది తెలుగు కవులు సంస్కృత భాష యందే రచించి యుండిరి.

సంస్కృత భాషయందు విరళముగ కనిపించెడి దండకములు, తెలుగున ప్రచురముగ రచింపబడినవి. ఈ దండక వృత్తమునకున్న విస్తృతి, స్వరూప, స్వభావ, వికాసములు మరి యేయితర వృత్తమున కును లేవనుట సత్యదూరము కాదు. సామాన్య జనులు, పండితుల నోళ్ళలో నప్రయత్న పూర్వకముగా నలుగుచూ, నడచుచున్నదే గాని, ఇదియొక ప్రత్యేక శాఖ యని యాలోచించుటకు తావునీయదు. ఛందోనుశాసనకర్త అనియతపాది గణసమన్వితమైన దండకములను గద్య దండకములని విభాగించి యుండెను. తొమ్మిది వందల తొంబది తొమ్మిది- వేయి అక్షరములకు వ్యత్యాస మొకే అక్షరము. కావున 999 అక్షరముల వరకే రచింపవలె నను నియమము పాటింపబడునది గాదు. గద్యమువలె కనిపించును. పద్యమేగాని, గద్యము కాదని చెప్పవచ్చును.

ఇట్టి దండక వృత్తము సంస్కృత సాహిత్యమున దేవీ స్తోత్రముగ కనిపించిన, తెలుగున ప్రథమముగ శివస్తుతి పరముగ కనిపించును.

సంస్కృతాంధ్ర సాహిత్యముల యందు భగవన్నుతి పరముగ వినియోగింపబడిన దండక వృత్తము, కాలక్రమమున తెలుగున శృంగార సంబంధిగా పరిణమించినది. సాంఘికేతివృత్తములకు వినియోగింపబడినది. ధారాళముగ చెప్పెడి భావమేది యైనప్పటికిని దండక వృత్తము తగినదను ఆలోచనను రేకెత్తించినది. ఒక ప్రాంతీయ సంఘటనలకు గాని, ఒక గ్రామ దేవతకుగాని సంబంధించిన దండకములు వెలసినవి. హేళన పూర్వకముగ వస్తువుతో కాఫీ, టీ, పొగాకు, డబ్బు మొదలగు వాని నుద్దేశించి యాయా నామములతో దండకములు పుట్టినవి. అంతియేగాక జుగుప్సావహమైన తిట్లు గూడ దండకమున రచింపబడి, ప్రాథమికముగా గుర్తింపబడిన ప్రయోజనమునకు విఘాతము కలిగినది. సంభాషణములకు, వర్ణనములకు నాలవాలమైనది. వృత్యను

ప్రాసలు, లోకోక్తులు నల్లుకొనినవి. అనర్ఘళమగు ధారతో, సర్వ విధముల తన స్వరూపమును సుస్థిరము చేసికొనినది.

పలుతావుల పయనించిన దండకము తెలుగున పురాణములు, ప్రబంధములు, అచ్చతెలుగు కావ్యములు, ద్వ్యర్థి కావ్యములు, యక్షగానములు, నాటకములు, చిత్ర కావ్యములు మొదలగు ప్రక్రియల యందంతటను తన రూపమును వటవృక్షము ఊడలు మాదిరిగ విస్తరింపజేసికొనినది.

ఇట్లు వేయి సంవత్సరముల నుండి అవిచ్ఛిన్నముగ విరాజిల్లు చుండిన తెలుగు దండకమును ఒకే బిగింపులో పరిశీలించుట సులభ సాధ్యము గాదు. కనుక నీవేయి సంవత్సరముల కాలపరిమితిని కొన్ని యుగములుగ విభజించి, యాయా యుగము లందేయే కవులు దండక రచన గావించిరో అది వివిధ దశలలో కొనసాగిన తీరు, ప్రాచుర్యము మొదలగు విషయములను గ్రంథాంతర్గతములు - స్వతంత్రములలను పునర్విభాగములతో పరిశీలించుట యుచితము కాగలదు.[4] ఆ విభజన యిది. —

1. పురాణేతిహాస యుగము. (క్రీ.శ. 11 శ. నుండి 14 శ.వరకు)
2. కావ్య ప్రబంధ యుగము. (క్రీ శ. 15 శ. నుండి 16 శ.వరకు)
3. దక్షిణాంధ్ర యుగము (క్రీ. శ. 17 శ. నుండి 1850 వరకు)
4. ఆధునిక యుగము. (క్రీ. శ. 1850 నుండి నేటి వరకు)

## 3—1. పురాణేతిహాస యుగము :— (క్రీ. శ. 11 నుండి 14 వరకు)

### 3-1—1, గ్రంథాంతర్గతములు :-

ఈ యుగమున వెలసిన ప్రప్రథమ కృతి ఆంధ్రమహాభారతము, ఆంధ్రమహాభారతము, నృసింహ పురాణము, మార్కండేయ పురా

ణముందు దండకము, కేవలము భగవన్నుతి పరముగనే వినియో గింప బడినది. అందున పలు దృక్పథములుగల వ్యక్తులకు పలువిధము లుగ గోచరించెడి మహాభారతము నందు, పురాణ నామాంకిత కృతుల యందును రచింపబడుటచేత నీయుగము పురాణేతిహాస యుగముగా పేర్కొనబడినది.

తెలుగు దండక సాహిత్యమునకు ఆద్యుడు నన్నయ. తెలుగు తల్లి యేనోముల పంటయోగాని నన్నయగారిని కన్నది. సంస్కృత మున స్తోత్రపరముగ, శ్లోకరూపమున వినియోగింపబడిన భావమును నన్నయ తెలుగున దండక రూపకముగ మలచి వేయి సంవత్సరముల దండక సాహిత్యమునకు మార్గదర్శి యాయెను. ఆంధ్రమహాభారత ములో, అరణ్య పర్వమున అర్జునుడు పాశుపతాస్త్రకాంక్షియై పరమే శ్వరుని గూర్చి తపము జేయును. అర్జునుని తపమునకు మెచ్చి పరమే శ్వరుడు ప్రత్యక్షమగును. ఈ సందర్భమును పురస్కరించుకొని, పరమేశ్వరుని గూర్చి అర్జునుడు చేసిన స్తోత్రమును నన్నయ ఈ క్రింది విధముగ దండక రూపమున రచించెను.

దం. "శ్రీకంఠ లోకేశ లోకోద్భవస్థాన సంహారకారీ మురారి ప్రియా
చంద్రధారీ మహేంద్రాది బృందారకానంద సందోహ సంధాయి
పుణ్యస్వరూపా విరూపాక్ష దక్షాధ్వర ధ్వంసకా దేవ నీదైన
తత్త్వంబు భేదించి బుద్ధి ప్రధానంబు విజ్ఞాన మధ్యాత్మ యోగంబు
సర్వక్రియా కారణంబంచు నానాప్రకారంబులన్ బుద్ధిమంతుల్
విచారించుచున్ నిన్ను భావింతు రీశాన! సర్వేశ్వరా! శర్వ సర్వజ్ఞ
సర్వాత్మకా నిర్వికల్ప ప్రభావా భవానీపతీ నీవు లోకత్రయీ
వర్తనంబున్ మహావాయు ఖాత్మాగ్ని సోమార్క తోయంబులం
జేసి కావించి సంసార చక్రక్రియా యంత్రవాహుండవై తాదిదేవా !

మహాదేవ! నిత్యంబు నత్యంత యోగస్థితిన్ నిర్మలజ్ఞాన దీపప్రభా
జాల విధ్వస్త నిస్సార సంసార మాయాంధకారుల్ జితక్రోధ
రాగాది రోషుల్ యతాత్ముల్ యతీంద్రుల్ భవత్పాద పంకేరుహ
ధ్యాన డిండీర ధారానుభూతిన్ సదాతృప్తులై రవ్యయా భవ్య సేవ్యా
భవా! భర్గ! భట్టారకా! భార్గవాగత్స్యకుత్సాది నానా మునిస్తోత్ర
దత్తావధానా లలాటేక్షణోగ్రాగ్ని భస్మీకృతానంగ భస్మానులిప్తాంగ
గంగాధరా! నీ ప్రసాదంబునన్ సర్వ గీర్వాణ గంధర్వులున్ సిద్ధ
సాధ్యోరగేంద్రా సురేంద్రాదులున్ శాశ్వతైశ్వర్య సంప్రాప్తులై
రీశ్వరా విశ్వకర్తా సురాభ్యర్చితా నాకు నభ్యర్థితంబుల్ ప్రసాదింపు
కారుణ్యమూర్తీ త్రిలోకైకనాథా నమస్తే నమస్తే నమః"

(ప్రథమాశ్వాసము. ప. సం. 324)

ఈ దండకము శ్రీకారముతో ప్రారంభింపబడినది.[5] 'నమస్తే నమస్తే నమః' అను నమోవాకముతో ముగియుచున్నది. ప్రప్రథమాంధ్ర దండక మయినప్పటికిని, గణముల కూర్పున నన్నయ సంస్కృత పరిపాటిని విడిచి క్రొత్త పుంతను త్రొక్కెను. తగణముతో ప్రారంభించబడినది. తక్కిన గణము లన్నియును తగణములై యుండి అంతమున నొక గురువుతో ముగియుచున్నది.

తెలుగున తగణ దండకము నన్నయతోనే ప్రారంభ మయినది. సంస్కృత లాక్షణికుడు వృత్తరత్నాకరకారుడు తగణదండక భేదమును చెప్పినప్పటికి దండకాదిని నగణద్వయమును విడువలేదు. అట్లే హేమచంద్రుడు కామబాణ మను మరియొక తగణదండక భేదమును పేర్కొనినప్పటికిని దండకాంతమున రెండు గురువులు కలిగినట్గా తెలిపియుండెను.

నన్నయ పై లక్షణముల ననుసరించిగాక, నొకే గురువు

నంతమున నిలిపి తగణదండక రచన జేసెను. ఈ దండకమును నూట ముప్పది నాలుగు తగణములతో, ఇరువది తొమ్మిది విశేషణములతో రచించెను.

"తెలుగు సాహిత్యమున వెలసిన ప్రప్రథమ దండకము మూలమున స్తుతిపరముగ శ్లోక రూపమున నున్నది.[6]" శ్లోక రూపమున నున్న మూల భావమును తెలుగున దండకముగ మలచుట నన్నయ గారి మరియొక ప్రత్యేకత.

కృతకమగు ప్రయత్నముతో చేసిన భక్తిపూర్వక స్తుతి వేరు. భగవంతుని దర్శించుటతో హృదయము నందలి భావము ఒక్కమారుగ నుప్పొంగి యప్రియత్న పూర్వకముగా ప్రవహించు శబ్ద జాలము వేరు. మహాశిఖరము నుండి క్రిందికి జాలువారి ప్రవహించు జలపాతము వంటిదీ. దండక రూపమున సాగిన భక్తి భావన. పాదము విడిచి మరియొక పాదమునకు అడుగిడుటలో భక్తి భావమునకు విఘాతము కలుగును. అంతర్లీనమగు యీభావన నొక్కమారుగ చెప్పవలెనని దండక వృత్తమే మిక్కిలి తగినది. ఏకోన సహస్రాక్షర పర్యంతము దండక వృత్తమును నడుపవచ్చును గదా! లేదా గద్య దండకముగనైనను కొనసాగించవచ్చును గదా ! కావున స్తోత్రభావము దండకరూపమున మిక్కిలి రక్తికట్టును.

ఇట్లు దండకమును భక్తిప్రపత్తులు బహిరపర్చుటకై వినియోగించుటకు సంస్కృత సాహిత్యమునందు గూడ భక్తిపూర్వకముగ రచింపబడుట అంతఃప్రేరణయని చెప్పవలెను.

ఆంధ్రమహాభారతమున నీదండక వృత్తమును నన్నయ ఒక్కడే రచించెను. తిక్కన, ఎర్రనల భారత భాగములందు దండకము కనబడదు. తదుపరి కవులెందరో దండకవృత్తమును నన్నయ యొనరించిన రీతినే అనుసరించి యుండిరి.

తిక్కన శిష్యుడైన 'మారన' (క్రీ. శ. 13 వ శతాబ్ది) తన మార్కండేయ పురాణాంతర్గతముగ, శుంభుని సంహరించిన నారాయణిని దేవతలు స్తుతించు సందర్భమున దండకరచన గావించి యుండెను.[7]

దం. "శ్రీవిష్ణుశక్తీ! జగన్మూల శక్తీ! మహాశక్తి నారాయణీ! దేవి! మా మ్రొక్కు గైకొమ్ము, కాష్ఠాది కాల స్వరూపంబులంజేసి పాకంబు గావించి లోకంబుల న్మ్రింగు నారాయణీ! దేవి! మా మ్రొక్కు గైకొమ్ము ... ... బాధలంజెంద కానందలీల న్సుఖంబుండ గాంచు న్నమస్తె భద్రా! నమస్తేక పుణ్యా! నమస్తే నమస్తే నమః"

ఈ దండకమున 'నారాయణీ! దేవి! మామ్రొక్కు గైకొమ్ము' అను ప్రార్ధనా వాక్యము పండ్రెండుమారు లుపయోగించుటనుగూర్చి "నడుమనున్న యావృత్తి పాటలో పల్లవి వలె ప్రవర్తించును. ఆవృత్తికి, ఆవృత్తికి నడుమనున్న దూరము మారుచు వచ్చినది. చివర నందబోవు అనుభూతికి ఈ యావృత్తులు క్రమ సోపానములై సహకరించుచున్నట్లు గోచరించును."[8] అని 'స్ఫూరిశ్రీ' గారు తమ అభిప్రాయమును వెలిబుచ్చియుండిరి.

క్రీ. శ. 13, 14 శతాబ్దులదుండిన 'ఎర్రన' తన భారత భాగమునందు దండక రచన చేయలేదు. అట్లని తన 'నృసింహ పురాణము'న వీడను లేదు. నృసింహస్వామికృత హిరణ్యకశిపుని వధానంతరము, దేవతలు, మునులు, నృసింహస్వామిని స్తుతించు సందర్భమున దండకమును రచించి యుండెను.[9] అది—

దం. "శ్రీనాథ నాథా జగన్నాథ నమ్రైకరక్షా సమక్షా సరోజాక్ష సర్వాభివంద్యా మహానంద గోవింద నీవెందు నీవిశ్వ దృశ్య

ప్రపంచంబునన్ నిండి యొండొండ ... ... యీ భవ్య
దివ్యావతారోదయ స్ఫూర్తి నాపూర్తమై యొప్ప నీయొప్ప
మప్పొప్పు లక్ష్మీశ యీశా నృసింహా నమస్తే డమస్తే
నమస్తే నమః"

నన్నయ, సూరనలు నమోవాకమును మూడుమారులు ప్రయోగించి యుండగా, ఎర్రన నాలుగు మారులు ప్రయోగించి యుండెను. వందలకొలది గణములు ఏకధారగ కొనసాగు దండకమును ముగించునపుడు 'నమస్తే నమస్తే నమస్తే నమః' అని నాలుగు మారులు ప్రయోగించిన నమోవాకమే భావమునందలి వేగము నుప శమింప జేయుటకు తగినదిగ గోచరించును.

3-1-2. స్వతంత్రములు :-

తెలుగు సాహిత్యమున స్వతంత్ర దండకరచన గూడా నీయుగ మునసే జరిగినది. క్రీ. శ. 13వ శతాబ్ది ఉత్తరార్థమునకు చెందిన 'పాల్కురికి సోమన' తన 'పండితారాధ్య చరిత్రమున' పండితుని రచనలను పేర్కొనెను. అందు పండితుడు 'మానిదండకము' అను నొక దండకమును రచించినట్లు తెలియుచున్నది. [10]

"మలయ రాజీవంబు మాని దండకము
స్తుతి మూలమగు మహాస్తోత్ర సూత్రముల
శతకంబు శివతత్త్వసారంబు, దీప
కళిక, మహానాటకము, నుదాహరణ
ములు, రుద్ర మహిమయు, ముక్తావళులు
గీత సూక్తములు, భృంగి స్తవములు, బు
రాతన మునిముఖ్య రచితాష్టకములు"

(పర్వత ప్రసరణము)

పండితుని రచనగా తెలియుచున్న 'మహాని దండకము' నేడు నామమాత్రావశిష్టమై యున్నది. అది యేభాషయందు రచింపబడినదో గూడ దురూహ్యము. ఆకృతి నేడు అనుపలభ్య మయినను స్వతంత్ర దండక రచనకు ఆద్యుడు పండితారాధ్యుడు. ఈతడు వీరశైవుడు గాన మహాని దండకము శివ సంబంధియైన దనుటలో విప్రతిపత్తి యుండదు.

సోమన కాలముననే "చక్రపాణి రంగనాథుడ"ను కవి వేయి పాదములు గల స్వతంత్ర దండకము నొకదానిని రచించెనని తెలియుచున్నది ఈ చక్రపాణి రంగనాథుడు పాల్కురికి సోమనాథుని తనయుడైన "చతుర్ముఖ బసవేశ్వరు" నిచే వాదమున నోటమినిపొంది యాతనిచే శివదీక్షను పొంది శైవుడయ్యెను. "తొల్లి వైష్ణవుడుగా నుండిన చక్రపాణి రంగనాథుడు శైవుడయినాడు. కర్ణాట కృతి 'గురు రాజ చరిత్ర' యందు తత్కర్త 'సిద్ధనంజేశకవి' రంగనాథుని యోట మిని గూర్చి చెప్పుచూ నాతని గ్రంథములను గూడ పేర్కొనెను. అందు చక్రపాణి రంగన వెయ్యి పాదములు గల దండకమును రచించె[11] నను విషయమును కీ. శే. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు తెలియ జేసియుండిరి.

"శ్రీశైల భర్తకును సీసంగళేనూరు
వేనొప్ప పద్యంగళెంటు సారవిగళుం
భాసుర దండకం సాహస్ర, తారావళియు, నాల్కు లయ
గ్రాహియు, ఆగతక వృత్తగళు దోధకం నివిరవు"

(చాటుపద్య మణిమంజరి)

శ్రీశైల మల్లికార్జునిపై అయిదు వందల సీస పద్యములను, ఎనిమిది పద్యములు గల వేరొక గ్రంథమును, వేయి పాదములు గల దండకమును, ఒక తారావళియును, నాలుగు లయగ్రాహులును ఇంకను మరికొన్ని కృతుల నాతడు రచించియుండెనని తెలియుచున్నది.

శైవుడుగా మారిన తదుపరి శివసంబంధి కృతులు రచించుట వలన రంగనాథుడు రచించిన వేయి పాదములు గల దండకము గూడ శివ సంబంధియైన, స్తుతిపూర్వకమైన రచన యనుటకు వీలున్నది. వేయి పాదములు గల దండకము గనుక పాదము నొక దండకముగ గ్రహించిన పది దండక శతకములుగ భావించవచ్చును.

ఈ విధముగ పురాణేతిహాస యుగముననే స్వతంత్ర దండక రచన జరిగినది లఘు కృతులును, కేవల స్తుతి పూర్వకములు నగుట వలన నామమాత్రావశిష్టములైనవి.

### 3–1–3. పురాణేతిహాస యుగవిశిష్టత :–

గ్రంథాంతర్గతముగను, స్వతంత్రముగను తొలి దండక రచన ఈ యుగముననే ఆవిర్భవించినది.

తొలి తెలుగు దండకమున శ్రీకార మాదిని నిలిపి, నమో వాకముతో నంతము జేయు సంప్రదాయము నెలకొనినది. అనంతర దండక సాహిత్య మందంతటను ఈ సంప్రదాయములు అపారమైన ప్రభావమును జూపినవి. ఈ సంప్రదాయములకు పునాది వేసినది ఆదికవి నన్నయయే.

ఒక గురువునే అంతమున నిలిపి సంపూర్ణముగ తగణముతో దండక రచన చేయుట యీ యుగము నందే ప్రారంభ మయినది. ఈ నియమమునే అనంతర కవులెందరో అనుసరించిరి.

ఈ యుగమున దండకము స్తుతిపూర్వకముగ వెలసినది. అనంతర కవులు అందునను ఈ యుగము నందలి కవులు కేవల స్తుతి పూర్వకముగనే దండకములు రచించిరి.

దండకమును ఏకపాదముగనే రచించుట యీ యుగమునందలి మరియొక ప్రత్యేకత. ఇందులకు విరుద్ధముగ చక్రపాణి రంగనాథు

నిచే రచింపబడిన వేయిపాదములుగల దండక మొక్కటియే కనిపించును.

గ్రంథాంతర్గతములైన దండకములు వివిధ దేవతామూర్తులు అనగా శివ, విష్ణు, నారాయణి సంబంధులుగ కనిపించిన, స్వతంత్ర దండకములు రెండునూ కేవల శైవ సంబంధిగనే వెలసినవి.

తెలుగున ఉదాహరణ, ద్విపద, శతకాది ప్రక్రియలకు ఆద్యులయిన శివకవులే స్వతంత్ర దండకరచనను గూడ చేపట్టుట యీ యుగము నందలి మరియొక విశిష్టత.

తెలుగు సాహిత్యమున సమగ్రమగు తొలి సాహిత్యరచనగా తలపబడు భారతము నుండియు దండక సాహిత్యము కనిపించును. దండక సాహిత్య ప్రాచీనతకిది నిదర్శనము.

కావ్యాంతర్గతములుగ వెలసిన మూడు దండకములును పురాణాంతర్గతములే. తెలుగుభాషా సంబంధి యైనవియును. నన్నయ రచించిన దండకము అర్జునకృత స్తోత్రముగ, నేక ముఖముగ వెలువడగా, సూరన, ఎఱ్రన కృతులందు మునులు, దేవతల సమూహముచే దండకములను స్తోత్రప్రాయముగనున్న మూల శ్లోకములను యథాతథముగ దండక రూపమునకు పరివర్తింపజేసినవే.

తెలుగు దండకమునకు లక్షణ నిర్దేశము కూడ ఈ యుగముననే జరిగినది. కవిజనాశ్రయ లక్షణ గ్రంథ కర్త భీమన (క్రీ. శ. 13పూ) యీ యుగము నందలి లాక్షణికుడు. ఈతడు చెప్పిన దండక లక్షణములలో నీ యుగమున వెలసిన లక్ష్యములతో పొత్తుకుదరని లక్షణము కూడ నున్నది. ఈ యుగమున యేకవియును నీతని లక్షణమున కనుకూలముగ న,స,హ గణములపై తగణరచన కొనసాగించలేదు.

ఈ విధముగ తెలుగు దండక సాహిత్యము గ్రంథాంతర్గతముగను, స్వతంత్రముగను నీ యుగముననే యావిర్భవించినది. ఎన్నియో

సంప్రదాయములకు మార్గదర్శకమైనది. బాగుగ వేళ్లూనుకొని రెండు కొమ్మలు వైచినది.

## 3-2. కావ్య ప్రబంధయుగము : (క్రీ. శ. 15, 16 శతాబ్దులు)

నన్నయాదుల సృజన స్వాతంత్ర్యము ఈ యుగము నందలి దండక రచనకాధారభూతమైనది. తత్ఫలితముగ నీ యుగమున వెలసిన పెక్కు కావ్యములందు దండకరచన జరిగినది. పురాణేతిహాసయుగమున కవుల సంఖ్యయందు లోటు లేనప్పటికిని వారి దృష్టి కథా కథనము వైపున్నది గాని, కవితా పరముగ వారు చమత్కారముల జోలికి పోయినవారుగారు. శివకవుల దృష్టిలో మతము ప్రాధాన్యము వహించినది. పాల్కురికి సోమనాథుడీ దండకరచన దరిజేరినవాడుగాడు. దండకరచన యీ యుగముననన్నయాది కవుల కాలమున కంటె నధికాదరణ పాత్రమైనది.

స్వతంత్ర దండకరచన తత్పూర్వమే జరిగినప్పటికిని, నీయుగము నుండియే స్వతంత్ర దండకములు సాహిత్యమున కాలూనుకొనినవి. తత్ఫలితముగ నీ యుగమునందే గాక యనంతర యుగములందు గూడ స్వతంత్ర దండకరచన అవిరళముగ సాగినది. ఇంతదనుక దండకము కేవలము స్తుతిపరముగ కొనసాగినను ఒక్కమారుగ మలుపు శృంగార రసాత్మకమైనది. పింగళి సూరన రచనతో నది యధిక ప్రాచుర్యము నొందినది. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన స్తుతి ప్రబంధముగ గూడ గుర్తింపు నొందినది.

14 వ శతాబ్దమున జీవనయాత్ర ప్రారంభించి, 15 వ శతాబ్దమున నధిక సంఖ్యలో కృతులు రచించిన శ్రీనాథునితో నీ యుగము ప్రారంభమైన దనుకొనవచ్చును. అంతియేగాక కవులు తాము రచించిన కావ్యము లన్నిటియందును విధిగ దండకరచన చేయుట యీ యుగము నుండియే కనిపించును. ఈ తత్త్వమునకు శ్రీనాథుని రచనలు ప్రేరణయని చెప్పవచ్చును.

3-2-1. గ్రంథాంతర్గతములు :-

శ్రీనాథుడు తన శృంగార నైషధ, హర విలాస, కాశీ ఖండ ముల యందు దండకరచన చేయుటయే గాక, తెలుగున సంస్కృత దండక లక్షణమున కనువుగ సంస్కృతభాష నాధారముగా జేకొని దండకమును రచించియుండెను.

ఇతడు రచించిన శృంగార నైషధ మహాకావ్యము నందు దమయంతి తండ్రి భీమభూపతి ముఖముగ సరస్వతీదేవి స్తుతిని దండక రూపమున వెలువరించెను.[12] దమయంతీ స్వయంవర సమయమున ఆహూతులగు రాజుల గుణగణములను వర్ణించి చెప్పుటకు దేవియే తగినదిగ భీమభూపతి తలపోసెను. తాను తలపెట్టిన కార్యము సఫలము నొందుటకు భారతీదేవిని గూర్చి ఈ క్రింది విధముగ స్తుతించెను.

దం. "జయ జయ జనయిత్రి కళ్యాణ సంధాత్రి గాంధర్వ విద్యాకళా
కంఠనాళాం త్రివేదీవల్లీం ...... దేవి వన్దే త్వామహమ్.
భగవతి గుణదీర్ఘ భావోద్భావాం సంతతం సందధానాం మహాశబ్ద
నిష్పాదకం వ్యాక్రియాశాస్త్ర కాక్షీకలాపం... విద్యా
మయీం త్వాంభజే.
ద్రుహిణ గృహిణ మత్స్యపద్మాది సంలక్షితం పాణిపద్మం
త్వదీయం పురాణం శిరస్త్రావకం, నిర్మలం, ధర్మశాస్త్రం ......
పరిణీన్యే స్వయమ్.
భవతు మమసదా శుభం భారతి త్వత్ప్రసాదా దసాధారణా
సత్కృపాధారభూతం ప్రభూతం — — నమస్కారదాయై
నమస్తే నమస్తే నమః"

తెలుగు సాహిత్యమున సరస్వతీదేవి స్తుతిపరమగు ప్రప్రథమ దండకమిది. నాలుగు పాదములతో సంస్కృత లక్షణోక్తముగ,

సంస్కృత భాషయందు రచింపబడిన ప్రప్రథమ కావ్యాంతర్గత దండకము నిదియే. నాలుగు పాదములందునను గణసంఖ్య సమానముగ లేదు. క్రమముగ 40, 68, 27, 47 రగణములు నగణద్వయముపై రచితమైనవి. రెండు నగణములపై ఇరువదియేడు రగణములు నిలిపిన దండకమును 'సత్కార' మను నామమున పిలువబడును. కాని యిట్లు పాదపాదమునకు తెలుపుటకు వీలులేదు. లాక్షణికులు కేవలము ప్రత్యేక దండక విషయమున తెలిపిరిగాని పాదమునకు గాదు. తెలుగు సాహిత్యములో ప్రప్రథమ సంస్కృత గద్య దండకము నిదియే.

హరవిలాసమున దేవాసురులు క్షీరాంబుధిని మథించు సందర్భమున తమ కార్యమునకు విఘ్నము కలుగకుండగ విఘ్నరాజును స్తుతించిరి. ఈ సందర్భమును పురస్కరించుకొని శ్రీనాథుడు విఘ్నేశ్వరుని దండక రూపమున స్తుతింపజేసెను[13]. హరవిలాసముననే లింగోద్భవ ఘట్టమునందు సుర, గరుడ, ఖచర, విద్యాధర, కిన్నెర, సాధ్య, దానవముఖ్యులు పరమేశ్వరుని స్తుతించు సందర్భముననను దండకరచన గావింపబడినది.[14]

దం. "జయ జయ జగదేక రక్షామణీ దేవ చూడామణి శ్రేణి ...
ముకుంద ప్రియా ఇందుధారీ కటస్యంది దానాంబుధారాధునీ
ధోరణీ గాహ కౌతూహలాయత్త మత్తద్విరేఫాంగనా ......
యసారోరు సంసార మాయాంధకారాహుతి ప్రక్రియా
భాస్కరా... నీ యాజ్ఞ సర్వేశ! సర్వాత్మకా! నిర్వికల్పా!
నిరీహా నిరీహా!... నమస్తే నమస్తే నమః"

విఘ్నేశ్వరుని స్తుతించు పై దండక రచనపై నన్నయగారి ప్రభావము స్పష్టముగ కనిపించును. నన్నయ పరమేశ్వరుని 'మురారి

ప్రియా చంద్రధారీ బృందారకానంద సందోహ సంధాయి పుణ్య స్వరూపా' అని స్తుతింపజేసెను. శ్రీనాథుడు 'ముకుందప్రియా ఇందు ధారీ — మత్త ద్విరేఫాంగనా' అని విష్ణురాజుని స్తుతింపజేసెను. నన్నయ 'నిస్సార సంసార మాయాంధకారుల్ జితక్రోధులై రీశ్వరా' అని చెప్పగా, శ్రీనాథుడు 'యసారోరు సంసార మాయాంధకారా హృతి ప్రక్రియా భాస్కరా' అని విష్ణురాజును వర్ణించెను. 'సర్వే శ్వరా! శర్వ! సర్వజ్ఞ! సర్వాత్మకా!' అని యీశ్వర పరమైన సంబో ధనలు నన్నయ గావింపగా, 'నీ యాజ్ఞ! శర్వేశ! సర్వాత్మకా! నిర్వి కల్పా!' అని శ్రీనాథుడు విఘ్నేశ్వరుని పరముగ వినియోగించెను. పదగుంఫనమున, సంబోధనల వినియోగమున నన్నయగారు శ్రీనాథు నికి మార్గదర్శి యని చెప్పనగును.

హారవిలాసము నందలి రెండు దండకములును నగణద్వయ ముపై రగణ సమూహము కలిగినవి. ఒకటి పరమేశ్వర స్తుతిపర మైనది. మరియొకటి విఘ్నేశ్వరుని స్తుతిపరమైనది. విఘ్నేశ్వరుని స్తుతించు దండకములు తెలుగున అనేకములు గలవు. అట్టివానిలో శ్రీనాథునిదే ప్రథమము.

శ్రీనాథ విరచితమైన కాశీఖండ గ్రంథమునను రెండుమారులు దండకరచన గావించి యుండెను.[15] మొదటిది దక్షయజ్ఞ సందర్భము లోనిది. దక్షుడు యజ్ఞము చేయ తలపెట్టెను. కాని పార్వతీ పరమే శ్వరుల నాహ్వానించలేదు. భవాని పరమేశ్వరుని అనుమతి గైకొని తండ్రియగు దక్షుని యింటికి చూడ వెడలెను. దక్షుడు తన కూతు రగు భవాని రాకకు సంతసించియు, అల్లుడగు పరమేశ్వరుని దూషిం చెను. ఆ సందర్భమున దక్షునకు బుద్ధి గరపుచు భవాని పరమేశ్వరుని స్తుతించినది. రెండవ దండకము సప్తమాశ్వాసమున శంభుడు వివిధ లింగముల మహత్త్వమును విశాలాక్షికి వివరించు సందర్భములోనిది.

ఈ రెండు దండకములును గూడ నగణద్వయము మీద రగణ సమూహము కలవి. ఒకటి ఏకపాదమున నడచినది. మరియొకటి నాలుగు పాదములతో నడచినది. ఇంతదనుక రచింపబడిన పూర్వ కవుల దండకములు నమోవాకముతో ముగియుచున్నవి. కాని, కాశీఖండాంతర్గత దండకములను శ్రీనాథుడు నమోవాకముతో ముగించలేదు. "ఇందు ప్రధానమైన శ్రోత దక్షుడు. వక్త్రి సతీదేవి. విషయము శివ ప్రాశస్త్యము. వివరణ ప్రధానము భంగ్యంతరమున ప్రశంసానిర్వాహకమే గాని, సాక్షాత్తు పారాయణ యోగ్యయగాదు. అంతియేగాక క్రమ క్రమముగ నుపన్యాస వైఖరి గూడ నావిష్కరించుట జరిగినది. అందువలననే కడపట నమస్క్రియను సూచించు శబ్ద జాతము గూడ తప్పుకొన్నది.[16]" అని స్ఫూర్తిశ్రీ గారు తమ అభిప్రాయమును వెలిబుచ్చిరి.

అంత వరకును శ్రీనాథునివలె దండకరచన నెక్కువగా చేపట్టిన కవిలేడు. తదుపరి యాతనివలె దండకరచనను మిక్కిలిగా నాదరించినది బమ్మెర పోతన గారు. స్వతంత్రకృతి భోగినీ దండకము ఒకటి. భాగవతము తృతీయ, దశమ స్కంధములలో రెండును, వీరభద్ర విజయము నందలిది ఒకటి. ఇవి మూడును గ్రంథాంతర్గతములు. మొదటిది స్వతంత్రము.

భాగవతమున తృతీయ స్కంధము నందు మైత్రేయుడు విదురునకు కృష్ణ మహత్త్వమును వినిపించు ఘట్టమున దండకము రచింపబడినది.[17]

దం. "శ్రీనాథ నాథా! జగన్నాథ! నమ్రైకరక్షా విపక్ష! క్షమా
భృత్సహస్రాక్ష! నీరేజ పత్రేక్షణా!...... యోగీంద్ర
చేతస్సరోహంస! దేవాది దేవా! నమస్తే నమస్తే నమస్తే నమః"

ఈ దండకమున అద్యంతములందు పోతన - ఎఱ్ఱన ననుసరించి నాడు. ఆదిలో పొందుపరచిన మూడు విశేషణములును పోతన యథా తథముగ అనుకరించినవే.

శ్రీనాథ నాథా! జగన్నాథ! నమ్మెక్క రక్షా! సమక్షా!
సరోజాక్ష! (ఎఱ్ఱన)
శ్రీనాథ నాథా! జగన్నాథ! నమ్మెక్క రక్షా! విపక్ష క్షమా
భృత్సహస్రాక్ష (పోతన)

ఇట్లే ఎఱ్ఱన నమోవాకమును నాలుగుమారులు ప్రయోగిం చెను. పోతనయును నాలుగుమారులు ప్రయోగించియుండెను. పోతనచే తగణ మాధారముగనే ఏకపాదమున రచింపబడినది.

రెండవ దండకము దశమస్కంధము పూర్వభాగమున అక్రూ రుడు యమునానదీ జలములందు రామకృష్ణులను దర్శించినప్పటి సందర్భమున చేసిన స్తుతిపూర్వకమైన రచన.[18]

దం. "శ్రీమానినీ మానచోరా! శుభాకార! వీరా! జగద్ధేతు హేతు
ప్రకారా! సమస్తంబు నస్తంగతంబై...... పన్నగాధీశతల్పా
కృపాకల్ప! వందారు కల్పా! నమస్తే నమస్తే నమస్తే."

ఈ దండకమున దశావతార వర్ణనము, పరమేశ్వర రూప చిత్ర ణము గావించబడినవి, దండకపాదమున మూడు వందల ముప్పది మూడు గణములకంటె పొడిగించరాదను లాక్షణిక నియమము పోతన గారికి కొంత బాధాకరముగ నున్నదనియే తలపవలెను. మూడువందల యిరువది యేడు తగణములపై నొక గురువును నిలిపి దండకమును సమాప్తము చేసెను.

ఇట్లే వీరభద్ర విజయము నందు దక్షుని యజ్ఞము ధ్వంసమైన పిమ్మట, వీరభద్రుని గూర్చి మునులు, దేవతలు చేసిన స్తుతిని దండక మున రచించియుండెను.[19]

దం. "శ్రీవీర రూపా శివద్రోహగండా ప్రచండ ప్రతాపా సువర్ణాణ సంఘాత తమోభానుబింబ ప్రదీపా ...... శ్రీవీరభద్రా శరణ్యంబు రుద్రా నమస్తే నమస్తే నమస్తే నమః"

క్రీ. శ. 15వ శతాబ్దమునకు చెందిన 'దగ్గుపల్లి దుగ్గన' తన నాచికేతూపాఖ్యానమున, బ్రహ్మస్తుతి పరముగ దండకము నొక దానిని రచించి యుండెను.[20] ఈ యుగమునకు చెందినవాడే యయిన "జక్కన" తన 'విక్రమార్క చరిత్ర' కావ్యము నందు మహాకాళి స్తుతిపరమైన దండకము నొకదానిని రచించెను.[21]

ఈ యుగమునకు చెందిన 'విన్నకోట పెద్దన, అనంతామాత్యు'లు, దండక వృత్తమును లక్షణీకరించి యుండిరి. విన్నకోట పెద్దన - అలంకార, వ్యాకరణ, లక్షణ గ్రంథమగు కావ్యాలంకార చూడామణి యందుగాని, అనంతామాత్యుడు - ఛందోదర్పణము నందుగాని దండక వృత్తమును విపులముగా లక్ష్యములకు తగినట్లుగ నైనను లక్షణములు చెప్పినవారు గారు.

క్రీ. శ. 15వ శతాబ్దమునకు చెందిన 'కొరవి గోపరాజు' తన కృతియగు 'సింహాసన ద్వాత్రింశిక' యందు 'యసమగణ నిరోష్ఠ్య దండకము'ను రచించెను.[22]

దం. "జయకృష్ణ జయకృష్ణ కృష్ణ స్థిరాస్యందన స్థాన నానా దిన ధ్యాన... నానా సితానేక, సేనారజోనీక రథ్యాతి రథ్యాళి సన్నాహ సన్నద్ధ రాజన్య... సంధానితాలీల లసచ్చారిణీ గీత నీరేజ సంచారిణీ రాజ రాజాగ్రిణీ."

తెలుగు సాహిత్యమున వెలసిన ప్రప్రథమ నిరోష్ఠ్య దండక మిది. ఇంతదను కెవరును రచించని 'య, స, మ' గణములను దండకాదిది నిలిపి తగణ దండకమును రచించియుండెను. రచన సంస్కృత

భాషాశ్రితమైనది. 'కరాళాగ్ర హస్తాద్రి విశ్రాంతి' సమాసములోని 'విశ్రాంతి' శబ్దమునందలి 'వి' దంతోష్ఠ్యము. కావున పెదవి సహాయము లేనిదే ఉచ్చరించుట సాధ్యముగాదు. కొంతవరకు ముక్త పదగ్రస్తమై యొప్పును.

భైరవ కవి యొకడు (క్రీ. శ. 15 శతాబ్ది) తన "శ్రీరంగ మహాత్మ్యము" కావ్యమునందు దండకము నొకదానిని మూడు పాదము లలో రచించియుండెను.[23] రచన సంస్కృతభాషాశ్రిత మైనది. శ్రీరంగనాథుని స్తుతిపరమైనది. పాదములు మూడును సమాన దైర్ఘ్యము గలవి గావు. గణ విచ్ఛిత్తి జరుగును.

తెలుగు సాహిత్యమున తొలి జంటకవులయిన "నంది మల్లయ-ఘంట సింగన"లు (క్రీ. శ. 15 పూ.) రచించిన వరాహ పురాణము నందును, ప్రబోధ చంద్రోదయము నందును దండక రచన చేసి యుండిరి. వరాహపురాణమున మూడుమారులును, ప్రబోధ చంద్రో దయమున యొకమారును రచించిరి. వరాహ పురాణమున షష్ఠాశ్వా సము నందలిది బ్రాహ్మణులు, దేవతలు చేసిన శివ స్తుతిపరమైనది.[24] నాలుగు పాదములతో నడచిన తగణ దండకము. సమాక్షర సమన్వి తము. ఇందు మొదటి పాదము రెండు నగణములపై హగణము, తదుపరి తగణములతో రచింపబడగా, తక్కిన మూడు పాదముల యందును హగణము విడువబడి నగణద్వయముపై కేవల తగణముతే రచితమైనవి. మొదటి రెండు పాదములు సంస్కృత భాషాశ్రితముగ రచింపబడగా, తక్కిన రెండు పాదములును తెలుగునందు రచింప బడినవి. గీర్వాణాంధ్రములందు అందెవేసిన చేయి యని చెప్పుకొనుటకు గాబోలు, జంటకవులిరువురిలో ఒకరు రెండు పాదములను, మరియొకరు రెండు పాదములను రచించి యుండవచ్చు. లేదా సంస్కృతాంధ్ర ముల "సమపాళ్ళతో" కవిత్వము చెప్పుట గాబోలు,

దం. "జయ జయ జగదీశ యీశాన కాశాహిపాకాశ... కోదండా యుధ ధ్వంసకా. గజ రజ నిచరాంతఃపురీ ధమ్మిల్ల... దుర్గా మనోనాయకా. పరమ పురుష రూపంబు నీవున్ మహాశక్తి... బ్రహ్మాండమున్ దాల్తువై రాజరూపంబునన్. మదన మదన ది్రగీష్మ నీ మేని మీదన్... ప్రార్థింపుచున్నార లసన్నానసా భోజుడై"

ఇక ప్రబోధ చంద్రోదయాంతర్గత దండకమునకు సంస్కృతము నందలి కృష్ణమిశ్రుని–ప్రబోధ చంద్రోదయ నాటకము నందలి దండకము మూలము.[25]

దం. "జయ జయ వినయానతేంద్రాది బృందారకశ్రేణి చూడామణి రాజినిరాజితోపాంత పాదద్వయాంభోజ రాజన్మణిద్యోతవిద్యోతిత పూర్ణపీఠా నిరాఘాట మాయారుచిద్వేషణాద్వైత విభ్రాంతి సంతాన సంతప్త వందారు సంసార నిదాఘపహా రైకదక్షా దినాధ్యక్ష నక్షత్ర నాథార్ధ విశ్వేక్షమా విస్ఫురచ్చైచ్ఛల సంఘాత పాణి......" ఇట్లే దండక మంతయును ఇంచుమించు యథానువాదముగనే కొనసాగినది.[26] "మోహా సందేహముం బాపి బోధత్వముం జూపి రక్షించు మంచున్ బునర్నమ్రముడై" అని యంతమగును.

మూలమున దండక రూపము నందుండి యనువాదమున గూడ దండక రూపముననే యనువదింపబడిన మొట్టమొదటి దండకమిది. దండక సాహిత్యము (తెలుగు) నందంతటను గూడ ఈ ఒక్క రచనయే నిట్లు యథాతథానువాదముగ మలచబడినది.

క్రీ. శ. 16వ శతాబ్దమునందలి 'మాడయ్యకవి' తన కృతియగు "మైరావణ చరిత్రము" నందు ఆంజనేయుని స్తుతించుచు నొక దండక

మును రచించెను.[27] ఆంజనేయునిపై రచించిన దండకములలో నిది ప్రథమము.

దం. "శ్రీ రాఘవేదాంఘ్రి పంకేరుహాస్ఫారభృంగా జగత్ప్రాణ పుత్రా... జితారాతి షడ్వర్గ పంచేంద్రియా సర్వభూతాత్మకా సర్వ లోకాశ్రయా శ్రీహనూమంత దేవా నమస్తే నమస్తే నమస్తే నమః

అనంతర దండక సాహిత్యమున ఆంజనేయ దండకములు చాల గలవు. అందునను స్వతంత్రములే యధికము. మాడయ్యకవి కృత మైన ఆంజనేయ దండకము నిడివియందు నాతిదీర్ఘమై పారాయణ యోగ్యమైన చక్కని రచన.

16వ శతాబ్దమున పూర్వార్థమునకు చెందిన, తెలుగు సాహిత్య లోకమునకు సుపరిచితుడైన "ముక్కుతిమ్మన తన పారిజాతాపహర ణము"న కృష్ణ స్తుతిపరమైన దండకము రచించెను.[28] ఇది గణసమక దండకము. తిమ్మకవియే, ఈ నామమును పొందుపరచెను. రెండు పాదములు కలిగినది. రెండు పాదములందున గణములు సమానముగ నిలుపుట. ఒక్కొక్క పాదమున రెండువందల యిరువదియేడు గణ ములు రచితమైనవి. నగణద్వయముపై రగణ సమూహము.

దం. "యదుతిలక జగత్త్రయీనిర్మితి ప్రక్రియా కర్మఠేందింది రోద్భాసి నాభీ సరః ... వేద శాఖాంచత్ప్రవాళాత్పదా ! మాధవా ! సత్యభామాధవా!"

నమోవాకము కూడా విడుపబడినది. లాక్షణికులు ఈ నమో వాకమును నియమముగను దలప లేదు.

16వ శతాబ్దమునకు చెందిన రామకృష్ణుడు తన కావ్యము లన్నిటి యందును దండకమును రచించి యుండెను. మొదటిది 'ఉద్భటారాధ్య చరిత్రము' లోనిది[29] రెండవది పాండురంగ మాహా

త్మ్యమునందలిది. విష్ణుస్వరూప వర్ణనాత్మకమైనది.[30] మూడవది 'ఘటికాచల మాహాత్మ్యము' లోనిది.[31] కేవలము రగణాత్మకము. నగణద్వయమును విడిచి శ్రీకార సంప్రదాయమును నిలిపెను. ఈ దండకమునకును లాక్షణిక లోకము గుర్తింపులేదు.

దం. "శ్రీనృసింహా సురారాత్యహంకార రంహః ప్రమత్తేభసింహా
నిరంహ స్సమస్సాధు సంకీర్తితాహ్వాద్విజిహ్వాది రాడ్భూషణా
... నిరీశా ! రమాధీశ ! సర్వేశ్వరా ! నిర్వికల్పా ! నిరీహా !
పరానంద సంవిత్స్వరూపా! నృసింహా! నమస్తే నమస్తే నమః"

ఈ యుగమున వెలసిన కావ్యాంతర్గత దండకములలో 'పింగళి సూరన' తన 'కళాపూర్ణోదయము' నందు దండకమున కొక ప్రత్యేక ప్రతిపత్తి కల్పించి యుండెను.

సీ. "అని యింతి పల్కిన మునిపల్కె... నవునవు
నెలత నిన్నెరుగుదు; దలచు కొంటి
మా శిష్యుడైన మణికంధరాహ్వాయు
డిట గొన్నినాళ్ళ కిందటను గ్రొత్త
గాగ హరిం బొడగానంగ తావచ్చి
దండకరూప సంస్తవన రచన
యొనరింప నేక సంతన గ్రహించు పఠించు
నట్టి నేర్పరివి గదమ్మ నీవు
తే. పేరు కలభాషిణివి గద! బిరుద చతుర
వగుదు; భళి భళి! యిప్పుడు నీకది ముఖస్థ
మగుచున్నది యే? శక్యమగునె చదువ
ననుచు శక్యంబు గాకేమి యనుచు బలికి" 1-78

వ. "అమ్మదిరాక్షి మధుర గంభీర స్వరంబుగ నిట్లని చదివి"... 1-79

దం. "శ్రీకామినీ కామితాకార కారుణ్యధారా నవాంకూర శశాంకాకరా శోణరేఖా మయూరాళి కిమ్మీరితాలోక నాలోక సంస్తుత్య నిత్య ప్రభావా విభావైభవాధిక్య ధిక్కారితానంత మార్తాండ కోటీర క్రియాటీక మానామలా స్తంభ శుంభద్యశః కర్పూర సౌరభ్య మైత్రీ పవిత్రీ కృతామ్నాయ వాయు ప్రచారా... భావనాతీతః! కళ్యాణ నానాగుణశ్రీ సముద్భాసితాంగా మమ్ముం గేవేంబైన కారుణ్య దృష్టిం గటాక్షించి రక్షించి లక్ష్మీమనోవల్లభా! దేవదేవా! నమస్తే నమస్తే నమస్తే నమః" 1-80

రంభకు రానున్న సవతి కయ్యపు సూచన యందలిదీ దండకము. నలకూబరునకు గానున్న సవతివి నీవే గావచ్చును గదా! అని అంతలో గుర్తునకు వచ్చి, శ్రీకృష్ణుని ఆస్థానమున తానును తన శిష్యుడు మణికంధరుడును పలుమార్లు చూచియుండుట వలన "అన్నట్లు నీవు కలభాషిణివి గదా। ఆనాడు మణికంధరుడు ఆశువుగా చెప్పిన దండకమును ఏకసంతగా మరల అప్పగించిన నేర్పరివి నీవేగదా! మరచితిని, ఆ ఉదంతమంతయు మరల నిపుడు జ్ఞప్తికి వచ్చుచున్నది. ఇప్పటికిని నీకది కంఠస్థముగ నున్నదా? ఏది మరియొకమారు చదువుము." అను నారదుని మాటలతో పొంగినదై కలభాషిణి దండకమును మరల చదువును.

ఎన్నడో మణికంధరుడు చేసిన దండకరూప స్తవము, కావ్యమునందంతటను ఒక్కచోటనే యున్నది. ఈ దండకము నొక వృత్తముగ దలపక, దండకరూప స్తవమును చదువుమని ప్రత్యేకత నాపాదించుటవలన స్తుతిపాత్రమైన వాక్కును దండకమున నేకసంతగా వ్యక్తీకరింపవచ్చు ననెడి భావమును, నొక్కి చెప్పుటయేగాక,అనంతర

దండక వాఙ్మయము అభివృద్ధి చెందుటకు సూరనగారి దండకము ప్రేరణగ నిలిచినది.

చం. "అనయము ప్రీతితో హరియు నాతని కానుక యాదరించి వై
కొని తదభీష్ట వస్తువులు గొబ్బున దా గృపజేసి యప్పు డిం
పొనరుచు దండకాకృతి సముజ్జ్వల సంస్తవలీల కెంతయున్
ఘనముగ మెచ్చియిచ్చె మణికంధర నామునకున్ ధరాధిపా"
అష్టమాశ్వాసము - 190

ఈ యుగమునందే నేదో యొకానొక సందర్భమును పురస్కరించుకొని తమ గ్రంథాంతర్గతములుగ ఎందరో కవులు దండకములు రచించి యుండిరి. వారిలో మాదయ్యగారి మల్లన - రాజశేఖర చరిత్రము, ధూర్జటి - కాళహస్తీశ్వర మాహాత్మ్యము, హరిభట్టు - ఉత్తరనారసింహ పురాణము, సంకుసాల నృసింహకవి - కవికర్ణ రసాయనము, తెనాలి అన్నయ - సుదక్షిణా పరిణయము, తిమ్మయ భాస్కరుడు - పంచతంత్రి, బైచరాజు వేంకటనాథుడు - పంచతంత్రము, కోట శివరామకవి—సానందోపాఖ్యానము, రామరాజు రంగప్పరాజు—సాంబోపాఖ్యానము, ఎర్రయ- సకల నీతికథా నిధానము, కాచ భూపాలపుత్ర మల్లారెడ్డి - షట్చక్రవర్తి చరిత్ర, పట్టమట్ట సరస్వతీ సోమనాథయాజికృతులు - బ్రహ్మోత్తర ఖండము - పృథుచరిత్ర (అముద్రితము), ఇత్యాదులు కృతులయందు ఇంచుమించు అన్నియును పూర్వకవి పంథా ననుసరించి రచింపబడిన స్తోత్ర ప్రాయములైన రచనలే.

16 వ శతాబ్దమునందలివాడైన 'అద్దంకి గంగాధర కవి'- తపతీ-సంవరణోపాఖ్యాన' మనెడి శృంగార ప్రబంధము నొకదానిని రచించి గోల్కొండ మల్కిభరాము అను నామాంతరము కలిగిన 'ఇబ్రాహీం

కుతుబ్ షాహి'కి (క్రీ. శ. 1550–1580) అంకిత మిచ్చి యుండెను. ఇతడు తన గ్రంథమున "మలయగిరి దండకము" నొకదానిని రచించి యుండెను.[32] కేవలము గిరి వర్ణనాత్మకమైన రచన యిది. ననలపై తగణ ఘటితమైనది.

దం. "చపల నయన యీ చందనాగంబు చందంబు లాశ్చర్య
కదంబు నందంబు జెట్టె యథః కంథరాసీమలన్ వేమరున్...
గేహినీలోక చూడామణీ! యా మణీ గహ్వరాంతమ్ము లెంతేసి
భవ్యమ్ము లిచ్చోట నిచ్చా విహారమ్ములన్గేలి సల్పందగున్"

ఈ విధముగ నీ యుగమున గ్రంథాంతర్గతముగ దండక రచన పరిచరముగా గానవచ్చుచున్నది. ఇక నీ యుగమున వెలసిన స్వతంత్ర దండక రచనలను పరిశీలించుదము.

## 3-2-2. స్వతంత్రములు :

పురాణేతిహాస యుగమునందు వలెనే నీయుగమునను స్వతంత్ర దండక రచనలు వెలువడినవి. ఈ యుగము నందు గూడ పూర్వ యుగము లందు వలె నామమాత్రా వశిష్టము లైనవియు నున్నవి. కనిపించుచున్నంత వరకు నీయుగమున "భోగినీ దండకము" ప్రిసిద్ధ మమై, తత్కర్త "బమ్మెర పోతన" అని నిర్ధారితమై యున్నది. భోగినీ దండక కృతి కర్త పోతన యని నొక్కి-చెప్పుటకెంత ప్రబల ప్రమాణములున్నవో, తత్కర్త పోతనయా? అని సంశయించుటకు వీలైన యాధారములున్నవి. కృతి కర్త, కృతి భర్తలకి గల సంబంధము, కాలము మొదలగు విషయములు నిర్దిష్టము గాకపోవుట వలన పోతనయే భోగినీ దండక కృతికర్త యని చెప్పుటకు సంశయింప వీలగు చున్నది. కృతి కర్త తన యితర కృతులలో భోగినీ దండకమును

తాను రచించితినని చెప్పకపోవుట మరియొక ప్రబల కారణము. కృతి భర్త కాలము శాసన ప్రమాణములచే నిర్ధారిత మయ్యెను, కృతి కర్త పోతన కాలము నిర్ధారించుటకు సహేతుకములగు ప్రమాణములు అంతగా కానవచ్చుట లేదు.

కవిత్వము విషయమున పోతన కవిత్వమునకు పోలిక యుండుటే గాక, పోతన కృతమేనని భావించుటకు వీలగుచున్నది. ఈ భోగినీ దండకము ననుసరించి అనంతర స్వతంత్ర దండక కర్తలు కొందరు కొన్ని దండకములను రచించిరి. తత్కర్తలపై భోగినీ దండక ప్రభావము కలదని తప్పక చెప్పవచ్చును.

ఈ భోగినీ దండకమున నే కృతిభర్తకు సంబంధించిన విషయము మరికొంత వివాదగ్రస్తమై యున్నది. ఈ యుగమున స్వతంత్ర దండక కృతుల యందు కేవలము ఒక భోగినీ దండకమునకు సంబంధించిన అంశమునే యమితముగా పేర్కొనుట యుచితముగాదు. అందునను అనంతర దండక కర్తలపై భోగినీ దండక ప్రభావము మిక్కిలిగా నుండుటవలన "భోగినీ దండకము—తజ్జాతి దండకములు" అను అయిదవ అధ్యాయమున ప్రత్యేకముగా వ్యక్తీకరింపబడినది.

నేడు కనిపించుచున్నంత వరకును సంపూర్ణముగను, స్వతంత్రముగను గ్రంథరూపమున వెలువడిన దండకములలో భోగినీ దండకమే మొదటిది.

ఇంతదనుక భగవత్పరమైన, స్తుతిరూపక సంప్రదాయమునకు సాధనముగా దండకమును వినియోగించుచుండగా, మానవ సంబంధమైన యితివృత్తమును వస్తువుగ గ్రహించి రచించుట భోగినీ దండకము ప్రత్యేకత. దండక శాఖ అవతరించుటకు పురాణేతిహాస యుగము కందలి దండక కృతులు ప్రేరణగ నిలిచినను, వివిధ వస్తువు

లను స్వీకరించియు, రచించుటకు మార్గము నేర్పరచినదియును భోగినీ దండకమే.

భోగినీ దండకము నందలి యితివృత్తము శృంగార పరమైనది, ఇంతవరకు భక్తిరస ప్రధానముగ కొనసాగిన దండకము, ఒక్క మారుగ శృంగార రసమునకు మరలించినదియును భోగినీ దండకమే.

పురాణేతిహాస యుగమున నామావశిష్టములైన పండితుని, రంగనాథుని దండకములు పద్యముగ రచింపబడినవో, గద్య దండకములుగ రచింపబడినవో తెలియదు. రంగనాథుని దండకము వేయి పాదములు అగుట వలన గద్య దండకముగనే భావించవచ్చును. భోగినీ దండకము అటులుగాక, ఏకపాదమున కొన్నివేల అక్షరములు రచితమైనవి. నాక్షణికాభిప్రాయము ప్రకారము ఇది గద్య దండకము. తెలుగున వెలసిన స్వతంత్ర గద్యదండకములలో గూడ నిదియే ప్రథమము. ఇందు కొన్ని పాత్రల సంభాషణము చోటు చేసికొనుట వలన భోగినీ దండకము ప్రత్యేకత యినుమడించినది.

ఈ యుగముననే 'ముక్కు తిమ్మన' గారు కూడ 'త్రిస్థలీ దండకము' అను పేరుతో నొక దండకమును రచించెనని తెలియు చున్నవి. అప్పకవి తన అప్పకవీయమున గణాధిదేవతా ఫలములను దెలుపుచు "నగణం బమృతాంధోనాథ దేవతాకంబు గాన సకల భోగ ప్రదంబని...... త్రిస్థలీ దండకము నందు 'విజయనగర హేమ కూటంబు నన్నిల్చి' యని నందితిమ్మనయుం జెప్పి!' [38] అని తెలిపి యుండెను. కాని నేడు ఈ కృతి, ఆకృతి యేటో నింతకంటె తెలియదు.

భోగినీ దండకము ప్రత్యేకముగా మానవపరమై, శృంగార సంబంధియై వెలువడగా, నీయుగముననే 'తాళ్ళపాక పెద తిరుమలాచార్యుడు (క్రీ. శ. 1458–1554) "శృంగార దండకము"ను, ఇతని

తనయుడు "చినతిరుమలాచార్యుడు" (క్రీ.శ.1488-1562) "అష్టభాషా దండకము"ను రచించియుండిరి.

పెదతిరుమలాచార్యుని దండకము మధురభక్తికి భక్తి శృంగారమునకు చెందినది. ఇందు పద్మావతీ శ్రీనివాసుల పరిణయగాథ చిత్రించబడినది.[34] దండకాంతమునందలి పద్యము వలన ఈ కృతి శ్రీనివాసునికి అంకితమిచ్చినట్లు తెలియును.

ఉ. "సన్నుత తాళ్ళపాక పురశాసన డన్నయః తిమ్మనార్యుడ
త్యున్నతి జెప్పె దండకము దుగ్ధపయోనిధి కన్యకారతి
స్విన్న మృగీ మదాంకునకు వేంకట భర్తకు నవ్యభోగ సం
పన్నన కారవీందుకులపర్వత తారకమై చెలంగగాన్"

ఇట్లు దండక కృతిని అంకిత మిచ్చినట్లు, దండకాంతమున పద్యమును రచించు సంప్రదాయము భోగినీ దండకము నుండియే ప్రారంభమైనది. పెదతిరుమలాచార్యుని శృంగార దండకమును గద్య దండకమే.

దం. "శ్రీ వెంకట క్ష్మాధరోత్తుంగ శృంగాగ్ర నిత్యస్థిరోగారు గారుత్మ దోదీర్ణ సౌవర్ణ భూమీ విశేషోజ్జ్వలాకారు గారుణ్య సార ప్రభా పద్మ...అని మొదలిడి శ్రీవెంకటాధీశుని ఒక బింబోష్ఠి మోహించుట, ఆమె విరహము, చెలులామెను మరపించుటకు ఉద్యానవనమునకు తీసికొనిపోవుట, జలక్రీడ సలుపుట, వేంకటాధీశుడు నీమెను గాలిపటము నాధారముగా తమ ప్రే భావములు తెలుపుకొనుట, తుదకు వారిరువురి కలయికతో దండకము, చేష్టాలసద్భూషుడై, సార నర్మక్రియాచారు సంభాషుడై సమ్మతింగ్రిమ్మరం గొమ్మతో గూడి తాముండు పెంపొందు నయ్యిందిరా మందిరంబైన యాత్మీయ గేహంబునన్ ప్రవేశించి యుండెందగన్"అని ముగియును.

చినతిరుమలాచార్యుడు 'అష్టభాషా దండకము'ను రచించెను.[35] ఆనాడు అష్టభాషలలో కవిత్వము చెప్పుట కవి ప్రతిభకు తార్కాణముగ చెప్పవలెను. 'భాస్కర రామాయణ' రచనలో 'మల్లికార్జున భట్టు' 'శ్రీమదష్టభాషా కవిమిత్ర' అని చెప్పుకొనెను. 'పాల్కురికి సోమన' అష్టభాషారచన కాద్యుడు. వృషాధిప శతకమున ఇతడు అష్టభాషా వైవిధ్యము చూపియుండెను. అప్పకవి మతమున సంస్కృతము ప్రాకృతము, శౌరసేని, మాగధి, పైశాచి, చూళిక, అపభ్రంశము, ఆంధ్రభాష అనునవి అష్టభాషలు. అప్పకవి ఆంధ్రభాషను కూడ అష్టభాషలలో చేర్చియుండెను. కాని, చినతిరుమలాచార్యులు అష్టభాషా దండకమున ఆంధ్రభాషను చేర్చలేదు.

## 3-2-3. కావ్య, ప్రబంధ యుగవిశిష్టత.

పురాణేతిహాస యుగమున నుద్భవించిన తెలుగు దండకము భక్తి భావమునకే అంకితమైనది. కాని, కావ్య, ప్రబంధ యుగమున పుట్టిన దండకములు శృంగార సంబంధములైనవి. పోతనగారి భోగినీ దండకము మానవ శృంగార సంబంధి. లౌకిక శృంగార సంబంధమైనది. ఇంతదనుక ఈ పోకడలేదు. దీనికి అంకురార్పణ ఈయుగముననే జరిగినది.

తాళ్ళపాక పెద తిరుమలాచార్యుని శృంగార దండకము భగవత్సంబంధి. అలౌకిక శృంగారమున కంకితమైనది. మొత్తముమీద శృంగార భావముల చిత్రీకరణ దండకములలో నీయుగముననే జరిగినది.

దండకమున చిత్రకవిత ప్రవేశపెట్టబడినది. నమోవాక సంప్రదాయము వస్తువులనుబట్టి గ్రహించుట జరిగినది.

ఈ యుగమునను దండక లక్ష్యములకు తగినట్లుగ లక్షణములు జనించలేదు. చిత్రకవి పెద్దన సమగ్రముగ గాకపోయినను కొంతవరకు

నైన దండకమునకు లక్షణములు చెప్పియుండెను తక్కిన లాక్షణికు లెవరును దండకమును సమగ్రముగ పరిశీలించినవారు గారు.

నన్నయగారు నాటిన తగణము, తెలుగున దండక సాహిత్యము నందంతటను ఎంతలోతుగ వేళ్ళూనుకొని యున్నదో, యట్లే పోతనగారి భోగినీ దండక యితివృత్తము అనంతర స్వతంత్ర దండక కర్తలకు నిత్యనూతనమైనది. అందువలననే తదుపరి యుగమైన దక్షిణాంధ్ర యుగమున నీదండక యితివృత్తము 'అనేకమంది' కవులచే అమితముగ నాదరింపబడినది.

పురాణేతిహాస యుగమున దండకము ఆవిర్భవించగా, నీయుగ మున అధికాదరణపాత్రమై, రసవైవిధ్యము కలిగినదై. అభివృద్ధి చెందినదని చెప్పనగును. కాని స్వతంత్ర దండక కృతుల పుట్టుక తక్కువయే.

## 3-3. దక్షిణాంధ్ర యుగము. (క్రీ. శ. 1700 నుండి 1850 వరకు)

ఈ యుగమున దండకము వివిధ విన్యాసములకు లోనయినది. తక్కిన వృత్తములవలె వివిధ వస్తు స్వీకరణకు తగినదిగా నిరూపించు కొనినది. కావ్యాంతర్గతముగ కొనసాగుచునే, సంఖ్య యందు దీటుగా స్వతంత్రముగను నడచినది. ఒక విధముగ చూచిన అంతర్గతముల కంటె స్వతంత్రములదే పై చేయి.

గ్రంథాంతర్గతములు ఇంచుమించు స్తుతిపరముగ నడచినను, స్వతంత్రములు కూడ ఒకేమూసలో పోసినవిగనే కన్పట్టును. ప్రత్యే కించి స్వతంత్ర కృతుల యందు రాజులు, వేశ్యలు, వేశ్యామాతలు, వేశ్యల యిండ్లయందలి ఆచార వర్తనములు మిక్కుటముగా ప్రద ర్శింపబడియున్నవి. వీని యన్నిటి యందును రాజులే నాయకులు. నాయికలు వేశ్యకుల సంజాతలు. వీటికన్నిటికిని చాలవరకు చారిత్ర

కాధారములుగూడ కానరావు. ఇట్టి దండకములు కన్పించెడి దీయుగ మునసే. కొన్ని గ్రంథాంతర్గతములు, స్వతంత్రములు గూడ రూప మున నొకే విధముగ నుండును.

పోతన జీవిత కాలము క్రీ. శ. 15వ శతాబ్దము నుండి యని తలచినయెడల, ఆయన భోగినీ దండకము తరువాత నూటయేబది లేదా రెండువందల సంవత్సరముల వరకును భోగినీ ప్రకృతి కలిగిన దండ కము మరొకటి జనించలేదు. కారణము, ప్రబంధకవులకు దండకమున మానవపరమైన శృంగారపు పోకడ నచ్చలేదో లేక నాటి రాజులు నిట్టి ప్రకృతిగల దండక కృతుల నాదరించెడివారు గారో అనునది అంతుబట్టనిది. పోతనకు దాదాపు సమకాలికుడగు తాళ్ళపాక పెద తిరుమలాచార్యుడు నాతని తనయుడైన చినతిరుమలాచార్యుడును రచించిన శృంగార, అష్టభాషా దండకములు స్వతంత్రములైనను వస్తు వైవిధ్యము కలిగినవై, శృంగార దండకము భగవదంకిత శృంగార పరమైనది.

క్రీ. శ. 18వ శతాబ్దమువాడైన 'కూచిమంచి తిమ్మకవి' తన కుక్కుటేశ్వర శతకమున, సామాన్యజనులు మార్గ సాహిత్యము నాద రించు స్థితిలో లేరని తెలిపియుండెను. తిమ్మకవి వ్రాతల ననుసరించి "ఈ భట్లూ, కవులూ, సెప్పే కవిత్వాలు వారికి బోధపడేవి గావు. 'తలబరువుపెట్టి తొందరగాగ దండకాల్. సతకాల్, సోకాలు సతుకు కొంటా' వున్నవారి నాదరించడానికి నిత్యజీవనం బరువై పోయింది.[36]" అని ఆరుద్రగారు తమ అభిప్రాయమును వ్యక్తపరచిరి.

ఈ యుగము నందును కొందరు కవులు చెప్పిన దండకములు నామమాత్ర ప్రాయములే. ఏనాటిదో పోతనగారి భోగినీ దండకము నిలిచినా 'సత్యవోలు భగవత్కవి, ధూర్జటి వెంకటపతి' మొదలగు కవులు రచించిన దండకములు నామమాత్రావశిష్టములైనవి.

కం. "ధీరత శత శతకంబులు
దారావళులున్, దశావతారావళులుం
జారుదాహరణంబులు
శ్రీరాజిత దండకములు చెప్పిన వాడన్"
(రుక్మిణీ పరిణయం. సత్యవోలు భగవత్కవి. ప.సం. 18)

అను గ్రంథాంతర్గత సాక్ష్యమును బట్టి యతడు పెక్కు దండకములు రచించెనని తెలియు చున్నది.

## 3-3-1. గ్రంథాంతర్గతములు :—

ఈ యుగ సారస్వత పోషకులలో ప్రముఖ స్థానము నలంకరించి నది రఘునాథ భూపాలుడు. రాయలవలె నీతడును కవియు, కవి పోషకుడును. తంజావూరు నాయక రాజ్యమును క్రీ. శ. 1614 నుండి 1633 వరకును 19 సంవత్సరములపాటు ఏకచ్ఛత్రాధిపత్యముగ పరిపాలించిన నీతడెన్నో రచనలను చేసెను. ఈతని కృతియైన 'వాల్మీకి చరిత్రము' నందు సప్తర్షికృతమైన విష్ణు స్తోత్రము దండకమున రచింపబడినది.[37]

దం. "శ్రీభామినీ భూమి నీళా కుచాభోగ భాగాతి భాస్వద్భుజా మధ్య మధ్యందినార్కార్చిరా ధిక్కార్య వేల ప్రభాజాల జాలం ధరోద్యాణ బంధాను సంధాన...నీ పాద సేవన్ ప్రసాదింపుమో దేవతాసార్వభౌమా! పవిత్రైకనామా! ఘనశ్యామా! శ్రీరామా! హస్తేకృతశ్రీ విహస్తేందర్వైరీ! నమస్తే హితార్థ ప్రధానా నమస్తే నమస్తే నమస్తే యటంచున్నుతింపన్"

రఘునాథుడు దండకమును ముగించిన తీరు విలక్షణమైనది. నమోవాకమును విడువలేదు. కథకు అనుకూలముగ 'అటంచు న్నుతింపన్' అని మలుపు త్రిప్పెను. రావతారము వరకు నవతార వర్ణన

గావించి "రామ రూపంబునన్ నిల్పి నీ పాద సేవన్ ప్రసాదింపుమో దేవతా సార్వభౌమా" అని వేడుకొనెను. తగణమూధారముగ నడచిన నైనను నిది 'గగ'లతో సంతమగును దీనిని హేమచంద్రుని కామ బాణ లక్షణమునకు లక్ష్యముగా గైకొనవచ్చును.

'అప్పకవి' తన (క్రీ. శ. 1656) "శశిరేఖా పరిణయ" కావ్యము నందు దశావతార స్తుతిపరమైన దండకము నొకదానిని రచించి యుండెను.[38]

దం. "శ్రీ మానినీ మానసాంభోజ హంసాబ్జ గర్భామరేంద్రాది
బృందారక స్తోత్ర...... మురారీ పురారిప్రియా చక్రధారీ
దినేంద్రాయుతానంత తేజ... యీ సురేంద్రాది బృందారకు
ల్మందు నేస్నాన మేయోగ మేలాగు గావించినాకో మిముం
జూడగా గల్గి వైకుంఠవాసా నమస్తే నమస్తే నమస్తే నమః"

ఎత్తుగడలో పోతనగారిని, పదాల కూర్పులో నన్నయగారిని తలపించును.

క్రీ. శ. 17వ శతాబ్దము నడుమ నుండిన "గణపవరపు వేంకట కవి" దండకమును చిత్రకవితలయందు చొప్పించి మరియొక మలుపు త్రిప్పెను. ఈతని కృతి "ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము' నందు 'ముద్రాలంకార రూపార్ణవ దండకము" అను నామముతో దండకము నొకదానిని రచించియుండెను.[39]

దం. "కలిత భువన యోగ జీమూత గోత్రావళీ శాత్రవాత్మ
ద్యుతిచ్ఛేద నోద్ధామ దామాభి రామాకృతి విలసిత ముని
భావ షట్కోణ పంకేరుహాంతస్థ సత్కర్ణి కాపార సంచారి
భృంగానుకారీ స్థితీ. ఘన విపిన సరోంబుపాన ప్రభిన్నాగ్రి

పాదస్ఫురద్గ్రాహక గ్రాహమస్తాగ్ర చిద్భీమ చక్రాయుధా.
వినుతజన దురంత సంసార ఘోరార్ణవోత్తారణా కారణాభూత
నౌకా ప్రతీకాశ సైకాభిదా"

ఇది నాలుగు పాదములు కలిగినది. నగణద్వయముపై రగణ సమూహ రచితము. సంస్కృతభాషా సంబంధి. రెండేసి నగణములపై తొమ్మిది రగణములు చొప్పున ప్రతిపాదమునను రచింపబడినవి. అర్ణవమను నామమున పిలువబడు దండకము. దండకమునందలి ఆఖరి పాదమున అర్ణవ శబ్దమును అర్థవంతముగ ప్రయోగించి ముద్రాలంకృతము చేసియుండెను.

ఇతడే 'భుజంగప్రయాత స్రగ్విణీ వృత్త గర్భిత దండక రూప చిత్ర సీసము' నొకదానిని రచించెను.[40]

సీ. "పూతనా ద్యాసుర భ్రాతృ సంత్రాణ సూ
ర్య ప్రకాశా కృతీ యప్రమేయ
శేష తల్పాకర స్ఫీత శంఖారి గాం
భీర్య వార్ధి స్థితా భీమ వంద్య
దంతి రక్షా వరాద్వైత మార్గ ప్రభా
వాత్త చిత్తాధినా యతి ధైర్య
కంజనేత్రా శరాఖ్యాత జీమూత సం
కాశ వర్ణాతిగా కంబు కంఠ"

ఒక్కొక్క పాదమున ఏడేసి రగణములు చొప్పున దండకమున కుపకరించును. తదుపరి ప్రబంధరాజ వెంకటేశ్వర విజయవిలాసము నందే 'దశావతార గర్భిత గుణిత వర్ణాచల జిహ్వోకోష్ఠ్య వర్ణ, భుజంగ ప్రయాత వృత్త గర్భిత నిరోష్ఠ్యాచల జిహ్వా స్రగ్విణీ వృత్త గర్భితో

ష్ట్రాచల, జిహ్వా సంకీర్ణ వర్ణ సమగణ దండకము' అను నొక వృత్త మును రచించెను.[41]

ఉదా. "జయ హరి గిరిపా భవాకార భోగోద్ధాగమోద్ధారణా భామ భృద్ధుర్య భిన్నేత్రి రాత్రీయ దంష్ట్రాధృత ఘాతలా భీమరూపా భుజంగేంద్ర వాసస్థ దైతేయరాణ్మాస్త్ర దివ్యాస్త్ర పాదాంబుజాభారి రాజన్య మార్జ త్కుఠార ప్రభా దేవ చూడాతి భాస్వద్ధనుర్భంగ బాహాబలా భైరవాంగ ప్రలంబా శిరచ్ఛేదనోదార సీరాయుధా భోగమోఘీకృత త్రైపురస్త్రైణ పాతివ్రతీ భూమ భీమ ప్రసూవైరి సంహారి...... దేహి భక్తిం భవత్పాదయోః స్థిర్యయుక్తాం విభూతీం నమస్తే నమస్తే నమస్తే నమః"

ఇందు గణభంగము గోచరమగును. ననహ గణములపై తగణ సమూహముగ లెక్కించిన 'కృతత్రైపు స్త్రైణపా' అనుచోట తగణము తదుపరి రగణమేర్పడు చున్నది అట్లుగాక, నగణద్వయముపై రగణ సమూహముగ లెక్కించిన తగణము గూడ నేర్పడుచున్నది. రచన సంస్కృత భాషా సంబంధి,

మొత్తముమీద రగణ, తగణము లేర్పడునట్లు, నగణద్వయ మాదిని నిలిపి చిత్రకవితలయందు దండకమును కదను త్రొక్కించెను. తక్కిన రెండు దండకములును సంస్కృత భాషాశ్రితములే. దండక మును రచించునపుడు సంస్కృత పదప్రయోగమే సముచితమని వెంకటపతి అభిప్రాయముగా తోచును.

తంజావూరు పాలకుడైన శహజీ (క్రీ శ. 1684-1712) ఆస్థా నమునందేగాక, శహజీ తమ్ముడగు శరభోజీ (క్రీ. శ. 1712-28) ఆస్థానము నందును గూడ కవిగా ప్రసిద్ధి గాంచిన 'దర్భా గిరిరాజు'

తన కృతియగు "వాద విజయము" అను యక్షగానము నందు దండకమును రచించియుండెను.[42] ఇది నూటికి తొంబదిపాళ్ళు భోగినికి సహోదరి.

ఇద్దరు వారాంగనలు వారి వారి నాట్యముతో మహారాజును మెప్పించుటకు పంతము పడి ఉద్యుక్తులగుదురు. వీరిలో నొకామె అప్పగారు 'ఇదేమి అఘాత్యం దుడుకు చేయుచున్నావే' వెఱ్ఱిదానా అని యీ దండకమును చదువును. తుదకు శహాజీ మహారాజు వారాంగనల నిద్దరిని నాదరించి, లాలించి, పాలించుట జరుగును.

దం. "ఓనాతి యీరీతి మజ్జాతికిన్ లేని యీరీతి మజ్జాతిగా నీకున్ సీమ సీమాటి బోధించె, ఏమన్నవాం వీరుడాదిగా నీకు నేడి విరాళన్, విరాళించెనే, చంచలాలోక లోకస్తుతాకార రేఖా జితానేక కందర్ప సౌందర్యుడే శహాజీ భూపాల దేవేంద్రు ... బైకముల్ తెమ్ము తెమ్మంచు నారొక్క మెల్లం దగం డక్కనే జూతురే. చూచి సన్నాసిగా జేసి వేరొక్కనిం జేరగా జూతురే చెల్లెలా"

యక్షగానములపై గూడ దండకరచనా ప్రభావము పొడసూపినది. ఇంతదనుక శ్లోకములు, పద్యములు చోటు చేసికొనగా 'వాద విజయము' నందు దండకరచనయును చేయబడినది. దానికి కారణము ఇతర శాఖల యందు దండకము నమితముగ నాదరించుట వలనగాని, భోగినీ దండక చ్ఛాయలో నెందరో కవులు దండకములను రచించుట వలన గాని కావచ్చును.

'దత్తోజీ' (క్రీ. శ. 18 పూ.) పండితుడు తన 'కృష్ణార్జున సంవాద' కావ్యమునందు ప్రకృతి పురుష విభాగమున దండకము నొకదానిని రచించియుండెను.[43]

దం. "పార్థాన్ వైరి సంహర్తాన్... ... కీర్తించు భక్తాళి తేజో
మయంబైన లోకంబు నందుండు నాదేవుని న్నిత్యునిన్ సత్య
సంకల్పునిన్ సర్వ కళ్యాణునిం దుష్ట సంహారకు న్నన్నుతింతున్"

ప్రకృతి పురుష విభాగమున నీదండకము రచించినను, శ్రీకృష్ణ స్తుతిపరమైనదేగాని, భగవద్గీత యందలి ప్రకృతి పురుష విభాగము నకును, దీనికిని నేవిధమైన సంబంధము లేదు.

17 వ శతాబ్దము నడుమ నుండిన 'దామెర్ల వెంగళభూపాలుడు' తన కృతి యగు "బహులాశ్వ చరిత్రము" నందు శ్రీరామ స్తుతిపర మగు దండకమును రచించియుండెను.[44]

దం. "శ్రీరామ భద్రాయ లీలా సముద్రాయ సంభద్ర శుంభద్ర
సాపాంగ శంపాయ భృత్యన్నిలింపాయతే... సీతా సతీ శక్త
పట్టాభిషిక్తాయ సంకీర్తనాభ్యాసరోభ్యాస సఖ్యాయ నమేశ
నాఖ్యాయ తుభ్యం నమః"

ఇదికూడ పూర్వ కవిపంథాలో నడచినదే. శ్రీరామ స్తుతిపర మైనను, శ్రీరామ వృత్తాంతము క్లుప్తముగనైనను ఇచ్చి, రచింప బడలేదు.

క్రీ. శ. 18వ శతాబ్దమునకు చెందిన 'కంకంటి పాపరాజు' తాను రచించిన 'ఉత్తర రామాయణము' నందు శరవణమున ప్రవేశించి స్త్రీగా మారిన ఇలమహారాజు, తన శాపవిమోచనమునకై పార్వతీ దేవిని ప్రార్థించిన సందర్భమునందు దండకమును రచించెను.[45]

దం. "శ్రీమద్రమా భద్ర మాతంగ యానామణీ ముఖ్య నానామర
గ్రామణీ కామినీ కల్పితానల్ప కల్ప ప్రసూనా పూజాతి
రాజత్పదాంభోజ ... దుర్గా మహాదేవి మా తల్లి శ్రితా
ర్తిచ్ఛటా భల్ల భల్లీ ననున్ గన్నతల్లీ నమత్కల్పవల్లీ నమస్తే
నమస్తే నమః"

తెలుగు సాహిత్యమున తెలుగు దనమును పుష్కలముగ నింపి యెన్నియో వైవిధ్యములైన రచనలుచేసి ప్రస్తుతికెక్కిన 'కూచిమంచి తిమ్మకవి' 18వ శతాబ్దమున జీవించెను. ఈతడు తన కృతులు అన్నిటియందును దండక రచన విరివిగ జేసెను.

'రుక్మిణీ పరిణయమున' రుక్మిణి శ్రీకృష్ణుని యొద్దకు 'అగ్నిద్యోతనుడ'ను బ్రాహ్మణునిచే తన వివాహ సందేశమును పంపును. ద్యోతనుడు శ్రీకృష్ణుని యొద్ద కేగుచు, మార్గమధ్యమున రైవతకాద్రిపైనున్న శంకరుని జూచి పరవశుడై స్తుతించును. ఈ సందర్భమును పురస్కరించుకొని అగ్నిద్యోతనునిచే, తిమ్మకవి దండకరూపమున శంకరు నిట్లు స్తుతింపజేయును.[46]

దం. "శ్రీమద్గిరీశాయ, ధీమత్ప్రకాశాయ కాశాబ్జ భాశేశుగాశ్వాధిపాకాశ గంగా సరిల్లోల కల్లోల మల్లీ శరన్నీరదాళీమరాళీ సుధా కర్ణ కర్పూర పాటీర డిండీర వాగ్భామినీ... వైవస్వత ప్రాణ సంహారణో జ్జృంభమాణాయ దూరీకృతాంభోజ సంభూత గర్వాయ శర్వాయ తుభ్యం నమస్తే నమస్తే నమః"

ఇట్లే 'రాజశేఖర విలాసము'న భల్లాణ భూపాల కృతమగు శివ స్తుత్యాత్మక దండకము రచించెను.[47]

దం. "జయ గిరీశ! సురేశ! ముఖ్యామరస్తోమ మౌళి స్థితి స్నిగ్ధ చామీకరోదగ్ర రత్న ప్రయుక్తావతంస! ప్రభా సంచయాంచత్పదాంభోరుహ ...... శశ్వద్విభాతిం బ్రకాశించుచున్నట్టి సద్భక్త సంఘంబులంబోలె నన్నుం గృపాదృష్టి వీక్షించి రక్షింపు మీశా! వియత్కేశ పాపౌఘనాశా! నమస్తే నమస్తే నమః"

నీలాసుందరీ పరిణయమున, నీలాదేవి తన వలపును గోపాలదేవునకు తెలిపినది. అతడును ఆకర్షితుడగును. ఈ విషయము తెలిసి

యొక బ్రాహ్మణ కుమారునిచే చేయబడిన నిది నగణద్వయముపై తగణ దండక రచన.[48]

దం. "సిరి మగడ నన్నుం దిరంబొప్ప నప్పాపరెడట్టి రాయంచ వార్వంబు జోడైన నోరార నగ్గింపలేరన్న చో చిన్నలెట్లన్నగాజాలు వారెన్న నోయన్న..."

ఇట్లే మరియొకటి అచ్చ తెలుగు రచన 'అచ్చ తెనుగు రామాయణము' లోనిది. నారదకృత శ్రీరామ స్తుతి దండకృతిని మలచబడెను.[49] ఇదియును నగణద్వయముపై నేర్పడిన తగణ రచనయే.

దం. "అరిది బిరుద రాయంచ తేజీవ జీరుండవై చుట్టు వాల్దాల్పువై మెట్టు విన్వోల్పవై కీవితో ముజ్జగంబెల్ల బుట్టించుచుం బ్రోవుచున్ ... జక్కనై సాగు బొమ్మంచు నెయ్యంబుతో దెల్పి జేజేని రాబారి యందేనియుం బోవ రాచూలి దానప్పుడా గూడు కాన్పుం దొరం గూర్మి డెందమ్మున న్నిల్పుచున్."

'రసికజన మనోభిరామము'న గౌతమ మహర్షి కృతమగు హరి స్తుతి, దండకము.[50] అయిదు వందల యేబది యెనిమిది తగణముల పై గురువును నిలుపుట జరిగినది. గ్రంథాంతర్గతములుగ వెలసిన రెండవ గద్య దండకమిది. మొదటిది శ్రీనాథునిది. తిమ్మకవి రచన ఏక పాదముననే కొనసాగినది.

దం. "శ్రీమజ్జగన్నాథ లక్ష్మీమనోనాథ గాధేయ కౌండిన్య శాండిల్య మాండవ్య వల్మీకజ వ్యాస వాసిష్ఠ గార్గద్య శేషర్షి సంఘాత సంస్తూయమాన... శ్రీప్రదున్ హృత్సరోజాత మధ్యంబున న్నిల్పి సేవింతు మత్యాదరంబొప్ప మమ్మేలు మీకౌ నమస్తే నమస్తే నమస్తే నమః"

ఇట్లు తిమ్మకవి తాను రచించిన అయిదు కావ్యము లందునను దండకములు రచించియుండెను. ఇందు రెండు అచ్చ తెనుగు దండకములు. తక్కినవి సంస్కృతాంధ్ర సమ్మిశ్రితములు. ఛందమునందును, భాషా వినియోగము నందును వైవిధ్యము ప్రదర్శించెను. శ్రీనాథ, పోతనల తదుపరి విరివిగ దండక రచన చేపట్టినది తిమ్మకవియే.

18వ శతాబ్దమునకు చెందిన 'కనుపర్తి అబ్బయామాత్యుడు' కూడ తన రెండు కావ్యములందునను దండకములు రచించెను. ఇందు మొదటిది అనిరుద్ధ చరిత్రము. ఉషాపరిణయ సందర్భమున, బాణాసురుని మూలమున, శివ కేశవులకు కలిగిన సమరము నందలిది.[51] శాంభవ జ్వరము. వైష్ణవ జ్వరమునకు తట్టుకొనలేక శ్రీకృష్ణుని శరణువేడినది. ఈ సందర్భమును పురస్కరించుకొనినది.

దం. "శ్రీమద్రమా మానినీ మానసారామ వాటీ వసంతాయ మానా ... బరబ్రహ్మమూర్తీ నిన్నుం నా మనోవీధి భావింతు సేవింతునో స్వామి, నన్నుం గృపం జూచి రక్షింపుమో దీన సంరక్ష, యో పుణ్య చారిత్ర, యో భక్తమందార, యో నిత్య కళ్యాణ, కారుణ్య శాలీ, జగన్నాయకా, దేవతా సార్వభౌమా, రమా వల్లభా, పాహిమాం పాహిమాం పాహిమాం"

అని నుతించినది. ఇందు దశావతార ప్రసక్తితోపాటు, నారద, వ్యాస, వాల్మీకి, రుక్మాంగదాది పరమ భాగవతోత్తముల ప్రసక్తి కలదు. విష్ణుస్తుతి పరమైనది. తగణయుతమైన పద్య దండకము, అబ్బయా మాత్యుని రెండవ కృతియగు 'పురూరవశ్చరిత్రము' నందు షట్చక్రవర్తులలో నొకడైన పురూరవుడు విష్ణుమూర్తిని స్తుతించు సందర్భము నందలిది.[52] ఈ దండక మంతయును ద్వితీయాంతముగా, సంబోధన రహితముగ రచింపబడినది.

దం. "శ్రీమదభ్రమా భద్రమాతంగ కుంభోపమాన స్తన న్యస్త కస్తూరికాచిత్ర పత్రాంకురాలంక్రియా కచ్ఛలోద్భాసితాంతః కళంక ప్రభాస్తోక రాకా కురంగాంక బింబాకృతిన్ ...... శ్రీసుధా కామదుగ్దేవతా సింధుకాజన్య రాజత్తరంగోపరి స్ఫూర్జితాహీంద్ర భోగస్థలానల్ప తల్పున్ నిజకల్ప తేజోభిరామున్ జగత్కల్పనా కౌశలున్ సిద్ధ సంకల్ప సంసిద్ధిగా జూచుచున్ జన్మసాఫల్య మయ్యెంగదా నేటికంచున్ ప్రమోదించుచున్"

ఈతడు రచించిన రెండు దండకములును స్తుతిపరమైనవి. పూర్వకవి పంథాలో నడచినవి. నమోవాకముతో ముగించునట్టివి గావు. పురూరవశ్చరిత్రాంతర్గత దండకమున గణభంగ మగును.

రుక్మిణీపరిణయ కృతికర్త సత్యవోలు భగవత్కవి (క్రీ.శ.1750) తన గ్రంథమున లక్ష్మీదేవి స్తుతిపరముగ నొక దండకమును రచించెను. [53]

దం. "శ్రీరస్తు తుభ్యం నమోలక్ష్మి ... ... దయానంద దేహా నయానంద శీలే! పదాబ్జాత రేఖా నిమజ్జన్మజ్జంతు సంతానికే ! మల్లికాకుంత సంతానికే! సత్కృపామర సంతానికే ! మాంపాహి మాంపాహి తుభ్యం నమస్తే నమస్తే నమః"

శకుంతలా పరిణయ కృతికర్త 'కృష్ణకవి' (18వ శతాబ్ది) తన కావ్యమున, విష్ణు సాక్షాత్కారమైన పిమ్మట దుష్యంతుడు శకుంతలను, సర్వదమనుని గ్రహించి విష్ణుమూర్తిని స్తుతించు సందర్భమున దండకము రచింపబడినది. [54]

దం. "శ్రీమదభ్రమా విదుమ్రోష్ఠీ సమారాధ్య వక్షఃశమా దుపేతాక్ష సమీచీన వీక్షా నిమీల ద్విపక్ష సమక్షాణ దక్షా... సంతతోగార మయ్యెన్ గృతార్థుండ నైతిన్ ద్రయీతత్త్వపారాయణా యాదినారాయణా దేవతాభ్యాం నమస్తే నమస్తే నమః"

దశావతార వర్ణనాత్మకమైనది. అవతార ధర్మములు వర్ణింపబడినవి.

సర్వతంత్ర స్వతంత్ర సకల భాషా విశేష కవితా దురంధర ప్రౌఢిన ప్రబంధ పరమేశ్వర శ్లేష యమక చక్రవర్తి బిరుదాంకితులు 'తిరుమల బుక్కపట్టణం వెంకటాచార్యులు' తమ 'అచలాత్మజా పరిణయ' కావ్యము నందు పార్వతీదేవి పరముగను, సీతాదేవి పరముగను రెండర్థములు కలిగిన దండకము నొకదానిని రచించియుండెను.[55] కేవలము నుతిపరమైనదిది.

దం. "జయతు జయతు శేష శైలాధిపామండలీలా మహానంద వేలాణి గాంబోధి డోలా... పరంజ్యోతి నిత్యంబు మహ్యాంద మేథా భక్తిముత్పాదమేథా సుధారాశి కన్యే రామే పద్మహస్తే ప్రసీద ప్రసీద ప్రసీదంబమే"

రచన సంస్కృత భాషా పరమైనది.

పదునెనిమిదవ శతాబ్దమునకు చెందిన 'పరశురామపంతుల లింగమూర్తి – సీతారామాంజనేయ సంవాదమున' హనుమంతుడు పరమ సాంఖ్య రాజయోగ సమాధి వలన మేలుకొని బ్రహ్మానంద సంభరితుడై తన ముందున్న సీతారామగురుని జూచి నుతించు సర్గమున దండకమును రచించెను.[56]

దం. శ్రీరామ రామా! త్రిలోకాభిరామా! పరంధామా! నిష్కామ! సంపూర్ణకామా! బుధేంద్రాంత రంగాబ్ధి సోమా! లసద్దివ్యనామా! నిర్వికారుండవై నిర్వికల్పుండవై నిర్విచేష్టుండవై నిష్ప్రపంచుండవై నిర్విశేషుండవై నిర్గుణబ్రహ్మమాత్రుండవై యొప్పునీ దివ్యతత్త్వంబు నీ సత్కృపా సంభృతాంచత్కటాక్షంబు చేతం గనుం గొంటి దేవా...... నమస్తే నమస్తే నమః"

ఇందు శ్రీరాముడు కేవల పరబ్రహ్మముగ నిరూపితుడు. సాంఖ్య యోగ సిద్ధాంత కలితము.

18 వ శతాబ్దమునకు చెందిన 'శతకంఠ రామాయణ' కర్త 'మర్దనకవి' తన గ్రంథమున, ఆంజనేయుడు పరమేశ్వరుని దివ్యతేజమును పొందదలచి, పరమేశ్వరుని ధ్యానించి ప్రత్యక్షీకరింప జేసికొను సందర్భమున దండకరూప స్తుతి గావింప జేసెను. [57]

దం. "శ్రీమన్మహాదేవ! దేవాదిదేవ! స్ఫుటచ్చారు కోటీర దేదీప్యమానోల్లసద్రత్న కాంతిచ్ఛటా మండితాంఘ్రిద్వయా! యద్వితీయా! క్రమా! విక్రమా! చారుహస్త ప్రశస్తా!... పాపవారాశి భూగాఢబా! వేడబాలన్నియున్నాని నీబంటుగా బూని రక్షింపవే భర్గ! సత్పుణ్య మార్గా! నమస్తే నమస్తే నమః"

"అన్నంరాజు రమణయ్య"(క్రీ.శ. 18వ శతాబ్ది) తన కృతియగు "శంతనురాజ చరిత్రము" నందు శ్రీమన్నారాయణుని శంతనురాజు స్తుతించుట దండకమున గలదు. [58]

దం. "శ్రీభామినీ భూమి నీళా సువృత్త స్తనన్యస్త కస్తూరికా సూత్ర గుచ్ఛాంకితోద్యద్భుజా మధ్య మధ్యాసనాసీన... బాహాగ్రిజాగ్రత్స్ఫురత్ఖడ్గ ధారాహతిం దుంచి కల్పాకృతిన్ మీరితీవేగదా! దేవ దేవా! నమస్తే నమస్తే నమః"

రచన సంస్కృతాంధ్ర సమ్మిశ్రితము.

క్రీ. శ. 13, 19 శతాబ్దులకు చెందిన 'శ్రీరాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయని' వారి ప్రధాన సంస్థాన పండితుడగు 'ములుగు పాపయారాధ్యుడు' తన కృతులైన 'దేవీ భాగవతము, సర్వామధురము' (అచ్చతెనుగు కావ్యము) లందు దండకములు రచించియుండెను.

దేవీ భాగవతమున నాలుగుమార్లు దండకమును రచించెను. ఆంధ్రీకృత భాగవతములలో పాపయారాధ్యుని భాగవతము సుప్రసిద్ధము. ఇందు మొదటిది రాక్షస మాయచే విష్ణువు శిరము సముద్రములో పడినపుడు బ్రహ్మాది దేవతలు లలితాదేవిని స్తుతించు సందర్భములోనిది. [59]

దం. "శ్రీమన్మహాదేవి మాయా జగజ్జన్మహేతు ప్రశస్తా! శిరా! నిర్గుణా! సర్వభూతేశ! మదిష్టమ్ము లిమ్మా... బ్రహ్మవిద్యా నమస్కారముల్ భవానీ! భవ స్త్రీర్నమస్తే"

అని 'గగ'లతో నంతమగును. రెండవది మహిషాసుర సంహారానంతరము దేవతలు గావించిన భువనేశ్వరిదేవి స్తవము (5-535). మూడవది శుంభ – నిశుంభుల వధానంతరము దేవతలు పరాశక్తిని స్తుతించు సందర్భము నందలిది. (5-602)

దం. "నమస్తే నమస్తే నమోదేవి విశ్వేశ్వర ప్రాణనాథే! సదానంద రూపే!
సురానందదాతే! నమో దానవాంశుప్రదే!... పాహినః
పాహినః పాహి దేవి!"

తెలుగున దండక సాహిత్యము నందంతటను 'యగణము'తో రచింపబడిన దండకమిది ఒక్కటే. జగణముతో నంతమగును. ఇక నాలుగవది అభ్యుదయాకాంక్షియగు ఇంద్రునిచే చేయబడిన మహాలక్ష్మి స్తోత్రము.

పాపయారాధ్యుని ద్వితీయకృతి "సర్వమధురము"న విష్ణుస్తవ ఘట్టమున అచ్చతెనుగు దండకమొకటి రచింపబడినది. [60]

దం. "జేజేల రేడా! పరాకేల జేజేలకొమ్మ వేకొమ్మునం గుమ్మగా
జాపపై పాపలా యమ్మె కాడొక్క గుర్రలంబట్టు రాకాసిపోకార్చ

"...నినుం గంటిమో తమ్మికంటీ ! మముంజూడు బంగారు దువ్వల్వ వేల్పా"

ఈ దండక మంతయును అచ్చ తెలుగు పలుకులతో మధుర మే. దశావతారములు వర్ణింపబడినవి. తగణయుక్తమైనది. రగణమునకు మరలును. గణభంగమగును. శ్రీకార నమోవాకములకు తావు లేదు. ఇట్లు దక్షిణాంధ్రయుగముగ పరిగణింపబడిన కాలమున వెలసిన కృతు లన్నిటి యందును దండకము మిక్కుటముగా గానవచ్చును.

## 3-3-2. స్వతంత్రములు :

గత రెండు యుగములందునను కలిసి వెలువడనన్ని స్వతంత్ర దండకములీ యుగమున పుట్టినవి. పురాణేతిహాస యుగమున దండకము భక్తి సంప్రదాయమున కంకితమైనది. కావ్య ప్రబంధయుగ మావిర్భవించుసరికి శృంగారపరమైనది. పెదతిరుమలాచార్యుని చలువ వలన భక్తి శృంగారమున కంకితమైనది. పెదతిరుమలాచార్యుని తన యుడు చినతిరుమలాచార్యుని అష్టభాషా దండకము రచించుటతో దండకము మరియొక మలుపుతిరిగి అభివృద్ధి దిశగ పయనించుట మొదలిడి నదని భావించవచ్చును, పింగళి సూరన మరింత ప్రాధాన్యము నిచ్చెను. తాను ప్రబంధమును రచించుచూ తక్కిన వృత్తములతో పాటు దండకమును గూడా రచించుచు, ఒక విశిష్టతను అపాదించెను. కథలో భాగముగ ప్రస్తావనకు దెచ్చెను.

దక్షిణాంధ్ర యుగము నందడుగిడుసరికి దండకము కావ్య, ప్రబంధ యుగము నందలి నడకనే కొనసాగించినది. స్వతంత్ర దండక కృతులు రచించుట యధికమైనది. ఇవన్నియును మీదు మిక్కిలి మానవ శృంగారమునకే యంకితమైనవి. భోగినీ దండకేతివృత్తము పెత్తనము చెలాయించినది. దానిని నిత్య నూతనముగనే కవులు

దలచిరి. సాధారణముగ నివన్నియును కల్పితములుగ నుండును. ఆయా రాజులను పొగడుటకు, వారి యాశ్రియము పొందుటకు కనిపించిన వెంటనే స్తోత్రముగ, ఆశుధారగ, అనర్గళముగ తాను కవిత్వము చెప్పగల దిట్టనని నిరూపించుటకు రచించినటులు కన్పించును. వీనికి చారిత్రక ప్రాధాన్యము గూడ నంతగా కప్పించదు.

భక్తి రస ప్రధానములైన దండకములు నీయుగమున గూడ వెలసినవి. కాని గత రెండు యుగములందలి దండకముల స్థాయికి తగినవిగావు. వానికి దీటురావు.

ఈ విధముగ దక్షిణాంధ్ర యుగమున నుద్భవించినవానిలో రాజగోపాల, శాహరాజ, వెంకటపతిరాయల మొదలగు దండకములు గలవు. ఇందు రాజగోపాల దండకము భగవత్పరమైనను, వెంకపతి రాయలు, శాహరాజాది నామములతో పుట్టిన దండకములు ఏమంత గొప్పవి గావు. భోగినీ దండకేతివృత్తము కలిగిన దండకములన్నిటిని భోగినీ దండ జాతి దండకములుగ ప్రత్యేకముగ విభాగింపబడినవి.

తంజావూరు సరస్వతీమహాలు నందు 'రాజగోపాల దండక'మను నామముతో నొక అముద్రిత ప్రతి గలదు. దీనిని రచించినది 'రాఘవ కవి.' [61]

దం. "శ్రీరుక్మిణీ సత్యభామా కుచద్వంద్వ విన్యస్త కస్తూరికా సారభోదార భూరిప్రదా, విస్ఫురత్కౌస్తుభ ప్రోల్ల సద్వత్స! వత్సాభిరక్షా సముత్సాహ...... యీ మాధుర్యముం జెందు సంస్కారముం జేయగా నెంచి నానేర్చినట్టుల్ల సన్మాధురీ రీతిన్వీడం బించు మీ దివ్య లీలా విలాసాబ్ది లోనన్ లవాంశంబు నీదండక స్ఫూర్తిగావించి యర్పించితిన్ సత్కృపాశీల సంసేవితాదిత్య దైత్యాహి రాణ్మౌనిజాలా శుభావాల శ్రీరాజగోపాల నైకొమ్మ టంచు న్మహిన్మించు నీదండకం బున్నతిన్ జెప్పె..."

నాపాకనాటస్ గడున్ మేటియా కావటూరన్విరాజిల్లు వృద్ధాచలా
మాత్య పౌత్రుండు సంస్కృతాంధ్ర ప్రబంధైక సందర్భలీలా కళా
శారదా మూర్తియా మూర్తి విద్వత్తనూ జాతుడే రాఘువాఖ్యు
డతి ఖ్యాతి నాచంద్రతారార్కమై........ మించగాన్" అని
ముగియును.

దీనిని రచించినది రాఘువాఖ్యుడనియు, మూర్తికవి పుత్రు
డనియు వృద్ధాచలామాత్యుని పౌత్రుడనియు, పాకనాటి నియోగి
యనియు, కావటూరు నివాసి యనియు తెలియుచున్నది,

"శాహరాజ దండక" మను నామముతో సరస్వతీమహాలునందు
మరియొక అముద్రిత ప్రతి గలదు.[62] దీని కర్త యెవరో తెలియదు.
"ఉపలబ్ధభాగమును బట్టి చూడగ నిది శహాజీ ఆస్థాన కవియగు గిరి
రాజు కవి రచించుచుండవచ్చునను నూహ పొడిసూపుచున్నది.[63] అని
కీ. శే. నిడదవోలు వెంకటరావుగారు అభిప్రాయపడిరి. ఈ ప్రతి
అసమగ్రముగ నున్నది. అయినను తరువాత యితివృత్తము నూహిం
చుటకు అవకాశము గలిగినది. ఇదికూడ భోగినీ దండకేతివృత్తము
వంటి యితి వృత్తము కలిగినదే.

శాహరాజు వాహ్యాలికి వెడలిన సమయమున వారకాంత
యొకతె వలచి, తుదకు తన పెంపుడు చిలుకచే తన గోడును విన్నవించు
కొనగా నాతడును, తనను వలచిన వారకాంతను ఆమెతల్లిని సమస్తైశ్వ
ర్యములతో లాలించి తేలించును.

కవితా గుణములు కానరావు గదా, శహాజీ వర్ణన, వారకాంత
తల్లి కూతురికి అతనిని వలచుట సరిగాదని నచ్చచెప్పు విషయము
దండక మంతయును మిక్కుటముగా నున్నది. దీనినికూడ భోగినీ జాతి
దండకములలో చేర్చి యయిదవ అధ్యాయమున సమగ్రముగ పరిశీ
లింపబడినది.

వెంకటపతిరాయల నామముతో సరస్వతీ మహాలు నందు అము ద్రిత దండకప్రతి ఒకటి కలదు.[64] కర్ణాటక రాజ్యమును పరిపాలించిన వెంకటపతిరాయనిపై (క్రీ. శ. 1630-1642) చెప్పినది. కవియెవరను నది తెలియదు. అనేక రాజసభల సమ్మానము నొందిన "గణపవరపు వేంకటకవి" గా తలపవచ్చును. కాని యిది నిశ్చితమైన ఆధారము గాదు. ఇంచుమించు 17 వ శతాబ్దము ద్వితీయార్ధమున 'ముద్దళగిరి'పై నీతడు దండకమును చెప్పియుండెను.[65] ఈ వెంకటపతిరాయల దండ కముగూడ భోగినీ దండకేతివృత్తము వంటిదే.

మధుర రాజ్యమును క్రీ.శ. 1659 నుండి 1682 వరకును చొక్క నాథనాయకుడు పరిపాలించి యుండెను. ఈతని సవతి తమ్ముడే ముద్దళ గిరి. ఈతని నాయకుని జేసియే భోగినీ దండకమును బోలిన విద్యావతీ దండకమును రచించియుండెను. వెంకటపతి ఈ దండకమును "పుష్ప కోదండ" మని సంబోధించియుండెను. ఇందు నమస్కారమునకు పర్యాయపదములుగా వాడెడి జోహారు, దెంకణాలు, చేమోడ్పు, సలాము, చేమ్రొక్కు మొదలగు పదములను విరివిగా వాడియుండెను. ముద్దళగిరి క్రీ. శ. 1673 లో తంజావూరు పరిపాలకుడు. ఈ దండక రచనను బట్టియే గణపవరపు వేంకటకవి కాలము సునిశ్చితమైనది.

తంజావూరులోనున్న అముద్రిత తాళపత్ర ప్రతులలో 'సూర్య దండక' మొకటి.[66] రెండు ఆకులలో నీదండకము సంపూర్ణముగనే ఉన్నది. దీనిని కూడా ఎవరు రచించిరో తెలియదు. ఇంచుమించు సూర్యనారాయణస్వామిపై పుట్టిన ఆధునిక దండకమును పోలినది. ఇది యెప్పటిదో తెలియదు. "శ్రీ సూర్యనారాయణా ధైర్య పారాయణా లోక రత్నామణీ, ధైర్య చూడామణీ... అని ఆరంభమగును. మధ్యలో 'ఏకాకినై చిక్కి యే దిక్కులం గానగాలేక' అని తాళపత్ర ప్రతిలో ఒక ముప్పది అక్షరముల స్థలము (చోటు) ఖాళీగా విడిచిపెట్ట

బడినది. ఆధునిక యుగమున వెలసిన సూర్యనారాయణస్వామి దండక ములకు ఏమాత్రమును దీటురాదు.

సరస్వతీ మహాలు నందే "శ్రీరామ దండకము" పేరున తాళ పత్ర ప్రతి మరియొకటి యున్నది.[67] సరస్వతీ మహాలు కేటలాగున "కొండరామభట్టు" రచించినదిగా తెలిపియుండిరి. ఈ కొండరామభట్టు ఎవరో తెలియదు. "ఎవరో దండెభూమయ్య అనే ఆయన అసకనూరి చెలువ రంగప్ప చేత రామదండకమును వ్రాయించుకొన్నాడు. అని కొండరామభట్టు చెప్పిన ఈ దండకాన్ని రంగప్ప జాములోపల కాపీచేసి ఇచ్చా"డని శ్రీ ఆరుద్రగారు తమ సమగ్రాంధ్ర సాహిత్య మున తెలిపియుండిరి.[68]

'చంద్రాననా దండకము' సుదురుపాటి వెంకనార్యుని పౌత్రుడు చిదానందకవి కృత మొకటి యున్నది.[69] తొండమాన్ ప్రభువు రామచంద్ర భూపాలునిపై జెప్పినది. ఒక వారవనిత రామచంద్ర క్షితీశుని వలచుట ఆమెపొందిన ఆవేదనకు జాలిపడి యొక చెలికత్తె యాతని ఆస్థానమునకు బోయి విన్నవించుట, యాతడామెను సర్వజ్ఞ సింగభూపాలుడు భోగినిని చేరదీసినట్లు, వలచిన వారవనితకు, నామె తల్లికి నిష్టార్థములు నిచ్చుట యిందలి యితివృత్తము.

విజయనగర సంస్థానమున నారాయణగజపతి ఆశ్రిత కోటిలో 'నడిమింటి రామయోగి కవి (క్రీ. శ. 1836 - 1879) యొకడు. ఈతడు రచించినదే' భల్లాణ దండకము.[70] "భల్లాణుడు వ్రతాచార తత్పరుడు. జంగముల కడిగినదెల్ల దానము చేయు లే శివభక్తుడు. వీరశైవ ఆతని శివదీక్ష. భల్లాణుడు సింధుపట్టణ ప్రజలను శ్రీరామాదులవలె పరిపాలించుచుండెను. ఒకనాడు నారదుడు భూలోకపు వింతలను జూచుచు భల్లాణుని యేలుబడిలోనున్న సింధు

పట్టణ వైభవమునకును, భల్లాణుని భక్తి తత్పరతకును, నాతని శివ దీక్షకును వెరగొందును. వెంటనే కైలాసమునకు బోయి పరమేశ్వరుని నీ కామధేను వెంత? నీ కల్పశాఖ యెంత। నాట్య గత్తెలు నెంత? యని భల్లాణుని గూర్చి తెలుపును. వీరశైవ వ్రతాచారుడైన భల్లాణుని పరీక్షింపగోరి పరమేశ్వరుడు మిండజంగమ వేషముదాల్చి యాతని యొద్దకుబోయి, రక్తిలేకున్న భక్తిలేదని రంభాద్యప్సరసలను బోలు వారాంగన నొకతెను గోరును. ఈ విషయమున భల్లాణుడు సర్వప్రయత్నములుచేసి విఫలుడయ్యెను. తుదకు తన సద్ధర్మపత్ని శిరోరత్నమగు "మల్లమాంబ"ను పిలిచి జరిగిన వృత్తాంత మంతయును దెలుపును. మల్లమాంబ భల్లాణునితో తమ యర్థములన్నియు పూర్వమే జంగమాధీనములని, భల్లాణుని వ్రతదీక్షను కాపాడుటకు సిద్ధపడి, తానే మిండజంగముని దరిజేరి యాతనిని సమీపించి కౌగిలించుకొనగా నా జంగము బాలుని రూపమున నామె యొడిజేరెను. పసివాని యేడుపు వినినవాడై భల్లాణుడామె దరిజేరగ నీ యద్భుతముచూచెను. ఆశ్చర్యము కలిగినవాడై మహాత్మా మీరెవరో అని యాబాలుని ప్రార్థింపగా పరమేశ్వరుడు ప్రత్యక్షమగును. మల్లమాంబ పాతివ్రత్యము, భల్లాణుని శివభక్తియును వర్ణింపబడిన దండకమిది.

గుండ్లూరి నరసింహశాస్త్రిచే 1825 ప్రాంతమున రచింపబడిన భాషీయ దండకము, ఈ యుగమున వెలసిన స్వతంత్ర దండకములలో ప్రముఖమైనది.[71]

15 వ శతాబ్దమున తాళ్ళపాక చినతిరుమలాచార్యులు - అష్ట భాషాదండకము తదుపరి కావ్యాంతర్గతముగ ద్వ్యర్థి, అచ్చతెనుగు, నిరోష్ఠ్య దండకములు వెలసినను గుండ్లూరివారి రచన ప్రత్యేకమైనది. చిన్నన్న అష్టభాషల వైవిధ్యమును ప్రదర్శించిన, గుండ్లూరి నరసింహాశాస్త్రి తెలుగు భాషయందే వివిధ వర్ణముల ప్రజలు మాట్లాడెడి

భాష నాధారముగా గాని భాషావైవిధ్యమును ప్రదర్శించి యుండెను. వీనిని వర్గ మాండలికములుగ పరిగణింపవచ్చును.

ఇందు వృద్ధ బ్రాహ్మణులు, బ్రాహ్మణ స్త్రీలు, వైష్ణవ స్వాములు, మధ్వ విద్వాంసులు, సిద్ధాంతులు, రాజులు, వైశ్యులు, వైశ్య స్త్రీలు, వారకాంతలు. జారకాంతలు, దాసళ్ళు. జంగములు, శౌరకాంతలు, చంటిపిల్లలు, సాతానులు, బుడుబుక్కలవాళ్ళు, చెంచులు వీరందరును అహూబల నృసింహస్వామి తిరునాళ్ళకు బయలు దేరుట యితివృత్తము,

ఇట్టి వైవిధ్యము కలిగిన దండకము మరియొకటిలేదు. ఆయా జనులు మాట్లాడెడి భాష నుపయోగించుటవలన భాషీయ దండకమను నామము తగినది. గణభంగ మగుట సర్వసాధారణము. శృంగారో క్తులు మిక్కుటము. చాలవరకు కృతకములుగ కానవచ్చును. ఈ కృతి అహూబల నృసింహస్వామి కంకిత మీయబడినది. ఇది గద్య దండకము.

### 3-3-3. దక్షిణాంధ్రయుగ విశిష్టత :-

ఈ యుగమున పుట్టిన స్వతంత్ర దండక సాహిత్యమును తెలుగు దండక సాహిత్యము యొక్క అభివృద్ధిలో భాగముగా నెంచవచ్చును.

భోగినీ దండకేతివృత్తము మిక్కిలి ప్రాచుర్యము నొంది యీ యుగ స్వతంత్ర దండక సాహిత్యమునకు ప్రతినిధిగ నిలిచినది. గుండ్లూరి నరసింహశాస్త్రి – భాషీయ దండకమునకు, చివతిరుమలా చార్యుని – అష్టభాషా దండకము ప్రేరణయని చెప్పనోపును.

అచ్చతెనుగు, ద్వ్యర్థి, యక్షగాన శాఖలలో ప్రవేశించినది. కావ్య, ప్రబంధ యుగమున కంటె నీయుగమున స్వతంత్ర దండక కృతులు సంఖ్యయందభివృద్ధి చెందినవి.

గ్రంథాంతర్గతములైన దండకములకు కొందరు కవులు సంపూర్ణముగ సంస్కృతభాషనే నుపయోగించిరి. అట్టివారిలో గణపవరపు వేంకటకవి. కూచిమంచి తిమ్మకవి, సత్యవోలు భగవత్కవి, తిరుమల బుక్కపట్టణం వేంకటాచార్యులు, ములుగు పాపయారాధ్యుడు, మొదలగువారు ముఖ్యులు.

కొందరు కవుల దండక లక్ష్యములకు లక్షణనిర్దేశము చేయబడలేదు.

ఈ విధముగ కావ్య, ప్రబంధ యుగమున అభివృద్ధిదశకు చేరిన దండక మీ యుగమున అభివృద్ధిదశను దాటలేకపోయినది. వికాస స్థితికి చేరుకొనలేకపోయినది.

## 3-4. ఆధునిక యుగము. (క్రీ.శ. 1850 నుండి)

ఆధునిక యుగమున దండకము పోని పోకడలేదు. అన్ని విషయములును దండకములందు రచింపబడినవి. కొన్ని పేరడీలుగ తయారయినవి. చాలవరకు పూర్వకవికృత దండకచ్ఛాయలలో నడచినవే. గ్రంథాంతర్గతములతోపాటు దీటుగ స్వతంత్రములు గూడ వెలువడినవి. ఈ యుగమున దండకరచన కొనసాగిన విధముగ పూర్వ యుగముల కొనసాగియుండలేదు. పూర్వ కవికృత గ్రంథాంతర్గత దండకములను విడిగ పునర్ముద్రించిన సంఘటనలున్నవి. అట్లే పూర్వ కవికృత దండకముల కబ్బురపడి, వారిదతీతకు ప్రమాణముగ నేరుగ గ్రహించి తాము రచించిన కృతులందు పొందుపరచిన వారుసుండిరి. ప్రచురణమునకు నోచుకొనని కృతుల నుండి దండకమును ఏరితీసి స్వతంత్రా కృతి రూపమున వెలువరించినవారు నుండిరి. ఎక్కడి కక్కడే చాలువులుగ దండకములు రచించుట యీ యుగము సంబంధి కము. చివరికి చుట్ట, పొగాకు, కాఫీ, టీ, చీట్లపేక మొదలగు దర్శక

ములను గూడ రచించి యుండిరి. ఏహ్యాపైన తిట్లు కూడ దండక రూపమున వెలువడినవి.

పూర్వ యుగము లందెన్ని దండక కృతులు లుప్తమైపోయి యున్నవో నీయుగము నందును అటువంటివాటి సంఖ్య యధిక మే. లఘుకృతులగుటవల నేమాత్రము వివరములు తెలియని వెన్నియో యున్నవి.

గత యుగమునందు భోగినీ దండకము అపారమైన ఆధిపత్యము చెలాయించినది, కాని ఈ యుగమున అది కొనసాగ లేదు, కొనసాగినను నామమాత్ర మే.

భోగినీ వంటి దండకములు మానవ శృంగార సంబంధులై వెలువడినను, ఆధునిక యుగమున విశిష్టాత్మక వ్యక్తిత్వము కలిగిన కొందరు వ్యక్తులపై 'గాంధీ' వంటి దండకములు ఉద్భవించినవి.

దండకము, గడచిన యుగములందు ఏవిధముగ గ్రంథాంతర్గత ముగ, స్వతంత్రముగ నడచినదో నీయుగమునందు అట్లే కొనసాగి తన అవిచ్ఛిన్నతను నిరూపించుకొనినది. ఆధునిక కాలమున ఆంగ్లవాఙ్మయ ప్రభావముతో పెంపొందిన ఆధునిక ప్రక్రియలలో గూడ చోటుబడినది.

ఇంతదనుక పురాణ, ప్రబంధ, యక్షగాన, చిత్రకవితలలో నంత ర్గతముగ నడచిన దండకము, ఈయుగమున నాటకము, ఏకపాత్ర మొదలగు ప్రక్రియలందు గూడ నాదరణపాత్రమైనది.

ఏయుగము నందును వెలువడనన్ని దండక కృతులు ఈయుగ మున వెలువడుటయేగాక, నవరసములతో కలసి, వస్తువైవిధ్యమును ప్రదర్శించి, సంపూర్ణ వికాసస్థితి నొందినది.

భగవంతునిపై నూరు పద్యములను రచించిన శతక కర్తలు గూడ తనివి తీరక తమ శతకాంతము నందు దండకములును రచించిరి.

భగవంతుని నుతించుటకు ఒక శక్తివంతమైన ప్రక్రియగ వీరును తలచి యుందురు.

**3-4-1. గ్రంథాంతర్గతములు :-**

19వ శతాబ్దమున జీవించియుండిన 'మిక్కిలి మల్లికార్జునకవి' (క్రీ. శ. 1805-75) తన కృతి యగు నాచికేతూపాఖ్యానమున దండకము నొకటి రచించియుండెను.[72] మునిబాలకుడైన నచికేతువు యమధర్మరాజును దర్శించిన సందర్భమున, యమధర్మరాజును దండకమున స్తుతించును. అది—

దం. "శ్రీదక్షిణాధ్యక్ష భీమాక్ష పాపేభ హర్యక్ష భూరిక్షమాపేక్షితాక్షీణ పీఠాసదా ధర్మరతా మహాధర్మశీలా హారీ సిద్ధితాకార సర్వాత్మకాదర్శకా దర్శకాప్రీత నాథా భవాత్మా... సుధీకల్పభూజా మహాధర్మరాజా..." అని ముగియును. తెలుగున దండకములలో యమధర్మరాజు పరమైన దండక మిదియొక్కటియే. అంత్యానుప్రాస సహితము.

అభినవాంధ్ర పితామహ బిరుదాంకితులు శత శతక సంధాన కర్తలు, బొబ్బిలి సంస్థాన పండితులునగు 'మండపాక పార్వతీశ్వర శాస్త్రి' (1833-1897) తమ ఏకాశ్వాస ప్రబంధమగు 'శ్రీకృష్ణాభ్యుదయము'న ఉదంకునిచే శ్రీకృష్ణ స్తవమును దండక రూపమున చేయించిరి.[73]

దం. "శ్రీమజ్జగజ్జాల జేగీయమానాగ్రజ గ్రామణీ" ఇత్యాదిగా శ్రీకృష్ణ మహాత్మ్యమును వర్ణించియుండిరి.

19వ శతాబ్దము నందలి 'చెళ్ళపిళ్ళ నరసకవి' తన 'యామినీ పూర్ణతిలకా విలాస' కావ్యమున దండకరూప స్తోత్రము నొకదానిని రచించియుండిరి. అది కథానాయకుడగు బిల్హణుడు పరమశివుని స్తుతిం

చిన సందర్భములోనిది.[74] రచన సంస్కృతభాషాశ్రితము. వృత్త్యను ప్రాస యుతమై, ముక్తపద గ్రస్తమై, యమక, ఛేకాను ప్రాసలతో కూడి యుండును.

కవిసార్వభౌమ బిరుదాంకితులు, శతాధిక గ్రంథకర్తలు నగు 'శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి'గారు తమ గ్రంథములగు 'శ్రీకృష్ణ రామాయణము, శ్రీకృష్ణ భాగవతము, నైషధీయ చరితము, విక్రమాభ్యుదయము, యాజ్ఞవల్క్య చరిత్రము, ఏకావళీ పరిణయము, సావిత్రీ చరిత్రము'లందు దండకరచన నమితముగ చేసి యుండిరి.

సావిత్రీ చరిత్రము నందు మద్రక్షితీశునకు సరస్వతీదేవి ప్రత్యక్షమయిన సందర్భమునందు, సరస్వతీదేవి దండకమున స్తుతింప బడినది.[75]

ఏకావళీ పరిణయము నందు చంపాధీశ్వరుడు విష్ణుమూర్తిని గూర్చి తపము చేయును. విష్ణుమూర్తి సాక్షాత్కరించిన సందర్భమున చంపాధీశ్వరుడు గావించిన స్తుతి దండకమున కొనసాగినది.[76]

విజయలక్ష్మీ విలాసము అను విక్రమాభ్యుదయమున, మూల పురుషుడు ఈశ్వరుని స్తుతించుట దండకమున గలదు.[77]

యాజ్ఞవల్క్య చరిత్రము నందు యాజ్ఞ వల్క్యుడు సూర్య నారాయణస్వామిని స్తుతించును.[78] యాజ్ఞ వల్క్యుని సూర్యస్తుతి శ్రీకృష్ణ భాగవతము నందు యథాతథముగ పొందుపరచియుండిరి. ఈ కృతి జయపురం సంస్థానాధీశ్వరులు శ్రీవిక్రమదేవవర్మ మహారాజు గారికి అంకితమీయబడినది.

నైషధీయ చరితము నందు భీమరాజు సరస్వతీదేవిని స్తుతించి నట్లు దండకరచన గావించిరి.[79] విశేషించి సందర్భమే గాక, ఛందము గూడ శ్రీనాథునిదే అనుకరింపబడినది.

భగవద్విలాసము నందు దక్షసుతులు వీరభద్రుని స్తుతించినట్లు దండకమును రచించిరి.[80]

శ్రీకృష్ణ రామాయణము నందు రెండుమార్లు దండకరచనచేసి యుండిరి.[81] అందు మొదటిది హనుమంత, మాల్యవంతుల యుద్ధ వర్ణనము. రెండవది, అగస్త్యకృత ఆదిత్యోపదేశము.

శ్రీకృష్ణ భాగవతము నందు తొమ్మిదిమార్లు దండకమున రచించిరి. శ్రీకృష్ణుడు భగవంతుని ప్రార్థించుట (2-63), పరమేశ్వరుడు పరబ్రహ్మను స్తుతించుట (4-311), దక్షుడు చేసిన హంసగుహ్యాక స్తవము (6-276), బ్రహ్మకృత హరి స్తుతి (8-88), చిత్రకేతు మహా రాజునకు పునర్జీవితుడైన మృతబాలకుడు చేసిన వేదాంతబోధ (6-276), అక్రూర స్తవరాజము (పూర్వ. భా. 3-154), బలరాముని తీర్థయాత్రా ప్రశంసాత్మకము (ఉత్తర. భా. 2-307), శ్రీకృష్ణుడు మృతుడైన విప్రబాలకుని బ్రతికించునప్పటి శివస్తుతి (ఉత్తర. భా. 3-206), మహాపద్మనందాది భవిష్యద్రాజుల వృత్తాంతము (12-5), యాజ్ఞవల్క్యకృత సూర్యస్తుతి (12-91), ఇట్లు పదిమారులు రచింప బడిన దండకములన్నియును తగణ ఘటితములే. ఇందు యాజ్ఞవల్క్య కృత సూర్యస్తుతి. యాజ్ఞవల్క్య చరిత్రము నందలిది.

శ్రీకృష్ణ భారతము నందు మూడుమార్లు దండకము రచింప బడినది. బ్రహ్మకృత విష్ణుసుతి (శాంతి. 9-201), శ్రీకృష్ణకృత శివ స్తుతి (అనుశాసనిక. 1-371), భీష్మకృత దేవర్షి వంశ వివరణము అనుశాసనిక (5-230).

శుద్ధాంధ్ర నిర్వచన కావ్యముగ "సత్యవిజయ" మను కావ్య రచన చేసిన "అయ్యవకోటి పార్థసారథిశాస్త్రి" గారు, హరిశ్చంద్రుడు చంద్రమతీ లోహితాస్యులతో కాశీ విశ్వనాథుని దర్శించి స్తుతించు సందర్భమున అచ్చతెనుగు దండకము నొకదానిని రచించిరి.[82]

బహుముఖ పాండితీ ప్రజ్ఞావంతులు, కళాప్రపూర్ణ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు తమ శంకర విజయ, మదాలసా విలాస కావ్యములందు దండకములు రచించియుండిరి.

మదాలసా విలాసము నందు అశ్వతరుడు, చనిపోయిన మదాలసను బ్రతికించుటకు హిమాలయమునకేగి సరస్వతీదేవిని గూర్చి తపము జేయును. ఆ సందర్భమున అశ్వతరుడు సరస్వతీదేవిని స్తుతించుటను దండకమున రూపొందించియుండిరి.[83]

మదాలసా విలాసములోని దండకమునకు మార్కండేయ పురాణాంతర్గత మదాలసా చరిత్రము నందలి సరస్వతీదేవి స్తుతి మూలము.[84] మూలమునందలి శ్లోకరూప స్తుతిని తెలుగున దండకముగా మలచి యుండిరి. సంస్కృత లక్షణోక్తముగ నగణద్వయముపై రచింపబడిన రగణ సమూహము గలది. "జయ జయ జగద బ త్రైలోక్య సంపూజ్య! మూర్తి త్రయారాధిత శ్రీపదాంభోజ నినున్ భజింపంగ వాంఛించి సద్భక్తి నీశక్తి కొండాడెదన్" అని ప్రారంభమగును. "సర్వలోకాశ్రయంబైన సంబంధమెన్నం ద్వదీయ స్వర వ్యంజన శ్రేణిచే గల్గుగాయంచవాఙ్మానసంబైన నీవైభవం బెంచి వైవశ్యముంగందు గాకేమి యందున్ త్రయీకేళి చూడామణీ భూత పాదద్వయీ! వాఙ్మయీ! ... తే నమస్తే నమస్తే నమః" అని ముగియును. ఇంచుమించు దండకమంతయును మూల భావమునకు అనుకరణమే.

తెలుగున సరస్వతీదేవి స్తుతి పరముగ శ్రీనాథుడు మొట్టమొదటి దండక రచన గావించియుండెను. అది సంస్కృత భాషాశ్రితమైనది. నైషధీయ చరితమున శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారును శ్రీనాథుని శృంగార నైషధము నందలి సందర్భ, ఛందములను అనుకరించియుండిరి. తదుపరి గ్రంథాంతర్గతముగ శ్రీ వెంపరాల సూర్యనారా

యణశాస్త్రిగారు రచించియుండిరి. శాస్త్రిగారును రగణ దండక రచననే గ్రహించిరి. శ్రీనాథుని తదుపరి శాస్త్రిగారొనరించిన సరస్వతీదేవి స్తుతియే శక్తివంతమైన రచనము. శ్రీనాథుని రచనకు దీటు రాగలిగినది.

"శంకర విజయ" పద్యకావ్యము నందు మూకాంబికా స్తోత్రము దండకమున రచించిరి.[85] శంకరుడు దిగ్విజయయాత్ర చేయుచు మూకాంబికా క్షేత్రమున కేగి, అచట మూకాంబికను స్తుతించు సందర్భములోనిది.

దం. " శ్రీమజ్జగన్మాతా ! సామోద్గమోద్గీయ మానానుభావాతిలో
ద్భవోపేత ! యమ్నాయ మౌళ్యంత రాలక్షిత జ్ఞాన దీపాయితా!
శీతశైలేంద్ర సంజాత! మాతా! భవద్దివ్య మాహాత్మ్య మగ్గింపగా
వేదాంతరాసుల్ పురాణంబులున్, సర్వ శాస్త్రంబులున్ జాల
వెంచెంచ నస్మాదృశుం డల్పబుద్ధిన్ దలంపన్ సమర్థుండె తల్లీ!-"

ఇత్యాదిగా కొనసాగును. ఈ మూకాంబికా స్తుతికి సంస్కృతము నందలి శ్రీ విద్యారణ్యస్వామి విరచిత శ్రీశంకర విజయ కావ్యము నందలి మూకాంబికా స్తుతి మూలము.[86] ఇంచుమించు నిదియును మూలమున కనుకరణమే.

గ్రంథాంతర్గతములుగ రచింపబడిన దండకములు అపరిమిత సంఖ్యలో కలవు. ఎందరో కవులు తమ గ్రంథములలో దండకములు రచించినను పూర్వకవులవలె భక్తిభావ పూరిత స్తుతి రూపముగను, తగణ-రగణములలో నేదియేనొక గణమాధారముగ జేసికొని రచించినవేగాని ప్రత్యేకములుగావు. ఆధునిక యుగమున నాటకములందు గూడ స్తుతి రూపముగను, హాస్యరస పూరితముగను రచించియుండిరి. అట్లు రచించినవారిలో "ఉమర్ ఆలీషాకవి – మహాభారత కౌరవ

రంగము, కాళ్ళకూరి నారాయణరావు-వరవిక్రయము" మొదలగునవి గలవు. అట్లే "కాంచనపల్లి కనకాంబ - జీవయాత్ర" కావ్యము పేర్కొనదగినది.

## 3-4-2. స్వతంత్రములు :—

ఈ యుగమున వెలసిన భక్తి పరమైన స్వతంత్ర దండక కృతులలో అత్యాధునికులు 'యడవల్లి పూర్ణయ్య సిద్ధాంతి'గారి 'గాయత్రీ దండకము' పేర్కొనదగినది.[87] అత్యంతము శక్తిమంతమైనది ప్రతి నిత్యము గాయత్రీ ఉపాసకులకు గాయత్రీ మంత్రముతో పాటు పఠించదగినది. ఇంత చక్కని దండకము ఈ యుగమున లేదనుటలో అతిశయోక్తి యెంతమాత్రము గాదు.

దం. "తల్లీ! జగత్కల్పవల్లీ! చిదానందవల్లీ! సుధారాగవల్లీ! మతల్లీ! త్రివర్ణ స్వరూపా! త్రియీపాదరూపా! త్రిసంధ్యాస్వరూపా! త్రినేత్రా! ప్రసాదింపవేతల్లి!—... ఈ జీవికై నీ దయా వర్షమున్ చిమ్మవే, ముక్తిమార్గంబు చూపింపవే, దోసపుంజంబులన్ దుంపవే, దివ్యభావంబుతో నామనంబున్ సదా మ్రొక్కెదన్ తల్లిరో వేదమాతా నమస్తే నమస్తే నమస్తే నమః"

"నగాయత్ర్యాః పరమ్ మంత్రమ్, నమాతుః పర దైవతమ్" అని ఆర్యోక్తి. గాయత్రీ మంత్రము సర్వ మంత్రములకు మూలమైనది. పుం దేవతా రూపమునగాని, స్త్రీ దేవతా రూపమునగాని ఆరాధింపబడుచుండును.

కవి పంచముఖి శబ్ద విచారమున విష్ణు, రవి, శక్తి, గణపతి, శివస్వరూపము లన్నియును గాయత్రీ మంత్ర ప్రతిపాద్యములని నిరూపించి యుండిరి.

ఈ దండకమున యిరువదియేడు సంస్కృత విశేషణములు ప్రయోగింపబడినవి. అన్నియును ద్వితీయాంతములై యున్నవి.

దండకాదిని శ్రీకారోపక్రమణము లేదు. తల్లి యను సంబోధనముతో ప్రారంభమగును. దండకమున స్త్రీ దేవతగా ఆరాధింపబడిన గాయత్రీ దేవి పరముగనే గాక, తల్లి అను సంబోధన చాల వ్యాపకమైనది. అర్థవంతమునై యున్నది. 'కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా నభవతి' కంటికి రెప్పవలె కాచు తల్లిని సంబోధనగ స్వీకరించి దండక మారంభించుటకంటె యుక్తమైన శబ్దము మరియొకటిలేదు. కర్త ప్రయోగించిన ప్రతి విశేషణమును చాల శక్తిమంతమును, అర్థవంత మునై యున్నవి. చదువరులను అప్రయత్నముగా ఆనందరసాబ్ధిలో ముంచెత్తుననుటలో శంక లేదు.

అవధాన సాహిత్య శేఖరులు, బహుముఖ ప్రజ్ఞావంతులు, శతాధిక గ్రంథకర్తలు నగు "తిరుపతి వెంకట కవులు" కిర్లంపూడి రాజా వారి సంస్థానమున (19 శ. ఉత్తరార్ధము) ఆశువుగా దండకము నొకదానిని రచించిరి.[88]

దం. "శ్రీశ్రీ మదిన్గంటి వంశాబ్ది రాకాశరచ్చంద్రు డేతాదృశ స్వీత భూతి ప్రకాశ... బత్తుతేన్గుల్, గురాంగనా దాస దాసీ జనం బుల్ కడు వృద్ధి చెందంగ నేటేట నిన్నున్ సమర్పించు మా చిన్నభూపాలుపై రాజగోపాలుపై దానధారేయుపై రూప శూనాంకుపై శీతలానూన దృష్టి ప్రసారంబు గావించి పాలింప వమ్మా మహాదేవదేవీ! మనోహారిణీ! శాంకరీ! గౌరీ! దుర్గే! నమస్తే నమస్తే నమః"

కిర్లంపూడి సంస్థానాధీశ్వరుడు చిన్నభూపాలరాయుడు దేవీ నవరాత్రోత్సవములు చేయు సందర్భమున ఆశువుగా చెప్పినదీ దండకము. చిన్నభూపాలుని ఆస్థాన వైభవము, ఆకార, ఆచార, వ్యవహారాలను వర్ణించనట్టిదై భోగినీ దండకేతివృత్తము వంటిదిగా

కనిపించును. చిన్నభూపాలుడు ఏనుగుపైనంబారీనెక్కి ఊరేగుట, పౌర కాంతలు వివిధరకములుగా నాతనిని భావించి ఆనందించుట జరుగును. మొగంబుల్ గురుల్ గప్పగా దప్పికొంచున్ బదంబందు ఘల్లులా రావం బొప్పగా నందియల్ మ్రోయగా పైటలున్ జారగా వ్రీడచే గప్పికొంచున్ మరుండో! కుబేరాత్మజుండో! సురేంద్రాత్మజుండో! వసంతుడో! యంచున్ బ్రశంసించుచున్ మించియామించు విల్కాని శారిం దగుల్కొంచు నెమ్మోము సూచితే! కాను సింగారముం జూచితే యంచు లోలోన నూహించుకొంచున్ దదేకాతురాయత్త చిత్తమ్ములతో నత్త భీతిన్ విసర్జించుచున్ బోవులై జూడగా నందులో గొంద రత్తింటి కోడండ్ర భీతిం గృహం బేగగా నెంచ వారిన్ మరిం గొందరేమో భయంబేల ఈ చాలునే? యత్తలుం దాము కాలమ్ములో నీదృశంబుల్ విలోకింపబోరే యటంచున్నివారింపగా నత్త యే తెంచి మా కోడలిచ్చోటనే యున్నదా? యింటికిం రాదు గాబోలు నంచున్ ప్రశంసింపగా జూచి యాగుంపులో డాగుచున్ లేదు లేదంచు నావ్వారిచే చెప్పగా... ఇట్లు కొనసాగును. ఈ విధముగా కొంత స్త్రీజన ప్రవృత్తి విశేషములు కనిపించివను తుదకీ దండకము "గౌరీ! దుర్గే! నమస్తే నమస్తే నమః" అని ముగియుట వలన యీ దండకము దుర్గాదేవి స్తోత్రసంబంధిగా తెలియును. ఇది తగణము నాధారముగా జేకొని రచించినది.

వీరి "శ్రీ లక్ష్మి, కాళీ, వాణీ" దండకములను సంస్కృతమున రచించిరి. ఇవి మూడును ఏకపాదయుతమై, గగలతో అంతమగును.[89]

హరికథా పితామహ "ఆదిభట్ల నారాయణ దాసు" గారు (1864-1945) మైసూరు రాష్ట్రమును సందర్శించి 'మైసూరు దేశ ప్రశంసా స్తబకము' అను పేరున దండకము నొకదానిని రచించిరి.[90] ఇది మైసూరు యొక్క అందచందములను వర్ణించు నట్టిది.

దం. "జయ జయ జగతి శీతానిలోద్ధూత రంగత్తరంగావళీ... స్వర్ణ కర్ణాట దేశోత్తమాంగీకృతా రాజధానీ మహీసూరనామ్నా"

అని ముగియును. తగణములతో నడచి గగలతో సంతమగును. కర్త మైసూరును మహీసూరుగా సంబోధించిరి,

1890 ప్రాంతమున 'గుడివాడ తాలూకా ఆఫీసు' నందు సబ్ రిజిస్ట్రారుగా పనిచేసిన 'వావిలాల అద్వైతబ్రహ్మశాస్త్రిలు' గారు ఆంజనేయ దండకము నొకదానిని రచించి యుండిరి,[91] పరమేశ్వరుడు వాయువు-అగ్నులపై తన తేజో జలమును ప్రసరింపజేయును. అగ్ని తన భారమును గంగయందు విడువగా షణ్ముఖుడు జన్మించెను. అగస్త్య మహర్షి శాపము వలన గంధర్వకన్య అంజన నామముతో మర్కటిరూపము కలిగినదై కేసరి నామముగల కీశేశుతో కామ ప్రసంగముల దేలుచూ సంతానము లేమిచే కుందుచుండును. ఈ విషయమును వాయవు తన దివ్యదృష్టితో తెలిసికొని తన భారమును అంజని గర్భమునందుంచెను. ఆంజనేయుడు జన్మించెను. ఈ రెండు విషయముల నాధారముగా గొని, కథాపూర్వకముగా వర్ణింపబడినది.

ఈ యుగమున వెలసిన దండకములలో స్వాతంత్ర్య సంగ్రామ పరిస్థితులను వర్ణించినది, 'సుబ్రహ్మణ్య భాగవతులవారి (20 శ,పూ) భరతమాత దండకము.[92] భారత దేశమును తల్లిగ, మాతృభూమిగ భావించి ఆమె దయను అర్థించుట యీ దండకము నందలి ఉద్దేశ్యము. ఆంగ్లేయులు భారత దేశమును పరిపాలించునప్పటి వారి దౌష్ట్యము లిందు వర్ణితములు. స్వాతంత్ర్య సంగ్రామ విషయము, గాంధీజీ తిలక్ మొదలగు నాయకుల ప్రస్తుతి కలిగినటువంటిది.

దం. "శ్రీమన్మహా భారతాంబా దయా సత్య శౌచాది సద్ధర్మమార్గా వలంబా" యని మొదలిడి 'కొంత కాలంబై పైనుండి మమ్మా

విదేశ ప్రభుత్వంబు పాలింపు చుండంగ పాశ్చాత్యమైనట్టి వ్యామోహమందే సదా మగ్గి మా సంప్రదాయంబులన్వీడి మా కట్టు, మా జుట్టు మా బొట్టు సర్వంబు పాశ్చాత్య మార్గానుసారంబుగా సల్పుచున్ మాతృభాషా ప్రవేశంబు లేనట్టి జీవుండు మూఢుండుగా నెంచుచున్' అనుచు కర్త ఎన్నో విషయములను విప్పిచెప్పుచూ "నిన్ను సేవించు నీభక్త బృందంబుపై నీదు కారుణ్య దృష్టిం బ్రసాదించి మమ్మెల్ల నాశీర్వదించంగదమ్మా నమస్తే నమః" అని ముగించును. భరతమాత స్తుతిపరమైనదిగా కనిపించినను, కర్త సమకాలీన సమాజ పరిస్థితిని దండక రూపమున అద్దము పట్టి చూపించిరి. అక్కడక్కడ గణవిచ్ఛిత్తి జరుగును. ఇది ఉద్వేగపూరితమైన రచన. గద్య దండకము.

స్వాతంత్ర్య సంగ్రామమును పురస్కరించుకొని రచించినటువంటిదే "నేత దండకము" మరియొకటి గలదు.[93] దీనియందు భారత దేశమున మాలుబట్టల ఉత్పత్తి, వర్తక వ్యాపార చరిత, ప్రాచీన కాలముమండి ఆంగ్లేయుల పరిపాలన వరకు తేటతెల్లముగ వర్ణించినది. విదేశీ యంత్రముల మూలమున చేనేత పరిశ్రమకు కలిగిన ముప్పు కూడ వర్ణింపబడినది. కర్త యెవరో తెలియకపోవుట దురదృష్టకరము.

ఇట్లు స్వాతంత్ర్య సంగ్రామమును, ఆంగ్లేయుల దౌష్ట్యములను ఇతివృత్తములుగ గ్రహించి కొన్ని దండకములు వెలువడగ, మరి కొందరు తాత్కాలిక ఉత్పాతములను, సంఘటనలను ఆధారము చేసికొని దండకములు రచించియుండిరి. అటువంటివానిలో "గాలివాన, కోయపితూరీ, ధూమశకట, పీపుల్సుపార్కు అగ్నిప్రళయ దండకములను" ప్రముఖముగా పేర్కొనవచ్చును.

గాలివాన, కోయపితూరీ అను దోపిడీ దండకములను రచించినది బృందావనం రాఘవాచార్యులు గారు. (19,20 శ.)

గాలివానతో కూడిన గొప్ప ఉత్పాతము సంభవించి ప్రజా జీవితము అల్లకల్లోలమైపోయినది, తదుత్పాతమును జూచి రచించి నటువంటిది గాలివాన దండకము. "శ్రీమన్మహాదేవ" అని మొదలిడి ఉత్పాతము జరిగిన రోజున ప్రజలు పడిన కడగండ్లను వర్ణించి అంత మున "క్రోధనామంబు వర్షంబునన్ రాశికిన్ నెక్కు నాశ్వయుజ మాసంబులో శుక్లపక్షంబునన్ సప్తమీ మందవారంబునన్ పంచక్రోశంబులో నుండు శ్రీ గౌతమీతీర గోపాలపగరంబునన్ వెలయు శ్రీ వెంకటేశ్వరుల పాదారవిందంబులన్ డెందంబునన్ దలచి బృందావనము రాఘవాచార్యులని చెప్పగన్" అని తిథి వారాది వివరములు కర్త స్పష్టీకరించి యుండిరి.

కోయపితూరీ అను దోపిడీ దండకము నందు కర్త "శ్రీమన్మహారాజు లాంగ్లేయ ప్రాభుత్వ మందిట్టి చిత్రంబులున్విన్న వారెన్నడున్ లేరు నానాటికిన్ మర్త్యు లార్జించు పాపంబులున్ ఘోరదుర్బుద్ధులున్ హెచ్చులౌచుండ ఇల సత్యమున్ ధర్మమున్ సన్నమైపోవ" అని వాపోయి, వర్షములు లేక కరువు లేర్పడగ కోయజాతివారు గుంపులుగ నేర్పడి గ్రామములను దోచుకొనుచుండిరి. ఈ విషయమును కర్త దండకమున చెప్పిరి.

"కోయదండకమిది నేను కోర్కెమీర
జెప్పినాడను సుజనులు చిత్తగింప
నయగుణులు నార్యులందరు నాదరమున
నయము మీరంగ వినుడి నాహ్లాదమొనర" అని ముగియును.

చాలచోట్ల గణభంగమగును, దండకము పుష్కలమైన వాగ్ధోరణి కలిగినది. ఇదియును గద్య దండకము.

"పాలెపు బంగారురాజు"గారు రాజమహేంద్రవర గ్రామకాపురస్తుడు. "జమాబందీ దండక" కృతికర్త. (20 శ.పూ.) రాజమహేంద్రి

వరమునందు తాలూకా కార్యాలయమున పనిజేసెనో, ఏయూరి కరణముగ నైన పనిజేసెనో తెలియదు. తాలూకా కార్యాలయమున కరణములుపడు పలుపాట్లు వర్ణించుటవలన, నీయన తాలూకా కార్యాలయమున పనిజేసెనని చెప్పవచ్చును. రాజమహేంద్రవరము పరిసర ప్రాంతములైన రాపాక, ఆలమూరు, తొర్రేడు, చెల్లూరు, గోనేడ, పెద్దాడ, జొన్నాడ, వెల్చేరు, మాగాము, తోకాడ, మొదలగు గ్రామ నామములు పేర్కొనబడినవి. ఇంచుమించు 1920, 25 సంవత్సర ప్రాంతమున ఈయన ఈ దండకమును రచించి యుండవచ్చును. గద్య దండకము.

గాలివాన దండకము వంటిదే 'పీపుల్సుపార్కు అగ్నిప్రళయ దండకము.' కర్త 'గంగరాజు అప్పయ్య' మద్రాసులోని విక్టోరియా గార్డెనులో సంభవించిన అగ్ని ప్రమాద మభివర్ణితమైనది.

ఆయా కాలములలో ప్రత్యేక విషయముగ కనిపించినదానిని ఆధారముగ జేసికొని రచించినట్టిదే 'ధూమశకట దండకము'ను. కర్త "గుంటి రంగయ్య."

దేశము పరాయి దేశము వారల పరిపాలనలో పడిన పాట్లను భరతమాత, నేత దండకములు వర్ణించగా, దేశము స్వదేశీయుల పాలనలోనికి వచ్చిన తదుపరి స్వదేశ రాజకీయ నాయకుల దౌర్బల్యమును వర్ణించు దండకము "ఓటు దండకము." గోల్కొండ పత్రికా సంపాదకులు శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు దీనిని కృష్ణా పత్రిక ప్రాత సంచిక నుండి గ్రహించిరట.[96] దండకాదిని రెండు పూర్వకవి కృత పద్యములను పేరడీలుగా మలచి తదుపరి దండకమును రచించి యుండిరి.

"నీవే తల్లివి తండ్రివి
నీవే నా తోడు నీడ నిజముగ సఖుడా
నీవే నా గురుడవు దైవము
నీవే నా పతియు గతియు నిజముగ ఓటర్"

"లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె ప్రాణంబులున్
ఠావుల్దప్పెను మూర్ఛవచ్చె తనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
ఓటే తప్ప యితఃపరం బెరుగ మన్నింపందగున్ దీనునిన్
రావే ఓటర కావవే వరద సంరక్షించు భద్రాత్మకా"

దం. "మహాభాగ్య నగరాన, మా పూర్వపుణ్యాన మేమెన్నియో యేండ్లు చూడంగ చూడంగ మా బాల్యమున్ యౌవ్వనత్వంబు మా ప్రాయమున్ మనోదార్ఢ్యముల్ కుంగుచున్ పోయి వృద్ధాప్యముల్ పొంది... ఓటే ప్రశస్తంబు ఓటే మహాముక్తి ఓటే పరబ్రహ్మ తద్ధారివైనట్టి ఓటర్ మహాదేవ నమస్తే నమస్తే నమః"

స్వాతంత్ర్య సముపార్జనకై గాంధీ, తిలక్ వంటి మహానాయకులు పాట్లుపడి, జనులచే స్తుతింపబడగా, నేటి రాజకీయనాయకులు ఓట్ల సముపార్జనకై పలుపాట్లుపడుచు పేరడీలుగా మలచబడిరి.

ఆంగ్లేయుల దౌష్ట్యములను వర్ణించినటువంటిదే మరియొక దండకము "ఇంజనీరు దండకము." కర్త "దుగ్గిరాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి" హయగ్రీవ స్తుతి కనిపించును. తగణయుతమైన గద్య దండకము. 'లసచ్చక్రి నిర్వక్రి ధారా మహుర్గ్లాన శక్రద్విషచ్చక్రి శుక్రప్రభా కౌముదీపూర పరిపానోత్సుక స్వాంత దుర్ధాంత పంకావళీ ధ్వాంత... అని ఉద్వేగపూరితముగ సంస్కృత సమాసములతో మొదలిడినను తక్కిన దండక మంతయు తేట తెలుగున రచింపబడినదే.

ఈయన ధవళేశ్వరమున ఇంజనీర్ డిపార్ట్‌మెంట్‌లో హెడ్ అక్కౌంటెంట్‌గా పనిజేసెడివారట. అందువలన దీనికి ఇంజనీరు అను నామము స్థిరపడినది.

పింజల సోమశేఖరరావు దేవాంగకులమువారి యిలువేల్పు అయిన చౌడేశ్వరీ అమ్మవారిపై చౌడేశ్వరీదండకము నొకదానిని రచించిరి.[97]

దం. "రాజరాజేశ్వరీ, సర్వలోకేశ్వరీ, సర్వభూతేశ్వరీ, మారి కాత్యాయనీ మానామ నామాంకితంబుల్... బ్రోచుమీ ఈశ్వరీ జగదీశ్వరీ మాహేశ్వరీ చౌడేశ్వరీ మీకుం నమస్తే నమస్తే నమః"

అని స్తుతిపరముగా సాగును. దండకము రగణముతో మొదలిడి తగణమునకు మార్పు చెందును. కృతికర్త ముందుమాట వ్రాయుచు "దీనిని లోకమునకు అందించవలయునని తలపువొడమి, పనిలో పని కొంత సంస్కరించియు, ధ్యానాదులయందత్యంతోపయుక్తమగునటుల చౌడేశ్వరీ అమ్మవారి దండకము జతపరచితిని. ముఖ్యముగ నీకృతి దేవాంగ మహాజనులందరికి గ్రాహ్య పఠనీయము కాగలదని నా విశ్వాసము." అని, అభిప్రాయమును వెలిబుచ్చిరి.

ఇంతదనుక స్వాతంత్ర్య సంగ్రామ పరిస్థితులు, ఆంగ్లేయుల పరిపాలనలోని బాధలను, దేశ రాజకీయనాయకులను, కమనీయమైన ప్రదేశములను, తాత్కాలికోత్సవములను, కొందరి కులదేవతలకు సంబంధించిన దండకములును వెలువడియున్నవి. ఇవియేగాక అనూచానముగా వచ్చుచున్న, భక్తిభావమునకు చెందిన కృష్ణ, రామ, కాళి, నూకాలమ్మ, పోలేరమ్మ, సరస్వతి, ఆంజనేయ, సూర్య మొదలగు దేవతాపరమైన దండకములు ఈ యుగమునందు మిక్కుటముగ వెలసినవి.

భగవంతుని నూరు పద్యములలో నుతించిన శతక కర్తలు కొందరు దండకములను కూడ రచించిరి.

మార్కండేయ శతక కర్త అల్లక సత్యాదాసు తన శతకము సంపూర్ణమయిన తదుపరి రాజమహేంద్రిపుర వాసుడైన మార్కండేయ స్వామిని స్తుతించుచు దండకమును రచించెను.[98]

దం. "శ్రీమన్మహామేరు ధీరా! చిదానంద సారా! మహాపాపదూరా! త్రిలోకాది యాధార!... రాజమహేంద్రివాసా మార్కండధీశా సదా చిద్విలాసా" ఇత్యాదిగా స్తుతింపబడెను.

నీరామి లింగరాజయ్య—భీమలింగేశ్వర శతక కర్త. ఈయన భీమేశ్వరునిపై దండకమును రచించెను.[99]

దం. "శ్రీమద్ధరామండలంబందు శ్రీభీమలింగేశ్వర స్వామి... పర్లా జమీందారు డేలేటి సద్గ్రామమౌ బాహుసాలా పురీవాసుడౌ వీరమాహేశ్వర స్వామి నీరామి వంశోద్భవుండైన లింగాంగి లింగరాజయ్యనే మానసాకృష్ట యోగీంద్రుడీ దండకంబొక్కటిం ప్రూదండగా జెప్పె... దేవదేవేశ దేవాయ తుభ్యం నమస్తే నమస్తే" అని ముగియును.

శారదా పత్రికాధిపతి, రామలింగేశ్వర శతక కర్త అయిన ఆచంట సూర్యనారాయణరాజు, ఆచంట రామలింగేశ్వరునిపై దండకము నొక దానిని రచించెను.[100]

దం. "శ్రీ మన్మహామాని సందోహ సుజ్ఞాన సంప్రేక్షితాలోక సప్తాశ్వ శోభా ప్రతీకాశ... సర్వేశ్వరా! రామలింగేశ్వరా! యీశ్వరా! శంకరా! పాపనాశంకరా! శ్రేష్ఠ వందారు బంధూ దయాపూర్ణ సింధూ స్వరాడ్దివ్యస్వరూపా! విరాడ్భావ్యరూపా! మహాదేవ శంభో నమస్తే నమస్తే నమః" అని ముగియును. రచన సలక్షణమయినది. తగణ ఘటితము.

తణుకు తాలూకా కుముదవల్లి గ్రామ కరణముగా పనిజేసిన ఉమామల్లేశ్వర శతక కర్త-చిప్పాడ శ్రీరాములు, ఉమామల్లేశ్వర స్వామిపై దండక గర్భిత చిత్రసీసము, దండక గర్భిత సీస పద్యములు రచించెను.[101]

రేపాక రాజలింగశతకమును రచించిన కొమ్మరాజు వెంకట శివయ్య శతకాంతమున రామలింగేశ్వర స్తోత్ర దండకము నొకదానిని రచించెను.[102]

కోదండరామ శతక కర్త - అవసరాల రామమూర్తి తమ శత కాంతమున కోదండరామునిపై దండకము నొకటి రచించెను.[103] దండ కాంతమునందు కృతికర్త తన నామము నుటంకించలేదు. దీనిని రామ మూర్తిగారే రచించిరో, ముద్రాపకులే పొందుపరచిరో తెలియదు. పూర్వకవులు రచించిన స్వతంత్ర, గ్రంథస్థ దండకములను ముద్రా పకులు తాము ముద్రించిన పొత్తముల ఆఖరి పుటలో తిరిగి ముద్రిం చుట చేసియుండిరి. కాని ఈ దండకము ఏ గ్రంథస్థముగా గాని, స్వతంత్రముగా గాని నాకగుపించలేదు.

శివస్తోత్రామృతము అను నామముతో శివునిపై నూరు పద్య ములలో శతకరచన చేసినవారు పేరూరు కూర్మయ్య. ఈయన శత కాంతమున శివునిపై దండకము నొకదానిని రచించిరి.[104]

దం. "శ్రీమన్మహానాథ యోవిశ్వనాథా త్రిలోకాదినాథా త్రి నేత్రా ప్రభో నీలకంఠా పరంధామ పంచాననం పార్వతీశం మహాదేవశంభో కృపావారిసింధో దయాళో దయాంభోనిధే ధర్మ సంరక్షణార్థంబు కైలాస వాసుండవై జటాజూట ధారుండవై..." ఇత్యాదిగా కొనసాగును. 'నీ ఆశ్రితుల్ సర్వకాలంబు నిన్నే మదిందలచి నీ మీదనే ఆశపాశంబులన్ భారమున్

మోపి యంతంగా మైమరచి మాసంటు దొల్చంగ మర్యాదె స్వామీ' అని ప్రశ్నించుచూ రావణుని బ్రోచినది నీవేగదా! కైలాసమున పెకలింపబూనిన ఆ రావణునిపై మరల దయను చూపించినది నీవే గదా! బాణాసురుని పూజ సంపదకు మెచ్చి బాహుసంపద నొసంగితివి నీవేగదా! త్రిపురాంత సంహారక! సాంబమూర్తీ! అని స్తుతిపరముగ సాగిన చక్కని రచన. ఇది గద్య దండకము అక్కడక్కడ గణభంగ మగును.

ఈ యుగమున పుట్టిన దండక కృతులలో ప్రత్యేకముగా పేర్కొనదగినది "శివరామకృష్ణ దండకము." కర్త "ముదునూరి వేంకటాచలపతి." సుదీర్ఘమైన గద్య దండకము.[105]

దం. "శ్రీమద్గుణస్తోమ సూత్రామ సంరక్షణవ్యాజ విధ్వస్త క్రవ్యాద రాజ్యాధిపత్యాది మాద్యత్సభస్తోమ సద్భక్త సంస్మృత్య కళ్యాణనామా, భవత్సృష్టి విశ్వంబునన్... సౌహార్ద్ర భావుండవై కాచి రక్షింపు మక్షీణ భద్రాకరంబైన త్వద్భక్తి సారూప్య సాయుజ్య సన్ముక్తి సామ్రాజ్య లబ్ధిన్ ప్రసాదించి యో దేవ దేవా నమస్తే నమస్తే నమస్తే నమః"

ఇది స్వతంత్రము, గ్రంథాంతర్గతము రెండునూ. కర్త దండకమును స్వయముగ ముద్రింపించి యుండిరి. ఈయన యీ దండకమునకు ముందుమాట వ్రాయుచు "శ్రీ సుగుణాకర విజయాది కబ్బంబులు రచించి యుంటి. అందు సుగుణాకర విజయంబను కబ్బంబు శృంగార, ప్రేమ, కరుణా, భక్తిరస ప్రధాన మూలకంబై ద్రాక్షాపాక సమంచితంబై సహస్రాధిక పద్యానువృత్త గద్య సంకలితంబై శ్రీభగవత్కృపాలోకనా విశేషంబున నాంధ్ర కవితా జననీ సహాయ నిరవత్తి కొలంది శ్రీపార్థివనామ సంవత్సరంబున బరిపూర్తియగు

భాగ్యాతిశయోన్నతి వడయగంటి, గాని 'ప్రస్తుత కాలపరిస్థితింబట్టి యా పాత్తంబు నవ్వొత్తించుట కలవియలవడని కతన గ్రంథాంత ర్భాగంబైన యీ దండకంబునైన ముద్రింపించి మనోరథార్థ సంసిద్ధి వడయ దొరకొంటి" నని చెప్పియుండిరి.

శివకేశవభేద యుతమైనది దశావతారవర్ణనము కలిగినది. సుగుణాకర విజయ ప్రబంధము వెలుతురు చూడకపోవుట దురదృష్ట కరము. గ్రంథాంతర్గతమైన దండకము ప్రత్యేకాకృతి దాల్చినది.

శ్రీకాళహస్తికి చేరువలోనున్న అర్సవిల్లి గ్రామమున నెలకొనియున్న శ్రీ సూర్యభగవానునిపై రచించినది 'శ్రీఅర్సవిల్లి సూర్యనారాయణ దండకము.' శిథిలావస్థయందున్నది. కర్త నండూరి విజయగోపాలుడు. కర్తయే స్వయముగా దండకాంతమున 'నండూరి భావన్న రెండవ కుమారుండు విజయగోపాల విద్వద్విధేయుండు' అని చెప్పికొనియుండెను. తగణమాధారముగ నడచిన గద్యదండమిది. గణ విచ్ఛిత్తి జరుగును. 'సూర్యాయయాపాలితే తల్లసద్దండకాఖ్యాన ముర్విం బాధించేటివారల్ శుభైశ్వర్య దీర్ఘాయురారోగ్యముల్గల్గి వర్ధిల్లుచుం ప్రసాదింపుమా శ్రీమతే వీర మార్తాండ!' అని కర్త పంశుతిని పల్కెను.

సూర్యదండకములలో సుప్రసిద్ధమైనది, ప్రాతఃకాల స్మరణీయ మైనది, తెలుగువారలందరూ ముక్త కంఠముతో పఠించునటువంటిది, "శ్రీ సూర్యనారాయణా, వేదపారాయణా, లోకరక్షామణీ, ఆత్మరక్షా మణీ, నమః పాపశిక్షా నమో విశ్వకర్తా నమో విశ్వభర్తా నమో దేవతాచక్రవర్తి... భాస్కరా శ్రీసూర్యనారాయణా మహాదేవ దేవా నమస్తే నమస్తే నమః' అనెడి సూర్యనారాయణస్వామి దండక కర్త యెవరో తెలియదు. రచన ఆపాత మధురమైనది. సూర్యభగవా నుని ముప్పమూడు విశేషణములతో ఘటించిన క్షమా ప్రార్థనా

పూర్వకమైన రచన. తరచుగ ఆకాశవాణి విజయవాడ కేంద్రము నుండి ప్రసారము చేయబడును.

తిరుపతి వెంకటేశ్వరునిపై కొన్ని దండకములు వెలువడినవి. అందు కర్తల నామములు తెలియనివే ఎక్కువ. శ్రీ వేంకటేశా, మహాపాపనాశా అనంత ప్రకాశా దయాదివ్యపాశా సదానిన్ను సేవింతు దీనాళి దైన్యమ్ము పోకార్చి కాపాడు... దురాశా పిశాచోగ్రి దోషాపహారీ కృపాపూర పూర్ణామలాపాంగ వృష్టిన్ మముం గావుమా చక్రిధారీ నమస్తే నమస్తే నమః' అని వేంకటేశ్వరుని స్తుతించుచు సాగినరచన.[106] కవిపేరు తెలియదు. మరి రెండు దండకములు శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారి సంపాదకత్వమున లభించినవి.[107] ఇందు హేమాద్రి రంగకవి రచించిన వేంకటేశ్వరదండకమొకటి కలదు.

రంగనాథుని దండక కృతికర్త ముదివర్తి కొండమాచార్యులు[108]

దం. "జయ జయ భూమినీళా వధూలోక కారుణ్యశీలా... భూదేవ తన్ నమ్మి చెట్లున్న చందాన నేనుంట...... యాగమా ! యోగమా ! జ్ఞానమా! దానమా! సత్యమా! శౌచమా ! యేదియున్ లేదే..." అని క్షమా ప్రార్థనా పూర్వకముగా కొనసాగును. దండకాదిని ఆరు లఘువులకును బదులుగ నాలుగు లఘువులనే ఉంచిరి. కర్త తన కర్మ పరిపాకమునకై శ్రీరంగనాథుని వేడికొనుట ప్రధాన విషయము. పాపముల కన్నిటికిని మూలము దప్పికయు, నాకలియునట. ఆ రెండింటిని బాపమని, తల్లివి తండ్రివి నీవేయని వేడుకొనును.

సీతా దండకము, రామాయణ కథా సంగ్రహ దండకము, శివ దండకము, శ్రీహరి స్తుతి దండకములను రచించినవారు

"జంధ్యాల లక్ష్మీనారాయణ శాస్త్రి"గారు, 26 శ. పూ. ఈయన గుడివాడ తాలూకాలోని కొర్నిపాడు అగ్రహార వాస్తవ్యుడు.

లోకంబునన్ పుత్రకుండెన్ని నేరంబులన్ జేసినన్ తల్లి యుల్లంబునన్ గిన్క జాలించి వానిం దయంజూచి పాలించు లీలన్... కుపుత్రుండు దాబుట్టుగా కెక్కడైనన్ గుమాతల్ జగానన్ లేరటంచున్... ఇత్యాదిగా కొనసాగిన స్తుతిపరమైన దండకము శ్రీమదంబికా దండకము.

దశరథుడు పుత్రకామేష్ఠి యాగము చేయగ దివ్యపురుషుడు ప్రత్యక్షమై పాయసముతో నిండిన దివ్య పాత్రను ఇచ్చుట,దశరథుడు తన సతులకు పంచిపెట్టుట, శ్రీరామ జననము, శ్రీరాముడు తాటికిని చంపుట మారీచ సంహారము, సీతాపహరణము, అహల్యా శాప విముక్తి, రాముడు చిత్రకూటాద్రిపై నుండగా దశరథ నిర్యాణము, జనస్థానమున విరాధాది రాక్షస సంహారము, సుగ్రీవ సఖ్యము, ఆంజనేయుడు లంకకేగి సీతాదేవి సమాచారమును దెచ్చుట, సేతు బంధనము, పద్మజాస్త్రముతో రావణ సంహారము, విభీషణుని లంకకు రాజుగ జేయుట, పుష్పకమెక్కి సీతారాములు సాకేతపురమునకు ఏతెంచుట, శ్రీరామ పట్టాభిషేకము మొదలగు విషయములు అతి సంక్షిప్తముగ వర్ణింపబడిన దండకము. రామాయణ కథా సంగ్రహ దండకము.

శివదండక మంతయును విశేషణములతో కూడినదే.

దం. "శ్రీమన్మహాదేవ శంభో పురారీ మురారిప్రియా విశ్వనాథా జగత్సర్వ సంరక్షణ ధ్వంస ధౌరేయ భీమా మహేశా గిరీశా నిరీశా..." ఇత్యాదిగా కొనసాగును.

శ్రీహరి స్తుతి దండకమున అవతారములు స్వల్పముగ వర్ణింపబడినవి.

సోమయాజుల సుబ్బశర్మ—పరంధామ దండక కృతికర్త.[109] తగణ యుతమైన గద్యదండకమిది.

దం. "...శుద్ధ సత్వప్రధానంబు నాద్యంత శూన్యంబునై సూక్ష్మాతి రూపంబునై కేవలాఖండల స్ఫూర్తి బ్రహ్మాండ భాండంబు వాఙ్మానస ప్రాప్య దృగ్గోచరంబై సదా సత్యమై నిత్యమై తద్వితీయంబు రూపంబచిత్యం బవాచ్యం బతర్క్యం బతీతంబు తుల్యంబునై యద్వయ శ్రీ పరబ్రహ్మ తేజోమయోరాశివై వెల్గుచున్నట్టి నీ తేజమందుండె యే సెంచు నయ్యాదిమూల ప్రకృత్యాఖ్య రూపంబతంత్రితమై హెచ్చి త్రైగుణ్యభావం బుచే నీదు సాన్నిధ్య యోగంబునం జేసెగాదె తదీయాంశ త్రేతంబులో రాజసాంశంబు చతుర్ముఖబ్రహ్మ భావంబుచే ముజ్జగత్సృష్టి కావింపుచు సాత్వికాంశంబునై విష్ణుభావంబుచే దాని పాలింపుచున్ దామసాంశంబునై రుద్రభావంబుచే నాశ మొందింపుచుండెన్ నదే మూల మాయాభిదానంబు చిచ్ఛక్తి రూపంబుగా వేరు నామాంతరంబొందె" అనుచు శ్రీపరంధామ పరతత్త్వ ప్రభావమును కర్త అభివర్ణించిరి. ఇంకను విశ్వరూప ప్రభావము, వటపత్రశాయి ముకుందాభివర్ణన, ఆది విరాణ్మూర్తి వర్ణన, మీనాది పదవతారముల వర్ణనతో పాటు ప్రత్యేకముగా రామ, కృష్ణ, బుద్ధ, కల్క్యవతారముల వర్ణనము, సంపూర్ణ బ్రహ్మము యొక్క వర్ణనతో ఫలశ్రుతిచెప్పి దండకమును ముగించిరి. ఈ యుగమున వెలసిన దండకములలో భగవత్తత్త్వమును వివరింప బూనిన దండకమిది.

"విఘ్నేశ్వర, సరస్వతీ, శ్రీ మదాంజనేయ, శ్రీ శంకర, శ్రీ దశావతార దండకములను దండక కుసుమావళి నామముతో రచించినవారు ఆముజాల నరసింహామూర్తి కవి గారు."[110] కర్త శాలి

వాహాన శకంబున బహుధాన్యాబ్ది చైత్రశుద్ధమున విదియ శనివారమున (క్రీ. శ. 2-4-1948) దండక కుసుమావళిని రచించినట్లు చెప్పికొనిరి. ఈ కృతి కోదండరామున కంకిత మీయబడినది. అయిదు దండకములును తగణమాధారముగ రచించినవే. స్తుత్యాత్మకములైనవి. పఠన యోగ్యములు. కేవలము దండకములనే రచించి ఖ్యాతము వెలువరించిన దీయన ఒక్కరే.

ఇట్లే భగవదంకితములుగా వెలసిన రచనలెన్నియో దండక రూపమున వెలువడినవి. అట్టి వాటిలో వీరభద్రుడు, షిర్డి సాయిబాబా సంక్రామిక వ్యాధి నివారణోపాయములుగ తలచి నూకాలమ్మ, మరిడమ్మ, పోలేరమ్మ, తలుపులమ్మ మొదలగు గ్రామ దేవతలపై స్తుతిపూర్వకములైన దండకము లెన్నియో వెలువడినవి.

ప్రవహించే నదులపై పవిత్ర దేవతారాధన భావముతో దండకములు పుట్టినవి. అట్టివానిలో "వల్లూరి హనుమంతరాయ శాస్త్రిగారి పుష్కర దండకము, వేమూరి నలసింహం గారి కృష్ణానదీ దండకము" పేర్కొన దగినవి.

> "పేపరువంటి దండకము పెద్దలనుజ్ఞ వహించి
> ద్వీపవతిప్రభా వమలపేశల పుష్కరవృత్తి ధర్మముల్
> భూపతి బర్కొటుల్ యగమ ముఖ్య విశేష దరీసప్లయిల్
> శ్రీపతులుత్తముల్ దయ సుశీల సమీర యాఢి నెంచితిన్"[111]
>
> (పుష్కర దండకాంత పద్యము)

కర్త పేపరువంటి దండక మనుట అంతుబట్టనిది స్వచ్ఛమైన దనియా? దినపత్రికవలె పుటలు త్రిప్పుచూ చదువునట్లుగా తీగవలె సాగెడి రచన యనియా? ఏఉద్దేశ్యమున పేపరువంటి దనిరో తెలియనిది. శిసల్ ప్రింటు వేయించి, సమస్తంబు టోటల్, కల్కుటర్,

రాజమహేంద్ర ముస్తాగిరి, రిపోర్టుల్, డిస్ట్రిక్టు, సిర్దార్లు, మెమోరాండ ముల్, శెల్వుసర్వీసు, సమన్ చేసి, బిల్లింగుబున్, దస్కత్తు, బుతేదార్లు, బేహారులు, చోపీలు, దస్సర్లు (డాక్టర్లు) సబార్డినేటు, ఆశిత్యక్లోజుల్, దరోబస్తు, మార్కట్టు, డింగీలు, దీపావళీశేడు, దాఖలా మొదలగు పారశీక, ఆంగ్లభాషాపద ప్రయోగముతో నిండినటువంటిది. దండక చ్ఛందమునకు అన్య భాషాపదముల నిచ్చవచ్చినట్లు వినియోగించిరి.

కర్త దండకాదిలో "గోదావరీ పుష్కర క్షేత్ర దివ్య ప్రజా కీర్తి సామర్థ్య హేలా మహాత్మ్యల్ నదీ సంస్తుతుల్ జేసి వర్ణించెదన్" అని చెప్పినను ఇది స్తుతిపరమైన రచన యెంతమాత్రముగాదు.పుష్కర సమయమున ప్రభుత్వము కావించెడి ఏర్పాట్లను విశదీకరించును. అంత మాత్రమే దీని ప్రయోజనము. కర్త ఛందస్సును గూర్చి భాషాపద జాలమును అపభ్రంశము చేసినను ఛందఃపరమైన తప్పులు కోకొల్లలు. అందునను ఇది గద్య దండకము. ఒకవిధముగా దీనిని గద్యమని చెప్ప వచ్చును.

"కృష్ణా ముష్ణాతు దురితం స్మృష్టా సుజనపావనీ

స్మరణాన్ముక్తిదా పుంసాం భగవన్నామధారిణీ" అని కృష్ణానదీ దండక ప్రారంభమున జెప్పబడినది.[112] కర్త వేమూరి నరసింహం. నాలుగుపాదముల సంస్కృత దండకములను తెలుగు కవులే ఎక్కువ మంది కన్పింతురు.

శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణ కర్త వావిలికొలను సుబ్బరాయకవి కృతమైనవి ఆంజనేయ, కుమార దండకములు.[113] ఆంజనేయ దండకము స్తుతిపరమైనది. రామాయణేతిహాసమున హను మంతుని సాహస కృత్యములు, భక్తి భావము క్లుప్తముగా వర్ణించి నటువంటి పరంపరాగతమైన రచన. కుమార దండకము ఒక ప్రత్యేక సందర్భము కలిగినది.

శ్రీ సుబ్బారావు పంతులు గారికి సంతానములేదు. ఆ కారణాము చేత తన తమ్ముడైన రంగారావుగారి రెండవ కుమారు తెచ్చుకొని పుత్రవాత్సల్యముతో పెంచిరి. 1902వ సంవత్సరము ఫిబ్రవరి నెలలో ఆ బాలుడును మరణించెను. ఆ మరణమునకు ముందు వ్యాధి గ్రస్తుడైన ఆ బాలుని తన తొడలపై పరుండబెట్టుకొని సుబ్బారావు గారు ఈ దండకమును జెప్పిరి.[114]

పన్నాల వేంకట సుబ్బరాయశర్మగారు సుదీర్ఘమైన శ్రీ వేంకటేశ్వర దండకము నొకదానిని జెప్పిరి.[115] ఇంతవరకు ప్రత్యేక దండకముల చివరన పద్యమో, శ్లోకమో వ్రాయుట పరిపాటి, లేదా దండకము నందే తమ వంశమును, నామధేయమును పేర్కొనట జరిగినది. శర్మగారు అట్లుగాక, తక్కిన కావ్య ప్రక్రియలో అంతమున (అశ్వాసాంతమున కూడ) ఉపయోగించెడి గద్యమునే ఉపయోగించిరి.

గద్య. "ఇది శ్రీమదిందిరా సుందర చరణారవింద మకరందపాన తుందిలేందుకుండును, పన్నాల వంశ పయః పారావార కైరవ మిత్రుండును, కౌండిన్యస గోత్రి పవిత్రుండును, లక్ష్మీనరాసాభిధామ పౌత్రుండును, నృసింహార్య పుత్రుండును నగు వేంకట సుబ్బరాయశర్మచే ప్రచయింపబడిన వేంకటేశ్వర దండకము సమాప్తి."

వేంకటేశ్వర స్తుతిపరమైనది. దశావతార వర్ణితమైనది.

శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు-ఆంజనేయ దండకము నొకటి రచించిరి.[116] "భవజ్జన్మ వృత్తాంతమున్ భక్తి భావించి యీ జన్మ ధన్యంబుగా జేసికొందున్మరుత్పుత్ర" యని చెప్పబడినది. రామాయణ కథాసందర్భముల కిందు తావులేదు.

"ఈశ్వరీ శాంభవీ గౌరీ కౌమారీ"యను నామములతో సంబోధించుచు రచించునటువంటిది 'ఈశ్వరమ్మగారి దండకము.'[117] కర్త

'కడియాల వీరపూరయాచార్యులు.' ఆదిశక్తిపరమైనదీ దండకము. ఈశ్వరమ్మ పోతులూరి వీరబ్రహ్మంగారి పుత్రిక యని చెప్పబడినది. ఆమెను పలువిధములుగా స్తుతించునదీ దండకము. అనవసరమైన శబ్దాడంబరము మీాదు మిక్కిలి కన్పించును.

దత్తాత్రేయ వృత్తాంతమును వివరించునది దత్తాత్రేయ దండకము.[118] కర్త శ్రీరామ్ వీరబ్రహ్మకవి.

దం. "శ్రీమన్మహాదేవ దేవాచ్యుత బ్రహ్మ సయుక్త మూర్తి త్రయాద్భుతాకార ! సాధ్వీలలామానసూయాత్రి బ్రహ్మర్షి దీప్యత్తపః ప్రాప్తపూజ్యాత్కుమారా !" అని దండకము ప్రారంభమగును. తరువాత నారదుడేతెంచి త్రిమూర్తుల భార్యల యొద్దకు ఇనుప ముక్కలను తీసికొనిపోయి వానిని ఆహార యోగ్యముగా చేయమనును. అంతటవారు నారదుని పరిహసించిరి. నారదుడు, అత్రి మహాముని భార్య అనసూయా మహాదేవి వీనిని ఆహార యోగ్యముగా చేయగలదని చెప్పెను. ఈ విషయము నెరిగిన త్రిమూర్తు లామెను మాయారూపములతో పరీక్షింప దలచిరి. ఇనుప ముక్కలను గొనిపోయి భోజనమునకు యోగ్యముగాచేసి, ఆహార మును వడ్డించుమని, వివస్త్రోభ్యతో వారి అతిథ్యమే గైకొందుమని నియమము నేర్పరచిరి. ఆమె వీరు సామాన్యులు కారని గ్రహించి, త్రిమూర్తులను పసిబాలురుగా మలచి కోరిన విధముగా అతిథ్య మిచ్చినది. తదుపరి త్రిమూర్తుల భార్యలేతెంచి పసిబాలురుగా నున్న తమ పతులను జూచి యథా స్వరూపులుగా చేయుమని అనసూయా దేవిని వేడుకొనుట లోక మాతలగు వారిని అనసూయాదేవి కీర్తించుట, ఓ దివ్యమాతలారా మీా భర్తలను పుత్రులవలె చూచుకొనెడి భాగ్యమును కలిగింపుమని అనసూయాదేవి వారిని కోరుట, జగన్మాత లగు నా ముగ్గురును తమ నిజేశులయొక్క అంశలను దత్తముచేయుట

జరుగును. ఈ కథనంతటిని కవి, కమనీయముగా దండక రూపమున వెలువరించిరి. దత్తాత్రేయుని కొలిచెడివారికిది ఉపాసన స్తుతివంటిది. కర్త తగణమునే వినియోగించిరి. రచన సుబోధకమైనది.

ఈ యుగమున వెలసిన ఆధునిక దండకములలో 'మాతృ అనసూయాదేవి స్తోత్ర దండక' మొకటి.[119] కర్త యెవరో తెలియదు. జిల్లెళ్ళమూడి అమ్మవారిపై రచించినది. ఎచ్చటనయినను కృతి కని పించి కర్త నామము తెలియకపోవుట కద్దు. కృతి వివరములు తెలిసి, ఆ కృతి కానరాకుండుట కద్దు. ఈ రెండిటికినీ భిన్నమైన సంఘటన యిది. పొత్తము నిన్న కాక మొన్న అచ్చయినట్లున్నది. కృతికర్త నామము లేకుండగనే పొత్తము వెలువడుటకు కారణము దురూహ్యామైనది.

కృతికర్త దండకము నందు అనసూయా మహాదేవి జన్మ వృత్తాంతమును దెలిపిరి. 'ధరన్మన్నవా స్తోక వంశావతోత్తంసమ శ్రీమణీ రంగమాంబా సతీయుక్త సీతాపతీశర్మ సుక్షోద యోత్తేజమాక్తీ పరానందశక్తీ... రాకా నిశారాజ నాగేశ్వరామాత్య హస్త గృహీ తాత్మపత్నీ జగత్సర్వ కళ్యాణయత్నీ పవిత్రాన్న సూయాభిధేయా భిగణ్యే... పరాశక్తి జిల్లెళ్ళమూడీపురీ నిత్య నివాసీ" అని తెలిపి యుండిరి. "శ్రీమంజుల స్వర్ణమాణిక్య సంధాన మంజీర నిక్వాణ విస్ఫార మాతంగ యానామణీవిశ్వ విశ్వోదయానంద చిచ్ఛక్తిరూప ప్రదీపోన్నతీ సర్వలోకోన్నతీ దేవ దేవర్షి సంస్తోత్ర ఓం తత్సవితాద్రి ప్రాచోదయాత్యంత్య మంత్ర త్రిపాద చ్చతుర్వింశతీ బీజగాయత్రిణీ" అనే సంబోధనలతో దండకము ప్రారంభమగును. ఈ దండక కర్తయే తనుపరి స్తోత్రమాల యను పేరున మరియొక దండకము రచించెను. అసంబద్ధమైన శబ్దాడంబరముతో నడచును.

శ్రీశైల భ్రమరాంబా దండకము, శివదండకము అను రెండు దండకములు కన్పట్టుచున్నవి.[120] కృతికర్త యెవరో తెలియదు.

సీ. "కోట వంశాబ్ధి మండిత చంద్రుడు
భోగియా శ్రీ వీరయోగిగురుని
పాదాబ్జములకును భక్తితో దుత మ్రొక్కి
దండకంబు రచింప దలచినాడ
శివభక్తులకు మహా సిద్ధి నొసంగెడి
దండకం బఘజాల ఖండనంబు
బ్రహ్మహత్యాది పాపములను దొలగించు
దండకం బఘజాల ఖండనందు

గీ. మూడు వేళల స్మరియింప ముక్తికలుగు
నాయురారోగ్య విభవము లన్ని గలుగు
కష్టజాలంబు లెల్లను కదలి వెడలు
శ్రీ శివస్తోత్ర దండక సిద్ధి మహిమ" అని కృతికర్త దండకాంతమున పలశ్రుతి చెప్పియుండెను. ఈయనే శివ దండకమున తనను గూర్చి "శ్రీవీర మహేశ్వరార్య స్వామిన్మది న్నిల్పి నీ నామ ధ్యానంబు నే జేయగా బూనితిన్ లింగ ధవళాంగ మంగళా కాళి భక్తుండ భృంగి గోత్రుండనౌ ఈశ లోకేశ భూతేశ విశ్వేశ దేవా నమస్తే నమస్తే నమః" అని చెప్పుటను బట్టి కాళికా భక్తుడనియు, భృంగిగోత్రుడనియు తెలియుచున్నదిగాని నామము మాత్రము గానరాదు. మధురధార కలిగినవీ రెండు దండకములును. శ్రీశైల భ్రమరాంబా దండకమునందు కృతికర్త, మానవుడు జన్మనెత్తిన నాటి నుండి కష్టముల పాలగుచున్నాడనియు, అన్య దైవములను మనసునందు నిలుపక నిన్నే వేడుచున్నాననియు, స్తుతిపరమైన చక్కని రచనచేసిరి.

శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున సుప్రభాత దండకము అను పేరున వెన్నెలకంటి లక్ష్మీనరసింహారావు గారు కూడ దండకరచన గావించిరి.[121] ఈ దండకమునందలి ధార ఎక్కువగా వేంకటేశ్వర స్వామి సుప్రభాతమును పోలి యుండును.

శతావధానులు 'అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, గారావఝల రామకృష్ణశాస్త్రి గారును కలసి సరస్వతీ, శ్రీవిష్ణు, శ్రీలక్ష్మీ, ఈశ్వర, శ్రీమదాంజనేయ నామములతో అయిదు దండకములను రచించిరి.[122]

తెలుగున దండక రచనయందు ప్రత్యేక ప్రతిపత్తి కలిగినవారు, రామాయణ కథ నంతటిని సుదీర్ఘముగ 'దండక రామాయణ' మను పేరిట రచించినవారు శ్రీ కలుగోడు అశ్వత్థరావుగారు[123] (క్రీ. శ. 1901-72) వీరు రాయ దుర్గము తాలూక యందలి కలుగోడు గ్రామ వాస్తవ్యులు. ఇది లఘు కృతిగా చెప్ప శక్యముగాదు. 228 పుటల బృహద్గ్రంథము. రామాయణము నందలి ఆరు కాండములను దండక రామాయణము పేరుతో దండక చ్ఛందమున వ్రాయబడినవి. ఇంతటి బృహదేతివృత్తమును దండక చ్ఛందమున రచించుట మిక్కిలి కష్ట సాధ్యము. ఇంతదనుక తెలుగు దండక సాహిత్యమున ఇంతటి సాహస రచన జరుగలేదు.

తగణఘటితమగు సంప్రదాయ రచన యిది. గద్య దండకమని వేరు చెప్పనవసరములేదు. రామకథ రచించు పట్టున దశరథుడు, భరతుడు, జనకుడు, విభీషణుడు మొదలగు శబ్దములు తగణమునకు లొంగెడివిగావు విభీషణ శబ్దమున ఒక గురువున్నను తక్కినవి సర్వ లఘు శబ్దములు. స్వరూపహాని జరుగవలసి యున్నది. విభీషణుడు శబ్దము విభీషాఖ్య దైత్యేంద్రుడు, విభీషుండు మొదలగు నామాంతర ములతో అక్షర లాఘవత్వమున రచించి యుండెను.

వాల్మీకి రామాయణము ప్రధానమైనను, రంగనాథ రామాయణమును గూడ అనుసరించిరి. అక్కడ అశ్వత్థరావుగారు స్వాతంత్ర్యము గూడ ప్రదర్శించి యుండిరి.

వాల్మీకి రామాయణమున దశరథుని మృతికి కైకేయి విలపించినట్లు కనిపించదు. అశ్వత్థరావుగారు కైకేయి దశరథుని మృతికి మిక్కిలి దుఃఖించినట్లు చిత్రించిరి. అట్లే, మాయలేడి రూపముననున్న మారీచుని తరుముచు శ్రీరాముడు వెడలును. ఎంతకును తిరిగిరాడు. సీత శ్రీరాముని జాడకై లక్ష్మణుని వెడలుమనును. అతడు ఎంతకును వెడలడు. సీత అతనిని నొప్పించి శ్రీరాముని వెదకుటకు పంపును. ఆ సందర్భమున లక్ష్మణుడు సీత యెడల కటువుగ మాటాడినటులు (ధిక్ త్వా మద్య ప్రణశ్యత్వమ్. అర. 45-31) అని వాల్మీకి రచింపగా, అశ్వత్థరావుగారు "తల్లీ! యిటుల్ చెల్లునే తప్పుగా నన్ను భావింపగా నిమ్మనిన్ బంచ భూతమ్ములే పోషించు! జాగ్రత్త! నేబోయి వత్తున్" అని "దేహంబు కంపింపగా నీరు నేత్రంబులన్ రాల నేల్మోడి" వెడలినటులు రచించి యుండిరి.

హనుమంతుడు లంకయందు సీతను వెదకుచుండెను. రావణుని శయ్యపై మండోదరిని జూచి సీతయని భ్రాంతిచెంది తన వాలమును జాడించినటులు, ముద్దిడినటులు, గంతులు వైచినటులు మొదలగు చేష్టలు చేసినటులు వాల్మీకి రచించెను. అశ్వత్థరావుగారు తమ గ్రంథమున మండోదరిని జూచి "దివ్య సౌందర్య రేఖల్ విలోకించి యన్నాతియే సీత కానోవు నంచెంచి నుల్లమున్ గాత్రమాపాదమున్ జిల్లనన్ నీరు గ్రమ్మనన్ విచేష్టుండునై నిల్చి హా! సీత దుష్టాత్ముడైన రావణున్ గూడె నింకేల నా సాహసంబేల శ్రీరాము యత్నంబు" అని విచారించినట్లు హనుమ పాత్రకు ఔచిత్యము చేకూర్చి యుండిరి.

ఇట్లు అశ్వత్థరావుగారి దండక రామాయణము తెలుగునందలి

రామాయణ కృతులలో ప్రత్యేక ప్రతిపత్తి కలిగిన దనుటలో విప్రతిపత్తిలేదు.

అశ్వత్థరావు గారు "ఉత్తరగీతా దండక" మను పేర మరియొక దండకమును రచించియుండిరి.[124] శ్రీ గౌడపాదాచార్యులవారి ఉత్తర గీతకును ఈ దండకమునకును ఎటువంటి సంబంధమును లేదు. దీనిని కన్నడ భాషలో హాస్పేట వాస్తవ్యులు, న్యాయవాదులు నగు మైదూరు తిరుమలాచార్యులుగారు సరళ రగళె యను ఛందమున రచించిన ఉత్తరగీత దీనికి మూలమట. ఈ దండకకృతి కామవరపు సూర్యనారాయణగారి భార్య గవిరేశమ్మగారికి అంకిత మీయబడినది.

భారత యుద్ధానంతరము గీతోపదేశమును మరచిన అర్జునుడు రాజ్య పరిపాలనము విషయభోగముగ తలచి విచరించుచుండగ, కృష్ణభగవానుడు మరల అర్జునునకు ధర్మతత్త్వోపదేశమును జేయును. ఈ సంఘటననే ఉత్తరగీతగా పేరిడిరి.

దం. "శ్రీకృష్ణ! యేనిట్లు రాజ్యంబు, రాజ్యంబటంచాస మాకీవు గొల్పంగ? సద్బంధు మిత్రాళి సంహారమున్ జేయుటన్, రక్త సిక్తంబులౌ హస్తముల్ గొన్న యీపాడు రాజ్యంబు త్యాజ్యం బుగాకెట్లు పూజ్యంబగున్? భోగ రాజ్యంబగున్ మాధవా! సింహాకిశోరమోనా విరాజిల్లు నావీర సౌభద్రుడా పోయె! మాతాత, వంశపుంభాత, మాతాత, మానేత గాంగేయుడో కూలె గట్టా! ధనుష్మన్ మహాలోక వీరాధి వీరుండు లోకైక శూరుండు, విద్యా గురుండౌ ఘటోద్భూతుడౌ ద్రోణుడో లేడుగా!... నాడు గీతోపదేశంబుచే దీర్ఘగా నాత్మ దౌర్బల్య మున్ జూసి యుద్ధావనిన్ గాలరుద్రుండువై నిల్చి వేదండ తండంబులన్ దూకి దూకాడి పోకార్చు నాకేసరీ శాబకం బట్టులన్ వైరి తండంబులన్ జెండె ముల్లోక వీరుండునా పేరు

గన్పట్టి యీ గండదేరీతి కారణంబేమొ ?...... సత్యంబుతే నీనుడుల్ వేసలున్ జేసి డెందంబు గాసిల్లనిల్లే సుమీ! వల్లకాడౌను. కాంతారమే శాంతికిం దావలంబంచు... అని అర్జునుని ఆలోచనలు ఉత్తరగీతోపదేశంతో "ఓ దేవ జ్ఞానోదయం బయ్యె! మద్బాహు మూలంబునన్ దాల్చి సామ్రాజ్యమున్ ధర్మ సంరక్షణన్ జేతు నీయాజ్ఞ నేనాదలన్ దాల్తు నో మాధవా ! యోజగన్నాటకాచార్య ! నీమాయ దాటంగ సాధ్యంబె కాదొక్క నీపాద పద్మావధానంబునన్ దక్క సద్భక్త సంరక్ష దుష్టాళి శిక్షా! దయాపార! లీలావతారా! హరీ! కేశవా! మోక్ష లక్ష్మీధవా! దేవదేవా! నమస్తే నమస్తే నమః" ఈ విధముగ కృష్ణార్జునుల యొక్క సంవాదము ఉత్తరగీతా దండకమున చక్కగ రచింపబడినది. రచన సుబోధకము. తగణయుతమైన గద్య దండకము.

కామవరపు సత్యనారాయణగారు - శ్రీ గజానన దండకమును రచించిరి.[125] వీరు ఆలమూరు గ్రామ వాస్తవ్యులు. ఈ దండకమును వెలువరించినది పేరూరు గ్రామ వాస్తవ్యులైన జిల్లెళ్ళ వెంకట భానోజీ రామయ్యగారు. "శ్రీపార్వతీ పుత్ర సత్పుణ్య చారిత్రశ్రీ సిద్ధి విఘ్నేశ! లంబోదరా! ధూమకేతు గణాధ్యక్షా! నీమీద నే దండకంబొక్కటింజేయ నూహించి..." యని మొదలిడి, దేవలోకమున యింద్రుడు జ్యోతిశ్శాస్త్ర ప్రశంస జేయుట. పరమేశ్వరుడా జ్యోతిశ్శాస్త్రమును పరీక్షించి దృశ్యాదృశ్య మగునట్లు శపించుట దేవతలు గజముఖునికి విఘ్నాధిపత్యము నిచ్చి పూజించుట, రాచ దృష్టిచే వినాయకుని ఉదరము పగులగ పార్వతీదేవి చంద్రుని శపించుట, పునర్జీవితుడగు వినాయకుని దీవించి., పార్వతీదేవి చంద్రునకు తానిచ్చిన శాపము త్రిప్పుట, శమంతకోపాఖ్యానము, జాంబవతీ పరిణయము, శ్రీ సత్యభామా పరిణయము, గ్రంథోత్పత్తి వివరము,

శ్రీ కోనసీమ వెంకట భనోజీ రామయ్య కళాశాలాశీర్వాదముతో దండకము ముగియును.

దేవతా స్తుతిపరమై దండకములు చాల విరివిగ రచించి యుండిరి, అట్టివారిలో 'ఆంజనేయ దండకము - గడ్డం సూర్యనారాయణ,[126] సరస్వతీ దండకము - చంద్రు వీరేశ్వరరావు,[127] ఆంజనేయ దండకము - నరసింహం,[128] విఘ్నేశ్వర దండకము — దొంతి రామదాసు,[129] దండు మారెమ్మ దండకము - వేపూరు నరసింహం,[130] నూకాలమ్మ దండకము- మేడపల్లి గోవిందుడు,[131] కాళీ దండకము - గుండు సర్వేశ్వరుడు,[132] అమ్మవారి దండకము - బేతి లక్ష్మీ నరసింహం,[133] మొదలగువారి దండకములే గాక, కృతి కర్తలు తెలియనివియును పెక్కు గలవు.

ఈయుగ దండక రచయితలలో ద్విభాష్యం ఫుల్లకవి యొకరు. ఈయన రచించిన దండకము లన్నియు సంక్రామిక వ్యాధినివారక దేవతా స్తోత్ర ప్రాయములైనవే. ఈయన లఘుశక్తి, నూకాలమ్మ మరిడమాంబ, తలుపులమ్మ అను నామములతో దండకములు రచించిరి.[134]

ఫుల్లకవిగారు పిఠాపురమునకు చేరువలోనున్న దుర్గాడ గ్రామ వాస్తవ్యులు. ఈయన రచించిన దండకము లన్నిటి యందును తన నామమునే గాక, గ్రామ నామమును, తలిదండ్రుల నామములను పొందుపరచి యుండిరి. ఈయన రచించిన దండకములు నాలుగును గ్రామదేవతలకు సంబంధించినవే. లఘుశక్తి దండకము కూడ నూకాలమ్మ స్తుతి పరమైనదే. ఈ నూకాలమ్మ దేవాలయము సాధారణముగ ప్రతి గ్రామమునందును కన్పించును. గ్రామములందు వ్యాధులు సంక్రమించినపుడు గ్రామదేవతలకు జంతుబలులు నిచ్చుట, యేటేట జాతరలు చేయుట పరిపాటి. అమ్మవారు గ్రామవాసులను

తన చల్లని చూపులతో రక్షించునని గ్రామవాసుల నమ్మకము. అయినను జాతరులు జరుగుట, బలులు నొసగుట పరంపరాగతముగా వచ్చుచునే యున్నది. కర్త ఒకచోట 'నీరూపముం జూపి యీ యక్షిణీ, కామినీ మోహినీ, దైత్యకూష్మాండ సంధిగ్రహాదుల్మముం బాధలం బెట్టకుండంగ తత్కేశముల్బట్టి పక్షంబులం దుంచి పక్షంబులం జించి హస్తంబులందుంచి దునకలౌనట్లుగా భూమిపై గూల్చి యవాటి నెల్లన్దొలంగించి వారించి మాపిల్లల నోళ్ళకి యున్నట్టి యుష్ణంబు, వాతంబులున్, కాళ్ళ యీడ్పున్ బరాకైన వాక్యంబులున్ దాహముల్మాన్పి ఒక్కంబు లాడించవే, పెంచవే తల్లీ యీ బాధలీ గ్రామమం దంతమాత్రంబు లేకుండగా జేయవే...' అని గ్రామ దేవతయగు నూకాలమ్మను స్తుతించును.

అత్యాధునిక దండక కర్తలలో శ్రీ తమ్మన వేంకటేశ్వరరావు ఒకరు. ఈయన మహాదేవ స్తుతిమంజరి నామముతో ఈశ్వరదండకమును,[135] ఆంజనేయ స్తవాక్షరి నామముతో ఆంజనేయ దండకమును[136] రచించిరి.

ఈశ్వర దండకమునందు 'స్వీయ మాయా రజశ్శక్తిన్ బ్రహ్మవై వేరి కర్మంబులన్ వారు భోగించి నిష్కర్ములై ముక్తి చూరంగానన్ వీలుగా సృష్టి కార్యక్రియంబున్ యథాకర్మ నిర్దిష్ట నిర్దుష్ట మార్గంబునన్ పక్షపాతంబు లేకుండ సాగించినావే కదా! సత్త్వముం బూని విష్ణుండవై సర్వలోక స్థితి ప్రార్థనీయ వ్యవస్థా ప్రతిష్టాపనాచార్య వర్యుండవైతే కదా!' ఇట్లు పరమేశ్వరుని కార్యక్రియమును వివరించిరి. పరమేశ్వర స్వరూపమును గూర్చి 'వివేచింప నీ జాగరూకత్వమే సృష్టి, నీ స్వప్నమే సృష్టి, నీ వాక్కు మంత్రంబు, నీ మానమే సత్తపోనిష్ట, నీ శ్వాస వేదంబు, నీ ప్రీతి వర్షంబు, నీ భూలతా కంపముల్ క్రొమ్మెరుంగుల్. నీ మందహాసంబులే వెన్నె

లల్, నీదు క్రోధమ్మె కష్టెండ, కరాళించు నీ హుంకృతుల్ నిప్పులం గ్రక్కు నిర్ఘాతముల్, నీదు పాదంబు పాతాళలోకంబు. నీమధ్యమూర్వీ తలంబిక, నీ మూర్ధమే సత్యలోకంబు, నీ కేశపాశంబె యాకాశ ధామంబు, నీ రోమముల్ వృక్షముల్, నీదు కాఠిన్యమే శైలముల్, నీదు మృదుత్వంబె కూలంకషల్, నీదు కనెప్ప పాటుల్ గణింపగ మన్వంతరంబుల్, విభాగింప నీ వామపార్శ్వంబు స్త్రీ తత్త్వ సంపత్తి, నీ దక్షిణాంగంబు పుంభావ విస్ఫూర్తి, నీ కూచరాగంబె సంగీత శాస్త్రంబు, నీ పాద విన్యాసమే నాట్య శాస్త్రంబు, నీ వాదచాతుర్యమే తర్క శాస్త్రంబు, నీ నామమే శబ్ద శాస్త్రంబు, నీ నైజమే తత్త్వ శాస్త్రంబు. నీ తీర్పె ధర్మంబు నీ యోర్పె యర్థంబు, నీ కూర్పె కామంబు. నీ చేర్పె మోక్షంబు' అని సమస్త ప్రకృతిని, సకల చరాచర జగత్తును పరమేశ్వర స్వరూపముగా కవి వర్ణించిరి. కవితాధార అనర్గళమైనది. ప్రాచీన కవుల సరసన నిలువగల శక్తి గలది. ఈ దండకమున కర్త పరమేశ్వర పరముగా తోంబది విశేషములను వాడి యుండిరి.

నారదుడు, ప్రహ్లాదుడు, ధ్రువుడు, అక్రూరుడు, ఉద్ధవుడు, భీష్ముడు, అర్జునుడు, కుబేరుడు, గజేంద్రుడు, విభీషణుడు మొదలగు వారి వలె ఆంజనేయుడును మహా భక్తుడు. తక్కిన వారందరూ పురాణ ప్రసిద్ధులేగాని, ఆలయ ఆరాధన, జప యోగ్యత కలిగినవారు కాదు. ఒక్క ఆంజనేయునకు మాత్రమే ఆలయ ప్రతిష్ఠ, జపయోగ్యత పారాయణ ఫలము, భక్తానుగ్రహ శక్తి, వరదాన సామర్థ్యము ఉన్నవి. అట్టి హనుమంతుని పై తెలుగువారు కొన్ని వందలి సంవత్సరముల నుండి, దండక రూపమున స్తుతించుచునే యుండిరి. అత్యాధునికముగ తమ్మన వేంకటేశ్వరరావు గారును సుదీర్ఘమగు దండకము నొకదానిని ఆంజనేయస్వామిపై రచించిరి. ఉభయభాషలు కలసి సమానముగా పరుగులిడును.

తెలుగున దండక సాహిత్యములో హాస్యరస పూరితములైన కాఫీ టీ, పొగాకు మొదలగు దండకములు కూడా జనించినవి. చతుర్థాధ్యాయమున వీనిని పేర్కొనుట జరిగినది. ఇట్టి దండకములేగాక, తిట్లు కూడ దండక రూపమున వెలువడినవి. గుక్క త్రిప్పుకొనకుండా తిట్టవలెనన్న దండక చ్ఛందమే తగినదని తలచిరి గాబోలు. ఈ తిట్ల దండకములు నాకంటబడినవి గావు. రావూరి దొరసామిశర్మగారు రెండు తిట్ల దండకముల వివరములను సేకరించిరి.

"ఇయ్యది కోపూరి రామయ్యాను సంస్థానోద్యోగిపై చెప్పినది. మన కవిగారి బర్రె రామయ్యగారి దొడ్డిలో కూరాకు తోటలో పడి మేసినది. రామయ్యగారి భార్య కవిగారి భార్య కామాక్షమ్మతో తగవులాడినది. అంతట ఊరుకొనక ప్రతిదినము కవిగారి కుటుంబమును తిట్టుచున్నది. ఒక సంవత్సరము గడచిన తరువాత నిత్యము భరించు బాధ కామాక్షమ్మగారు కవిగారితో చెప్పి ప్రతీకారము చేయుగోరినది. ఆమె చేసిన తప్పుకి తల తీయవలెనే గాని, బ్రహ్మహత్యా వాటిల్లునని తత్ ప్రత్యామ్నాయముగ రాజుతో విన్నవించినాడట కవి. అది కానిపని అని ప్రభువు తెలుపగా నేనే ఆపని చేయించెదనని కవిగారు అన్నారట. ఇంతలో రామయ్యను రావలసినదని రాజువద్దనుండి వచ్చిన వార్త తెలిసి రామయ్య ఆస్థానమునకు రాగా కవిగారు చూసి కోపోద్రిక్తుడై తన తిట్లను దండక రూపమున ప్రవేశపెట్టి ప్రయోగించినాడు."[137] ఈ కథ కార్వేటి నగరములో వాడుకలో నున్నదట.

దం. ఛీ ఛీ ఒరే పాతకా! ఘాతుకా! దుర్నీత! ఉచ్ఛిష్టపున్ రోత! వారాంగనా మూత్రముల్ పట్టు ముంతా! ఇదే చూడగా! ధాత నీ వ్రాత నాచేత పట్టిచ్చెరా నేడు! దుర్భజమా, సాజమా, ఏర కోపూరి రామా హరామా, గులామా, పురీషంపు తూమా, ఉపారాల వేటా..." వినలేని మాటలు తిట్ల రూపమున వెలువడినవి. తుదకు కోపూరి రామయ్య తిరిగి ఇంటికేగి లోని

కడుగిడుతున్న సమయమున ద్వారబంధము తలకు తగిలి మంచముపట్టి మరణించెనట కథ నిజమగునో లేదో గాని కవికి అనర్గళమైన కవితాధోరణి యుండినట్లు తెలియును.

విజయనగర సంస్థానములో పూసపాటి ప్రభువులు (బ్రాహ్మణుల కిచ్చిన భూములను కస్తూరి అప్పయ అనునతడు విఘాతము కలిగించుచుండగ ఎవరో కవిగారు చెప్పిన మరియొక తిట్ల దండకము కలదు. కవిగారి పేరు తెలియదు.

"శ్రీయుత పూసపాటి కులసింధు సుధాకరులైన భూపతుల్
వేయితరాల నుండి కడు వేడ్క నొసంగిన యట్టి మాన్యముల్
న్యాయముదప్పి ఘాతకొడిగట్టిన నీ కులమున్ యశంబు నీ
యాయువు క్షీణమై పోచను యథార్థము నమ్మర కస్తురప్పయా.
(దండకాంత పద్యము.)

దం. "నీ కెంత చేటున్నదో కాని భూలోకమందెన్నడున్ లేని దుర్మార్గపాలోచనల్ సంభవించెన్ మరిన్ నీకు నీసారి యార్నెల్లకే తప్పినన్ ఒక్క యేడాదికిన్ మీదుగాకుండ నీ చావు నిక్కంబుగా నమ్ముమీ బ్రహ్మదేవుండు శంభుండు నీకడ్డమై వచ్చినా నామాటకుం దప్పగాదు ఛీ లండీ! మొండి శిఖండి, గులామా!" 138

విజయనగర సంస్థానమున చిన విజయరామరాజు (1747–94) కాలమున తిట్టు కవిత్వము చెప్పగల దిట్ట, 'సూరకవి తిట్టు కంసాలి సుత్తి పెట్టు' అను నానుడి కలిగిన 'అడిదము సూరకవి' యుండెను. కాని ఇదమిత్థముగా వివరములు తెలియవు.

### 3–4–3. ఆధునికయుగ విశిష్టత :—

నేటికి తెలుగు దండక సాహిత్యము వేయి సంవత్సరముల ప్రాయము కలిగినదైనది.

భగవన్నుతి శంకితమై పారాయణ యోగ్యమగు దండకము రాను రాను శృంగార భరితమై, ఆధునిక యుగమున చారిత్రాత్మక సంఘటనలను కూడ రచించుట కుపయుక్తమైనది. ప్రకృతి యందలి ఉత్పాతములను చెప్పినది. తుదకు కాఫీ, టీ, పొగాకు మొదలగు వ్యసనములు దండకమున వర్ణింపబడి, హాస్యరసమునకు ఆటపట్టైనది. ఇన్ని విధములుగ దండకము మలుపు తిరిగి అత్యున్నత స్థాయికి చేరి నేల నాలుగు చెరగులా విస్తరించినది.

దండక శాఖకు వికాస స్థితి ఆధునిక యుగమునందే యని చెప్ప వలెను. ఇట్లు దండకములు దప్ప తక్కిన పోకడలన్నియును హర్షించ దగినవే. గత మూడు యుగముల కంటె వస్తు వైవిధ్యమున అనంత విధములుగ భాసించినది. భోగినీ దండకేతివృత్తమును చాల వరకు నే కవియును రచింప బూనలేదు. ఒకటి రెండున్నను దక్షిణాంధ్ర యుగమునందువలె ఉద్ధృత రూపము దాల్చలేదు.

రాచరిక వ్యవస్థ తారుమార్రై జమీందారీ వ్యవస్థ యందడు గిడి, స్వాతంత్ర్య సమరమున కవుల యందు జాగృతి కలిగినది. కావు ననే సమాజమున కనుగుణముగ దండక యితివృత్తము మలచబడినది. తన స్వరూపమును స్వభావమును సంపూర్ణముగ వ్యక్తీకరింపజేసి కొనినది.

ఔన్నత్యము కలిగిన గాంధీ వంటి వ్యక్తులు పరముగ, స్వాతం త్ర్య సంగ్రామమున ప్రబోధాత్మకముగ, గుర్తింపదగిన ఉత్పాతము లకు గురుతులుగ, భోగలాలసత్వము కలిగిన రాజకీయ నాయకులకు విమర్శగా, మీదు మిక్కిలి భగవన్నుతి పరముగ, సంఖ్యయందధి కమై, వస్తువునందు నైవిధ్యము కలిగినదై, ప్రబల ప్రచారము పొందిన దగుటవలన ఆధునిక యుగమున దండక సాహిత్యమునకు వికాసస్థితి యని తప్పక చెప్ప వచ్చును.

## అథస్సూచికలు

1. **Pingala Naga, the author of the sutra on the metrical science was the younger brother of panini, Maxmullar and weber had accepted this view was Pinglanaga, the younger brother of the same panini, who was the author of Ashtadhyayi.**

   **(A comprahensive History of vedic literature. Brahmana and Aranyaka works' Satya sarva. XIV Chapter page, 293 )**

2. ప్రబోధ చంద్రోదయము, చతుర్థాంకము. పు. 162-64

3. ఋతుసంహారము, శృతబోధ, శృంగారతిలకము, శృంగార రసాష్టకము, సేతుబంధము, జ్యోతిర్విద్యాభరణము, కర్పూరమంజరి, శ్యామలా దండకము, పుష్పబాణ విలాసము, కాళిదాస ప్రహసనము, ప్రశ్నోత్తరమాల,కుంతేశ్వర దౌత్యము, రాక్షసకావ్యము నవరత్నమాల మొదలగు ననేక కృతులు కాళిదాసు పేర గన వచ్చునుగాని, యిందొకటియు నిజముగా రఘువంశ కర్తదిగాదు.

   సంస్కృత వాఙ్మయ చరిత్ర. సం 2, పు. 274

4. (ఈ విభాగము సౌలభ్యము కొరకు గావింపబడినది. ఒకేకాలమునందు వివిధరీతుల దండక రచనలు పుట్టుక కూడా ఇందులకు కారణము. పురాణేతిహాస యుగమున స్వతంత్ర దండక కృతులు నామమాత్రములైనవి. ఇక దక్షిణాంధ్ర యుగమున, ఆధునిక యుగమున స్వతంత్ర కృతు లధికముగ కనిపించినను గ్రంథాంతర్గతమునగల అవిచ్ఛిన్నత కాదనరానిది. కాన నీయుగ విభజనము సమర్థనము కాగలదు.)

5. (వేదముల కెల్ల నోంకార మాదియైన, కరణి గృతులకు నెల్ల శ్రీకారమాదిగాన కవివరులెల్లను దానిదక్క, నితర వర్ణంబు లిడరు సత్కృతుల మొదల.) అప్పకవీయము 3-354

6. దేవ దేవ మహాదేవ నీలగ్రీవ జటాధర
కారణంచ పరమ్ జానే త్వాం త్ర్యంబకం విభుమ్
భగవన్ దర్శనాకాంక్షీ ప్రాప్తోస్మిమం మహాగిరిమ్
దయితం తవ దేవదేవేశ తాపసాలయ ముత్తమన్
(వ్యాస భారతము, వనపర్వము. అధ్యా. 39, శ్లో. సం. 74-81)
7. షష్ఠాశ్వాసము. ప. సం. 224
8. శ్రీనాథుని దండకములు, వార్తపత్రిక. 1967
9. పంచమాశ్వాసము, ప. సం 111
10. పర్వత ప్రకరణము, మృగవ్యాధుని కథ. పు. 255
11. చాటుపద్యమంజరి. ప్రి. సం. పు. 80, 81.
12. చతుర్థాశ్వాసము. ప. సం. 138
13. హరవిలాసము, పంచమాశ్వాసము. ప. సం. 58
14. ,, షష్ఠాశ్వాసము. ,, 62
15. కాశీ ఖండము. సప్తమాశ్వాసము. ప. సం. 74,203.
16. శ్రీనాథుని దండకములు. వార్తపత్రిక. 1967
17. ఆంధ్రమహాభాగవతము. తృతీయ స్కంధము. ప. సం. 204.
18. ప. సం. 1237
19. చతుర్థాశ్వాసము. ప. సం. 180
20. ద్వితీయాశ్వాసము ప. సం. 181
21. ద్వితీయాశ్వాసము ప. సం. 59
22. చతుర్థాశ్వాసము ప సం. 24
23. ప్రథమాశ్వాసము ప సం. 197
24. ప. సం. 91
25. ప్రబోధ చంద్రోదయము, జంటకవులు. చతుర్థాశ్వాసము ప సం. 46
26. ,, కృష్ణమిశ్రుడు. చతుర్థాంకము పు. 162-64
(కృష్ణమిశ్రుని దండకము అనుబంధమున నియబడినది.)

27. తృతీయాశ్వాసము ప. సం. 132
28. తృతీయాశ్వాసము ప. సం. 38
29. తృతీయాశ్వాసము. ప. సం. 28
30. చతుర్థాశ్వాసము ప. సం. 77
31. ద్వితీయాశ్వాసము ప. సం, 253
32. పంచమాశ్వాసము పు. 102
33. అప్పకవీయము, చతుర్థాశ్వాసము ...
34. శృంగార దండకము, ఆంధ్రసాహిత్య పరిషత్తు, వ్రాతప్రతి. నెం. 142/20
35. అష్టభాషా దండకము, ఆంధ్రసాహిత్య పరిషత్తు డి. నెం. 123/20
36. సమగ్ర ఆంధ్రసాహిత్యం సం. 12, పు. 67
37. ప్రథమాశ్వాసము ప. సం. 118
38. పంచమాశ్వాసము ప. సం. 62
39. ప. సం. 143
40. ప. సం. 807
41. ప. సం. 832
42. పు. 94–96
43. ప్రకృతి పురుష విభాగాంతము
44. పంచమాశ్వాసము. ప. సం. 47
45. సప్తమాశ్వాసము ప. సం. 436
46. చతుర్థాశ్వాసము ప. సం. 33
47. రాజశేఖరవిలాసము, కూచిమంచి తిమ్మకవి, ద్వితీయాశ్వాసము. ప. సం. 194
48. నీలాసుందరి పరిణయము, " " " ప. సం. 41
49. యుద్ధకాండ ప. సం, 166
50. షష్ఠాశ్వాసము ప. సం. 179

51. చతుర్థాశ్వాసము ప. సం. 97
52. చతుర్థాశ్వాసము ప, సం. 157
53. చతుర్థాశ్వాసము ప. సం. 113
54. తృతీయాశ్వాసము ప. సం. 157
55. ప్రథమాశ్వాసము ప. సం. 48
56. పంచమాశ్వాసము ప. సం. 62
57. ప్రథమాశ్వాసము ప. సం. 53
58. చతుర్థాశ్వాసము ప. సం. 217
59. ప్రథమాశ్వాసము ప. సం. 261
60. రెండవ విన్నపము
61. అముద్రిత తాళపత్రి ప్రతి డి. నెం. 423
62 అముద్రిత తాళపత్ర ప్రతి డి. నెం. 426
63. ది సదరన్ స్కూల్ ఆఫ్ తెలుగు లిటరేచర్, పీఠిక పు. 112
64. అముద్రిత తాళపత్ర ప్రతి డి. నెం. 425
65. **First Bulletion of oriental manscript library. Madras, 1948, Edited by, Sri N. Venkata Rao.**
66. అముద్రిత తాళపత్రి ప్రతి డి. నెం. 848
67. ,, ,, డి నెం. 152
68. కడపటిరాయల యుగము సం. 12, పు. 131
69. ఆంధ్ర సాహిత్య పరిషత్తు, వ్రాతప్రతి డి. నెం. 25/20
70. ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీ, హైదరాబాదు, వ్రాత ప్రతి, నెం. 37; T16-10
71. భాషీయదండకము, గుండ్లూరి నరసింహశాస్త్రి.
72. తృతీయాశ్వాసము పు. 111
73. ప. సం, 281
74. షష్ఠాశ్వాసము ప. సం. 87

75. తృతీయాశ్వాసము ప. సం. 102
76. తృతీయాశ్వాసము ప. సం. 42
77. తృతీయాశ్వాసము ప. సం. 58
78. ప్రథమాశ్వాసము ప. సం. 120
79. చతుర్థాశ్వాసము ప. సం. 23
80 భగవద్విలాసము 47
81. యుద్ధకాండ ప. సం. 3-216, 4-35
82. చతుర్థాశ్వాసము ప. సం. 26
83. ద్వితీయాశ్వాసము. ప. సం 188
84. మార్కండేయ పురాణాంతర్గత మదాలస చరిత్రము 21వ అధ్యాయము శ్లో. సం. 195-204.
85. షష్ఠాశ్వాసము ప. సం 126
86. ద్వాదశ సర్గ. శ్లో. సం. 23-36
87. గాయత్రీ దండకము 1978
88. నానారాజ సందర్శనము ఉత్తరార్థము పు. 79
89. కాళికాది స్తోత్రమాల. పు. 14
90. చాటు ప్రబంధము. పు 107
91. ఆంజనేయ దండకము
92. భరతమాత దండకము
93. ఆధునిక యుగము-గాంధీ సాహిత్యము, నేత దండకము, నిడదవోలు వెంకటరావు.
94. గాలివాన దండకము
95. కోయపితూరీ అను దోపిడీ దండకము

96. ఓటు దండకము, హాస్యతోరణము, సంపా; పోలాప్రగడ సత్యనారాయణమూర్తి పు. 172–75

97. చౌడేశ్వరీ దండకము సారస్వతనికేతనం ప్రింటింగ్ ప్రెస్, 1960.

98. మార్కండేయ శతకము. అల్లక సత్యదాసు. ఆఖరిపుట

99. భీమలింగేశ్వర శతకము, నీరామి లింగరాజయ్య. ఆఖరిపుట

100. శ్రీమదాచంట రామలింగేశ్వర శతకము. ఆఖరిపుట

101. ఉమామల్లేశ్వర శతకము. ప. సం. 33, 74, 75

102. రేపాక లింగరాజ శతకము, శివదండకము. ఆఖరిపుట

103. కోదండరామశతకము, కోదండరామ దండకము. ఆఖరిపుట

104. శివస్తోత్రామృతము, శివదండకము. ఆఖరిపుట

105. శివరామకృష్ణ దండకము, ముంజులూరు.

106. సరస్వతీ జ్యోతిషాలయంవారి ముద్రణ, కాకినాడ.

107. శ్రీవేంకటేశ్వర లఘు కృతులు, పు. 151–158

108. సప్తగిరి, జూన్, 1984.

109. పరంధామ దండకము, శ్రీ శారదా విలాస ముద్రాక్షరశాల, పాలకొల్లు.

110. దండక కుసుమావళి, పండితరాయ ముద్రాక్షరశాల, 1940

111. పుష్కర దండకము, మనోరమా ముద్రాక్షరశాల, 1908

112 కృష్ణానదీ దండకము, బెజవాడ, వాణీ ముద్రాక్షరశాల, 1918

113. ఆంజనేయ దండకము, ఒంటిమిట్ట; వాల్మీకి ఆశ్రమము, 1920

114. కుమార దండకము, కాకినాడ; ఆంధ్ర సాహిత్య పరిషత్తు, నం. 826/7

115. శ్రీ వేంకటేశ్వర దండకము, బాపట్ల; విజయా ప్రెస్

116. ఆంజనేయ దండకము, ఒంగోలు; రామమోహన ప్రెస్, 1943

117. ఈశ్వరమ్మగారి దండకము, తెనాలి; రఘు బుక్ షాప్

118. దత్తాత్రేయ దండకము, మచిలీపట్టణం; హిందూ ప్రెస్, 1951

119. మాతృశ్రీ అనసూయాదేవి స్తవం, నిడుబ్రోలు; విజయా ప్రెస్, 29-12-1960

12. శ్రీశైల భ్రమరాంబా దండకము, బాపట్ల; కన్యకాపరమేశ్వరీ ముద్రాక్షరశాల, 1930

శివ దండకము, " " "

121. శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున సుప్రభాత దండకము.

122. అట్టలు చినిగినవి. వేటపాలెం; సారస్వత నికేతనం, నెం. 294 . 5 / 9270

123. దండక రామాయణము 1648

124. ఉత్తరగీతా దండకము, ఆలమూరు; వెంకటేశ్వర ప్రింటింగ్ ప్రెస్, 1954

125. గజానన దండకము, భట్నవల్లి; ఎస్. ఎస్. ప్రెస్, ద్వి. ము.1952

126. అట్టలు చినిగినవి, వేటలపాలెం; సారస్వత నికేతనం, నెం. 294.5/ 10679

127. రాజమండ్రి; సరస్వతీ పవర్ ప్రెస్, 1925

128. చెన్నపురి; లక్ష్మీనృసింహవిలాస ముద్రాక్షరశాల, 1919

129. దండక రత్నములు, రాజమండ్రి; గొల్లపూడి వీరాస్వామి సన్

130. " " "

131. " " "

132. త్రిదండకములు, రాజమండ్రి; కొండపల్లి ప్రెస్

133. ,, ,, ,,

134. 1,2,3,4. కాకినాడ, ఆంధ్రసాహిత్య పరిషత్తు, నెం. 15/24

135. ఈశ్వర దండకము, మహాదేవ స్తుతిమంజరి, భీమవరం; గౌతమీ ప్రింటర్స్, 86

136. ఆంజనేయ దండకము, ఆంజనేయ స్తవావళి, భీమవరం; ఎస్. ఆర్. ప్రింటర్స్, 83

137. తెలుగులో తిట్టు కవిత్వము, పు. 123, 24.

138. తెలుగులో తిట్టు కవిత్వము, పు. 125

# 4

# దండకము-వివిధ రీతులు

'రస్యతే ఆస్వాద్యతే రసః' అని రసశబ్ద నిర్వచనము. రసమును గూర్చి భరతముని 'న భావహీనో౽స్తి రసః న భావో రస వర్జితః'అని రస ప్రాముఖ్యమును ఉగ్గడించి యుండెను. ఇట్టి రసములు ఎనిమిది లేక తొమ్మిది విధములని, అవియేగాక నింకను భక్తి ప్రేమో వాత్స ల్యాది రసములు కలవనియు రస చర్చ గలదు. ఇట రస సంఖ్యా విషయక చర్చ యనవసరము. ఏమన భరతుడు తెలిపిన తొమ్మిది రసములనే గాక భక్తి గూడ రసముగ యంగీకరించుచూ సిద్ధాంతీకరించిన వారును గలరు. వారి వారి సిద్ధాంతములను పరిశీలించిన భక్తిని కూడ నొక రసముగ నంగీకరింపవలసి యున్నది.

ఇట్టి రసములకు నాటపట్టులైన దండకరచన లనేకములు గలవు. దండకములలో నేయే రసములు ప్రముఖపాత్రి వహించినవి యనునది ప్రధానాంశము. అట్లే సాంఘిక పరిస్థితులను వెల్లడిచేయునట్టి దండకములును గలవు. అటువంటివానిని సాంఘికములుగనే విభాగింపబడినవి. రస నిష్ఠకు గాని, సాంఘిక ప్రాధాన్యమునకుగాని చెందని తిట్లతోకూడిన దండకములును గలవు. అట్టివానిని తిట్లు దండకములు గనే పరిశీలింపబడినవి.

అనగా దండక సాహిత్యము తెలుగున అనేక రూపములలో వెల్లివిరియుట వలన వివిధ రీతులుగ పేర్కొని విషయ ప్రాధాన్యమును బట్టి వివరింపబడినవి

తెలుగు దండక సాహిత్యము భక్తిరస సముద్భూతము. భక్తి భావములకే యంకితమయినది. స్వతంత్రములు కొన్ని యీ భక్తి

భావమును విడిచి వివిధరీతుల నడచినవి. ఇదియును హర్ష దాయకమైన పరిణామమే అయినను తెలుగున దండకముల ప్రధాన తత్త్వము భక్తిభావ సంభరితములై కొనసాగుట. ఈ నడక వేయి సంవత్సరముల నాటిది. నేటికిని యీ బాటను వీడనిది.

భక్తి భావమునకు దండకము అనువుగ నుండుటకు ఆచార్య కము నెరపిన మనీషి నన్నయభట్టు. ఈతని మహాభారతాంతర్గత దండకము భక్తిభావ సంభరితము. వందలకొలది రచనలకిది రెుుజ్జబంతి.

ఇట్లు నడచిన దండకములు బహుచమత్కారములతో కూడినట్టివి. ఇవి రచనా వైశిష్ట్యమును, ప్రత్యేకతను, దండకముయొక్క పరిణామ క్రమమును వ్యక్తీకరించునవేగాని, వానిని ప్రత్యేకముగ నుటంకింప బనిలేదు.

## 4-1. భక్తి :

### 4-1-1. భక్తి నిర్వచనము :

భజ సేవాయాం అను ధాతువునకు 'క్తిన్' ప్రత్యయము చేరుట వలన భక్తి యనుపద ముత్పన్నమగుచున్నది. అనగా నిర్మలమైన మనోవాక్కాయ కర్మలతో భగవంతుని సేవించుట భక్తి యగును. అట్టి యీ భక్తిని ఎందరో మహాపురుషులు అనేక విధముల నిర్వచించి యుండిరి.

శ్లో. "మయ్యావేశ్య మనో యేమాం నిత్య యుక్తా ఉపాసతే
శ్రద్ధయా పరయోపేతా స్తేమేయుక్త తమామతాః"

భగవద్గీత 12-2

అని గీతాచార్యుని వాక్కు. దీనివలన భక్తియన నిరంతరము నిర్మల మైన మనస్సుతో భగవంతుని సేవించుటయని తెలియును. "తన ఆత్మ

స్వరూపముతో ఐక్యమందుటయే భక్తి” యని వివేక చూడామణి యందు శంకరాచార్యులవారు వక్కాణించియుండిరి.[1] “పరమేశ్వరుని పాదపద్మములను చేరిన మానసిక వృత్తియే భక్తి” యని శివానందల హరి యందు శంకరభగవత్పాదులు మరియొక నిర్వచన మొసగి యుండిరి.[2] “ప్రేమతో ప్రారంభమై ప్రేమతో అభివృద్ధి చెంది ప్రేమ చేతనే సమాప్తి నొందు యథార్థ పరమేశ్వరాన్వేషణ”యని స్వామి వివేకానంద భక్తియోగమును గూర్చి వివరించియుండెను.[3] సమస్త కర్మములను భగవదంకితము చేయవలెను, ఆ భగవంతుని యే మాత్రము విస్మరించినను పరమవ్యాకుల హృదయులగుటయే భక్తి” యని నారదుని మతము.[4]

## 4-1-2. భక్తి రసము :–

భక్తి రసమగునా? యను విషయమున చాలమంది లాక్షణికులు భక్తిని రసముగా అంగీకరించలేదు.

భక్తిని రసముగ ప్రతిపాదించి, నిర్వచించి, వివరించిన వారిలో ‘ఉజ్జ్వలనీలమణి’ కర్తయగు ‘రూపగోస్వామి’, ‘భక్తిరసాయన’ కర్త ‘మధుసూదన సర్వతి’ యును ముఖ్యులు.

భక్తిని రసముగ ప్రతిపాదించినది రూపగోస్వామి. ఇతడు ప్రతి పాదించి భక్తి కృష్ణగోపికల సంబంధమైన మధురభక్తి. శృంగార రూపమున నున్న విషయము. ఇతర లౌకిక శృంగార ముపాదేయము గాదు. కాని యిది భగవద్భక్తి యందేకదేశముగ గ్రహింపగలమే గాని సంపూర్ణమైన భక్తిగా చెప్పలేము. ఇట్లు ఏకదేశముగ గ్రహింప దగు భక్తివిషయము నటులుంచిన, మధుసూదన సరస్వతి తన భక్తి రసాయన గ్రంథమున భక్తి రసత్వమును సంపూర్ణమైనదిగ భావించ వచ్చునని యిట్లు చెప్పెను.

"అనుభవ మాత్రమునసే సాక్షత్తు విరుద్ధములగు శోక, క్రోధ భయాదులకు రసత్వ మంగీకరించియుండిరి. అనుభవ సిద్ధము, మిగిలిన రసములకంటెను వేయిరెట్లు అధికముగ రస్యమానమగు భక్తిని రసము గాదనియేల నందురని మధుసూదన సరస్వతి ప్రశ్నించుటయే గాక, కాంతాది విషయకములైన ఏరసములందును భగవద్రతివలె పరిపూర్ణమైన ఆనందము కలుగదని చెప్పియుండెను. అట్లు సద్ధాంతీక రించుటయేగాక. మిణుగురు పురుగులకంటె సూర్యకాంతి ఎంత పరి పూర్ణమైన ప్రకాశమో అట్లే తక్కిన రసములు భగవద్రతికంటె పరిపూర్ణానందములు కాజాలవని వక్కాణించియుండెను."[5] ఈ భక్తి రసమునకు అలంబన విభావము భగవంతుడు. అతని చరిత్రలే ఉద్దీపన విభావములు. భగవదాకార చిత్తవృత్తియే స్థాయిభావము. అదియే భగవద్రతియగును. ఆలంకారిక మతమున భక్తిని రసముగ నంగీక రించుట వివాదాస్పదమైనను అది సహృదయామోదక మనుటలో అసమంజసము కానేరదు.

**4-1-3. వివిధ భక్తి మార్గములు :-**

"చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినో ర్జున
ఆర్తో జిజ్ఞాసు ర్థార్థీ జ్ఞానీచ భరతర్ష భ"
భగవద్గీత. 72-16

అను గీతాచార్యుని ఉక్తినిబట్టి భక్తి, ఆర్తభక్తి, జిజ్ఞాసభక్తి అర్థార్థభక్తి. జ్ఞానభక్తి యని చతుర్విధములుగ నొప్పుచున్నది. శ్రీమద్భాగవతమున భక్తి, శ్రవణ, కీర్తన, స్మరణ, పాదసేవన, అర్చన, వందన, దాస్య, సఖ్య, ఆత్మనివేదన రూపములలో నవవిధము లని తెలుపబడినది. నారదభక్తి సూత్రములలో ఏకాదశ భక్తి భూమికలు పేర్కొనబడినవి.[6] మానవసేవయే మాధవసేవ యను నట్లుగ భక్తి కేవలము కొన్ని రూపములకే పరిమితముగాక,మానవుని సంస్కార వాసనా బలమున అనంత రూపములు కలిగినది.

## 4—1—4 దండకములలో భక్తితత్త్వము :-

ఈ భక్తి మానవుని మానసిక పరిణతికి, భావనా చైతన్యము నకు సంబంధించినది. ప్రతి వ్యక్తికిని ఒక్కొక్క రూపమున కొక్కొక్క తూదిరిగ భగదాకార చిత్తవృత్తులు కలుగుచుండును. కొందరికి త్రిమూర్త్యాత్మక దత్తాత్రేయ స్వరూపము మానసానందము కలిగించుచుండగా, మరికొందరికి త్రిమూర్తులు ప్రత్యేకాకృతిగ గోచరించి యానందము కలుగుచుండును. కొందరికి భగవదాకార విశేషము పురుష రూపము కాగా, మరికొందరికి స్త్రీమూర్త్యాత్మక స్వరూపముగ గోచరించుచుండును. 'ఏకంసత్ విప్రాః బహుధా వదన్తి'యను వైదిక సూక్తినిబట్టి భగవంతుడు స్థూలాతిస్థూల శరీరుడు. సూక్ష్మాతి సూక్ష్మవర్తి. భక్తుని మనస్సుకు అతడు భావించెడి భగవద్రూపము దప్ప తదితర ప్రకృతి గోచరింపదు. అదియే భగదానందాతిరేకము. సంపూర్ణమగు రసానుభవము. దీనిని మించినది లేదు.

సకల చరాచర జగత్తు శబ్దముచేత నారాధింపబడుచున్నది. అదియే అక్షర స్వరూపము, నాశరహితమైనది. అట్టి అక్షర స్వరూపమునే స్త్రీమూర్త్యాత్మక భావముతో సరస్వతీదేవిగ పిలుతురు. ఇదియే అక్షరబ్రహ్మ స్వరూపముగ పిలువబడును. ఇట్టి యక్షరబ్రహ్మ మాధారముగనే మునుల నుండి మూఢుని వరకును భగవదానంద సంప్రాప్తులగుదురు. ప్రపంచమునందలి పదసర్వస్తు స్వరూపమంతయు అక్షర స్వరూపము. శబ్దమయముగ ఆధారితము. ఇటువంటి అక్షర బ్రహ్మము వాక్శుద్ధిరూపమున సంస్కార భావముతో నియతమై యుండును. అట్టి శబ్దముచేత నారాధింపబడునపుడు నియతమైన, లయతోకూడిన భావనాసంపత్తి ఆవశ్యకము. వైదిక స్తోత్రములు ఋక్కుల రూపమునను న్నవి. వివిధ ఛందము లాధారముగ కొనసాగినవి. వైదిక కాలమునుండి కనిపించకపోయినను, మిక్కిలి ప్రాచీన

మగు దండకముగూడ భగవదారాధన కుపకరించుచున్నది. అన్య భావనలు లేక కేవల భగవదాకార గుణకీర్తనముతో కూడిన దండకము వేదోచ్చారణమును తలపించును. ఇటువంటి దండకములందు భక్తిరసాత్మకములైన భగవద్రూప స్తోత్రము లనంతముగ వెలువడి యున్నవి.

నన్నయ భారతాంతర్గత దండకము భక్తిరస సముద్భూతము. పరమేశ్వరుని గుణములను 'శ్రీకంఠ లోకేశ లోకోద్భవస్థాన సంహారకారీ మురారిప్రియా చంద్రధారీ మహేంద్రాది, బృందారకానంద సందోహ సంధాయిపుణ్య స్వరూపా' ఇత్యాదిగా కీర్తించును. 'దక్షాధ్వర ధ్వంసకా' అనునొక విశేషణముతో నొక కథను జ్ఞప్తికి తెచ్చుకొనును. తదుపరి పరమేశ్వర తత్త్వమును కొనియాడును. మునులు, దేవతలు నినుకొలిచి శాశ్వతైశ్వర్య సంప్రాప్తులైరని భావించును. పాశుపతాస్త్రమును బడయగోరు అర్జునుడు తుదను 'అభ్యర్థితంబుల్ ప్రసాదించు కారుణ్యమూర్తీ' యని వేడును

ఇట భక్తి యేకదేశము. ఇష్ట వస్తుసాధనకై వినియోగింపబడినది. 'తత్తు విషయత్యాగాత్ సంగత్యాగాచ్చ' అని నారద భక్తి సూత్రము. కాని అర్జునుని భక్తిభావము దానికి విరుద్ధము. ఇది విషయభోగాది త్యాగము ధనపుత్రాది సంగత్యాగము వలనను సిద్ధించును. అర్జునుడిట విషయత్యాగి కాడు. పాశుపతాస్త్ర సంపాదన మాతని ప్రథమ లక్ష్యము. గార్గుని మతములో నారద భక్తిసూత్రములలో 'కథాస్విత్యి గార్గః' అని చెప్పబడినది. ఇట దైవతకథలయందు అనురాగము భక్తియని చెప్పుట వలన అర్జునుని మనస్సు భక్తిభావయుతమని చెప్పవలెను. నారదమహర్షి మత ప్రకారముగా అర్జునుని భక్తి పరాకాష్ఠకు చెందినదిగాదు. కాన 'లోకేపి భగవద్గుణకీర్తనాత్'' అని చెప్పుటవలన అర్జునునిది భక్తిభావమే. అర్జునుడు

సామాన్యమగు వ్యక్తి. కనుక భగవద్గుణకీర్తనము వలన భక్తి సిద్ధించినదని తెలియును. అతని పాశుపతాస్త్రాభీష్ట సిద్ధియే, పరమ భక్తి భావమునకు మూలకారణముగ దలపవచ్చును

ఎఱ్ఱన తన నృసింహపురాణమున ప్రహ్లాద పురస్కృతులై మునులు లక్ష్మీనృసింహావతారమును కీర్తింతురు. "నీతత్త్వమాద్యంబనాద్యంత మత్యంత మక్షోభ మక్షీణ మక్లిష్ట మామూల మవ్యాజ మాజేయ నిర్వాణ సర్వస్వ మూలం బమూలంబు నున్మూల మామూలమాన స్వతంత్రి భవల్లోక శోకంబవేలంబకాలంబు కర్మంబు నిస్సీమ శర్మంబు నిర్మాయ ధర్మంబు నిష్పంక లేశంబు నిశ్శంకరూపంబు నిశ్శ్రేయసంప్రత్యయోద్భూతి హేతుత్వసిద్ధంబు సిద్ధాంత సిద్ధార్థ సంపాద మిట్లుంటగానేని" అని పరమేశ్వరతత్త్వ మగమ్యాగోచరముగ తమ విజ్ఞాన సంపత్తిచే, భావనా మహిమచే దర్శించి కీర్తించిరి.

ఇట మునుల భక్తిభావన నిష్కల్మష జనితమైనది. విషయ వాంఛా సహితముగాదు. నృసింహస్వామి చరణారవిందములను మనసా వాచా కర్మణా నమ్మినవారు. వీరికి ప్రతిఫలాపేక్ష యేమియును లేదు. విష్ణు విరోధియగు హిరణ్యకశిపుని బారినుండి జగద్రక్షణము గోరువారు. విష్ణుకీర్తనము వివిధ అవతారములలో గొనియాడిరి. ఇట్టి పరమేశ్వర గుణకీర్తనము జగత్కల్యాణ కారకము.

హరవిలాసమున దేవాసురులు ఇష్టకామ్యార్థములకై గణపతిని షోడసోపచారములతో పూజించి నుతించిరి. హరవిలాసము నందే సుర గరుడ ఖచర విద్యాధర కిన్నర సిద్ధ సాధ్య దానవముఖ్యులు పరమేశ్వరుని ప్రార్థించిరి. వీరికి పరమేశ్వరుడు వివిధ లింగాకృతులలో దర్శనమిచ్చెను.

భక్తికి సాధనము పరమేశ్వర గుణకీర్తనమైనను, విషయత్యాగ మనునది ప్రధాన నియమము. దీనినే పింగళి సూరన తన కళా

పూర్ణోదయమున మణికంధరుడు చేసిన దండక స్తవమున వక్కాణిం
చును 'మీ పాదసేవాదరంబున్ మదింగోరుచున్ వేదవాదుల్ శమా
దుల్ కడుంజాల నార్జించి భోగేచ్ఛ వర్జించి నాతపశ్చర్యలాశ్చర్య
తాత్పర్య పర్యాకులత్వంబునన్ గైకొనన్ మాకుసేయత్నముల్ లేక
యోకృష్ణ! యీకైవడిన్ కృపాలోక సంసిద్ధి సిద్ధించుటల్ బుద్ధి
తర్కింప నత్యంత చిత్రంబుగాదే!'. ఈ భావమునే నారదమహర్షి
తన భక్తి సూత్రములలో తన మతముగ 'నారదాస్తు తదర్పితాఖిల
చరితా తద్విస్మరణే పరమ వ్యాకులతేతి' అని వివరించును.

ఇట్లు సమస్త కర్మలను పరమేశ్వరుని కర్పించుట యొకటికాగా, సర్వ ప్రపంచమును పరమేశ్వరునిలో దర్శించుట భక్తికి పరాకాష్ఠ. మార్కండేయపురాణ గ్రంథాంతర్గత దండకమున దేవతలు నారాయణిని స్తుతించుట యిందుల కుదాహృతి కాగలదు. "సర్వంబునం బాణి పాదాస్యముల్గల్గి, సర్వంబునస్మీర నేత్రాంగముల్ గల్గి, సర్వంబునన్నాసి కాకర్ణముల్గల్గి సర్వంబునీవైన సర్వేశ్వరీ!" అని సన్నుతింతురు. ఇట్లే మహాభాగవతమున అక్రూరుడు యమునలో రామకృష్ణులను దర్శించి యొనరించిన నుతియు నిటువంటిదే. 'కృశానుండు నెమ్మోము సోముండు భానుండు కన్నుల్ దిశల్ కర్ణముల్ భూమి పాదంబు లంభోనిధుల్ కుక్షి కల్పంబు లద్రుల్ లతాసాలముల్ రోమముల్ గాలి ప్రాణంబు బాహుల్ సురేంద్రుల్ ఘనంబుల్ కచంబుల్ నభోవీధి నాభి ప్రదేశంబు రేలున్ బగళ్ళున్ నిమేషంబు లంభోజగర్భుండు శేఫంబు వర్షంబు వీర్యంబు నాకంబు మూర్ధంబును న్నేకమైయున్న నీమేని దండల్ బయోజాత గర్భాండముల్ మండితోదుంబరానోక హానేక శాఖాఫలాపూరితానంత జంతుప్రకాండంబులీలం బ్రసిద్ధోదరాశిస్థ జంతుప్రకాండంబుగా నిండి యుండున్ మహారూప' అని నుతించును. ఇట సమస్త విశ్వము పరమేశ్వర స్వరూపముగా

దర్శనీయమైనది. "తస్మిన్ సర్వం ప్రతిష్ఠితం" అని వైదికసూక్తి వచించినటులా పరమేశ్వరునియందు సర్వమున్నదని భావము. ఇట్టి భావనలు, పరమ భాగవతోత్తములు, పెక్కుదండకములలో ఎక్కడ గాంచినను దర్శనమిత్తురు.

## 4-2. శృంగారము.

రసములలో శృంగార రసము ప్రధానమైనది. దీనికి రతిస్థాయి భావము. వర్ణము శ్యామము. రసాధిదేవత విష్ణుమూర్తి.

వర్ణము లన్నిటియందును శ్యామవర్ణము ప్రధానమైనది. దేవతాకోటిలో విష్ణుమూర్తి మూలపురుషుడు. రసము లన్నిటియందును శృంగారము ప్రథమము. ఇన్ని ప్రాధాన్యములనుబట్టి శృంగార రసముయొక్క ఉత్కృష్టత వ్యక్తమగుచున్నది. సరస్వతీ-కంఠాభరణ కర్త-భోజుడు, ధ్వన్యాలోక కర్త- ఆనందవర్ధనాచార్యుడు మొదలగు వారెందరో యీరసముయొక్క వైశిష్ట్యమును వక్కాణించియుండిరి.

ఆనందానుభూతికి ప్రధానమైనది శృంగారరసము. ఇది యౌవనములోనున్న ఉత్తమ స్త్రీ-పురుష ప్రకృతులకు సంబంధించినది. హృద్యమును, ఉజ్జ్వలమునగు వేషము కలదగుటవలన శృంగారరసమను నామము ఆవారసిద్ధమైనది.

భావము, హావము, హేల, విలాసము, మాధుర్యము, ధైర్యము విభ్రమము, లీల, కిలికించితము, కుట్టాయితము, లలితము, విచ్ఛిత్తి, బిబ్బోకము, విహృతము, చకితము, హసితము, కుట్టమితము, కుతూహలము, అనునవి యీ శృంగార రసమునకు చేష్టలుగా చెప్పబడుచున్నవి.

చక్షుఃప్రీతి, చింత, సంస్మృతి, గుణకీర్తనము, అరతి, తాపము లజ్జాత్యాగము, గమనము, మూర్ఛ, ధన్యత అనునవి ఏతత్సంబంధము లగు శృంగారావస్థలు.

ఇట్టి శృంగారరసము కొన్ని దండకములందు ప్రస్ఫుటముగా గోచరించును. కేవలము శృంగార రసాశ్రయముగనే తాళ్ళపాక పెద తిరుమలాచార్యులు - శృంగార దండకమును రచించియుండెను. పద్మావతీ శ్రీనివాసుల దివ్య శృంగార మభివర్ణితము.

నాయక గుణకీర్తనమిందు నాయికకు కలిగిన ప్రప్రథమ శృంగారావస్థ.

ఉదా :- "శ్రీవెంకట క్ష్మాధరోత్తుంగ శృంగాగ్ర నిత్యస్థిరాగారు గారుత్మదోదీర్ణ సౌవర్ణభూషా విశేషోజ్జ్వలాకారు గారుణ్య లావణ్య సారప్రభాసద్మ పద్మాధరాధీర లీలాకరోదార సంసారు సారూప్య సామీప్య సాలోక్య సంలోక్య సద్భక్త ముక్తప్రజస్తోత్ర పాత్రీకృతాచారు..... ప్రగానాస్త్ర సందోహ సౌందర్య సాఫల్య రూపాభి రాజద్విశాలాత్మ వక్షోల్లకగ్రీవ దుర్గాహి నిగ్రాహకోదగ్ర చక్రాబ్జ చాపాసి సంశోభి హస్తారవిందున్ సదానందు గోవిందు నంకించి యంకించి యయ్యిందిరానాథు గాంభీర్య చాతుర్య శౌర్యాది చంచద్గుణస్తోమమున్ బ్రేమమున్సర్వ విద్యాధురీణత్వము న్సుప్రవీణత్వమున్ రూపరేఖా విలాసంబు..."

శృంగార దండకమునందలి యీ వర్ణన వలన నాయకుడైన శ్రీనివాసుని దివ్యమంగళ శృంగార రూపము తెలియవచ్చును.

నాయికయగు పద్మావతిని పెద తిరుమలాచార్యులు బింబోష్ఠి యనియే సంబోధించినారు. ఇందు నాయిక నాయకుని గుణకీర్తనము వినినదై తాపము, లజ్జాత్యాగము, సంస్మృతి మొదలగు శృంగారావస్థలకు లోనగును.

ఉదా :- "...దిక్కులం బిక్కటిల్లంగ నుప్పొంగినానంగనా శ్రేణి గీర్తింపగా సొక్కు బింబోష్ఠి యాలించి... మోహంబు గీలించి ధైర్యంబు దూలించి యుద్దేవతా మౌళి నిచ్చోటికి న్మద్బ్రకం దెచ్చు

వారెవ్వ రీమాట యేబోటితో వాడుదున్ జోడుగానెట్టి యిూ శేష శైలేశుతో గూడుదు న్మ్రొక్కి యేవేలుపు న్వేడుదు న్నెడు చూడంగ నొక్కొక్క యెడయ్యెడు న్వాడి పూజొంపముల్ వేడి క్రొవ్వెన్నెలున్ క్రూరముల్ కీరముల్ ఘోరముల్ భృంగ ఝుంకారముల్ దీపితా టోపముల్ కోకిలాలాపముల్ విస్ఫురత్కోపముల్చిత్ర పాంచాలికా రూపముల్ జాలముల్మంద వాతూల ల్సంతతాభీలము ల్మారికా జాలముల్ వీని నేనెట్లు సైరింతు చేతోభవాస్త్రంబు లేరీతి వారింతునో యంచు జింతం గపోలోపరివ్యస్త హస్తాబ్జయై మోము వాడంగ బెన్గొప్పు వీడంగ చన్గప్పు జారంగ నిట్టూర్పు మీరంగ బెట్టాస బార వశ్యంబు దేరంగ లక్ష్మీధన ప్రార్థనాధీనయైయున్న..." ఈమెను చెలులు చూచిరి.

తదుపరి చెలులీమెను ఉద్యానవన విహారమునకు, జలక్రీడకు తీసుకొని వెడలుట సంభవించును. జలకేళి సలుపు సమయమున శ్రీనివాసుని నెచ్చెలులు కొందరు పద్మావతీదేవిని చూచిరి. ఆమె రూప లావణ్యములకు ముగ్ధులై శ్రీనివాసునికి వివరించి యామె యాతనికి కాగోరు వధూరత్నముగా నభివర్ణించిరి. శ్రీనివాసుకుగూడ కుతూహల పడెను. శ్రీనివాసుడు "భవ్య సౌధంబుపై నెక్కి లోక త్రయీ జిత్వరానంగ భల్లీ లసదృష్టివల్లీ...గామిని న్వేమరుంజూచి కామించి రోమాంచితాంగ మ్మునన్మించి తద్దృష్టిపాతం బపేక్షించి హర్షించి యున్నంత గాంతుల్జలక్రీడ జాలించి తత్ప్రాంతసీమ న్సమీ చీన చీనాంబరాలేపనాలంక్రియా వాంఛచేతం బరాక్కై పరివర్తింప నద్దేవ దేవుండు చేతన్మహా హేమనాళంబు సంధించి యక్కొమ్మ గస్తూరి యుంటం గుచంబంట భూత్కారమాయాఘి గావింప నయ్యింతి బిట్టుల్కి సల్దిక్కులంజూచి యక్కాంత వీక్షించి నచ్చాపుల-హొచ్చి నల్లెచ్చల్ మచ్చిక వేరిచి యన్యోన్య [illegible] గుర్చిచ్చినట్లుండె... నయ్యిద్దగుం తన్మయావస్థ [illegible]..."

తదుపరి యామె యందముగా కస్తూరితో విన్నపములనువ్రాసి గాలిపటమునకు గట్టి శ్రీనివాసుని భవ్యసౌధముపై నాడించును. అతడు నా విన్నపములను జూచి తన ప్రేమను వెల్లడించుచూ వ్రాసిన విన్నపములా కేళీపటము నందుంచగా ఆమెయును ఆ విన్నపములను గ్రహించినది, చదివినది. అంతలో సఖులేతెంచిరి. పద్మావతీదేవి విరహావ్యథకు లోనయినది. నెచ్చెలులకు హేతువు అంతుబట్టలేదు.

ఉదా :- "...కామినీ విప్రలాంబున న్మోహ తాపంబునఁ గ్రాగి జాలింగడన్వేగి రాగంబునన్మాగి భాష్పంబులోనోగి యిందిందిర శ్రేణి దూషించి మందానిలున్మీరి భాషించి...యస్య ప్రసంగంబు వర్జించి నారాయణ స్నేహ మర్థించి దీవింపగా దద్వయస్యల్ నిరూపించి శైత్యోపచారంబు చేయ న్విచారించి యక్ష్మోమలిం తమ్మిపూసెజ్జపై నుంచి ప్రాలేయ నీరంబు కర్పూర పూరంబు సద్గంధ సారంబు మేదించి తోరంబుగా బూసి..."

ఇట్లు నానావిధ శైత్యోపచారములు చేయుదురు. తుదకు "సఖి ప్రాణబంధుం కృపాసింధు శ్రీవేంకటాధీశు వేవేగ నూర్పుం దగం గాక యీచేతలేలంచు నాత్మీయ హస్తాబ్జ వాతూల లీలాపటం బచ్చటన్ జూపినన్' నెచ్చెలులు సంపూర్ణ సంతోషముతో శ్రీనివాసునికడకరిగి మా నెచ్చెలి పద్మావతిని రక్షింపమని వేడుదురు.

'అదౌ వాచ్యః స్త్రియారాగః పుంసః పశ్చాత్తదింగితైః' అను విధమున ముందుగా రతియనెడి స్థాయి నాయికకు కలిగి, యా యింగితములచే పిమ్మట నాయకునికి కలిగినట్లు వర్ణింపబడవలెను. కాని మొదట నాయిక నాయకుని జూచి యనురక్తురాలు గావలెను. ఇట పద్మావతిని శ్రీనివాసుడు జూచుట ప్రథమముగ సంభవించినది తదుపరి యామెయును జూచినది. ఒకరినొకరు మరులు గొనిరి,

పద్మావతిని శ్రీనివాసుడు ముందుగ జూచుట సంభవించినను, అంతకు ముందుగనే నాయికయగు పద్మావతి శ్రీనివాసుని దివ్యమంగళ స్వరూపము నందు అనురక్తురాలయి వివిధ శృంగారావస్థలకు లోనగును. కావున నాయికకే ప్రథమముగ రతియనెడి స్థాయిభావము జనించినదని సువ్యక్తమగును.

తుదకు 'యా నీరజాక్షి విజ్ఞాపనంబెల్ల నాలించి లాలించి సౌభాగ్య సామ్రాజ్య మేలించి తద్భామిన రత్నముం దాను బక్షీంద్రుపై నెక్కి శ్రీ వేంకటేశుండు సంప్రాప్త సంతోషుడై... సమ్మతిం గ్రమ్మరం గొమ్మతో గూడి తాముండు పెంపొందు నయ్యిందిరా మందిరంబైన యాత్మీయ గేహంబునందుం బ్రవేశించి యుండెందగన్.'

పద్మావతీ శ్రీనివాసుల పరిణయ వృత్తాంతము శృంగార రసమున చక్కగ పోషించి పెదతిరుమలాచార్యులు చరితార్థుడైనాడు.

ఇట్లే ఈ శృంగార రసమున కంకితమైన దండకము లెన్నియో ఉన్నవి. వానిలో భోగినీ దండకేతివృత్తమునకు సంబంధించి నన్నియును శృంగార రసమునకు ఆలవాలములే. కాని యందు వర్ణింపబడినది మానవ శృంగారము.

## 4-3. హాస్యము :

రసములలో హాస్యరసము రెండవది. కేవల శబ్దాశ్రియమైగాని అర్థాశ్రియమైగాని దీనిని రెండు విధములుగ వ్యక్తీకరింప వచ్చును. కొన్ని కొన్ని విచిత్రములగు శబ్దములను అనుకరించుటవలన శబ్దాశ్రియమైన హాస్యము జనించును. విషయమేదైనను వ్యక్తీకరించు సందర్భమున, సంభాషణయందు శబ్దముమ చిన్నమార్పు గావించినను భావ ప్రధానమగు హాస్యము జనించును.

'వికృతి దర్శనాది జన్యో మనోవికారో హాస్యరసః' అని ప్రతాపరుద్రీయకారుని నిర్వచనము. విరుద్ధాలంకారములు, వేష

భావల వలన హాస్యము జనించును. అట్టి యీ హాస్య రసమునకు 'హాసము' స్థాయి భావము. హాసమనగా నవ్వు. ఈ హాసమును భరత ముని ఆరు విధములుగ వ్యక్తీకరించియుండెను.[10] 1. స్మితము, 2. హాసితము, 3. విహసితము, 4. ఉపహసితము 5. అపహసితము, 6. అతిహసితము. హాస్య రసమునకు గణాధిదేవత గణపతి.

తెలుగు కావ్య ప్రపంచమున నవ్వుల గనులు ప్రహసనములు, చాటువులు మొదలగునవి. సంస్కృత నాటకములందుగాని, తెలుగు యక్షగాన ప్రబంధములలోగాని నాయకునకు విదూషకుడు తోడుగ నుండును. విదూషకుడు హాస్యరస పోషకుడు. శృంగార, వీరములు అంగి రసములుగ వర్ధిల్లిన, హాస్యము అంగరసమగుట కద్దు. ఆధునిక యుగమున తెలుగును నాటకములలో, ఉపన్యాసములలో, నాటికలల్లో, నవలలలో ఒకటనీ చెప్పనలవిగాదు అన్ని ప్రక్రియలందున హాస్యముప్పతిల్లు చున్నది.

"మానవ జీవితములోని యొక్కొక్క విషయము, ఒక్క సుందరమైన సత్యము, ఒక్క మధురానుభూతి, ఒక్క గిలిగింత, మాట నుచ్చరించుటలోని మార్పు, ఒక్కయూపు, ఒక్క మెలిక, ఒక్క వింతచేష్ట, అప్రియత్నముగ లభించిన యొక్క తీవ్ర భావము హాస్య రసమునకు వస్తువగును.[11]

1922 23 సంవత్సరములలో సంఘసంస్కరణమును ప్రధానోద్దేశ్యముగా భావించి వెలువరించిన రచన వరవిక్రయము. కర్త కాళ్ళకూరి నారాయణరావుగారు.

వరవిక్రయము నందు (ద్వితీయాంకమున) లింగరాజుగారి వ్యాపారపు గది, యాయన పాత్రప్రవేశముతో ప్రారంభమగును. లింగరాజుగారికి ప్రాతఃకాలమునసే స్నానాదికములు ముగించి తన యినుపపెట్టె ముందు నిలచి లక్ష్మీదేవి ప్రార్థన చేయుట పరిపాటి.

ఒకనాడు వరాకున ఆలస్యమగును. వెంటనే ఇనుపపెట్టెముందు భక్తి ప్రపత్తులతో నిలచి లక్ష్మీదేవి ప్రార్థన చేయును. ఆ ప్రార్థనను శాళ్ళకూరివారు దండక రూపమున హాస్యరస స్ఫోరకముగ చిత్రీకరించిరి. మనిషి ధనముకొరకు ఎటువంటి నీచమునకైనను వెనుదీయడనునది యీ దండకము వలన దెలియును. నిడివిన చిన్నదైనప్పటికిని విత్తమే ప్రధానాశయముగా కలిగిన వ్యక్తులపాలిటి చురక వంటిది. "సంభాషణల్లో సన్నివేశాల్లో, పాత్రపోషణలో, ప్రహసనంలో కనిపించని గాంభీర్యం, వాస్తవికత, విమర్శ నారాయణరావుగారి రచనలో కనిపిస్తాయి. అవహేళనద్వారా పాత్రలను అసంభావ్యంగా, నీచంగా ప్రదర్శించేబదులు వాస్తవికత ద్వారా, హాస్యం ద్వారా సజీవమైన పాత్రలలోని నైచ్యాన్ని అవిష్కరిస్తూ వ్యంగ్యాత్మకంగా వారి ప్రవర్తనద్వారా సమాజంలోని బలహీనతల్ని ఎత్తిచూపడం నారాయణరావుగారి పద్ధతి".[12]

దం. "భగవతీ! భాగ్యలక్ష్మీ! ప్రణామంబు నీదాస దాసానుదాసుండ నీపాద ముక్తుండ నిత్యంబు భావింతు నీ దివ్య నామంబె నిక్కంబుగా నిద్రలోగూడ జింతింతు, నా దిక్కు నా మ్రొక్కు నా యండ నా దండ నీవేసుమా! భార్యయుం గీర్యయుం, బిడ్డలుం గిడ్డలున్, దేవుడున్ గీవుడున్, మోక్షమున్ గీక్షమున్, సర్వము న్నీవె! సత్యంబు నీకై నిరాహారినై యుందు, నీకై నిశల్ నిద్ర మానొ్కందు, నీకై శరీరాభిమానంబు వర్జింతు, నీకై యసత్య ప్రమాణంబులెన్నేని గావింతు, నీయాన యీ పెట్టియే నీ పవిత్రాలయం బేనె నీ యర్చకుండన్ యదార్థంబుగా నాదు ప్రాణంబులే నీదు పూజాసుమంబుల్ శరీరంబె నైవేద్య కుంభంబు, నాయింటనేయుండి నా పూజలంగొంచు నేయింటికే

నంపినంభోయి యూయిల్లు మట్టంబు గావించి నాయింటికిం దెచ్చి
నాకిచ్చుచుండంగదే కన్నతల్లీ! నమస్తే నమస్తే నమః"

పాత్ర తన ప్రవృత్తిని తెలియజేసికొనును. 'నా యింటనే యుండి నా పూజలంగొంచు నేయింటికేనంపినం బోయి యూయిల్లు మట్టంబుగావించి' యా యింటిలోని ధనమెల్లను తనకు చెందునట్లు చేయుమని వేడును. ఆపై నామెను కన్నతల్లి యని సంభోధించునునైజగుణమును వ్యక్తీకరించినను పాత్రయొక్క భావన చాల విచిత్రమైనదై, విపరీతబుద్ధి కలిగినదై, హాస్యరస స్ఫోరకముగా నున్నది.

ఓటు దండకము. (గోలకొండ పత్రిక 24-5-1934)

ఇంతవరకు స్వతంత్ర దండకములు అంకితాంశ పద్యములతో ముగియుట యున్నది. గద్యతో ముగింపబడుట కూడా కద్దు. ఈ ఓటు దండకము అటువంటి తత్త్వము కలిగినది గాదు. దండకమునకు ముందుగ పూర్వకవికృత పద్యములను రెండు ఓటుహక్కుదారు పరముగ మలచబడినవి. పూర్వకవికృత పద్యము లీరెండును పోతన గారి గజేంద్రమోక్ష ఘట్టము (మహాభాగవతము) నకు చెందినవై, తెలుగువారందరికిని సుపరిచితములే.

కం. "నీవే తల్లివి దండ్రివి
నీవే నాతోడు నీడ నిజముగ సఖుడౌ
నీవే గురుడవు దైవము
నీవే నా పతియు గతియు నిజముగ ఓటర్

శా. "లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె ప్రాణంబులున్
ఠావుల్దప్పెను మూర్ఛవచ్చె తనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
ఓటిప్పు యితఃపరంబెరుగ మన్నింపన్ దగన్ దీనునిన్
రావే ఓటర కావవే వరద సంరక్షించు భద్రాత్మకా"

దం. "మహా భాగ్యనగరాన మా పూర్వ పుణ్యాన మేమెన్నియో
యేడ్లు చూడంగ చూడంగ మాబాల్యమున్ యౌవ్వనత్వంబు
మా ప్రాయముల్ మనోదార్ఢ్యముల్ క్రుంగుచున్ పోయి
వృద్ధాప్యమున్ పొంది వెంట్రుకల్ తెల్లనై మప్పయీరేండ్లు
అటుగడ్చి యిటుగడ్చి ఈనాటికిన్వచ్చి యీ కొత్త ఖామాను
మాగోర్కె లీడేర మా జన్మముల్ ధన్యతన్ బొందెనో
బల్దియా శాసనంబో ఇదేనీకు వేవేల దణ్ణాలు కైకొమ్ము తల్లీ
వినో వోటరా మూడేండ్లకోసారి నీపాద పద్మంబులం గొల్చి
నిన్నునే దలచెదన్, నిన్నునే పిలచెదన్, నీ కటాక్షంబునన్
జూడవే, దాతవై బ్రోవవే, దగ్గరన్ నిల్వవే, స్వామి నిన్నెంచ
నే నెంతవాడన్, దయాదృష్టి వీక్షింపవే, నాఓటు నాకిచ్చి
నన్నెట్టులైనన్ సభాయీ (సఫాయి) కమిటీకి మెంబర్నుగా
జేసినన్ జాలు నా వంశమున్ దేశమున్ ధన్యతం బొందు,
ఆమీద నీ పూర్వ పుణ్యంబు, నాచాకచక్యంబు, నా భావి
భాగ్యంబు, నాతంత్రి నాదంబు, సవ్యంబుగా నున్నచో ఆ
నిచ్చెనం బట్టి ఎంతైన పైపైకి ఎగబ్రాకగావచ్చు, ఎన్ని
హాట్‌హాములైనన్ భుజింపంగ ఆటంకముల్లేవు, రాజ
మాన్యుండ గావచ్చు, పేదసాదల్ భయంబంద అటుతిర్గి యిటు
తిర్గి ఎంతెంత పేరైన నే పొందగావచ్చు, కొద్ది యుద్యోగులన్
శక్తియున్నంతగా ఏడ్పించగావచ్చు, వీలుగాకున్నచో కొద్ది
మేజ్లేసి షాబాసు షాబాసు అనిపించుకోవచ్చు, ఏవైన లాభాలు
సాధించుకోవచ్చు, కాబట్టి యెట్లైన నీ ఓటుతో గూడ బంధు
మిత్రాది వర్గంబు ఓట్లన్ని నాకు నిప్పింపుమా, లేమి పోగొ
ట్టుమా, దీనినున్ బ్రోవగా దిక్కు నీవేగదా! నీవేకులంబందు
జన్మంబుగానీ నీ స్పర్శ, నీరూపు, నీతీరు మొదలైన నీదే
సమస్తంబు అస్పృశ్యమౌగాని సాక్షాత్ పరబ్రహ్మ రూపం

బుగా నుండు నీఓటు మాత్రంబె, నిత్యసంపూర్తమై నెగడు లోకంబులన్, సంసారమున్ బాసి సౌఖ్యంబులన్ రోసి నిద్రాహారంబులన్ నీతి నియమంబురన్ నిత్య కృత్యంబులన్ మాని, సర్వంబు వర్జించి యోగీశ్వరుం బోలి నే దీక్షతో నుండి నీ ఓటు వాంఛించెదన్ నిన్ను యాచించెదన్, ఓటే సమస్తంబు, ఓటే ప్రశస్తంబు, ఓటే మహాముక్తి, ఓటే పరబ్రహ్మ తద్ధారి వైనట్టి ఓటర్ మహాదేవ నమస్తే నమస్తే నమః"

స్తుతి సంప్రదాయమున కంకితమైన దండకము, హాస్యరసమునకు గూడ అతికినట్లు సరిపడినది గణభంగమగును. ఓట్లను సమపార్జించుటకై రాజకీయ నాయకుడు పడుపాట్లు, దురుద్దేశములు కర్త యథాతథముగ వివరించిరి. ఒకసారి పారిశుధ్య కమిటీకి మెంబరుగా నియమింపబడినచాలు తాను, తనేగాక తన బంధువర్గమునకు గూడ సరిపోవు ధనమును ఆర్జించవలెననెడి కుటిలబుద్ధి గలవారు వీరు. గాంధీ వంటి నిస్వార్థ దేశభక్తులుగారు.

సాహిత్యము కత్తికంటె పదునైనది. అందులకీ దండకము నిదర్శనము. వ్యంగ్యముగ రాజకీయ నాయకుని వ్యక్తిత్వమును వెలువరించినది. ఇందు గూమణ కేమాత్రమును తావులేదు. కర్తకు గుక్కతిప్పుకొనని ఉపన్యాస ధోరణి కనువుగ దండకము నెన్నుకొనినట్లు గనపడును. హుందాతనముతో చక్కని హాస్యము స్ఫురింపచేసెడిదీ దండకము.[13]

పొగాకు దండకము, ఊటుకూరి హనుమంతరాయుడు.

పొగాకు దండకము పేరున అముద్రిత తాళపత్రప్రతి యొకటి ఆంధ్ర సాహిత్య పరిషత్తు కాకినాడ యందున్నది. ప్రతిసగము శిథిలమైనది. దానికి ఆయువు కొలది రోజులు దప్ప యేండ్లు వుండదు. సాధ్యమగువరకు దానినుండి గ్రహించితిని.

పొగాకు దివ్యౌషధముగను, ధూమపానము నుపయోగించుట నాధారముగా జేసికొని ఆశువుగ రచించినది.

దం. "శ్రీమద్గణేశా ! మహీశా! ... రాజా ! సదామిమ్ము సద్భక్తి
ప్రే ... లఖ్యాత మయినట్టి యా ... సమర్పించెదం విన్నపం
బొక్క టాలించు ముల్లోక మం దెల్ల ... శేషంబు ... తగా
నిచ్చ ! యానారదుండంత నా దేవలోకానికిం బోయి నంతెం
సురేంద్రుండు దిక్పాలకు ... తా లేచి సాష్టాంగ దండప్రణా
మంబులం జేసి చారు ప్రభారత్న ... నారదా ! మూడు
లోకంబులన్ చరించే మహాత్ముల్ గదా మీరు భూలోక
మం దెల్ల యేమయిన ... వింతలుం గంటిరా ? చెప్పంగదా
యన్న సంజీవి సారంబనంగా ... కద్దు నాయాకు చెయదంబు
ధూమా ప్రి... ప్పగా కారణంబే నెరింగియున్న ... దులుం,
మహాశ్వాసకోశాది ... చతుర్వేద షట్ శాస్త్రముల్ గల్గు
విద్యల్" మహాశైవులున్ శాక్తేయులున్ సంతతంబొప్ప
సేవింపుచున్నారు. శ్రీవైష్ణవుల్ ప్రొద్దునే లేచి సంధ్యాది
కృత్యంబు సంక్షేపముం జేసి మోమెల్లనుం తెల్లగా నామ
ముల్ దీర్చి నీర్కా విపింజల్ విడంబింపగా శ్రీమతే రామాను
జాయంచు సేవించున్నారు, తత్త్వాదులెల్లం ... వయ్యార
ముల్ మీరి సౌయ్యారలంపించి కట్టాకు మట్టాకు యరాకు
నల్లాకు జాబత్రితో సాటియాబల్ ఝరీయాకు ఆ యాకులో
చెన్నబట్నంబు సారాల ... వాయిఖ్య న్యూపాకు (న్యూ
పేక్) చుట్టలుగా జుట్టి బల్ ముద్దుగా గోళ్ళతో ద్రుంచి
కాకంకటశ్చాయ లొక్కమ్మకం గ్రమ్మ సీలాల గాజుల్
రవాళింబగా ... పం ముంగురుల్లాడగా కాంత సేవించి ...
చుట్టాని కందిచ్చి అరడయ్యగా వాడు తశ్చేషముందీసి

లెస్సాయనే కంబుకంఠీమణీ నీదు కేమ్మావి స్వర్గంబు నంత కన్నం మహాముద్దు గుల్కంగదా యంచు కూడి యున్నా రదింగాక కాంతాకుచాలింగనా సక్తులయి నిద్రలోనం పొగాకా పొగాకా పొగాకా యటంచుం కల్వరించేటి వింతల్ వినోదంబులై యుండునంచు మునీంద్రుడు జెప్పం సురేంద్రుండదె లాగు జెప్పంగ దేయన్న శ్రీరామచంద్రుండు శాఖామృగాధీశులగూడి యుద్ధంబునన్ ... యింద్రజిత్తుండు లక్ష్మణుడు మూర్ఛిల్లగా జేసితె వాయుసూనుండు ద్రోణాచలత్యంత ... యత్యుగ్రుడయి పర్వతంబెత్తి నేతేరగా వార్ధి మధ్యంబునం రాక్షసుల్ గూడి యుద్ధంబొనర్పగా దద్బాణ పుంఖానుపుంఖబు సంజీవి మీనం ప్రయోగించెనంతం నదిందాకి యా విత్తులుం రాలి యాంతి...డ తగం మొరచెనంత ఫరంగీలు, దిగంబరుల్ బయిరాజుల్ వాడవాడల్ విచారించుచూరాగసం ... జీవి చెట్టున్న యాదీవికం వచ్చి రందుం మహామాని శాండిల్యుడందుండి యా ధూమ్రపానంబు గావింపగాజూచి ఓస్వామీ! యాధూమపానంబు గావించ కారణం బెరింగింపవే యన్న, యావద్వృత్తాంతమెల్లం దగం జెప్పె దివ్యౌషధంబంచు సేవించె తద్వార్తపట్నాలకుం దెలిపినం చం ... బెంగుళూరు వద్ద నమ్మేటి యార్కాడు తూలూరు కోవూరు కాకాని, చెల్లూరు, మల్లూరు, మాటూరు, అల్లూరు, చిట్లూరు, చిత్తూరు, కల్లూరు గుంటూరు, గూడూరు హేమాద్రి, రజతాద్రి, యాసిద్ధ పట్నంబు, అల్కాపురీయంబు బాబట్ల, అద్దంకి, ...గొల్లు, చీకుర్తి, కంభంబు, కాకలప్, నెల్లూరు, బెల్లూరు, రాచూరు, రేపల్లె టూరాదిగా గల్గు బట్నాల ... సంప్రీతితో వచ్చి తద్బీజముల్ వేగగొనిపోయి తావల్లె పట్నాల యందెల్ల

నిండారుగా నెండ ... పులయు తోటలుం వేసి తాపోషణల్ జేసె తాముం సదా ధూమ్రపానంబు గావించిరంచున్ మునీంద్రు ... సురేంద్రుండు తానప్పుడే వేగ చారుల బిలిపించి భూలోక సంజీవి సంబంధమయినట్టి యావిత్తుల్ తీసికొని వాటి ... సాన్నిధ్యమందుంచగా నాతడా పారిజాతంబులున్నట్టి యాతోటలో వేసి తాపోషణల్ జేసె తాముసున్ ... ధూమపానంబు గావించి రావార్త వైకుంఠమందుండుం మహావిష్ణువున్నట్టి ... కొలువు కూటంబులో ... దిగా దేవతాఖ్యులా ధూమ్రప్రస్తావముం...నాయాకు తెప్పించినాయింద్రు రప్పించి తామున్ సదా ధూమ్రపానంబు గావించిరి దండకం బెవరు వ్రాసినా సాధసం జేసినా విన్నవారందరుం పుత్రపౌత్రాభి ఆయురారోగ్యభాగ్యోన్నతశ్రీయశఃతుంగధారేయులై యుందు రాచంద్రతారా... లున్నంత భూమండలిం దేవదేవా నమస్తే నమస్తే నమః"

ఈ దండకము ఊటుకూరి వెంకట వరదము, ఊటుకూరి అన్నయ్యగారి కుమారుడు హనువంతరాయుడు చదువుచుండగా విని వ్రాసెనని దండకాంతము నందు గలదు. ఊటుకూరి హనుమంతరాయుడు ఈ దండకమును ఆశువుగ జెప్పియుండవచ్చును. తాళపత్ర స్థితినిబట్టి హనుమంతరాయుని కాలము 19శ. ఉత్తరార్ధముగ భావించవచ్చును.

తగణముపై నడచిన ఈ దండకమున చాలచోట్ల గణభంగమగుచున్నది. స్తుతిరూపక సంప్రదాయమున కంకితమైన వృత్తముగ కవి గుర్తెరిగియే ఈ రచన యొనరించి యుండెను. ముందుగ గణపతిని స్మరించియుండెను. శ్రీకార సంప్రదాయమును విడువలేదు. హాస్యరస ప్రధానమయిన యీ దండకమున హాస్యరసాధిదేవత గణపతి స్తుతిని

చేసి, పొగాకు వృత్తాంతము చాల విచిత్రముగ కల్పింపబడినది. ఈ దండకమున పలుకుబడిగూడా హాస్యము పుట్టించుచున్నది.

మరియొక పొగాకు దండకము గలదు. దీని కర్త యెవరో తెలియదు.[14] శిథిలావస్థయందున్నది. పై అముద్రిత తాళపత్ర ప్రతియందలి పొగాకు దండకమునే పోలియున్నది. విఘ్నేశ్వర సంబోధనతో ప్రారంభ మయినది. మనుష్య, దేవలోకముల కనుసంధాన కర్తనారదుడు. ఇంద్రలోకమునకు పోయిన నారదుని ఇంద్రుడు మొదలుగాగల దేవతలు త్రిలోక సంచారులు మీరు భూలోకమునందలి వింతలేమైనను తెలుపుమనగ పొగాకును గూర్చి చెప్ప మొదలిడును.

'దేవేంద్ర! భూలోక సౌభాగ్య మేమందు (బహ్మాఖ్యపత్రంబు తాపన్నని న్చెన్నునిం బూని రా కెంపులనోప్పలి జాపత్రితో సాటియై మాటుయై దిట్టమై బ్రహ్మాఖ్య ప(త్రరబు' అని పొగాకును బ్రహ్మపత్రముగ సంభోధించును ఇది సంజీవి సారమట. '(శ్రీ)వైష్ణవుల్ పొద్దునన్ లేసి శైవా ళుం దిట్టి నిర్కావి వేష్టుల్ విళంబనబుగా గట్టి పండ్రెండు నామంబులదీర్చి పూవుల్సిగల్నిండగా జుట్టి... (ప్రబంధంబులన్పాడి సద్భక్తి మీరంగా యెంబెరుమనార్ తిరువడిగళే శరణంబంబటంచున్నే మంబుతో తిర్పనూడెంబులో... పురంబైన యాబ్రహ్మపత్రంబునం ధూపముల్గ్రోలు చున్నారు' అని వర్ణించును. ఓం నమశ్శివాయ వేలాయుధా వీరభద్రా యనుచు శైవులు చుట్టలు తాగుచుండిరట. పొగాకు జన్మవృత్తాంతము అంతయును ముందుగ వివరించిన దండకము నందలిదే.

ఈ పొగాకు దండకమున గూడ' సద్భక్తితో ధూపముల్... పుణ్యాత్ములో యెంత ధర్మాత్ములో యెంత శూరాత్ములో వారికిన్ పుత్రపౌత్రాదులున్ మేలు గుర్రంబులున్ మించు రాజ్యంబులున్ పల్లకీల్ సర్గలోకది భోగంబులున్ గల్గు తొల్లి వాల్మీకి, వ్యాసాది

మానింద్రులున్ బల్కిరన్న' అనెడి ఫలశ్రుతిని నారదుడు దేవేంద్రునికి తెలిపియుండెను. ఈ దండకమును హాస్యరస సంభరితమనుటలో సందియము లేదు.

హాస్యము చిప్పిల్లు దండకములలో 'కాఫీ దండక' మొకటి. వ్యసనమునకు సంబంధించిన వస్తువైనప్పటికిని హాస్యరసోద్భూతమైనది. "చెన్నపురి ఆంధ్ర మహాసభలో అష్టావధానం జరుగవలసివుంది. కాశీపత్యవధానులుగారు చెన్నపట్టణం చేరుకొన్నారు. సరాసరి సభాస్థలికి వెళ్ళారు. సభాప్రారంభమునకు కొంచెం ముందు సభానిర్వాహకులు కాశీపత్యవధానులు గారిని కాఫీ సేవించవలసింగా కోరారు, అరకప్పు కాఫీ తీసుకొన్నారు. ఇంతలో సభాసదులందరూ వచ్చారు. కోలాహలం బయలుదేరింది. కాషాయాంబరధారీ, కర్ణకుండల సువర్ణఘంటా కరకంకణ కేయూరధారీ గండపెండేరభూషితపాదుడూ అయిన కవిసింహ కాశీపత్యవధానులుగారు అభినవ శ్రీనాథుడన్నట్లుగా సభావేదిక నలంకరించారు. చప్పట్ల వర్షం కురిసింది. వెంటనే కాఫీని గురించి దండకం చెప్పవలసిందిగా 'ఆంధ్రవిశారద తాపీ ధర్మారావుగారు' అవధానిగారిని కోరారు. కవిసింహ దండకం ప్రారంభించారు.[15] "

దం. "శ్రీమన్మహాదేవీ, లోకేశ్వరీ, కాళికాసన్నిభాకారిణీ, లోకసంచారిణీ, అంబ కాఫీ జగన్మోహినీ, తొల్లి శ్రీకృష్ణుడా స్వర్గముం జేరి వ్రాతంబునా పారిజాతంబున్ దెచ్చియున్, నాతికిన్ ప్రీతిగా నిచ్చు కాలంబునందా సుమంబందునం గల్గు బీజంబులుర్వీస్థలిన్ రాలియున్ లోకభేదంబుచే గాఫీ బూజంబుగా బుట్టియున్, గొమ్మలన్, రెమ్మలన్, బూవులన్, దావులన్, జక్కనౌ పిందెలన్, జిక్కనౌగాయలన్ జొక్కమౌపండ్ల భాసిల్ల దబ్బీజ జాలంబు నైర్లండు, నింగ్లాండు, హాలెండు, పోలెండు, రష్యా, జపాన్, జర్మనీ, గ్రీకు దేశంబులన్ నాటి

పెన్ మాత్రికులై ఇండియన్ దోటలై విత్తనాలిచ్చుచున్నావటంచున్ మదిన్ దోచెన్, బాపురే, తీపిలో, నీరమున్, క్షీరమున్, జెక్కెరన్, మించుటంగాదె నీ బీజ చూర్ణంబు, నామూటిలో జేర్చి సేవించుటన్ నీదు బీజంబులన్ బెంములో మాడ్చి చూర్ణంబు గావించినన్ దీపిపోదాయె నీ మాధురీశక్తి నీయింపు, నీ సొంపు, నీ పెంపు వర్ణింప నేనెంతవాడన్ ధనాకర్షిణీ, ప్రాణ సంరక్షిణీ, ధాత్రి నెవ్వార లేన్ వేకువన్ లేచియున్ నిత్య కృత్యంబులన్ దీర్చి, మున్ ముందుగా నిన్ను బానంబు గావింపకున్నన్ ద్విజుల్ వేద మంత్రంబులన్ బల్కగాలేరు, ప్రాంచత్కవుల్ పద్యముల్ హృద్యమౌరీతి నిర్మింపగాలేరు, శ్రావ్యంబుగా శౌరిదాసుల్ గళంబెత్తియున్ బాడి, నృత్యంబులన్ సేయగాలేరు, శిల్పుల్ మనస్ఫూర్తిగా సుత్తి చేపట్టగాలేరు, వైశ్యోత్తముల్ కోట్ల తాళంబులన్ దీయగాలేరు, డ్రైవర్లు మోటార్లు స్టీరింగులన్ బట్టగాలేరు, టీచర్లు పాఠంబులన్ జెప్పగాలేరు, డాక్టర్లు నింజక్షనుల్ జేయగాలేరు, ప్లీడర్లు నోరెత్తి వాదింపగాలేరు, జడ్జీలు నేసల్పమౌరీతి తీర్పులన్ వ్రాయగాలేరు, దిట్టంబుగా బాలసుల్ కూట సాక్ష్యంబులన్ జెప్పగాలేరు, వారాంగనల్ కోడెగాండ్రన్ వెసన్ గేళిలో నోలలాడింపగాలేరు, ముప్పూటలున్ నిన్నాగిన్ గ్రోలకున్నన్ శిరోభారమై నాల్కయెండున్, మనంబెంతొ చాల చాంచల్యముం బొందుచున్· గుండియల తల్లడంబందుచున్, మేను కంపించుగాదె, కటాక్షంబుతో నిత్యమున్ వేకువన్ దర్శనంబిచ్చి నిన్ బాగుగా ద్రాగు సౌభాగ్యమున్ గూర్చి రక్షింపవే సారెకున్ గొల్చెదన్ విశ్వకర్మాన్వయంబందునన్ సత్కవీంద్రుండనన్, పోకూరి కాశీపతి స్వాంత రాజీవ సంవాసినీ నీకికన్ మంగళంబౌ మహాకాఫీ దేవి నమస్తే నమస్తే నమస్తే నమః”

దండకము సమాప్తముకాగనే సభాభవనముకరతాళధ్వనులతో ప్రతిధ్వనించినదట. ఈ కాఫీ దండకము కూడ పొగాకు దండకమువలెనే దేవలోకముతో ముడిపెట్టబడినది. ఇట్లే ఈహాస్యరసమునకుసంబంధించిన నల్లి, దోమ, టీ, అనప్పిండి. చీట్లపేక మొదలగు దండకము లెన్నియో గలవు.

4-4. రౌద్ర రసము.

"పరావృద్ధి త్వథైవ వైరి వైకృత సమ్భవః
భృకుటీరచనా కమ్ప స్వేదాద్యై రనుభావితః
భావితైః మదగర్వాద్యైః క్రోధే రౌద్రో భవేత్ స్వయమ్"

అని కావ్యసారమున జెప్పబడినది.[16]

ఇది క్రోధమనెడి స్థాయినుండి పరిణమించును. రాక్షసుల, దానవుల, ఉద్ధతమనుష్యుల ప్రకృతికి సంబంధించినదై సంగ్రామము వలన పుట్టును. ఆయుధములు చేబూనుట, విరచుట, నరకుట, శస్త్రముల ప్రయోగము, రక్తము స్రవించుట మొదలగునవి వర్ణితముల గును. ఎర్రని కనులు. చెమట, బొమముడివేయుట, పండ్లు కొరకుట, చెక్కిళ్ళు అదరుట, అరచేతు లొండింటితో రాయుట మొదలగు అనుభావములచే రౌద్రరస మభినయింతురని నాట్యశాస్త్రమున జెప్ప బడినది. ఇట్లు ఉగ్రకర్మలతో కూడినది రౌద్ర రసము.

రౌద్రమనగనే రుద్రుడు గుర్తుకు వచ్చును. అనగా రుద్రసంబంధమైనది రౌద్రము. అట్లని స్త్రీమూర్త్యాత్మక దేవతలలో రౌద్రము ప్రదర్శించిన వారు లేరనిగాని, రౌద్రము వారియందు కలుగదని గాని చెప్ప లేము. స్త్రీదేవతామూర్తులలో రౌద్రము ప్రదర్శించినవారిలో సతీదేవియొకతె.

దం. "జనకా! కలకశైల కోదండు డల్లుడుగా జూపితే? తండ్రీ!
కల్పాంత సంధ్యా మహా తాండవాడంబరారంభ సంభరం

సంక్షోభితాశేష లోక ప్రపంచుండు వంచింప నర్హుండొకో!
అయ్యా! త్రియ్యంత విద్యా వధూరత్న సీమంత సింధూర
పాంసుచ్ఛటా పాటల శ్రీపదాంభోజ యుగ్మండితన్మాతు్రిడే?
తాత! దైతేయ లీలావతీ గండపాళీ పరిన్యస్త కస్తూరికా పత్రి
వల్లీమతల్లీ కళా ద్రోహి బాహార్గళ స్తంభుపై నీకవష్టంబ మేలయ్య
యీలాగునన్? మధుమదన! మహా ప్రబుద్ధుండ నీవిట్టి దుచ్చే
ష్టితం బెట్లు వీక్షింపు చున్నాడ'వు'? అబ్జాప్త! నీయిల్లు
వేల్పుండ నీ బంధ దుర్గోష్టితో గూడి యున్నాడ వింకొక్కొ
మ్మాటైన నీ మోమునం జూచె దీశాను పాదబ్జముల్; వహ్ని!
యీ కూడు తీపయ్యెనే నీకు నిర్భాగ్య! ఏణాంక! యంతఃకళం
కంబు తెల్లంబు గావించి తిన్నాళ్ళకున్ లెస్సగా కేమి? పౌలస్త్య!
నిన్నుంగనుంగొన్న సిగ్గయ్యెడున్ శుక్ర!నీ మొక్కలంబు ల్వినం
బడ్డమే కావే, వాచస్పతీ! నీచరిత్రంబు నీచంబుచాలున్ వృధా
లాపముల్ సేయ 'నీ'

యున్న వారిందరున్నారు చూడంగ నేడెల్లి యాలోన
నేపాకముం బొందనున్నారొ? ఏ దుర్గతిం జెంననున్నారొ? ఎ యాపదం
దూలనున్నారొ? ఏ వంచనుం దూరనున్నారొ? ఆమీద దైవం బొకం
డెర్గుడున్" (కాశీఖండము. 7-74)

సతీదేవి పలికిన పలుకులలో పేరుపేరున సంబోధించి రౌద్రరస
వర్షము కురిపించినది. దక్షుని కూడా వదువలేదు. అందరిపై క్రోధవి
స్ఫులింగాలు కురిపించినది. తుదకు ఏగతిపట్టనున్నదో, ఏపంచలపాలు
కాబోతున్నారోయని దుమ్మెత్తి పోసినది.

ఆధునికులు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి శ్రీకృష్ణరా
మాయణము నందలి దండకమున గూడ రౌద్రరసము పోషింపబడినది.
అందలి సందర్భమిది.

హనుమ సంజీవని తెచ్చుటకు వెడలెను. నీర్ణీత సమయమున హనుమ సంజీవిని గొనిరానిచో లక్ష్మణుడు మూర్ఛనుండి తెప్పరిల్లడు. శ్రీరాముడు యుద్ధమున తమ్ముని కోల్పోయినవాడయి మరింతగ దుఃఖితుడగును. ఈ సంఘటన వలన రావణునికి, అతని సేనకును మరింత బలము, ధైర్యము చేకూరును. అందువలన రాత్రించరులు కపటవేషములు ధరించి, శ్రీరామకార్యార్థమై వెడలిన హనుమ నడ్డగించుటకు ప్రయత్నించిరి. సర్వకార్య సఫలీకృతుడు హనుమ వారి ఆగడముల నన్నియును అరికట్టెను. సకాలమున సంజీవి గొని తెచ్చెను. లక్ష్మనుడు పునర్జీవితుడగును.

దం. "వాతాత్మజుండంత వాతాతి వేగంబుతో వార్ధి జేరంగ బో నంతలో మాల్యవంతుం డనంతాది శార్యుల్ మహాధైర్య ధుర్యుల్ సమస్తాయుధోపేతులై రక్కసుల్ పెక్కువేల్ తన్ను గూడంగ నీరాశి మధ్యంబునన్ మూగిపోనీక పోరాడగా నుండినన్ గొండతోనుండు నవ్వా నరేంద్రుండులో మేఘజాలంబొకో యంచు మున్మున్ను శంకించియున్ సింహనాదంబులన్ జ్యానినాదంబులున్ శస్త్ర సంపాతము ల్గాంచి నక్తంచరుల్ నన్ను మూర్కొంగ రైరంచు దానెంచి యున్నంత వారంత యేపాత మొప్పన్ గదాఘాతముల్ బాణ విన్యాసముల్ ప్రాస చక్ర ప్రయోగంబులుం జేసి నొప్పింప నప్పావకాంభు ఒడు నాజ్యాహుతిన్ వర్ధమానుండు వైశ్వానరుండోయనన్ నుండి మెండైన సత్వంబునన్ దండిక్రొక్కంగనై లేళ్ళపై బారు హర్యక్షముంబోలి లీలన్ సమీరాత్మజుండెల్ల రక్షోబలంబున్ గలంగన్ జలం బెర్పడం జేయుచుం వాలపాశంబునం జుట్టి బిట్టేపునం ద్రిప్పి వారాశిలో వైచుచుం బావ యుగ్మంబునం దన్ని ప్రాణంబులం దీయుచుం బార్శ్వముందాకి వీకంబడం

జేయుచున్ జానుఘాతంబులన్ జంపుచున్నొంప సైన్యంబు
దైన్యంబు నొందంగ నైనంత నమ్మాల్యవంతుండటన్."

యుద్ధకాండ. తృతీయాశ్వాసము. 218.

హనుమంతుడు సంజీవనినే దెచ్చుట కుపక్రమింపలేదు. ద్రోణాచలమునే పెకలించెను. శ్రీరాముని యొద్దకు తిరిగి వచ్చెడి సమయమున రాక్షసుల మాయోపాయములను ఛేదించెను. తమ ఎత్తులు పారవని తుదకు యుద్ధమునకు దిగిరి. హనుమచే సంహరింపబడిన వారిలో మాల్యవంతుడు నాలిని రాక్షస గణము నొకటి. రాత్రించరులు పోరాటమునకు సన్నద్ధు లగుటతో హనుమయందొక్కమారుగ రుద్రత్వ మావహించినది. ఈ రౌద్రరస స్ఫూర్తి గల్గిన సంఘటన శ్రీ కృష్ణమూర్తి శాస్త్రిగారు దండంమున రచించియుండిరి.

4-5. బీభత్స రసము.

"విభావితో విస్రగంధోవ మధు శ్లేష కీటకైః
రుధిరాస్త్ర వసా మాంసై రత్యర్థ మనుభావితః
భవేజ్జుగుప్సా బీభత్సాస్యాద్వేఘ్రియ భావితః" అని బీభత్సరస నిర్వచనము చెప్పబడినది.[17] ఇది జగుప్స అనెడి స్థాయి వలన జనించును. హృద్యములు గానివి, అప్రశస్తములైనవి, అప్రియములైనవి. అనిష్టములునగు వస్తువులను చెప్పుటచేత బీభత్సరస ముత్పన్నమగును,

కోయపితూరి అను దోపిడి దండకము బీభత్సరసాత్మకమైనది. ఇందు ప్రకృతి వైపరీత్యమునకు దోడుగ, కోయలు గుంపులు గుంపులుగ జేరి గ్రామములందుబడి, యిండ్లయందలి వస్తుసముదాయమును దోచుకొనుట వర్ణింపబడినది.

దం. "... మర్త్యులార్జించు పాపంబులున్ ఘోర దుష్బుద్ధులున్
హెచ్చులౌచుండి యిల సత్యమున్ ధర్మమున్ సన్నమైపోవ

బల్ వర్షముల్లేక యారహితులున్ ఘోషలున్ జెంద బల్
పంటలున్ క్షీణమై విత్తనాల్ నాశనంబందగాన్ పక్షిజాతంబు
లున్ భస్మమైపోవగన్ పశువులెల్లన్ వగల్ జెంది ధర నీరము
ల్లేక యాకాశమున్ జూచి కడు బొబ్బలిడి చావ మరికొన్నిటిన్
మాలలున్మాదిగల్ చోరవశ్యంబులైనట్టి మందుల్ ప్రయోగిం
చియున్ ప్రాణముల్ తీసివేయంగ, ధరకొంత దేశంబునన్
మరిడె మహాలక్ష్మి జాడ్యంబులు న్బొడమి నరులెల్లరున్ బెగడి
బల్ నాశనం బొందుచున్నుండగా" మరికొన్ని విపరీతములు

పుట్టినవట. బొంబాయి, కలకత్తా మొదలగు పట్టణముల నుండి కఠినమైన బొబ్బరోగములు వ్యాపించినవి. జనులు లక్షలకొలది మరణించుచుండిరి. ఆఖరిసారిగ జనులకు మందు నిచ్చుట (ప్రభుత్వము) మొదలిడినది. అంతయేగాక, వ్యాధి సంక్రమించిన ప్రదేశముల 'యా పురమునందగ్నిని న్బెట్టి యా మేడలుల్ మిద్దిలున్ మింటనున్నట్టి భగభగన్మంటలున్ మండుచు న్బెళ్ళుమని పేలుచున్ దగ్ధమై ధరణిన్ గూలుటన్జూచి యా పురజనుల్ చాల దుఃఖంబులన్ బొందియు న్మరణమైపోవ విశ్వంబునందంతట న్నిట్టి కష్టంబులున్ గల్గి యా మానవుల్ మానసంబందునన్ చాల భీతావహుల్ జెందియున్ 'బీదలు స్వ (దేశ) ప్రదేశమును విడిచి దేశాటనచేయ మొదలిడిరి. తిండికి కరువైరి. ప్రజలు క్షామముతో బాధలుపడుచుండగ తిండిలేని కొందరు కోయ ప్రజలు గుంపులు గుంపులుగ చేరి ప్రజలు విడిచి వెళ్ళిన గ్రామములను దోచుకొనుచుండిరి. 'బల్క్రూరు ప్రమని నందరున్ కెవ్వుమని నెగురుచున్ కరవాలం దీసుకొని కత్తులన్బూనుకొని విం డ్లెలున్ పూసలున్ ఉండలున్ బద్దల న్గుద్దులన్ బడి తెలున్ సీటుగల బాకులన్ చేతలన్బూని తుపాకుల న్వేయుచున్' కోయలు గ్రామములపై బడి దోచుకొనుచుండిరి. వారిని చూసిన ప్రజలు భీతావహులై 'అందరున్ గుండెలున్ ఝల్లుమని బెదరుచున్ ప్రాణముల్ అల్లడల్ తల్లడల్ బొందగన్ తల్లులున్ అన్న

లున్ దమ్ములు న్చెల్లెలున్ అక్కలు న్నొక్కరికి నొక్కరెడబాసి యున్గొందరున్' అయిరి. ఇట్లున్న సమయమున కొందరు తమ సొమ్ములను తీసివేసి పెట్టెలలో పెట్టుకొని కొండప్రాంతములలో దాగుకొనిచుండిరి. మరికొందరు ఆ పెట్టెలను నూతులలో పారవేయుచుండిరి. సమస్త వస్తు సంపద దోపిడీకి గురి అయినది. వస్తువులు పోవుటయే గాక ప్రజలు రోగముల పాల్పడిరి. ప్రజా జీవితము అల్లకల్లోలమయి నానావిధముల బీభత్సము నొందినది. ఇది క్రీ. శ. 1898 సంవత్సరమున జరిగిన సంఘటన. దీనిని బృందావనము రాఘవాచార్యులుగారు దండకమున రచించి యుండిరి.

ప్రకృతి సృష్టించిన బీభత్సము కొంతమైన, ప్రజలు సృష్టించుకొనిన బీభత్సములు మరికొన్ని. ఇట్టి బీభత్సాత్మకమైనదే గాలివాన దండకము. ఇది ప్రకృతి సృష్టించినది. ఇందునను ప్రజా జీవనము భగ్నమైనది. తల్లి పిల్లలు తెలియకైరి. వృక్ష, జంతు, పక్షి సమూహములు నాశనమయినవి. గృహసముదాయము కుప్పకూలినది. సస్యములకు చావుదెబ్బ తగిలినది. హృదయవిదారకమైన ఉత్పాతము. దీనినికూడా శ్రీ బృందావనము రాఘవాచార్యులుగారే 'గాలివాన దండక' రూపమున రచించిరి. ఈ బీభత్సాత్మక సంఘటన 1865 సంవత్సరమున జరిగినది.

శ్రీ 'గంగరాజు అప్పయ్య' రచించిన 'పీపుల్సుపార్కు అగ్నిప్రళయ దండకము'ను బీభత్స రసాత్మకమైనదే. క్రీ.శ. 1886 డిసెంబరు 31వ తేదీన సాయంకాలము 6 గంటల సమయమున నీసంఘటన జరిగినది. మద్రాసు నందలి పీపుల్సుపార్కు (విక్టోరియా గార్డెను) నందు యీ సంఘటన జరిగినది. ఆరోజున ఆపార్కునందొక సంత (ఎగ్జిబిషను) వంటిది పెద్దఎత్తున ఏర్పాటు చేయబడినది. ఆ సంతయందు సర్కసు, ఆంగ్లవనితల నృత్యములు వంటివి కూడ ఏర్పాటు చేయబడినవి.

కరెంటు వైరుల వలన సంభవించినదో, ఎవరైనను ధూమపానము చేసిరో లేక చేయవలెనను తలపుతో మరెవరైనను చేసిరో నిప్పు అంటుకొనినది. సమస్తము భస్మీపటల మయినది. ఇదియును బీభత్సాత్మక సంఘటనయే.

శ్రీ పెళ్యారు శ్రీనివాసరావు రచించిన "గజేంద్రమోక్ష దండకము" నందును కొంతవరకు బీభత్సరసము పోషింపబడినది.

ఉదా :- "...నద్దాన వన్యేభముల్గొన్ని ఘోరంబుగా నల్ల రాచట్టులో శాక నీలంపు బెన్మిట్టలో నాగ మెప్పింపగాజాలి దాంపత్యపుం గూర్మిచే గొన్ని ఆత్మేజ ప్రేమావిశేషంబుచే గొన్నియున్ మిత్రవాత్సల్య మొప్పారగా గొన్ని యెన్నో కుటుంబంబులుండెన్ వనంబందు తదాత్రవముల్ విన్న భల్లూకరాజంబులున్ గహ్వరాంతంబున్ దూరు శార్దూలముల్ మాంగుమూలల్ సొరంబారు భూదారముల్ నేల రంధ్రింబులన్ జేరు నవ్వాన కేంద్రంబులున్ వృక్షశాఖాళిపై దారు సర్పంబులాపోయి వల్మీకముల్ సొచ్చగా నీలకంఠంబులున్ మింటిపై హెచ్చగా ఘోర కాంతారమందిమ్ముగా సందడుల్ గానరావార సింగంబులున్ వాటి జేరంగ భీతిల్లు..." ఇట్లు తండోపతండములుగ గజసమూహము కాసారములకు బోయి తామరలు తునకలగు నట్లుగ జలక్రీడ సలుపును. ఈ కృత్యమునకు జలచరములు గూడ భీతిల్లినవి. "కాసారముంజొచ్చి దాహంబుతో నీరంబునుం గ్రోలియంజే సుఖంబార గేళీ విహారంబు సల్పంగ నుంకించి తద్దారలుందాను లోనుండు పాఠీనముల్ నక్రముల్, మత్స్యముల్ మున్నుగా గల్గు నీరాటముల్ భీతిలం గ్రుంకి పై కేగుచున్ దూకుచున్ మున్గుచున్ జెల్లు కల్లోలముల్ సల్పి తద్భుదారావముల్ మింటికంటంగ" హద్దులేకుండగ ప్రవర్తించినవి. మాతంగమును నక్రము పట్టుకొనుటతో కథ అడ్డము తిరిగినది. అంతవరకును త్రికూటాద్రియందును కాసారమునందును గల జంతుజాలమునంతను భీతావహము జేసినవి.

ఇట్లు దండకములందు అమితముగ కానరాకున్నను బీభత్స రసాత్మకము లైనవియును లేకపోలేదు.

4—6. సాంఘికములు.

కవి యెంతటి స్వతంత్రుడయినప్పటికిని దేశ కాల పరిస్థితుల ప్రభావ మాతనిపై నుండితీరును. కవికూడా సంఘమునందలి వ్యక్తి గనుక సంఘముయొక్క ప్రభావము అవ్యాజముగ నాతనిపై ప్రసరించును. అట్లే కవికూడా తన ప్రభావమును సంఘముపై ప్రసరింపజేయును. కవి కవితా ప్రభావము నుండి సంఘము తప్పుకొనలేదు. కారణము అతడు నాయా దేశకాల పరిస్థితులు దృష్టియందిడుకొని కావ్యరచన చేయుటయే. ఆయా కాలములందు ప్రత్యేక సంఘటన లేమయిన నుండినను కవి చలితుడై మేలుకీడులు విచారించుచు కావ్య రూపమున నిక్షిప్తము చేయును. ఇటువంటి వానిలో స్వాతంత్ర్యోద్యమ మొకటి. ఇది యావద్భారత దేశమునకు సంబంధించినది. స్వేచ్ఛా స్వాతంత్ర్యముల కొరకు పాటుపడిన భారతీయుల చారిత్రాత్మక సంఘటన. ఈ సంఘటనకు చలితులై ప్రతిస్పందించిన కవులు, రచయితలు తెలుగు సాహితీలోకమున లెక్కకు మిక్కిలి గలరు.

బహుభాషా పండితుడగు కీ॥ శే॥ కందుకూరి వీరేశలింగంపంతులు తన దృష్టిని సంఘ సంస్కరణమువైపు ప్రసరింపజేసిన వ్యక్తి. బాల్య వివాహములు తగవని, వితంతువులకు పునర్వివాహము చెల్లునని, స్త్రీలకు విద్యయు, సమానహోదా యుండవలెనని మూఢనమ్మకములను, మతాచారములను నిరసిస్తూ తన సాహిత్యముద్వారా ప్రబోధించిన మహా మనిషి. ఇట్టి మహోద్యమములకు భాషనొక సాధనముగా జేసికొని ఆచరణయందు కృతకృత్యుడైన మహానుభావుడు వీరేశలింగంపంతులు. ఈ కోవకు చెందినవారే యెందరో మహాత్ములు గలరు.

బలవంతుడు తన బలముచేత చరిత్రపుట సృష్టించగలడు. కవి తన కలముతో ఆ చరిత్ర పుటలు మార్చగలడు. ఒకటి శారీరక పరిణామమునకు చెందినదికాగా, మరియొకటి మానసిక పరిణతికి చెందినది.

కన్యాశుల్కములు, వరవిక్రయములు, జాతివైషమ్యములు మొదలగునవి కొన్ని కాలములలో ప్రబలెడి దురాచారములు. ఇవి దేశమునందలి ప్రజలకు సంబంధించినవి. సంవత్సరములకొలది ఆయుస్సు కలిగినవి. కన్యాశుల్క విషయమున గురజాడ మొదలగు కవులు ప్రతిఘటించగ, జాతివైషమ్యమున ఉన్నవ వంటివారు, వరవిక్రయ విషయమున కాళ్ళకూరి ప్రభృతులు ప్రతిఘటన సలిపియుండిరి. దీనికి గల కారణము సంఘమునందలి మానవుని మనుగడకు ముప్పు వాటిల్లుటయే. స్వాతంత్ర్యోద్యమమునసేమి, దేశమునందలి దురాచారముల దౌష్ట్యమునసేమి తెలుగుకవి సమానముగ చలించియుండెను.

కోపోద్రిక్తుడైన మానవుడు ఏ ఒక్క సంఘటనకైనను తోడ్పడగలడు గాని, ఔపదేశిక రూపమున కార్యాచరణ చేయజాలడు. అట్టి ఔపదేశిక రూపమున, స్వాతంత్ర్యసంగ్రామ వస్తువును గ్రహించి లఘాకృతులైనను కొందరు కవులు దండకములను రచించియుండిరి. దేశమునందలి రాజకీయ పరిస్థితులను దృష్టియందిడుకొని తెగడిన కవులును గలరు. అటువంటివాటిలో ఈ క్రింది దండకములు గొన్ని—

నేత దండకము : ఈ దండకమును రచించిన కవిపేరు తెలియదు.[18]

ఆంగ్లేయుల పాలనలో భారతీయులు మానసికముగ, ఆర్థికముగ సామాజికముగ చిత్రహింసలకు లోనగుచుండిరి. ఈనేత దండకము ఆర్థికపరమగు వస్తువును ఆధారముగ రచించినట్టిది. నేత శబ్దమిట వస్త్రములు అల్లెడి విషయమునకు సంబంధించినదిగాని, నాయకుని పరముగ ప్రయోగించినది గాదు.

రెండువేల సంవత్సరములకు ముందుగనే భారతీయులు రేగళ్ళలో ప్రత్తిని పండించి, రాట్నములపై సన్నని దారమునుదీసి, బండిచుట్టి, మగ్గములపై వస్త్రములు నేయుచుండెడివారు. ఇట్లు తయారుచేసిన వస్త్రములను పారసీకాది రాజ్యములకు ఎగుమతి చేయుచుండిరి. పారసీకులు ఈ వస్త్రములనుచూసి మురిసినవారై యుండగా, వీరిని జూచిన గ్రీకులు రాజ్యవ్యాప్తితోపాటు వర్తకము నంతటిని సంగ్రహించుటకు సమకట్టిరి. క్రమముగ ఆంగ్లేయులు వర్తకము చేసి కొనుటకు భారతదేశము నందడుగిడి, వారి దేశములో నెలకొనియున్న నూలు నేసెడి యంత్రములను భారతదేశమున ప్రవేశపెట్టిరి. దేశము నందు ఐశ్వర్యవంతులుండిరి. కూలినాలి చేసెడివారు లెక్కింపశక్యముగా నుండిరి. ఈ దేశమునందు పండించు ప్రత్తిని, ఈ దేశము మగ్గములపై వస్త్రములుగనేసి, అట్లు నేసిన వస్త్రములను ధరించిన మూలము, వడ్డీ, కూలి, లాభము దిగుమతి వస్నులు మొదలగునవి మనకే లాభించును. అని ఆంగ్లేయ ప్రభుత్వము నెలకొల్పిన నూలు యంత్రముల కదలికను నిలువుమని కవి వేడుకొని యుండెను.

ఈ దండకమున భారతదేశము నందలి నూలు బట్టల ఉత్పత్తి, ఆంగ్లేయుల పరిపాలన వలన దేశీయ మగ్గములకు, ఆర్థిక విధానమునకు ఏర్పడిన ముప్పు వివరింపబడినది భావమునందు బంధశైథిల్యత హెచ్చు.

**భరతమాత దండకము :**

ఈ దండకమును రచించినది శ్రీసుబ్రహ్మణ్య భాగవతులు.[19] భరతమాతను తల్లిగా భావించి యీ దండకమున, ఆంగ్లేయ పరిపాలనలో భారతీయులకు కలిగిన కష్ట, నష్టములను వర్ణించియుండిరి. కొంతకాలము నుండి మమ్ములనీ విదేశీ ప్రభుత్వము పరిపాలించుచున్నదనియు. వారి పరిపాలన వలన భారతావనికి హాని కలిగెదనియు తలచి దండక కర్త వ్యథచెందిరి. 'పాశ్చాత్య సంబంధమైనట్టి వ్యామోహామందే సదా

మున్ని మా సంప్రదాయంబులన్నీడి మాకట్టు, మాజుట్టు, మాబొట్టు సర్వంబు పాశ్చాత్య మార్గానుసారంబుగా సల్పుచున్ హూణభాషా ప్రవేశంబులేనట్టి జీవుంకు మూఢుండుగా నెంచుచున్ దేశభాషా పరిసంగం బటన్నన్ మహా ఘోరమౌ పాతకంబంచు యేమెంచి నీపాద సేవారతిన్ మాని లోకంబులో మానవుండన్నవా డెంతయుం జన్మ హక్కంచు తానెంచు స్వాతంత్ర్యముంబాసి 'జీవచ్ఛవములవలె నున్నారమని' మా పూర్వ పుణ్యంబునం జేసియో నీ చల్లవౌ కామ్య భాగంబును జేసియో' సత్యవాక్యావలంబుండు, సద్ధర్మమార్గప్రచారుడు శాంతస్వభావుడు, అహింసా మహతత్త్వబోధ పరిభావాప్త విజ్ఞాన చక్షుడు, సత్యాగ్రహవ్యాప్తి తత్పరుడు నయిన గాంధీ మహాత్ముడు భారతదేశ స్వాతంత్ర్యమునకై పోరుచున్నాడని, ఈ సమయముననే సుశ్లోకుడు, లోకమాన్యుడయిన బాలగంగాధర తిలక్ స్వర్గస్థుడయ్యె నని, అధ్యాత్మికమార్గమున నిత్యమైనిలచిన శాంతి, హింసాయుత చర్యలతో సాధ్యమా? అని యహింసాతత్త్వ జ్ఞానోపదేశము చేసిన మనీషి గాంధీజీయని, భారతమాతకు కృతికర్త కొన్ని ప్రమాణములను చేసి యుండెను. అవి ఏవన...

రాటంబుపై దీయు దారంబుతో నేయు వస్త్రంబులం గాక వేరొండు వస్త్రంబులం దాల్పగాబోము.

మా సంప్రదాయంబులన్ మార్చి మమ్మెల్ల దాస్యంబుపాల్జేయు పాశ్చాత్య విద్యావిధానం బపేక్షింపగాబోము.

మాదైకమత్యంబునుం బాసి వైమనస్యముల్ పెంచి మాయిళ్ళు వాకిళ్ళు మా భూభాగము లమ్మించి మమున్ నిరాధారులంజేయు కోర్ట్ల రకుం జేరగాబోము.

పరిమత్తాత్ములన్ జేయుచున్ నీచమౌ ఘోరమౌ కార్యమే దైన మాచేత చేయించి మమ్ముం దురాచారులం జేయు నామద్యపానంబు నాశింపగాబోము.

నిస్సారభూతంబులౌ తోకలున్ కేవలార్థపరిధానంబులై నట్టి యుద్యోగముల్ గోరి దేశంబుకై ద్రోహమున్ సల్పగాబోము.

వెయేల మాకిందు సంపూర్ణ స్వారాజ్యంబు [చేకూరువందాక యీ సక్రమాందోళనంబుల్ విడంజాలమో యమ్మరో వీనిలో దేనికిం దప్పినన్ మాతృద్రోహంబునుం జేసినట్లేగదా !

ఇంక మాశామహాత్ముడు నిర్దేశముం జేసి నట్లిచ్చటన్ కోటి రూప్యంబులుం కోటి సభ్యాళికిన్ కోటిలో బంచభాగంబు రాటంబులుం జేర్చి మున్ముందుగా నావిదేశంపు వస్త్రంబులన్నింటి త్యాగంబుగావించి శుద్ధ స్వదేశంపు వస్త్రంబులే యన్ని ప్రాంతంబులందున్ ధరించన్ నిరాటంకమారీతి యత్నంబులన్ కల్పి దేశంబులో నంతటన్ పూర్తిగా నైకమత్యంబునున్ నిల్పి యాపిమ్మటన్ శాసనోల్లంఘనమున్ ప్రవేశంబు చేయించి స్వాతంత్ర్యముంబొంది నిన్ను స్వారాజ్యంపు సింహాసనం బెక్కగా జేతుమమ్మా. అని పండ్రెండు ప్రమాణములు చేసి యుండెను.

వాణిజ్య నిర్వహణకై క్రీ॥శ॥ 1600 లో ఆంగ్లేయులు "ఈస్టు ఇండియా కంపెనీ"ని స్థాపించి మొగల్ పాదుషా సహకారముతో సుగంధ ద్రవ్యములను, భారతదేశమునందలి ప్రత్తిని కొనుగోలు జేసి ఇంగ్లాండులో తయారయిన వస్తుసముదాయమును దేశీయ సంస్థానాధిపతులకు, నవాబులకు అమ్ముచుండెడివారు. తుదకు వారి ఎత్తుగడలలో భారతదేశమే వారికి హస్తగతమైపోయినది. స్వదేశీయుల ఇక్కట్లు మిన్నుముట్టినవి. 1921 సంవత్సరములలో సహాయ నిరాకరణోద్యమము ప్రారంభమైనది. ఉద్యోగములు వదలివేసిరి. పాఠశాలలు మూసివేసిరి. అస్పృశ్యతా నివారణ, మద్యపాన నిషేధము వంటి సంస్కరణములతో పాటు పన్నులను నిరాకరించిన సహాయనిరాకరణోద్యమ మాధారముగా (శ్రీ) సుబ్రహ్మణ్య భాగవతులు ఈ దండకమును రచించిరి.

జార్జిప్రభు పట్టాభిషేకము :

ఈ కావ్యకర్త నాదెళ్ళ పురుషోత్తమ కవి. [18] (క్రీ॥ శ॥ 1865-1936). ఈకృతి అయిదవ జార్జి పట్టాభిషేకమును పురస్కరించుకొని రచించినది. అయిదవ జార్జి పట్టాభిషేకము 12-11-1931 సంవత్సరమున జరిగినది.

1600 సంవత్సర ప్రాంతమున ఆంగ్లేయులు స్థాపించిన ఈస్టు ఇండియా కంపెనీ మొగల్ పాదుషా జహాంగీరు అనుమతితో భారత దేశమున వర్తకము ప్రారంభించినది. కొలది కాలమునాటికి కుతంత్రములతో రాచరిక విషయములలో చొరబడినది. కొందరు రాజులకు యుద్ధములందు సహాయమొనరించి మరికొందరిని బలహీనులను జేసి స్వదేశరాజుల మెప్పునుపొంది, కొన్ని ప్రాంతములకు అధిపతులై తుదకు యావద్భారతావనిని తమ హస్తగతము చేసికొనిరి. ఆంగ్లేయుల నుండి భారతీయులు స్వాతంత్ర్యమును సంపాదించుకొనుటకు పడినపాట్లు వర్ణింప శక్యముగానివి.

ఇట్టి చరిత్రను కలిగియుండగా "నాదెళ్ళ పురుషోత్తమకవి" తమ కావ్యాంతర్గత దండకమునందు ఈవిధముగా నభివర్ణించిరి. "ఇంగ్లాండు దేశమునందు నివసించెడి దొరలు ఈస్టు ఇండియా కంపెనీ పేరున వాణిజ్యమునకై వచ్చి వర్తకము చేయుచుండిరి. వీరు యుద్ధములు సేయుటయందు దిట్టలు. హూణప్రభువులు వీరి సాహాయ్యము కోరి యుద్ధములుచేసి వారి మెప్పునుపొంది, వారొసగిన రాజ్యములను గ్రహించుచు తదుపరి వారే యుద్ధములుజేసి క్రమావాప్తమైన సంపదకు వారసులై, దేశమును చాలవరకు నాక్రమించి ఇంగ్లండు దేశమును ఏలికగా జేసిరి. ఇట్లు జయించిన భారతదేశమును, ప్రజలను విక్టోరియా మహారాణి నాయకురాలుగ కన్న బిడ్డలవలె పరిపాలించు

చున్నది. ఆమెయే హిందూదేశమునందు ఉత్తర ప్రత్యుత్తర సౌకర్యము "పోస్టు", టెలిగ్రాఫ్ సౌకర్యములు ప్రవేశపెట్టి అమిత దూరమునందలి వృత్తాంతములు తెలిసికొనుటకు సౌఖ్యము కలుగజేసినది. ఆసుపత్రులు ప్రత్యేక రహదారులు, రైలుబండ్లు, సముద్రములందు స్టీమర్లు ప్రవేశపెట్టి భారతదేశ ప్రజలకు మేలు చేకూర్చిన మహామనీషి. ఆమె కుమారుడు అయిన ఐదవజార్జి ప్రజలను ప్రాజ్ఞతతో పరిపాలించుచుండెనని 'జేజే యటంచు న్నుతింపంగ నో నావియత్వ మీ చూపగా జెల్లుగా తన్మముం బ్రీతి మాకోరు నద్దా వరంబీ మహేశా' అనెడి వేడికోలుతో ఈ దండకము ముగియును.

ఇది గ్రంథాంతర్గతము. నిడివియందు బాగా స్వల్పమైనది. సంపూర్ణముగ నాంగ్లేయ పరిపాలకులు భారతదేశమున కొనరించిన మేలునే కొనియాడినట్టిది.

భాషీయ దండకము :

కర్త గుంటూరి నరసింహశాస్త్రి [21] (క్రీ. శ. 1850) ఇందు వివిధ జాతుల ప్రజలు అహూబలస్వామి తిరునాళ్ళకు బయలుదేరి నట్లు, అప్పటివారి సంభాషణమును కర్త దండకరూపమున వ్యక్తీకరించి యుండిరి. ఇటువంటి సంభాషణాలనే వర్గ మాండలికములుగా పరిగణింతురు. దీనియందు రెండర్థములనిచ్చు పదములు ముక్కుటము. ఆయా జాతుల ప్రజల భాష పదజాలమును యథాతథముగ పొందుపరచుట వలన దండక చ్ఛందమునకు విఘాతమేర్పడుట సర్వసాధారణము. దీనివలన నాయావర్గముల ప్రజలు మాట్లాడెడి విధము వ్యక్తమగును. అవి ఏవన-

1. చోద్దార్లు :- కే అదబ్బీ కదేరోకే తే బాడు బాజీనికాలో బరోబర్ కదంపర్ కదంసారప్సే అరాభీ సరగ్కే అదప్పీ తపావత్ర పావల్ చలోనిప్పజా అంచు చోద్దార్లు

2. వృద్ధబ్రాహ్మణులు :– '– –వసిరో మీరలప్పావ ఘుప్పావధాన్! లచ్చిభొట్లన్న! పిన్రంగుభట్లూ! బృహత్కుటీ గోపాలభట్లూ! మహాసూత్రకా రెల్లుభట్లూ! నమస్కారమోహో – –'

3. బ్రాహ్మణ స్త్రీలు :– 'ఓ వర్ఝులంబక్క! జంధ్యాల పేరక్క! తీర్థాల బుర్రిక్క! మీవారు శోపించు కొంచారుగా! వాహ! మావారికిన్ ముందరయ్యో! నాకెన్నడైనాను లేస్నుంది – –'

4. వైష్టవస్వాములు :– 'బొడ్డు మంటప్పలాచార్లువారూ! జయస్తంభ తిరువెంగళాచార్లూ! పెద్దయ్యా మాచార్లు! ముద్దయ్యమాచార్లువారా! అయ్యంగార్లు వేంచేస్తిగే! రండి రండీడ గూర్చుండి – –'

5. మధ్వ విద్వాంసులు :– 'ఓహూహు! మాంచారి సీర్గట్ట నారాయణాచార్రి! బంకాపురీ చట్టిగీతమ్మణాచార్రి గద్వాల పల్లక్కి పురుషోత్తమాచార్రి శ్రీమన్నృసింహాద్రి ఆచార్రి! – –'

6. సిద్ధాంతులు :– 'ఏమోయి కొండిభట్లూ కుంరగాటీ. నేడే సమర్తాడె, నేనే నిషేక ప్రయత్నంబు చేయించియున్నాడ యీపిల్ల పెండ్లప్పుడున్ జక్క శోధించి బల్ మంచి లగ్నంబు సాధించి – –'

7. రాజులు :– 'ఓయి శండ్రాజ! కొండ్రాజ! ఎల్రాజ! కామాక్షిరాజా! బలా భూములేలేటి దొర్లందరీ ఔబుస్వామి తిర్నాలకే వస్తిరో చాల సంతోషమీపొద్దు – –'

8. వైశ్యులు :– 'అయ్యా అన్నంగులూ! ఐన గంటంత మీ తూట్లకే పెట్టితే ముందరెట్లాగ? నాశందులో – –'

9. వైశ్య స్త్రీలు :– 'ఏమె ఓప్పె! పేరంటాల కొండమ్మ! ఓతల్ల మెంగమ్మా! ఓ బుల్లగూరచ్చమా! బుచ్చమా! చూడవో, నన్న మాయల్లుడి పొద్దు నేసింది, పండక్క లేన్నిడకున్ తోడి తెమ్మంట – –'

10. వారకాంతలు :– 'ఏమె ఓ చిన్నదాన! నితాంతానవచ్చి

న్న దానా! మదుద్యున్ని దానా! మహోబలస్వామి తిర్ణాళ్ళు చూతాము రావే వడిన్ భవద్వ్యానం బివ్విధిన్ వ్యర్థమున్ సేయగా నవ్వరా— —'

11. జారకాంతలు :— 'ఆయేవేయే! శకోరాచ్చి! పోమాచ్చి! కామాచ్చి! మీనాచ్చి! కోగట్టుకో! తల్లడేపిచ్చుకో! ఓబలం తేరు కొచ్చేటి వారెవ్వరైనాను వస్తారు లేయే సాగన్ చేసుకో — —'

12. సాతానులు :— 'దేశికుల్ దేశికుల్ శ్రీహరి శ్రీహరీశ్రీమదాచార్య రామానుజాయై నమోస్మద్గురేభ్యో నమో నమ్మయాళ్వారు పెదలెల్లాను మీ కక్షయంబే అనుష్ఠించ నీ త్రోవలో నిన్ను — —'

13. దాసళ్ళు :— 'బుద్ధి బుద్ధిర్దెర్యాగా రెప్పుడేంచేసిరో! మీ కడెం త్రోసి మీకు అడియేన్ దాసి నజ్ఞానినే పరమ నీచుండ శండాల బల్ పాతెకండయ్య ప్రమాణాం శేసిరా — —'

14. జంగమువారు :— 'సిద్ధిలింగ! ఇరూపాక్ష! పంపా పతీ! కేలో హోర్పపర్వాదినా నీనూడి కొండెద్ది యల్లి విభాచి రుద్రాక్ష పోదీకతో మోక్షపో చాయికట్టెయి తెనంచాలు — — —'

15. పౌరకాంతలు :— 'రావె వోశమ్మ! మీయాలగాడెంత పుణ్యాత్ముడే నిత్య నీవెందరిన్ చక బెట్నా మరి యెద్దనేవాడుగా డెంత శాంతుండో హో! నెత్తిపై తన్నినగాని నిందగానేవాడు నీవెంత పుణ్యంబు — —'

16. చంటిబిడ్డలు :— 'దాయో అమ్మోల్ల వుద్దద్ది వచ్చింది కచ్చింది నన్నిద్ద మాపెద్ద మాడిచ్చి నాముద్దు డేదిద్ద భూతన్ పిత్తి తన్నితిత్తే నింద నేబోత వేకుంత నేపోవ పోచిన్న బల్లక్క — —'

17. బుడుబుక్కలవారు :— 'పాలుయాముల లచ్చిబల్ పల్కుతుండాది నీయింటిలో వంటకంబింత పాల్పొంగి నట్టాంగు తుండాది బోచేస్తివా నాజొజ్జ బెరిగీని మంచుంబు మీదున్న కాల్కింద నేపెట్ట — —'

18. చెంచువాండ్లు :- "యేల అయ్యా కరే దొర నీవింటితం గాపుమన్ శెంచురాబయ్యా తేరట్టె వస్తాలె సూతాది మామందు సూసింది నేలేదు గారయ్య మాదోశికి దుచ్చతట్నాసి తందంటినో..."

ఈ విధముగ పది, పన్నెండు పుటల గద్యదండకము. ఒక్కొక్క తెగ ప్రజ యేవిధముగ మాట్లాడెడిదో యొకటి, రెండు పంక్తు లుదాహరించబడినది. కొన్ని జాతుల ప్రజలు మాట్లాడెడి భాష నాధారముగా రచించినది గనుక దీనికి భాషీయ దండక మనెడి నామము సార్థకము. ఇవి వర్గ మాండలికములు. ఒక్కొక్క జాతి మాట పడికట్టు ఒక్కొక్క విధము గా నున్నది. ఈ పొత్తము 1912వ సంవత్సరమున ముద్రింపబడినది. కొన్ని మార్పులకులోనైనది. "యుక్తి యుక్తముగ కూర్చబడిన దగుటచే నిది పామర జనులకు మిగుల నుపయోగముగ నుండునని కొన్ని మార్పులతో ముద్రింపబడినది." అని భాషీయ దండకమునకు పీఠిక వ్రాసిన "మున్నంగి లక్ష్మీనరసింహాశర్మ" గారు తెలిసియుండిరి. వీరు ఏవిధమగు మార్పులు గావించిరనునది తెలిసికొనుటకు నింతకంటెను పూర్వప్రతి నాకంటబడినదిగాదు.

కర్త యితివృత్తరూపముగ రచించిన దండకము కాదిది. తుదను అహూబలస్వామి తిరునాళ్ళకి వెడలుదమని అనుటవలన అన్ని జాతుల ప్రజలు అహూబలస్వామి తిరునాళ్ళకి బయలుదేరిరని ఐక్యత కల్పించుకొనవలెను. కవి రచనను కొంతవరకు కృతకముగా నొనరించినట్లు తోచును. కారణమిందు పేర్కొనబడిన ప్రతి జాతి భాషించిన తీరున నేదో యొక లోపమున్నది. వారకాంతల సంభాషణమును రచించు పట్టున "భవద్వ్యసనం బివ్విధిన్ వ్యర్థమున్ సేయగా నవ్వారా యెవ్వరైనాను ఓ పువ్వుబోణీ! వినే హైకతకోరినే" అని సుస్పష్టమైన చక్కని సంస్కృతభాషాపదముల నుపయోగించియుండిరి. కారణము "నీ పాయమూ బుద్బుద ప్రాయమే కాన వేగన్ ధనాకర్షణోపాయమున్

జేయవే" అని ప్రయోగించిన వాక్యమున ప్రాయ శబ్దము రేఫ రహిత ముగ నొకమారు, రేఫ సహితముగ నొకమారు ప్రయోగింపబడుట అనౌచిత్యము. నోరుతిరగక గాని, ఉచ్చారణ సౌలభ్యము కొరకు గాని శబ్దమునందు మార్పు సంభవించుచుండును. అంతియేగాని ఒక మారు ఒకవిధముగ, మరొకమారు మరొకవిధముగ ఒకే శబ్దము వాడుకలో నుండుట సంభవింపదు. కారణమిది వర్గ మాండలిక సంబంధిగనుక.

ప్రత్యక్షముగను, పరోక్షముగను అనుచితార్థములు స్ఫురించు నట్లు శబ్ద ప్రయోగము జరిగినది. మొత్తముమీద వివిధ జాతుల ప్రజలు మాట్లాడెడి తీరును వ్యక్తీకరించినదనుటలో సందేహము లేదు. దీనినిబట్టి యేకాలము నందే జాతి జీవనమెటులున్నదో, వారి మనుగడ యెట్టిదో మొదలగు అంశములు తెలిసికొనవచ్చును.

మైసూరుదేశ ప్రశంసా స్తబకము :

కర్త హరికథా పితామహ ఆదిభట్ల నారాయణదాసుగారు.[22] ఈయన బహు రాష్ట్రములను సందర్శించి బహుభాషలలో హరికథలు చెప్పిరట. వీరు మైసూరు నగరమును సందర్శించిరి గాబోలు, ఆ నగరమును వర్ణించుచు నొక దండకమును రచించియుండిరి. ఆధునిక కాలమునందా నగర మేవిధముగ శోభించుచున్నదను విషయము నిందుండి గమనింపవచ్చును.

ఉత్సవ దండకము :- ఈ దండకమును తిరుపతి వేంకటకవులు రచించిరి.

రాజ్యములు కృశీభూతములైనవి. చిన్న చిన్న పరగణాలకు ధనవంతులుగ, జమీందారులుగ రాజవంశీయులు కొందరు వెలిసియుండిరి. అట్టివానిలో కిర్లమపూడి సంస్థాన మొకటి. "ఇది గోదావరి

మండలములోని ఎస్టేటులలో నొకటి. ఒకనాడు పెద్దాపురము సంస్థానములోని ఒక ముఠా. సర్కారువారి వేలములో పిఠాపురము వారి చేతికి వచ్చినది. ఎస్టేటులలోని కొంతభాగము మాత్రమే చివరిదాక ఇనుగంటివారి వంశమున నుండినది.[23] " అని శ్రీ తూమాటి దోణప్ప ఈ సంస్థానము గూర్చి తెలియపరచియుండిరి. ఈ వంశమునందలి చిన్నారావుగారు ఏటేట దేవీ ఉత్సవములు చేసెడివారట. ఈ సందర్భమును పురస్కరించుకొని వీరి ఆశ్రితులైన తిరుపతి వేంకటకవులు చాటువుగ నీ దండకమును చెప్పిరి. ఈ దండకమున "వారాంగనల్ రంగమందంగ ముప్పొంగ నాడంగ బాడంగ రంగత్ప్రరీ మంగళారంభ వాదిత్రముల్ చిత్రమై మ్రోయగా[24]" అని వర్ణించిరి. ఇట్లు ఉత్సవ సమయమున వారాంగనలు ఆడుట, పాడుట యనునొక ఆచారముండెడిదని తెలియును. ఇట వారాంగన లనగా భోగమువాండ్రు. వీరే ఆటపాటలు నేర్చినవారు. ఈ నాటి కాలమున కూడ భోగపు మేళములను రప్పించి వారి ఆటపాటలతో ప్రజలు ఆనందమును పొందుచు నుందురు. అట్లే ఉత్సవములు జరిగెడి రోజులలో జమీందారులచే విద్వద్గోష్ఠులు నిర్వహింపబడుచుండెడివి. తిరుపతి వేంకటకవులు రచించిన యీ దండకమున జమీందారుయొక్క ఆచార వ్యవహారములు వర్ణింపబడుటయేగాక, కొంతవరకునిది భోగినీ దండకేతివృత్తము ననుసరించినదిగ విదితము.

**జమాబందీ దండకము :**

కృతికర్త "పాలెపు బంగార్రాజు" (19, 20 శ) ఈయన రాజమహేంద్రవరమునగాని, చుట్టు ప్రక్కలగాని కరణముగ పనిజేసియుందురు. "భత్త్యాలు లేకుండగన్ జూడ కర్ణాలు కావించు వ్యాపారమండంతయున్ జూచు నాపీసరుల్సేయు వారి అర్జన్లనుంబట్టి పొందేటి ఆయాయి కష్టంబులన్నింటి కాలానుసారంబుగా బొంది సాలాంతమున్

దామొకే రీతిగ స్ఫూర్తిగ సౌఖ్యమే లేక యేప్రొద్దునుంబుచ్చుచుం డేటి వారైరయా దీనరక్షామణీ యేటేట నిట్టట్లు పొందేటి కర్ణాల కష్టంబులన్నింటినిం జూచి చింతించి దండకం బొక్కటింజేసి" అని కృతి కర్త స్వయముగా జెప్పియుండిరి. కరణములు లెక్కలు వ్రాయగా రెవెన్యూ ఇనస్పెక్టరు, తాసిల్దారు మొదలగు అధికారులు వాటిని ఆమోదించెడివారు. ఈ కార్య నిర్వాహణయందు 'యీ లెక్కలన్ దిద్ద నంపించుటన్బట్టి కర్ణాలకు న్నిచ్చుచున్ ఏలోటుపాటుండకుండంగ మాన్యాలులో రీతిగ స్ఫూర్తిగా నిచ్చు నయ్యాజ్ఞ గైకొంచు రాత్రిం బగళ్ళందు నిద్రేమియునోక గర్ణాలు తార్వంచు నడ్మెత్తకుండంగ వెంకయ్యా, రామయ్యా యోరన్న యోతమ్ముడో బావ యంచుం గడున్మెచ్చుటల్సల్పుచు న్జుట్టలం గొల్చుచున్ బొడుమునుం బీల్చుచుం నల్లమందుండలం మ్రింగుచున్ పూట కూళ్ళింటిలో భోజనాల్జేయు చుండగ" నుండెడివారట. వీరు లెక్కలను తయారుజేసి యధికారుల కుందివ్వగావారు, వీరిని రేవురా మాపురా యని త్రిప్పుచు, గ్రామము లలో తాము మామూళ్ళు వసూలుచేయుచు, ఆయా అధికారుల కిచ్చుచూ మానాభిమానములను గోల్పోయి బ్రతుకుచున్నారమని కర్త ఆవేదన వెలిబుచ్చియుండిరి. ఈ దండకము వలన ఆధునిక కాలమున భూమిశిస్తు వసూలుజేయుట, అధికారులు లంచములు తీసు కొనుట, చిన్న చిన్న ఉద్యోగులను రెవెన్యూ అధికారులు బాధలు పెట్టుట, కరణములు పొరుగు గ్రామమునుండి ప్రధాన కార్యాలయ మునకు వచ్చి పడెడి పాట్లు మొదలగు విషయములను వివరించినది.

## గాలివాన దండకము :

కృతికర్త "బృందావనము రాఘవాచార్యులు" గారు. దీనిని ఆధునిక కాలమున జరిగిన ప్రజాకంటకమగు సంఘటనగ గుర్తించ వచ్చును క్రోధన నామ సంవత్సరము, ఆశ్వయుజ మాసము, శుక్ల

పక్షము, సప్తమీ మందవారమున నీ యుత్పాతము జరిగినది. వర్షము నకు గాలితోడైన చెప్పవలసినది లేదందురు, గాలివాన బీభత్సమునకు ప్రజా జీవితము అస్తవ్యస్తమైనది. రహదారులు తెగిపోయినవి. తంతి సౌకర్యములు కుప్పకూలిపోయినవి. కరెంటు సౌకర్యము అంతంత మాత్రముగ నున్న ఆ రోజులలో యిండ్లయందలి నూనెదీపములు కూడ గాలి తాకిడికి నిలువలేకపోయినవి. ఇళ్ళు కూలినవి. పేదప్రజల జీవనము చెప్పనలవిగాని దైనది. ప్రజలు అనువగు స్థలములకు మార్పు చెందెడి సమయమున చెట్లుకూలి కొందరు ప్రజలు ప్రాణములు విడిచిరి. పంటలు నాశనమయినవి. హృదయవిదారకమైన యీసంఘటనను జూచి చలించిన రాఘవాచార్యులుగారు జరిగిన ఉత్పాతము నంతటిని దండక రూపమున పొందుపరచిరి.

వీరు రచించినదే 'కోయపితూరీ అను దోపిడీ దండకము.' గాలివాన దండకము ప్రకృతి సలిపిన హృదయవిదారక విలాసమును వర్ణించగా, నీ దండకము కోయ జాతి ప్రజలు సృష్టించిన అశాంతిపూర్వక సంఘటనను వర్ణించినది. హేవళంబి సంవత్సరము జ్యేష్ఠ మాసమున నీ సంఘటన జరిగినదట. బొంబాయి, కలకత్తా మొదలగు నగరముల నుండి పల్లెటూళ్ళ వరకు బొబ్బ రోగములు ప్రబలినవట. ప్రభుత్వాధికారులు సమాలోచన జేసి రోగ నివారణకుగాను, క్రిమి కీటకాదులను నాశనము చేయుటకు గాబోలు రోగములు ప్రబలిన ప్రదేశములందు ఇండ్లను తగులబెట్టిరట. బీదసాదలు యిండ్లు విడిచి సంచార జీవనము ప్రారంభించిరి. ఈ సంఘటనను అదనుగా జేసికొని వన్య ప్రాంతములలో నివసించెడి కోయలు గ్రామములందు దోపిడులు ప్రారంభించి సమస్త వస్తువులను దొంగిలించు చుండిరి. ప్రజలు బంగారము మొదలైన వస్తువులను వస్త్రములలో మూటలుగట్టి నూతులలో దాచుచుండిరి. ఈ కోయలు సలిపిన దాడికి సరిపల్లె, కామయ్యపాలెం, అంకాల గూడెం, బండార్ల గూడెం, బయన గూడెం,

సురపోరిగూడెం, మంగిశెట్టిగూడెం, దబ్బగూడెం, జగ్గిశెట్టిగూడెం, పట్టెన్నపాలెం, దానయ్యపాలెం, అక్కమ్మపేట, అంకాలపాలెం, వేదాంతపురం, కేతవరం, తిరుమలాయపురం, రామంజపురం, మల్లెపూడి, ములగలంపల్లి, మొదలగు గ్రామములు గురియైనవట. ప్రభుత్వ రక్షణ వ్యవస్థ, ఆయా గ్రామములందలి పెద్దలు ఆ కోయగుంపుల నదిరించి కొంతమందిని పట్టుకొని శిక్షార్హులుగా జేసిన వృత్తాంత మీ దండకమున వర్ణితమైనది.

ఇంజనీరు దండకము :-

కర్త 'దుగ్గిరాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి' గారు.[25] ఈయన ఇంజనీరింగ్ డిపార్టుమెంటులో హెడ్ అక్కౌంటెంట్‌గా పనిజేసెడి వారట అందువలన నీ దండకమునకు "ఇంజనీరు" నామము ప్రసిద్ధ మైనదట. ఇప్పటిలో గోదావరికి ఆనకట్ట కట్టుటకు ప్రయత్నము చేయుచుండిరి హూణ ప్రభువుల ఆజ్ఞతో బంట్రోతులు కొన్ని జాతుల ప్రజలను పట్టుకొని పనులు చేయుటకు తీసుకొచ్చెరవారు. ఇందులో కొందరు ప్రజలు కొంత సొమ్ము ముట్టజెప్పిన. ఆ వచ్చిన బంట్రోతులు వారిని వదిలిపెట్టుచుండెడివారు. భర్తలు ఇండ్లయందు లేకపోయినను ఆడవారినిగూడ 'ఝుంకారముల్ బింకముల్' చేయుచు పనులకు తీసుకు వెళ్ళెడివారు. కూలి ప్రజలకు చెందెడి భత్యములను అధికారులు కూలీలకు ముట్టజెప్పెడివారుగాదు. ఈ కూలీలను అధికారులు కొట్టుచు తిట్టుచూ పనులను చేయించుచుండెడివారు. "విద్యచే వన్నెగా కన్న డున్ జీవనోపాధి లేనట్టి వడ్లలు, పల్లీలు, ముచ్చీలు, కంసాలులున్, గొల్లవాండ్రదుం, గులాబీలు, సాలీలు బంట్రోతులై యుండి, హూణ గ్రీకుల్ వాండ్రనుం గొప్ప యుద్యోగముల్ సెప్పగానందు వర్తించి మర్యాదలం జెందుచున్" అని కర్త ప్రత్యక్షముగ జూచినవారై స్వదేశమునందలి ప్రజలు అందున దళితజాతుల కష్టములను దండకమున తెలియపరచియుండిరి.

పీపుల్సుపార్కు అగ్ని ప్రళయ దండకము :—

కర్త "గంగరాజు అప్పయ్య", 26 ఇదియును గాలివాన, కోయ పితూరీ దండకములవలె సంఘటనాత్మకమైనది. ఈ సంఘటన క్రీ.శ. 1886 సంవత్సరమున డిసెంబరు 31వ తేదీన జరిగినది. పీపుల్సు పార్కు అనగా మద్రాసునందలి విక్టోరియా గార్డెను. ఈ పార్కు ఆరోజులందే ప్రసిద్ధిగాంచిన విహారస్థలము. ఆంగ్ల ప్రభుత్వాధికారులు దీనిని ఎక్కువగా వినియోగించుకొనుచుండెడవారట. ఈపార్కునందు ఒక పెద్ద ఎగ్జిబిషన్‌వంటిది యేర్పాటు చేయబడినది. ఆరోజున సాయం కాలము ఆరుగంటలకు పార్కు నందొక పెద్ద అగ్ని ప్రళయము సంభ వించినది. కరెంటు తీగల వలననో, దుకాణములందలి దీప సముదా యము వలననో, లేక ఎవరైనను నిర్లక్ష్యముగ ధూమపానముచేసిరో తెలియదు. వస్తు సముదాయ మంతయును భస్మీపటలమయినది.

ఈ పార్కునం దేర్పాటు చేయబడినది ఒక పెద్ద సంతయట. దీనియందు సర్కసు, ఆంగ్ల వనితల నృత్యములు, వివిధ సంభారము లతో కూడిన కొట్లు మొదలగు వన్నియును ఏర్పాటు చేయబడినవి. ధనవంతులందరును ఈ పార్కునందు మెంబర్లుగా నుండెడివారు.

ధూమశకట దండకము :— కర్త గుంటి రంగయ్య, (19. ఉ)

రైలుబండిని ఆంగ్లేయులు భారతదేశమునందు ప్రవేశపెట్టినపుడు అదియొక వింతగా నుండెడిది. పొగ వదలుచూ పోవు దీనిని పొగబండి పొగ్గాడు, ధూమశకటము మొదలగు పేర్లతో పిలచెడివారు. మార్గ మధ్యమున అడ్డగించు కాలువలు మొదలగువానిపై వంతెనలు నిర్మిం చుచూ రైలుమార్గ నిర్మాణము జరిగెనని, "పంచభూతాత్మకంబైన పొగ్గాడు చందాన" ఉండెనని కవి వర్ణించియుండెను. ఈ దండకము

రాయపూరు-పెరంబూరుల మధ్య రైలును ప్రవేశపెట్టిన సందర్భము లోనిది.

ఇట్లు జనజీవనములో ముడిపడున్న అనేక సంఘటనలు దండక రూపమున రచింపబడినవి.

## 4-7. తిట్ల దండకములు.

తెలుగు సాహిత్యములో దండకమునందు తిట్లను ప్రవేశపెట్టినది భోగినీ దండకము, సింగభూపాలుని భోగిని తల్లి దూషించును. సింగభూపాలుని దూషించెడి పదములలో అవగుణములను వెల్లడి చేయునవియు, రాజులయొక్క దుర్నీతిని చాటిచెప్పునవియే యున్నవి గాని, నీచార్థమును స్ఫురింపజేసెడివి లేవు. అందులకు సంతోషించ వచ్చునుగాని, తిట్లనుగూడ దండకములలో తిట్టవచ్చుననెడి భావము కలుగజేసినది భోగినీ దండకమే తుదకివి పరాకాష్ఠకు చేరినవి. అసహ్యమైన, అన్యాయమైన శబ్దములు తిట్లురూపమున దండకము లలో చోటుచేసుకొన్నవి. స్తుతి సంప్రదాయమున కంకితమైన దండ కము అనేక పరిణామములు పొందినను, ఈ తిట్ల దండకములు జనిం చుట యేమంత సంతోషింపదగిన విషయముగాదు. స్వతంత్రముగ తిట్లనే ప్రధానాంశముగా జేసుకొనిన దండకములకు పాఠకులే పరిశీలకులు.

సామాన్యముగ ఉపద్రవములు సంభవించినపుడు భగవంతుని దూషించుచునో, తమ విధిని తామే నిందించుకొనుటయో జరుగును. అట్లుగాక స్తుతిరూపక భగవన్నుతి దండకములలో మాహాత్మ్యములు, నీ స్వరూపమును తెలుసుకొనజాలరైరని వగచుచూ భగవంతున్ని నుతించుటలో దూషణ స్వభావము కొంతవరకు గోచరించుచుండును. ఇట్టి స్వభావము ననుసరించిగాక ఎదుటి వ్యక్తి తనకు హాని కలిగించి

నపుడో లేక తీరని మనస్తాపమునకు అన్యాయముగ గురిచేసినపుడో పరిత్యక్తనిందకు పాల్పడును. ఆనింద దూషణ స్వభావముతోనేగాక వినెడివారికి కర్ణకఠోరముగ నుండును. ఇట్టి దూషణ స్వభావముతో కొన్ని తిట్ల దండకములు వెలువడినవి. అందువలన ప్రత్యేక విభాగముగ నేర్పరచుటయే లెస్స. ఈ క్రింద నుదహరింపబడిన తిట్ల దండకములు రెండును "విద్వాన్ రావూరి దొరసామిశర్మగారు" సేకరించి యుండిరి.[27]

దం. "ఛీ ఛీ ఒరే పాతకా, ఘాతుకా, దుర్నీత, ఉచ్ఛిష్టపున్‌రోత,
వారాంగనా మూత్రముల్ పట్టు ముంతా, ఇదే చూడరా,
ధాత నీ వ్రాత నాచేత పట్టిచ్చెరా నేడు, దుర్బీజమా, నైజమా
సాజమా, ఏర, కోవూరి రామా, హరామా, గులామా, పురీ
మంపుతూమా, ఉపారాల కేటా, వలిక్కాలి చేటా, దగాకోరు
షాజీ, దగుల్బాజి మాజీ,...జూచి నీవైన ఏమోసి, ఏబ్రాసి,
కష్మాలమా, చాకిబండా, చలంగల్లు ముండా, సగంకోయ రండా
అమేధ్యాల బొండా, అనాకారి తుండా...వికారాల బండా...
ఒసేబోడిముండా... మహామైథునీ... గండుకోతీ... రంకులాడీ
యటంచొక్క మాటైన గద్దించి నీకిద్ది మేల్బుద్ధి గాదంచు
వాదింపరాదా ! మదిం దోపలేదా ! తుదిన్నీకు నాచేత
చావయ్యెగాదా. సదా దాని పాదాలకుం లొంగి వెంటాడుచుం
గూడుచున్నందువే మంకుకుంకా... నినుంబంకజాక్షుండునుం,
బంకజాసీనుడున్, శంకరుండైన గావంగ లేరింక... నాదు
శాపంబువమ్మౌనె ముమ్మాటికిం గాదుసుమ్మా, అదే మృత్యు
వే తెంచి కేల్సాచి నిన్నట్టగా బొంచి కాలంబు కాలంబు లెక్కిం
చుచుంట న్నీవాలోకింపుమా...పోలిపెద్దాన్వయాబ్ధీందు తుల్యుండ
శ్రీ వేంకనార్యుండ—సత్కావిందుండ... ననుం దిట్టగాబూని

> నీయాలు కామాక్షీ హా! దాని గర్వంబు నేమందురా... నీపాడగట్టా...యముండిట్టి నిన్నట్టి కాల్నేతులం గట్టి కొంపో వగా వచ్చు, నీ కాలముం జెల్లె నాశాప మీాడేరు, నిక్కంబు నీవింటికిం బోయి వేవేగ కాళ్ళోలికి న్నేగుమా సాగి, కోవ్రూరి రామా యయోరామ రామా సమాప్తం సమాప్తం సమాప్తమ్."

ఈ దండకమును చెప్పినది "పోలిపెద్ది వెంకనార్యుడు. ఆచార్య తూమాటి దోణప్ప కార్వేటినగర సంస్థాన చరిత్రమును దెలుపుచూ" పోలిపెద్ది వెంకటరాయకవి కార్వేటి నగర ప్రభువులైన రాజకుమార వెంకట పెరుమాళ్ళు రాజుబహద్దరుగారి ఆస్థానమునందలి విద్వత్కవి. (క్రీ. శ. 1800–1875) ఈయన వేణుగోపాలస్వామి భక్తుడు. వేణుగోపాలశతకము. లావణ్యశతకము అను సీసపద్యములనురచించెను. తిట్ల దండక మొకటి యేతత్కవి కృతము కలదట"[28] అని తెలిపియుండిరి. ఈ వేంకటకవిగారి దే యీా తిట్ల దండకము. ఎవరో కోవ్రూరి రామయ మీాద చెప్పినదియని దండకాంతమునందలి పంక్తుల వలన దెలియును.

దీనికొక కథకూడ నున్నది. ఈ కథ కార్వేటి నగరములో వ్యాప్తియందున్నదట. కోవ్రూరి రామయ్య యొక సంస్థానోద్యోగి. అతనిపై చెప్పినదీ దండకము. కవిగారి బర్రె రామయ్యగారి దొడ్డిలో పడి ఇచ్చవచ్చినట్లు మేసినది. కూరాకు తోటలు నాశనమయినవి. ఇరువురివి ప్రక్క యిండ్లు గాబోలు కోవ్రూరి రామయ్య భార్య కామాక్షమ్మ, కవిగారి భార్యతో తగవులాడినది. కవిగారు మన్నింప గోరినారు. కాని యామె యంతటితో నూరకుండక ప్రతిదినము కన పడినపుడెల్ల తిట్టుచుండెను. ఇట్లొక సంవత్సరము గడిచినది. ఆమె

పోరు భరించలేక కవిగారు రాజువద్ద కరిగి రామయ్యా భార్య దురాగతమును విన్నవించి ప్రతీకారముసేయ వేడెను. అంతటితో నూరు కొనక ఆమెకు దల దీయించిన బ్రహ్మహత్య వాటిల్లునని, తల గొరిగించమని రాజును వేడెనట ఆపని కంగీకరింపని ప్రభువు రామయ్యాను రమ్మనమని కబురు పంపగా నాతడు వచ్చుట, ఆతని రాకనుచఃగాసి కోపోద్రిక్తుడయిన కవి యీ తిట్ల దండకము నాశువుగ జెప్పుట జరిగినదట. కవి తిట్లవలన రామయ్యా తనకు జరిగిన పరాభవమునకు చింతించుచూ ఇంటికి తిరిగివచ్చి, లోనికి ప్రవేశించుచుండగ ద్వారబంధము తలకు తగిలి మంచముపట్టి మరణించెనట.

ఇటువంటిదే వేరొక తిట్ల దండకము గలదు. విజయనగర సంస్థానములో పూసపాటి ప్రభువులు బ్రాహ్మణులకు దానమిచ్చిన భూములకు 'కస్తూరి అప్పయ' అనునాతడు విఘాతము కలిగించు చుండగా ఎవరో 'కవిపేరు తెలియదు' తిట్టుచు దండకము నొకదానిని రచించెను. దండక ప్రారంభమునందీ విధముగ కలదు.

"శ్రీయుత పూసపాటి కులసింధు సుధాకరులైన భూపతుల్
వేయుతరాల నుండి కడువేడ్క నొసంగినయట్టి మాన్యముల్
న్యాయముదప్పి ఘాతకొడిగట్టిన నీకులమున్ యశంబు నీ
యాయువు ఛీచమైపోచను యదార్థము నమ్ము కస్తురప్పయా"

దం. "......నీకెంత చేటున్నదోగాని భూలోకమందెన్నడున్ లేని దూర్మార్గపాలోచనల్ సంభవించెన్ మరిన్ నీకు నీసారి యార్నెల్లకే తప్పినన్ ఒక్క యేడాదికిన్ మీదు గాకుండ నీ చావు నిక్కంబుగా నమ్మమీ బ్రహ్మదేవుండు శంభుండు నీకడ్డమై వచ్చినాగాని నా మాటకుం దప్పగాదు ఛీ లండీ మొండీ శిఖండీ గులామా." ౨౨

ఇట్లు ప్రత్యేకముగ తిట్ల దండకములుగ వెలువడకపోయినను భోగినీ, పద్మినీ, గాలివాన, కోయవితూరి అను దోపిడీ, ఇంజనీరు, పీపుల్సుపార్కు అగ్నిప్రళయ దండకములలో తిట్లు చోటుచేసికొన్నవి.

తొల్లి భగవన్నుతికై వినియోగించినను, దండకమున సమస్త వస్తువులను, భావములను రచించుట కుపకరించు సామాన్య రచనగా మారినది కాఫీ, టీ, చీట్లపేక, నల్లి, దోమ, అవప్పిండి మొదలగు నామములతో దండకములు వెలసినవి. లఘుకృతు లగుటవలన మరుగున పడిపోయినవి. ఇట్టి దండకములన్నిటిని సేకరించి మరింత విస్తృతముగ తెలుపుట కవకాశమున్నది.

## అథస్సూచికలు

1. స్వ స్వరూపాను సంధానం భక్తిరిత్యభిధీయతే.
(వివేకచూడామణి. సాధన చతుష్టయము. శ్లో. సం. 33)
2. అంకోలం నిజ బీజ సంతతి రయస్కాంతోపలం సూచికా
సాధ్వీం నైజవిభుం లతా క్షితిరుహాం సింధుస్సరిద్వల్లభమ్
ప్రాప్నోతీహ యథా తథా పశుపతేః పాదారవిందద్వయమ్
చేతోవృత్తి రితి రుపేత్య తిష్ఠతి సదా సా భక్తి రుచ్యతే.
(శివానందలహరి. శ్లో. సం. 61)
3. **Bhaktiyoga is a heal genuine search after the lord beginning, Continuing and ending is love.**
**(Complete works of Swami Vivekananda. Vol. I Page. 31)**
4. నారదస్తు తదర్పితాఖిలాచారతా తద్విస్మరణే పరమవ్యాకులతేతి.
(నారద భక్తి సూత్రములు, ప్రేమభక్తి లక్షణము. సూ. 19.)

5. శోక క్రోధ భయాదీనాం సాక్షాత్సుఖ విరోధినా
రసత్వ మభ్యుపగతం తథాఽనుభవ మాత్రతః ॥ 72
ఇహానుభవ సిద్ధేఽపి సమాస్రిగుణితో రసః
జడ్డైనైవ త్వయా కస్మాదకస్మా దుపలభ్యతే ॥ 73
రతి ర్దేవాది విషయా వ్యభిచారీ తథాంజితః
భావః ప్రోక్తో రసో నేతి యదుక్తం రసకోవిదైః ॥ 74
దేశాంతరేషు జీవత్వా త్పరానందాఽప్రకాశనాత్
తదోభ్యజ్యం పరానందరూపే నపరమాత్మని ॥ 75
కాంతాది విషయానా ఛ్యే రసాసాద్యా స్తత్ర నేదృశం
రసత్వం పుష్యతే పూర్ణ సుఖా స్పర్శి కారణాత్ ॥ 76
పరిపూర్ణరసా క్షుద్రరసేభ్యో భగవద్రతిః
ఖద్యోతేభ్య ఇవాదిత్య ప్రభవే బలవత్తరా ॥ 77
(భక్తిరసాయనము. మధుసూదన సరస్వతి)

6. ప్రథమం మహతాం సేవా తద్దయా పాత్రతాతతః ।
శ్రద్ధా తేషాంచ ధర్మేషు తతో హరిగుణశ్రుతిః ॥
తతో రత్యంకురోత్పత్తిః స్వరూపాధిగతి స్తతః ।
ప్రేమవృద్ధి పరానందే తస్యాథ స్ఫురణం తతః ॥
భగద్ధర్మ నిష్ఠాఽతః స్వస్మిం స్తద్గుణశీలతా ।
ప్రేమ్ణోఽథ పరమా కాష్ఠే త్యుదితా భక్తిభూమికాః ॥
(భక్తిరసాయనము. మధుసూదన సరస్వతి. 1-32, 33, 34.)

7. నారద భక్తి సూత్రములు. 34

8. ,, 17

9. ,, 88

10. నాట్యశాస్త్రము. రసప్రకరణము. 6-52.

11. తెలుగు సాహిత్యంలో హాస్యరసము. మాణిక్యం వేదవల్లి తాయారమ్మ. పు. 9.

12. వర్ణవిక్రియం. పీఠిక : ఆర్. యస్. సుదర్శనం. పు. 3.
13. ఈ ఓటు దండకము '(శ్రీ) పోలాప్రగడ సత్యనారాయణ' గారి సంపాదకత్వమున వెలువడిన 'హాస్యతోరణ'మను గ్రంథమునుండి గ్రహింపబడినది.
(ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారి ముద్రణము.)
14. రాజమంద్రి : గౌతమీ గ్రంథాలయము. సెం డి. 21056.
ముద్రిత సం. 1892.
15. చాటుపద్యరత్నాకరము. దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు పు 39,40
16. కావ్యసారము. సర్వేశ్వరాచార్య. శ్లో. సం. 100
17. కావ్యసారము. సర్వేశ్వరాచార్య. శ్లో. సం. 98, 98.
18. నేత దండకము. ఆధునిక యుగము-గాంధీ సాహిత్యము.
కీ.శే. నిడదవోలు వెంకటరావు. ఆంధ్రపత్రిక. ప్రమాది సంవత్సరాది సంచిక. పు. 18, 19.
19. కృష్ణాముద్రాక్షరశాల, గుంటూరు. దుర్మతి.
20. మచిలీపట్టణం; సేతు ముద్రాక్షరక్షరశాల, 1911.
21. భాషీయ దండకము. ఏలూరు; మంజువాణీ ముద్రాక్షరశాల, 1912
22. చాటు ప్రబంధము. సంపా: ఆచార్య యస్వీ. జోగారావు. పు.107
23. ఆంధ్ర సంస్థానములు-సాహిత్య పోషణము. పు. 526.
24. ఉత్సవ దండకము. నానారాజ సందర్శనము. కిర్లమపూడి. పు. 90
25. కాకినాడ (శ్రీ) కళానిధి ముద్రాక్షరశాల, మొదటికూర్పు, 1885.
26. చెన్నపట్టణం ; గీర్వాణభాషారత్నాకర ముద్రాక్షరశాల, 1887.
27. తెలుగులో తిట్టు కవిత్వము. పు. 123-125.
28. ఆంధ్ర సంస్థానములు - సాహిత్య పోషణము. కార్వేటినగర సంస్థానము.
29. విద్వాన్ రావూరి దొరసామిశర్మగారు దండకములోని తుదిపంక్తులనే ఉదహరించిరి. ఈతిట్ల దండకములు రెండును నాకంటబడలేదు.

—0—

# 5

# భోగినీ దండకము-తజ్జాతి దండకములు

## 5-1. భోగినీ దండకము.

తెలుగు సాహిత్యమున స్వతంత్ర దండక కృతులు ఉద్భవించి నది పురాణేతిహాస యుగముననే. అయిన నేడవి లుప్తములు. కనిపించు చున్నంతవరకును భోగినీ దండకమే ప్రథమ కృతి. రావుసింగభూపా లున కంకిత మీయబడినది. కృతికర్త బమ్మెర పోతన. ఈ విషయ ములు దండకాంతమునందలి పద్యమువలన దెలియును.

ఉ. "పండిత కీర్తనీయుడగు బమ్మెరపోతన యాసుధాంశు మా
ర్తాండ కులాచలాంబునిధి తారకమై విలసిల్ల భోగినీ
దండకమున్ రచించె బహుదాన విహర్తకు రావుసింగ భూ
మండల భర్తకున్ విమత మానవనాథ మదాపహర్తకున్"

ఈపై దండకాంత పద్యమువలన కృతికర్త, కృతిభర్తల నామములు సుస్పష్టము దెలియుచున్నవి. అయినను పోతన యితర రచనలగు మహాభాగవత, నారాయణ శతక, వీరభద్ర విజయము లందెచ్చటను తాను భోగినీ దండకమును రచించితినని తెలిపినవాడు గాడు. లఘు కృతియని నిర్లక్ష్యము చేయుటకు వీలులేదు. ఆచంద్రతారార్కమై విలసిల్లునని ఫలశ్రుతికూడ చెప్పియుండెను.

పోతనకు సింగభూపాలునకు గల సంబంధమును తెలుపుటకు అనుశ్రుతముగా వినవచ్చు వుక్కిటిగాథ యొకటి యున్నది. పోతన ఆంధ్ర మహాభాగవత రచనను సింగభూపాలుడు తనకు అంకితము నిమ్మనగ నాతని కోరికను తిరస్కరించె ననియు, సింగభూపాలుడు పోతన భాగవతమును భూమిలో పాతిపెట్టించెననియు, అందు కొంత భాగము లుప్తమై పోయినదనియు ఒక కథ యున్నది. ఇది చారిత్ర

కాధారములేమి ప్రమాణము గాదు. సింగభూపాలుని నామము కలిగినవారు రేచెర్ల గోత్రమున మువ్వురు గలరు. మువ్వురు సింగభూపాలురలో ఈ దండకము ఏ సింగభూపాలునకు అంకితమీయబడినదను విషయము అనిశ్చితము. ఆ సింగభూపాలు డెవరో కొన్ని ఆధారములచే నిర్ణయించినను, అతని తల్లి పేరు తదితర విషయములు సప్రమాణములు గాకున్నవి. వీనికి తోడు పోతన కాలమే వివాదగ్రస్తము. అట్టి దృష్టితో ఈ దండకమును పరిశీలింతము.

5–1–1. ఇతివృత్తము.

గోపాలదేవుని ఉత్సవ సమయమున సింగభూపాలుడు గజారూఢుడై యూరేగ వెడలెను. ఆ సమయమున భోగిని కాదగు వారవనిత సింగభూపాలుని జూచి మోహించినది. మోహావేశముచే ఆమె తన్మయతనొంది పరాధీనమనస్కయైనది. ఆతనితో కలయికకు నాలోచించినది. ఈ విషయమును తన తల్లికెట్లు తెలిపెదనోయని విచారించినది. చింతాభరాక్రాంతయై చింతించుచునే యున్నది. ఈ విషయము నామె తల్లి గుర్తించినది. తల్లియూ తక్కువదిగాదు. 'మాయా పరాభూత జామాత మిథ్యావయోపేత విజ్ఞాత నానా వశీకార మంత్రౌషధీ వ్రాతలోకైక విఖ్యాత వారాంగనా ధర్మశిక్షాది సంభూత సమ్మోహితానేక రాజన్య సంఘాత వాచాలతాబద్ధ నానామహాభూతి' భోగిని తల్లికి ఇవన్నియును అర్హతలే. భోగినిమనసు గుర్తింపలేకపోవునా? సింగభూపాలుని నానా విధముల దూషించినది. కూతురి మనసు నెట్లైనను మరలింప ప్రయత్నించినది. భోగిని తల్లి మాటలు లెక్కచేయలేదు. తల్లిని ఎదిరించినది. తుదకు తన కార్యము తన అక్క వలన సఫలము కాగలదని తలచినది. తనగోడు అప్పగారితో వెళ్ళబోసుకొనినది. ఆమె సింగభూపాలుని యొద్దకు దూతిగాపోయి తన చెల్లెలి విరహావస్థను తెలిపినది. సింగభూపాలుడు భోగినిని కరుణించి సడ్డోగిని

పట్టముందిట్టమానట్లుగా జేసెను. భోగిని తల్లిని గజారూఢ గావించి ఆమెకుకూడ నిష్టైశ్వర్యములు సమకూర్చుటలో దండకము ముగియును

**5-1-2 కృతికర్త - కృతిభర్తలు.**

బమ్మెర పోతన. పైన తెలిపిన దండకాంత పద్యమున దక్క-దండకము నందెచ్చటను తన నామమును పొందుపరచి యుండలేదు.

కృతిభర్త సింగభూపాలుడు. ఈతని గూర్చి దండకమున చాల విపులముగ వివరములు గలవు.

'వసంతావనీనాథ సంసేవితాంచత్పదాంభోజు'

'సోమాన్వయోత్పన్న'

'సింగభూపాలు'

'కుమారాన్నపోతావనీనాథ సూనున్'

'సర్వజ్ఞ సింగ క్షమానాథు'

'పోచమాంబా లసద్గర్భ సంజాతు!'

'రేచెర్ల గోత్రోద్భవున్'

'రావుసింగ క్షమానాథ పౌత్రున్ సమీచీన రేచెర్ల గోత్రాంబు జాతత మిత్రున్ మహోదార చారిత్రు సర్వజ్ఞ సింగోర్వరాధ్యక్షు'

'రావుసింగ భూమండల భర్తకున్' ।దండకాంత పద్యము।

ఈ పైన పేర్కొనబడిన విశేషము లన్నియును కృతిభర్తకు సంబంధించినవి. కవి సింగభూపాలుని గోత్రనామము నుటంకించెనుగాని వంశ నామమును పేర్కొనలేదు.

భోగిని తల్లి, అప్పగార్లను ఏ నామమునను వ్యవహరించలేదు. ఇవన్నియును దండకమునందలి పాత్రలన్నింటికిని సంబంధించిన సాక్ష్యాధారములు.

**5-1-3, చారిత్రిక సాక్ష్యములు.**

దండకము నందలి సింగభూపాలుని వలచిన వారవనితను భోగిని

యను పేరుదక్క, ఆమెకుగాని ఆమె తల్లి, అప్పగార్లకుగాని చారిత్రక నేపథ్యము కానరాదు.

రేచెర్ల గోత్రమున సింగభూపాల నామము కలిగిన వ్యక్తులు ముప్పురు గలరు. ఈ ముప్పురును ఆ వంశమున 5, 7, 10 తరములకు చెందినవారు.[3] ఈదండక కృతి కుమారాన్నపోతావనీనాథుని తండ్రిగా కనిగిన సింగభూపాలునిపై చెప్పినది. కావున ముప్పురు సింగభూపాలురిలో కుమారాన్నపోతావనీనాథుని తండ్రిగా కలిగిన సింగభూపాలుడెవరు? అను విషయము తెలియవలెను. అయిదవ తరమునకు చెందిన సింగభూపాలుని తండ్రి "ఎఱ్ఱదాచానాయుడు". కావున అతనిపై చెప్పినది గాదు. తక్కిన ఏడు, పది తరములకు చెందిన సింగభూపాలుర తండ్రుల నామములు అనపోతానాయడు నామము గలవారే. వీరిరువురిలో సింగభూపాలుడు ఎవరి పుత్రుడను విషయము సందేహాస్పద మగుచున్నది.

తండ్రి నామమును ఆధారముగా జేసికొనక సింగభూపాలునకు వాడిన "రావుసింగక్షమానాథు పౌత్రిన్" అను విశేషణమును బట్టి దండక కృతిభర్త సింగభూపాలు డేతరము వాడనునది నిర్ణయింప వచ్చును. ఇందు 5, 7, 10 తరములకు చెందిన సింగభూపాలురలో ఏడవ తరమునకు చెందిన సింగభూపాలునకు అయిదవ తరమునకు చెందిన సింగభూపాలుడు తాత యగును. అయిదవ తరమునకుచెందిన సింగభూపాలునకు మూడవ తరమునకు చెందిన "వెన్నమనాయడు" తాతగారయిన, పదియవ తరమునకు చెందిన సింగభూపాలునకు ఎనిమిదవ తరమునకు చెందిన "వేదగిరిస్వామి" తాతయగు చుండెను,

కావున "రావుసింగక్షమానాథు పౌత్రిన్" అను విశేషణము వలన ఏడవ తరమునకు చెందిన సింగభూపాలుడు భోగినీ దండక కృతిభర్త యగుచుండెను.

సింగభూపాలురలో "సర్వజ్ఞ" నామధేయము గలవారెవరు? అను మరియొక ప్రశ్న యుత్పన్న మగుచున్నది. దండకమున "సర్వజ్ఞ సింగోర్వరాధ్యాత్మజు" అని సంబోధించి యుండెను.

అట్లే "పోచమాంబా లసద్గర్భ సంజాతున్' అను మరియొక సంబోధన ప్రయోగింపబడినది. ఏడవ తరమునకు చెందిన "సింగభూపాలుని తల్లి పోచమ గాక 'కనకలక్ష్మమ్మ' యని కీ. శే కవితరంగిణి కారులు తెలిపియుండిరి".[4] ఈ ఆధారము ననుసరించి దండక కృతి భర్త యేడవ తరమునకు చెందిన సింగభూపాలుడనుటకు ప్రతిబంధక మగుచుండగా "పద్మనాయకులలో ముగ్గురు సర్వజ్ఞ సింగభూపాలురు ప్రసిద్ధులు. వారి ముగ్గురి తల్లులపేర్లూ పోచమదేవులే"[5] యని ఆరుద్ర గారు తెలిపియుండిరి. ఈ ఆధారమునుబట్టి కూడ ఏడవ తరమునకు చెందిన సింగభూపాలుడు దండక కృతిభర్తయని చెప్పుటకు వీలగుచున్నది.

"వసంతావనీనాథ సంసేవితాంచత్పదాంభోజు" అనెడి సింగభూపాలునికి వాడిన విశేషణము మరియొక వివాదము. తదియవ తరమునకు చెందిన సింగభూపాలునకు "వసంతనాయడ"ను సోదరుడు కలడు. కావున నీ విశేషణము పదియవ తరమునకు చెందిన సింగభూపాలునకు అన్వయింప వీలగుచున్నది ఈ సందర్భమున "సర్వజ్ఞ సింగభూపతి కొండవీడు రాజధానిగ ప్రాగాంధ్రమును పాలించి వసంతరాజు అను బిరుదు వహించిన, కుమరగిరిరెడ్డి 'కుమారగిరి భూపాలుడు' వసంతరాజ బిరుదము కలవాడని కాటయవేమారెడ్డి శాకుంతలటీకలో" నిట్లు వ్రాసెనని కీ. శే. పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారి క్రింది శ్లోకము నుదాహరించి యుండిరి.[6]

"శ్రీ కృష్ణసేవ సమః కుమారగిరి భూపాలో నృపాలోత్తమః
స్వామీ యస్య వసంతరాజ బిరుదో వీరాన్నపోతాత్మజః"

ఈ సర్వజ్ఞ సింగభూపాలుకు ఏడవ తరమునకు చెందినవాడు.

"సోయం వేమవిభుః కుమార గిరిణా రాజ్ఞానియుక్తః కృతీ
నాట్యానాం త్రితయం కృతం కృతధియా శ్రీకాళిదాసేన యత్
తస్యోదీర్ణ రసార్ణవస్య రసిక శ్లాకుంతలాదే స్వయం
వ్యాఖ్యానాం కురుతే కుమారగిరి రాజీయాఖ్యా మస్మైహితమ్"

అనెడి కాటయవేముని శాకుంతల పీఠికలోని పై శ్లోకము నుదహరించుచూ "పై శ్లోకము వలన సర్వజ్ఞుని రసార్ణవ సుధాకరము కుమారగిరి, కాటయవేము లిద్దరూ చదివి యుందురను ధ్వని సూచితమగుచున్న"[7] దని శ్రీసుబ్రహ్మణ్యశాస్త్రిగారు అభిప్రాయపడియుండిరి.

కాని సింగభూపాలుని వసంతనామధేయము కలిగిన వారెవరును సేవించలేదు. క్రీ. శ. 1383-1400 నడుమ కాలమున పరిపాలనసాగించి ప్రభువుగానున్న కుమారగిరి భూపాలుని సమకాలికునిగ ఏడవ తరము సింగభూపాలుని భావించ వీలగును.

ఏడవ తరమునకు చెందిన సింగభూపాలునకు ఆరుగురు సంతానము గలరు. ఆరుగురును కుమారులే. వీరిలో ఆరవవాడైన 'మాధవ నృపతి' శా. శ. 1349 సంవత్సరమున 'క్రీ.శ. 1427' "రాఘవీయ" మను పేరుతో రామాయణమునకు టీక వ్రాసెనని యాతని భార్య 'నాగాంబిక' వేయించిన శాసనము వలన తెలియుచున్నది.

"శకాబ్దే నిధి వార్ధి రామశశిగే వ్యబ్దే ప్లవంగే శుభే
మాసే త్వాశ్వయుజే రఘూద్వహ పదే యోరాఘవీయా
హ్వాయం
టీకా మర్థ పటుత్వ బోధ ఘటనా మాణిక్య పుష్పాంజలిం
కృత్వా రాజతి రావు మాధవనృపో రామాయణస్య శ్రియే"[8]

క్రీ.శ. 1427 సంవత్సరమున రామాయణ వ్యాఖ్యను రచించిన మాధవ నృపతి తండ్రి సింగమనాయుడు 14వ శతాబ్ది ఉత్తరార్ధమున

"1383–1400" రాజ్యమేలిన కుమారగిరి భూపాలునిచే సమ్మానితుడై యుండనోపు. కాని ప్రమాణముగ చెప్పజాలము.

ఏడవ తరమునకు చెందిన సింగభూపాలుడు గొప్ప సంస్కృత పండితుడు. రాజనీతిజ్ఞుడు. నాటక రసప్రకరణమునకు చెంద న 'రసార్ణవ సుధాకరమ'ను గొప్ప అలంకార శాస్త్ర గ్రంథమును 'రత్నపాంచాలిక' అనెడి శృంగార రసాత్మకమైన నాటికను రచించెను. సంగీత రత్నాకరమునకు వ్యాఖ్య యొనరించెను. అంతియేగాక యీతని యాస్థానమున "విశ్వేశ్వరకవి"చే రచింపబడిన "చమత్కార మంజరి"యను సాహిత్యలక్షణ గ్రంథమునకు కృతిభర్త. కాన సర్వజ్ఞ నామధేయము గలవాడీతడే యగును.

పదియవ తరమునకు చెందిన సింగభూపాలుడు కృతికర్తగాని, కృతిభర్తగ గాని పేరువడి యుండలేదు. దండకమునందలి 'శేషుతో నైన భాషించు' అను విశేషణము గూడ ఏడవ తరమునకు చెందిన సింగభూపాలునకే చెల్లును గాని యీతనికి కుదరదు.

ఈ ఏడవ తరమునకు చెందిన సింగభూపాలునికే 'కుమార సింగభూపాలుడ'ను నామాంతరము న్నట్లుగ కీ. శే. మల్లంపల్లి సోమేశ్వర శర్మగారు "కుమార సింగభూపాలుడు (క్రీ.శ. 1383–84 క్రీ.శ. 1399) అనపోతానేనికి పిదప రాచకొండ సింహాసనము నెక్కినవాడు. అతని కొడుకు రెండవ సింగమనేడు. ఇతనికి కుమార సింగభూపాలుడని నామాంతరము గలదు. రాజ్యమునకు రాకపూర్వము ఇతడు తన తండ్రితో కలసి రాజ్య వ్యవహారములను చక్కదిద్దుచూ రాజ్యతంత్రమున గొప్ప అనుభవము గడించెన[1]"ని తెలిపియుండిరి.

'వసంతావనీనాథ సంసేవితాంచత్పదాంభోజు' అను విశేషణము దప్ప తక్కిన ఆధారములన్నియును రేచెర్ల గోత్రములోని ఏడవ తరమునకు చెందిన సింగభూపాలునకు సరిపోవుచున్నవి. ఈతడు 14వ శతాబ్దమునకు చెందినవాడనుటయు స్పష్టము.

ఈ సర్వజ్ఞ సింగభూపతి స్వయముగ సంస్కృత గ్రంథములను రచియించి, మరికొన్నిటి నంకితము గొనిన సాహిత్యాభిమాని. రాజ్య తంత్రమున అందెవేసిన ప్రజ్ఞాశాలి. ఈతడు తెలుగు కవులెవరిని ఆదరించినట్లు ఆధారములు లేవు. అంతియేగాక పదునాల్గవ శతాబ్దము మధ్య భాగమునందు విజయనగరము నేలిన బుక్కభూపతి, కొండ వీడును రాజధానిగ నేర్పరచిన వేమభూపాలుడును సంస్కృతభాషాభి మానులై యుండిరి. మరి యీపోతన భోగినీ దండకమును సర్వజ్ఞ సింగభూపాలుడు ఎట్లు అంకితము గొనెనో యంతుచిక్కదు.

దండకము నందలి ఆధారములను పురస్కరించుకొని గాని, శాసనాధారముల వలనగాని సర్వజ్ఞుని సమాచార మీపై విధముగ తెలియుచుండగ, పోతన కాలము వివాదగ్రస్తముగనే మిగులు చున్నది

పోతన కాలమును కనుగొనుటకు గ్రంథస్థ సాక్ష్యములుగాని, శాసన ప్రమాణములుగాని అందుబాటులో లేవు. తెలుగు సాహిత్య కారు లెల్లరును "దాక్షాయణి పరిణయ" కావ్యమును ఆధారముగా జేసికొని పోతన కాలమును నిర్ణయించియుండిరి. ఈ ఒక్క ఆధారము దప్ప పోతన కాలమును కనుగొనుటకు మరియొక ఆధార మేమియును గానరాదు. దీని ననుసరించియే పలువురు పలువిధములుగ పోతన కాలమును ఊహించియుండిరి. దీనికి గల కారణము తరమునకు ఎన్ని సంవత్సరములు లెక్కించవలెననుటలో భేదాభిప్రాయములుండుటయే.

'కేసకవి మల్లకవులు' తమ దాక్షాయణీ పరిణయ కావ్యమును "గురజాల చినమల్లన సోమయాజి"కి అంకితమిచ్చిరి. ఈతని వంశము నకు చెందిన "పోడూరి పెదరామామాత్యుడు" దాక్షాయణీ పరిణయ ప్రతికి నకలువ్రాసి యిచ్చుచూ, నకలు వ్రాయుచున్న కాలము మద హరించి యుండెను.

సీ. "ధాత్వాశ్వయుజ కృష్ణదశమి యిందు వారంబు
వరకు దాక్షాయణీ పరిణయంబు
తత్కృతి నాథుడై తనరినన్ గురజాల
చినమల్లన సోమయాజికి దనుజా
డగు లింగ ఘనసుతుడై నట్టి యజ్ఞ ప
త్రిభునకు దనయుడౌ పార్వతీశ
రునకు దిమ్మమకు బుత్రుడయి షోడశమహా
దానముల్స ప్త సంతానములును

గీ. జేసి వంశవర్ధనుడయి సిరుల వెలయు
పేర మంత్రీశ్వరునకు పోమారి పెద్ద
రామ డెనుబది సంవత్సరముల నాటి
ప్రతి విమర్శించి వ్రాసిచ్చె పక్షమునకు"[10]

ధాత సంవత్సరమనగా క్రీ. శ. 1756 వ సంవత్సరమని సాహిత్యలోక మంతయును అంగీకరించినదే. పోమారి పెదరాముడు దాక్షాయణీ పరిణయ కావ్యమునకు నకలు వ్రాసినట్లు స్పష్టము. నకలు ప్రతి తయారుచేయు సమయమునకు పేరమంత్రి షోడశమహా దానములు సప్తసంతానములు ఒనరించియుండెను. కావున పేరమంత్రి వృద్ధాప్య దశ యందుండినవాడిగ గుర్తింపవచ్చును. వృద్ధాప్యమనగా ఏబది యైదు, అరువది సంవత్సరములు దాటిన వయసు ఐయుండవచ్చును.

ఇక దాక్షాయణీ పరిణయ కావ్యకర్తలు 'కేసకవి మల్లకవులు' పోతన వంశమునకు చెందినవారు. పోతనకు మూడవ తరము తరువాత వారు.

కేసకవి మల్లకవులకు సమకాలికుడు, కృతిభర్తయైన గురజాల చినమల్లన సోమయాజి, అతని వంశ వృక్షములోనివాడైన పేరమంత్రి చినమల్లన సోమయాజికి నాలుగు తరములు పైవాడు.

ఇట్టియెడ తరమున కెన్ని సంవత్సరములు లెక్కకట్టవలెనను విషయమున ఎవరికి తోచిన విధముగా వారు కాలమును నిర్ణయించిరి. ఒకరు నూరు సంవత్సరములకు నాలుగైదు తరములు లెక్కగట్టిన, మరియొకరు తరమునకు నలుబది సంవత్సరములు లెక్కగట్టిరి. నూరు సంవత్సరములకు మూడు తరములు లెక్కపెట్టిన తరమునకు ముప్పది మూడు సంవత్సరము లగుచున్నది. ఈ నిర్ణయము నిర్దుష్ట మని చెప్పజాలము.

పోతనతో కలసి కేసకవి మల్లకవుల వరకు నాలుగు తరములు. చినమల్లన సోమయాజికి పేరమంత్రికిని నాలుగు తరముల అంతరము. మొత్తము ఎనిమిది తరములు అగుచున్నవి. ప్రతి వ్రాయించుకొనిన పేరమంత్రి వృద్ధాప్యదశ కలిగినవాడు గావున మరియొక ముప్పది సంవత్సరములు కలపవచ్చును. అనగా $8 \times 33 + 30 = 294$. ఇది ఎనిమిది తరముల అంతరము. పోడూరి పెదరాముడు ప్రతి వ్రాసిన కాలము క్రీ.శ. 1756 సంవత్సరము కాబట్టి ఎనిమిది తరముల కాలమును తీసివేయగ పోతన కాలము క్రీ.శ. 1462 అగుచున్నది.

క్రీ.శ. 14వ శతాబ్దము ఉత్తరార్థము నందున్న ఏడవ తరము సింగభూపాలుడు పోతనకు సమకాలికుడని అనలేము.

వసంతావనీనాథ సంసేవితాంచత్పదాంభోజ అను విశేషణము ఏడవ తరము సింగభూపాలునకు అన్వయింపకపోయినను, శేముషీనైన భాసించు అను విశేషణము పదియవ తరము సింగభూపాలునకు అన్వయింపలేము. అందున సింగభూపాలుని తాత వేదగిరిస్వామి నాయడుగాని సింగభూపాలుడు గాడు.

దండకమునకు చెందిన కృతికర్త, కృతిభర్తల కాలము, పొత్తు కుదరని విశేషము లేకుండగ నున్నవి. ఇక తెలుగు సాహిత్యలోక మంతయును ఇంచుమించుగ నాకే యభిప్రాయమును వ్యక్తీకరించి

యున్నది. పోతన బాల్యదశలో కీర్తి కాముకుడయినసేమి, ధన సంపాదనార్థమయిన నేమి భోగినీ దండకమును రచించి సింగభూపాలున కు అంకితము గావించెను. తదుపరి మనఃపరిణతిచే విరాగియై తదితర కృతులను నరాంకితము చేయుట కిచ్చపడలేదు. ఈ అభిప్రాయమును చాలవరకు సముచితముగనే యున్నది.

నాటి వేశ్యలు వారవనితలవంటివారు గారనియు, విదుషీమణులనియు, ఇట్టి దండకము రచించుట వలన పోతన యశస్సునకు కళంకము గాదనియు పలువురి యభిప్రాయము. అంతియేగాదు వారికి సమాజమున ఆనాడు సముచిత స్థానమున్నదనుటలో గూడ విప్రతిపత్తిలేదు. "రాజరాజ నరేంద్రుడు 'కల్దిండి' యను గ్రామముతోపాటు మరియొక గ్రామమును గూడ అగ్రహారములుగజేసి నూరుగురు శ్రోత్రియులకు, వైశ్యులకు, శూద్రులకు, ఏబదియిద్దరు వేశ్యలకు, ఏబదిమంది విద్యార్థుల పోషణ భారమునకై ఒక సత్రమును కట్టించి దానము చేసినట్లు 'కల్దిండి శాసనము' వలన దెలియుచున్నది."[11] రాజరాజ నరేంద్రునకు 'రేవల' యను ఒక ఉంపుడుగత్తె గలదు. ప్రతాపరుద్రునకు 'మాచల్దేవి' యను వేశ్యాస్త్రీ గలదట. ఇటువంటి లౌకిక విషయములు రాజులకు అనూచానముగ వచ్చుచున్నవే. అదియొక నియమము మాత్రము గాదు. ఏకపత్నీవ్రతము హిందూ ధర్మములలో ఒకటి. కీ.శే. పండిత వంగూరి సుబ్బారావు పంతులుగారి యభిప్రాయము పేర్కొనవలసి యున్నది. "నేను సిద్ధాంతపూర్వకముగా జెప్ప సాహసింపను గాని తోచిన విషయము నెరుక పరచెదను. పూర్వరాజులను దానశీలురు, పరాక్రమవంతులు, సజ్జనులని వర్ణించినట్లే స్ఫురద్రూపులనికూడ వర్ణింప మన కవులు బూనుకొనిరి. ఆజానుబాహువులుండుట స్ఫురద్రూపియగుట, తేజోవంతుడగుటయు గూడ రాజలక్షణములలో మనవారు చెప్పుచున్నారు. అందువలన నాయాకవులు తమరాజులు

స్ఫురదూర్పులవి వర్ణించుటకే దండకములు వ్రాసిరి. వేశ్య ప్రేమధన సాధ్యమైనది. ప్రేమ సాధ్యమైనది గాదు. ఇతర కాంతలు నిర్వ్యాజ ముగ నొక పురుషుని ప్రేమించవచ్చును. కాని వేశ్యలట్లు ప్రేమిం చుట దుర్లభము. పడుచుతనము నందున్న వేశ్య రాజరూపముజూచి ప్రేమించుటయు, వేశ్యమాత ఎన్ని చెప్పినను వినక రాజునందే లగ్న మానసయై యున్నదనుటనుబట్టి రాజరూపము అత్యంతము వర్ణనీయ మైనదని చెప్పకయే తేలుచున్నది. మోహముండని వేశ్యగూడ మోహింపదగిన శరీర లావణ్యమున నవధిలేని లావణ్యమని మనకు తట్టుచున్నది. ఇట్టి అత్యంత సురూపవంతుడగు రాజనుటకే యీదండక కర్తలివి వ్రాసియుందురని తోచుచుచున్నది. కాని మన రాజులెల్లరును వ్యభిచరించువారని కాని, వ్యభిచారము వర్ణనీయమైన గుణముగా నాకాలమున నెంచువారని గాని, యీ కథలు సత్యములని కాని యీ దండకముల తత్త్వమును పరిశీలించు వారంగీకరించరు. వ్యభిచార మే కాలము నందును దప్పే! అనేక భార్యాప్రియుడగు దశరథుని కాలమునందే రాముడను ఏకపత్నీవ్రతుడు లేడా? మన పూర్వ రాజు లలో ననేకులు భోగపరాయణులై యనేక భార్యల గ్రహించుట వలన మనవారు వ్యభిచారము గుణముగానెంచినను,అట్లెంచుటతప్పుగా దలపక సిగ్గువిడిచి యానీతిమాలిన దమ వర్తనమును గవులకు జెప్పి గ్రంథముల వ్రాయించుకొని మురిసి రనుకొనునంతటి మూర్ఖులనిగాని తలచుట తప్పు." [12] అని తమఅభిప్రాయమును నిర్ద్వంద్వముగ వ్యక్తీ కరించిరి. ఇంకొక విషయము పరిశీలింపవలసి యున్నది. దండకాంత పద్యమున పోతనయే 'పండితకీర్తనీయుడగు బమ్మెర పోతన యాశు ధాంశు మార్తాండ కులాచలాంబునిధి తారకమై విలసిల్ల భోగినీ దండక మున్ రచించె నని చెప్పకొనియుండెను. ఆచంద్రతారార్కమై విలసిల్లు దండక నామమును తన భాగవత రచన యందేల పొందుపరచియుండ

లేదు? సత్వగుణ సంపన్నుడై, భగవదంకిత మనస్కుడై, భాగవత రచన నాటికి మనఃపరిణతిచెంది యుండెనుగాన మానవ శృంగార పూరితమైన నీచేతివృత్తము నొనరించితినని చెప్పదలచ లేదా? పూర్వము తానీ రచన యొనరించినని తెలిపిన తన యశమునకు కళంకము సిద్ధింపదుగదా! పశ్చాత్తాపము పరిపక్వతకు చిహ్నమే కదా! ఏమయిననేమి తదితర రచనలలో భోగినీ దండక ప్రస్తావన గావించ లేదు.

దండక విషయ మంతయును ఒక కాముక క్రీడగా దోచును. వేశ్యమాత దండకమంతయును ఆవరించి యున్నది.

'తన్మాత మాయా పరాభూత జామాత మిథ్యావయోపేత విజ్ఞాత నానా వశీకార మంత్రౌషధీవ్రాత లోకైక విఖ్యాత వారాంగనా ధర్మ శిక్షాది సంభూత, సమ్మోహితానేక రాజన్య సంఘాత వాచాలతాబద్ధ నానా మహాభూత యేతెంచి నీతిన్విచారించి... భావించి నెయ్యంబు గావించి రావించి బాలా! జడత్వంబు మేలా! విచారింపవేలా! విలోకింపు బేలా! వయోరూప సౌందర్యముల్ రిత్తగా జేయ నీవృత్తికిన్ మెత్తురే కాముకుల్...లాభానకుం గారణంబైన నామాట నేరంబె? నేరంబుగాదీ విచారంబు వంశాను సారంబు సంసార సారంబు లాభాధికారంబు చర్చింప నీబోటికిన్ బిట్టలంకారమే గాని ధిక్కారముం జేయరాదీ...తాపాతిరేకంబులన్ గూర్చుటోగాక తోరంబులై మధ్యభారంబులై నిర్జితానంగ సౌధోపరి స్వర్ణ కుంభంబులై యొప్పు నీవిప్పు వక్షోజ కుంభంబులన్...నాతోడు నాతోడ మాటాడుమా శవ్యకాలోక చింతామణీ ధీమణీ గోత్రరత్నామణీ యెవ్వరెవ్వారి భాషించిరే యేమి భాషించిరే నేడు నీతోడ గ్రీడించు ప్రోడల్" ఇట్లు ఐదుపుటల అచ్చుప్రతిలో మూడు పుటలు దాటినది వేశ్యమాత సంభాషణము.

పండిత కీర్తనీయుడగు అను దండకాంత పద్యము ప్రథమపురుష యందున్నది. కాని యిదియొక కారణము గానేరదు. "దీనికి పాఠాంతరములు కూడ గలవు." [18] పండితులచే కీర్తింపబడిన పోతన ఏ కాలమునందు దీనిని రచించి యుండవచ్చును? చరమావస్థయందా? లేక బాల్యావస్థయందా? ఎప్పుడు రచించెననునది ఎవరికి తోచినవిధముగ వారంగీకరించుటయే గాని, ప్రామాణికాధార మేమియును గానరాదు.

## 5–1–4. శైలి.

కవితాశైలిని పరికించిన భోగినీ దండకమునకును, భాగవత రచనకును సామ్యము గన్పట్టును. పండితకీర్తనీయుడను దండకాంత పద్యమునకును భాగవతము అష్టమ స్కంధము నందలి వామన ఘట్టమునగల యీ క్రింది పద్యమునకును అనుప్రాసల సామ్యము గలదు.

ఉ. "స్వస్తి జగత్త్రయీ భువన శాసనకర్తకు హాసమాత్ర వి
ధ్వస్త నిలింప భర్తకు నుదారపద వ్యవహర్తకున్ మునీం
ద్రస్తుత మంగళాధ్వర విధాన విహర్తకు నిర్జరీగళ
న్యస్త సువర్ణ సూత్రి పరిహర్తకు దానవలోక భర్తకున్"

దండకమున : బహుదాననివార్త–మదాపహర్త–భూమండలభర్త
భాగవతమున : విధాన విహర్త–సూత్రపరిహర్త–లోకభర్త

పై అనుప్రాసలు పోతనగారినే తలపించును.

దండకమునందలి యీక్రింది పంక్తులు భాగవతమునందలి సప్తమ స్కంధమున గల పద్యముతో సరితూగ గలిగినవి.

దండకమున–

సింగభూపాలుపై వ్రాలి నాచిత్తమున్మత్తమై సోలి కామానలాయత్తమై రాదు, తేరాదు, నేనాథురుండైన, గౌరీవరుండైన, వాణీధరుండైన, దేవోత్తముండైన నన్యున్ మదిం గోరగా నొల్లనే

ఉల్ల సత్ఫుల్ల మందార రాజన్మరందంబు నందంబునం గ్రోలు మత్తాళి దుత్తూరముం గోరునే

హేమ రాజీవ రాజీ రజోరాజి తాకాశగంగా నదీలోల కల్లోల డోలా నటద్రాజ హంసంబు శైవాల గండూపదీ భేక భేకీ ఢులీ సంకులాసార కాసారముం జేరునే ?

మండితాఖండలా నీల జీమూత నిర్గత్పయోధారలన్ ద్రావు సారంగి కుంభాంతరాంభః ప్రపూరంబులన్ ద్రావునే ?

మాధవోజ్జాత చూతాంకుర స్వాదు లీలా లసత్కోకిలేంద్రంబు ఝుల్లీరవ క్రూర భల్లాతకీ శాఖికన్ బోవునే ?

భాగవతమున–

సీ. "మందార మకరంద మాధుర్యమున దేలు
మధుపంబు బోవునే మదనములకు
నిర్మల మందాకినీ వీచికల దూగు
రాయంచ జనునె తరంగిణులకు
లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు
కోయిల చేరునే కుటజములకు
బూర్ణేంద్రు చంద్రికా స్ఫురిత చకోరక
మరుగునే సాంద్ర నీహారములకు

తే. నంబుజోదర దివ్య పాదారవింద
చింతనామృత పాన విశేష మత్త
చిత్తమేరీతి యితరుల జేరనేర్చు
వినుత గుణశీల మాటలు వేయునేల ?" 7–50

దండకము నందలి మూడు పాదముల చెప్పదగిన భావములు. భాగవత పద్యము నందలి మూడు పాదముల భావములతో సంవదించున్నవి. ఇక అనుప్రాసలు, ముక్తపద గ్రస్తములు కోకొల్లలు.

5-1-5. యథార్థాఽయథార్థములు.

శైలిని, రచనను ఆధారముగా గొని కర్తృత్వము నిర్ణయించుట తగదు. కీ. శే. చాగంటి శేషయ్యగారు "శబ్దాలంకారములు కూర్చ సమర్థుడైన యేకవియైనను ఇట్టి దండకమును వ్రాయగలడనియును, దండకశైలినిబట్టి కవిని నిర్ణయించరాదని తలచుచున్నాడను."[14] అని తమ అభిప్రాయమును వ్యక్తీకరించుటయేగాక సర్వజ్ఞ సింగభూపాలుని యాస్థానమున నీపాటి సామర్థ్యము కలిగిన కవి యెవ్వరైనా యుండె నేమోయని, అతడీ దండకమును రచించెనేమోయని దోచుచున్నదని అభిప్రాయపడియుండిరి.

ఇంతదనుక తేలిన సారాంశ మేమనగ రేచెర్ల గోత్రమునందలి ముగ్గురి సింగభూపాలురలో ఏడవతరమునకు చెందిన సింగభూపాలుడు భోగినీ దండకమునకు కృతిభర్త. ఇతడే స్వయముగ కవి, కవిపోష కుడు. ఈతనికే తల్లిదండ్రుల పేర్లు, తాతపేరు సమన్వయమగుచున్నవి.

ఇకనీ దండక కృతికర్త ఆంధ్రమహాభాగవత కర్తయగు బమ్మెర పోతనయని దండకాంత పద్యము వలన సుస్పష్టముగా దెలియుచున్నది. కృతిభర్త-కృతికర్తలకు గల సంబంధము నిర్దిష్టము గాదు.

బమ్మెర పోతన యీ రచనను చరమావస్థయందే చేసెనో, బాల్యావస్థయందే చేసెనో స్పష్టముగ నొక్కి చెప్పుటకు తావులేదు.

భోగిని వేశ్యకుల సంజాత. సామాన్యమగు వారవనిత. ఈ దండకమున దక్క వేరు చారిత్రక నేపథ్యము కానరాదు. ఏ శాసన ప్రమాణములును లేవు. ఈమె తల్లి, అప్పగార్లకు పేర్లు లేవు. వీరిని గూర్చి యినుమంతైనను దెలియదు.

ఏడవ తరమునకు చెందిన సింగభూపాలుడు తెలుగు కవులను ఆదరించినట్లు కన్పించదు.

సింగభూపాలుని కాలమునకు, పోతన కాలమునకు చాల అంతరము గలదు. పోతన సమకాలికునిగ నెంచదగిన పదియవ తరము సింగభూపాలుని దండక కృతిభర్తగా జేయుట వీలుగాదు.

భోగిని సింగభూపాలుని ఎందులకు వలచినది? ఐశ్వర్యమును జూచియా? అతని గుణగణములు లెక్కించియా? సహజమగు స్త్రీ ప్రేమయా? లేక వారవనితా ప్రేమయా? ఈమె నాట్యశాస్త్రము తెలిసినదియా? లేక వాద్య నిపుణయా? ఈమెను సింగభూపాలు డెందులకు ఆదరించెను? ఈ విషయములు దృష్టియందిడుకొనిన భోగిని ప్రేమ స్త్రీ సహజమగు ప్రేమగాదు.

కృష్ణగోపాల దేవోత్సవ సమయమున ఏనుగునెక్కి యూరేగు చుండిన సింగభూపాలుని భోగిని మేడలోనుండి చూసినది. 'దర్శించి తద్వైభవంబుల్ విమర్శించి సంతోష బాష్పాంబుపూరంబు వర్షించి హర్షించి కందర్పబాణాహతిం జెంది లోగుంది మోహించి సంగంబు నూహించి యేవేళ తల్లిన్ ప్రమోషింతు నేలీల భూపాలకుఙ్ జేరి భాషింతు నేరీతి గామానలంబున్ని వారింతు నేవెంట దొల్సారివంచింతు, నేవంక గోర్కుల్ ప్రశంసింతు మున్నే ప్రశస్తారవిందంబునై యుండుబో రత్నహారంబునైనన్ శుభాకారు వక్షోవిహారంబు నైకొందుబో యేల యిట్లైతి నెట్లోగదే యంచు శంకింపుచున్' యున్నటువంటిది భోగిని. ఈమె యిప్పటివరకును ముగ్ధ. చూచిన మొదలుగనే సింగభూపాలుని సుందరాకారము ఈమె మనమునకు హత్తుకొనినది. ఏవెంట దొల్సారి వంచింతునని వంచనాయుతమైన, వంశానుగతమైన ఆలోచన పోనిది. సింగభూపాలుని వైభవములు విమర్శించి మరియు ప్రేమించినది. కీ. శే. వంగూరి సుబ్బారావు పంతులు గారననట్లు ప్రేమధన సాధ్యమయినదిగాని, ప్రేమ సాధ్యమయినది గాదు.

భోగిని తల్లినిగూర్చి చెప్పనవసరము లేదు. ఈమె వేశ్య. చుట్టునున్న సమాజముగూడ నటువంటిదే. ఈమె సంభాషణమంతయు చదివిన 'పరమ రోత' పుట్టును. అయినను వేశ్యాజాతి స్త్రీకి యీ సంభాషణము సముచితమే. ఒకచోట నామె "తాపాతిరేకంబులన్ గూర్చుటోగాక తోరంబులై మధ్యభారంబులై నిర్జితానంగ సౌధోపరి స్వర్ణకుంభంబులై యొప్పు నీవిప్పు వక్షోజ కుంభంబులన్" అని కూతురితో ననును. ఒకచోటగాదు, ఈమె సంభాషణ మంతయు నంతియే. ఇట్టి నీచ వర్గమున జన్మించిన భోగినిని సింగభూపాలుడెట్లు ఆదరించెను ? భోగిని తల్లి నేనుగుపై నెక్కించి, రావించి యామె కిన్నైశ్వర్యముల నెట్లు సమకూర్చెను ? నాటి సమాజ మీవింత నెట్లు చూచినది ? మరియే యితర కవియు నీ వృత్తాంతము నెందులకు గైకొనియుండలేదు ? అను ప్రశ్నలుకూడ తామర తంపరలుగ పుట్టును. అందుచేనను ఇది గద్య దండకము. కొన్ని వేల అక్షరములు ఒకే పాదమున రచింపబడినవి. కావున దీనిని మరింత పెంచి విపులీకరించి వ్రాయవచ్చును.

కీ. శే. పండిత వంగూరి సుబ్బారావు పంతులుగారు "సింగభూపాలుడు సమకాలికుడు భాగవతకృతి నీయకపోగా మరియొక కవిచే నీ దండకమైన కృతినిచ్చెనని పట్టుదలతో జూపుటకు దీనిని సృష్టి యొనరింపజేసి యుండవలెను. లేదా పూర్వులెవ్వరైన యీ దండక శైలికి భ్రమపడి పోతన్న దనుకొని చివర పద్యమును దగిల్చియుండవచ్చును" [15] అని వ్యక్తీకరించిన అభిప్రాయము చాలవరకు సమర్థనీయముగనే గన్పించును.

దండకము నందలి సర్వజ్ఞుని సమాచారము, బమ్మెర పోతన నామము విషయమున అభిప్రాయ భేదము లేదు. ఈ రెండును

గ్రంథస్థ సాక్ష్యము లగుటయే యిందులకు గల కారణము. తక్కిన వన్నియును ఊహాల్పై ఆధారపడినవే.

ఇవి యట్లుండగా దండకమున 'రేచెర్ల' గోత్రనామమే గాని, వంశనామము ప్రస్తావింపబడలేదు. రేచెర్ల గోత్రములోని సింగమ నాయని మూలపురుషుడు "చెవ్విరెడ్డి యను నామాంతరము గలిగిన పిల్లలమర్రి భేతాళ నాయకుడని వెలుగోటివారి వంశచరిత్రము వలన తెలియుచున్నది," [16]

పిండితార్థ మేమనగా భోగినీ దండకము అన్యకవి కృతము. పరమ భక్తాగ్రేసరుడైన పోతన పేరిట రచింపబడిన వెలుగులోనికి వచ్చునని భావించియుండును. పోతన కృతి యవగనే అది నాలుగు కాలములు నిలిచినది. లేనియెడల కావ్య, ప్రబంధ సాహిత్యము శోభాయమానముగ ప్రకాశించు కాలమున, ఈ కృతి ఆకృతి మనకు దక్కెడిది గాదు.

## 5-2. శృంగార దండకము.

శృంగార దండక కృతికర్త తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు [17] ( క్రీ.శ. 1458 - 1554 ) స్వతంత్ర కృతి. పద్మావతీ శ్రీనివాసుల పరిణయ గాథ యిందు సభివర్ణితము. భగవదంకిత శృంగారపరమైనది. ఈ కృతి వేంకటాచలాధీశ్వరున కంకిత మీయబడినది.

> "సన్నుతి తాళ్ళపాక పురశాసను డన్నయ తిమ్మనార్యుఁడ
> త్యున్నతి జెప్పె దండకము దుగ్ధ పయోనిధి కన్యకారతి
> స్విన్న మృదీమదాంకునకు వేంకట భర్తకు నవ్యభోగ సం
> పన్నున కారఁబిందు కులపర్వత తారకమై చెలంగగాన్"
>
> ( శృంగార దండకాంత పద్యము )

ఇటువంటి అంకితాంక పద్యముతో ముగియు పద్ధతి భోగినీ దండకములోనే ప్రారంభమయినది. 'పండితకీర్తనీయుడగు బమ్మెర

పోతన' యను పద్యము భోగినీ దండకమునకు చెందిన అంకితాంక పద్యమే. ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారు పెదతిరుమలయ్య శృంగార దండకాంత పద్య విషయమున "ఇట్లు దండక రచన అంకితాంక పద్యముతో ముగియుపద్ధతి యింతకు పూర్వపు కవులు పాటించినదియు, లాక్షణికులు నిర్వచించినదియు కాదు"[18] అని అభిప్రాయపడిరి. "ఇట్లు స్తుతి ప్రధానములై కావ్యాంతర్గతములుగ మాత్రమే రచితములగుచుండిన దండకములకు తెలుగున గొంత యితివృత్తమును గూడ తోడ్పరచి దానిని ప్రత్యేకమైక వాఙ్మయ శాఖగ వెలయింప జేసిన విఖ్యాతి తొలుత పోతన్నకే దక్కినది. అతని భోగినీ దండకమే ప్రత్యేక లఘుకృతి"[19] అనెడి ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారి యభిప్రాయమే పోతన పెదతిరుమలాచార్యులకంటె పూర్వము భోగినీ దండకము రచించెనని తెలియుచునే యున్నది. నిజమునకు తెలుగున దండమొక ప్రత్యేక శాఖగ నుద్భవించుటకు ఆద్యులు, శివకవులు.

శృంగార దండకము "శ్రీ వెంకట క్ష్మాధరోత్తుంగ శృంగాగ్ర నిత్యస్థిరాగారు గారుత్మతోద్దీర్ణ సౌవర్ణభూషా విశేషోజ్జ్వలాకారు గారుణ్య తారుణ్య లావణ్య సారప్రభాసద్మ పద్మాధరాధీర లీలాకరోదార సంసారు సారూప్య సామీప్య సాలోక్య సంలోక్య సద్భక్తి ముక్తప్రజ స్తోత్ర పాత్రీకృతాచారు జారుక్రియా యోగి యోగేశ్వర స్వాంత కంజాత సంవాస సంబంధు బంధూక బంధూ భవద్భవ్య నవ్యాధరానేక సల్లాప గోపాంగనాలింగ నానూన సన్మాను...సంభాషణానూన లీలం బ్రసంగించి కేలం గురుల్ దువ్వి మేలంబుతో నవ్వి జవ్వాది కాన్వాడి గోరం దగం జిమ్ముచున్ మక్కునం జెక్కు లొక్కింత చేనొక్కి కస్తూరికా గంధసారంబు బాలిండ్లపై మెత్తి బింబాధరసావర గాఢోపగూహంబుల నర్మముల్మ్రొట్టు కందర్పకేళిం జెలంగించి యానీరజాక్షీ విజ్ఞాపనం బెల్ల నాలించి లాలించి సౌభాగ్య

సామ్రాజ్యమేలించి తద్భామినీరత్నముం దాను బక్షీంద్రుపై నెక్కి శ్రీవేంకటేశుండు సంప్రాప్త సంతోషుడై సారసర్మ క్రియాచారు సంభాషుడై సన్నుతిం గ్రిమ్మరం గొమ్మతోగూడి తాముండు పెంపొందు నయ్యిందిరా మందిరంబైన యాత్మీయ గేహంబు ప్రవేశించి యుండెందగన్" అని అంతమగును.

ఇతివృత్తము.

శ్రీ వేంకటాధీశుని కీర్తి నలుదిక్కులా వ్యాపించగా ఒక బింబోష్ఠి ఆలకించినదట. అతని పొందుకై యోచించినది. చింతించుచున్నది. మనసంతయును వేంకటాధీశునిపైననే నిలిపినది. ఎవ్వరితో మాట్లాడుటలేదు. నెచ్చెలు లీమె కదలికను పరిశీలించుచుండిరి. వారును ఎప్పుడు నీమె నీవిధముగ జూచి యెరుగరు. ఏమయినదని ఆశ్చర్యపడుచుండిరి. నెచ్చెలులామె నుత్సాహపరచుటకు జలక్రీడకు దీసికొని పోయిరి. వారి జలక్రీడను వేంకటాధీశుని కాంతా పరివారము జూచినది. ఒక పద్మాక్షి కాంతా సహస్రంబుతో యేతెంచి జలక్రీడ సలుపుచున్నదని వేంకటాధీశునికి దెలిపిరి. తెలిపినచో బాగు. మాటాడు రాయంచరీతి జగన్మోహనాకారముతో ఒప్పుచున్నదని, యామె నీకు వధూరత్నముగా భావించుచున్నామని చెప్పిరి. వేంకటాచలాధీశునికా కాంతను చూడ నుత్సుకత కలిగినది. కోరిక కలిగినదే తడవుగ "త్సమీప స్ఫురద్వజ్రవైఢూర్య గారుత్మతాంభోజ రాగేంద్ర నీలాది రత్నప్రభాస్తోమచామీకరోద్దామదామాంచితోత్తుంగ రంగత్పతాకావళీ భవ్య సౌధంబుపై నెక్కి" చూచి యాలలనామణిని ప్రేమించెను. జలక్రీడ గావించిన పిమ్మట నామె చీనాంబరాలేపన వాంఛచేత పరాకుగానున్న సమయమున యామె కింటపడె నీతడు. ఈతని రూపురేఖా విలాసములు జూచి వేంకటాధీశు డీతడే యని గుర్తించినది. వేంకటాధీశుడు సౌధముపైనుండియు, నీమె సరస్సమీపము నుండియు

తన్మయావస్థను బొందిరి. నేను వినినట్టి వేంకటాధీశు డీతడేయని అంద ముగ కస్తూరితో విన్నపములు వ్రాసి కేళీపటమందు గట్టి, వేంకటా చలాధీశుని భవనముపై నాడించగా నాతడు గాంచి, యావిన్నపములు గ్రహించి, హర్షించి, మరల తాను నామెకుకూడ విన్నపములు వ్రాసి ఆ కేళీపటమునకే గట్టి పంపెను. ఆమెయును సంతోషాంతరంగయై యాతని విన్నపములు గ్రహించి, చదివినది. అంతలో ఆమె చెలు లేతెంచి యుద్యానవన విహారమునకు గొనిపోయిరి. కందుకక్రీడ సలిపిరి. క్రీడా లతాగారమునకు బోయిరి. ఆ సమయమున నీమె మరల మోహపరవశ యైనది. మన్మథ తాపమునకు గురియైనది. చెలికత్తెలు శైత్యోపచారములు జేసిరి. తుదకామె దేవాదిదేవుడు వేంకటాధీశు పై మరులుగొనినదని తెలిసికొని, సంతోషించినవారై, యాతని సౌధముకడ కరిగి ద్వారికుల ద్వారమున శౌరికి విన్నపం బంపిరి. వారును వేంకటాధీశుని యొద్దకుబోయి సాష్టాంగ దండ ప్రణామములు గావించి, యామె వృత్తాంత మెఱింగించిరి. ఆమెపై కృప జూపమని వేడిరి. వేంకటాధీశుడు మందహాసముతో నామె కోరికను మన్నించి యామె చెలులకు నిష్టార్థముల నిచ్చెను. పక్షిరాజుపై శృంగార పుందోటకు వచ్చి యామెనను గ్రహించి, గ్రహించి ఆనందపారవశ్యము గావించెను. ఇంతటితో దండకము ముగియును.

పెదతిరుమలయ్య దండకమున నాయికకు పేరిడలేదు.

భోగినీ దండకమువలె నిందు బంధశైథిల్యత మచ్చునకు గానరాదు.

వేంకటాధీశునిపై నొక ప్రేమ వృత్తాంత మల్లిన పెదతిరుమలా చార్యులు ఇందు జలక్రీడ, ఉద్యానవన విహారములతో కొత్తసొగసులు కల్పించెను. భగవత్పరమైన శృంగారము. చారిత్రిక నేపథ్యమునకై వెదక నవసరము లేనేలేదు.

## 5-3. వెంకటపతిరాయల దండకము.

తంజావూరి సరస్వతీ మహలులో అముద్రితముగ శిథిలావస్థలో నున్నదీ వెంకటపతిరాయల దండక ప్రతి. దీనిని రచించిన కవి యెవరో తెలియదు. విద్యావతీ దండక కర్తయయిన "గణపవరపు వేంకటకవి సత్కారాలు పొందిన రాజసభలు చాలా వున్నాయి. తాను ఆంధ్ర కవితా దురంధరుణ్ణని చెప్పుకొన్నాడు. కర్ణాట, తుండీర, చోళ, పాండ్య మండలాలు ప్రభువులు సత్కరించి మత్తసింధూర సైంధవాలు ఆందోళికలు, ఇళ్ళూ, వాకిళ్ళూ ఇచ్చారట. ఇతణ్ణి సన్మానించిన కర్ణాట ప్రభువు క్రీ.శ. 1630 నుండి క్రీ.శ. 1642 దాకా పాలించిన మూడవ వేంకటపతిరాయలు గావచ్చును. కర్ణాటనుండి వెంకటపతి తుండీర మండలానికి వెళ్ళాడు. అంటే చెంజి రాజ్యమన్న మాట. క్రీ.శ. 1649 దాకా చెంజికోటను వరదప్ప పరిపాలించాడు. ఆయనపై వేంకటపతి ఏవైనా పద్యాలు చెప్పాడు గాబోలు. కనీసం ఒక గ్రంథ మయినా చెప్పివుంటాడు. చెంజి నుండి తంజావూరుకు వెళ్ళి విజయ రాఘవుని సభలో మన్ననలుపొంది చివరకు మధురలో స్థిరపడ్డాడు"[20] అని ఆరుద్ర తెలియజేసి యుండిరి.

సరస్వతీ మహాలు నందలి వెంకటపతిరాయల దండకము ఇప్ప టికి సంపూర్ణముగనే యున్నది.

"శ్రీమత్కళాపూర్ణ చంద్రుండు చంద్రానసా మోహన శ్రేణి వీణాంగ దుండంగజాతాహితా ఈశ్వరాంభోజ భూ భామినీ యామినీ కామినీహార మందాకినీహార హీరప్రభాపూర సత్కీర్తి కర్పూర సంవాహనా వాసి తాశాంతరుం డంతరంగా నుషంగాధిక శ్రీహరిధ్యాన రుక్మాంగద క్ష్మాతలాధీశ్వరుం డీశ్వరాంశావతారాను తారాతి భూపాల కోటీర- దత్న నిర్య ప్రభాపుంజరాజత్పదాంభోజ" యని మొదలగును. తుదకు "సూత్న ముక్తావతార! జగన్మోహనా

కార ! శ్రీ వెంకటపతీశ్వరా గణ్యా కారుణ్యా గారుణ్యా నానా సముద్వేల ! హో వెంకటపతిక్ష్మాపాల ! పాంచాల ! మాబాల లీలా గతిన్ నీవు బాహా విదారాంగ నీ రూపురేఖా విలాసంబు వీక్షించి మోహించి అన్యంబు పేక్షించి కందర్పశరతాశుగ క్రూర ధారాచల ద్వర్తమై త్వద్గుణకర్ణనాయత్తమైయున్న నీచిత్త మత్తన్వి భాగ్యంబు వీక్షింపుమన్నన్ ప్రసన్నాంగుడై అప్పుడు ప్రౌఢకున్ తారహారాది భూషావితానంబు లిప్పించి, నయ్యింతి నాందోళికారూఢగా జేసిరప్పించి కందర్పకేళిన్ వినోదంబులన్ చాల మెప్పించి చేతో భవద్రాజ్య సామ్రాజ్యముల్నిచ్చి అక్కన్య గన్నమ్మకున్ వాంఛితార్థంబు లిప్పించి వేడ్కన్ చిరాయు స్థిరారోగ్య రేఖాకర మాజిష్ణుడై" యని ముగియును

'కామధేన్వాది నానా వదాన్యౌఘ విఖ్యాత ధిక్కారి హరి ప్రధానాత్మ కర్ణుండు కర్ణాట సర్వంసహా సార్వభౌమాళి రామక్షమా మండలా ఖండలాఖండ వంశప్రతాపోదయా శ్రీదయారామభద్రుండు' అని వెంకటపతిరాయలను సంబోధించి యుండెను. క్రీ.శ. 1630 నుండి క్రీ.శ. 1642 వరకు కర్ణాట రాజ్యమును పరిపాలించినది మూడవ వెంకటపతిరాయలు. ఆతని నాధారముగనే ఈ దండకము రచించి యుండవలెను.

**ఇతివృత్తము.**

వెంకటపతిరాయలు సర్వ భూషాలంకారుడై, సర్వ సన్నాహములతో పురమునందలి రాజమార్గము నుండి వచ్చుచుండగా ఒక వారాంగన జూచినది. ఇంద్రుడా ? చంద్రుడా ? కంతుడా ? యని యూహించినది. విద్యా వినోదక్రియల యందనాదరణ వహించినది. పరాభూత మనస్కయైనది. ఈమె యీ విధముగ నుండుట నామె తల్లి పసిగట్టినది. ఈ విధముగ నుండుటకు గల కారణము నీవు వేంకటాద్రిక్షితీశుని జూచితివా ? అతని పొందు వాంఛించుచున్నావు

గాబోలు, నట్టిపని తగదు. అతని పొందు నాగవాసము వంటిది. అంతః పురమునందలివారు నిన్ను చులకనగాజూతురు అని యాతని గుణగణ ములు వర్ణించి చెప్పినది. తదుపరి తన కూతురికి ముద్దిచెప్పుటకు నుప క్రమించినది. వేశ్యకు ఎక్కువగా ధనము తెచ్చియిచ్చువారే మహా రాజులు. రాజులతో కూటమి వట్టి జంజాటమి. వారి పోరాములు కత్తిపై సాములువంటివని వేశ్యాచార వర్తనము లేకరువు పెట్టినది. కూతురు తల్లి మాటలువిని, ఎదిరించినది. ఈమెకు కంతు సంతాపము అధికమైనది. అప్పుడొక ప్రౌఢాంగన వేంకటాద్రిక్షితీశుని యొద్దకు పోయి యీామె వృత్తాంతమంతయును విన్నవించినది. వేంకటపతి ప్రస న్నాంగుడయ్యెను. తనతో చెప్పవచ్చిన యాప్రౌఢాంగనకు తారహా రాదిభూషణముల నొసగెను. తనను వలచిన యా వారవనితను ఆందో ళికారుఢగా జేసి రప్పించి, కందర్పకేళీ వినోదంబుల చాల మెప్పిం చెను. వారవనితనుగన్న తల్లికి కోరిన ధనమును ప్రసాదించెను. ఇంతటితోనీ దండకము ముగియును.

ఈ దండకమున నాయిక తల్లికిని. నాయికకును పేర్లులేవు. ఊరా? వెంకటపతిరాయలు వాహ్యాళికి వెడలుటబట్టియు, ఈమె సౌధ మునుండి చూచుటను బట్టియు. వేంకటపతిరాయలచే పాలింపబడు తున్న ప్రధాన పట్టణముగ భావింపవలెను. ఈ దండకము నూటికి నూరుపాళ్ళు భోగిని దండకమునకు చెల్లెలు.

## 5-4 శాహరాజ దండకము.

ఈ దండకమును రచించిన కవి యెవరో తెలియదు. తంజా వూరు సరస్వతీ మహాలు నందుగల ఆసమగ్ర, ఆముద్రిత తాళపత్రప్రతి.[21]

"శ్రీ శంభు పాదాబ్జ భృంగాయ మానాంతరంగుండు" అని

మొదలగును. "మారు మాటాడకంచున్ తగుబల్కి యా పెంపుడు గల్కి రాచిల్క నింపారగా బిల్చి యేటీరున్నైనా రాజకందర్పునిం గూడు చందంబు నూహించుమా" అని అసమగ్రముగా ముగియును. ఇక సమగ్రముగా నున్నను ఒకటి రెండు పత్రముల కంటె నెక్కువ యుండవు. జరుగవలసిన కథయంతయు జరిగిపోయినది. రాచిలుక పోయి యారాజ కందర్పునితో చెప్పట. యాతడు వెంటనే సకల లాంఛనము లతో ఆమెను రప్పించుట కంటె, ఈ జాతి దండకములకు వేరు యితి వృత్తము గానరాదు.

శహాజీ, శరభోజీ ఇరువురును మహారాష్ట్రీయులు. తంజావూరును పరిపాలించినవారు. దక్షిణాది బాషలకు మిక్కిలి సేవ చేసిన వ్యక్తులు. శహాజీ తంజావూరును క్రీ.శ. 1684 నుండి క్రీ.శ. 1712 వరకును పరి పాలించగా, ఈతని తమ్ముడగు శరభోజీ క్రీ.శ. 1712 నుండి 1722 వరకును పరిపాలించియుండెను. ఈ దండము శహాజీపై రచించినది. శహాజీ, శరభోజీల యిరువురి యాస్థానము నందుండిన సుప్రసిద్ధకవి దర్భాగిరిరాజు యొకడు. అతడుగాని రచించియుండవచ్చును. ఖచ్చిత మగు ప్రమాణమేదియును లేదు.

"శ్రీ శంభు పాదాబ్జ శ్రీ భృంగాయమానాంతరంగుండు రంగ కృపాపూర్ణ నిర్నిద్ర లక్ష్మీకటాక్ష ప్రవేశామృతానేక నిత్యాంశ... భద్రాసనాధ్యాస చోళక్షమాశాసి తంజాపురీవాసి భూచక్ర ధారంధరీ ధిక్కరీభావ భృన్నిర్జరేంద్రార్జిత శ్రీపురీవాస త్యాగేశ్వర ప్రేమ పాత్రుండు"

"శ్రీశాహభూపాల దేవేంద్రు శింగార.........దమ్ముడై నట్టి శ్రీ శరభోజీంద్రుడున్......సజ్జన స్తోత్రపాత్రంబునై మిక్కిలిన్ మిత్తి చేహత్తి చేదోడుగా"

అని యింత కంటెను శహాజీ, శరభోజీలను గూర్చిన వివరములు లేవు.

## ఇతివృత్తము

ఇదియును భోగినీ దండక కోటికి చెందినదే. ఈతడును సర్వ సన్నాహములతో వాహ్యాళికి రథారుఢుడై వెడలెను. వారకాంతా జనము సౌధములనుండి తిలకించిరి. ఆ సమూహములో అపురూప సౌందర్యరాశి యొకతె శాహభూపాలుని వీక్షించినది. చూచినదే తడవుగ మోహించినది. తుదకు నెచ్చెలులు శైత్యోపచారములు చేయు స్థితికి చేరినది. ఈమె వర్తనము తల్లి గమనించినది. వెంటనే కూతురిని శాహభూపాలుని చూచితివా ? అని యడిగి, వాని సౌఖ్యమును గోరుచున్నావు గాబోలు నాతనితో పొత్తు నీకు తగదనీ, శాహ భూపాలుని గుణగణములు వర్ణించి చెప్పినది. వేశ్య కులాచారముల నామెకు వివరించినది. తల్లి నెదిరించినది కూతురు. ఇంతదనుక భోగినీ దండకమువలె నడచినది. కాని యీామె యవస్థ నెవరును పట్టించుకొన లేదు. శాహభూపాలుని యొద్దకుబోయి యెవరును విన్నవింపలేదు. భోగినివలె నీమెకు అప్పగాకు లేదు. తన పెంపుడు చిలుకను బిలిచినది. తన గోడు చెప్పికొనినది. ప్రతిలో ఇంతవరకే తాళపత్రములున్నవి. తదుపరి యీ చిలుకబోయి శాహభూపాలునికి యీామె యావేదన వ్యక్తీకరించుట, ఆతడు ప్రసన్న హృదయుడగుట, తన పరివారము నామె యొద్దకు బంపి రప్పించుకొనుట, ఆమెను, ఆమెనుగన్న తల్లికి నిష్టైశ్వర్యముల నొసగుట జరుగునని యూహింపవచ్చును.

శాహరాజు యీామెను తనదానిగ జేసికొని, అంతఃపురమున సముచిత స్థానము నిచ్చెనా లేక తన భోగినిగ గుర్తించెనో తెలియదు.

ఈ దండకమున శహాజీ, శరభోజీ, తంజావూరు పేర్లు ప్రతి శహాజీని వలచిన వారవనితకుగాని, యీామె తల్లికిగాని పేర్లు లేవు.

## 5-5 పద్మినీ దండకము.

మైసూరు రాజవంశానికి చెందిన కృష్ణభూపాలుని పౌత్రుడు. చామావనీనాథ పుత్రుడునగు కృష్ణరాజభూపాలుడు పద్మినీ దండకము నందలి నాయకుడు. వీరిది ఆత్రేయస గోత్రము. పద్మావతియను వారాంగన యీ దండకము నందలి నాయిక. కృతికర్త మైసూరు సంస్థానమున ఆంధ్ర పండితుడు నయిన చంద్రకవి. తగణయుతమైన గద్య దండకమిది.[22]

### ఇతివృత్తము

కృష్ణభూపాలుడు వాహ్యాళికి బయలుదేరెను. పెద్దయెత్తున నాతని పరివారము కూడా వెంటనడిచినది. ఆ పరివారములో అతని ఆస్థాన కవీంద్రులు గూడా వెంటనుండిరి. ఈతడు అశ్వారోహుడై యుండెను. వాహ్యాళి కేతెంచు సమయమున 'చెన్నొందు వారాంగనాలలామంబు పంచాస్త్రదీమంబు సౌదామినీ భవ్యధామంబు లీలా వయస్సీమ శశ్వత్ కళారామ భాస్వద్గుణస్తోమ పద్మావతీనామ భామాలలామంబు రాకా సుధారామునిన్ మించు' కృష్ణభూపాలునీ, అతని వైభవలక్ష్మిని చూసి, మోహించినది. భోగినివలెనే కృష్ణభూపాలుని పొందు ఎట్లు లభించునాయని యాలోచించినది. ఈమెతల్లి చింతాభర క్రాంతయగు నామెను గమనించినది. 'ఏమే విలాసానులాపా, లసద్గానవిద్యాధురీణా, మరాళేంద్రయానా, మరుత్కుంభ కుంభస్తనీ, నాట్యవిద్యాధునీ, కొమ్మ, నామేలు బల్లుప్ప మాయప్ప, నా ముద్దుపట్టీ యిదేమిట్టి చందంబు, నీకందమా, చందమా చందమామన్ దురాయించు మోమందు సిందూరవున్ దీర్పంగరాదో రహిన్ వీణ పల్కించరాదో'అని పలువిధముల ముచ్చటించినది. 'పద్మరాగంబులన్ రాగ పద్మంబులన్ గెల్చునీ నీరదంబు ల్విభాస్వత్పదంబుల్ సిరుల్ గుల్కు-

రాచిల్క పీవల్కచే సుందురా సుందరీ యందరేమేమి బాధించరో యేమి సాధించిరో...' అనివాపోయినది. వారాంగనా జాతికి న్నీతిరేమి యని గద్దించినది. 'విత్తంబుమీదాస లేదేమి మోహంబె' యని హితవు చెప్పినది. అంతయు వినినది పద్మావతి. నీ జగజ్జాలములు చాలనినది. 'కృష్ణరాజేంద్ర చంద్రుడు నన్నేలునే తల్లి! నీకున్ దయా లేశ మింతైన లేదెంత దుర్మోహివే, ద్రోహివే, పాపజాతీ భవజ్జాతి ధర్మంబు సత్యంబులా నాస్తి, దౌత్యంబులా మస్తి, మర్యాదలా సున్న, చోరత్వమా వెన్న, మోహంబులా దబ్బరల్, ద్రోహమా కొబ్బరల్, లేదు సత్యంబు, మీ సాంప్రదాయంబు దుష్పల్లవ వ్రాత సంసర్గ దుర్మార్గపున్ రోతలెల్లన్ వడిగట్టి రూపంబు వోగట్టి కాపట్య మూహించి, కారుణ్యమున్ దింపి, సిగ్గున్ విసర్జింపగా జాలునే?' అని తల్లికి నానాచివాట్లు పెట్టినది. 'భాషాచమత్కార శేషాహిరాయై శూరు కృష్ణ క్షమాకాంతు కాంతాశ్వరేవంతు సత్యవ్రతానంతు శ్రీమంతు ధీమంతు లీలారతిన్ గామ చంచత్కరంగాక్షి యన్య క్షమాధ్యక్షు లన్ చేర వీక్షించునే? పాళీ మిళత్పల్లవాంభోవిహారంబు చంద్రదన్ఫు రచ్చంద్రికాపాన మాద్యచ్చకోరంబు దాగోరునే?' అనుచు నొక చెలి కత్తెను పిలిచినది. ఆమె కోరికను కృష్ణభూపాలునుకి విన్నవించమని వేడినది. చెలికత్తెయు వెడలి పద్మావతీ విరహ వృత్తాంతమును కృష్ణ భూపాలునకు విన్నవించి వేవేగ రక్షింపమని ప్రార్థించినది. కృష్ణ భూపాలుడు 'గాంచి హర్షించి భావజ్ఞుడై వేగ పద్మావతీకన్య మూర్ధన్య నాందోళికారూఢ గావించి వేవేగ రావించి రత్నప్రభాళీ మహాత్తంస పర్యంకమున్ జేర్చి పంచాస్త్రకేళిన్ వినోదించి సంభో గనింగా బ్రసాదించి తన్మాత్ర లీలావయవ్యాళి కిష్టార్థ సంసిద్ధు లాచంద్ర తారార్కమై వర్ధిలన్నిచ్చి శ్రీ రంగనాథున్ సదా గొల్చు

చున్ గిర్తిమించెన్ భువిన్ రాజచంద్రుండు శ్రీ కృష్ణరాజేంద్ర నాముండు మైసూరు రాజ్యాభిరాముండు సంపత్ప్రభావుండునై తేజరిల్లెన్ మహాభోగభాగ్యోన్నతిన్ భూస్థలిన్' అని దండకమునందలి ఇతివృత్తము ముగియును.

దండకాంతమున కృతికర్త యొక్క పదవమునందు తనను గూర్చి ఈ విధముగ చెప్పికొనియుండెను.

ఉ. "పండితులెల్ల మేలనగ భాసిలు చంద్రకవీంద్ర వర్యుడా
ఖండల భోగకర్తకును కామిత దానవిహర్త కృష్ణభూ
మండల భర్తకున్ విమత మానస హర్తకు మేలు పద్మినీ
దండకమున్ రచించె నిది ధారుణి నారవితారకంబుగన్"

ఈ కవి భోగినీ దండకమును బాగుగ పరిశీలించినవాడనుటలో సందిలేదు. ఈ దండకమునందు కృష్ణభూపాలుని దైనందిన కృత్యములన్నియు వర్ణింపబడినవి. చంద్రకవి మైసూరు రాజప్రసాద పరిచయమున్నవాడనుటలో సందేహము లేదు.

## 5-6 విద్యావతీ దండకము.

దీనిని రచించినది 'గణపవరపు వేంకటకవి'.[23] (క్రీ.శ. 1670 ప్రాంతం) ఇందు 'ముద్దళగిరి'నాయకుడు. క్రీ. శ. 1659 నుండి 1682 వరకును మధుర రాజ్యమును పరిపాలించిన చొక్కనాథనాయకునికి సవతి తమ్ముడు. క్రీ. శ. 1674 సంవత్సరమున తంజావూరును పరిపాలించి యుండెను. మధుర నాయక రాజులలో సంగీత, సాహిత్య, వినోదములతో కాలము గడిపిన వ్యక్తి. తంజావూరి పరిపాలకులలో విజయ రాఘవనాయకుని తదుపరి యితడే వినోద పురుషుడు. ముద్దళగిరి సాహిత్యలోలుడు, సాహిత్య పోషకుడుగనే గాని, కవిగా నీతని రచన లేమియును గనిపించుట లేదు.

దం. "(శ్రీ) విశ్వనాథాన్వయాంబోధి చంద్రుండు.....సత్కాశ్యపాభిఖ్య గోత్రుండు భాస్వచ్చరిత్రుండు (శ్రీ) తిమ్మలోర్వీధరాధీశ పౌత్రుండు వీరావనీపాల పుత్రుండు వీరాధివీర స్తుతోదార దోస్సార వచ్ఛ్రీకనాథ క్షితీశాగ్రణీ సోదరుం డాశ్రితత్రాణబద్ధ ధీరుండబ్ధి కన్యా సమానోల్ల సల్లింగమాంబా వధూగర్భశుక్తి స్ఫుర న్మౌక్తికాకారుఁడై యొప్ప ముద్దళ్ఘురి క్షోణిపాలుండు......చంద్రబింబాస్య చంద్రానుకారా స్మితోదార సారస్యమవ్వంపు పూరెమ్మమాణిక్యపుం బొమ్మ, యాద్యద్వయస్సీమ విద్యావతీభామనున్ ...... మన్మథా భోగ సామ్రాజ్య భోగమ్ములం దేలించెనట్టి త్రిలోకీ వదాన్యత్వ సంశీలుడౌ తిర్మలక్షోణిరాట్ పౌత్రపేరన్ సుధీ ముద్దువీరక్షమాధీశు సత్పుత్రపేరన్ గుణామేయ లక్ష్మీనివాస స్ఫురత్ పాండ్య సింహాసనాధ్యక్షు పేరన్, వృషాధీశ సంకాశు పేరన్ మహాలక్షణ గ్రంథ భాషాభిధానప్రథా మాధురీ సాధురీత్యర్థ వచ్ఛబ్ద బంధాను బంధ ప్రబంధాభిధానాప్పయామాత్యరా డ్వేంకటార్య ప్రణీతంబుగా బొల్చునా బుష్పకోదండకంబైన విద్యావతీ దండకబుర్వి నాచంద్రతారార్కమైయొప్పు నెల్లప్పుడున్."

## ఇతివృత్తము

ఒకనాడు 'చౌవంచు పూదూపు సాహేబు రాచిల్కపై నెక్కమే టెక్కు' ముద్దళగిరి అశ్వము నధిరోహించి వాహ్యాళికి వెడలెను. ముద్దళగిరి రూపు రేఖా విలాసాదులు నావూరి వారాంగనాకోటిలో మేటి యగు విద్యావతీ భామ చూచును. తక్కిన కథలో కూడ ఏమియును ప్రత్యేక లేదు. వేశ్యమాత. విద్యావతీ భామకు హితవు చెప్పుట. విద్యావతీ యామె మాట వినక భీష్మించుకొని కూర్చొనుట. తుదకామె వేదనను భరింపజాలక వేశ్యమాతయే రాజువద్దకేగి

కూతురి అవస్థను విన్నవించుటయును జరుగును. ముద్దళగిరి కరుణించి తన పరివారముతో పల్లకిని బంపి యామెను రప్పించి 'ఆత్మీయమా నాట్యస్థలి పాత్రలందెల్ల సన్మాన పాత్రింబుగా' జేసి, మన్మథాభోగ సామ్రాజ్యమ్మలం దేలించి, యానందింప జేయుట దండకము నందలి కథ.

## 5-7 కచ్చిరంగరాజ దండకము.

దీనిని రచించిన కవి పేరు తెలియదు.[24] దండకాంతమున నైనను తన నామమును పొందుపరిచెనో లేదో తెలియుటలేదు. కారణము, దండకమంతయును సంపూర్ణముగ లేదు.

దం. "శ్రీమత్సమస్తావనీ నాథ యూథైక సంస్తుత్య నిస్తుల్య కళ్యాణ నానా గుణశ్రేణి నాపాదనూన కచ్చన్వయక్షీర వారాశి సంపూర్ణ చంద్రాభ్ర మాతంగ చంద్రాతపోభంగ సాంద్రామృతాంధో ధునీభంగ ...... శోభాభర ప్రాపిత క్షౌమ రాజద్వితానాధిక ద్యోత మానాభ్ర దేశుండు దేశాం తరాయాత శుంభత్కవీంద్రా విద్యాధిక శ్రేణి సంరక్షణాక్షీణ కారుణ్యధారాధురావార సత్కటాక్షేక్షణోదారాత్తా రామ భద్రుండు భద్రేభయానా నవీన ప్రసూనాస్త్ర కల్పుండు కల్పవనీజాత భాస్వత్తనూజాత కంజాత ...... దానధారా సుధాపూర పాత్రీకృతాశేష ధాత్రీ నరశ్రేణి కర్ణుండు కర్ణాటరాజన్య......కచ్చన్వ యాధీశ రంగక్షమా మండలా ఖండల స్ఫీత గర్భాబ్ధిచంద్రుండు జ్ఞానప్రసూనాంబికా పుత్ర రత్నాకర గణ్యుండు ...... శ్రీ యావ రాజ్యాభిషిక్తుండు సర్వక్షమాపాలనా శక్తి యుక్తుండు శ్రీ కచ్చిరంగావనీపాల చంద్రుండు తానొక్కనా డెక్కువౌ మక్కువన్ పిక్కటిల్లంగ

ద్రొల్లుబ్బలి నిబ్బరం బొప్పగా గమ్మనె త్తిమ్మిరాయేటి గాటంపు గెంజాయచే నట్టె గన్పట్టు నప్పట్టునన్ వంది బృంద స్తవంబుల్ చెవిన్ సోకగా శీవి నెత్తావి చెంగల్వ టేరుల్ పొసంగం బసంగాంచు పూసజ్జలో మెల్ల నే నిద్రి మేల్కాంచి-''నది మొదలుగ రాజు స్నానము, భోజనము, వేషము, సభాప్రవేశము, తదుపరి వాహ్యాళికి వెడలుట, పురముగందాక మేడలో నుండి, వారవనిత చూచి మోహించుట, విరాళి బొందుట, ఆమెకు నీతనితో పొందుకురుటతో నంతమగును కథ. రాజు వాహ్యాళి, వారాంగన వలపుతో కూడిన యితివృత్తము వరకే ప్రతిలో కలదు. కనుక వీరిద్దరికి పొందుకుదురుననుట యూహింపవచ్చును.

5-8 చంద్రాననా దండకము.

దీనిని రచించినది 'చిదానందకవి'.[25] ఈకృతి రామచంద్ర తొండమానురాజున కంకితము చేయబడినది. ఈతడు పుదుక్కోట ప్రభువు. పుదుక్కోట నేలిన రాజులకు 'తొండమాన్' అనునది బిరుదనామము, ఈ రామచంద్ర తొండమాన్ ప్రభువు. రెండవ విజయ రఘునాథుని తమ్ముడైన రఘునాథుని కుమారుడు, క్రీ. శ. 19 శ. మధ్యభాగము. చిదానందకవిని పోషించిన దీతడే.

''...... సద్యశశ్శకాంతుడై యొప్పు శ్రీమాన్ మహారాజ రాజేశ్వరుండైన శ్రీ రామచంద్ర క్షమాధీశు పేరన్ స్ఫురన్నిత్య సామ్రాజ్య సత్పుత్ర సంతాన సంపత్తు లింపొంద నుద్దండ విద్వత్కవి తాంకనుండైన శ్రీ వేంకనాభిఖ్యాధీరేంద్ర పౌత్రుండు శ్రీ మాతృభూతాఖ్య ధీమంతు పుత్రుండు శ్రీ మచ్చిదాకార విద్వత్కవీంద్రుండు వ్రైజేయు చంద్రాననాంకంబుగున్ దండకంబుర్వి నాచంద్ర మస్తార కాంభోజ మింత్రతంబుగాన్.''

ఇతివృత్తము.

తెల్లవారు వేళ వందిమాగధుల స్తోత్రములతో రాజు లేచుట,

స్నానాదికములు, సామంతరాజులు రాజు రాకకై వేచియుండుట, రాజు కొలువు దీరుట మొదలగు దైనందిన కృత్యముల తదుపరి రాజు వాహ్యాళికి వెడలుట మొదలగు విషయములు వర్ణింపబడినవి. వాహ్యాళి సమయమున రామచంద్ర తొండమాన్ రాజును చంద్రానన యనునొక వారాంగన చూచినది. మోహించినది. ఈమె చెలికత్తె యొకతె అంతఃపురము నందలి చెలికత్తె వేషమున రాజు శుద్ధాంతః పురము ప్రవేశించి చంద్రానన యొక్క వలపును వివరించి, కాపాడు మని వేడినది. చంద్రానన చెలికత్తె వచోరీతికి రాజుమెచ్చి, భూషాంబరములకు గానుకగా నిచ్చెను. తన పరివారముతో పల్లకిని బంపి, చంద్రాననను రప్పించి తనదానిగ జేసికొనెను. ఈమెనుగన్న తల్లికి నిష్టైస్వర్యములను ప్రసాదించెను.

## 5-9 పద్మినీ దండకము.

దీనిని రచించినది 'దేవరకొండ రామయ్య'.[26] ఇది కేవలము భోగినికి ప్రతికయే. కవి యెంతమాత్రమును స్వాతంత్ర్యము చూపించ లేదు. బొమ్మరాజేంద్ర పుత్రుడు తిరుమల రాయనిపై చెప్పినది.

ఇతివృత్తము.

బొమ్మరాజేంద్రపుత్రుడు వాహ్యాళికి వెడలగా ఒక వారాంగన ఈతనిని చూచి మోహించినది. ఆమెతల్లి యాతనిని వలచుట కూడ దనినది. ఆమె వినలేదు. తుదకామె పెంపుడు చిలుకను బిలిచి, తన బాధను చెప్పికొని, యారాజునకు నివేదించమనినది. చిలుక అట్లే చేసినది. అతడు నామెను, ఆమె తల్లిని రప్పించి యిష్టైశ్వర్యములు ప్రసాదించుటతో కథ ముగియును.

పద్మిని తల్లియును, భోగిని తల్లియు నొకమాదిరి వారే.

ఉదా: "...వెతం జెందనేలా దిగుల్ చెందనేలా ఖేలావతీ

చారులీలావతీ శ్రేయంపు నందీ పరాయత్త యోగంబు భోగంబుకే యోగంబుకే నేరదే యర్థలాభంబు సుమేలంబునం జేరదే వారకన్యా జగన్మోహనాకార రేఖా విలాసంబు హాసంబు శృంగారవన్యాయ కేళీ మనస్సంవిధానంబు గానంబు...మాణిక్యపుం దీవి, పాలింగ్లు పూచెండ్లు, నూగారు ఒకతీరు ...... నయ్యారె యొయ్యారి వెయ్యార్లు లైనం దగం దెత్తురే వత్తురే యిత్తురే విత్తమాయత్తముం జేయ...... మంచి విత్తంబుపార్జించ రాదాయె బంగారపుం గిండ్లు శృంగారపుం జెండ్లు మేల్ జక్కవల్ బల్నిక్క చన్గుబ్బలం జూపి మోహంబు పుట్టింపరాదాయె......"

ఇక వారకన్య పద్మిని మాట్లాడిన తీరు, భోగిని మాట్లాడిన తీరున ననుసరించినది.

ఉదా: "నిర్మలాకాశగంగాధునీ తుంగరంగత్తరంగాంబురు ట్ప్రాలికా మాలికా డోళికా కేళి లోలమేరామరాళంబు భేక భేకీ ఘులీ వంక శంకాద్రి సంకీర్ణమా వాగులాశించునే?-

దివ్య మందార సందోహ సమ్యగ్మరందంబు లానందమిం జెందు నామత్త సారంగి యుమ్మెత్త పూగుత్తులన్ హత్తునే?-

చైత్రవేళా మాకందపాళీ చరత్కోకిలేంద్రంబు ఝుల్లీరవ ద్వాజ్రివల్లీ సమూహంబులం గోరునే?

రాజరత్నంబనన్మించు శ్రీ తిర్మలక్షోణి రాణ్మౌళిరాడ్గా సమాలింగ నంబున్ దగంగోరు నీపద్మినీకన్య యన్య ప్రసంగం బపేక్షించునే?-"

భోగిని యీవిధముగనే తన తల్లిని ప్రశ్నించినది. రచన గూడ భోగినీ దండక రచన ననుసరించెననుటలో సందేహములేదు.

## 5-10 శ్రీమేశ్వర దండకము.

దీని నెవరు రచించిరో తెలియదు.[27] (ధాక్షారామము నందలి

్రరు డిందలి నాయకుడు. మాణిక్యాంబిక నాయిక. ఇది గ్రంథ స్థము గాదు. ఇంకను జనుల నోళ్ళలో నలుగుచున్నది. ఎప్పటిదో అంతుబట్టదు. దక్షిణాంధ్ర యుగమునకు తరువాత రచించినదై యుం డును. కారణము, భోగినీ దండకము ఈ జాతి దండకములకు జనని వంటిది. ఆ మహానుభావు డేముహూర్తమున భోగినిసృజించెనోగాని, పుత్రికలు పుట్టలకొద్దిపుట్టినవి. దక్షిణాంధ్రయుగమున భోగిని దండకేతి వృత్తము మిక్కిలి ఆదరణీయమైనది. కనుక ఆకోటికి చెందినటువంటి కవియే దీనిని రచించినదియును.

మాణిక్యాంబిక అష్టాదశ శక్తులలోనొకతె. ఈమె వేశ్య బాలికయై, సకల కళ్యాణ స్వరూపిణియై భీమేశ్వరస్వామి సన్నిధిని ప్రేమతో వెలసియుండెనని దాక్షారామ పురవాసులలో ఐతిహ్యా మొకటి పరంపరాగతముగ వచ్చుచున్నదట. భీమేశ్వర దండకము అనుపేర నిలిచియున్న యీదండకములో వేశ్యబాలిక యొకతె ఉత్సవ సమయమున ఊరేగవచ్చిన భీమనాథుని వలచి యాస్వామి వెంటవచ్చి యాలయమున మాణిక్యాంబిక యైనట్లు తెలుపుచున్నది.

దం. "శ్రీ మన్మహాదేవ శ్రీ భీమనాథుండు శ్రీ దక్షవాటి మహా పట్నముం జూడగా నాత్మలో సంధించి బారువేంచేయగా భేరీయునుశ్రీం జయున్ కంచు మద్దెళ్ళనున్ కంచు తప్పెట్లలున్ శంఖ జేగంటలున్ ఢంకా ఢమామీలు బాకాసన్నాయిలున్, భడభద్రికాళీలు, గుమ్మ మని గుమ్మటుల్ వారాంగనామణుల్ కరకంకణ ధ్వనుల్ ఘల్ ఘల్లులా పాదాల సజ్జులా ఇలుకులా గిలుకులా చూపులా సోకులా వన్నెలా చిన్నెలా గుంపులా జంపులా ఓయమ్మ ఆవచ్చువారెవ్వరే? యని కాంచి మోహించి ఆరాజు దేవూరు? యెన్నంగ పేరేమి? ఓముగ్ధ! ఓబాల! శిశువువే, దేవాది దేవుడే, నిత్యకళ్యాణుడే శ్రీ భీమ లింగేశుడే అనివారు చెప్పంగ, ఆత్మలో మోహించి ...... ఎక్కు గుర్రంబులున్ జాకట్లు డలతారు జల్తారుపోగులా మిద్దెలమ్మెస్తునే,

బుద్ధి చెప్పిస్తునే, ఆ పోయెనా కాలమూ లేవె సరోజాక్షీ! అని పిలిచి చెయబట్టి తాలేవదీయగా చీయనుచు పో ద్రోసి నీయమ్మలక్కడు నీతను మండను నీరూపు నీమాయ నిర్మూలమైపోను స్వామిభీమేశ్వరా! త్రిపుర సంహారకా! నన్నేలు నాస్వామి నన్నేలకుంటేను చత్తునో నొత్తునో పడుతునో దేహంబు విడుతునో ప్రాణంబు తనపాల భీమజన నాయకా తన పాల నుండి చెయ్యిచ్చి రమ్మని చెక్కిళ్ళు నొక్కుచూ జాకాయ జాపత్రి సయ్యాటలాడించి ఓ నీలకుంతలా! ఓ హంసగామినీ! ఓ పల్లవాధరా ! నిత్యం నమస్తే నమస్తే నమః"

గణభంగము, వస్తువునందు బంధశైథిల్యత మిక్కుటము.

## 5—11 భోగినీ జాతి దండకములు - వాని పోకడ.

ఈ జాతి దండకముల ప్రధాన వ్యక్తియును. నాయకుడును రాజు నాయిక వేశ్యకుల సంజాత. వీరిరువురును ప్రధానులు. రాజు గొప్పదన మెరుగనిదిగాదు. సకల సంపదలు గల వ్యక్తి. సమస్తైశ్వ ర్యములతో వచ్చెడి దర్పము, స్ఫురదూపము కలిగియుండును. ఈతడు వాహ్యాళికి వెడలునపుడు, ఈతని వరించబోవు వారవనిత జూచుట మోహపరవశ యగుట ప్రధానాంశము. ఈమె రూపము, గుణములు నెటువంటివనిన కొద్దిపాటిగ చెప్పుటకు కవియే ప్రాతినిధ్యము వహించును.

ఇక నాయికా నాయకులకు మధ్యస్తురాలు మూడవ వ్యక్తి యగు నాయికతల్లి. ఈమె ఎటువంటిదనిన, కొద్దిసాటిగ కవియే వర్ణించి, ప్రవేశము కల్పించి తప్పుకొనును. ఈమె తన కూతురి మనోవిచారము నెరుగుట, అట్టి విచారము కలిగించిన నాయకుని గుణగణములు వర్ణించుట, యాతనిని దూషించుట, తన కులాచార ములు కూతురి కోరువు బెట్టుటయు జరుగును. తుదకు నాయిక తల్లి మాటలు విననిదై తన అప్పగారినో, చెలికత్తెనో లేదా తన పెంపుడు

చిలుకనో బిలిచి తన ఆవేదన రాజునకు విన్నవించమని వేడును. ఈ నాల్గవ పాత్రబోయి రాజునకు జరిగిన వృత్తాంతము విన్నవించును. అతడును విని సంతసించినవాడై యొక పల్లకిని బంపి యామెను రప్పించి సకల సౌఖ్యముల దేలించును. యామెను గన్న తల్లికి కోరిన కానుక లిచ్చును.

ఇందు ప్రధానమైన విషయములు రాజే నాయకుడగుట, వేశ్య జాతి స్త్రీయే నాయిక యగుట.

భోగినీ దండకమున – సర్వజ్ఞ సింగభూపాలుడు, వెంకటపతి రాయల దకడకమున- వెంకటపతిరాయలు, శాహరాజ దండకమున- శాహరాజు, పద్మినీ దండకమున- కృష్ణభూపాలుడు, విద్యావతీ దండక మున – ముద్దళగిరి, కచ్చిరంగరాజ దండకమున – కచ్చిరంగరాజు, చంద్రినా దండకమున- రామచంద్రతొండమానురాజు, దేవరకొండ రామయ్య రచించిన మరియొక పద్మినీ దండకమున- బొమ్మరాజేంద్ర పుత్రుడు తిరుమలరాయడు, వీరందరును రాజులే.

ఇవి గాక తాళ్ళపాక పెదతిరుమలయ్య రచించిన శృంగార దండకమున- వేంకటేశ్వరుడు, ధూర్జటి కాళహస్తీశ్వర దండకమున- కాళహస్తీశ్వరుడు, భీమేశ్వర దండకమున- భీమేశ్వరుడును నాయకులు వీరందరును దేవకోటికి చెందినవారు.

ఈ దేవకోటికి చెందిన దండకముల నటులుంచి, రాజులు నాయకులుగ గలిగిన దండకములం దందరును వాహ్యాళికి వెడలినవారే. వీరిని మోహించిన నాయిక లందరును, ఈ సమయమున చూచి మోహించిన వారే. పౌరకాంత యొక్కతెయును రాజును వలచి నటులు ఏ దండకమునను గానరాదు. ఈవాహ్యాళి సమయమున వేశ్య కుల సంజాత యొకతెచూచి మోహించినదను అంశమునకు భోగినీ దండకము మాతృక. వాహ్యాళి సమయమునే చూచుట, మోహించుట యను నంశ మసమంజసముగ కనిపించును. రాజున కిదియొక

నిత్య కృత్యము. లేదా కొన్నాళ్ళ కొకతూరి యైనను జరిగెడిదిగ తల వచ్చును. నాయికలు ఇంతకు ముందెన్నడును రాజును చూచియుండ లేదా యను ప్రశ్న జనించును. రాజుయొక్క వైభవములు ఆ సమ యమున చూచిన తదుపరి తెలిసియుండునా ? అట్లయినచో ముగ్ధలై యుందురు. అట్టి ప్రాయమున రాజులీ వనితలను ఆదరించి జీవితాంతము పోషించి యుందురా ? అట్టియెడ ఎందరు వేశ్యకుల సంజాతలు రాజులను వలచుటకు వెనుదీయుదురు ? చూచినంతనే మోహింపదగిన సౌందర్యవంతులు రాజులు యని చెప్పుటకే దండకములు రచితమైన వియా ? లేక రాజ్యపాలనలో, కష్ట సుఖములలో నారి తేరి, సమస్తైశ్వర్య సంపన్నుడగు రాజు మోహించునంతటి సౌందర్యరాశులా వేశ్యలు వీరిరువురి ప్రవృత్తి లెటువంటివను విషయమున వారవనిత యగు నాయిక తల్లి నోటినుండే దెలియును.

భోగినీ దండకమునందు నామె తల్లి 'మిథ్యావయత్వంబులన్ రంజకత్వంబులన్ కూడ యంత్రంబులన్ మోహమంత్రంబులన్-జిక్కడే సొక్కడే...చీటికిన్ మాటికిన్ బోటి యామేటి యిచ్చోటికిన్ రాడు పాటించి నీపాటి పాఠీన నేత్రల్ ధరిత్రిశు చిత్తంబు నుత్తంబుగా జేయగా జాలరే యేల రేలున్ బగళ్ళున్ విచారింప చాలింపవే వార వేశ్యా భుజంగుండు గాడే మహారాజవేశ్యాభుజంగుండు' అని రాజు యొక్క గుణములను చాటును. ఆఖరిగ 'రాచ దండంబు గండంబు' యనీ నిందించును.

ఇట్లే జాతి దండకము లన్నిటియందును రాజుయొక్క గుణములను బొగడుటతోపాటు, తమ వారవనితా ధర్మములు సాగవని రాజులను దూషించుట కూడా వేశ్యామాతల కృత్యము. నాయికలు తల్లుల నెదిరించుట పరిపాటి. భోగినీ తల్లి కెదురుతిరిగి 'సిన్ననాడెల్ల నీవెవ్వరిం గోరవేమున్న?' యని యడుగును. ఈ దండంము లందలి

నాయిక లెవరును కళామతల్లులు గారు. భోగిని మొదలందరును వార వనితలే. ధనమును జూసి మోహించెడి తత్త్వము గలవారే.

విజయనగర సంస్థానాశ్రితకోటిలో నొకడైన నడిమింటి రామయోగి (1800 ప్రాంతమున) తన కృతియగు 'భల్లాణ దండకము' నందు భోగిని యనగ సామాన్యమగు వేశ్యగ నభివర్ణించెను. భల్లాణుని శివభక్తిని పరీక్షింపదలచి పరమేశ్వరుడు జంగమ వేషమున వచ్చి, రంభాద్యప్సరసలను బోలిన వారాంగన నొకతెను కోరును. భల్లాణుడు వారాంగనకై ప్రియత్నించును. ఆ ప్రియత్నమున తన పరివారమునంతను వినియోగించెను సింధు పట్టణము సందుల గొందుల తిరిగిరట. ఎవరును కనిపించలేదు. తుదకు తలారిని పిలిచి 'నీవేగి వేవేగమే భోగినీ నాగయానామణిందెచ్చితే గాని శిక్షింతు జుమ్మా యటంచు' ఆజ్ఞాపించును. కనుక భోగిని యనగ భోగింప దగినది. వీరు దేవాలయముగాని, రాజాస్థానముల గాని నర్తకీమణులు గారు. భల్లాణుని యాస్థానమున నర్తకీమణులెందరో యుండిరి గాని వారు భోగినులుగారు. ఒకచోట రామయోగియే భల్లాణుని యాస్థానమును 'మత్తేభయానాణుల్ నాట్యము ల్సల్పగా' అని వర్ణించును. చివరిగ తన ధర్మపత్నియగు మల్లమాంబనే జంగము వద్దకు పంపుట, జంగమరూపధారియైన పరమేశ్వరుడామె యొడిలో బాలుడుగా మారుట, భల్లాణుని ప్రార్థనచే పరమేశ్వరుడు సాక్షాత్కరించి, కథ సుఖాంతమగుటయును జరుగును.

భల్లాణుని కథ యటులుంచి, భోగిని యనగా పురమునందు వేశ్యా జీవితమును గడుపు సామాన్య వనితగనే రామయోగి వర్ణించెను. ఈ భోగినులు రేచల, లకుమాదేవి వంటివారు గారు. కనుక భోగిని వేశ్యకుల సంజాతయగుట, వేశ్యాకులసంజాతయదు నామెను భోగినిగనే నామ మొనరించుటనుబట్టి, భోగిని యనగా నొక సామాన్యమగు వారవనిత. విటులను తృప్తిపరచునదిగా తోచును.

సీ॥ "జావులా" వని తురుష్క వ్యాహృతులు సెప్ప
"సాకుభే" కని స్వభాషలు వచింప
పంతులవారి ప్రభావంబు వెలయింప
నాచార్య భావంబు నధికరింప
ఓర్పుతో రాజకీయోద్యోగములు సేయ
ఘనభక్తి దేవతార్చనలు సేయ
భోగినీ యోగ సంభోగంబు చాటింప
దివిరి సాలగ్రామ తీర్థమాడ" [28]

అని మాధ్వులను గురించి చెపుతూ ప్రయోగించినదీ భోగిని శబ్దం. ఇట భోగిని యనగ వారవనిత యనియేగాని దేవాలయమందు శైవాంకితమైన నర్తకీమణులనిగాదు.

భోగినీ దండకమున భోగిని తల్లి పలుకులు కర్ణకఠోరములు. కుత్సిత బుద్ధికి తార్కాణములు. ఈమె డబ్బుకు అమ్ముడుబోయిన స్త్రీ. ఆమె కూతురు భోగిని. దండకాంతమున 'తన్మాత రావించి యుద్యద్గజారూఢ గావించి విఖ్యాతి ప్రమోదించి యిష్టంబు గావించి యొప్పించి' నని చెప్పెను. ఒక సామ్రాజ్య ప్రతినిధియును, ప్రథముడును, గౌరవనీయుడు నగు వ్యక్తి ఒక వేశ్యమాతను గజారూఢురాలి గావించి ప్రఖ్యాతి మోదియించుటయను నంశము నేడొక వింతగ దోచును.

ఈ వారవనితలనే కవులేల నాయికలను జేసిరి ? లేక యింత మంది రాజులను, ఈ వారవనితలేల మోహించిరి? యని యనుమానము కలుగకపోదు. వారవనితా సంబద్ధమైన కుటుంబమునకొక నీతియున్న దనియు, నీమె వంశమిదియని చెప్పుకొనుటయును జరుగదు. కారణము, ఆమె వేశ్య. అట్టివారి వంశ చరిత్ర మిదియని చెప్పుట కేకవియును ముందునకురాడు, ఏ రాజునూరుకోడు. పౌరకాంత మరియెవ్వరైనను

రాజులను వలచి, వలపించి, సముచిత స్థానము నొందినయెడల నామె కొక స్థానము చరిత్రయందు దక్కును. సంతానముగూడ నుండి యుండురు. అట్టిదీ దండకములందలి నాయికలకు చారిత్రక నేపథ్యముతోపాటు, నాయా రాజులవలన కలిగిన సంతానపు ముచ్చట లేమియును గానరావు, లేవు. సంతానమున్నను కవులు చెప్పక యుండి యుందురా ? కథోపయుక్తము కాదని మానియుందురా ?

ఇచట మరియొక విషయము గుర్తెరగవలయును. వలచిన ప్రతివేశ్యను రాజు అనుగ్రహించుటయే జరిగినది. తిరస్కరించుట యను విషయమునకు తావులేదు. కనీసమా వారవనితకు గావలసిన ఐశ్వర్యమును ప్రసాదించి యామె యింటి కామెను పంపించినట్లయినను గానరాదు. వేశ్యమాతను పురవీథులలో నూరేగించి, సత్కరించిన రాజు వేశ్యమాత కూతురుని పట్టమహిషితో సమానముగ గ్రహించుటయు జరుగలేదు.

ఇక దేవకోటికి చెందిన (నాయకులు గల) జాతి దండకములందు నను నాయికలు వేశ్యకుల సంజాతలే. పెదతిరుమలాచార్యుని–శృంగార దండకమునందు మాత్రమే యీ వేశ్యకు స్థానములేదు. 'దిక్కులం బెక్కులై పిక్కటిల్లంగ నుప్పొంగి నానంగనా శ్రేణి గీర్తింపగా నొక్కబింబోష్ఠి యాలించి మోహంబు గీలించి' యని చెప్పియుండెను.

ఈ జాతి దండకముల యందూహించుట కనువుగాని మనస్తత్త్వ మొకటి గోచరించును. నాయిక తల్లి పచ్చి వేశ్య గావున నామె రూపమును వికారముగ వర్ణించినను, ఆమె గుణములను మరింత వక్రముగ సృష్టించినను పట్టించుకొన నావశ్యకత లేదు. ఆమె తన కూతురును 'ప్రౌఢలోకంబులన్ సద్వివేకంబులం బాపి తాపాతిరేకంబులన్ గూర్చుటోగాక, తోరంబులై మధ్యభారంబులై నిర్జితానంగ సాధోపరి స్వర్ణ కుంభంబులై యొప్పు నీ విప్పు వక్షోజ కుంభంబులన్ జూపి

పౌరావళి న్నర్మలీలా కురంగావళిం జేసి నిర్జించి తర్జించుటో గాక' (భోగినీ దండకము) యని కూతురికి నచ్చజెప్పచుండును.

"...మా చేతికి పోతురాజైన భీతిల్లు! మా వొట్టుకే పుట్టుల మైనైన యిట్టిట్టను జాలదె! పట్టి! వట్టి వల్పుల్ మదిం బుట్టునె? యిట్లు నానాటికిన్ నవ్వలెల్ తొళ్ళు వేళాడగా, గాళ్ళుదూలాడగా, గూను కన్పింపగా, ముద్దు చెక్కిళ్ళు సుక్కిళ్ళుపొంగా, గూసైన కాసైన దానిత్తురా? వత్తురా?..." అని వెంకటపతిరాయల దండకమున వారవనితకు తల్లి బుద్ధి గరపుచూ చేయు జ్ఞానోపదేశమిది.

"...మంచి విత్తంబుపార్జించ రాదాయె బంగారపుం గిండ్లు శృంగారపుం జెండ్లు మేల్ జక్కవల్ బల్నిక్కు చన్గుబ్బలం జూపి మోహంబు పుట్టింపరాదాయె..." పద్మినీ దండకమునకు,

"...యా ప్రొద్దునన్ బైకముల్ తెమ్ము తెమ్మంచు నా రొక్కమెల్లన్ తగన్ దక్కగా జూతురే జూచి దర్వేశిగా జేతురె జేసి వేరొక్కనిన్ జేరగా జూతురె..."అని శాహరాజ దండకమున నిటు వంటి ఉపదేశము లెన్నియో యున్నవి. కూతురికి ప్రత్యక్షముగ బుద్ధిగరపుచున్నను, పరోక్షముగ రాజునకు భార్యగాబోవు వనిత కుటుంబ గౌరవమును తెలుపుచున్నది యగును. అట్లే నాయిక అంగాంగములను పచ్చి శృంగార సహితముగ వర్ణించుటకు రాజు కుతూహల పడెనా? లేక రాజునకును కవికిని గల సన్నిహిత సంబంధమును తెలియపరచునా?

పిండితార్థమేమనగ రాజుయొక్క గుణములను వర్ణించుట ప్రధానము. దానికొక యితివృత్తమును గల్పించి మరింత యెక్కువగ రాజుయొక్క యశోగానమునకు కవులు పూనుకొనిరి. వీని వలన కవులు తమ రచనా సామర్థ్యమును చాటుకొనియుండిరి. తమ శబ్ద సౌందర్యము జేత చక్కగ వర్ణించి, పదికాలములా రాజును బ్రతికించి యుంచుటే అట్టి కవుల ధ్యేయము కాదగును. ***

## అథస్సూచికలు


1. భోగినీ దండకము. మద్రాసు; వేమూరి కృష్ణమశెట్టివారి ప్రచురణ.
2. ,, రాజమండ్రి, గౌతమీ గ్రంథాలయము. డి. నెం. 21049.
3. రేచెర్ల వంశవృక్షము. కవితరంగిణి. సం-5, పు-116
4. కవితరంగిణి. సం-5, పు-115.
5. సమగ్ర ఆంధ్రసాహిత్యం. సం-9, పు-257.
6. బమ్మెరపోతన మహాకవి - సర్వజ్ఞ సింగభూపాలుడు. భారతి, జూన్, 1944
7. ,, ,, ,, ,,
8. కవితరంగిణి. కీ. శే. చాగంటి శేషయ్య. సం-5, పు-116.
9. విజ్ఞాన సర్వస్వము, సం-3, పు-296
10. ఆంధ్ర కవి తరంగిణి, సం-6, పు-201
11. కల్లిండి శాసనము, భారతి, మే-1943
12. ఆంధ్ర వాఙ్మయ చరిత్రము, దండకములు. పు-384
13. 1. పండిత కీర్తనీయుడు, 2. పండిత మాననీయుడు, 3. పండిత నీతి కోవిదుడు.
14. ఆంధ్ర కవితరగిణి, సం-6, పు-206
15. ఆంధ్ర వాఙ్మయచరిత్రము, దండకములు. 383
16. వెలుగోటివారి వంశ చరిత్రము, పు-6
17. శృంగార దండకము, వ్రాత ప్రతి డి. నెం 142/20. కాకినాడ; ఆంధ్రసాహిత్య పరిషత్తు.

18. తాళ్ళపాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు, దండక ములు, పు-384

19. " " " "

20. కేటలాగు వాల్యూమ్ నెం. 1, డి-425

21. కేటలాగు వాల్యూమ్ నెం. 1, గ్ర. సం. డి-426

22. బి. వైద్యనాథయ్యగారి చేతను, పి. సి. రాఘవులుగారి చేతను, 1901 సంవత్సరమున ప్రకటింపబడినది, మద్రాసు.

23. విద్యావతీ దండకము. సంపా; (శ్రీ) నిడదవోలు వెంకటరావు, పు. 88-102, **First bulletin of oriental manuscript library, Madrass; 1948.**

24. అసమగ్ర తాళపత్రప్రతి అముద్రితము. కాకినాడ; ఆంధ్ర సాహిత్య పరిషత్తు, గ్ర. సం. 67

25. చంద్రాననా దండకము. వ్రాతప్రతి. డి. నెం. 25/20. కాకినాడ; ఆంధ్రసాహిత్య పరిషత్తు,

సాహిత్యపరిషత్తునందు తాళపత్రప్రతి యొకటియు, కాగితపు వ్రాతప్రతి యొకటియు గలవు నుదురుపాటి వేంకన విరచితముగా కాగితపు ప్రతిపై పేర్కొనబడగా, రక్తాక్షి సంవత్సరము (1924) సం. 13, ఆంధ్రపరిషత్పత్రికయందు ఈ దండకమును గూర్చి వ్రా యుచూ, నుదురుపాటి సాంబకవి విరచితముగా పేర్కొనబడినది. అనగా చర్చనీయాంశమగు దండకము 1924 పరిషత్పత్రిక యందును, ప్రస్తుతము పొందుపరచబడియున్న వ్రాతప్రతి, తాళపత్రప్రతి యంద లిదియును ఒక్కటియే.

1934 సంవత్సరపు పరిషత్పత్రికయందు నీదండకమును గూర్చి తెలుపుచూ 'నుదురుపాటి సాంబకవి రచితము. ఈ సాంబకవి యాంధ్ర భాషార్ణవ కర్తయగు వేంకటకవి పుత్రుడు. తొండమాన్ నృపాలుర

యాస్థానములోని కవియితడు. ఆ సంస్థానములోని తన ప్రభువుపై జెప్పినదే యీ దండకము. కారణమేమో యెక్కడ జదివినను రాజు పేరు, వంశము వచ్చిన తావున నెల్ల జోటు విడిచిపెట్టినాడు గాని వ్రాయలేదు. కాబట్టి వారి పేరులు తెలియరావు.' అని వ్రాయబడినది.

దండకభాగమును గొంత యుటంకించుచు దండకాంతమున సాంబకవి రచితముగనే పేర్కొనబడినది.

"యొప్పు...క్షితీంద్రు పేరన్ స్ఫురన్నిత్య సామ్రాజ్య సత్పుత్ర సంతాన సంపత్తులంబొంద నుద్దండ విద్వత్కవిత్వాంకనుండైన శ్రీ సాంబనామాభిఖ్య విద్వత్కవీంద్రుండు కైసేయు చంద్రాననాంకంబగున్ దండకంబుర్వి నాచంద్ర మస్తార మిత్రంబుగా వర్ధిలున్"

ప్రస్తుతము పొందుపర చబడియున్న వ్రాతప్రతియందు దండక భాగమీ క్రిందివిధముగ నున్నది.

"సద్గర్భ వారాశి రాకానిశాకాంతు నాథుడై సద్యశఃకాంతుడై యొప్పు శ్రీమన్మహా రాజరాజేశ్వరుండైన శ్రీరామచంద్ర క్షమాధీశు పేరన్ స్ఫురన్నిత్య సామ్రాజ్య సంపత్తులింపొంద నుద్దండ విద్వత్కవిత్వాంకనుండైన శ్రీ వెంకనాభిఖ్య ధీరేంద్ర పౌత్రుండు శ్రీ మాతృభూతాఖ్య ధీమంతు పుత్రుండు శ్రీమచ్చిదాకార విద్వత్కవీంద్రుండు కైజేయు చంద్రాననాంకంబగున్ దండకంబుర్వి నా చంద్ర మస్తార కాంభోజ మిత్రంబుగా వర్ధిలున్"

**1924** సంవత్సరము పరిషత్పత్రిక యందు రాజుపేరు వంశము పేరు నుటంకింపబడ ఖాళీలు వదలిపెట్టబడినవని పేర్కొనబడినది. అది సరిగాదు. వ్రాతప్రతియందు ఉటంకింపబడియున్నవి. ఇది వ్రాతప్రతి గాని తాళపత్ర ప్రతిగాదు. కనుక వ్రాయసకాడేమైనను వీటిని పూరించెనని భావించిన కవిపేరు మార్చ నవసరము కానరాదు. అట్లని

రెండు దండకములును వేరని తలచుటకు వీలులేదు, ఇది వేంకనార్య విరచిత మంతకంటెను గాదు. దీనినే చంద్రరేఖా దండకమని కూడ పిలుచుట కద్దు.

26. పద్మినీ దండకము. అముద్రితము. వ్రాతప్రతి డి. నెం. 262/20 కాకినాడ; ఆంధ్రసాహిత్యపరిషత్తు.

27. ఈ భీమేశ్వర దండకము శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారిచే సేకరించబడినది.

భీమేశ్వరపురాణము. పీఠిక, పు-57 రాజమండ్రి; సరస్వతీ పవర్ ప్రెస్, ప్ర. ము. 1958.

28. తెలుగునాడు అను ఆంధ్రవీధిలో బ్రాహ్మణప్రశంస. మొదటి భాగం. మహాకవి దాసు శ్రీరాములు పు-17

# 6

# వర్ణనలు - అలంకారములు - లోకోక్తులు

## 6-1. వర్ణనలు :

వర్ణ స్తుతౌ అని వర్ణన శబ్దమున కర్థము. అనగా కొనియాడుట అని చెప్పవలెను. తాను కావ్యమున గ్రహించిన యేవస్తువునైనను లేదా వ్యక్తులనైనను బాహ్యాభ్యంత రాకారములను వాని గుణగణాదులను కొనియాడును. కొనియాడుటయందు నాతని దృష్టిలో ఉత్పన్నములైన భావములను ఛందోమయ శబ్దజాలముచే అందముగ, పొందికగ, హృదయాహ్లాదకరముగ నిబంధించును.

కవి నిరంకుశుడు. వాస్తవికతకే తావుండనవసరములేదు. అట్లని వాస్తవికముగ చిత్రీకరింపకూడదని గాదు. ఆనందజనక ప్రధానమైన కావ్యవస్తువును అనంత విధములుగ చిత్రీకరించును. అది సత్యాసత్య సమ్మిళితమై యుండనగును.

సాధారణముగ ఒక కథా వస్తువును గ్రహించి దానినొక రమ్యమైన ఆకృతిలో మలచుటకు వర్ణన ప్రధాన సాధనభూతమైనది. కానిచో ఆ కథా వస్తువునకు రోచకత్వము. కవితకు సంపూర్ణత్వము సిద్ధించదు. కేవలము వ్రితకథవలె కథనిచెప్పుకొని పోవలసి యుండును.

'కావ్యం యశసే అర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే
సద్యఃపర నిర్వృతయే కాంతాసమ్మితతయోపదేశయుజే' అను మమ్మటోక్తి వలన కావ్యముయొక్క బహుముఖ ప్రయోజనము అవగతమగును.

కవి తాను చెప్పదలచిన కథా వస్తువున ప్రకృతియందలి నదులుగాని, పర్వతములుగాని, ఉద్యానవనములుగాని మరియేదైయెది

నను చేతనాచేతన వస్తుజాతము గావచ్చును. వానినన్నిటిని వర్ణించుట వలన సంపూర్ణమైన చిత్రప్రదర్శనము శ్రోత్రగోచరముగా హృదయ వేద్యము గావించును. అందు నాయికా నాయకుల చేష్టలు, వారి వారి మనస్తత్త్వములు, భావ విభావాదులు మొదలగున వన్నియును కవి వర్ణించి చెప్పుట వలననే కావ్యము ఆనందజనకమగుచున్నది. అట్టి కావ్యమునందుపయుక్తములగు వర్ణనలను పెక్కింటిని అలంకారికులు లక్ష్య లక్షణ ప్రదర్శన పూర్వకముగ క్రోడీకరించి యుండిరి.

కావ్యమున అష్టాదశ వర్ణనలు ఉండవలెనని తెలుగున మొట్ట మొదటి సారిగ చెప్పినవాడు నన్నెచోడుడు. తదుపరి విన్నకోట పెద్ద నాదులును జెప్పిరి. అప్పకవి తన అప్పకవీయమున –

సీ. "పురమును ఋతుషట్కమును ప్రయాణంబును
 శైలంబు వేటయు సాగరంబు
మాసీంద్ర పుణ్యాశ్రమంబును మంత్రంబు
 దూత్యంబు పిదప నద్భుత రణంబు
విజయంబు మద్యపానజ వికారంబును
 వన విహారంబును వారికేళి
కన్యాంగ సౌందర్య కథనంబు హిమకరా
 భ్యుదయంబు విప్రలంభోదితంబు
తే. పద్మమిత్రోదయంబును బరిణయంబు
సురతమును దౌహృదంబును సుతజననము
ననగ నిరువది రెండు వర్ణనలు గూర్చి
చెప్పవలయు ప్రబంధంబు శ్రీనివాస"

ప్రథమాశ్వాసము - 28

అని యిరువదిరెండు వర్ణనలుండవలెనని తెలిపియుండెను. పదు నారవ శతాబ్దము నందలి 'రామరాజభూషణుడు' తన కావ్యాలంకార సంగ్రహమున –

కం. "పురసింధు నగర్త్వ్రిన శశి
సరసీ వన మధు రతి ప్రసంగ విరహముల్
పరిణయ తనయోదయ నయ
విరచన యాత్రాజి దాత్య విభువర్ణనముల్"

ద్వితీయాశ్వాసము - 166

అనియు పుర, సముద్ర, శైల, ఋతు, సూర్యోదయ, చంద్రోదయ, సరఃక్రీడా, వనక్రీడా, వసంత, రతిప్రసంగ, విరహ, పరిణయ, పుత్రోదయ, నయవిరచన, దండయాత్రా, యుద్ధ, దాత్య, ప్రభు అను పదునెనిమిది వర్ణనలనే జెప్పియుండెను.

సంస్కృతమున దండి మొదలగు అలంకారికులు పేర్కొనిన పదునెనిమిది వర్ణనలనే తెలుగు లాక్షణికులును పేర్కొనియుండిరి.

కావ్యమునందలి వర్ణనల విషయమున లాక్షణికులలో నియత సంఖ్య లేదు. ప్రతి సూక్ష్మాంశమును, లేశములను పరిశీలించి మరి కొన్ని వర్ణనలు పేర్కొనుట యేమంత యసాధ్యముగాదు. వీరు చూపిన లక్షణములన్నియు లేదా వర్ణన లన్నియు కలిగినగాని యది కావ్యము కాజాలదని చెప్పుట సరిగాదు. ఈ వర్ణనల గూర్చి రామరాజభూషణుడు తన కావ్యాలంకార సంగ్రహమున –

గీ. "ఇందు నొక కొన్ని కడమైన నెంచిచూడ
నదియు నవని మహాకావ్య మనగ బరగు"

ద్వితీయాశ్వాసము - 167

అని తన యామోదముద్రను తెలిపియుండెను, కావున పదునెనిమిది వర్ణనలు అచ్చుబోసినట్లుండ నవసరములేదు. 'రమణీయార్థః ప్రతిపాదకశబ్దః కావ్యమ్' అనికదా! కావ్యనిర్వచనము.

పదునెనిమిది లేదా ఇరువదిరెండు వర్ణనలు కలిగిన కావ్యములకును దండకమునకును పోలిక పెట్టుట యసాధ్యము. కథా సూత్ర

మున కంకితమై, వివిధ పాత్రల ప్రవేశమున కర్హమై, ఆశ్వాసములుగ విభజించుట కనువైనదై, వివిధ వృత్తములను వినియోగించుచు వర్ణనలు చేయుటకు వీలుగలిగినది కావ్యరచన. తొలినుండి తుదవరకు నొకేగణము నాశ్రయించుకొని యొక చరణముల గాని కొనసాగెడి తత్త్వము కలిగినదీ దండకరచన. ఆశ్వాస విభాగము చేయుట కనువైనది గాదు. సూత్రబద్ధమైన యితివృత్తమున్నను, ఇతివృత్తమునకు అంగభూతములైన వర్ణనలు, ఎందరో వ్యక్తుల సంభాషణములు నొకే చరణమున నొకే గణముతో రచింపవలసి యున్నది. ఇది కష్టసాధ్యమైనది. పాద సంఖ్యను బెంచి దండక చ్ఛందముననే రచించినను, దాన విసుగు జనించును. కారణము, ఇందు గణము ఒక్కటియే వినియోగింపబడుచున్నది. మాత్రాశ్రిత గణములయిన కొంతవరకు పఠిత సహనమునకు భంగము కలుగక పోవచ్చును. కావున దండకమునందు వివిధ గణములను ప్రయోగించెడి సౌకర్యము లేదు. కలుగోడు అశ్వత్థరావుగారి దండక రామాయణము ఆరు కాండములుగ విభజంపబడినది. అట్టియెడ దండక చ్ఛందమున ఆశ్వాస విభాగము చేయుచు కావ్యరచన చేయవచ్చును. చేయరాదని నియమము లేదు. కాని మరియే కవియును నిటువంటి పద్ధతిని అనుసరించి దండకరచన యొనరించియుండలేదు. కావున దండకమున అన్య కావ్యప్రక్రియల మాదిరిగ పఠితను సంతృప్తిపరచునటులు వర్ణనలు కూర్చుట కవికి మిక్కిలి కష్టసాధ్యము.

దండక రచన పైన పేర్కొనిన విధముగా గాక పాఠకుని మనస్సును వేగముగ నడిపించుకొని బోవును. ఆ నడకయందు నొక విరామ స్థానముగాని, చరణము అంతమగుటగాని జరుగదు. చరణము అంతమయినను ఒకే గణముతో కుదుపుచు, పఠిత మనస్సును కదుపుచు నడచును. కావున అఖండమైన యితివృత్తము దండకమున నడచుట కష్టము.

భోగినీ దండకము వంటి దండకములు రెండు మూడు పాత్రల ప్రవేశము, వారి వారి సంభాషణములు కలిగియున్నను అవి కవి సార ధ్యమున గాని కొనసాగవు.

కాని సంస్కృత సాహిత్యమున కంటె తెలుగున దండకములు పలుతావుల స్వాతంత్ర్యము కలిగియున్నవి. హిందీ సాహిత్యమున గూడ కేవల వర్ణన పరముగ దండక వృత్తము వినియోగింపబడినది. అట్లే తెలుగునను దండకములందు వర్ణనలు చేయబడినవి.

తెలుగున దండకములు భగవద్భక్తి పరముగ, భగవత్స్వరూప వర్ణనకు, తత్త్వ ప్రదర్శనమునకు నధికముగ వినియోగింపబడినవి. కొందరు కవులు ప్రకృతి వర్ణనంకును నివిని వినియోగించియుండిరి. అష్టాదశ వర్ణనలు నొకేదండకమున కనిపించనప్పటికిని, యించు మించుగ నావర్ణన లన్నియును తెలుగు కవులు దండకములందు ఏదో ఒకచోట చేసియే యుండిరి.

అట్టి యీ వర్ణనలను అలౌకిక, ప్రకృతి వర్ణనలుగ విభజింప వచ్చును. మరలనీ అలౌకిక వర్ణనలను స్త్రీ, పుం స్వరూపముల నాధారముగ రెండు విధములుగ విభజింపవచ్చును. ఈ అలౌకిక వర్ణనలు భగవత్పరములుకాగా, ప్రకృతి వర్ణనలు నదీనద పర్వత ములు మొదలగునవి నాయికా నాయకులకు సంబంధించిన మానవపర మైనవి. ఈ వర్ణనలు స్వరూప స్వభావములనూ పరిశీలింతము.

## 6-1-1. అలౌకిక వర్ణనలు :

వైదిక వాఙ్మయమున వివిధ దేవతామూర్తుల వర్ణనలున్నవి. ఇవి స్తుతిపరములై, ఉపాసనా తత్త్వము కలిగి వారి వారి స్వరూప, స్వభావములను వర్ణించును. దండకమున గూడ నీ స్వభావము కొంత వరకు మన్నది. ప్రచురముగ దండకము భగవదుపాసనకు అనువై

నది. సమస్త దేవతామూర్తుల ప్రకృతులను వర్ణించునట్టిది. స్తుతి పూర్వకమైనది.

## 6-1-1-1. పుం రూపాత్మకములు :

తెలుగున దండకము పరమశివుని కొనియాడుటతో ప్రారంభమైనది. ఇది జటిలత్వము లేని, పటుత్వము కలిగిన శబ్దజాలము కలది. పరమశివుని వర్ణించిన దండకములు తెలుగు సాహిత్యమున అసంఖ్యాకములు. ఇవి నన్నయతో ప్రారంభమై నేటిదనుక కొనసాగుచునే యున్నవి. గ్రంథాంతర్గతముగను, స్వతంత్ర రూపముగను గూడ దండకములు ప్రప్రథమముగ శివపరముగనే వెలసినవి.

ఉదా :- 'శ్రీకంఠ, లోకేశ, సంహారకారీ, మురారిప్రియా, చంద్రధారీ, దక్షాధ్వర ధ్వంసకా, శర్వ, సర్వజ్ఞ, గంగాధరా' మొదలగు విశేషణములతో గొనియాడినట్టిది.

ఆంధ్రమహాభారతము-అరణ్య పర్వము, 1-324

లింగాకృతి దాల్చిన పరమశివుని ఇరువదియారు విధములుగ శ్రీనాథుడు వర్ణించెను.

ఉదా :- 'శివలింగ, జ్యోతిర్మహాలింగ, శ్రీమహాలింగ, వేదత్రయీలింగ' ఇత్యాదిగను బీజాక్షర యుక్తముగను గూడ (ఐంలింగ, ఈంలింగ, ఓంలింగ) వర్ణించి యుండెను. హరవిలాసము, 5-62

ధూర్జటికవి కవి తన కాళహస్తీశ్వర మాహాత్మ్యమున పరమేశ్వర స్వరూపమును క్లుప్తముగ నిట్లు చిత్రీకరించెను.

ఉదా :- 'శ్రీమన్మహాదేవ! దేవాదిదేవా! నిమగ్నీకృతాజాండ భాండ ప్రభాండ ప్రకాశా! మహేశా! మహాయోగి పుంయోగ నిద్రా సమున్నిద్రితానందరూపా! భవార్ణో నిధానాంతరాపన్న రత్నాంతరీశా! జగద్దీప! నిర్లేప! బ్రహ్మాండపిండాండ బాహ్యాంత

రాశింబులం బూర్ణమై సూక్ష్మ సూక్ష్మార్థమై స్వార్థమై యున్న నిన్నున్' 1–146

అట్టిదే -

ఉదా :– 'ధర్మ సంరక్షణార్థంబు కైలాసవాసుండవై జటాజూట ధారుండవై విభూతి ధరియించి త్రైలోక్య సంచారమున్ జేయుచున్ ప్రేమతో భక్తులన్ బ్రోచుచున్... దుష్టులన్ శిక్షించుచున్ లోకాంత రంగుండవైనట్టి ఓ సాంబమూర్తి నీ మహిమ నీ కీర్తు లెన్నంగ బ్రహ్మేంద్రాదులకునైన శక్యంబులవునే...'

పేరూరు కూర్మయ్య-శివదండకము.

ఆధునికులలో శివదండకములను రచించిన వారిలో శ్రీ తమ్మన వెంకటేశ్వరరావు గారొకరు. వీరు శివుని అనంతవిధములుగ నభివర్ణించిరి.

ఉదా :– '...గీర్వాణులున్ పూర్వగీర్వాణులున్ గర్వదుర్వారులై క్షీరవారాన్నిధిన్ మందరాద్రిన్ మధింపన్ సముద్భూతమానాదిలక్ష్మీ మహాదేవి వయ్యాది నారాయణస్వామి కిప్పించి యైరావతంబున్ చతుర్దంతిరాజంబు నుచ్చైశ్శ్రవంబన్న యశ్వోత్తమం బప్సరః కన్యకారత్న సంఘంబు చింతామణీకల్ప భూరుణ్మహా కామధేన్వాద్యమూల్య ప్రియోదార వస్తూత్కరంబున్ పులోమాత్మజాచిత్త పద్మ భ్రమద్భృంగ రాణ్మౌళి పాల్జేసి, శుంభచ్చిరంజీవితేచ్ఛా మహాకామనాసిద్ధి సంధాయకంబౌ సుధాపూరమున్ సర్వదేవావళీ హస్త సంప్రాప్తముం జేసి కల్పాంత్యకానల జ్వాలద్విస్ఫులింగార్చి రాశింబునై శ్వానరోచ్చండమై దుర్నిరీక్ష్యశ్రీ భాసమానంబుగా బ్రహ్మాండ భాండ ప్రకాండంబు భస్మీకరింపన్ విజృంభించు నక్కాలకూటాంక హాలాహాలజ్వాల సంఘాతమున్ పక్వమాకంద సారామృతాసార నీరంధ్ర ధారా ప్రవాహంబుగా గ్రోలి తృప్తుండవై –

స్వీయ మాయారజః స్వీకృతిన్ బ్రహ్మవై నేరి కర్మంబులన్ వారు భోగించి నిష్కర్ములై ముక్తి చూరంగొనన్ వీలుగా సృష్టి కార్యక్రమంబున్ యథాకర్మ నిర్దిష్ట మార్గంబునన్ పక్షపాతంబు లేకుండ సాగించినావేగదా !

సత్వముంబూని విష్ణుండవై సర్వలోకస్థితి ప్రార్థనీయ వ్యవస్థా ప్రతిష్ఠాపనాచార్యుండ వైతే కదా !

కాలవశ్యంబులౌ లోక సంఘంబులన్ క్షీణతం బొందయున్ తమః స్వీకృతిన్ రుద్రదేవుండవై నీవె కల్పాంత సంహార కార్య క్రమంబ ప్రతి ద్వంద్వ భూరిప్రతాపాతి ఘోరంబుగా చక్కబెట్టంగ లంఘించినావే గదా !

వివేకింప నీ జాగరూకత్వమే సృష్టి. నీ స్వప్నమే నష్టి. నీ వాక్కె మంత్రంబు, నీ మౌనమే సత్తపోనిష్ఠ, నీ శ్వాస వేదంబు, కరాళించు నీ హుంకృతుల్ నిష్ఫలం గ్రక్కు నిర్ఘాతముల్, నీదు పాదంబు పాతాళలోకంబు, నీ మధ్య మర్త్యతలంబింక నీ మూర్ధమే సత్యలోకంబు, నీ కేశపాశంబె యాకాశధామంబు, నీ రోమముల్ వృక్షముల్, నీదు కాఠిన్యమే శైలముల్, నీ మృదుత్వంబె కూలంకషల్, నీదు కన్రెప్పపాటుల్ గణింపంగ మన్వంతరంబుల్, విభాగింప నీ వామ పార్శ్వంబు స్త్రీతత్త్వ సంపత్తి, నీ దక్షిణాంగంబు పుంభావ విస్ఫూర్తి, నీ కూచరాగంబె సంగీత శాస్త్రంబు, నీ పాద విన్యాసమే నాట్య శాస్త్రంబు, నీ వాద చాతుర్యమే తర్కశాస్త్రంబు, నీ నామమే శబ్ద శాస్త్రంబు, నీ నైజమే తత్త్వశాస్త్రంబు, నీ తీర్పె ధర్మంబు, నీ యోర్పె యర్థంబు, నీ కూర్పె కామంబు, నీ చేర్పె మోక్షంబిటుల్ సర్వమున్ నీవె సర్వేశ్వరా...'

తానొక్కడైనను భక్తుల కోరికల మేరకు, సత్వరజస్తమోగుణ ములతో నొప్పు పరమేశ్వర తత్త్వము నిరూపింపబడినది. పరమేశ్వర

వర్ణన ఆనంద పారవశ్యముతో అమృతాయమానముగా చేయబడినది. సృష్టియందలి సమస్త ప్రకృతి భగవత్స్వరూపముగ నభివర్ణితమైనది. శివస్వరూప మనంత విధములుగ వర్ణింపబడినది.

తెలుగున దండకములలో నించుమించు విష్ణుమూర్తికి సంబంధించినవే అధికము. తెలుగు దండక సాహిత్యమున నృసింహావతార పరముగ ఎఱ్ఱన తొలి దండకమును రచించియుండెను.

ఉదా :- 'శ్రీనాథనాథా జగన్నాథ నమ్రైకరక్షా సమక్షా సరోజాక్ష సర్వాభివంద్యా మహానంద గోవింద ... నీ తత్త్వ మాద్యంబ నాద్యంత మత్యంత మక్షోభ మక్షీబ మక్షీణ మక్లీబ మక్లేశ మవ్యాజ మాజేయ నిర్వ్యార సర్వస్వ మూలం బమూలంబును న్మూల మామూల మాన స్వతంత్రీ భవల్లోక శోకంబ వేలం బకాలంబు కర్మంబు నిస్సీమ శర్మంబు నిర్మాయ ధర్మంబు నిష్పంక లేశంబు నిశ్శంక రూపంబు నిశ్శ్రేయ సప్రీత్యయోద్భాతి హేతుత్వసిద్ధంబు సిద్ధాంత సిద్ధార్థ సంపాద మిట్లుండగా నేని నానానుమానాది బంధాత్ములున్ బుద్ధి నైర్మల్య కళ్యాణముం బొందకున్నారు' 5-10

ఎఱ్ఱన నృసింహావతార తత్త్వమును వర్ణించగా, పోతన శ్రీకృష్ణ తత్త్వముతోపాటు స్వరూపమునుగూడ నభివర్ణించియుండెను.

ఉదా :- 'శ్రీమానినీ మానచోరా! శుభకార! వీరా! జగద్ధేతు హేతుప్రకారా! సమస్తంబు నస్తంగతంబై మహాలోల కల్లోల మాలాకులాభీల పాథోనిధింగూలగా బాలకేళీగతిం దేవ నారాయణాఖ్యం బటుఖ్యాతి నీ నాభి కంజంబులోకపుంజంబులం బన్న విన్నాణియైనున్న యా బమ్మ యుత్పన్నుడయ్యెంగదా!... చెల్లన్ విచారింప వారెంతవారెంతవారైన మాయాదులున్ మాయతోగూడి గ్రీడించు... ఘటాంతర్గతాకాశముల్ తద్ఘటాంతంబునం దేకమౌ రేఖ లోకావధిన్ వీక నేపోకలంబోవ యేకాకివై యుండు దీశా! కృశానుండు

నెమ్మోమ్ము, సోముండు భానుండు కన్నుల్, దిశల్ కర్ణముల్, భూమి పాదంబు, లంభోనిధుల్ గుక్షి, శల్యంబు లద్రుల్, లతాసాలముల్ రోమముల్, గాలి ప్రాణంబు, బాహుల్ సురేంద్రుల్, ఘనంబుల్ కచ్చంబు ల్నభోవీధి నాభి ప్రదేశంబు రేలున్ బగళ్లున్ నిమేషంబు లంభోజ గర్భుండు శేఫంబు. వర్షంబు వీర్యంబు నాకంబు మూర్ధంబును న్నేకమై యున్న నీమేని దండన్ బయోజాత గర్భాండముల్... శాఖా ఫలాపూరితానంత జంతు ప్రకారంబుగా నిండియుండున్ మహారూప'

దశమస్కంధము–30

సమస్త ప్రపంచము విష్ణుమూర్తి స్వరూపముగా నభివర్ణిత మైనది. ఆధునికులు తమ్మన వెంకటేశ్వరరావుగారు రచించిన దండక మున ఈశ్వర వర్ణన యించుమించు పోతనగారి దండకము ననుసరించి నటులున్నది.

విష్ణుపరమైన దండకము రచించుపట్టున దశావతార వర్ణన తప్పక నుండియుండును. ఈ దశావతార వర్ణన ఎఱ్ఱన నృసింహపురాణములోని దండకము నుండియు కనిపించును.

దశావతార వర్ణన :

"...నీ దివ్య లీలా నికాయంబు లాత్మన్వివేకింపగా నపరిమేయంబు లశ్రాంత యోగీంద్ర హృద్గేయముల్ శక్ర శంభు స్వయంభూ మనోజ్ఞేయముల్ భవ్య దివ్యర్షి వాగ్గేయముల్ క్షీరవారాశికన్యా జనుర్భాగధేయంబు లవ్వాని నే మున్ నుతింపన్ ప్రవర్తింపుటో మహా సాహసిక్యంబు దేవోత్తమా...

1. మత్స్యావతార వర్ణన :- 'సోమకాఖ్యుండు దైతేయ ముఖ్యుండు వాణీ వధూనాథు వచించి ప్రామిన్కు లెల్లన్ బరిమోపించి మున్నీటి పెన్నీటిలో డాగ వానిన్ మహా మత్స్యరూపావతా

రంబునన్ బుట్టి వారాశిలో బట్టి పుచ్ఛంబునన్ గొట్టి యావేదముల్ దెచ్చి యావేధకున్ బ్రీతితో నిచ్చి హెచ్చున్ గటాక్షింపవా'

2. కూర్మావతార వర్ణన :- 'దేవతల్ దేవతారుల్ సుధో త్పాదనార్థంబుగా మందరాగమ్మునన్ వారిరాశిన్ మథించంగ నప్పర్వ తంబబ్ధిలో గ్రుంగినన్ దాని గూర్మావతారంబునుం దాల్చి పై కెత్తవా'

3. వరాహావతార వర్ణన :- 'పాపబుద్ధిన్ హిరణ్యాక్షు డిద్ధా రుణిన్ జాపగా జుట్టి పాతాళలోకంబునం బెట్టి దానిన్ వరాహావతా రంబునన్ మీరి దంష్ట్రాగ్రభాగంబుచే నుబ్బగా నెత్తవా'

4. నరసింహావతార వర్ణన :- 'సర్వమున్ విష్ణుడే యంచు భాషించు ప్రహ్లాదుపై గిన్కవాటించి యిచ్చోట నీవా హరిం జూపు మంచున్ హిరణ్యాక్షు దైత్యానుజుం డుక్కు కంబంబు దాజేత దాటింప పాటించి యందే నృసింహావతారంబునన్ బొల్చి ఘోరార్భ టిన్ నిల్చి యాదైత్యునిన్ ద్రుంచవా'

5. వామనావతార వర్ణన :- 'వామన బ్రహ్మచర్యాకృతిన్ బూని నీవాబలిం జేరి యాదైత్యు చేగోరి పాదత్రయీమాత్ర భూదా నముం బట్టి త్రైవిక్రమాకారముం బూని మింటన్ ధరిత్రిన్ పద ద్వంద్వమున్ నించి శిష్టైకపాదంబు తన్మూర్ధభాగంబుపై నుంచి యద్దైత్యు పాతాళముం జేర్పవా'

6. పరశురామావతార వర్ణన :- 'తండ్రికిం గీడు వాటించు నక్కార్తవీర్యార్జునిన్ జామదగ్న్యుండవై త్రుంచి శోధించి దదాజ వంశావళిం గిన్క ముయ్యేడు మారుల్ కుఠారాగ్రహాటిన్ రణక్షోణి హింసించి తద్రక్తధారావళిన్ సప్త హ్రదంబుల్ ముదంబొప్ప గావించి వాటిన్ బితౄణం బాగిం దీర్పవా'

7. రామావతార వర్ణన :- 'పంక్తికంఠుం డకుంఠ ప్రతా

పంబునన్ వాసవాద్యష్ట దిక్పాలురన్ సిద్ధ సాధ్యాప్సరో యక్ష గంధర్వ విద్యాధర శ్రేణులం బట్టి బాధింప వానిం విదారింప ధాత్రిన్ దశస్యం దనక్షోణిపాలాత్మజుండవై రామనామంబునం బుట్టి సీతాసతిం బెండ్లియై తండ్రి యాజ్ఞప్తి నీరేడు సంవత్సరంబుల్ మహారణ్యవాసంబు గావించి సీతాపహారున్ మహావీరు లంకాపురీవాసు లీలాత్మ సంత్రాసు లోకైక విద్రావణున్ రావణున్ ఖండన క్షోణిలో దుంచి సీతాసమేతంబుగా రాజ్యముం జెందవా'

8. బలరామావతార వర్ణన :- 'ధాత్రి కృష్ణాగ్రజాతుండవై రోహిణేయుండవై బుట్టి లీలం బ్రలంబాది దుష్టాసుర శ్రేణి ఖండింపవా'

9. బుద్ధావతార వర్ణన :- 'త్రైపురేంద్రద్విడర్యుర్వి నాశార్థమై బుద్ధ రూపంబునం దద్వధూ శీలభంగంబు వాటింపవా'

10. కల్క్యవతార వర్ణన :- 'గల్కిరూపంబునన్ మ్లేచ్ఛులన్ మట్టనున్నట్టి మీ దివ్య లీలన్ ప్రశంసింతు మీశా'

ఘటికాచల మాహాత్మ్యము, 2-253

ఇట్లు పుం రూపాత్మకములైన భగవద్వర్ణనలు శివ, విష్ణు పరముగనేగాక, దత్తాత్రేయ, శ్రీరామ, వేంకటేశ్వర, సూర్యనారాయణ, ఆంజనేయ, యమధర్మరాజ, విఘ్నేశ్వర, వీరభద్ర మొదలగు దైవతములపైనను, సాయిబాబా వంటి అవతార మూర్తులపైనను దండకములు విరివిగ పుట్టినవి. ఇందు సూర్యనారాయణ, విఘ్నేశ్వర, ఆంజనేయ దండకము లధికము.

అన్ని దండకములును దైవ స్వరూప, స్వభావములను కొనియాడినవే. పరమేశ్వరుని యద్భుత వృత్తాంతమును వేనోళ్ళ చాటినవే. శివ, కేశవులకు సంబంధించిన దండకముల కంటె, ఆంజనేయాది దైవములపై వెలసిన దండకముల యందు ఇతివృత్తము పాలు ఎక్కువ.

ఇవి అన్నియును అలౌకికములు. ఇట్టి పుం రూపాత్మకముల వలెనే స్త్రీ మూర్త్యాత్మక దండకములును కోకొల్లలు.

## 6-1-1-2. స్త్రీమూర్త్యాత్మకములు :

తెలుగున దండకములలో స్త్రీమూర్త్యాత్మక వర్ణన అనంత రూపములలో సాగినది. మారన - మార్కండేయ పురాణమున జగన్మాత నారాయణీదేవిని స్త్రీమూర్త్యాత్మక విష్ణుశక్తిగా వర్ణించెను. శ్రీనాథుడు - శృంగార నైషధమున సరస్వతీదేవిని అక్షరమయిగ, శబ్దబ్రహ్మముగ నభివర్ణించెను. ఈతని శైలి మంత్రోచ్చారణమును తలపించును.

### సరస్వతీదేవి వర్ణన :

'జయ జయ జనయిత్రి కళ్యాణ సంధాత్రి గాంధర్వ విద్యాకళా కర్ణనాళాం త్రివేదీవళీం సార సాహిత్య నిర్వర్తితపోల్ల సద్భక్తరజ్ఞా మనేకాభిచారక్రియా హోమధూమావళీ మేచకాథర్వణామ్నాయ రోమావళీం కల్పశిక్షాక్షరాకల్ప సాక్షాచ్చరిత్రాం భుజద్వంద్వతా మశ్నువానేన సంభోభితాం ఛన్దసా జాతివృత్త ప్రభేద ప్రభిన్నేన విద్యామయీాం త్వాంభజే'

శృంగార నైషధము 4-138

శ్రీనాథుడు సమస్త కళలు, శాస్త్రములు సరస్వతీదేవి స్వరూపముగ వర్ణించియుండెను. ఇందు భీమభూపతి అభ్యర్థన కొంతవరకు నున్నది. ఇట్లు గాక కీ. శే. వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు తమ 'మదాలసా చరిత్రము'న సరస్వతీదేవిని అక్షరమయిగ, సర్వశక్తి స్వరూపిణిగ నామె మూల తత్త్వమును వర్ణించియుండిరి.

దం. "జయ జయ జగదంబ! త్రైలోక్య సంపూజ్య! మూర్తిత్రయా
రాధిత శ్రీపదాంభోజ! నినుం భజింపంగ వాంఛించి సద్భక్తి
నీ శక్తి గొండాడెదన్ దారువందగ్నికోలెన్ భువిన్ బీలుపుల్
కైవడిన్ బ్రహ్మమున్ లోకమున్ గూడ నీయంద యంతర్గతం

బుల్ చూడ నో దేవి! నీ స్థానమానందు రోంకార వర్ణాత్మకం
బైన మాత్రాత్రయంబున్ స్థిరంబైన సత్త స్థిరంబౌ జగంబుల్
క్రియా వాక్త్రయంబున్ త్రిమూర్తుల్ త్రివిద్యాళి త్రేతాగ్ను
లున్ ముజ్వెలుంగున్ త్రిధాభూత ధర్మాది వర్గంబులున్ ముత్తె
రంగా గుణంబుల్ త్రిదోషంబులున్ ద్రశ్యాశ్రమంబుల్
త్రికాలంబవస్థా త్రయంబున్ బితృశ్రేణి రేలున్ బవళ్ళున్
మొదల్గాగ వెగ్గొందు మాతా! త్రయంబెల్ల నీ రూపమే కాదె
వాణీ! బరబ్రహ్మ భిన్నంబుగా విశ్వమున్ గాంచునవ్వారిలో
నాద్యులౌ బ్రహ్మవాదుల్ త్వదుచ్చారణంబాదియే కాదె
యేదేశ భేదంబులౌ నాహవిస్సోమ సంస్థల్ మఱిన్ బాక
సంస్థల్ సదా చేయుచుండ్రింబరో! తావకంబౌ ననిర్దేశ్యమై
ధర్మమాత్రాశ్రితంబై పరంబై వికారోజ్ఝితంబై క్షయాపేతమై
దివ్యమై నిష్పరిణామమై వెల్గు నీయద్వితీయాకృతిన్ తెల్పగా
నా తరంబౌనె యో దేవి! యాస్యంబుచేగా జిహ్వోష్ఠ తాల్వా
దులన్ గాని పేర్కొ తరంబౌనొకో, యింద్రివస్వబ్జగర్భుల్ రవీం
ద్వాదిక జ్యోతులున్ దానయై విశ్వమున్ దాల్చుచున్ దాననే
నిల్చు విశ్వమున్ బ్రోచుచున్ సాంఖ్య వేదాంత వేదోక్తమై
యాది మధ్యాంత శూన్యంబునై యెన్న నిత్యంబనిత్యంబు
నయ్యున్ సదానిత్యమై జన్మభేదంబుచే నైకమున్ నైత
మయ్యున్ సదా యద్వితీయంబునై యాఖ్య లేకుండియున్ షడ్గు
ణాఖ్యంబునై, తద్గుణ త్రయ్యుపేతంబు నానా మహాశక్తి
మద్వస్తు బృందంబునం దేకశక్తి స్వరూపంబయై ఘోరభేదా
వృతిన్ గాంచియున్ సచ్చిదానందమౌ నీ పరాకార మే వేళ
భావింప మాతా! కళాపూర్ణమున్ నిష్కళంబౌచు నద్వైత
వ్యవస్థంబు కానీ జగంబెల్ల ద్వ్యద్వ్యాప్తమై దీప్తమౌగాదె నిత్యం
బనిత్యంబు స్థూలంబు సూక్ష్మాతి సూక్ష్మంబు భూమాద్యంత

రిత్యాన్య దేశాశ్రియంబౌ పదార్థౌఘమెల్లన్ భవత్సృష్టమే కాదె?
మూర్తం బమూర్తంబుగా దోచుచున్ సర్వభూతంబు:న్ గించి
దేశారి తేకాంతమై సర్వలోకాశ్రియంబైన సంబంధమైన్నంత్వా
దీయ స్వర వ్యంజన శ్రేణిచే గల్గుగా యంచవాఙ్మానసంబైన
నీ వైభవం బెంచి వైవశ్యముంగందు గాకేమి యందున్
దృియామాళి చూడామణీ భూతపాదద్వయీ! వాఙ్మయీ!
శ్రీ పరారూపిణీ తే నమస్తే నమస్తే నమః"

మదాలసా చరిత్రము 188

తెలుగున సరస్వతీదేవిని కొనియాడిన ప్రప్రథమ దండకము శ్రీనాథుని దయిన, తదుపరి శ్రీనాథుని రచన కంటె మిన్నయైనదీ మదాలసా చరిత్రము నందలి దండకము. ఈ దండకము అక్షరమయి మూలతత్త్వమును వెదికిపట్టుకొన్నది. అక్షరమయి నుపాసించువార లకు ఈ దండకము కంటె పఠించదగిన స్తుతి తెలుగు సాహిత్యమున లేదనుటలో అతిశయోక్తి కాదు. సమస్త చరాచర జగత్తు నెరుగుటకు అక్షరమయి ప్రధానము. ఈమె సహాయము లేనిదే సమస్త జగత్తు నకు నాకృతి యిది యని చెప్పజాలము అపారమైన అంతరార్థము గలిగినదీ దండకము. మచ్చునకు గొన్ని యంశములను చూతము.

బ్రహ్మమున్ లోకముల్ గూడ నీ యందంతర్గతంబుల్ : నాశరహితమైన యే పరబ్రహ్మములో ఈ సృష్టి దాగియున్నదో ఆ సర్వము నీవు. కారణము. అక్షర పరబ్రహ్మవు గనుక. ఈ జగత్తంత యును నాశమైనను శాశ్వతమైన పరబ్రహ్మము నీలో దాగియుండును. అక్షరమయి సత్తువంటిది. దేనినీ తాకదు. దేనినీ అంటదు. ప్రతి వస్తువును, సమస్త విశ్వమును తనయందంతర్గతము గావించుకొను చుండును. బ్రహ్మ విష్ణు మాహేశ్వరులయినను సరే ఈ అక్షర బ్రహ్మమునందు అంతర్గతము కావలసినదే.

దారువందగ్నిఁ గోలెన్ భువిన్ బీలువుల్ కైవడిన్: దారువునందు అగ్ని, భూమియందు పరమాణువులు నిగూఢమై యున్నట్లు, అక్షరమయి యందు సర్వము దాగియున్నది.

ఓంకార వర్ణాత్మకంబైన మాత్రాత్రయంబైన జగత్తంతయున్: ఓంకారాక్షర సంస్థితమగు యీ చరాచర ప్రపంచ మంతయును మాత్రాత్రయి నిష్ఠమై ఆమెయందే యున్నది. సమస్తమునకును నీవే మూలము.

త్రిమూర్తుల్, త్రివిద్యాళి, త్రేతాగ్నులున్, మువ్వేలుంగుల్, త్రిధాభూత ధర్మాది వర్గంబులున్ ముత్తెరంగౌ గుణంబుల్ త్రిదోషంబులున్ ద్రాశ్ర్యమంబుల్ త్రికాలం బవస్థాత్రయంబున్ బితృశ్రేణి రేలున్ బవళ్ళున్ మొదల్గాగ వెల్గొందు మాత్రాత్రయంబెల్ల! నీ రూపమేకాదె వాణీ:

స్వర్గ మర్త్య పాతాళములను మూడు లోకములును, త్రైవిద్యలనబడు ఋగ్యజుస్సామములను మూడు వేదములును, దక్షిణాగ్ని గార్హపత్య ఆహవనీయములను మూడగ్నులును, చంద్ర సూర్యాగ్ని సంబంధములగు మూడగ్నులును, ధర్మార్థకామములను త్రివర్గములును సత్త్వరజస్తమములనబడు మూడు గుణములును, మంద్ర మధ్య తారములను మూడు శబ్దములును, మలవిక్షేపావరణములను త్రిదోషములును, (పద, వాక్య, అర్థ దోషములును), బ్రహ్మచర్య గార్హపత్య వానప్రస్థ సన్యాసాశ్రమములును, భూత భవిష్య ద్వర్తమానములనబడు మూడు కాలములును, జాగ్రత్స్వప్న సుషుప్తులను మూడు అవస్థలును, పితరులును, అహర్నిశలును అన్నియును మాత్రాత్రయ నిర్దిష్టములును అక్షరమయి రూపములై యున్నవి.

ఓ సరస్వతీదేవీ నీ రూపము ముఖముచేత గాని, జిహ్వా తాలువు ఓష్ఠములు మొదలగు స్థానముల నుండి జనితమైన శబ్దములచే గాని,

వర్ణింప నలవిగానిది. ఇందుౖడు, వసువులు, బ్రహ్మ, సూర్యుడు, చంద్రుడు, అగ్ని మొదలగువారిచేత నిరంతరము ఆరాధించబడునట్టిది నీ దివ్యస్వరూపము.

ఇట్లు సరస్వతీదేవి మహాత్తు అనేక రూపములలో వర్ణింప బడినది. ఇంతకంటె వర్ణించుటకు భావనాశక్తి చాలదు. అక్షరమయిని ఆరాధించు వారల కీదండకము మంత్రపఠనము వంటిది.

ఆధునిక యుగమున వెలసిన దండకములలో గాయత్రీ దండక మొకటి. గాయత్రీ మంత్ర ప్రభావ ప్రచారములను ఇనుమడింప జేసి కొనినది. కర్త యడవివల్లి పూర్ణయ్య సిద్ధాన్తిగారు.

గాయత్రీదేవి వర్ణన :

"తల్లీ జగత్కల్పవల్లీ! చిదానంద వల్లీ! సుధారాగవల్లీమ తల్లీ! త్రివర్ణ స్వరూపా! త్రయీపాద రూపా! త్రిసంధ్యా స్వరూపా! త్రిమూర్త్యాత్మ రూపా! త్రినేత్రా! ప్రసాదింపవే తల్లి; తదూపిణీ! దివ్య చిదూపిణీ! దివ్య భాగూపిణీ! దివ్య సదూపిణీ! వేదవిదూపిణీ! తుల్య భాగ్రూపిణీ! వర్య వాగ్రూపిణీ! పూరకుంభ స్వనదేచ కోద్భాసినీ! నీలవేణీ! యతీంద్రాది హృత్పద్మ సంచారిణీ... నృత్యముం జేయవే -

'సూర్యోదయంబందు బ్రిత్యగ్ర రూపంబుతో రక్త పద్మాసనా రూఢవై రక్త వస్త్రంబులందాల్చి రక్తాంగివై...వచ్చు నీ తేజమున్ గొల్తు'

'మధ్యాహ్న కాలంబులో నీవు శ్వేతాంగివై శ్వేత వస్త్రంబులం దాల్చి శ్వేత పద్మాసనంబందు... నిన్ను సేవింతునోయమ్మ'

'అస్తాద్రి తాకంగ సూర్యుండు నీవంతటన్ కృష్ణవర్ణంబుతో కృష్ణ పద్మాసనారూఢవై... సద్భావ సంపత్తినో తల్లి'

ఇట్లు కర్త గాయత్రీదేవిని త్రిసంధ్యలలో త్రివిధములుగ నభి వర్ణించిరి. గాయత్రీ శబ్దమునందు విశేషార్థములున్నవి. అవి ఏవన -

1. గానము చేయువానిని రక్షించునది.

2. గాయతిచ త్రాయతేచ గాయత్రీ. అనగా ప్రపంచమున అన్యోన్య భేదము తెలియునట్లు వ్యవహారరూపముగ ప్రవర్తించునది. భయమును పోగొట్టి కాపాడునది.

3. గాయాన్ ఇంద్రియాన్ రక్షతీతి గాయత్రీ. అనగా ఇంద్రియముల నుండి భ్రష్టముగాకుండ రక్షించునది.

ఇట్లు గాయత్రి యను పదమునందే భయమునుండి రక్షించునది యను అర్థము యిమిడియున్నది.

కర్త గాయత్రీదేవిని త్రిసంధ్యలలో త్రివిధములుగ వర్ణించుటయేగాక, నక్షత్రమాలా రూపమున నిరువదియేడు విశేషణములతో వర్ణించియుండిరి. ఈ వర్ణనమును చిత్రకారుడు చిత్రింపవలెనేగాని సాక్షాత్తు గాయత్రీదేవి ప్రత్యక్షమయినటు లుంటును. కాని అసాధ్యమేమో. అది ఎట్లన -

1. భాస్వత్కిరీటాం : ప్రకాశించుచున్న కిరీటము గలది.

2. మహాకుండలైర్మండితాం : గొప్పవైన మణికుండలములచే అలంకరింపబడినది.

3. శంఖ చక్రాంకహస్తాం : శంఖము, చక్రము హస్తమునందు ధరించి యుండును.

4. స్ఫురత్కాంతి రూపాం: తేజోవంతముగ ప్రకాశించుచుండును

5. ఉదూఢద్యుతిం : యౌవనాదులతో కూడిన దేహకాంతిని వహించి యుండును.

6. శ్యామలాం: యౌవన మధ్యస్థురాలు. శ్యామవర్ణము కలిగి ఉండును.

7. కోమలాం : కోమలత్వముచే ఒప్పారుచుండును.

8. సుందరీం : రూపలావణ్యములచే నొప్పునది.

9. చంద్రతారాత్మికాం : చంద్రుడు, నక్షత్రములు స్వరూపముగా కలిగినది.

10. నిత్యసత్యాత్మికాం : త్రికాలాబాధితమైన సత్యమే స్వరూపముగా కలిగినది.

11. మోహినీం : మైమరపును కలిగించునది.

12. సర్వ మంత్రాశ్రితాం : సర్వమంత్రములచే ఆశ్రయింపబడినది. సర్వమంత్రములు నాశ్రయించి యున్నటువంటిది. 'నగాయత్ర్యాః పరం మంత్రమ్, నమాతుః పరదైవతమ్' గాయత్రీ మంత్రము సర్వ మంత్రములకు మూలమైనది. గాయత్రీమాత కంటె నితర దైవము లేదని ఆర్యోక్తి.

13. శుద్ధ విద్యాం : కేవల విద్యాస్వరూపిణి.

14. జయాం : జయశీల

15. జ్ఞానరూపాం : జ్ఞానరూపిణి అనగా అజ్ఞానమును తొలగించునది.

16. తమోహారిణీం : తమస్సును హరియించునది.

17. వేద ధాత్రీం : వేదమాత. ఋగ్యజుస్సామ వేదములను ధరించునది.

18. ఉషఃకాలగమ్యాం : ఉషఃకాలమున సేవింపదగినది.

19 ఉదాత్త స్వరూపాం : ఉదాత్తురాలు. స్వరభేదమే రూపముగా కలిగినది.

20. సదా హంసయానాం : ఎల్లప్పుడూ రాజహంసపై చరించునది.

21. అజేశాది వంద్యాం : బ్రహ్మ, ఈశ్వరుడు మొదలగు వారికిని నమస్కరింప దగినది.

22. సుమేధాం దదానాం : మంచి బుద్ధిని ప్రసాదించునది.

23. సుశాంతాం : మిక్కిలి శాంతస్వరూపురాలు.

24. సుకాంతాం : మిక్కిలి మనోజ్ఞురాలు.

25. శుభాం : మంగళ స్వరూపురాలు.

26. నిత్యమైశ్వర్య సౌఖ్యప్రదాం : ఎల్లప్పుడు ఐశ్వర్యమును, సుఖమును ప్రసాదించునది.

27. శాకినీ ఢాకినీ ఘోర భూతాళి విద్రావణీం : శాకిని, ఢాకిని మొదలగు ఘోర భూతములను పారద్రోలునది.

ఇట్లు ఇరువదియేడు విశేషణములతో చిత్రకారునకు, భావుకునకు కూడ అందనంత ప్రతిభావింతముగ, సహజ సుందరముగ జగన్మాత స్వరూపమును కర్త వర్ణించియుండిరి. వేదోచ్చారణమును తలపించెడి రచన. గాయత్రీమంత్ర ప్రభావ నిహితము.

గాయత్రి పుం రూపమునగాని, స్త్రీ రూపమునగాని ఆరాధింపబడుచుండును. కర్త తల్లీ! అను సంబోధనతో స్త్రీ మూర్త్యాత్మకశక్తిగ జగన్మాతగ వర్ణించియుండిరి.

ఇట్లు తెలుగున దండకముల దేవతా వర్ణన మనంతము. వివిధ ఆకృతులలో దేవతామూర్తులు వర్ణింపబడిరి. దండక వృత్తము ప్రచురముగ సమస్త వాఙ్మయమునందు భగవద్వర్ణన, స్తుతులకే అంకితమయినది. ఇంకను స్త్రీ దేవతా పరములైన శ్యామలా, లక్ష్మీ, భ్రమరాంబా ఇత్యాది నామములతో దండకములు వెలసినవి.

దేవతా వర్ణన లీవిధముగ కొనసాగగా, దండకము కాలక్రమమున సమస్త ప్రకృతులకు అనుకూలముగ మలచుట జరిగినది. ఒకే దండకమున అష్టాదశ వర్ణనలు గానరాకున్నను కొన్ని దండకముల ప్రకృతి వర్ణనలు, నాయికా నాయక వర్ణనలు గనిపించుచున్నవి. ఏక ధాటిగ అష్టాదశ వర్ణనలతో కూడిన దండక మేదియు సంస్కృతాంధ్ర

భావములలో గానరాదు. గ్రంథాంతర్గతముగ నక్కడక్కడ కొన్ని తావుల స్తుతి సంప్రదాయము, భగవద్వర్ణనలు వీడి ప్రకృతి పరముగ కొన్ని దండకములు రచింపబడినవి. వానిని గూడ పరిశీలించుదము.

## 6–1–2. ప్రకృతి వర్ణనలు :

ప్రకృతి యను పదము విస్తృతార్థము కలిగినది. సకలచరాచర జగత్తంతయును ప్రకృతి యందంతర్భాగము. అట్లుగాక తెలుగు కావ్యముల యందొనరించు అష్టాదశ వర్ణనలను దృష్టియందిడుకొని యిట పరిమితార్థమున వాడబడినది. తెలుగు కావ్యముల యందలి అష్టాదశ వర్ణనలకు జెందిన పుర వర్ణన మొదలగు వాటిని కొందరు దండకము లందునను చేసియుండిరి. అట్టివానిలో గొన్ని...

## 6–1–2–1. పుర వర్ణన :

విన్నకోట పెద్దన పుర వర్ణన లక్షణమిట్లు చెప్పియుండెను.

కం. దుర్గమ పరిఖావరణ ని
సర్గ బలానీక చతుర చాతుర్వర్ణ్యా
నర్గళ సంపద్వన జల
వర్గ స్తుతి వలయు నగర వర్ణనమునకున్

కావ్యాలంకారచూడామణి. 3–58

దీనికి లక్ష్యము కాదగినదీ దండకము.

దం. "జయ జయ జగతి శీతానిలోద్భూత రంగత్తరంగావళీ రమ్య కాసార కేళీ చరన్మత్త శుండాల శుండోద్ధితాంభః కణాస్వాద నోత్ఫుల్ల సూనాంచితారామ వల్లీ నికుంజా...దుర్గాలయాలంకృతా శేషభూమీధర భ్రాజితాగ్నేయభాగా... పూర్ణాభిషిక్తాంగ విభ్రాజమానాశ్వరింఖా సముద్ధూత ధూళీపరివ్యాప్త దిఙ్మండలా లోహాయంత్రోజ్ఝిత స్వాదునీర ప్రపూర్ణ స్ఫురత్కుంభ భారోచ్ఛలన్మధ్య వక్షోజ వేణీ నితంబాంచి తాంభో

రుహాక్షీ కటాక్షేషు మూర్ఛద్యువపాప్త వాత్రాయన ప్రోన్నత స్ఫీత సౌధాగ్ర సంభాసురా... నానావిధాలోల భూమీజపంక్తి సన్మార్గ పార్శ్వోర్వరుపీథీ మనోజ్ఞా రమావిష్ణు దాంపత్యశోభాయ మాన క్షమాపాల చూడామణి శ్రీమహా చామరాజేంద్ర... స్వర్ణకర్ణాట దేశోత్తమాంగీకృతా రాజధానీ మహీసూర నామ్నా[1]"

మైసూరు (దేశ) ప్రశంసా స్తబకము -
ఆదిభట్ల నారాయణదాసు

## 6-1-2-2. పర్వత వర్ణన :

అష్టాదశ వర్ణనలలో పర్వత వర్ణన మొకటి. ఈ వర్ణన చేయుటలో కొన్ని నియమములను లాక్షణికులు పేర్కొని యుండిరి. విన్నకోట పెద్దన-కావ్యాలంకార చూడామణియందు పర్వత వర్ణనకు అచలత, ఉన్నతము, ఖచర వినోదితము! కనకాది ధాతుయుక్తమై యుండవలెనని తెలిపియుండెను.

కం. అచలతయును నున్నతియును
ఖచర వినోదాచితియును గనకాది ఖనీ
రచయితమును మొదలుగాగల
ప్రచురతలు నుతింపవలయు బర్వతమునకున్ 3-97

మ. చెలువారున్ నవరత్న పాదకటక శ్రీచేత గంధర్వ మం
గళ నాదంబులతోడ నొప్పగు నభంగస్థైర్యవృత్తిన్ మహా
బలునైనం బ్రహసించు భూభరణ శోభందాల్చి మిన్నందుచున్
గులశైలంబుల పెంపు విశ్వవిభుతో గూర్పందగున్ ధీరతన్
3 - 98

తెలుగున చంపూకావ్యముల మిక్కుటముగ కానవచ్చెడిది యున్ను,ఒక నియమముగ పాటించి రచింపబడెడిదియు నీపర్వత వర్ణనము.

ఏదియో నొక వృత్తమును గ్రహింతురు. అట్లే దండక వృత్తము నాధారముగ అద్దంకి గంగాధరకవి పర్వత వర్ణన యొనరించి యుండెను. మలయగిరి వర్ణనాత్మకమైనది.

దం. "చపల నయన యీ చందనాగంబు చందంబు లాశ్చర్యకం దంబు గంధంపు జెట్టె యథః కంధరా సీమలన్ వేమిళద్గంధ సంబంధ బంధంబులై యుండ నాదండ నుద్దండ వేదండ రాట్కర్ణ తాళంబులన్ బాలె మైపాప లేబూప తండంబు పాలిచ్చి పెల్లుగ్గుగా ద్రావ నుద్యద్భుజంగంబు లేకాహతిం గ్రోల దద్భూరి ఫూత్కార వాతోద్గమక్ష్వేల కీలాహతిం గ్రాగి యో నీదు బింబాధరస్యంది ధారామృత స్పర్శనంబంది శైత్యం బునం బొంది మందానిలాంకూరముల్ గందంపు జేరులై చం దనా మంద గంధంబులన్ దిక్కులం బెక్కు చందింబులొందం బచారింపగా జూచితే మేచకాంభోరుహాక్షీ! మహాక్షీణతా హేతుసూనాది వాస్త్యాది సంజాత చేతో ముదంబంది పై భూములం గిన్నరీ కిన్నర ద్వంద్వముల్ కిన్నరుల్ పూని తార స్వరంబెత్తి తాళక్రియల్ హత్తి గీత ప్రబంధంబులన్ మోహ బంధంబుగా బాడుచో మెచ్చి మమ్మా యనంబోలు గొమ్మా భ్రమేతద్వరం బెచ్చనో మచ్చకంటే కనుంగొంటె వాగంటె వాకన్ మయూరంబు తోరంబు పింఛంబు గొంచెంబు గాకుండ సారెం బ్రపంచంబు గావించి నీచారుధమ్మిల్ల బంధంబు దాచూ పరుల్ చూడ్కికిన్ మోహబంధంబులం గంధ సారద్రు సం వేష్టిత వ్యాళబంధంబులన్ లేచి యాచేరువన్ బానాగంబు కంఠంబు నాసాగ్రభాగంబునం గుచ్చి యచ్ఛైఛపదం బెక్కుచో నక్కటా చయ్యనన్ బయ్యెదన్యాయగా నేల రోమావళీ నీకు నా శంకచే గొంకగా నేటికి న్నాటికి న్నీదు ముగ్ధత్వ మున్నాన

వేమందునో మందయానావతంసా రిరంసాభిలాషమ్ములన్ స్మేరు భూభృద్గుహా గేహ సీమమ్ము లందుండి గంధర్వలంభోజ పత్రేక్షణ ల్తారు నంభోదయానాళిపై నెక్కి యేతత్కుభృత్కూట కోటిన్విహారింప నస్మత్ప్రకారమ్మునన్ వచ్చియున్నారు పున్నాగనాథా మహాభాగు లీ కొండపై నుండు భోగుల్జగన్మోహినీ గేహినీ లోకచూడామణీ యీమణీ గహ్వరాంతమ్ము లెంతేని భవ్యమ్ము లిచ్చోట నిచ్చావిహారమ్ముల న్గేలి సల్పందగున్"

పోతన ఆంధ్రమహాభాగవతము నందలి గజేంద్రమోక్ష ఘట్టము నాధారముగా గొని 'పెళ్యూగు శ్రీనివాసరావు' (క్రీ. శ. 20 శ. పూ) గజేంద్రమోక్ష దండకమును రచించిరి. ఇందు కొంతవరకు స్వతంత్రమైన ప్రకృతి వర్ణనము దక్క మిగిలినదంతయును పోతనగారికి అనుకరణమే. ఇందు త్రికూటాద్రివర్ణన చేయజడినది.

ఉదా :- "...మున్నుండె సీధాత్రి శైలంబు దీవ్యత్ త్రికూటాఖ్య జెన్నారుచున్ యోజనవ్యాప్తమై వన్నెచే మిన్నయై భూరి దేదీప్యమాన ప్రభన్—

సాటిలేదంచు దష్ట ల్యాచింపంగ గాసార రాజంబులన్ ఘుమ్ము ఘుమ్మంచు సద్వాసనోపేత పుష్పంబులన్ దాల హింతాల తక్కోల భల్లాత కామ్రాత ఖర్జూర మందార పున్నాగ జంబీర జంబూ ప్రియాశ్వాది భూజంబులన్ సింహ శార్దూల నాగేంద్ర భల్లూక మార్జాల సారంగ సాలావృకోత్తుంగ వన్యంబులన్ గండ భేరుండ హంసాద్యనేకంబులౌ పక్షిజాతంబులన్ నీలవైడూర్య గోమేధికామూల్య రత్నప్రపంచంబునన్ నవ్య సల్లాప సంగీత విద్యాప్రసక్తిన్ సిద్ధగంధర్వ విద్యాధరా ద్యామరానీక సేవ్యంబుపై చూడ భవ్యంబునై యుండె"

ఇందు త్రికూటాఖ్య పర్వతముపై సరస్సులు, వివిధ వృక్షములు, జంతువులు, పక్షులు, స్ఫటికములు, ఖచర వినోదితమునై యొప్పుచున్నది.

### 8.1.2.3. ఋతు వర్ణన :

తెలుగు కావ్యముల వసంత, శరదృతువులను వర్ణించుట సాధారణము. లేదా గ్రీష్మ ఋతు వర్ణన యొనరించుటకూడ కద్దు. అట్లుగాక 'శ్రీ ముత్య సూర్యనారాయణమూర్తి శర్మ తమ 'సకలానందము' కావ్యమున గ్రీష్మాంత వర్ణనమును దండకమున రచించియుండిరి.

ఈ దండకమున గ్రీష్మఋతువు అంతమగుచున్నప్పటి ప్రకృతిని, వర్షఋతువు ప్రారంభమగుచున్నప్పటి ప్రకృతిని మిళితముగావించి గ్రీష్మాంత వర్ణనముగా నభివర్ణించి యుండిరి.

ఉదా :- "గ్రీష్మాన బైవేడిం కిం దాళగాలేక పల్మారు తానాలు సేయన్ సదా నీటిలోనాను వస్త్రంబులం గట్టి నాయాసముం బొంది తాగంగ నాచల్వ యష్టావకాయంచు బండ్లంచు నెన్నేని మార్గాల భక్షించు భాస్వ్రద సాలంపు కాయల్ ప్రసాదించు నుష్ణంబుచే నేమియుం జేయగాలేక బల్ దొంగ చందంబునం దాకి మేఘంబు లాకాశ సంచారముం జేయగానే మహారాత్రిముల్ గోర్కి వర్ధిల్లగా గామ మార్గంబునన్ బోవుటల్ మర్మ మార్గంబునం గల్గు శీతంబు జిహ్వా చాపల్యముం బట్టి యగాకరింబచ్చలిం దోటకూరన్ దినన్ నోటి మార్గంబునం బోవు శీతంబు బిల్లంబొసి యాహార సంపాదనార్థంబు నానా ప్రదేశంబులం డెల్ల సంచారముం జేసి యాయాసముం జెంది తాపంబుచే నీటికై వెండియుం జాల సంచారముం జేయ చాత్రిస్థవకాస్త్రదసంబాత్మ భాస్వత్కర శ్రేణి గారుణ్య చిత్తంబుతో జెట్టు భూశక్తికిన్ సూర్యడత్యంత భక్తిం బలిన్ వేయుచందంబునం దత్ప్ర తాపంబుచే ప్రాణముల్ బాసి యీ భూమిపై గ్రావాలు వ్యాఘ్రాదులౌ జంతు దేహాలపై వ్రాలి తన్మాంసమున్ ముక్కులం దేసి భక్షించుచుం బ్రీతితో గూయుచుం గంతులన్ వైచు గృధ్రాదులౌ పక్షులం జాల

చిత్రంబుగా మ్రింగి నానా విషస్థానముల్ ద్రొక్క బల్ కల్మషంబొంది
నా యేళ్ళ సంబంధమా నీటిపై గాలి శక్తిన్ నివారించు చొక్కాలు
గుళ్ళాయిలున్ లేమిచే రోమకూపంబులం శ్రోత్ర మార్గంబునం జొచ్చు
శీతంబు గ్రొత్తగాంబు గానం బట్టి ఛత్రంబులున్ జెప్పులున్ లేక యే
వానలో రొంపిలో సంచరింపన్ శిరఃపాద మార్గంబునన్ మెల్లగా నెక్కు
శీతంబు... వేడికిం జంకుచుం బుట్టనేయుండి పైనుండు వృక్షంబులూగన్
ధ్వనింబట్టి యేతెంచి యా వేడిగాడ్పు కటంబీల్చి నీ యుగ్రపుం దాళ్ళవా
యమ్మనీ వేడికిం బాలు సేయుంగ ధర్మంబు గాదింక రక్షింప వేయంచు
నానూర్ధ్వ ధ్యానించుచున్నట్లుగా గన్నులన్ మూయుచున్ ద్రావి
సూర్యస్వరూపంబు చేకొన్న చందంబునం గొన్ని ప్రాణంబులం బాయ
శేషంబులై యెప్పుడుం దమ్ము భక్షింపగా జూచునా పక్షిజాతాన కింతే
నియుం జంకకిష్టేనియుం జావగా దప్పదెంచెంచుచున్ మెల్లగా గడ్డిచే
బచ్చనౌ దొడ్లలో జేరి తాపంబుదీరంగ బొర్లాడుచుం జిన్నవౌ
పువ్వులం దించు సంతోషముం బొందుచు నట్టి యాపాములం ద్రొక్కి
యుం బాదులం గల్గు చీకట్లనే దొండఖండించెరా పొట్లకాయంచు
బైకెత్తి యాకాట్లచే నిఁక నెన్నని మార్గంబులన్ నైజకర్మానుసారం
బుగా మానవుల్ పుర్వులే పొంది భక్షింప వృక్షంబులున్ రోగ
జాతంబుచే జంతు పక్ష్యాదులుం మృత్యుబాధం గనం బూరుష
శ్రేష్ఠుడా... నారాయణత్వంబు పెల్గొందగా నీటిలో నిల్చి సర్వౌష
ధుల్ మార్చి వృక్షాదులన్ సృష్టి సేయంగ దేహంబు మాత్రంబు
వైకుంఠ మందుంచి పూర్ణ ప్రభావంబుతో వచ్చి భూలోక వాసంబు
సేయంగనో పాలసంద్రంబులో శేషశయ్యా స్థితిన్ భాస్వదంభోజ
నేత్రుండు కన్మూసెగా బట్టియే సూర్య చంద్రుల్ ఘనచ్ఛన్నులై
రబ్జముల్ హీనకాంతింగనెన్"

సకలానందము. 3-68

6-1-2-4. జలక్రీడ వర్ణన :

విన్నకోట పెద్దన తన కావ్యాలంకార చూడామణి యందు జలక్రీడా వర్ణనమునకు ఈ క్రింది విధమున లక్షణములను తెలిపి యుండెను.

కం. నీరజములు జెంగలువలు
శైరవములు వీచికలును గరయంత్రపయో
ధారల నావర్తంబులు వారి వి
హారముఁదు వర్ణిము లరయన్ 3-117

చం. వళులును వీచికావళులును వారిరుహంబులు వక్త్రపంక్తులున్
చెలువగు నాభులున్ సుడులు జేతులు రక్త సరోరుహంబులున్
జల దలకంబులున్ మధుపజాలము లీడ్వడ గేలిసల్పి మిం
చులుగొను చూడ్కుఁ గన్ సతులు సూతురు విశ్వనృపాల
మన్మథున్ 3-118

విన్నకోట పెద్దన జలక్రీడా వర్ణనమునకు నియమములను చాల విపులముగా తెలిపియుండెను. తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు రచించిన శృంగార దండకమునందలి జలక్రీడా వర్ణనమున పెద్దన తెలిపిన లక్షణములన్నియును గానరావు. సందర్భవశమున పద్మావతీదేవి జల క్రీడావర్ణనమును చేసియుండెనుగాని, సమగ్రమగు రీతిలో వర్ణించుటకు పూనుకొనలేదు. అయినను పద్మావతీదేవి సఖురాండ్రతో సరోవరమున కేగుట, జలక్రీడ సలుపుట, విశ్వనృపాలుడు వేంకటాధీశుడు పద్మావతీదేవి నిచూచుట, యామెయు నాతని జూచుట మొదలగు సంఘటనలనుబట్టి పెదతిరుమలాచార్యులు వ్యంగ్యార్థ ప్రధానముగ నీజలక్రీడా వర్ణనమును చేసియుండెనని భావించవగును.

ఉదా :- '... నీతోటి బాలల్కడుం జూడ గోలన్నినుం భోలరే కాకలం జాలు నీకేల యీ జాలి మాటో నెరిగింపు నీ యింపు

సొంపొందగానంచు నత్తోయజాక్షిన్ జలక్రీడచే గొంత వంచింప నూహించి నేర్పుల్పచారించి చేతో వికాసంబు గావించి యా చక్రి వాక_స్తనిం దోడుకొంచున్మహోద్యానవీథీ లసత్కేళికాసార కాసారముం జేరి యాలోని మీనంబులు న్మీది ఫేవంబులున్ హంసయానంబుల న్నన్నిధానంబునం జూపి భృంగంబులం భాస సంగంబులన్నీర భాగంబుల న్నుపరిసంగంబుగా జెప్పి కోకంబులం గంజనాళంబుల న్నుపరివాళంబులం జాల మేలంబుగా వైచి కూలంబులం గంజనాళంబు లన్నుపరివాళంబులం బుండరీకంబులన్నేక నేకంబుగా జూపి యాలేమకుం దోయకేళీ సమాసక్తి పుట్టించి సోపాన మార్గంబు మెట్టించి యందోలలాడించి యొండొండ జోడించి యాదండ వేదండ యాన్వ్యాడి న్మండలాకారమై యుండి క్రీడింపగా గాంచి యప్పంకజావాసముం గాంచి యున్నట్టి కాంతలీ హరిం జేరి దేవా భవద్దివ్య పద్మాకరాంభోవగాహక్రియాసక్తిమై నొక్క పద్మాక్షి యే తెంచి కాంతా సహస్రంబుతోడ న్విజృంభించి వర్తించుచుం గాంతిమైయున్న'

శృంగార దండకము.

### 6.1.2.5. వన విహార వర్ణన.

కం. చారుతర సంప
త్పూరిత విభవముల వేడ్క పొంగుచు వడగా
నారీజన సహచరుడై
యారామ విహార మొప్ప నధిపతిచేయున్

కావ్యాలంకార చూడామణి. 3-115

సీ. మానినీ గండూష మధువుల బూచిన
పొగడను సోలగొప్ప బొగడి బొగడి
నారీ పదాహతి నిలిచిన కంకేళి
పరువంబు నగ్గించి పలికి పలికి

లలనావలోకనంబుల పుష్పితంబగు
తిలకంబుపై జూడ్కి త్రిప్పి త్రిప్పి
వనితోహాగూహానంబున చేర్చు
సురపొన్న మేలి పుణ్యమునకు మెచ్చి మెచ్చి

తే. మన్మథారామముల పొంత మలసి మలసి
శుక పికాళి విహారంబు చూచి చూచి
సతులు దానును చరింతు వసంతవేళ
ప్రమద వనమున విశ్వభూపాల వరుడు.

కావ్యాలంకార చూడామణి. 3-116

వనవిహార వర్ణనమునకు విన్నకోట పెద్దన తెలిపిన లక్షణమిది. పెదతిరుమలాచార్యుని శృంగార దండకమున వనవిహార వర్ణనమున్నది. ఇందు పద్మావతీదేవి తన సఖురాండ్రతో కలిసి వన విహారము జేయును. ఈ సమయమున విశ్వభూపాలుడు వేంకటాద్రీశుడు పద్మావతీదేవి వెన్నంటిలేడు. వనవిహారమునకు ముందుగనే పద్మావతీదేవి వేంకటేశుడు ఒకరినొకరు కేళీపటమునకు గట్టిన తమ తమ విన్నపములతో ప్రేమ భావములను వ్యక్తీకరించుకొనియుండిరి. పద్మావతీదేవి తన్మయావస్థను బొందినది. ఆమెను మరపించుటకు సఖులు వనవిహారమునకు దీసికొని బోయిరి. ఈ సందర్భమునందలి వర్ణనము వనవిహారమున కుదాహృతి కాగలదు.

ఉదా :– '... సరోజాక్షి తాను విన్నట్టి శ్రీ వేంకటేశుండితండంచు భావించి సేవించి వేవేగ లీలాగతిం గాలినాడించు కేళీపటంబందు నందంబుగా విన్నపంబుల్ దగం గస్తురిన్ వ్రాసి సూత్రంబునం గట్టి యా చక్రి సౌధంబు పాయన్ముదంబార నాడింపగా గాంచి యక్కేశవుండేచి బంగారపుం జిల్కనం జుల్కగా నేర్పునం జేర్పగా జేసి విస్తారహస్తంబునంబట్టి తన్మత్తకాశి న్యురువ్యస్త విన్యస్తసప్రేమ

వాక్యార్థర స్వచ్ఛసంక్తిం దదాసక్తి బారంబు గావించి యచ్చో నిజ ప్రేమల వ్రాసి పుత్తెర నాశారికాలాప తేరంగ దత్స్వాంతమున బట్టి కేలీపటం బద్ధితో జట్టి... తత్సఖుల్ చేర నేతెంచి ప్రేయసీయుందు బింబాస్య నుద్యాన కేళి న్విహరింప బోధించి నానాద్రుమస్తోమ విశ్రామ కామప్రియారామ సీమం ప్రకాశించు మందారముల్ దూరి కంజంబులన్ జేరి యందంద పైలోచి సందీక చేవైచి నీపంబులం బట్టి ధూపంబులన్మెట్టి పంతింబుల ప్రంతుల న్వింతగా నేలలుం తూగుటు య్యాలలం బాడుచుం బాలలంబోక పూబాళలన్వేయుచు న్బంతుల న్మల్లె పూబంతుల నువ్వ్రుచున్ పంతులన్ మీరి సేవంతుల న్మీటుచున్ బేరులం బిల్చి పూబేరులం గుచ్చుచున్ బీరముల్మించి జంబీరముల్చి మ్ముచున్ బావులం బొన్న పూదావులం గోరిలుచుం జల్లగా దెమ్మెరల్ జల్లగా మెచ్చుచుం గేలి నొండొండ గంగేలి గీలించుచు న్నెచ్చెలిం జూచి నేడిచ్చటన్ కందుక క్రీడ గావింతమా వింతమార్గంబుగా నిందు గాయిందు రాజన్మశీచూతమా చూతమాంబార పుంజంబు మోమెత్తి మాటాడి వేసాల బోనేల పోనే లతాతన్వి నాయున్కి యేమక్కడా యక్కడాయంగ రమ్మానినుంగాన నా కాననాంతస్థలం బేమి నీ కందువా కందువారెన్ మెరుంగాను నీ మోమిదే చందమా చంద మాను న్విడంబించు క్రీడాలతాగార మిచ్చోటికిన్ దూరమా దూర మాకేల రమ్మంచు నారామ నారామ కేలిం జెలంగింప...'

శృంగార దండకము

## 6.1.2.6. యుద్ధ వర్ణన :

ప్రబంధములందుగాని, మరేయితర సాహిత్యశాఖయందుగాని యుద్ధవర్ణనము సర్వసాధారణముగ మత్తేభ, శార్దూల వృత్తములందు రచించుట పరిపాటి. దండక వృత్తమున రచించుట మిక్కిలి యరుదు. కీ. శే. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారిచే 'శ్రీకృష్ణరామాయణమున

యుద్ధకాండమునందు' దండకవృత్తమున యుద్ధవర్ణన మొనరింప బడినది,

రామ, రావణ యుద్ధము జరుగుచున్నది. లక్ష్మణుడు యుద్ధమున మూర్ఛనొందెను. అతడు మూర్ఛనుండి తేరుకొనవలెననిన చో సంజీవని యను ఓషధి కావలెను. దానిని గొని తెచ్చుటకు హనుమంతుడరిగెను. హనుమ సంజీవనిని తెచ్చిన లక్ష్మణుడు యథాస్థితుడగును. హనుమంతుని కార్యమునకు విఘ్నము కలిగించుటకై రాత్రించరు లనేక మాయోపాయములను పన్నిరి.

హనుమ సంజీవని గొని తెచ్చుచు మునివేషధారియైయున్న కాలనేమియను రాక్షసుని సంహరించు లక్ష్మణుడు మూర్ఛనుండి తెప్పరిల్లెనని, ఓషధి తేనవసరము లేదని ఒక మాయావి సుగ్రీవవేషధారియై హనుమ కార్యమునకు విఘ్నము కలిగించుటకు ప్రయత్నించి తుదకు హనుమచే హతుడగును. ఇప్పటి కిద్దరు రాక్షసులను సంహరించి వచ్చుచుండగ మాల్యవంతుడు (రావణ పరివారములోని ముఖ్యుడు), తన రాక్షస సమూహముతో హనుమ నడ్డగించి యాతడును సపరివారముగ హతుడగును. ద్రోణాద్రిని నిరాఘాటముగ హనుమ లక్ష్మణునివద్దకు కొనిపోవుట జరుగును.

పై సందర్భమును పురస్కరించుకొని హనుమ - మాల్యవంతుల యుద్ధవర్ణనము దండకమున కొనసాగినది.

ఉదా :— 'వాతాత్మజుండంత వాతాతి వేగంబుతో వార్ధి జేరంగబో నంతలో మాల్యవంతుండనంతాతి శౌర్యుల్ మహాధైర్య ధుర్యుల్ సమస్తాయుధోపేతులౌ రక్కసుల్ పెక్కువేల్ తన్నుగూడంగ నీరాశి మధ్యంబునన్ మూగిపోనీక పోరాడగా నుండినన్ గొండతోనుండు నవ్వాన రేంద్రుండు లోమేఘుజాలంబౌకో యంచు మున్మున్ను శంకించియున్ సింహనాదంబులన్ జ్యానినాదంబులన్ శస్త్ర

సంపాతముల్గాంచి నక్తంచరుల్ దన్ను మార్కొంగ నైరంచు దానెంచి యున్నంత వారంత యేపార మొప్పన్ గదాఘాతముల్ బాణవిన్యాసముల్ ప్రాస చక్ర ప్రయోగంబులుం జేసి నొప్పింప నశ్రావకాంభుంతు నాజ్యాహుతిన్ వర్ధమానుండు వైశ్వానరుండోయనన్ మండి మెండైన సత్వంబునన్ దండికెక్కంగనై లేళ్ళపై బారు హార్యక్షముం బోలి లీలన్ సమీరాత్మజుండెల్ల రక్షోబలంబున్ గలంగన్ జలంబేర్పడం జేయుచున్ వాలపాశంబునం దన్ని ప్రాణంబులం దీయుచుం బార్శ్వముందాకి వీకం బడంజేయుచున్ జానుఘాతంబులన్ జంపుచున్నొంప సైన్యంబు దైన్యంబు నొందంగ నైనాత నమ్మాల్యవంతుండటన్'

తృతీయాశ్వాసము - 218

శ్రీ పూతలపట్టు శ్రీరాములురెడ్డి తన కంబరామాయణమున యుద్ధకాండమునందు దండకము నొకదానిని రచించియుండెను. రామ, రావణ సమరమును పురస్కరించుకొనిన సందర్భములోనిదీ రచన.

కం. చండతరంబుగ గార్ముక
పాండిత్యము జూపు రాము బరిమార్పనియీ
దండాటలేల యని పోర
దిండియు మాయాస్త్రమున వధింప దలచెన్

మాయాస్త్రమును ప్రయోగించును. ఆ అస్త్ర ప్రభావముచే మున్ను చనిపోయిన రాక్షసులందరును, పునర్జీవితులయినటులు లేచి ఆయుధములను చేపట్టుదురు. తుదకు రాముడు ప్రయోగించిన జ్ఞానాస్త్ర ప్రయోగముచే భ్రాంతి దొలగి స్వాస్థ్యము నొందుట యీ దండకము నందలి విషయము.

ఉదా :— 'పూజించి యుగ్రాక్షు గీర్తించి చందంబు న్యాసంబు విధ్యుక్త ధర్మంబుతో సేవగావించి మాయాస్త్రమున్ వింట సంధించి

శ్రీరాముపై నేయ నాయస్త్రమాయా విధిం జేసి పూర్వంబు శ్రీరామ
సౌమిత్రి బాణంబుఁన్ ధారుణిం గూలియున్నట్టి గైతేయులున్ లేచి
హర్యక్ష నాదంబు గావించిరా యింద్రజిత్తు న్నికుంభుండు సేనానులున్
మిన్నుమున్నున్ వెసంగప్పిరా కుంభకర్ణుండు గాన్పించి బిట్టార్చి
సంగ్రామ రంగంబునందుం దురంగ వ్రజంబున్ శతాంగోచ్చయ
శ్రేణి సారంగ సంఘంబులుం జేరి వేల్లువల్ శంభుచేతన్ వరంబంది
ప్రాణంబులంబొంది యింపారగా లేచు చందంబునన్ లేచి బృందారక
వ్రాతముల్ జూడ దిగ్భ్రాంతి గల్గించి మున్ గెల్చు నవ్వీరులంబిల్చి
మా శక్తి జూడుండు మమ్మోడ యోడించినారంచు బేరెత్తి రారంచు
ఖండాలుగా గోసి పిండాలుగా జేసి వేమ్రింగకే పోదుమే యంచు
నిట్లార్భటింపంగ నాగంబులా భోగిలోకంబు నందుండి ధాత్రిన్ విదా
రించు కొంచిట్టు లేతెంచి నా నొప్పి భూతంబులున్ శాకినీ ఢాకినీ ప్రేత
రాసుల్ జనించెన్ దమంబందు జన్మించి ధర్మంబులన్ మ్రాల్చు సత్త్వా
ఢ్యులున్ ధామసత్త్రింబుఁలా నాయధ స్తోమముంబట్టి చిత్రింబుఁగా
గ్రాల దంష్ట్రారుచుల్ బాలచంద్రాకృతిన్ వ్రాల దిగ్దేశముల్ నిండి
సింగంబులంబోలి గర్జించి చౌగంటులంబోలి వాలిప్పి నానావిధాభీల
జాజ్వ్వల్యమానానల జ్వాలలం జింద వీక్షించుచున్ దూషణద్వేషణో
ద్భీషణస్ఫార దుర్భాషణంబుల్ ప్రవంచించుచుండన్ రఘుస్వామి
వీక్షించి యేమాయయో నీకు భావనం దోచు నేనిన్ విచారించి వాక్రు
త్తువే యన్న నవ్వోథయున్ దేవ దేవేశ యీ దేవ విద్వేషి కర్మారు
లేశ్యంబునన్ నూడలమ్మంగ నేతెంచు వానిం బలెం బూని నీమీ మా
యాస్త్ర మిల్లేసి క్షోభింపగా జేయ భావించి యున్నాడు... యీ
మాయ యేదేని యాగాళ యంమన్ విచారించి జ్ఞానాస్త్రమున్ వింట
సంధించి యేఁయంగ ధర్మంబు శ్రోవన్ జనన్ జ్ఞాన సంపత్తి నజ్ఞాన
బంధంబుల న్నీగులాగై జగంబెల్ల విభ్రాంతి బోనాడి స్వాస్థ్యంబు
నొందెన్'

యుద్ధకాండ. ద్వి. సం. పు. 452,53.

ఇట్లు దండకముల ప్రకృతి వర్ణనములు మిక్కుటముగా కన్పించును. ఇతివృత్త పూర్వక దండకములలో నాయికా నాయకుల వర్ణనలు మిక్కిలిగా నెక్కొని యున్నవి.

## 2. అలంకారములు.

అలంకార మనెడి శబ్దమును బట్టియే అవి శోభోత్కర్ష హేతువులని అర్థమగును. కావ్యమునందలి అపరిహార్య ధర్మము అలంకారిక రచన. అలంకార రహితమగు రచన పేలవముగ నుండును. ఆనంద జనకత్వముగాదు. కేవలము ఆలోచనలనే రేకెత్తించుచుండును. అట్లుగాక పఠితకు ఆలోచన కలుగజేయుటతో పాటు ఆనందము నొసగుటకు అంకారము లుండితీరవలెను. అట్టి అలంకారములు లఘుకృతి రచించినను మినీకవిత రచించినను అవి ఆరచనకు శోభాయమానముగ నుండుటకు తోడ్పడుచుండును ఇట్టి అలంకారములు దండకములందు గూడ ప్రచురములే. వీటిని మచ్చునకు పట్టి చూతము.

### 2-1. అర్థాలంకారములు.

1. ఉపమాలంకారము : అనగా ఒక వస్తువును వేరొక వస్తువుతో మనోహరముగ వర్ణించుట.

ఉదా :- 'అంభోజ బాణప్రతాపానల జ్వాలలంబోలె సంధ్యారుచుల్ బర్వె'

ఉదా :- 'కుందబాణ ప్రయోగంబులంబోలె నందంద నక్షత్ర బృందంబు లింపొందె'

ఉదా :- 'కోకాళికిన్ భీషణాకారమై ఘోర గాఢాంధకారంబు శ్రీకంఠ కంఠప్రభా కుంఠిత బ్రహ్మాండ భాండంబులన్నిండె'

ఇట సంధ్యారుచులు పద్మములకు సంబంధించిన పుష్పాడివలెను, నక్షత్రవ్రజము మల్లెపూలతోను, గాఢాంధకారము శ్రీకంఠ కంఠముతోను ఉపమింపబడినవి.

2. సందేహాలంకారము : 'స్యాత్ స్మృతి భ్రాన్తి సన్దేహై స్తదఙ్కాలఙ్కృతిత్రయమ్' అని లక్షణము.

అనిశ్చయ జ్ఞానమే సందేహము. సందేహము వలన నేర్పడు అలంకారము సందేహాలంకారము. వర్ణ్యావర్ణ్యముల సాధారణ ధర్మమును మాత్రము దర్శించి విశేష ధర్మమును దర్శింపకపోవుట వలన నుద్భవించిన అనిశ్చయ జ్ఞానము వర్ణితము.

ఉదా !- 'కొందరంభోజగర్భాదు లధ్యాత్మలందున్న శేషాది భూతంబులందు న్ననేకాది దైవంబులందున్ సదాసాక్షివై యుండు వటంచున్, తదంతర్గత జ్యోతి వీశండ వంచున్ త్రయీ పద్ధతిన్ గొందరిక్రాది దేవాభిదానంబులన్ నిక్క మొక్కండ వంచున్ మరింగొందరారాధ కర్మంబులం దుంచి సంసారముం ద్రెంచి సన్న్యస్తులై మించి విజ్ఞాన చక్షుండవంచున్, మరింబంచరాత్రానుసారంబునం దన్మయత్వంబుతో గొందరీవాత్మ యటంచున్ మరిం గొందరా వాసుదేవాది భేదంబులన్ నల్వురై చెల్వు వాటింతువంచున్ మరిన్నీవు నారాయణాఖ్యుండ వంచున్ శివాఖ్యుండవంచున్ మరిన్ బెక్కు మార్గంబులన్ నిన్ను వర్ణింతు రెగ్గేమి?'

(భాగవతాంతర్గత అక్రూరదండకము.)

పై ఉదాహరణలో ఉల్లేఖాలంకార భేదముగూడ స్ఫుటముగ కన్పించును. బ్రహ్మాది దేవతలే నిశ్చయ జ్ఞానంకలిగిలేరు. నీ తత్త్వము నిర్ణయించుకొనలేక పోవుచున్నారు. అని అక్రూరుడు కృష్ణుని గూర్చి స్తుతి చేయును. ఇందు అక్రూరునకు గూడ కృష్ణతత్త్వం అనిశ్చయమే.

బహుభిర్బహుధోల్లేఖా దేకస్యోల్లేఖ ఇష్యతే అను ఉల్లేఖ లక్షణానుసారము ఒక్కడే అయిన కృష్ణపరమాత్మ బ్రహ్మాది దేవతలకి

వేరు వేరు తాత్త్విక దృక్కోణములలో కన్పించుచున్నందు వలన దీని ఉల్లేఖముగను భావించవచ్చును.

3. ఉల్లేఖాలంకారము : 'ఏకేన బహుధోల్లేఖే వ్యాసా విషయ భేదతః' అని లక్షణము.

ఒక్కనిచేత ఒక్కనిగూర్చి విషయభేదమునుబట్టి యనేక విధములుగ వర్ణింపబడిన నది యుల్లేఖమగును.

ఉదా :- 'విశ్వంభరా భర్తకీ విశ్వమెంతేనియుం పాణి పాదంబులై నేత్ర పద్మంబులై యుత్తమాంగంబులై మానస శ్రోత్రజాలంబులై యొప్పనా యున్నత స్ఫూర్తిచే'

(కృష్ణార్జున సంవాదాంతర్గత దండకము)

విశ్వమును విష్ణుమూర్తి స్వరూపముతో నుపమించుచూ బాహువులై, పాదతలమ్మై, నేత్రపద్మములై, ఉత్తమాంగములై, మానసశ్రోత్ర జాలములై విశ్వము ఒప్పుచున్నదని కవి వర్ణించెను. విశ్వమునందు మార్పు లేదు. విరాట్పురుషునకే విశ్వము బహురూపము లతో ఒప్పుచున్నది.

4. ముద్రాలంకారము : 'సూచ్యార్థ సూచనం ముద్రా ప్రకృతార్థ పరైః పదైః' అని లక్షణము.

ప్రస్తుతమైన అర్థమును ప్రతిపాదించు పదములచేత సూచింపదగిన అప్రస్తుతార్థము సూచితమైన యెడల అది ముద్రాలంకారమగును. ఇందు సూచ్యార్థ సూచనము శబ్దాశ్రయమై యుండును.

ఉదా :- 'కలిత భువన యోగ జీమూత గోత్రావళీ శోత్రవాశ్మ ద్యుతిచ్ఛేద నోద్దామ దామాభిరామాకృతీ

విలసిత మునిభావ షట్కోణ పంకేరుహాంతస్థ సత్కర్ణికాపార సంచారి భృంగానుకారీ స్థితీ

ఘన విపిన సరోంబుపాన ప్రభిన్నాగ్ర పాదస్ఫురద్గ్రా
గ్రాహ మస్తాగ్ర భిన్నీభవ చక్రాయధా

వినతజన దురంత సంసార ఘోరార్ణవోత్తారణా కారణాభూత
నౌకా ప్రతీకాశ నైకాభిధా'

(ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము-143)

ఇది తెలుగు ప్రబంధమందలి సంస్కృత దండకము. ఇందు ముద్రాలంకారము ప్రస్ఫుటము. ఆఖరి పాదమున 'అర్ణవ' శబ్దమును అర్థవంతముగ ప్రయోగించియు ముద్రాలంకృతము చేసియుండెను.

౫. పరిణామాలంకారము : 'పరిణామః క్రియార్థశ్చే ద్విషయీ విషయాత్మనా' అని దీని లక్షణము.

ఉపమానము ఉపమేయ రూత్మకత్వముచేత క్రియా సాధన మైనయెడల పరిణామాలంకారమగును.

ఉదా :- 'నిగమకమల గంధముల్ సంధిలంజేయు'

(పాండురంగ మాహాత్మ్యాంతర్గత, దం.)

ఇట వేదములనెడి కమలములు సుగంధములు కూర్చినటులు వర్ణించబడినది.

## 2-2. శబ్దాలంకారములు :

ముక్తపదగ్రస్తము : ప్రస్తుతమగు ముక్తపద
గ్రస్తాబన నదియు గృతులబరగు బదాంతో
దస్తము పాదాద్యంత సు
విస్తృతము పదాంత సింహ వీక్షణమనగన్

ఇది యొక యమక భేదము. ఈ ముక్తపదగ్రస్త భేదము పై పద్యమున నుదాహరించినట్లే గాక అనేక విధములలో నొప్పును.

ఉదా :- 'శ్రీమన్మహా మంగళాకారు నాకారు లక్ష్మీకమా

రున్ కుమారీ మనోరామ రామాంబకీపాది రాజన్య రాజద్యశో కాము గామాహిత క్షీర వారాశి తారేశ వాగీంద్ర నాగేంద్ర మందార విందార కుందాభ్ర కల్లోలినీ కాశ విఖ్యాత సత్కీర్తి ముక్తావళీ భూషితాశాంగనాలోక సీమంతు సీమంతినీ మానసారామకోటీ వసంతున్ వసంతావనీనాథ సంసేవితాంచత్పదాంభోజ సంభోజ రాజీ సుహృత్తేజు తేజోమయ ప్రాభవోద్దామ సుద్దామ జన్యావనీ భీము భీమ ప్రతాపానలా భీల'

ఇట్లే 'భోగినీ దండక' మంతయును మొదటినుండియు తుదివరకు మనోహర పదవిన్యాసముతో ముక్తపదగ్రస్తమై యొప్పును.

పెదతిరుమలాచార్యుని శృంగార దండకమునను కొంతవరకు ముక్తపదగ్రస్తము కానగును.

ఉదా :- '... నెచ్చెలిం జూచి నేడిచ్చటన్ గందుకక్రీడ గావింతమా వింతమార్గంబుగా నిందురా యిందురాజన్ముఖీ చూతమా చూత మాలూర పుంజంబు మోమెత్తి మాటాడ వేసాల బోసేల పోసే లతాతన్వి నా యున్కియే యక్కడా యక్కడాయంగ రమ్మా నినుం గానగాలేని కాననాంతస్థలంబేమి నీకందువారెన్ మెసంగారు నీమోమిదే చందమా చందమామన్విడంబింప గ్రీడాలతాగార మిచ్చోటికిన్ దూరమా దూరమా కేల నారామ నారామ కేలిం'

## 3. సూక్తులు :

సూక్తి యనగా రుచిరమైన చమత్కార యుక్తమైన కూర్పు. వీటినే సుభాషితము లనియు నందురు. ఇట్టి సూక్తులు జన జీవనమున మిక్కుటముగ కానవచ్చును అట్లే తెలుగున కవులును తమ కావ్యము లందు విరివిగ ప్రయోగించి యుండిరి. ప్రత్యేకముగ తనను 'నానారుచిరార్థ సూక్తినిధి' యని నన్నయ చెప్పుకొనియుండెను. ఈ సూక్తులు

బహుభంగులుగ దండకము లందును గానవచ్చును. అట్టివానిలో కొన్నిటి నుదాహరించుచుంటిని.

1. అందరుం గిట్టువారే కదా ! (శ్రీకృష్ణ కళ్యాణాంతర్గత, దం.)
2. అంభోజ నాళాంతరాళ స్ఫుర త్తంతు యోగంబునన్ జిక్కునే గంధనాగంబు ? (భోగినీ. దం.)
3. అగ్గిలోదూరి బొగ్గాయె. (పీపుల్సుపార్కు అగ్ని ప్రళయ, దం.)
4. ఆనంద మానందమే (యోగేశ్వర, దం)
5. ఆనందము జెందుటే విందు (జార్జి ప్రభు పట్టాభిషేకాంతర్గత, దం.)
6. ఆ పాప మేకీడుగా మూడెనో (పీపుల్సుపార్కు అగ్ని ప్రళయ, దం)
7. ఎండమావుల్ కడున్ నీళ్ళుగా చూత మే ? (వెంకటపతిరాయల, దం.)
8. ఏరుల్ పయోరాశినే కూడు ( ,, ,, )
9. ఓటే సమస్తంబు (ఓటు, దం.)
10. కంపించునే మక్షికా విక్షేప వాతాహతిం గాంచ నాగంబు (భోగినీ, దం.)
11. కబ్బమందైతె మీాదబ్బురల్ జెల్లును (వాదవిజయాంతర్గత, దం.)
12. కాంతారమే శాతికిం దావలంబు (ఉత్తరగీతా, దం.)
13. కానున్న కార్యమ్మెట్టున్ గాకపోదు ( ,, ,,)
14. కామికాగోరు రక్తుండు ముక్తుండగున్ (భల్లాణ, దం.)
15. కాముకత్వంబు లేకున్న సంసార సౌఖ్యంబు సిద్ధించునే? (భల్లాణ, దం.)

16. కాయంబు విద్యున్నికాయోపమేయంబు (భోగినీ, దం.)
17. కార్యం బకార్యంబు (ఆంజనేయ, దం.)
18. కాలికిం బుద్ధిం జెప్పి ( ,, ,, )
19. కుపుత్రుడు దాబుట్టుగా కెక్కడైనన్ (శ్రీమదంబికా, దం.)
20. కూర్మిన్ విలోకింబుచు లచ్చి వర్తించునే? (భోగినీ, దం.)
21. కూలీలు లెక్కింపగా శక్యమే? (సీత, దం.)
22. కోపంబు పాపంబుకు మూలమౌజూడ (శ్రీరామ, దం.)
23. క్షాత్ర ధర్మంబు యుద్ధంబు (శ్రీకృష్ణకళ్యాణాంతర్గత, దం.)
24. గుండెల గ్రాయిగన్ జేసుకొని
కోయపిటూరి అను దోపిడీ, దం.)
25. చావుకునెండు మరిరెండు చావులున్ ఉండునే? (,, ,,)
26. చెట్టుకొక్కడై (పీపుల్సు పార్కు అగ్నిప్రళయ, దం.)
27. జగత్కంటక చ్ఛేదముల్ వేదముల్ (ప్రబోధచంద్రోద
యాంతర్గత, దం.)
28. తల్లి కోపించితే పిల్లలుంగాచి రక్షించువారెవ్వరు ?
(మరిడమాంబా, దం.)
29. తాపత్రయాభీల దావాగ్నిలో ద్రేలు సంసారమా చాలు
(ఉత్తరగీతా, దం.)
30. దంభాలకై లేని ధర్మాలు గావించు
(పీపుల్సుపార్కు అగ్నిప్రళయ, దం.)
31 దూత న్వధింపంగరాదు (శ్రీరామ, దం.)
32. ధన్యులౌ తాపసుల్ (,, ,,)
33. ధర్మహీనుండు సత్కర్మ హీనుండగున్ (భల్లాణ, దం.)
34. ధూర్త పరిసంగంబు లేల? (ఆంజనేయ, దం.)
35. నియమంబు నియమంబుతోనుండు (వెంకటపతిరాయల, దం.)
36. నోటిలో ముత్తెముల్ జిందునా? (రాజగోపాల, దం.)

37. పాండురాజ్యంబు త్యాజ్యంబు గాకెట్లగున్ ? (ఉత్తరగీతా,దం)
38. పాశ్చాత్య సంబంధమైనట్టి వ్యామోహమందే సదామున్గి
(భరతమాత, దం.)
39. పీన్గ లై రంత కాల్గంటెలో
(పీపుల్సు పార్కు అగ్ని ప్రళయ,. దం.)
40. పుత్ర మిత్రాదు లేతెంతురే? ధర్మంబె దావచ్చు
(భల్లాణ, దం.)
41. పూరుషుల్ వేగశీలుల్ గదా ! (భల్లాణ, దం.)
42. సైడి గీపెట్టినా బుట్టునా ? (వెంకటపతిరాయల, దం )
43. పోనౌనె సిద్ధాన్నమున్ ద్రోసి (ఉత్తరగీతా, దం.)
44. ప్రియ మెవ్వారికిన్ బుద్బుద ప్రియ మే
(వాదవిజయాంతర్గత, దం.)
45. బాల్యంబునం దేమి భాషించినం దండ్రి హర్షించు
(రాజగోపాల, దం )
46. బాహ్యమెల్లన్ నసిద్ధంబె (చంద్రిననా, దం.)
47. భూతదేహం బసత్యంబు, తాజేయు ధర్మంబు సత్యంబు
(భల్లాణ, దం.)
48. మండలాధీశ్వరాగార సంచారముల్ దూరముల్
(పద్మినీ, దం.)
49. మరుం గన్న వారెవ్వరు ( ,, ,, )
50. మహీశులు బహు ప్రేయసీ సక్తులు
(వాదవిజయాంతర్గత, దం.)
51. మాటలా నీరుమూటలు (పద్మినీ, దం )
52. మీసాలపై దేనలీ సౌఖ్యముల్ (ఉత్తరగీతా, దం.)
53. మొదల్ మోసమయ్యింది. (భాషీయ, దం.)
54. మొహమాటమన్నాట బల్మోసము (పద్మినీ, దం.)

55. మోహంబులో నేటి రాగంబు లేపాటు (భల్లాణ, దం.)
56. రంభవైనా దారల్ కడున్ జొకగా జూతురె
(వెంకటపతిరాయల, దం.)
57. రక్తి లేకున్నచో ముక్తి లేదు (భల్లాణ, దం.)
58. రాచ దండంబు గండంబు ( „ „ )
59. రాచబోరామి యింటింట బోరామికిన్ మూలమే ( „ „ )
60. రాజుల్ బహు వ్యాజులే (భోగినీ, దం.)
61. రాణివాసంబు లాసింతురా? ( „ „ )
62. రోటిలో మస్తముం దూర్చి రోకంటి పోటొల్ల
(ఆంజనేయ, దం.)
63. లోకార్తినిం బూర్తిగా దీర్చుటల్ కీర్తియే గాదె!
( „ „ )
64. వట్టి వల్పుల్ మదిం బుట్టునె? ( „ „ )
65. వల పడ్డ మత్స్యంబు భంగి (పద్మినీ, దం.)
66. వారాంగనా జాతికి న్నీతియే? ( „ „ )
67. వా రెంతవా రెంతవారైన (భాగవతాంతర్గత అక్రూర, దం.)
68. విత్తంబు మీ దాసలే దేమి మోహంబె? (పద్మినీ, దం.)
69. సర్వమున్ బ్రహ్మమే (సతీబాలబ్రహ్మేశ్వరీ పరిణయాంతర్గత, దం.)
70. సిపాయీల కంటెన్ కఠోరుల్ కనిష్టేబు గుంపుల్
(పుష్కర, దం.)

# ఉపసంహారము

దండక మొక విశిష్టసాహిత్య ప్రక్రియ. సంస్కృతభాషా సంబంధియగు మార్గ ప్రక్రియ యిది. వేయి సంవత్సరముల పూర్వము తెలుగు సాహిత్యమున నడుగిడినది. అడుగు పెట్టినది మొదలు 'ఇంతింతై వటుడింతయై' యనట్లు తన స్వరూపమును విస్తరింప జేసుకొనినది. తెలుగువారల కీ ప్రక్రియయైన తెలియకపోవచ్చునుగాని దండక మనిన అందరకును సుపరిచితము. అట్టి తెలుగు దండక సాహిత్యము యొక్క మౌలిక స్వరూపము ఔన్నత్యము తెలుపుటతో పాటు, వేయి సంవత్సరముల నుండియు ఈ ప్రక్రియ సాగించిన ప్రగతి యీ సిద్ధాంత వ్యాసమున నిరూపింపబడినది.

ఈ దండకము తెలుగు సాహిత్యమున మిక్కిలి ప్రాచుర్యము నొందుటకు గల కారణము, తెలుగున ఆది కావ్యమైన మహాభారతము నందు నన్నయ దీనిని చేపట్టి రచించుటయే. ఈ దండకము నాధారముగా గొని లెక్కకు మిక్కిలిగా రచనలు పుట్టినవి. కావున దీనిని దేశి సంబంధి ప్రక్రియగ కొందరు తలచిరి. కాని, యిది దేశి సంబంధియగు ప్రక్రియగాదని, మార్గ సంబంధమై అపురూప ప్రక్రియ యనియు, వివిధములగు దేశీయేతివృత్తములను, దేశీయ దేవతలను దండక ప్రక్రియయందు చొప్పించి, రచించి, మరింత ప్రచురము గావించిరనియు నీ సిద్ధాంత వ్యాసమున నిరూపింపబడినది.

దండక మొక ఛందము. సంస్కృతభాషా సంబంధి యైనను దాని లక్ష్యములంతగా కనిపించవు. లక్షణములు సజీవములై యున్నవి. లక్ష్యముల కంటెను లక్షణములే ప్రాచీనములైనవి లభించినవి. లక్ష్యములు స్వల్పముగా నుండుట నూతగొనియు, తెనుగున దీని విస్తృత ప్రాచుర్యము నాధారముగ గొనియు, తెలుగునకు సోదరీ భావలగు

తమిళ, కన్నడములయందు లేకయుండుటను బట్టియు, తెలుగున లక్షణ, లక్ష్యములు భిన్నముగా నున్నవాటిని బట్టియు తెలుగున దండకము దేశి సంబంధిగా భావించిరి. అందువలన సంస్కృత భాషకు పుత్రికయగు హిందీ, తెలుగునకు సోదరీ భాషలగు తమిళ, కన్నడముల లక్షణములను గ్రహించి, సంస్కృతము నుండియే తక్కినభాష లన్నిటికిని దండకప్రక్రియ ఆయా భాషాకవులు గ్రహించిరనియు నీ సిద్ధాంత వ్యాసమున లక్ష్య, లక్షణ పూర్వకముగా స్థిరీకరింపబడినది.

నన్నయ యే ముహూర్తమున దండకరచన కుపక్రమించెనో తెలియదుగాని, పలు సంప్రదాయములకు ప్రాతినిధ్యము వహించుటతోపాటు ప్రసిద్ధముదై నేటికిని తన రచనా ప్రభావము చూపుచు ఒరవడియనదగిన దండకరచన యొనరించియుండెను.

సంస్కృతమునసేగాక, తెలుగునను భక్తిభావమును వెల్లడించుటకు దండకము తగినదిగా కవులూహించిరి ఈ ఉద్దేశమును తెలుగున దండకము సంపూర్ణముగ నెరవేర్చినది. అంతియేగాక నితర ప్రక్రియలకంటె నీ ప్రక్రియ యుపయుక్తమైనదిగ గణుతికెక్కినది.

గ్రంథాంతర్గతముగ వెలసిన దండకము పండితారాధ్యుని చేతిలో స్వతంత్ర ప్రక్రియా రూపము దాల్చినది. పోతనగారి భోగినీ దండకముతో సంపూర్ణ స్వేచ్ఛ నొందినది. పోతన సాంఘికేతివృత్తమును మానవ శృంగార పరముగ మలచగ, పెదతిరుమలాచార్యులు భగవదంకితముగ దివ్యశృంగారాకృతిని రచించియుండెను గ్రంథాంతర్గతములుగ సాగిన దండకములు శ్రీనాథాదుల రచనలలో క్రమముగ నుపన్యాస వైఖరి దాల్చగ, నమోవాకమును విడువకుండగనే రఘునాథాదుల రచనలలో కథకు అతుకునటులనువుగ రచింపబడినది. అచలాత్మజా పరిణయాది కావ్యముల ద్వ్యర్థిగాను, అచ్చతెనుగు

రామాయణాది కావ్యములతో నచ్చతెనుగు రూపమునను, నిరోష్ఠ్యాది నియమములతో చిత్రకవితగను బహురూపముల నందినది. ఇంతియేగాక స్వతంత్రము లతి స్వాతంత్ర్యము వహించినవి. భోగరాజ రానారాయణమూర్తిగారి కృష్ణకుమారి కావ్యమున లేఖ రూపము దాల్చినది. అద్దంకి గంగాధరకవి మొదలగువారు కేవల వర్ణనలకే దీనిని వినియోగించిరి. స్వతంత్రములందీ వర్ణనల విషయము చెప్ప నలవిగాదు. అలౌకికములగు భగవదాకార చిత్రవృత్తులను ఎందరో కవులు గ్రంథాంతర్గతములుగను, స్వతంత్రములుగను గూడ నమితముగ వర్ణించియుండిరి. వీనినన్నిటిని సోదాహరణపూర్వకముగా నిరూపించుట జరిగినది.

సంస్కృత వాఙ్మయమున నుద్భవించిన దండక ప్రక్రియ తెలుగున సుప్రతిష్ఠితమైనదని సప్రమాణముగ నిరూపించుటకు యథామతి ప్రయత్నించి యుంటినని విశ్వసించుచున్నాడను.

చివరగా ఒక వేడికోలు. నాది పథ ప్రదర్శక ప్రయత్నము. ఈ మార్గమున నౌత్సాహికులు మరికొందరు కృతపరిశ్రములై పురోగమింపగలరని ఆశించెదను.

ఇతిశమ్

# అనుబంధము

## ముద్రితములు — గ్రంథాంతర్గతములు.

1. అచ్చుతరామకవి, వారణాసి. శ్రీకృష్ణసుధాసారము
2. అన్నయ, తెనాలి. సుదక్షిణా పరిణయము
3. అప్పకవి, కాకునూరి. శశిరేఖా పరిణయము
4. అప్పదాసు, వేజెండ్ల. అప్పదాసు చరిత్రము
5. అప్పయ్యశాస్త్రి, చివ్వుకుల. గర్గభాగనతము
6. అబ్బయ, కనుపర్తి. పురూరవశ్చరిత్రము
7. ... అనిరుద్ధ చరిత్రము
8. ఉమర్ ఆలీషాకవి. మహాభారత కౌరవరంగము
9. ఎర్రన. నృసింహపురాణము
10. ఎర్రయ. సకలనీతికథా నిదానము
11. ఎల్లయ, చింతలపూడి. విష్ణుమాయా నాటకము
12. కనకాంబ, కాంచనపల్లి, జీవయాత్ర
13. కాంతకవి, నారపరాజు, కవిజనచకోర చంద్రోదయము
14. కామరాజకవి, కొప్పరపు. జాంబవతి పరిణయము
15. కామేశ్వరకవి, సత్యవోలు. శృతికంఠోపాఖ్యానము
16. కూర్మనాథకవి, గోగులపాటి. మృత్యుంజయ విలాసము
17. కృష్ణకవి, శకుంతలా పరిణయము
18. కృష్ణమూర్తిశాస్త్రి, శ్రీపాద. భగవద్విలాసము
19. ... సావిత్రీ చరిత్రము
20. ... ఏకావళీ పరిణయము

21. ... శ్రీకృష్ణ భారతము
22. ... విక్రమాభ్యుదయము
23. ... యాజ్ఞవల్క్య చరిత్రము
24. ... నైషధీయ చరితము
25. ... శ్రీకృష్ణ రామాయణము
26. ... శ్రీకృష్ణ భాగవతము
27. కోటేశ్వరకవి. భోజసుతా పరిణయము
28. గంగాధరకవి, అద్దంకి. తపతీసంవరణము
29. గిరిరాజు, దర్భా. వాదవిజయము
30. గోపరాజు, కొరవి. సింహాసనద్వాత్రింశిక
31. గోవిందాచార్యులు, ఆత్మకూరి. గోవిందరామాయణము
32. చిదంబరశాస్త్రి, పీసుపాటి. హైమవతీ విలాసము
33. చిన్మయబ్రహ్మకవి, చేబోలు. నాదబ్రహ్మ
34. చెన్నకృష్ణకవి, బొడ్డుచెర్ల. సతీబాలబ్రహ్మేశ్వరీ పరిణయము
35. జక్కన. విక్రమార్క చరిత్రము
36. తమ్మాళ్, చూడికుడు, మృగశృంగ చరిత్రము
37. తిమ్మకవి, కూచిమంచి, రుక్మిణీ పరిణయము
38. ... రాజశేఖర విలాసము
39. ... అచ్చతెనుగు రామాయణము
40. ... నీలాసుందరి పరిణయము
41. ... రసికజనమనోభిరామము
42. తిమ్మన, నంది. పారిజాతాపహరణము
43. తిమ్మన, పుష్పగిరి. సమీరకుమార విజయము
44. తిమ్మనృపాలుడు. పరమయోగి విలాసము

45. తిరుపతి వెంకటకవులు. దేవీభాగవతము
46. దత్తోజీ. శ్రీకృష్ణార్జున సంవాదము
47. దుగ్గన, దగ్గుపల్లి. నాచికేతూపాఖ్యానము
48. ధూర్జటి. శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము
49. నన్నయ. ఆంధ్రమహాభారతము
50. నరసకవి, చెళ్ళపిళ్ళ. యామినీపూర్ణతిలకావిలాసము
51. నరసింహము, విశ్వనాథము. హరివంశపురాణము
52. నరసింహాచార్యులు, మాడభూషి. వల్లీవల్లవోల్లాసము
53. నాగవీరయ్యశాస్త్రి, ముదిగొండ. శివపురాణము
54. నారాయణమూర్తి, భోగరాజు. కృష్ణాకుమారి
55. నారాయణరావు, కాళ్ళకూరి. వరవిక్రయము
56 పట్టెయ్యకవి, మాపూరి. నీలకంఠవిలాసము
57. పాపయారాధ్యుడు, ములుగు. దేవీభాగవతము
58. — సర్వమధురము
59. పాపరాజు, కంకంటి. శ్రీమదుత్తర రామాయణము
60. పార్వతీశ్వరశాస్త్రి, మండపాక. శ్రీకృష్ణాభ్యుదయము
61. పార్థసారథిశెట్టి, అయ్యనకోట. సత్యావిజయము
62. పురుషోత్తమకవి, నాదెళ్ళ. సోమేశ్వరీయము
63. ... జార్జిప్రభు పట్టాభిషేకము
64. పూర్ణయాచార్యులు, రాయవరపు. రాజధీరజనమనోవిరాజితము
65. పేరన్నశాస్త్రి, మూలా. శ్రీముఖలింగేశ్వర శతకము
66. పోతన, బమ్మెర. శ్రీమదాంధ్రమహాభాగవతము
67. ... వీరభద్రవిజయము.

68. భగవత్కవి, సత్యవోలు. రుక్మిణీ పరిణయము
69. భానుకవి. పంచతంత్రి
70. భాస్కరాచార్య. శ్రీ వైశ్యపురాణము
71. భీమశంకరశాస్త్రి, వడ్డాది. భక్తమందారము
72. భైరవకవి. శ్రీరంగమహాత్మ్యము
73. మంగయ్య, వద్దిపర్తి. హనుమద్విజయము
74. మర్దనకవి. శతకంఠ రామాయణము
75. మల్లన, మాదయ్యగారి. రాజశేఖర చరిత్రము
76. మల్లయకవి. శ్రీరామ స్తవరాజము
77. మల్లయ, నంది, సింగన, ఘంట. వరాహపురాణము
78. ... ప్రబోధ చంద్రోదయము
79. మల్లయ్య, సంగిశెట్టి. నరకాసురవధ యక్షగానము
80. మల్లారెడ్డి, కామినేని. షట్చక్రవర్తి చరిత్రి
81. మల్లికార్జునుడు, పిడుకాలి నాచికేతూపాఖ్యానము
82. మాడయ్యకవి. మైరావణచరిత్రము
83. మాధవరాయలు, సురభి. చంద్రికా పరిణయము
84. మారన. మార్కండేయపురాణము
85. మృత్యుంజయకవి. ధర్మాత్మజాపరిణయము
86. యోగానందసూరి, ఉన్నవ. పద్మినీ పరిణయము
87. రంగప్పరాజు, రామరాజు. సాంబోపాఖ్యానము
88. రఘునాథభూపాలుడు. వాల్మీకి చరిత్రము
89. రఘునాథాచార్యుడు, శేషము. కులశేఖరమహీపాలచరిత్రము
90. రమణయ్య, అన్నంరాజు. శంతనురాజచరిత్ర
91. రామకృష్ణుడు, తెనాలి. ఉద్భటారాధ్య చరిత్రము

92. ... పాండురంగ మాహాత్మ్యము
93. ... ఘటికాచల మాహాత్మ్యము
94. రామచంద్రశాస్త్రి, గడిశాస్త్రిల. సగరపురాణము
95. రామయమంత్రి, ధరణిదేవుల. దశావతారచరిత్రము
96. లక్ష్మీకాంతకవి, బలిజేపల్లి. సత్యహరిశ్చంద్రీయము
97. లక్ష్మీనారాయణశాస్త్రి, ఆర్య సోమయాజుల. శివకథాసుధాసారము
98. లక్ష్మీనారాయణశాస్త్రి, వడ్లమాని. దేవదేవీస్తోత్రము
99. లింగమూర్తి, పరశురామపంతులు. సీతారామాంజనేయ సంవాదము
100. లింగమూర్తి, పూడిపెద్ది సువర్చలాపరిణయము
101. వరదరాజేంద్రకవి, కట్టా. శ్రీరంగమహాత్మ్యము
102. వీరభద్రకవి, చాగంటి విశ్వేశ్వర ప్రభావము
103. వెంకటకవి, ఇంద్రకంటి. శ్రీకృష్ణదాస హృదయోల్లాసము
104. వెంకటనాథుడు, బైచరాజు. పంచతంత్రము
105. వెంకయ్య, అందుగుల. నరపతివిజయము
106. వెంకటరత్నం పంతులు. కొక్కొండ, బిల్వేశ్వరీయము
107. వెంకటసుబ్బయ్య, గురు. ధర్మజ్ఞ చరిత్ర
108. వెంకట్రంగ కవి. శశిరేఖా పరిణయము
109. వెంగళభూపాలుడు, దామెర్ల. బహులాశ్వచరిత్రము
110. వేంకటకృష్ణకవి, కోటికెలపూడి. దిలీపచరిత్ర
111. వేంకటకృష్ణయ్య, కామరాజు. రామలీల
112. వేంకటకవి, గణపవరపు. ప్రబంధరాజ వెంకటేశ్వర విజయ విలాసము

113. వేంకటపతి, వెలిదండ్ల. రాధామాధవ సంవాదము
114. వేంకటవరదాచార్యులు, చక్రవర్తుల. మాతృజ్యోతి
115. వేంకటాచలకవి, శ్రీధరమల్లె. బ్రహ్మోత్తరఖండము
116. వేంకటాచలకవి, శ్రీపాద. కౌసల్యాపరిణయము
117. వేంకటాచార్య, అత్తిలి. శ్రీవీరసేన చరిత్రము
118. వేంకటాచార్య, నిరంతుశచర్య. భరతాభ్యుదయము
119. వేంకటాచార్యులు, తిరుమల బుక్కపట్టణం. అచలాత్మజా పరిణయము
120. వేంకటశాస్త్రి, నృసింహదేవర. విచిత్రరామాయణము
121. వైద్యనాథకవి, సూర్యభొట్ల. సత్యభామాపరిణయము
122. శరభలింగకవి, దిమ్మానేని. అలంకారచంద్రోదయము
123. శివరామకవి, కోట. సనందోపాఖ్యానము
124. శేషాద్రిశర్మ, జనమంచి. సతీతిలక
125. శ్రీనాథుడు. శృంగారనైషధము
126. ... హరవిలాసము
127. ... కాశీఖండము
128. శ్రీరాములురెడ్డి, పూతలపట్టు. కంబరామాయణము
129. శ్రీరాములు, విప్పరి. లింగశతకము
130. సింగరాయకవి, గోపాలుని. కిరాతార్జునీయము
131. సుబ్బరాయకవి, వావికొలను. శ్రీకుమారాభ్యుదయము
132. — శ్రీ కౌసల్యా పరిణయము
133. సుబ్బరాయశాస్త్రి, దేవులపల్లి. మహేంద్రవిజయము
134. సుబ్రహ్మణ్యకవి. శ్రీకృష్ణకళ్యాణము
135. సుబ్రహ్మణ్యకవి, అల్లమరాజు. భద్రాపరిణయము

136. సుబ్రహ్మణ్యభాగవతార్, పరిమి. శ్రీకృష్ణభాగవత యక్షగాన ప్రబంధము

137. సూరన, చెరుకువాడ. శ్రీజగన్నాథ మాహాత్మ్యము

138. సూరన, పింగళి. కళాపూర్ణోదయము

139. సూర్యచింతామణి, ఉపాధ్యాయుల. శ్రీమదాంధ్ర లలితోపాఖ్యానము

140. సూర్యనారాయణ, బొండాడ. లక్ష్మీజనార్దన చరిత్రము

141. సూర్యనారాయణమూర్తి, ముత్యా. సకలానందము

142. సూర్యనారాయణశాస్త్రి, వెంపరాల. శంకర విజయము

143. ... మదాలస విలాసము

144. సోమనాథయాజి, పట్టమట్ట. బ్రహ్మోత్తరఖండము

145. ... పృథుచరిత్ర

146. సోమనాథరాయ, ఆదిపూడి. విజయేంద్ర విజయము

147. సోమసుందరకవి, సత్యవోలు. శ్రీజగదాంబా నారద ప్రసంగము

148. హనుమంతశర్మ పాకయాజి, అబ్బరాజు. నందిరాజు లక్ష్మీనారాయణ దీక్షిత చరిత్ర

149. హనుమయ్య. శుద్ధాంధ్ర నిర్వచన సత్యావివాహము

150. హరిభట్టు. ఉత్తరనారసింహ పురాణము

## ముద్రితములు - స్వతంత్రములు

| కవి | కృతి |
|---|---|
| 1. అప్పయ్య, గంగరాజు, | పీపుల్సుపార్కు- అగ్నిప్రళయ దండకము |
| 2. అద్వైతబ్రహ్మశాస్త్రులు, వావిలాల, | ఆంజనేయ దండకము |
| 3. అశ్వత్థనారాయణరావు, కరణం, | దండకరామాయణము |
| 4. ... | ఉత్తరగీతా దండకము |

5. కాశీపతి, పోకూరి. కాఫీ దండకము

6. కూర్మయ్య, పేరూరి. శివదండకము

7. కేశవరావు, దండంరాజు. (శ్రీ) మట్టపల్లి నృసింహ దండకము

8. కొండమాచార్యులు, ముదివర్తి. రంగనాథుని దండకము

9. గోవిందుడు, మేడపల్లి. నూకాలమ్మ దండకము

10. చంద్రకవి. పద్మినీ దండకము

11. చిదానందకవి చంద్రవదనా దండకము

12. చినతిరుమలాచార్యులు, తాళ్ళపాక. అష్టభాషా దండకము

13. తిరుపతి వెంకటకవులు. ఉత్సవ దండకము

(నానారాజ సందర్శనము)

14. నరసింహం. ఆంజనేయ దండకము

15. నరసింహం, చేపూరు. దండుమారెమ్మ దండకము

16. నరసింహమూర్తి, ఆముజాల. విఘ్నేశ్వర దండకము

17. — సరస్వతీ దండకము

18. — శ్రీమదాంజనేయ దండకము

19. — శ్రీ శంకర దండకము

20. — శ్రీ దశావతార దండకము

21. నరసింహశాస్త్రి, గుంట్లూరి. భాషీయ దండకము

22. నారాయణదాసు, ఆదిభట్ల. మైసూరు దేశ ప్రశంసా స్తబకము

23. నారాయణరావు, కాళ్ళకూరి. శ్రీమజ్జగద్గురు స్తోత్రరత్నము

(దండకము)

24. నృసింహశాస్త్రులు, వేమూరి. శ్రీవేదాద్రి పఞ్చ నారసింహ

స్వామి దండకము

25. ... కృష్ణానదీ దండకము

26. పుల్లకవి, ద్విభాష్యం. లఘుశక్తి దండకము
27. ... సూకాలమ్మ దండకము
28. ... మరిడమాంబ దండకము
29. ... తలుపులమ్మ దండకము
30. పూర్ణయ్యసిద్ధాంతి, యడవిల్లి. గాయత్రీ దండకము
31. పెదతిరుమలాచార్యులు, తాళ్ళపాక. శృంగార దండకము
32. పోతన, బమ్మెర. భోగినీ దండకము
33. బంగారురాజు, పాలెవు. జమాబందీ దండకము
34. భీమశంకరదాసు, వడ్డాది. (భక్తమందారము) హరిహరనాథ దండకము
35. మంగయ్య, వద్దిపర్తి. సూర్యదండకము
36. రంగయ్య, గుంటి. ధూమశకట దండకము
37. రాఘవాచార్యులు, బృందావనం. కోయపితూరీ అను దోపిడీ దండకము
38. — గాలివాన దండకము
39. రామకృష్ణశాస్త్రి. గొరావరఘుల. శ్రీ విష్ణు దండకము
40. ... శ్రీ లక్ష్మీ దండకము
41. ... ఈశ్వరదండకము
42. ... శ్రీమదాంజనేయ దండకము
43. రామదాసు. శ్రీరామదండకము
44. రామదాసు, దొంత. విఘ్నేశ్వర దండకము
45. రామప్పవరకవి, ప్రసిద్ధి. శ్రీ సరస్వతీదేవి దండకము
46. రామమూర్తి, అవసరాల. రామ దండకము

47. రామమూర్తి, సాధు. శ్రీహరి దండకము
48. రామయోగి, నడిమింటి. భల్లాణ దండకము
49. రామయ్య, దేవకొండ పద్మినీ దండకము
50. రామలింగయ, మండపాక. శ్రీ మహాలక్ష్మి దండకము
51. లక్ష్మీనరసింహము, ప్రేత. అమ్మవారి దండకము
52. లక్ష్మీనరసింహము, వెన్నెలకంటి. శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున సుప్రభాత దండకము
53. — మల్లికార్జున స్తోత్రము
54. ... మల్లికార్జున ప్రపత్తి
55. లక్ష్మీనారాయణశాస్త్రి, జంధ్యాల. శ్రీమదంబికా దండకము
56. ... రామాయణకథా సంగ్రహ దండకము
57. ... శివ దండకము
58. ... శ్రీహరి స్తుతి దండలము
59. లింగరాజయ్య, నీరామి. భీమలింగేశ్వర దండకము
60. వరలక్ష్మమ్మ, కనుపర్తి. శ్రీబాపట్ల భావనారాయణస్వామి వారి దండకము
61. వార్తాకవి కుప్పయ, నందవైదీక. శ్రీ చూడాంబికా దండకము
62. విజయగోపాలుడు, నండూరి. శ్రీ అరసవిల్లి సూర్యనారాయణ దండకము
63. విశ్వనాథం. భద్రాద్రిరామ దండకము
64. వీరపూరయాచార్యులు, కడియాల. ఈశ్వరమ్మగారి దండకము
65. వీరబ్రహ్మకవి. శ్రీరామ్. దత్తాత్రేయ దండకము.
66. వీరరాఘవాచార్యులు, కొండూరి. ఆంజనేయదండకము.
67. వీరేశ్వరరావు, చంద్రుడు సరస్వతీ దండకము.
68. వెంకటప్పయ్య, పొందూరు. శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి దండకము.

69. వెంకటశివయ్య, కొమరారాజు. శివ దండకము.
70. వెంకటేశ్వరరావు, తమ్మన. ఆంజనేయ దండకము.
71. వెంకటేశ్వరరావు, తమ్మన. ఈశ్వర దండకము.
72. వెంకనార్యుడు, పోలిపెద్ది. తిట్ల దండకము.
73. వేంకటకవి, గణపవరపు. విద్యావతీ దండకము.
74. వేంకట సుబ్బరాయశర్మ, పన్నాల. వేంకటేశ్వర దండకము.
75. వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, దుగ్గిరాల. ఇంజనీరు దండకము.
76. వేంకటాచలపతి, ముదునూరు. శ్రీ శివరామకృష్ణ దండకము.
77. శ్రీనివాసరావు, పెళ్యూరు. శ్రీ గజేంద్రమోక్ష దండకము.
78. సత్యదాసు, అల్లక. శివ దండకము.
79. సత్యనారాయణ, కామవరపు. గజానన దండకము.
80. సత్యనారాయణరాజు, ఆచంట. రామలింగేశ్వర దండకము.
81. సత్యనారాయణరావు, నండూరి. శ్రీ వీరభద్ర దండకము.
82. సర్వేశ్వరుడు, గుండు. కాళి దండకము.
83. సిద్ధప్ప. శ్రీ సరస్వతీదేవి దండకము.
84. సుబ్బశర్మ, సోమయాజుల. శ్రీ పరంధామ దండకము.
85. సుబ్బారావు, మార్గాని, సాయిబాబా దండకము.
86. సుబ్బారావు, వావికొలను. ఆంజనేయ దండకము.
87. ,, ,, కుమార దండకము.
88. సుబ్రహ్మణ్య భాగవతులు, భరతమాత దండకము.
89. సుబ్రహ్మణ్యశాస్త్రి, అయ్యగారి. శ్రీలలితా మహాదేవి దండకస్తోత్రం.
90. సుబ్రహ్మణ్యశాస్త్రి, అవ్వారి. సరస్వతీ దండకము.
91. సూర్యనారాయణ, కామవరపు, శ్రీ గజానన దండకము.
92. సూర్యనారాయణ, గడ్డం. ఆంజనేయ దండకము.

93. సోమశేఖరరావు, పింజల. శ్రీ చౌడేశ్వరి దండకము.
94. హనుమంతరాయశాస్త్రి, వల్లూరి. పుష్కర దండకము.
95. హనుమంతరావు, బాపట్ల. శ్రీ సాయిబాబా దండకము.
96. హిమాద్రిరంగేంద్రుడు; వెంకటేశ్వర దండకము.

## కృతికర్తల నామములు తెలియనివి – ఉపలభ్యములు.

| | | |
|---|---|---|
| 97. | — | సూర్యనారాయణ దండకము. |
| 98. | — | వెంకటేశ్వర దండకము. |
| 99. | — | వెంకటేశ్వర దండకము. |
| 100. | — | మాతృశ్రీ అనసూయాదేవి స్తవం. |
| 101. | — | శ్రీశైలభ్రమరాంబా దండకము. |
| 102. | — | శివ దండకము. |
| 103. | — | శ్రీరామ దండకము. |
| 104. | — | కృష్ణ దండకము. |
| 105. | — | హనుమద్దండకము. |
| 106. | — | శ్రీరామ దండకము. |
| 107. | — | నేత దండకము. |
| 108. | — | శ్రీకృష్ణ దండకము. |
| 109. | — | పొగాకు దండకము |
| 110. | — | ఆంజనేయ దండకము. |
| 111. | — | కచ్చిరంగరాజ దండకము. |
| 112. | — | భీమేశ్వర దండకము. |
| 113. | — | తిట్ల దండకము. |
| 114. | — | సూర్యనారాయణ దండకము. |
| 115. | — | సాయిబాబా దండకము. |

116. — ఓటు దండకము.
117. — శ్రీ కనకదుర్గా దండకము.

## అముద్రితములు - ఉపలబ్ధములు.

| | కర్త | కృతి | | వివరములు |
|---|---|---|---|---|
| 118. | రాఘవాఖ్యుడు | రాజగోపాల దండకము, | | తంజావూరుసరస్వతీ మహాలు, నెం. డి. 423 |
| 119. | తెలియదు, | దండకము. | — | నెం.డి 422 |
| 120. | — | రామదండకము. | — | నెం.డి. 424 |
| 121. | — | వెంకటపతిరాయల దండకము. | ... | నెం డి. 425 |
| 122. | ... | శాహరాజ దండకము | ... | నెం.డి. 426 |
| 123. | ... | సూర్యదండకము | ... | నెం.డి. 848 |
| 124. | సుబ్రహ్మణ్యశాస్త్రి, గరుడాద్రి | శ్రీ శృంగేరీ విద్యా నృసింహ భారతీంద్ర స్వామి దండకము | | ఆంధ్రసాహిత్య పరిషత్తు వ్రాత ప్రతి నెం. 262/20 |
| 125. | రామయ్య, దేవరకొండ. | పద్మినీదండకము | | వ్రాతప్రతి 262/20 |
| 126. | తెలియదు, | హనుమద్దండకము | — | నెం. 99/20 |
| 127. | — | దండకములు (శిథిలమైనది) | ... | నెం. 321/20 |
| 128. | — | పుష్పశైలప్రభా దండకము | | తాళపత్ర ప్రతి నెం. 137 |
| 129. | — | ఆంజనేయదండకము | — | నెం. 82 |
| 130. | — | కాళికాదండకము | — | నెం. 213 |
| 131. | — | ఒంటిమిట్టదండకము | — | నెం. 2 05 |

| | | | |
|---|---|---|---|
| 132. | ... | నామగిరిలక్ష్మీదండకము | ... నెం. 171 |
| 133. | ... | ఆర్యాపురానాథ దండకము | ... నెం. 171 |
| 134. | — | పాగాకుదండకము | — నెం. 83 |
| 135. | — | మీనాక్షీదండకము | — నెం. 130 |
| 136. | — | శక్తిగణపతిదండకము | — నెం. 130 |
| 137. | — | రమాకాళిందీదండకము | — నెం. 205 |
| 138. | — | రామస్వామిదండకము | ... నెం. 283 |
| 139. | — | రామానుజదండకము | — నెం. 262 |
| 140. | ... | హనుమద్దండకము | — నెం. 225 |
| 141. | — | ... | ... నెం. 179 |
| 142. | — | విఘ్నేశ్వరదండకము | ... నెం. 276 |
| 143. | ... | శ్రీవీరభద్రదండకము | — నెం. 17 |
| 144. | కృష్ణమాచార్యుడు అకలంక | కొమ్మాలపాటి దండకము | — నెం. 184 |
| 145. | తెలియదు | శ్రీరామదండకము | ... నెం. 156 |
| 146, | — | సుబ్రహ్మణ్యదండకము | ... నెం. 197 |
| 147. | గోవిందుడు, | హనుమద్దండకము | ... నెం. 236 |
| 148. | పూర్ణకవి, బాణీల, | శక్తిదండకము | — నెం. 236 |
| 149. | తెలియదు | హనుమద్దండకము | ఆంధ్రాహిస్టారికల్ రీసెర్చి సొసైటీ, తాళపత్ర ప్రతి నెం. 17 |
| 150. | — | సురాభాండేశ్వర దండకము | — నెం. 129 |

151. రామయోగి, నడిమింటి — భల్లాణదండకము, ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్సు లైబ్రరీ, హైదరాబాదు. నెం. సి. సి. 37

## అముద్రితములు—అనుపలభ్యములు.

1. తిమ్మన, నంది, త్రిస్థలీదండకము.

అప్పకవి గణఫలములను వివరించుచు 'నగణం బమృతాంధో నాథ దేవతాకంబుగాన సకలభోగ ప్రదంబని...... త్రిస్థలీ దండకము నందు "విజయనగర హేమకూటంబునన్నిల్చి" యని 'నంది తిమ్మన చెప్పినదియుంగాక' యని నంది తిమ్మన త్రిస్థలీ దండకమును రచించి నట్లు పేర్కొని యుండెను.

అప్పకవీయము, చతుర్థాశ్వాసము, 23

2. తిమ్మకవి, కూచిమంచి.

"మంచి క్షేత్ర కథనంబు మరియు బెక్కు
శతక, దండక సత్కృతుల్ ప్రతిభగూర్చి
యుల్లమలరార పార్వతీ వల్లభునకు
భక్తినర్పణ జేసిన భవ్యమతిని"

శివలీలా విలాసము, ప్రథమాశ్వాశము. 5

3. పార్వతీశ్వరశాస్త్రి, మండపాక.

"నీ మృదుపద దండకమున కరు
దైమును దామర కులీనులగు వెలమ దొరల్
గ్రామస్థులు దుగ్ధపుర
గ్రామంబున భూమి గాన్కగా నిడిరిగదా!"
"ఆ జగదంబా దండక
మో జగదంబాలయోదయమున క

వ్యాజ గతింగను విను జను
డీగతి గను వినుత నేప్సిత ఫలముల్"

కవితావిశారద కోశమాలిక, ఛత్రపురము

పార్వతీశ్వరశాస్త్రిగారు జగదంబా దండక రచన చేయుటయే గాక ఆకుండి చినవేంకటాద్రి యను పేరుగల కవీశ్వరుడు కోరగా, శ్రీరామ దండకమును సంస్కృతమున రచించి యిచ్చినట్లు నామ మాత్రముగ దెలియుచున్నది. ఇవియేగాక చాల సంఖ్యలో దండకములు రచించినట్లు పెద్దలు చెప్పుదురు.

4. సత్యవోలు భగవత్కవి.

"ధీరత శతకంబులు
దారావళులున్ దశావతారావళులున్
జారూదాహరణంబులు
శ్రీరాజిత దండకములు జెప్పినవాడన్"

రుక్మిణీపరిణయము, అవతారిక.

ఈతడు రచించిన దండకములు కనీసము నామమాత్రావశిష్టము లైనను గావు.

5. మల్లికార్జున పండితారాధ్యుడు - మాని దండకము.

పండితుడు మానిదండకమను నామముగల యొక దండకమును రచించినట్లు పాల్కురికి సోమన - పండితారాధ్యచరిత్ర వలన తెలియు చున్నది. పండితుని రచనలలో నిదియొకటి. తృతీయాధ్యాయము పురాణేతిహాస యుగము నందలి స్వతంత్ర దండకములలో దీని వివరములు గలవు.

6. రంగనాథుడు - వెయ్యిపాదముల దండకము.

రంగనాథుడను ఒక కవి వేయిపాదముల దండకమును రచించి నట్లు కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమ చాటుపద్యమణి

మంజరిలో తెలిపియుండిరి. దీని వివరములును తృతీయాధ్యాయమున పురాణేతిహాసయుగ స్వతంత్ర కృతులలో గలవు.

7. విజయరాఘవుడు - రాజగోపాల దండకము.

"రాజగోపాల దండక సందర్భ
వైదర్భిగన్న విద్వత్కవీంద్రు"

ప్రహ్లాదచరిత్ర. పు 8

8. వెంకటరావు, కవికొండల.

దండకములను గూర్చి తెలుపుచూ కీ. శే. వెంకటరావుగారు "మాభాస్కరామయ్య మామ......ఆయన కీర్తిశేషులైనా ఆయన కంఠం అలా మధురఘుటంలా వినిపిస్తూనే వుంటుంది. ఇప్పటికీ నాచెవుల్లో ఎన్ని దండకాలు వచ్చో ఆయనకి. వర్ణన పోర్లగా ఆయనకు సీతని, లేతని, జాలిని, గేలిని అనిప్పించి దండకంనుండి ఈశ్వర దండకందాకా తెల్లవార్లూ చదవమన్నా చదివేవాడు.

ద్విపద-రగడ-దండకము. భారతి, జూన్ 1942

9. వెంకటపతి, ధూర్జటి.

రత్నావళీ పరిణయాన్ని వ్రాసిన కవిపేరు ధూర్జటి వేంకటపతి. ...చిన్నప్పుడే శతకాలూ, దండకాలూ చెప్పాడు... ఇతని ఇతర రచనలు దొరకలేదు.

(సమగ్రాంధ్ర సాహిత్యం. ఆరుద్ర. సం. 10, పు. 210)

10. వేంకట నరసింహాచార్యులు, గోవర్ధనం.

ఈయన అముద్రిత కావ్యము 'సారంగశైల మాహాత్మ్యము' నందు గ్రంథాంతర్గతముగ నిరోష్ఠ్యదండకము నొకదానిని రచించిరట.

దశరథరాజనందన చరిత్ర. పీఠిక. పు. 48. శ్రీరగాచార్య. సాహిత్య అకాడమీముద్రణ.

**11. కామకవి, మండపాక.**

మండపాక కామకవి 1810-1872 పితృపాదుల సన్నిధిని కావ్య పంచకము పూర్తిచేసి, అలంకారశాస్త్రము నభ్యసించి సాహిత్యములో నారితేరినవాడయి పెక్కు గ్రంథములు రచించెనట.. వానిలో కొన్ని దండకములు పేర్కొగిదగినవి.

ఆంధ్ర సంస్థానములు-సాహిత్యపోషణము.
ఆచార్య తూమాటి దోణప్ప. బొబ్బిలి. పు. 308

-0 —

# అనుబంధము-2

## కృష్ణమిశ్రుని ప్రబోధచంద్రోదయాంతర్గత దండకము.

జయజయ భగవన్ అమరచయ చక్ర చూడామణిశ్రేణి నీరాజితోపాంత పాదద్వయాంభోజ రాజన్నఖద్యోత కిమ్మీరిత స్వర్ణపీత స్ఫురద్ధాత విభ్రాన్తి సంతాన సంతప్త వందారు సంసారనిద్రాపహార్యై కదశ్చ క్షమామండలోద్వార సంభార సంఘట్టదంష్ట్రాగ్ర కోటీస్ఫురచ్చైల చక్ర క్రమా క్రాంత లోకత్రయా-

ప్రబల భుజబలోద్ధృత గోవర్ధనచ్ఛత్ర నివారితాఖండ ఖద్యోజ్యోతా కాండ చండాంబు వాహాతి వర్ష త్రసద్గోకులత్రాణ విస్మాపితాశేషవిశ్వప్రభో-

విబుధ రిపు వధూవర్గ సీమంత సిందూర సంధ్యామయూరచ్ఛటోన్మాద్య నోద్దామ దామాధి సత్రస్త దైత్యేంద్ర వక్షస్థటీ పాటనాకుంఠ భాస్వన్నఖశ్రేణి వాణిద్వయ సృస్త విస్తారి రక్తవర్ణనామగ్ర లోకత్రయ-

త్రిభువన రిపుకైటభోదండ కంఠాస్థి కూటస్ఫుటోన్మార్జితోద్దామ చక్ర స్ఫురజ్జ్యోతి రుల్లోసితోద్దామ దోర్దండ ఖండేందు చూడప్రియ ప్రౌఢ దోర్దండ విభ్రాంత మందాచల క్షుబ్దదుగ్ధాంబుధి ప్రోత్థిత శ్రీభుజవల్లీ సంశ్లేష సంక్రాంత పీనస్తనాభోగ స్థల స్థూల ముక్తాఫలోదార హారప్రభా మండల స్ఫురత్ఖండ వైకుంఠ భర్తస్య సంసారమోహాచ్ఛిదం దేహి బోధోదయమ్ దేవ తుభ్యం నమః

-0—

# ఉపయుక్త గ్రంథ పట్టిక

తెలుగు


1. అనంతుడు. ఛందోదర్పణము. పు. 63, 64. చెన్నపురి; వావిళ్ళ రామస్వామి అండ్ సన్స్, తృ. ము., 1958.
2. అప్పకవి, కాకునూరి. అప్పకవీయము. చెన్నపురి; వావిళ్ళ రామస్వామి శాస్త్రి అండ్ సన్స్, 1962.
3. అప్పారావు, పియస్ఆర్. నాట్యశాస్త్రము. పదునైదవ అధ్యాయము. పు. 426, హైదరాబాదు; అజంతా ప్రింటర్సు, 1952.
4. అశ్వత్థనారాయణ, ఘట్టమరాజు. సుందరం, ఆర్వీయస్. రాళ్లపల్లి పీఠికలు. బెంగుళూరు; ఆంధ్రా ప్రింటర్సు, 1978.
5. ఆనందమూర్తి వేటూరి. తాళ్లపాక కవుల లఘుకృతులు-వివిధ సాహితీ ప్రక్రియలు. (సిద్ధాంతవ్యాసము) దండకములు. పు. 382-384. హైదరాబాదు; మురళీపవర్ ప్రెస్, ప్ర.ము. 1974.
6. ఆరుద్ర. సమగ్రాంధ్ర సాహిత్యం. సం. 9, పు. 257. సం. 11, పు. 166, సం. 12, పు. 67, 131.
7. జయకృష్ణబాపూజీ, జంధ్యాల. ఆంధ్రదేశ చరిత్ర - భూగోళ సర్వస్వము. దండకములు (వ్యాసం) పు. 406. సం. 2. ప్రకాశకులు: హైదరాబాదు ఆంధ్ర రచయితల సంఘం, 1974.
8. తాయారమ్మ, మాణిక్యం వేదవల్లి. తెనుగు సాహిత్యములో హాస్యరసము. పు. 9. రాజమండ్రి; సరస్వతీ పవర్ ప్రింటింగ్ ప్రెస్, ప్ర. ము. 1968.
9. —— దండకవాఙ్మయము (వ్యాసం) పు. 134-36. ఆంధ్రపత్రిక; హేమలంబ సంవత్సరాది సంచిక, 1958.
10. దొరసామిశర్మ, రావూరి. తెలుగుభాషలో ఛందోరీతులు. మాలికావృత్తములు. పు. 131. మద్రాసు; వెల్డన్ ప్రెస్, 1962.

11. దొరసామిశర్మ, రావూరి. తెనుగులో తిట్టు కవిత్వము. పు. 123, 24. మద్రాసు; యం. శేషాచలం అండ్ కంపెనీ, ప్ర. ము., 1968.

12. దోణప్ప, తూమాటి. ఆంధ్రసంస్థానములు-సాహిత్యపోషణము. ముఖ్య సంస్థానములు. వాల్తేరు; ఆంధ్రవిశ్వకళాపరిషత్తు, 1969

13, పిచ్చయ్యశాస్త్రి, దీపాల. చాటుపద్యరత్నాకరము. పు. 40, 41

14. పెద్దన, చిత్రకవి. లక్షణసార సంగ్రహము. ద్వితీయాశ్వాసము. మాలికా వృత్తములు-దండకము. కాకినాడ; ఆంధ్రసాహిత్య పరిషత్తు. తృ. ము. 1961.

14. పెద్దన, విన్నకోట. కావ్యాలంకారచూడామణి. చతుర్థోల్లాసము. మాలికావృత్తములు; జ్యోతిష్మతీ ముద్రాక్షరశాల, 1909

16. ప్రభాకరశాస్త్రి, వేటూరి. చాటుపద్య మణిమంజరి. ప్ర. సం. పు. 80, 81.

17. భీమకవి, వేములవాడ. కవిజనాశ్రయము. మాలికావృత్తములు-దండకము. చెన్నపురి; ఆంధ్ర సాహిత్యపరిషత్ప్రకటితము. 1917.

18. మాధవరామశర్మ, పాటిబండ. ఆంధ్రమహాభారతము - ఛందః శిల్పము. విశేషచ్ఛందములు - దండకము. పు. 271. శివాజీ ప్రెస్, 1966.

19. రంగయ్య, కస్తూరి. ఆనందరంగరాట్ఛందము. మాలికావృత్తములు-దండకము. చెన్నపురి; వావిళ్ల రామశ్వామిశాస్త్రులు అండ్ సన్స్, 1922.

20. రంగాచార్యులు, చెలమచర్ల. ఆంధ్రశబ్దరత్నాకరము. సం. 2. పు. 225. బెజవాడ; వెంకట్రామా అండ్ కో వారిచే ప్రకటితము.

21. లింగనమంత్రి, తెల్లటూరి. సరసాంధ్రవృత్తరత్నాకరము. అముద్రితము మద్రాసు; ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ నెం. డి. 1820.

22. వెంకటరావు, నిడదవోలు. ఆధునిక యుగము – గాంధీ సాహిత్యము. వ్యాసం పు. 18, 19. ఆంధ్రపత్రిక; హేవలంబసంవత్సరాది సంచిక.

23. — ఉదాహరణ వాఙ్మయము. అవతారిక. పు. 1. విజయ భాస్కర పబ్లికేషన్స్, సికింద్రాబాదు; శివాజీ ప్రెస్, ద్వి. ము., 1968.

24. — పోతన పు. 61. నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రచురణ, 1962.

25. ... ది సదరన్ స్కూల్ ఆఫ్ తెలుగు లిటరేచర్, మద్రాస యూనివర్సిటీ, సీరీస్ నెం. 18, ద్వి. ము. 1960.

26. వెంకటాచలపతి, ముదునూరి. పీఠిక. (శివరామకృష్ణదండకము) ముంజులూరు 1948.

27. వేంకటరమణరవి, పొత్తపి. లక్షణ శిరోమణి, దండకము. పు. 165, 66. సంపా. విద్వాన్, రావూరి దొరసామిశర్మ, తెలుగు అకాడమీ ముద్రణ, 1979.

28. శేషయ్య, చాగంటి. కవితరంగిణి. సం. 5, పు. 115, 16, సం. 6 పు. 206. కపిలేశ్వరపురం; హిందూ ధర్మశాస్త్ర గ్రంథాలయ ప్రచురణ, 1962.

29. శ్రీరాములు, విప్పర్తి. ఉమామహేశ్వర శతకము. తణుకు; స్వాధ్యాయినీ ముద్రాక్షరశాల, ప్ర. ము. 1918.

30. శ్రీరామమూర్తి, కొర్లపాటి. శారదా దరహాసపాలు శ్రీనాథుని రసధుని. పు. 20. సంపా; ఆచార్య యస్వీ. జోగారావు. వాల్తేరు; ఆంధ్రాయూనివర్సిటీ ప్రెస్, 1979.

31. సంపత్కుమారాచార్య, కోవెల. తెనుగు ఛందోవికాసము. పు. 61, సికింద్రాబాదు; అజంతా ప్రింటర్స్, 1962.

32. సత్యనారాయణమూర్తి, పోలాప్రగడ. హాస్యతోరణము. పు. 172, 78, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ, 1982.

33. సదాశివశాస్త్రి, వెల్లాల. శేషశాస్త్రి, అవధానము. వెలుగోటి వారి వంశ చరిత్ర. పు. 6. చెన్నపురి; శారదాంబావిలాస ముద్రాక్షరశాల, ద్వి. ము. 1911.

34. సుబ్బారావుపంతులు, నంగూరి. ఆంధ్రవాఙ్మయ చరిత్రము. దండకములు, పు. 382-84 నరసాపురం: కమలాకుటీర్ ప్రెస్, ద్వి. ము. 1957.

35. సుబ్బారెడ్డి, మద్దూరి. తెలుగులో జాతీయోద్యమ కవిత్వము. సిద్ధాంతవ్యాసము దండకములు. పు. 301, తిరుపతి; రాగసుధా ప్రచురణలు, 1982.

36. సుబ్రహ్మణ్యశాస్త్రి, పెండ్యాల. బమ్మెర పోతన మహాకవి-సర్వజ్ఞ సింగభూపాలుడు. వ్యాసం భారతి, జూన్ 1944.

37. సూర్యనారాయణశాస్త్రి, వెంపరాల. శంకర విజయము. పు. 135. కాకినాడ; శ్రీపతి ప్రెస్, 1980.

38. సోమశేఖరశర్మ, మల్లంపల్లి, విజ్ఞానసర్వస్వము. సం. 2. పు.206

39. సూర్యమూర్తి శ్రీ. శ్రీనాథుని దండకములు. వ్యాసం లేఖిత్రపతి, 1967

సంస్కృతము

40. కాళిదాసు. శ్యామలా దండకము.

41. కృష్ణమిశ్రుడు. ప్రబోధ చంద్రోదయము , చతుర్థాంకము. బొంబాయి: నిర్ణయ సాగర్ ప్రెస్, 1924.

42. కేదారభట్టు. వృత్తరత్నాకరము. ద్వితీయాధ్యాయము. ఢిల్లీ: భారత భారతీ ప్రెస్, 1926.

43. గంగాదాసు. ఛందోమంజరి. ద్వితీయ స్తబకము. వారణాసి; చౌకాంబా ప్రెస్, తృ. ము. 1976.

44. తారానాథ తర్కవాచస్పతి భట్టాచార్య. తర్కవాచస్పత్యమ్ చతుర్థభాగము. పు. 3432, 33. వారణాసి: చౌకాంబా ప్రెస్, 1962.

46. భరతమహర్షి. నాట్యశాస్త్రమ్, పదిహేనవ అధ్యాయము. వృత్తలక్షణవిభాగము. ఢిల్లీ; పరిమళ్ పబ్లికేషన్స్, 1984.

47. భవభూతి. మాలతీమాధవము. పంచమాంకము. ఢిల్లీ; మోతీలాల్ బనారసీదాస్ ప్రచురణ. తృ. ము. 1967.

48. మధుసూదన సరస్వతి. భక్తిరసాయనము. ద్వితీయోల్లాసము. తెనాలి; సాధన గ్రంథ మండలి. 1958.

49. రాధాకాంత బహదూర్. శబ్దకల్పద్రుమము. ద్వితీయకాండము పు. 471. ఢిల్లీ : మోతీలాల్ బనారసీదాస్ ప్రచురణ, 1961.

50. విద్యారణ్యస్వామి. శంకరవిజయము. ద్వాదశవర్గ. ప్రకాశకులు వ్యాసాశ్రమము, చిత్తూరు: 1961.

52. — మార్కండేయపురాణాంతర్గత మదాలస చరిత్రము. 21వ అధ్యాయము. ప్రకాశకులు: వ్యాసాశ్రమము, చిత్తూరు: 1978.

53. —శ్రీమద్భాగవత పురాణమ్. దశమస్కంధము. గోరఖ్‌పూర్ గీతాప్రెస్, 1981.

54. శార్ఙ్గదేవుడు. సంగీత రత్నాకరము. ప్రకాశకులు: యస్ సుబ్రహ్మణ్యశాస్త్రి. అడయార్ లైబ్రరీ ప్రచురణ; మద్రాసు:1953.

55. శ్రీరాములు, దాసు. తెలుగునాడు. మహాకవి దాసు శ్రీరాములు స్మారకసమితి, హైదరాబాదు; 1974.

ఆంగ్లము.

55. Brown, C.P. A grammer of the Telugu language. Page. 319, Published by : New Delhi. Aravinda educational series, second edition, 1981.
56. Keith, A. B. A History of Sanskrit Literature. Page. 116, New Delhi. Offeset Press, Second edition, 1973.
57. Monier. Williams. Dictionary of Sanskrit to English. Page, 467. London: Oxford university press, 1951. ...... ...
58. Swami Tapasyananda. Bhakti Ratnavali. Madras: Ramakrishna Math, 1979.
59. Satya Sarva A comprehensive History of Vedic literatue- Brahmana and Aranyaka works. Chapter XIV, Page. 298. New Delhi: Praveen Prakasan. 1964.

ఇతరములు.

60. కన్నడ ఛందస్స్వన చరిత్ర. ఎడిటర్స్: హెచ్. ఎమ్. నాయక్, డా. సి.పి. కృష్ణకుమార్. ప్రకాశకులు: కన్నడ అధ్యయన సంస్థ, మైసూరు. ప్ర.ము., 1980.
61. కేశవదాసు. సంక్షిప్త రామచంద్రిక. సంకలనకర్త; లాలాభగవాన్‌దాస్. కాశీ: నాగరీ ప్రచారిణీ సభా, ప్రథమ సంస్కరణము. 1956.
62. నాగవర్మ. ఛందోంబుధి. ప్రకాశకులు: డి. వి. కె. మూర్తి, మైసూరు. ప్ర. ము., 1975.
63. — — ఎడిటర్: రామానుజ అయ్యంగార్, కర్ణాట కావ్య కళానిధి ప్రకాశన్. 1962.

64. తమిళ విజ్ఞాన సరస్వము. వాల్యూమ్. 5, మద్రాసు: తమిళ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, ప్ర.ము. 1958.

65. రామచంద్రశుక్లా. హిందీ సాహిత్యకా ఇతిహాస్. కాశీ: నాగరీ ప్రచారిణీ సభా, ప్రథమ సంస్కరణము 1978.

66. రామ్‌బహాదూర్ శుక్లా. కావ్యప్రదీప్. ప్రకాశన్: అలహాబాదు; హిందీభవన్. ఎనిమిదవ సంస్కరణము. 1978.

...0...

# సంకేతాలు

| | | | |
|---|---|---|---|
| ఉ. | - ఉత్తరార్థము | పు. | - పుట |
| గ్ర.సం. | - గ్రంథ సంఖ్య | పూ. | - పూర్వార్థము |
| తృ. ము. | - తృతీయముద్రణము | ప్ర. ము. | - ప్రథమ ముద్రణము |
| దం. | - దండకము | ల. | - లక్షణము |
| ద్వి. ము. | - ద్వితీయముద్రణము | సం. | - సంపుటి |
| ప. సం. | - పద్య సంఖ్య | సూ. | - సూత్రము |
| | | —— | - పై నామమునే సూచించు గుర్తు |

—( ० )—

# సవరణలు

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 1 | 5 | తెలుగుతల్లిని | తెలుగుతల్లికి |
| 1 | 7 | విషమును | విషయమును |
| 3 | 21 | షష్టాధ్యాయము | షష్ఠాధ్యాయము |
| 5 | 12 | దండక శబ్దము | దండ శబ్దము |
| 5 | 17 | అచట నది నొక | అచట నది యొక |
| 8 | 12 | మర్షియే | మహర్షియే |
| 9 | 13 | అధికాక్షారముతో | అధికాక్షరముతో |
| 10 | 1 | పలనసే నొక | వలనసే యొక |
| 10 | 3 | నామముయె | నామమున |
| 11 | 18 | అనుస్యూతను | అనుస్యూతరసు |
| 12 | 3 | ఉపయొక్తములగు | ఉపయుక్తములగు |
| 14 | 6 | వృత్తమును | వృత్తము |
| 16 | 12 | నడిమిండి | నడిమింటి |
| 19 | 24 | దేశీయేవత్పృత్త | దేశీయేతివృత్త |
| 24 | 17 | వితరణము | వివరణము |

| | | | |
|---|---|---|---|
| 33 | 14 | ఎన్నియో నధిక | ఎన్నియో అధిక |
| 35 | 3 | తాక్షణికు | లాక్షణికు |
| 35 | 4 | నీ దండక | ఈ దండక |
| 35 | 7 | ధండకమునకు | దండకమునకు |
| 58 | 4 | మాతఙ్జు | మాతఙ్గ |
| 67 | 10 | చంఃక ర్తలు | ఛందఃక ర్తలు |
| 69 | 1 | మత్తమాఙ్గ | మత్తమాతఙ్గ |
| 69 | 8 | గాలుగు | నాలుగు |
| 78 | 22 | చెన ముప్పిన | మున చెప్పిన |
| 79 | 23 | దండ యొక | దండక మొక |
| 88 | 24 | ప్రసరణము | ప్రకరణము |
| 118 | 24 | రావతారము | రామావతారము |
| 221 | 11 | సంఘముదందలి | సంఘమునందలి |
| 237 | 21 | పీశకలో | పీఠికలో |
| 258 | 13 | దండము | దండకము |
| 259 | 24 | ప్పత | తప్ప |
| 262 | 5 | పదవమునందు | పద్యమునందు |
| 263 | 15 | కోందండకంబైన | కోదండకంబైన |
| 271 | 25 | దండంము | దండకము |
| 272 | 23 | భోసులు | భోగినులు |
| 272 | 23 | సంజాతయసు | సంజాతయగు |
| 277 | 17 | రర్త్రాక్షి | రక్త్రాక్షి |
| 296 | 9 | యడవివల్లి | యడవల్లి |
| 310 | 10 | సంహారించు | సంహారించును. |
| 324 | 4 | రానాయణ | నారాయణ |
| 324 | 12 | సుప్రతిష్ఠిత | సుప్రతిష్ఠిత |

TELUGULO DANDAKA SAHITYAMU. Rs. 50/-

The researcher spared no pains to unearth a good number of Dandakas both individual type and part of some Nibaddhakavya and aptly classified them, with comments necessary with utmost care. He scrupulously followed the suggestions given to give the thesis, the present format.

I assure that this thesis forms the first of its kind which will be a hand torch to the researchers of the posterity.

*Prof. : J. S. PRAKASA RAO*

The First and the Foremost poet of the Telugu Language, Nannaya, in his composition of Maha Bharata offered an excellent model of Dandaka to poets of posterity. Here in this thesis the candidate has scrupulously unearthed with meticulous care almost all the Dandakas in Telugu which are scores in number, classified them according to the nature of the content and offred criticism with careful acumen in each and every aspect of every one of the composition.

This is a thesis first of its kind in Telugu literature and stands commendable in its credit to the contribution of knowledge.

*Prof. : S. V. JOGA RAO*

The very topic 'Dandaka Literature in Teluge' is fine one which has not been touched upon sofar by any scholar. So the candidate could take much pain in collecting and exploring the importance of Dandaka Sahitya in Telugu

*Prof : S GANGAPPA*